
# ఆధునిక భారత చరిత్ర

బిపన్ చంద్ర

T-16 3C



Nandyala
Committee
Constituted
4.03
45305
15305

# ఆధునిక భారత చరిత్ర

మూలం
బిపిన్ చంద్ర

తెలుగు
సహవాసి

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

వెల : సాదాప్రతి రు. 30-00
మేలుప్రతి రు. 40-00

C.16897
954.03
చంద..ఆధు

45305
-508 044

ట్రస్ట్ సంపాదకుడు : వేకూరి రామారావు
ప్రథమ ముద్రణ : సెప్టెంబరు, 1983
రెండవ ముద్రణ : సెప్టెంబరు, 1990
కవర్ పేజి ఫోటో : షరీష్
వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్
1-1-342/బి,
వివేకనగర్, హైదరాబాద్ - 500 020.

ముద్రితము : ఓం సాయి లేజర్‌గ్రాఫిక్స్ & ప్రొసెస్, 3-4-709, 2వ ఫ్లోర్, నారాయణగూడ, హైదరాబాద్ - 29.

# మా మాట

'పరస్పరం సంఘర్షించిన శక్తులలో పుట్టింది చరిత్ర. బ్రిటిష్ వలస పాలకుల ప్రయోజనాలకు - భారత జాతీయ వాంఛలకు నడుమ పరస్పర సంఘర్షణలో జాతీయోద్యమం ఆవిర్భవించింది. ఆధునిక భారత చరిత్రలో బ్రిటిష్ సామ్రాజ్యవాదం, సామ్రాజ్యవాద వ్యతిరేక భారత జాతీయోద్యమం పరస్పరం సంఘర్షించిన శక్తులు. ఆ సంఘర్షణలో అంతర్భాగంగా సమాజంలో ఎన్నో గణనీయమైన మార్పులు వచ్చాయి. జాతీయ భావవికాసం, నూతన ఆర్థిక శక్తుల ఆవిర్భావం, ఆధునిక పాశ్చాత్య భావాల సంస్కృతుల ప్రభావం, విద్యావ్యాప్తి, ప్రపంచ పరిస్థితి గురించి ఇతోధిక స్పృహ, మొదలైనవి భారత సమాజానికి దాని వెనుకబాటుతనం గురించి, హీనస్థితిని గురించి చైతన్యం పెంచాయి. సంఘ సంస్కరణ సంకల్పాన్ని దృఢతరం చేశాయి. మత, సాంఘిక సంస్కరణోద్యమాలు, స్త్రీ విముక్తి ఉద్యమం, కుల వ్యతిరేక పోరాటం, అస్పృశ్యతా నిర్మూలనోద్యమం వంటి ఈ ఉద్యమాలు - ప్రపంచ భావవెల్లువలో భారతీయులు కూడా పాలుపంచుకునేటట్లు చేశాయి. కాని, ఈ ఉద్యమాల ప్రతికూలాంశాల్ని కూడా గమనించవలని వుంది. ఒకటి - ఇవి ప్రజల్లో కొద్ది శాతాన్ని మాత్రమే స్పృశించాయి. రెండు-వెనక్కు చూసే వాటి ధోరణి. అది గత ఔన్నత్యం గురించి గొప్పలు పలికే ధోరణి; మత గ్రంథాల ప్రామాణ్యం మీద ఆధారపడే ధోరణి. ఈ ధోరణులు మత సంస్కరణోద్యమాలు ప్రచారం చేసిన నిర్మాణాత్మక బోధలకు విరుద్ధంగా తయారయ్యాయి. అన్నిటికన్నా ముఖ్యంగా, ఈ ధోరణులు హిందువుల్ని, ముస్లిముల్ని, సిక్కుల్ని, పార్సీల్ని విడదీసే దిశగా సాగాయి. అగ్రవర్ణ హిందువుల్ని కింది కులాల హిందువుల నుంచి వేరుపరచాయి. అన్ని వర్గాల, మతాల ప్రజలు సమాన పాత్ర నిర్వహించిన కళలు; శిల్పం, సాహిత్యం, సంగీతం, విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలు వగైరా విషయాలకు మన సంస్కర్తలు సముచిత ప్రచారం కలిగించలేదు. పైగా, హిందూ సంస్కర్తలు భారతదేశ గత కీర్తిని ఘనంగా కీర్తించినప్పుడల్లా, ప్రాచీన యుగం మీదనే దృష్టి నిలిపారు; మధ్యయుగాల్ని క్షీణయుగంగా పరిగణించారు. ప్రాచీన యుగాన్ని, మతాన్ని విచక్షణారహితంగా ఆకాశానికెత్తడం కింది కులాల ప్రజలకు నచ్చలేదు. ఎంచేతనంటే - వాళ్ళు యుగయుగాలుగా వినాశకరమైన కులదోపిడికి గురయ్యారు. తత్ఫలితంగా భారతీయులందరూ సమానంగా తమ గతాన్ని, సాంస్కృతిక విజయాల్ని గర్వకారణంగా భావించడానికి బదులుగా, వాటి నుంచి సమానంగా స్ఫూర్తి, ఉత్తేజం పొందటానికి బదులుగా గత కీర్తి కొద్దిమంది వారసత్వం అయింది. పాక్షికత ప్రాతిపదికమీద గతం అన్నది రెండు వేర్వేరు అరలకింద విడిపోయింది.

దీనికి తోడు 'విభజించి పాలించే' బ్రిటిష్ కుటిల నీతి అల్పసంఖ్యాక ముస్లిం ప్రజల ప్రయోజనాల్ని పరిరక్షించే సాకుతో మత ప్రాతిపదికమీద ప్రత్యేక నియోజకవర్గాల్ని సృష్టించింది. హిందూ-ముస్లిం ప్రజల్ని విభజించి పాలించే కుటిల నీతిలో ఇదొక భాగం. ఒక అవిచ్ఛిన్న చారిత్రక పరిణామ క్రమంగా వస్తున్న భారత ఏకీకరణ ప్రగతిని ఇది కుంటుపర్చింది. దేశంలో హిందూ-ముస్లిం ప్రజల్లో మతతత్వం

పెరగటానికి ఇది దోహదం చేసింది. ఉభయ ప్రజల మధ్య పెరిగిన వైరభావం వేళ్ళూనుకొని, వటవృక్షమై పెరిగి చివరికి దేశవిభజనకు, రెండుమతాల ప్రజల మధ్య దారుణ మారణ హోమానికి దారితీసింది.

భారత సామాజిక జీవితంలోని ఈ వైరుధ్యాలనూ, సంక్లిష్టతను బిపిన్ చంద్ర అత్యంత ప్రతిభావంతంగా విశ్లేషించారు. నాయకులమీద 'మహా' వ్యక్తులమీద కాక చరిత్ర చోదక శక్తులమీద, ఉద్యమాల మీద తమ దృష్టిని కేంద్రీకరించారు. 18వ శతాబ్దపు ఆర్థిక సాంఘిక విషయాల చరచ ఈ పుస్తకంలో విశేషంగా ఉంది. విదేశాల నుంచి వచ్చిన వర్తక సంస్థలు ఈ దేశాన్ని సునాయాసంగా ఆక్రమించుకోటానికి దారితీసిన పరిస్థితులను గ్రహించటానికి ఈ చర్చ ఎంతో ఉపయోగిస్తుంది. బ్రిటిష సామ్రాజ్యవాద తత్వాన్ని భారత ప్రజల జీవన విధానాలమీద దాని ప్రభావాన్ని విపులంగా వివరించారు. దేశప్రజల్లో జాతీయతా భావావిర్భావం, విదేశపాలనకు వ్యతిరేకంగా జరిగిన దేశవ్యాపిత పోరాటం, రాజకీయ స్వాతంత్ర్య సముపార్జన వరకూ చిత్రించారు. ఈ దేశ చరిత్రకూ ప్రపంచ ఘటనలకూ ఉన్న సంబంధాన్ని నిరూపించారు.

మా లక్ష్యాలకనుగుణంగా ఇప్పటివరకు ఆంధ్రుల సంస్కృతి-చరిత్ర రెండు సంపుటాలూ, చరిత్ర అంటే ఏమిటి, తరతరాల భారతచరిత్రలో ప్రాచీన మధ్యయుగాల సంపుటం ప్రచురించాం. ఈ వరుసలో ఆధునిక యుగం మీ చేతిలో ఉంది.

మీ
హైదరాబాద్ బుక్ ట్రస్ట్

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | 18వ శతాబ్దంలో భారత సంస్థానాలు, సమాజం | 1 |
| 2. | ఐరోపా వర్తక స్థావరాల ఆరంభం | 31 |
| 3. | బ్రిటిషు వారి భారతదేశ ఆక్రమణ | 51 |
| 4. | బ్రిటిష్ ఇండియా ప్రభుత్వ నిర్మాణం | |
| | బ్రిటిష్ సామ్రాజ్య ఆర్థిక విధానాలు (1757-1857) | 73 |
| 5. | పరిపాలనా వ్యవస్థ, సామాజిక సాంస్కృతిక విధానం | 93 |
| 6. | 19వ శతాబ్ది ప్రథమార్థంలో సామాజిక, సాంస్కృతిక జాగృతి | 110 |
| 7. | 1857 తిరుగుబాటు | 119 |
| 8. | 1858 తరువాత పరిపాలనలో మార్పులు | 139 |
| 9. | భారతదేశం - పొరుగు రాజ్యాలు | 154 |
| 10. | బ్రిటిష్ పరిపాలన ఆర్థిక ప్రభావం | 169 |
| 11. | నవభారత వికాసం - జాతీయోద్యమ సంరంభం: 1858-1905 | 184 |
| 12. | నవభారత వికాసం - 1858 తరువాత మత, సాంఘిక సంస్కరణ | 203 |
| 13. | 1905-1918 సంవత్సరాల మధ్య జాతీయోద్యమం | 223 |
| 14. | స్వరాజ్య సమరం | 249 |

# 18వ శతాబ్దంలో భారత సంస్థానాలు, సమాజం

మొఘల్ సామ్రాజ్యం, రాజకీయ వ్యవస్థల శిథిలాల మీద, బెంగాల్, అవధ్, హైదరాబాద్, మరాఠా వగైరా స్వతంత్ర, అర్ధ స్వతంత్ర రాజ్యాలు అనేకం అవతరించాయి. 18వ శతాబ్ది ఉత్తరార్ధంలో భారతదేశంపైన తమ అధిపత్యాన్ని స్థాపించుకోవటం కోసం ఇంగ్లీషు వాళ్ళ ప్రయత్నాల్ని సవాలు చేసిన రాజ్యాలు కూడా ఇవే. కొన్ని రాజ్యాలు మొఘల్ సుబేదార్లు స్వతంత్రాధికారం స్థిరపర్చుకోవడం ద్వారాను మరికొన్ని మొఘల్ అధికారానికి వ్యతిరేకంగా ధ్వజమెత్తడం ద్వారానూ ఏర్పడ్డాయి.

ఈ సంస్థానాధీశులు శాంతి భద్రతలు నెలకొల్పారు, స్వశక్తి మీద నిలబడ గలిగే ఆర్థిక, పరిపాలనా సౌష్టవం కలిగిన సంస్థానాల్ని ఏర్పాటు చేసుకున్నారు. రైతు పండించే పంటలో మిగులుని చేజిక్కించుకోడానికి ఉన్నతాధికారుల్తో నిరంతరం కజ్జాలకు కాలుదువ్వే స్థానిక చిన్న ఉద్యోగులకి, ఛోటా ముఖ్యులకి, జమీందార్లకి వీళ్ళ రెక్కలు కత్తిరించారు. ఆ ప్రయత్నంలో పూర్తి విజయం సాధించిన, సాధించని సందర్భాలు రెండూ ఉన్నాయి. అయితే, ఛోటా అధికార్లు, జమీందార్లు స్థానికంగా అధికార పీఠం ఆక్రమించి ఇష్టారాజ్యంగా అయినవాళ్ళకి పదవులు, అధికారాలు పంచిపెట్టిన సంఘటనలు కూడా జరిగాయి. ఈ సంస్థానాల పరిపాలనా వ్యవస్థ మత పక్షపాతానికి లోబడని లౌకిక స్వభావం సంతరించుకొంది. ఆర్థిక, రాజకీయ విషయాల్లో సంస్థానాధీశుల ఉద్దేశ్యాలు ఒకే రకంగా ఉన్నాయి. పౌర సైనిక ప్రభుత్వోద్యోగాల్లో వీళ్ళు ఎటువంటి వివక్షా చూపలేదు. వీళ్ళ అధికారాన్ని ధిక్కరించిన తిరుగుబాటుదార్లు సైతం పాలకులు ఏ మతస్థులన్నది పట్టించుకోలేదు.

ఈ సంస్థానాలేవీ కూడా ఆర్థిక సంక్షోభాన్ని నివారించడంలో విజయం సాధించలేదు. జమీందార్లు, జాగీర్దార్ల సంఖ్య అపరిమితంగా పెరిగిపోతూ వచ్చింది. వ్యవసాయం మీద రాబడి పడిపోయింది. అయినా ఆ ఎండిన రొమ్ముల్ని పీక్కు తినటంలో జమీందార్లు, జాగీర్దార్లు పోటాపోటీలు పడి పరస్పరం కుమ్ములాడుకోవటం మానుకోలేదు. మరోవేపు రైతాంగం పరిస్థితి ఆ ఏటికాయేడు దిగజారి పోయింది. దేశం లోపల జరిగే వ్యాపారం దెబ్బతిని పోకుండాను, విదేశ వ్యాపార వాణిజ్యాలు పెంపొందే లాగున ఈ సంస్థానాధీశులు చర్యలు తీసుకున్నారే గానీ, తమ సంస్థానాల్లోని మౌలిక పారిశ్రామిక, వాణిజ్య వ్యవస్థని అధునాతనం చెయ్యడానికి ఏ చర్యలూ తీసుకోలేదు.

*హైదరాబాద్, కర్నాటకలు :* హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం-ఉల్-ముల్క్ అసఫ్‌జా 1724లో స్థాపించాడు. ఔరంగజేబ్ తదనంతర కాలంలో ఈయన ప్రముఖ సర్దారు సయ్యద్ సోదరుల్ని గద్దె దించడంలో ఘనమైన పాత్ర వహించినందుకు ప్రతిఫలంగా ఈయనకు దక్కను వైస్రాయిగిరీ దక్కింది. 1720 నుండి 1722 వరకు నిజాం తన శత్రుపక్షాన్ని పూర్తిగా అణగదొక్కి దక్కనులో తన ప్రాబల్యాన్ని సుస్థిర

పర్చుకున్నాడు. పరిపాలనా నిర్వహణని సమర్థవంతమైన పద్ధతుల్లో తీర్చి దిద్దాడు 1722 నుంచి 1724 వరకు మొఘల్ సామ్రాజ్యానికి వజీరుగా కార్యభారం వహించాడు సామ్రాజ్య పరిపాలనా వ్యవస్థని సంస్కరించాలని అయన తలపెట్టిన ప్రయత్నాల్ని మహమ్మద్ షా చక్రవర్తి సాగనీయక పోవటంతో విరక్తి చెంది తన ప్రాభవాన్ని నిరాటంకంగా వెలిగించుకోగల దక్కనుకు తిరిగి రావటానికి నిర్ణయించు కున్నాడు. తిరిగి రాగానే, హైదరాబాద్ సంస్థానానికి పునాదులు నిర్మించాడు. ఎదురు లేకుండా పరిపాలించాడు. కేంద్ర ప్రభుత్వం నుంచి వేరుపడిపోయి స్వతంత్రాధికారం స్థాపించినట్లు బాహాటంగా ప్రకటించకపోయినా, ఆచరణలో స్వతంత్ర ప్రభువు మాదిరిగానే వ్యవహరించాడు. ఢిల్లీతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా యుద్ధాలు సాగించాడు; శాంతిసంధులు కుదుర్చుకున్నాడు; బిరుదు లిచ్చాడు; జాగీర్లు, పదవులు పంచిపెట్టాడు. హిందువుల పట్ల సహనభావం ప్రదర్శించాడు. ఉదాహరణకి - పూరన్‌చంద్ అనే హిందువు అయన దివాన్. దక్కనులో సక్రమ పరిపాలనా నిర్వహణ సాగింపు ద్వారా తన అధికారాన్ని గట్టి పర్చుకున్నాడు. మదించిన పెద్ద పెద్ద జమీందార్లని లొంగదీశాడు. శక్తివంతంగా తయారైన మహారాష్ట్రుల్ని తన సంస్థాన సరిహద్దుల బైటికి తరిమి వేశాడు. రెవెన్యూ విధానంలో పేరుకుపోయిన అవినీతిని ఏరివెయ్యటానికి కృషి చేశాడు. 1748లో అయన చనిపోయాక, ఢిల్లీలో విచ్ఛిన్నకర శక్తులకు హైదరాబాద్ ఎర అయింది.

మొఘల్ దక్కన్‌లో కర్నాటక రాష్ట్రం ఒక సుబా కాబట్టి, అది కూడా నిజాం అధికార పరిధి కిందికే వచ్చింది. ఢిల్లీతో సంబంధం లేకుండా నిజాం సర్వ స్వతంత్రంగా వ్యవహరించినట్లుగానే, కర్నాటక డిప్యూటీ గవర్నరు (ఉప సుబేదారు) కూడా దక్కన్ వైస్రాయికి లోబడకుండా స్వతంత్రంగా పరిపాలించాడు. కర్నాటక నవాబు పదవిని వంశ పారంపర్యంగా కూడా చేశాడు. ఆ విధంగా, కర్నాటక నవాబు సాదతుల్లాకాన్ తన అనంతరం తన మేనల్లుడు దోస్త్ అలీని వారసునిగా నియమించాడు. ఆ నియామకం విషయంలో అయన కనీసం నైజాం అమోదాన్ని కూడా తీసుకోలేదు. 1740 తరువాత, నవాబు పదవికి పదే పదే దాయాదుల సంఘర్షణలు ప్రజ్వరిల్లటంతో కర్నాటక వ్యవహారాలు భ్రష్టు పట్టిపోయి, భారత రాజకీయాల్లో ఐరోపా వ్యాపార సంస్థల జోక్యానికి అవకాశం కలిగింది.

***బెంగాల్ :*** కేంద్ర ప్రభుత్వ అధికారం క్రమేణా సన్నగిల్లే అదను కనిపెట్టిన అసాధారణ ప్రతిభావంతులైన ఇద్దరు వ్యక్తులు బెంగాల్‌ని స్వతంత్ర రాజ్యంగా రూపొందించారు. ఒకరు ముర్షిద్ కులీఖాన్; రెండవ వారు అలీవర్దీఖాన్. ముర్షిద్ కులీకాన్ బెంగాల్ గవర్నరుగా పదవిలోకి వచ్చింది 1717లో అయినా, 1700 నుంచే దివాన్‌గా బెంగాల్‌లో రాజ్యచక్రం తిప్పాడు. చక్రవర్తికి సక్రమంగా కప్పం ముట్ట జెప్పుతూనే, కేంద్ర అధికారంతో సంబంధాలు తెంచుకుని స్వతంత్రంగా వ్యవహరించాడు. అయన బెంగాల్‌ని ఇంటిపోరు నుంచి, బైటిపోరు నుంచి తప్పించి శాంతియుత పరిస్థితులు నెలకొల్పాడు. చీటికి మాటికి జమీందార్లు తిరగబడ్డం తగ్గిపోయింది. సీతారాంరే, ఉదయ నారాయణ్, గులాం మహమ్మద్, షుజాత్‌ఖాన్ వగైరా జమీందార్లని చిత్తుగా ఓడగొట్టి, వాళ్ళ జమీల్ని తన కిష్టుడైన రామ్‌జీవన్ అనే జమీందారుకి కట్టబెట్టాడు. ముర్షిద్ కులీఖాన్ 1727లో మరణించాడు. అయన

అల్లుడు షుజా ఉద్దీన్ బెంగాల్‌ని 1730 దాకా పరిపాలించాడు. అదే సంవత్సరం, షుజా ఉద్దీన్ కుమారుణ్ని అలివర్ధిఖాన్ హత మార్చి బెంగాల్ నవాబుగా ప్రకటించుకున్నాడు.

ఈ ముగ్గురి నవాబుల ఏలుబడిలో బెంగాల్‌లో శాంతి నెలకొంది; సక్రమంగా పరిపాలన సాగింది; వ్యాపార వాణిజ్యాలు వర్ధిల్లాయి. ముర్షిద్ కులీకాన్ పరిపాలనా వ్యయం తగ్గించి పొదుపు చర్యలు తీసుకున్నాడు; నూతన శిస్తు పద్ధతిని అమలు జరిపి ఆర్థిక పరిస్థితిని చక్కబరచాడు. పేద రైతులకు తక్కావీ రుణాలు మంజూరు చేసి వాళ్ల బాధల్ని కడతేర్చాడు. వాళ్లు సకాలంలో భూమిశిస్తు చెల్లించ గలిగేలాగు వాళ్ళ పరిస్థితి మెరుగు పర్చాడు. బెంగాల్ ప్రభుత్వ ఆదాయ వనరుల్ని పెంచాడు. కాని, ఆయన ప్రవేశపెట్టిన రైతు కమతాలు రైతుపైన ఆర్థిక వత్తిడుల్ని పెంచాయి. నిర్ణీత ప్రమాణం మేరకే శిస్తు వసూలు చేసినా, అక్రమ పన్నుల్ని నిలిపి వేసినా, వసూళ్ల విషయంలో జమీందార్ల పట్ల, రైతుల పట్ల అతి నిర్దాక్షిణ్య వైఖరి అవలంభించాడు. ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణల ఫలితంగా పాత జమీందార్లలో చాలా మందికి ఉద్వాసన జరిగింది; వాళ్ల స్థానంలో నడమంత్రపు శిస్తు రైతులు తలెత్తారు.

ముర్షిద్ కులీఖాన్ గానీ, ఆయన తరువాత వచ్చిన నవాబులు గానీ ఉద్యోగ నియామకాల్లో హిందూ ముస్లింలు ఉభయులకూ సమానావకాశాలు ప్రసాదించారు. అత్యున్నత పౌర ప్రభుత్వ పదవుల్ని గానీ, సైనిక పదవుల్ని గానీ బెంగాలీలతో భర్తీ చేశారు. ఆ బెంగాలీలలో ఎక్కువ మంది హిందువులు. శిస్తు రైతుల ఎంపికలో, ముర్షిద్ కులీఖాన్ స్థానిక జమీందార్లకు, మహాజన్ అని పిలవబడే వడ్డీ వ్యాపార్లకు ప్రాధాన్యత ఇచ్చాడు వీళ్లలో కూడా ఎక్కువ మంది హిందువులే. ఆ విధంగా ఆయన బెంగాల్‌లో ఒక నూతన కులీన భూస్వామ్య వర్గానికి పునాదులు వేశాడు.

వ్యాపార, వాణిజ్యాల విస్తరణ వల్ల ప్రజలకు, ప్రభుత్వానికి ఉభయులకూ మేలు కలుగుతుందనే వాస్తవాన్ని ఆ ముగ్గురు నవాబులూ గుర్తించారు. అంచేత స్వదేశ, విదేశ వర్తకులు యావన్మందికి గొప్ప ప్రోత్సాహం ఇచ్చారు. విస్తృతంగా ధానాలు, చౌకీలు ఏర్పాటు చేయటం ద్వారా భూ, జల ప్రయాణ మార్గాల్లో దొంగలు, దోపిడిదార్ల భయం అనేది లేకుండా చేశారు. ప్రైవేటు వ్యాపారం మీద అధికార్ల తనిఖీ ఉండేది. వాణిజ్య సుంకాల వసూళ్లకు సంబంధించిన కార్యనిర్వహణలో అవినీతిని నిరోధించారు. అదే విధంగా, విదేశ వాణిజ్య సంస్థలు గానీ ఆ సంస్థల్లో పనిచేసే నౌకర్లు గానీ వారికిచ్చిన ప్రత్యేక సౌకర్యాలను దుర్వినియోగం చెయ్యకుండా అనేక కట్టుదిట్టాలు చేశారు. ఇంగ్లీషు తూర్పిండియా కంపెనీ ఉద్యోగులు ఈ దేశపు చట్టాలకు బద్ధులుగా ఉండేలాగు, ఇతర వర్తకుల మాదిరే వాళ్ళు కూడా నిర్ణీత వాణిజ్య సుంకాలు చెల్లించేలాగు కట్టడి చేశారు. ఇంగ్లీషు, ఫ్రెంచి వర్తక సంస్థలు కలకత్తా, చంద్రనాగూర్ రేవు పట్టణాల్లో తమ ఫ్యాక్టరీల చుట్టూ కోటలు కట్టుకోవడానికి నవాబ్ అలీ వర్ధీ ఖాన్ అనుమతించ లేదు. అయినప్పటికీ, ఒక్క విషయంలో బెంగాల్ నవాబుల దూరదృష్టి లోపం, నిర్లక్ష్యం బైటపడ్డాయి. 1707 తరువాత, తమ కోర్కెల్ని సాధించుకోడానికి సైనిక బల ప్రయోగానికి, బెదిరింపులకు తెగించిన ఇంగ్లీషు తూర్పిండియా కంపెనీ దుందుడుకు ధోరణిని బెంగాల్ నవాబులు కాలరాచి వెయ్యలేదు. కంపెనీ బెదిరింపుల్ని తుంచి వెయ్యగలిగే శక్తి ఆనాడు వారికుంది. అయినా, ఒక వెధవ వ్యాపార సంస్థ తమ అధికారానికి ఏం ఎసరు తేగలదులే అని భరోసాతో వుంటూ వచ్చారు. ఇంగ్లీషు

ఈస్టిండియా కంపెనీ కేవలం వ్యాపారస్థుల సంస్థ మాత్రమే కాదు; అనాడు విపరీత దురాక్రమణ స్వభావం, విస్తృత విస్తరణ కాంక్ష కలిగిన వలసతత్వ ప్రతినిధి సంస్థ అని బెంగాల్ నవాబులు గుర్తించలేక పోయారు. బైటి ప్రపంచాన్ని గురించి వాళ్ళకున్న అజ్ఞానం, బైటి ప్రపంచంతో వాళ్లకు బొత్తిగా సంబంధాలు లేక పోవటం అనేవి రాజ్యాన్ని పెద్ద దెబ్బ తీశాయి. బైటి ప్రపంచంతో సంబంధాలే గనుక వుండి వుంటే, పాశ్చాత్య వ్యాపార సంస్థలు ఆఫ్రికాలో, ఆగ్నేయ ఆసియాలో, లాటిన్ అమెరికాలో జరిపిన దారుణ దురంతాలు వాళ్ళకి తెలిసి వుండేవి.

బెంగాల్ నవాబులు బలమైన సైన్యం నిర్మించు కోవడంలో చూపిన నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించారు. ఉదాహరణకి ముర్షిద్ కులీకాన్ పదాతిదళం 4,000; అశ్వికదళం 2,000. అలీ వర్దీఖాన్ తన పరిపాలనా కాలంలో పదే పదే దురాక్రమణకు దిగే మహారాష్ట్రుల్తో అనేక కష్టాలు పడి, చివరికి ఒరిస్సాలో చాలా భాగం వాళ్ళకి వదిలి వెయ్యవలసి వచ్చింది. 1756-57 లో అలివర్దీఖాన్ వారసుడైన సిరాజ్ ఉద్దౌలా మీద ఇంగ్లీషు వాళ్ళు యుద్ధం ప్రకటించినప్పుడు, బలమైన సైన్యంలేని లోపం విదేశస్థుల విజయానికి బాగా ఉపకరించింది. అధికార వర్గాల్లో పెచ్చు పెరిగిన అవినీతిని అరికట్టడంలో కూడా బెంగాల్ నవాబులు విఫలులయ్యారు. అఖరికి న్యాయాధికార్లు సైతం లంచాలు పట్టటానికి అలవాటు పడ్డారు. అధికార్ల యీ బలహీనతని విదేశ సంస్థలు పూర్తిగా వినియోగించుకొని అధికార చట్టాల్ని, నియమ నిబంధనలన్ని, విధానాల్ని తృణీకరించ గలిగాయి.

**అవధ్ :** అవధ్ స్వయంపాలక సంస్థానాన్ని స్థాపించినవాడు సాదత్‌ఖాన్ బుర్హాన్-ఉల్-ముల్క్. 1722 లో ఆయన అవధ్ గవర్నర్‌గా పదవీ స్వీకారం చేశాడు. ఆయన మహా సాహసి; శక్తివంతుడు; దృఢ సంకల్పుడు, అద్భుతమైన తెలివితేటలు కలవాడు. ఆయన మొట్టమొదట గవర్నరుగా వచ్చిన రోజుల్లో, రాష్ట్ర వ్యాపితంగా జమీందార్ల తిరుగుబాటు ధోరణులు చెలరేగాయి. వాళ్ళు భూమి శిస్తు చెల్లించటానికి నిరాకరించారు; స్వంత సైన్యాలు నిర్మించుకున్నారు; బలమైన కోటలు కట్టుకున్నారు; చక్రవర్తి అధికారాన్ని ధిక్కరించారు. సాదత్ ఖాన్ వాళ్ళతో సంవత్సరాల తరబడి యుద్ధాలు చెయ్యాల్సి వచ్చింది. చిట్ట చివరికి, ఆ పెద్ద జమీందార్ల అరాచకాన్ని అణచివేసి, క్రమశిక్షణని నెలకొల్ప గలిగాడు. ప్రభుత్వ ఆర్థిక వనరుల్ని పెంచగలిగాడు. అయితే, ఓడిన జమీందార్లకి ఆయన ఉద్వాసన చెప్పలేదు. వాళ్ళు లొంగిపోయి బకాయిపడ్డ శిస్తు యావత్తు కక్కటానికి అంగీకరించాక వాళ్ళని అదే జమీల్లో స్థిరపర్చాడు. కాని, వాళ్ళు వెర్రి వేషాలు వెయ్యటం మానుకోలేదు. నవాబు సైనికపట్టు సన్నగిల్లినప్పుడు, లేదా నవాబు వేరే విషయాల్లో నిమగ్నమై ఉన్నపుడు వాళ్ళు తోక ఝాడిస్తూనే వచ్చారు. ఆ విధంగా, పెద్ద పెద్ద జమీందార్లు నవాబు అధికారాన్ని బలహీన పర్చారు. సాదత్‌ఖాన్ వారసుడు సఫ్దర్‌జంగ్ వీళ్ళని గురించి అద్భుతంగా రాశాడు : "అవధ్ జమీందార్లున్నారే .. వీళ్ళు కన్ను గీటితే చాలు అల్లకల్లోలం సృష్టించగల మహానుభావులు; దక్కన్ మరాఠీలకన్నా మహా ప్రమాద కారులు."

సాదత్‌ఖాన్ కూడా 1723 లో ఒక తాజా శిస్తు విధానాన్ని అమలుపర్చాడు. న్యాయమైన శిస్తు నిర్ణయం ద్వారాను, బడా జమీందార్ల పీడననుంచి రైతుని రక్షించడం

ద్వారాను ఆయన రైతాంగం స్థితి గతుల్ని మెరుగు పర్చాడని చెప్పుకుంటారు.

బెంగాల్ నవాబుల మాదిరిగానే, సాదత్‌ఖాన్ కూడా హిందూ ముస్లిముల మధ్య ఏపక్ష చూపలేదు. ఆయన సేనానుల్లో, ఉన్నతాధికారుల్లో ఎక్కువ మంది హిందువులు. వ్రరివీగే జమీందార్లని, నాయకుల్ని, సర్దార్లని వాళ్ళ మతంతో నిమిత్తం లేకుండా అణచి వేశాడు. ఆయన తన సైనికులకు సక్రమంగా మంచి జీతాలిచ్చాడు; సరయిన ఆయుధాలిచ్చాడు, చక్కని శిక్షణ యిచ్చాడు. ఆయన పరిపాలన సమర్థవంతమైంది. 1739లో ఆయన చనిపోవటానికి ముందు, దాదాపు సర్వస్వతంత్రుడుగా వ్యవహరించాడు. సుబేదారీని వంశపారంపర్యం హక్కుగా మార్చాడు. ఆయన తరువాత ఆయన మేనల్లుడు సఫ్దర్‌జంగ్ రాజ్యానికి వచ్చాడు. అవధ్ పాలక పదవితో పాటు 1748లో మొఘల్ సామ్రాజ్యానికి వజీరుగా కూడా నియమితు డయ్యాడు. అలహాబాద్ సుబా కూడా అదనంగా ఆయనకి అప్పగించబడింది.

1754లో ఆయన చనిపోయే దాకా అవధ్, అలహాబాద్ సుబాలు సుఖ శాంతుల్తో తులతూగాయి. తిరగబడిన జమీందార్లని అణచి వేశాడు. మహారాష్ట్ర సర్దార్లతో సంధి చేసుకొని తన సుబాలను మహారాష్ట్ర దాడుల నుండి రక్షించాడు. రోహిల్లాలకు, బాంగష్ పఠాన్లకు వ్యతిరేకంగా సమరం సాగించాడు. 1750-51లో బంగష్ నవాబులకు వ్యతిరేకంగా నడిపిన యుద్ధంలో ఆయన మరాఠా సైనిక సహాయం స్వీకరించాడు. ఆ సహాయానికి ప్రతిఫలంగా రోజుకి 25,000 రూ.ల చొ॥న దినభత్యం చెల్లించాడు. అట్లాగే జాట్‌లు ఇచ్చిన మద్దతుకు గాను రోజుకి 15,000 రూ॥ల చొప్పున దినభత్యం చెల్లించాడు. ఆ తరువాత, పీష్వాలతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాడు. దాని ప్రకారం, అహ్మదిషా అబ్దాలికి వ్యతిరేకంగానూ, సామ్రాజ్యాన్ని ఇండియన్ పఠాన్లనుంచి, రాజపుత్ర రాజుల నుంచి రక్షించటానికి పీష్వా మొఘల్ సామ్రాజ్యానికి తోడ్పాటు ఇవ్వాలి. దానికి ప్రతిఫలంగా 50 లక్షల రూపాయలు; పంజాబ్, సింధ్ రాష్ట్రాలలోను ఇంకా అనేక ఉత్తరాది జిల్లాలలోను చేత్ పన్ను వసూలు చేసుకునే హక్కు పీష్వాకు ధారాదత్త మయ్యాయి. అంతే కాకుండా పీష్వాను అజ్మీర్, ఆగ్రాలకు గవర్నరుగా చెయ్యటానికి కూడా ఒప్పందం కుదిరింది. కానీ, పీష్వా ఢిల్లీలో సఫ్దర్‌జంగ్ శత్రుపక్షంలో చేరడంతో ఆ ఒప్పందం రద్దయిపోయింది. సఫ్దర్‌జంగ్ శత్రుపక్షం వాళ్ళు పీష్వాకు అవధ్, అలహాబాద్ సుబాల గవర్నరు పదవి వాగ్దానం చేశారు.

సఫ్దర్‌జంగ్ అందరికీ సమానంగా న్యాయం జరిగే న్యాయ వ్యవస్థని నిర్మించాడు. ఉద్యోగాల నియామకంలో హిందూ ముస్లిమ్ మతస్థులు ఉభయులకు సమానావకాశాలు ఇచ్చాడు. ఆయన ప్రభుత్వంలో అత్యున్నత పదవిని మహారాజా నవాబ్‌రాయ్ అనే హిందువు నిర్వహించాడు.

నవాబుల పరిపాలనలో సర్దార్ల శాంతియుత జీవితం, ఆర్థిక సౌభాగ్యం అవధ్ దర్బారు చుట్టూ ఒక విలక్షణమైన లక్నో సంస్కృతి వికసించటానికి దోహదం చేశాయి. అవధ్ సంస్థానంలో ప్రముఖ నగరంగాను, 1775 తరువాత అవధ్ నవాబుల రాజధాని నగరంగాను భాసించిన లక్నో సాహిత్య, కళాపోషణలో ఢిల్లీని పోటీ పడింది. హస్త కళలకు ప్రశస్త కేంద్రంగా కూడా వర్ధిల్లింది.

సఫ్దర్‌జంగ్ వ్యక్తిగత నైతిక ప్రవర్తనలో అత్యున్నత ప్రమాణాలు అందుకున్నాడు. జీవితమంతా తన ఒకే ఒక భార్యతో మాత్రమే గడిపాడు. ఆ

మాటకొస్తే హైదరాబాద్, బెంగాల్ అవధ్ సంస్థానాధీశులు అంటే నిజాం-ఉల్-ముల్క్, ముర్షిద్ కులీఖాన్, అలివర్దీఖాన్‌లుగాని సాదత్‌ఖాన్, సఫ్దర్‌జంగ్‌లు గానీ అత్యున్నత వ్యక్తిగత నైతిక ప్రమాణాలు కలవాళ్ళు. దాదాపు వారంతా నియమిత నిరాడంబర జీవితాలు గడిపారు. 18వ శతాబ్దపు ప్రముఖ సర్దార్లందరూ భోగమయిన విలాస జీవితాల్ని గడిపినారనే విశ్వాసాన్ని ఈ సంస్థానాధీశుల జీవితాలు పటాపంచలు చేస్తాయి. అయితే, వాళ్ళు తమ ప్రజా సంబంధ, రాజకీయ వ్యవహారాల లావాదేవీల్లో దగా, కుట్ర, విద్రోహాలకు పాల్పడ్డారు.

**మైసూరు** : హైదరాబాద్ తరువాత, దక్షిణాదిన అత్యంత శక్తివంతమైన రాజ్యంగా హైదరాలీ ఆధ్వర్యంలో మైసూరు సంస్థానం తలెత్తింది. విజయ నగర సామ్రాజ్యం అంతరించి పోయిన కాలం నాటి మైసూరు సంస్థానం గాలిలో దీపం వంటి తన సున్నితమైన స్వాతంత్ర్యాన్ని జాగ్రత్తగా కాపాడుకొంది. 18వ శతాబ్ది మొదట్లో నంజరాజ్ (సర్వాధికారి), దేవరాజ్ (దుల్వాయ్) అనే ఇద్దరు మంత్రులు మైసూర్ మహారాజయిన చిక్క కృష్ణరాజ్‌ని కీలుబొమ్మగా చేసి రాజ్యాధికారాన్ని వశపర్చుకున్నారు హైదరాలీ 1721లో ఒక అజ్ఞాత సామాన్య కుటుంబంలో జన్మించాడు. మైసూర్ సైన్యంలో ఒక ఛోటా పదవిలో జీవితం ప్రారంభించాడు. హైదరాలీకి అక్షర జ్ఞానం లేకపోయినా నిశితమైన ప్రజ్ఞ ఉంది; గొప్ప శక్తి సామర్థ్యాలు, ధైర్య సాహసాలు, దృఢ సంకల్పం ఉన్నాయి. పైపెచ్చు, ఉజ్వల సేనాపతి, అద్భుత రాజకీయ చతురుడు కూడా.

ఇరవైకు పైగా మైసూరు సంస్థానాన్ని ఊపిరి సల్పకుండా చేసిన యుద్ధాల్లో హైదరాలీకి అవకాశం కలసి వచ్చింది. తనకు అందివచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటూ, క్రమేణా అతడు మైసూరు సైన్యంలో చాలా పైకి వచ్చాడు. పాశ్చాత్య సైనిక శిక్షణ తాలూకు ప్రయోజనాల్ని అతడు చప్పున గుర్తించి, తన అధీనంలో ఉన్న సైనిక దళాలకు ఆ శిక్షణ ఇప్పించాడు. 1755లో ఫ్రెంచి నిపుణుల తోడ్పాటుతో దిండిగల్‌లో ఒక ఆధునిక ఆయుధాగారాన్ని నెలకొల్పాడు. 1761లో సర్వాధికారి నంజరాజ్‌ని కూలదోసి మైసూరు సంస్థానంలో తన అధికారం స్థాపించాడు. తిరుగుబాటు తత్వం ఒంట బట్టించుకున్న జమీందార్లని పూర్తిగా లొంగగొట్టి బిద్‌నూర్, సుందా, సేవా, కనరా,



హైదర్ అలి

మలబార్ భూభాగాల్ని జయించాడు. చదువు సంధ్యలు లేకపోయినా, సమర్థుడైన పాలకుడుగా నిరూపించు కున్నాడు. అతడు అధికారం స్వీకరించి నప్పుడు మైసూరు సంస్థానం చిన్నాభిన్నంగా, దుర్బలంగా ఉంది అటువంటి సంస్థానాన్ని భారతదేశంలో ఒక ప్రముఖ శక్తిగా రూపొందించాడు మత సహనం పాటించి, తన కొలువులో అనేకమంది హిందువులకు పదవులిచ్చాడు. తన మొట్టమొదటి దివానుగా హిందువునే నియమించుకున్నాడు.

హైదరాలీ రాజ్యాధికారం స్వీకరించింది లగాయతు, మరాఠా సర్దార్లతోను, నిజాంతోను, బ్రిటిషు వాళ్ళతోను నిరంతరాయంగా యుద్ధాల్లో మునిగి తేలాడు. 1769లో బ్రిటిషు సేనల్ని పదే పదే తరిమి కొట్టి మద్రాసు శివార్ల దాకా వెళ్ళాడు. 1782లో రెండవ ఆంగ్లో-మైసూరు యుద్ధం జరుగుతున్న కాలంలో హైదరాలీ మరణించాడు. తరువాత అతని కుమారుడు టిప్పు సుల్తాను అధికారం స్వీకరించాడు

1799లో బ్రిటిషు వారి చేతుల్లో మరణించేటంతవరకు మైసూర్‌ని పరిపాలించిన టిప్పు సుల్తాన్ సంక్లిష్ట వ్యక్తి అయనసలు నూతన విషయ సాధకుడు. కొత్త క్యాలెండర్ని, కొత్త నాణాలని, కొత్త కొలతలు, తూనికల్ని ప్రవేశపెట్టడంలో కాలంతో పాటు మారాలనే ఆయన కాంక్ష ద్యోతకమవుతుంది ఆయన స్వంత గ్రంథాలయంలో మతం, చరిత్ర, సైనిక శాస్త్రం, వైద్యం, గణితం వగైరా వివిధ విభిన్న విషయాల మీద పుస్తకాలు కొకొల్లలుగా ఉండేవి ఫ్రెంచి మహా విప్లవం మీద ఆయనకు మహా ఆసక్తి శ్రీరంగపట్నంలో ఆయన "విప్లవ వృక్షాన్ని" (Tree of Liberty) నాటాడు, జాకొబిన్ క్లబ్‌లో సభ్యుడుగా చేరాడు భారత సైనిక దళాలలో క్రమశిక్షణా రాహిత్యం పెచ్చు పెరిగిపోయిన ఆ రోజుల్లో, టిప్పుసుల్తాను సైన్యాలు గొప్ప క్రమశిక్షణతో, తుదకంటా ఆయనకు విధేయంగా, విశ్వాసపాత్రంగా ఉన్నాయంటే అది ఆయన నిర్మాణదక్షతకు నిదర్శనం. జాగీర్లు దానంచేసే పద్ధతికి స్వస్తిచెప్పి, ఆయన రాజ్య ఆదాయం వృద్ధి చేశాడు. జమీందార్ల వంశపారంపర్య హక్కుల్ని తగ్గించటానికి ఆయన చాలా కృషి చేశాడు. ఏమైనప్పటికి భూమిశిస్తు ద్వారా ఆయనకు సమకూరిన ఆదాయం ఏ సమకాలీన రాజ్య ఆదాయానికీ తీసిపోలేదు. మొత్తం పండిన పంటలో మూడవవంతు భూమిశిస్తుగా నిర్ణయింప బడింది అక్రమంగా వసూలు చేసే పన్నుల మీద ఆయన తనిఖీలు జరిపించాడు. శిస్తు రెమిషన్లు మంజూరు చేయడంలో ఆయన చాలా ఉదారంగా వ్యవహరించాడు.

ఆయన పదాతి దళంలో సైనికులు యూరోపియన్ పద్ధతిలో మస్కెట్లు, బాయొనెట్లు ధరించే వాళ్ళు. అయితే, అవన్నీ మైసూర్‌లో తయారైనవే. 1796 తరువాత, ఆయన అధునిక నౌకాబల నిర్మాణానికి ప్రయత్నం చేశాడు. అందుకోసం రెండు నౌకాశ్రయాలు నిర్మించాడు. నౌకల నమూనాలు సైతం ఆయన స్వయంగా రూపకల్పన చేశాడు. ఆయన వ్యక్తిగత జీవితం మచ్చలేనిది. విలాస పూరిత జీవితానికి ఆయన దూరంగా ఉన్నాడు. ఆయనది అద్భుతమైన తెగింపుతో కూడిన సాహసం; సేనానిగా ఉజ్వల ప్రజ్ఞావంతుడు. అయితే, కార్యాచరణలో తొందరపాటు, చంచల స్వభావం ఆయన లోపాలు.

దాక్షిణాత్య రాజ్యాలకు గానీ, ఇంకా తదితర భారత ప్రాంతాలకు గానీ ఇంగ్లీషు వాళ్ళ వల్ల రాబోయే ప్రమాదాన్ని పసిగట్టటంలో టిప్పు సుల్తాన్ మాదిరిగా

రాజనీతిజ్ఞతను ప్రదర్శించినవాళ్ళు 18వ శతాబ్దంలో మరి కానరారు. భారతాకాశంలో ఉదయించే ఇంగ్లీషు శక్తికి అకుంఠిత శత్రువుగా నిలబడ్డవాడు టిప్పు సుల్తాన్. ఇంగ్లీషు వాళ్ళు ఈ దేశంలో తమకి అత్యంత ప్రమాదకర శత్రువుగా ఆయన్ని గుర్తించారు.

ఆనాటి ఆర్థిక పరమైన బడుగు స్థితి నుంచి మైసూరు సంస్థానం పూర్తిగా బైట పడకపోయినా హైదరాలీ, టిప్పుసుల్తాన్ల పరిపాలనలో కొంతవరకు ఆర్థిక వికాసం పొందింది. ముఖ్యంగా సమీప గతంలోని పరిస్థితితో గానీ, దేశంలో మిగతా ప్రాంతంతో పోల్చి చూసినప్పుడు గానీ హైదరాలీ, టిప్పు సుల్తాన్ల ఏలుబడిలో మైసూరు రాజ్యం సాధించిన ఆర్థికాభివృద్ధి స్పష్టంగా గోచరిస్తుంది. 1799లో బ్రిటిషు వాళ్ళు టిప్పు సుల్తాన్ని ఓడించి, వధించి మైసూర్ని స్వాధీనం చేసుకున్నప్పుడు బ్రిటిష్ ఇండియాలోని రైతుకన్నా ఎన్నో రెట్లు ఉచ్చస్థితిలో వున్న మైసూరు రైతుని చూసి వాళ్ళు ఆశ్చర్య పోయారు. 1793 నుంచి 1798 దాకా గవర్నర్ జనరల్గా పనిచేసిన సర్జాన్షోర్ ఇలా ప్రశంసించాడు : "మైసూర్ రాజ్యంలో రైతాంగానికి రక్షణ ఉంది; వాళ్ళ శ్రమకు తగిన ప్రోత్సాహం, ప్రతిఫలం ముట్టాయి." ఆధునిక వాణిజ్య, పరిశ్రమల ప్రాధాన్యాన్ని టిప్పు సుల్తాన్ చక్కగా ఆకళించుకున్నట్లు తోస్తుంది. నిజానికి, సైనిక శక్తికి పునాది ఆర్థిక బలమేనన్న వాస్తవాన్ని గ్రహించిన ఏకైక సంస్థానాధీశుడు టిప్పు సుల్తానే. విదేశీ నిపుణుల్ని రప్పించి, ఆధునిక పరిశ్రమల్ని స్థాపించి, ఆ పరిశ్రమలకు ప్రభుత్వ సహాయం అందించే దిశలో ఆయన కొంత కృషి చేశాడు. విదేశ వాణిజ్యాభివృద్ధి కోసం ఆయన ఫ్రాన్స్, టర్కీ, ఇరాన్, పెగూ దేశాలకు రాయబార వర్గాల్ని పంపించాడు. చైనాతో కూడా వర్తక సంబంధాలు సాగించాడు. యూరప్ వ్యాపార సంస్థల తరహాలో ఒక వ్యాపార సంస్థని స్థాపించటానికి సైతం ఆయన కృషి చేశాడు.

కొంతమంది బ్రిటిష్ చరిత్రకారులు టిప్పుసుల్తాన్ని మత దురభిమానిగా చిత్రించారు. కాని, వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. మతానికి సంబంధించిన అభిప్రాయాలలో ఆయన నిష్ఠగా ఉండవచ్చుగాని, నిజానికి ఆయన చాలా సహన శీలి; ఇతర మతాల పట్ల అతి వివేకవంతమైన దృక్పథం ప్రదర్శించాడు. 1791లో మరాఠా రౌతులు శృంగేరి ఆలయాన్ని కొల్లగొట్టినప్పుడు, దేవతా ప్రతిమ పునః ప్రతిష్ఠకు ఆయన భూరి విరాళం ఇచ్చాడు. శృంగేరీ ఆలయానికి, ఇంకా తదితర అనేక ఆలయాలకు ఆయన ఎప్పుడూ దానధర్మాలు ఇస్తూనే ఉండేవాడు. శ్రీరంగనాథుని సుప్రసిద్ధ దేవాలయం ఆయన రాజభవనానికి నూరు గజాలలోపే ఉంది.

*కేరళ* : 18వ శతాబ్ది ప్రారంభంలో కేరళ అనేకమంది ఫ్యూడల్ ప్రభువుల, రాజాల అధీనంలో ముక్కలు చెక్కలై ఉంది. కాలికట్, చిరక్కాల్, కొచ్చిన్, తిరువాన్కూరు అనేవి నాలుగూ ఆనాడు అతి ముఖ్య సంస్థానాలు. కాలికట్ జామొరిన్ ఏలుబడిలో ఉండేది. తిరువాన్కూర్ సంస్థానం 1720 తరువాత రాజా మార్తాండవర్మ పాలనలో పేరులోకి వచ్చింది. ఆయన 18వ శతాబ్ది రాజనీతిజ్ఞుల్లో ప్రముఖుడు; అరుదైన దూరదృష్టి, దృఢ సంకల్పంతో పాటు అపూర్వ ధైర్య సాహసాలు కలిగిన వ్యక్తి. ఆయన సామంతుల్ని లొంగ దీశాడు; క్విలన్, ఇలయదం ప్రాంతాల్ని జయించాడు; డచ్చి వాళ్ళని ఓడించి వాళ్ళ రాజకీయాధికారానికి గోరీ కట్టాడు. యూరోపియన్ అధికార్ల సహాయంతో తన సైన్యాన్ని పాశ్చాత్య పద్ధతుల్లో నిర్మించి, ఆధునిక

ఆయుధాలు సమకూర్చారు. ఒక ఆధునిక ఆయుధాగారాన్ని కూడా నెలకొల్పారు. తన నూతన సైన్యంతో ఉత్తర దిక్కుగా దిగ్విజయ యాత్ర చేశారు. ఆయన ఆధ్వర్యంలో తిరువాన్కూరు రాజ్యం కన్యాకుమారి నుంచి కొచ్చిన్ దాకా విస్తరించింది. ఆయన నీటి పారుదల సౌకర్యాలు ఏర్పాటు చేశారు; రవాణా సౌకర్యాలు మెరుగుపర్చడానికి రహదార్లు, కాలువలు నిర్మించారు, విదేశ వాణిజ్యానికి క్రియాశీల ప్రోత్సాహం ఇచ్చారు.

1763 నాటికి, కేరళలోని చిల్లరమల్లర సంస్థానాలు యావత్తు కొచ్చిన్, తిరువాన్కూర్, కాలికట్ రాజ్యాలలో సంలీనమై పోయాయి. 1766లో హైదరాలీ సైన్యాలు కేరళ దిగ్విజయ యాత్రకు బైల్దేరి జామొరిన్ ఏలుబడిలో ఉన్న కాలికట్‌తో సహా కొచ్చిన్ దాకా విస్తరించిన ఉత్తర కేరళని యావత్తు ఆక్రమించుకున్నాయి.

18వ శతాబ్దంలో మళయాళ సాహిత్యంలో ఒక అద్భుతమైన పునర్వికసనం చోటు చేసుకొంది. సాహిత్య పోషకులైన ఫ్యూడల్ ప్రభువుల, రాజాల ప్రోత్సాహం దీనికి కొంతవరకు కారణం. 18వ శతాబ్ది ఉత్తరార్థంలో తిరువాన్కూరు రాజధాని తిరువనంతపురం (త్రివేండ్రం) సుప్రసిద్ధ సంస్కృత విద్యాపీఠంగా రూపొందింది. మార్తాండవర్మ వారసుడు రామవర్మ స్వయంగా కవి, పండితుడు, సంగీత విద్వాంసుడు, సువిఖ్యాత నటుడు, ఉత్తమ సంస్కృతి పరుడు; ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడేవాడు; ఐరోపా వ్యవహారాల్లో గొప్ప ఆసక్తి; లండన్, కలకత్తా, మద్రాసు నగరాల నుండి వెలువడే పత్రికల్ని తెప్పించుకుని తప్పని సరిగా చదివేవాడు.

## ఢిల్లీ పరిసర ప్రాంతాలు

***రాజపుత్ర రాజ్యాలు*** : మొఘల్ సామ్రాజ్యం అంతకంతకు నిర్వీర్యమైపోతున్న అదను కనిపెట్టి ప్రధాన రసపుత్ర రాజ్యాలు కేంద్ర ప్రభుత్వాధికారం నుంచి బైట పడిపోవటమే కాకుండా సామ్రాజ్యంలోని ఇతర ప్రాంతాల్లో సైతం తమ పలుకుబడిని విస్తరింప జేశాయి. ఫరూక్ సియార్, మహమ్మద్‌షాల పరిపాలనా కాలంలో అంబర్, మార్వార్ ప్రభువులు ఆగ్రా, గుజరాత్, మాళవ వంటి ముఖ్య మొఘల్ సుబాలకు గవర్నర్లుగా నియమించబడ్డారు.

రాజపుటానా సంస్థానాలు పూర్వం మాదిరిగానే వేటికవి చీలిపోయి వున్నాయి. పెద్ద సంస్థానాలు బలహీనమైన తమ పొరుగు సంస్థానాల్ని కబళించి ఇంకా పెద్దవయ్యాయి. బలహీనుడైన పొరుగువాడు రాజపుత్రుడా, వేరేవాడా అనేది వాళ్ళు లెక్కలోకి తీసుకోలేదు. ఈ పెద్ద పెద్ద రాజపుత్ర రాజ్యాలమధ్య ఎప్పుడూ సఖ్యతనేది లేదు. నిరంతరం పరస్పరం గిల్లి కజ్జాలు పెట్టుకుంటూనే, అందర్యుద్ధాల్లో మునిగి తేల్తూనే ఉండేవి. ఇక ఈ రాజ్యాలలోని అంతఃపుర రాజకీయాలు మొఘల్ దర్బారులో మాదిరిగానే కుట్రలు, కుహకాలు, అవినీతి, విద్రోహాలతో కంపు కొడుతూ ఉండేవి. ఉదాహరణకి, మార్వార్ రాజు అజిత్‌సింగ్‌ని అతని కుమారుడే చంపివేశారు.

18వ శతాబ్ది రసపుత్ర రాజుల్లో అంబర్ సంస్థానాన్ని పరిపాలించిన రాజా సవాయ్ జైసింగ్ చాలా గొప్పవాడు. ఆయన ప్రముఖ రాజనీతిజ్ఞుడు, శాసనకర్త, సంస్కర్త. వీటన్నిటినీ మించి, ఆయన విజ్ఞాన శాస్త్రాభిలాషి. శాస్త్రీయ విజ్ఞాన ప్రగతి అంటే ఏమిటో భారతీయులు మరచిపోయిన యుగంలో ఆయన విజ్ఞాన శాస్త్రం పట్ల విశేషమైన ఆసక్తి ప్రదర్శించినవాడు. జైపూర్ నగరాన్ని నిర్మించినవాడు ఆయనే.

జైపూర్‌ని విజ్ఞాన కళాపీఠంగా రూపొందించాడు. ఒక ఖచ్చితమైన ప్లాను ప్రకారం, పూర్తిగా శాస్త్రీయ పద్ధతుల్లో జైపూర్ నగర నిర్మాణం జరిగింది. జైపూర్‌లోని విశాలమైన వీధులు సమకోణంలో కలుస్తూ విడిపోతాయి.

అన్నిటికన్నా ముఖ్యంగా, ఆయన గొప్ప ఖగోళ శాస్త్రవేత్త. నిర్దుష్టమైన ఉన్నతస్థాయి శాస్త్ర పరికరాలు సమకూర్చి ఒక గొప్ప నక్షత్రశాల నిర్మించాడు. ఆ పరికరాల్లో అనేకం ఆయన స్వయంగా కనిపెట్టి రూపొందించినవే. ఢిల్లీ, జైపూర్, ఉజ్జయిని, వారణాసి, మధురలలోని ఖగోళ పరిశోధనా శాలలు ఆయన పెట్టిన భిక్ష. ఆయన ఖగోళశాస్త్ర పరిశోధనలు అతి నిర్దుష్టమైనవి. ఖగోళ శాస్త్రంలో అభిలాష ఉన్నవాళ్ళు ముమ్ముందు పరిశీలనలు జరపటానికి అనువుగా ఆయన "జిజ్ మహమ్మద్ షాహి" అనే పేరుతో ఖగోళశాస్త్ర పట్టికలు తయారుచేశాడు. యూక్లిడ్ రాసిన "ఎలిమెంట్స్ ఆఫ్ జామెట్రీ"ని (ప్రారంభ రేఖా గణితం), త్రికోణమితి (ట్రిగ్నామెట్రీ) మీద వెలువడ్డ అనేక గ్రంథాల్ని, సంవర్గమానాల మీద (Loganthms) నేపియర్ రాసిన పుస్తకాల్ని సంస్కృతంలోకి తర్జుమా చేయించాడు.

జైసింగ్ గొప్ప సాంఘిక సంస్కర్త కూడా. ఆడపిల్లల పెండ్లి కోసం భారీ ఎత్తున ఖర్చు పెట్టి చివరికి అరిపోయే రాజపుత్రుల్ని రక్షించడం కోసం ఒక చట్టాన్ని రూపొందించాడు. ఈ విశిష్ట వ్యక్తి జైపూర్‌ని 1699 నుండి 1743 వరకు 44 సంవత్సరాల సుదీర్ఘ కాలం పరిపాలించాడు.

**జాట్‌లు:** జాట్‌లు వ్యవసాయ వృత్తి చేసుకునే కులస్థులు. ఢిల్లీ, ఆగ్రా మధురల చుట్టూ వున్న ప్రాంతాల్లో జాట్‌లు నివసించేవాళ్ళు. మొఘల్ అధికార్ల పీడన భరించలేక మధుర పరిసరాల్లో జాట్ రైతులు తిరగబడ్డారు. జాట్ జమీందార్ల నాయకత్వాన 1669లో ఒకసారి, తరువాత 1688లోను జాట్ రైతాంగం తిరుగుబాటు జరిపింది. మొఘల్ ప్రభువులు తిరుగుబాట్లని అణచివేసినప్పటికీ, అవి కల్లోల ప్రాంతాలుగానే ఉండిపోయాయి. ఔరంగజేబ్ చనిపోయాక, జాట్‌లు ఢిల్లీ చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో అల్లర్లు రేపారు. జమీందార్ల నాయకత్వంలో రైతాంగ తిరుగుబాటుగా ప్రారంభమైన జాట్ అందోళన దోపిడీ దౌర్జనకాండగా భగ్నమైంది. ధనికులు-పేదలు, జాగీర్దార్లు - రైతులు, హిందువులు - ముస్లిములు అనే విచక్షణ లేకుండా జాట్‌లు అందర్నీ దోచి పారేశారు. జాట్ జమీందార్లు మొఘల్ దర్బారు కుట్రల్లో మురుగ్గా పాల్గొన్నారు. గాలి వాటం కనిపెట్టి, తమ ప్రయోజనాల కనుగుణంగా పార్టీలు మారారు. చూరామన్, బదన్‌సింగ్ అనేవాళ్ళు భరత్‌పూర్ జాట్ సంస్థానాన్ని స్థాపించారు. 1756 నుండి 1763 వరకూ పరిపాలించిన సూరజ్‌మల్ కాలంలో జాట్ సంస్థానం మహా వైభవదశ అనుభవించింది. సూరజ్‌మల్ గొప్ప పరిపాలనాదక్షుడు, శూరుడు, రాజనీతిజ్ఞుడు. తూర్పున గంగ మొదలుకొని దక్షిణాన చంబల్ దాకా; పడమట ఆగ్రా సుబా మొదలుకొని ఉత్తరాన ఢిల్లీసుబా దాకా ఆయన జాట్ సంస్థానాన్ని విస్తరింపజేశాడు. జాట్ సంస్థానంలో మిగతా అనేక జిల్లాలతో పాటు ఆగ్రా, మధుర, మీరట్, అలీఘడ్ జిల్లాలు కూడా ఉండేవి. సూరజ్‌మల్ గురించి ఒక సమకాలీన చరిత్రకారుడు ఇలా వర్ణించాడు:

"ఆయన రైతు మాదిరే దుస్తులు వేసుకున్నా, రైతులు మాట్లాడే వ్రజ భాషయే మాట్లాడినా, జాట్ తెగకు ఆయన ప్లేటో అంతటివాడు. తెలివి తేటల్లో, సామర్థ్యంలో,



జాట్ జమీందార్లు, రైతులు

రవెన్యూ, శౌర పరిపాలనా వ్యవహారాలు చక్కబెట్టే నేర్పులో, శక్తిలో తలలు పండిన పెద్దల్లో ఒక్క అసఫ్‌జా బహదూర్ తప్ప సూరజ్‌మల్‌కు ధీటయినవాడు ఆనాడు యావద్భారతంలో లేడు."

1763లో సూరజ్‌మల్ మరణించాక, జాట్ సంస్థానం క్షీణించిపోయింది దోపిడీ చేసి బ్రతికే పిల్ల జమీందార్ల మధ్య సంస్థానం యావత్తు ఛిన్నాభిన్నమైపోయింది.

**బంగష్ పఠాన్లు, రోహిల్లాలు:** మహమ్మద్ ఖాన్ బంగష్ అనే ఆఫ్ఘన్ సాహసుడు ఫరూక్ సియార్, మహమ్మద్‌షాలు మొఘల్ సామ్రాజ్యాన్ని ఏలే కాలంలో ఫరూకాబాద్ చుట్టుప్రక్కల భూభాగంలో తన అధికారాన్ని స్థాపించాడు ఫరూకాబాద్ ప్రాంతమన్నది ఈనాటి అలీగఢ్ - కాన్పూర్‌ల మధ్యగల భూభాగం. అట్లాగే, నాదిర్‌షా దండయాత్రలో మొఘల్ పరిపాలనా వ్యవస్థ స్తంభించిపోయిన తరుణంలో అలీ మహమ్మద్ ఖాన్ అనేవాడు రోహిల్ ఖండ్‌ని స్థాపించాడు అది హిమాలయ పర్వత పాద సీమల్లో దక్షిణాన గంగానదికి - ఉత్తరాన కుమావోన్ కొండలకి మధ్య ఉండే ప్రాంతం మొదట్లో దానికి రాజధాని బెరెల్లి జిల్లాలోని (Aolan) ఓలాన్ తరువాత రాజధాని రామ్‌పూర్‌కి మారింది రోహిల్లాలు అవధ్, ఢిల్లీల్తోను, జాట్‌లతోను నిరంతర కలహాల్లో మునిగి తేలారు

**సిక్కులు:** 15 శతాబ్ది ముగింపులో, గురునానక్ స్థాపించిన సిక్కుమతం పంజాబ్‌లో జాట్ రైతాంగంలోను, ఇతర క్రింది కులాల్లోను వ్యాప్తి పొందింది 1606-1645 సంవత్సరాల మధ్య గురు హరగోవింద సింగ్ నేతృత్వంలో సిక్కులు సమరశీల, సైనిక శక్తిగా పరివర్తన చెందడం ప్రారంభమైంది సిక్కు గురుపరంపరలో పదవ, ఆఖరి గురువైన గురుగోవింద్‌సింగ్ నాయకత్వంలో సిక్కులు ఒక రాజకీయ, సైనిక శక్తిగా రూపొందారు 1699 తరువాత ఔరంగజేబ్‌కు, పర్వత రాజులకు వ్యతిరేకంగా గురుగోవిందసింగ్ ఊపిరి సల్పకుండా యుద్ధాలు చేశాడు ఔరంగజేబ్ మరణానంతరం గురుగోవిందసింగ్ బహదూర్‌షా పక్షం చేరి ఉన్నత హోదా పొంది చక్రవర్తితో పాటు దక్కన్‌కు వెళ్ళాడు. అక్కడ పఠాన్ ఉద్యోగులు ఆయనని ద్రోహకరంగా హత్య చేశారు.

గురుగోవింద సింగ్ మరణానంతరం సిక్కు గురు పరంపర ముగిసింది. సిక్కు నాయకత్వం ఆయన అనుయాయి బందాసింగ్ చేతుల్లోకి పోయింది. బందాసింగ్‌ని బందాబహదూర్ అని ప్రజలు వ్యవహరిస్తారు. బందా బహదూర్ పంజాబ్ సిక్కు రైతాంగాన్ని సమీకరించి మొఘల్ సైన్యానికి వ్యతిరేకంగా ఎనిమిది సంవత్సరాలు ఘోరయుద్ధంచేశాడు. మొఘల్ సైన్యానికి సమవుజ్జీ కాకపోయినా, బందా బహదూర్ వీరోచిత సమరం సాగించాడు. 1715లో మొఘలులకు బందీగా చిక్కి దుర్మరణం పాలయ్యాడు. ఆయన మరణంతో సిక్కుల రాజ్యస్థాపనా కాంక్ష వెనుకంజవేసింది. వాళ్లశక్తి తాత్కాలికంగా సన్నగిల్లింది.

నాదర్‌షా, అహమ్మద్‌షా అబ్దాలీల దండయాత్రలు, ఆ దండయాత్రల ఫలితంగా పంజాబ్ పరిపాలనా వ్యవస్థ విచ్ఛిత్తి సిక్కుల పునర్విజృంభణకు మళ్లీ అవకాశం కల్పించాయి. పంజాబ్ నుంచి అబ్దాలీ నిష్క్రమణతో ఏర్పడ్డ రాజకీయ శూన్యాన్ని సిక్కులు భర్తీచేశారు. 1765-1800 మధ్య సిక్కులు పంజాబ్‌ని, జమ్మూను తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. వాళ్ళు మిజిల్ అనే పేరుతో 12 ప్రధాన విభాగాలుగా విడిపోయారు. ఈ పన్నెండు మిజిలిలు రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో పాలనా నిర్వహణ

సాగించాయి. వాటి మధ్య పరస్పర సంపూర్ణ సహకారం వర్ధిల్లింది సమానతా ప్రాతిపదిక మీద అవి మొదట అవతరించాయి. మిజల్ వ్యవహారాల నిర్ణయంలోను, మిజలిదార్ ఎన్నికలోను, ఇతర కార్య నిర్వాహకుల ఎంపికలోను సభ్యులందరికి సమాన హక్కు ఉంటుంది. క్రమేణ ఈ మిజలిల ప్రజాస్వామ్య స్వభావం అదృశ్యమైంది పలుకుబడి కలిగిన ముఖ్యుల ప్రాబల్యం చోటు చేసుకొంది ఆ నాయకులు పరస్పరం కలహించుకొంటూ స్వతంత్ర అధినేతలుగా తయారుకావటంతో సిక్కులమధ్య సహోదర భావం, ఖాల్సా ఐక్యత మటుమాయమయ్యాయి.

***రంజిత్ సింగ్ నాయకత్వంలో పంజాబ్ :*** 18వ శతాబ్దంలో సుకర్ చకియా మిజల్ నాయకుడు రంజిత్‌సింగ్ పేరులోకి వచ్చాడు శక్తిసాహసాలు కలిగిన వీరుడిగా, పరిపాలనా దక్షుడుగా; రాజకీయ చతురుడుగా రంజిత్‌సింగ్ విఖ్యాతుడు ఆయన 1799లో లాహోర్‌ని, 1802లో అమృతసర్‌ని స్వాధీనం చేసుకున్నాడు సట్లెజ్ నదికి పడమర వైపు ఉన్న సిక్కు ముఖ్యులందర్నీ తన అదుపులో పెట్టుకొని, పంజాబ్‌లో స్వతంత్ర రాజ్యం స్థాపించాడు తరువాత కాశ్మీర్, పెషావర్, ముల్తాన్‌లను జయించాడు పాత సిక్కు నాయకుల్ని పెద్ద జమీందార్లుగా, జాగీర్దార్లుగా మార్చివేశాడు పూర్వం మొఘలులు ప్రవేశపెట్టిన రెవెన్యూ విధానంలో ఆయన మార్పులేమీ చెయ్యలేదు పండిన పంటలో సగం భూమిశిస్తుగా నిర్ణయించాడు

యూరోపియన్ సైనిక శిక్షకుల తోడ్పాటుతో రంజిత్ సింగ్ పాశ్చాత్య పద్ధతుల్లో సమస్త హంగులతో కూడిన ఒక శక్తివంతమైన, క్రమశిక్షణాయుతమైన సైన్యాన్ని నిర్మించాడు ఆయన నూతన సైన్యం కేవలం సిక్కులకు మాత్రమే పరిమితమై లేదు. గూర్ఖాల్ని, బీహారీల్ని, పఠాన్లని, డోగ్రాల్ని, పంజాబీ ముస్లిముల్ని తన సైన్యంలో చేర్చుకున్నాడు ఫిరంగుల తయారీకి లాహోర్‌లో ఒక ఆధునిక కర్మాగారాన్ని నెలకొల్పాడు ఫిరంగులను పేల్చడానికి ముస్లిములను నియమించాడు. ఇంగ్లీషు తూర్పిండియా కంపెనీ వారి సైన్యం తరువాత ఆసియాలో అంతటి శక్తివంతమైన సైన్యం రంజిత్‌సింగ్‌దే నంటారు

మంత్రుల, అధికార్ల ఎంపికలో రంజిత్‌సింగ్ అసాధారణ ప్రజ్ఞావంతుడు చాలా గొప్ప గొప్ప వాళ్ళతో ఆయన తన దర్బారుని నింపివేశాడు మత విషయాలలో ఆయన సహనశీలి, ఉదారుడు, పరమ నైష్ఠికుడైన సిక్కు మతస్థుడై కూడా, "ముస్లిం భిక్షువులు తన దర్బారులోకి అడుగు పెట్టినప్పుడు ఆయన, సింహాసనం దిగి తన పొడవాటి గడ్డంతో వాళ్ల కాళ్ళకంటిన దుమ్ముని తుడిచేసే వాడ"ని చెప్పుకుంటారు. మంత్రులందర్లో ఆయనకి ముఖ్యుడు, విశ్వాసపాత్రుడు అయినవాడు, ఫకీర్ అజీజుద్దీన్. ఆయన ఆర్థిక మంత్రి-దివాన్ దీనానాథ్ నిజానికి ఆయన పాలనలో పంజాబు ప్రత్యేక సిక్కు రాజ్యంలాగా లేదు. ప్రత్యేకించి సిక్కు ప్రయోజనాల కోసం ఆయన తన రాజ్యాధికారాన్ని ఎన్నడూ వినియోగించలేదు పైపెచ్చు, సిక్కు జమీందార్ల, జాగీర్దార్ల పీడనలో హిందూ, ముస్లిం రైతాంగం ఎంత నలిగిపోయిందో, సిక్కు రైతాంగం పరిస్థితి కూడా అంతే వాస్తవానికి రంజిత్ సింగ్ అధికారం కింద పంజాబ్ రాజ్య నిర్మాణం 18వ శతాబ్దం నాటి ఏ ఇతర రాజ్య నిర్మాణానికి భిన్నంగా లేదు.

1809లో బ్రిటిషు వాళ్ళు ఆయనని సట్లెజ్ నదిని దాటి రావద్దని ఆంక్షలు విధించి, సట్లెజ్‌కి తూర్పు వైపున వున్న సిక్కు భూభాగాన్ని తమ రక్షణ కిందికి

తెచ్చుకున్నప్పుడు రంజిత్‌సింగ్ మౌనం వహించాడు. బ్రిటిషువాళ్ల ముందు తన శక్తి చాలదని ఆయన గ్రహించాడు. ఆ విధంగా తన వాస్తవ రాజనీతిజ్ఞతతోను, సైనిక బలంతోను ఇంగ్లీషువాళ్ల బారినుంచి తన రాజ్యాన్ని సంరక్షించాడు. విదేశ ప్రమాదాన్ని ఆయన తొలగించలేకపోయాడు. ఆ కర్తవ్యాన్ని తన వారసులకు విడిచిపెట్టాడు. ఆయన మరణించాక, సింహాసనం కోసం దాయాదుల మధ్య భీషణ అంతర్యుద్ధం విజృంభించి రాజ్యం బీభత్సమై పోయినప్పుడు ఇంగ్లీషు వాళ్లు చొరబడి రంజిత్‌సింగ్ విడిచిపెట్టిపోయిన రాజ్యాన్ని కబళించారు.

మహారాష్ట్ర రాజ్య వృద్ధి-క్షయం: అంతరించిపోతున్న మొఘల్ అధికారానికి ధిక్కారం పలికిన ముఖ్య రాజ్యం మహారాష్ట్ర మొఘలుల అనంతరం ఉత్తరాధికారం పొందిన రాజ్యాలలో మహారాష్ట్ర రాజ్యం అత్యంత శక్తివంతమైంది నిజానికి, మొఘల్ సామ్రాజ్య విచ్ఛిత్తితో ఏర్పడ్డ రాజకీయ శూన్యాన్ని భర్తీ చెయ్యగల బలం కలిగిన ఏకైక రాజ్యం అదే పైగా, ఆ కర్తవ్య పరిపూర్తికి అవసరమైన ఉజ్వల సేనానుల్ని, రాజనీతిజ్ఞుల్ని తయారు చేసింది మహారాష్ట్ర రాజ్యమే. కాని మరాఠా సర్దార్ల మధ్య సమైక్యత లేదు; ఒక అఖిల భారత సామ్రాజ్య స్థాపనకు అవసరమైన సమ్యక్ దృష్టి, కార్యక్రమం వాళ్లకి కొరవడ్డాయి అందుచేత, వాళ్ళు మొఘలుల స్థానాన్ని ఆక్రమించుకోలేక పోయారు అయితే, మొఘల్ సామ్రాజ్యంతో నిరంతర సమరం సాగించి, దాన్ని నాశనం చెయ్యటం మేరకి వాళ్లు కృతకృత్యులయ్యారు.

శివాజీ మనుమడు షాహు 1689 నుండి ఔరంగజేబ్ చేతుల్లో బందీగా గడిపాడు. ఔరంగజేబ్ అతడినీ, అతని తల్లినీ హుందాగా, మర్యాదగా ఆదరించాడు; వాళ్ళ మతం, కులం, ఇతరేతర అవసరాలు శ్రద్ధగా గమనించి మన్నించాడు; బహుశా షాహుతో ఒక రాజకీయ ఒప్పందానికి రావటం కోసం కావచ్చు 1707లో ఔరంగజేబ్ మరణించాక షాహూ విడుదలయ్యాడు విడుదలై సతారాలో దిగిన షాహూకి, కొల్హాపూర్‌లో రాజ్యచక్రం తిప్పుతున్న అతని పినతల్లి తారాబాయికి మధ్య అంతర్యుద్ధం ప్రజ్వరిల్లింది భర్త రాజారామ్ చనిపోయాక, తన కుమారుడు రెండవ శివాజీ పేరుమీద 1700 నుంచి తారాబాయి మొఘల్ వ్యతిరేక సమరం సాగిస్తోంది కేవలం తమ కొక్కరికి మాత్రమే విశ్వాస పాత్రంగా వుండే పెద్ద పెద్ద దండుల్ని కట్టుకున్న మరాఠా సర్దార్లు ఈ ఉభయ పక్షాల్లో ఏదో ఒక పక్షాన చేరిపోయారు. రాజ్యాధికారం కోసం పోటీకి, పోరుకి దిగిన ఇరుపక్షాలతో ఈ మరాఠా సర్దార్లు స్వంత అధికారం, పలుకుబడి పెంచుకోడానికి బేరాలకు దిగారు వాళ్ళకిప్పుడు అటువంటి మహదవకాశం కలిగింది. వాళ్ళలో చాలామంది దక్కన్ మొఘల్ వైస్రాయిలతో సైతం కలిసి కుట్ర చేశారు. షాహూ-తారాబాయిల మధ్య సంఘర్షణ ఫలితంగా షాహూ బ్రాహ్మణ మంత్రి, పీష్వా బాలాజీ విశ్వనాథ్ నాయకత్వంలో ఒక కొత్త తరహా మహారాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థ ఆవిర్భవించింది. ఈ మార్పుతో మహారాష్ట్ర చరిత్రలో రెండవ దశ ప్రారంభమైంది; అదే పీష్వాల రాజ్యం-వాళ్ళ ఆధ్వర్యంలోనే మహారాష్ట్ర రాజ్యం సామ్రాజ్యంగా అవతారమెత్తింది.

బాలాజీ విశ్వనాథ్ ఒక ఛోటా రెవెన్యూ ఉద్యోగిగా జీవితం ప్రారంభించి, ఒక్కొక్క మెట్టే పైకెక్కి పోతూ ఓ ఉన్నతాధికారి అయ్యాడు. షాహూ కింద పనిచేస్తూ అతని శత్రువుల్ని అణగదొక్కి తన ప్రభువుకి విశ్వాసపాత్రుడుగా గొప్ప సేవచేశాడు రాజకీయ చతురతలో అతణ్ని మించిన వాళ్ళు లేరు పెద్ద పెద్ద మరాఠా సర్దార్లని

షాహూ పక్షంలోకి లాగాడు 1713లో షాహూ అతణ్ణి తన పీష్వాగా (ముఖ్యమంత్రి) తీసుకున్నాడు నెమ్మదిగా మరాఠా సర్దార్ల మీద తన ప్రభువు అధిపత్యాన్ని, తన అధిపత్యాన్నీ కూడా సాధించాడు కొల్హాపూరుకి దక్షిణంగా వున్న కొద్ది భూభాగం మినహాయిస్తే, మహారాష్ట్ర మొత్తం మీద షాహూ రాజ్యాధికారాన్ని విస్తరింపజేశాడు అధికారం యావత్తు పీష్వా పదవిలో కేంద్రీకృతమైపోయింది ఇతర మంత్రులు, సర్దార్లు పీష్వా అనే సూర్యుడి ముందు దివిటీలై పోయారు. బాలాజీ విశ్వనాథ్, అతని కుమారుడు మొదటి బాజీరావు పీష్వాని మహారాష్ట్ర సామ్రాజ్యానికి ప్రధాన పరిపాలకునిగా చేశారు

బాలాజీ విశ్వనాథ్ మహారాష్ట్ర అధికారాన్ని వృద్ధి చెయ్యటానికి మొఘల్ అధికార్ల మధ్య సాగే అంతరంగిక సంఘర్షణల్ని సంపూర్ణంగా వినియోగించుకున్నాడు. దక్కన్‌లో చేత్, సర్దేశముఖి పన్నుల్ని కట్టమని జుల్‌ఫికర్ ఖాన్‌ని రాపాడాడు; అఖరి దశలో సయ్యద్ సోదరులతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. దాని ప్రకారం ఒకప్పుడు శివాజీ రాజ్యంలో అంతర్భాగంగా వున్న భూభాగం యావత్తు తిరిగి షాహూకి స్వాధీనమైంది దక్కన్‌లో ఆరు సుబాలలో చేత్, సర్దేశముఖి పన్నుల్ని వసూలు చేసుకునే హక్కు చేతికొచ్చింది దానికి ప్రతిఫలంగా షాహూ మొఘల్ సార్వభౌమాధికారాన్ని సిద్ధాంతరీత్యా అంగీకరించాడు చక్రవర్తి సేనలో 15,000 అశ్విక దళాన్ని సంసిద్ధపర్చటానికి ఒప్పుకున్నాడు దక్కన్ సీమలో తిరుగుబాట్లు లేవకుండా చర్యలు తీసుకోడానికి, సాలినా 10 లక్షల రూపాయలు కప్పం కట్టటానికి సమ్మతించాడు 1719లో పీష్వా బాలాజీ విశ్వనాథ్ మహారాష్ట్ర సైన్యాన్ని ముందుండి నడిపిస్తూ సయ్యద్ హుస్సేన్ అలీఖాన్ వెంట ఢిల్లీలో ప్రవేశించి ఫరూక్‌సియర్‌ని పడగొట్టటానికి సయ్యద్ సోదరులతో చేతులు కలిపాడు అయన, అయనతో పాటు వెళ్ళిన మరాఠా సర్దార్లు మొఘల్ సామ్రాజ్య నిర్వీర్య పరిస్థితిని కళ్లారా చూసి, ఉత్తర భారతదేశంలో తమ అధికారాన్ని విస్తరింపజేసుకోవాలనే ఆశలు మనస్సులో నింపుకున్నారు

దక్కన్‌లో చేత్ సర్దేశముఖి పన్నుల్ని సమర్థవంతంగా వసూలు చెయ్యటానికి బాలాజీ విశ్వనాథ్ తన సర్దార్లకి తలా ఒక ప్రాంతం కేటాయించాడు. వాళ్ళు తాము వసూలు చేసే మొత్తంలో ఎక్కువ భాగం ఖర్చుల కింద తీసేసుకోవచ్చు. ఈ పద్ధతి వల్ల పీష్వాలు తమ వ్యక్తిగత అధికారాన్ని పెంచుకున్నారు ఆశపోతులైన సర్దార్లు అనేక మంది అయన పక్షాన చేరిపోసాగారు కాని, చిట్ట చివరకి ఈ పద్ధతి మహారాష్ట్ర సామ్రాజ్యాన్ని బలహీనపర్చే ప్రధాన సాధనంగా పరిణమించింది. అప్పటికే వతన్, జాగీర్ల పద్ధతి కింద మరాఠా సర్దార్లు మదించిపోయి, కేంద్ర ప్రభుత్వ అధికారానికి అసూయపడిపోతున్నారు దానికి తోడు, మొఘల్ సామ్రాజ్యపు దూరపు తావులకి చొచ్చుకుపోయి అధికారం స్థాపించుకోవటంతో వాళ్లు స్వతంత్రాధిపతులై పోయారు. మహారాష్ట్ర రాజ్యానికి వెలుపల వుండే భూభాగాన్ని సర్దార్లు ఈ విధంగా ఆక్రమించేసుకోవటం కేంద్ర పర్యవేక్షణలో జరగలేదు. మహారాష్ట్ర రాజు కిందగానీ లేదా పీష్వా కిందగానీ ఉండే కేంద్ర ప్రభుత్వ సైన్యాలు వెళ్ళి జయించిన దూరసీమలు కావవి మహారాష్ట్ర సర్దార్లు స్వంత సైన్యాల్ని వెంట బెట్టుకొని బలప్రయోగంతో ఆక్రమించుకున్నారు ఈ పరిణామక్రమంలో సర్దార్ల మధ్య పరస్పర సంఘర్షణలు

జరిగాయి. కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగి వాళ్ళని గట్టిగా అదుపు చెయ్యటానికి పూనుకున్నదంటే, వాళ్లు మరుక్షణం నైజాంతోనే, మొఘులులతోనే, ఇంగ్లీషువాళ్ళతోనే చేతులు కలపటానికి సందేహించరు

బాలాజీ విశ్వనాథ్ 1720లో చనిపోయాడు అయన కుమారుడు మొదటి బాజీరావు పీష్వా అయ్యాడు అప్పటికతని వయస్సు 20 సంవత్సరాలు వయస్సులో చిన్నవాడయినా, బాజీరావు గొప్ప ధైర్యసాహసాలు కలిగిన ఉజ్వల సేనాపతి, రాజనీతిజ్ఞుడు. "గెరిల్లా యుద్ధ తంత్రంలో శివాజీ తరువాత అంతటి అద్వితీయ నిపుణుడు"గా బాజీరావుని చరిత్రకారులు కీర్తించారు అతని నాయకత్వంలో మహారాష్ట్రులు మొఘల్ అధికార్లకు వ్యతిరేకంగా అనేక యుద్ధాలు సాగించారు మొదట, మొఘల్ విశాల భూభాగంలో చేత్ వసూలు చేసుకునే హక్కు కోసం, ఆ తరువాత ఆ భూభాగం యావత్తు తమ రాజ్యంలో కలుపుకోటానికి మహారాష్ట్రులు మొఘులుల మెడలు వంచటానికి ప్రయత్నం చేశారు 1740లో బాజీరావు మరణించే నాటికి మాళవ, గుజరాత్, బుందేల్‌ఖండ్‌లో కొంత భాగం మహారాష్ట్రుల అధిపత్యం కిందికి వచ్చాయి ఈ కాలంలోనే గయక్వాడ్, హోల్కార్, సింధియా, భోన్స్లే వంశాలు ప్రాముఖ్యంలోకి వచ్చాయి

బాజీరావు తను పరిపాలించిన ఇరవయ్యేళ్లు దక్కనులో నిజాం-ఉల్-ముల్క్ అధికారాన్ని పైకి ఎక్క రానికుండా చెయ్యటానికే కృషి చేశాడు నిజాం కూడా ఎడతెగకుండా కొల్హాపూర్ రాజుతోను, మరాఠా సర్దార్లతోను, మొఘల్ అధికార్లతోను కలిసి పీష్వా అధికారాన్ని బలహీనపర్చటానికి కుట్రచేశాడు పీష్వా బాజీరావు- నిజాం ఉల్‌ముల్క్‌ల మధ్య రెండు తూర్లు యుద్ధం జరిగింది రెండు తూర్లూ నిజాం చిత్తయిపోయాడు. మహారాష్ట్రులకు దక్కన్ రాష్ట్రాలలో చేత్, సర్దేశముఖి పన్నుల్ని వసూలు చేసుకునే హక్కు ధారాదత్తం చేసి సంధి చేసుకున్నాడు

1733లో జంజీర సిద్దీలకు వ్యతిరేకంగా సుదీర్ఘ యుద్ధం చేసి వాళ్ళని రూపుమాపాడు అదే సమయంలో పోర్చుగీసుల్తో కూడా యుద్ధం ప్రారంభించాడు సాల్సెట్టీ, బేసిన్‌లను స్వాధీనపర్చుకున్నాడు కాని పోర్చుగీసులు పడమటి కోస్తాలో తమ స్థావరాలను కాపాడుకోగలిగారు.

బాజీరావు 1740లో మరణించాడు తన ఇరవయ్యేళ్ళ పరిపాలనలో అతడు మహారాష్ట్ర స్వభావాన్ని మార్చివేశాడు రాజ్యస్థాయి నుంచి మహారాష్ట్రం సామ్రాజ్య స్థాయికి ఎదిగింది. దక్కనుని దాటి ఉత్తర హిందూస్థానం దాకా విస్తరించింది. అయితే బాజీరావు మహారాష్ట్ర సామ్రాజ్యానికి పటిష్టమైన పునాది వేయలేకపోయాడు కొత్త భూభాగాల్ని జయించాడే గాని, అక్కడ పరిపాలనా నిర్వహణ గురించి బొత్తిగా పట్టించుకోలేదు రెవెన్యూ వసూళ్ళలోనే మరాఠా సర్దార్లు తలమునకలై పోయారు. అదెక్కటే వాళ్ళ యావ.

బాజీరావు కుమారుడు బాలాజీ బాజీరావు 1740 నుండి 1761 వరకు పీష్వాగా ఉన్నాడు. పీష్వా పదవి స్వీకరించే నాటికి అతని వయస్సు 18 సంవత్సరాలు. నానాసాహెబ్ అని ప్రజల్లో పేరు పడ్డాడు. యోధుడు కాకపోయినా పరిపాలనా దక్షతలో తండ్రికి తీసిపోలేదు. 1749లో ఛత్రపతి షాహూ నిస్సంతుగా మరణించాడు. అయన రాసిపోయిన విల్లు ప్రకారం రాజ్య పరిపాలనాధికారం యావత్తు బాలాజీ బాజీరావుకు

సంక్రమించింది పీష్వా పదవి వంశపారంపర్య హక్కుగా స్థిరపడింది పీష్వా వాస్తవ రాజ్యాధినేత అయ్యాడు దానికి ప్రతీకగా, ప్రభుత్వ పీఠాన్ని పూణేకు మార్చాడు బాలాజీ బాజీరావు తండ్రి అడుగుజాడల్లో నడిచి సామ్రాజ్యాన్ని నల్దిక్కులా ఇంకా విస్తరింపజేశాడు మహారాష్ట్ర మహోన్నత స్థితికి వచ్చింది మహారాష్ట్ర సైన్యాలు భారతదేశమంతటా వీరవిహారం చేశాయి మాళవ, గుజరాత్ బుందేల్ ఖండ్‌ల మీద మహారాష్ట్ర అధిపత్యం స్థిరపడింది మహారాష్ట్రులు బెంగాల్ మీద పదే పదే జరిపే దాడుల్ని తట్టుకోలేక బెంగాల్ నవాబు ఒరిస్సాను కట్టబెట్టాడు దక్షిణాదిన మైసూరు, తదితర చిన్న సంస్థానాలు మహారాష్ట్రులకు లొంగిపోయి కప్పం కట్టాయి 1760లో ఉదిల్ వద్ద జరిగిన యుద్ధంలో నైజాం నవాబు చిత్తుగా ఓడిపోయి 62 లక్షల రూపాయల ఆదాయం సమకూరే విశాల భూభాగాన్ని సమర్పించుకున్నాడు ఉత్తర హిందూస్థానంలో మహారాష్ట్రులు మొఘల్ సింహాసనానికి కీలకశక్తి అయ్యారు 1752లో ఇమద్-ఉల్-ముల్క్ వజీరు కావటానికి తోడ్పాటు ఇచ్చారు మొఘల్ సామ్రాజ్యపు కొత్త వజీరు మహారాష్ట్రుల చేతుల్లో కీలుబొమ్మ అయ్యాడు ఢిల్లీ నుండి పంజాబుకు పయనించి అహ్మద్ షా అబ్దాలీ ప్రతినిధిని పదవీ భ్రష్టుణ్ణి చేశారు దాంతో అబ్దాలీతో తగాదా కొని తెచ్చుకున్నారు మహారాష్ట్రులతో అమీతుమీ తేల్చుకోడానికి అబ్దాలీ ససైన్యంగా భారతదేశం మీద తిరిగి దాడి చేశాడు

ఉత్తర హిందుస్థానం పైన అధిపత్యం కోసం భీషణ సంగ్రామం ఆరంభమైంది మరాఠా సర్దార్ల చేతుల్లో నానా బాధలనుభవించిన రోహిల్‌ఖండ్ నవాబు నజీబ్



మరాఠా సైనికులు

ఉద్దౌలాతోను, అవధ్ నవాబు షుజా ఉద్దౌలాతోను అహమ్మద్‌షా అబ్దాలీ మైత్రి కుదుర్చుకున్నారు. రానున్న యుద్ధం తాలూకు ప్రాముఖ్యాన్ని గుర్తించిన పీష్వా తన మైనర్ కుమారుని నాయకత్వంలో ఒక బలమైన సైన్యాన్ని ఉత్తరాదికి ఉరికించాడు పేరుకు ఆ మైనర్ కుమారునిదే నాయకత్వంగాని, అసలు నాయకత్వం నిర్వహించినవాడు సదాశివరావుభావే. పీష్వా సైన్యంలో అత్యంత ప్రధానమైన ఐరోపా తరహా కాల్బలాన్ని, ఫిరంగి దళాన్ని ఇబ్రహీంఖాన్‌గార్ది నాయకత్వంలో పంపాడు. ఉత్తర భారతదేశంలో మహారాష్ట్రులకిప్పుడు మిత్రరాజులు కావలసి వచ్చారు. కాని, లోగడ వాళ్ళ ప్రవర్తన, రాజకీయ అత్యాశ గమనించిన ఉత్తర భారత రాజులెవ్వరూ మహారాష్ట్రులతో సఖ్యతకు విముఖత ప్రదర్శించారు రాజపుటానా సంస్థానాల అంతరంగిక సంఘర్షణల్లో మహారాష్ట్రులు లోగడ జోక్యం కలుగజేసుకొని, రాజపుత్రుల వద్ద జరిమానాలు, కప్పం గుంజుకున్నారు అవధ్ భూభాగం, ధనరాసులు కాజేయాలని ప్రయత్నించారు; పంజాబ్‌లో తమ దుశ్చర్యల వల్ల సిక్కు నాయకుల ఆగ్రహాన్ని కొని తెచ్చుకున్నారు కాబట్టి, మహారాష్ట్రులు శత్రువుని ఒంటరిగా ఎదుర్కోవలసి వచ్చింది మొఘల్ వజీరు ఇమద్-ఉల్-ముల్క్ ఒక్కడే మద్దతు ప్రకటించాడు. ఇవన్నీ చాలక, మరాఠా అగ్రసేనాపతుల మధ్య నిరంతర వైరాలు సాగాయి.

1761 జనవరి 14న పానిపట్టు వద్ద ఉభయ పక్షాలు తలపడ్డాయి. మరాఠా సైన్యం సంపూర్ణ ఓటమి చవి చూసింది. పీష్వా కుమారుడు విశ్వాసరావు, సేనా నాయకుడు సదాశివరావు భావే, అసంఖ్యాక సైన్యాధికార్లు నేలకొరిగారు. రమారమి 28,000 సైనికులు రణరంగంలో విహతులయ్యారు పారిపోయే మరాఠా సైనికుల్ని అఫ్ఘన్ అశ్వికులు వెంటబడి తరిమారు. జాట్‌లు, అహీర్లు, గుజార్లు అందిన మేరకు నిలువు దోపిడీ సాగించారు.

సదాశివరావు భావేకు సహాయంగా ఉత్తరాదికి బయలుదేరిన పీష్వా ఆ విషాద వార్తలు విని నిరుత్తరుడై పోయాడు. అప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న పీష్వా ఈ చావు కబురుతో మరింత కృంగిపోయి 1761 జూన్‌లో చనిపోయాడు.

పానిపట్టు వద్ద సంభవించిన ఓటమి మహారాష్ట్రులకు చావు దెబ్బ.



మరాఠా అశ్విక దళాధిపతి

మహారాష్ట్రులు ఎందరో విలువైన యోధుల్ని పోగొట్టుకున్నారు వారి రాజకీయ ప్రతిష్ఠ అడుగంటి పోయింది. అన్నిటికన్నా, మహారాష్ట్ర ఓటమి వల్ల ఇంగ్లీషు తూర్పిండియా కంపెనీకి బెంగాల్లోను, దక్షిణ భారతదేశంలోను తన అధికారాన్ని దృఢపర్చుకోడానికి అవకాశం దొరికింది. అయితే, ఈ విజయం వల్ల అఫ్ఘన్లకు లాభించిందేమీలేదు. కనీసం పంజాబును కూడా తమ గుప్పెట్లో పెట్టుకోలేక పోయారు. వాస్తవానికి, మూడవ పానిపట్టు యుద్ధం భారత దేశాన్ని ఎవరు పరిపాలించాలనే దానికన్నా, ఎవరు పరిపాలించకూడదో నిర్ణయించింది భారతదేశంలో బ్రిటీషు అధికార విజృంభణకు దారి ఏర్పడింది.

1761లో పదిహేడేళ్ళ మాధవరావు పీష్వా అయ్యాడు. చిన్నవాడైనా అతడు ప్రతిభావంతుడైన యోధుడు, రాజనీతిజ్ఞుడు. 11 సంవత్సరాల స్వల్ప కాలంలో అతడు మహారాష్ట్ర గత వైభవాన్ని పునరుద్ధరించాడు నైజాం నవాబుని ఓడించాడు, మైసూరు రాజ్యాధిపతి హైదరాలీ చేత కప్పం కట్టించుకున్నాడు. రోహిల్లాలను ఓడించి, రాజపుటానా సంస్థానాల్ని లొంగదీసి, జాట్ సర్దార్లని అణగదొక్కి పీష్వా మాధవరావు ఉత్తర హిందుస్థానం పైన మరాఠా ఆధిపత్యాన్ని తిరిగి నెలకొల్పాడు 1771లో షా ఆలం చక్రవర్తిని ఢిల్లీ సింహాసనం ఎక్కించాడు మొఘల్ చక్రవర్తి మహారాష్ట్రుల ఫింఛనుదారుగా తయారయ్యాడు. మహారాష్ట్ర ఔన్నత్యం ఉత్తర భారతంలో పునరావిర్భావం చెందినట్లు తోచింది.

1772లో మాధవరావు పీష్వా క్షయవ్యాధితో మరణించడంతో మహారాష్ట్రులకు మరొక తూరి చెడు రోజులు దాపురించాయి. మహారాష్ట్ర సామ్రాజ్యం సంక్షోభంలో పడింది. పూనాలో బాలాజీ బాజీరావు కనిష్ఠ సోదరుడైన రఘునాథరావుకు, పీష్వా మాధవరావు సోదరుడైన నారాయణరావుకు మధ్య అధికారం కోసం పోరాటం ప్రారంభమైంది. 1773లో నారాయణరావు చంపబడ్డాడు. తండ్రి మరణించాక పుట్టిన సవాయ్ మాధవరావు పీష్వా అయ్యాడు. పీష్వా పదవి దక్కని రఘునాథరావు నిస్పృహతో బ్రిటీషువారిని ఆశ్రయించాడు వాళ్ళ సహాయంతో అధికారాన్ని సాధించటానికి రఘునాథరావు ప్రయత్నం చేశాడు. ఫలితంగా మొదటి ఆంగ్ల-మరాఠా యుద్ధం సంభవించింది.

పీష్వా అధికారానికిప్పుడు దుర్దశ పట్టింది. పూనాలో నానాఫడ్నవీస్ నాయకత్వంలో సవాయ్ మాధవరావు మద్దతు దార్లకి, రఘునాథరావు అనుచరులకు మధ్య ఎడతెగకుండా కుట్రలు, కుతంత్రాలు సాగాయి ఈలోగా, బడా మరాఠా సర్దార్లు ఉత్తరాదిన అర్ధ స్వతంత్ర రాజ్యాలు స్థాపించుకుంటున్నారు. అవి సహకరించే సమస్య లేదు బరోడాలో గయక్వాడ్, నాగపూర్‌లో భోన్స్లే, ఇండోర్‌లో హోల్కార్, గ్వాలియర్, సింధియా ప్రముఖులైపోయి మొఘల్ నమూనాలో పరిపాలనా వ్యవస్థ ఏర్పాటు చేసుకుని ప్రత్యేక సైన్యాల్ని నిర్మించారు. పీష్వా పట్ల వాళ్ళ విధేయత మరీ మరీ నామ మాత్రంగా తయారైంది. పైగా వాళ్ళు పూనాలో వైరి పక్షాల వైపు చేరి మహారాష్ట్ర సామ్రాజ్య శత్రువుల్తో మంతనాలు సాగించారు.

ఉత్తర హిందు స్థానంలోని మరాఠా ప్రభువుల్లో మహదాజీ సింధియా అతి ముఖ్యుడు. ఫ్రెంచి అధికార్ల తోడ్పాటుతో ఆయన చాలా శక్తివంతమైన సైన్యాన్ని నిర్మించి, 1784లో షా ఆలం చక్రవర్తిని గుప్పిట బిగించుకున్నాడు. కాని ఆయన

శక్తియుక్తులన్నీ నానాఫడ్నవీసుకు వ్యతిరేకంగా కుట్రలు, కుతంత్రాలు పన్నటంలోనే వ్యర్థమై పోయాయి. పైగా, ఆయన ఇండోర్ హోల్కారుకు బద్ధశత్రువు.

మహాదాజీ, నానాఫడ్నవీసు లిద్దరూ 1800లో మరణించారు. 18వ శతాబ్దంలో మహారాష్ట్రుల అధికారాన్ని పైకి లేవనెత్తిన ఇద్దరు యోధులు, రాజనీతిజ్ఞులు రాలిపోయారు. సవాయ్ మాధవరావు 1795లోనే మరణించాడు. అతని తరువాత రెండవ బాజీరావు అనే ఓ పనికిమాలిన వ్యర్థుడు, అసమర్థుడు పీష్వా అయ్యాడు. బ్రిటీషు వాళ్ళు తమ అధిక్యానికి అడ్డు వచ్చే మరాఠా సవాలుని అంతం చెయ్యటానికి నిశ్చయించుకున్నారు. మరాఠా సర్దార్ల మధ్య రగిలే అంతరంగిక వైరాల్లో బ్రిటీషు వాళ్ళు జిత్తులమారి ఎత్తులు వేసి, వాళ్ళలో చీలికలు తెచ్చి 1803-1805, 1816-1819 సంవత్సరాల మధ్య జరిగిన రెండవ, మూడవ మరాఠా యుద్ధాల్లో.అందర్నీ విడివిడిగా లొంగగొట్టారు. పీష్వా పదవిని రద్దు చేశారు. కొన్ని మహారాష్ట్ర సంస్థానాలు అనుబంధ రాజ్యాలుగా కొనసాగటానికి బ్రిటిష్ అనుమతి ఇచ్చారు.

మొఘల్ సామ్రాజ్యంపైన అదుపు చలాయించి, విశాల భారత భూభాగంలో తమ స్వంత సామ్రాజ్యాన్ని స్థాపించుకోవాలనుకున్న మహారాష్ట్ర స్వప్నం కేవలం కలగానే మిగిలిపోయింది. మొఘల్ సామ్రాజ్యం ఏ క్షీణయుగ సాంఘిక వ్యవస్థకి ప్రాతినిధ్యం వహించిందో అదే క్షీణ వ్యవస్థకి మహారాష్ట్ర సామ్రాజ్యం ప్రాతినిధ్యం వహించింది. కాబట్టి మొఘలులు ఏ అంతర్గత బలహీనతల వల్ల దెబ్బతిన్నాయో, అవే మహారాష్ట్రుల్ని కూడా దెబ్బ తీశాయి. ఈ మౌలిక కారణాల వల్ల విశాల సామ్రాజ్యాన్ని ఏలాలనే మహారాష్ట్రుల కల ఫలించలేదు. మహారాష్ట్ర సరంజామీ పద్ధతి మొఘల్ జాగీరు పద్ధతిని పోలి వున్నట్లుగానే మరాఠా సర్దార్లు సైతం అచ్చు కదపటి మొఘల్ కాలంనాటి జాగీర్దార్లకి తమ్ముళ్ళలాగా తయారయ్యారు. శక్తివంతమైన కేంద్ర ప్రభుత్వాధికారం సాగినంతకాలం, ఉమ్మడి శత్రువైన మొఘల్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, మహారాష్ట్రులు సమైక్యంగా ఉండవలసిన అవసరం గుర్తించుకున్నంతకాలం అందరూ ఒక కూటమిగా కొనసాగారు. కాని, అవకాశం వచ్చిరాగానే ఎవరికి వాళ్ళ స్వపరిపాలనాధికారం ప్రకటించుకోటానికే మొగ్గు చూపారు. మొఘల్ సర్దార్‌కన్నా మరాఠా సర్దార్లు ఇంకా క్రమశిక్షణ లేనివాళ్లు. కనీసం వాళ్లు ఒక నూతన ఆర్థిక పద్ధతినైనా రూపొందించుకున్నారా అంటే అదీ లేదు. విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల్ని వాళ్లు ప్రోత్సహించలేకపోయారు. వ్యాపార వాణిజ్యాలలో బొత్తిగా శ్రద్ధ చూపలేకపోయారు. వాళ్ళ రెవెన్యూ విధానం మొఘల్ పద్ధతికి నకలుగా తయారైంది. వాళ్ళ పరిపాలనా నిర్వహణ కూడా మొఘల్ అడుగుజాడల్లోనే నడిచింది. మొఘలుల మాదిరిగానే మహారాష్ట్ర ప్రభత్వం కూడా నిస్సహాయులైన రైతాంగాన్ని ముక్కు పిండి పన్నులు వసూలు చేసుకోవటం మీదనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. ఉదాహరణకి, మొఘల్ ప్రభుత్వం మాదిరిగానే మహారాష్ట్ర ప్రభుత్వం కూడా పండిన పంటలో దాదాపు సగం శిస్తు కింద వసూలు చేసింది. కనీసం మొఘలులు సొష్టవ పరిపాలనైనా చేశారు. మహారాష్ట్రులు తమ రాజ్యానికి వెలపల ఉన్న భూభాగంలో అదీ చెయ్యలేకపోయారు. భారత ప్రజల్లో విశ్వాసాన్ని రేకెత్తించటంలో మొఘలులు సాధించిన మాత్రపు విజయాన్ని కూడా మహారాష్ట్ర పాలకులు సాధించలేకపోయారు. వాళ్ళ అధిపత్యం ఒక్క బలప్రయోగం మీద మాత్రమే ఆధారపడి ఉంది. భారతదేశంలో

బ్రిటీషు వారి పెచ్చు పెరిగిపోయే అధికారానికి ఎదురుగుడుగా మహారాష్ట్రులు తమ రాజ్యాన్ని అధునిక రాజ్యంగానైనా రూపొందించగలిగి ఉండవలసింది. కాని వాళ్ళు ఇక్కడ కూడా విఫలమయ్యారు

***ప్రజల సామాజిక ఆర్థిక పరిస్థితులు:*** 18వ శతాబ్దం నాటి భారతదేశం వినాశనం నుంచి బ్రతికి బైటపడ్డానికి అవసరమైన శీఘ్రగతిలో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రగతి సాధించలేకపోయింది.

ఏయేటికాయేడు పెరిగిపోయే శిస్తు వసూళ్ళు అధికార్ల పీడన; జాగీర్దార్ల, భూకామందుల, జమీందార్ల దురాశ దోపిడీ; ప్రతిస్పర్థిసైన్యాల పదఘట్టన, 18వ శతాబ్ది ప్రథమార్థంలో అసంఖ్యాక దుస్సాహసికుల స్వైరవిహారం, లూటీలు ప్రజా జీవితాన్ని పరమ నికృష్టంగా తయారు చేశాయి

అనాటి భారతదేశం విపరీత తారతమ్యాల పుట్ట అంతులేని సిరిసంపదలు, భోగభాగ్యాల సరసన అతి కఠోరమైన పేదరికం తారాడింది ఒక ప్రక్క బలమూ, కలిమీ కలిగిన జాగీర్దార్లు, కులీనులు భోగవిలాసాల్లో మునిగితేలుతూ మరో ప్రక్క దోపిడీ కోరల్లో నలిగిపోయే పేదబడుగు రైతాంగం కలోగంజో తాగి ప్రాణాలు నిలుపుకునే స్థితిలో ఉంది పైపెచ్చు, నానా రకాల అన్యాయాల్ని, అక్రమాల్ని దిగమింగుకోవాలి. అయినప్పటికీ, కూడా, వందయేళ్ళ బ్రిటీష్ పరిపాలన తరువాత 19వ శతాబ్దాంతంలో ప్రజలు జీవించిన పరిస్థితుల కన్నా 18 వ శతాబం నాటి ప్రజా జీవన పరిస్థితులే చాలా మెరుగ్గా ఉన్నాయి

18వ శతాబ్దంలో భారతదేశంలో వ్యవసాయం సాంకేతికంగా చాలా వెనకబడి, నిలవ నీరులా కుళ్ళిపోయివుంది వ్యవసాయోత్పత్తి పద్ధతులు శతాబ్దాలుగా మార్పనేది ఎరక్కుండా జడప్రాయంగా నిలిచిపోయాయి సాంకేతిక పరమైన బడుగుదనాన్ని పూడ్చుకోటానికి రైతులు కఠోరమైన చాకిరీ చేశారు. నిజానికి, అనాటి రైతు తన పరిమితుల్లో కూడా అద్భుతంగా పంట పండించాడు పైగా, అనాడు భూమి కొరతలేదు. చాలీ చాలని నేల సాగుచేసే దుస్థితి లేదు. కాని, కష్టఫలితం రైతుకు దక్కనివ్వని పరిస్థితి అది. మిగిలిన సమాజాన్ని మొత్తం తను శ్రమించి పండించిన పంటతో పోషించాడే తప్ప, రైతుకు మిగిలింది చాలా తక్కువ. ప్రభుత్వం, జమీందార్లు, జాగీర్దార్లు, భూకామందుల రైతుల గోళ్ళూడగొట్టి అందినంత మట్టుకు ఎక్కువ రాబట్టుకోడానికి ప్రయత్నం చేశారు. మొఘలులు, మహారాష్ట్రులు, సిక్కులు, ఇంకా మొఘలుల వారసులు - ఎవరు పరిపాలించినా రైతు బ్రతుకులో అదే దుర్భర పరిస్థితి తాండవించింది.



బెంగాలు పేద గ్రామీణులు

భారతదేశంలో

చాలా గ్రామాలు స్వయం సమృద్ధిగా ఉంది. బైట నుంచి కొనుగోలు చేసే వస్తువులంటూ లేక పోయినా, రాకపోకల సౌకర్యాలు బహు వెనుక బడి ఉన్నా, దేశం లోపలగాని, బైటి దేశాలతో గానీ వ్యాపార వాణిజ్యాలు మొఘలుల కాలంలో విస్తృతంగా సాగాయి భారతదేశం పర్షియన్ సింధుశాఖ ప్రాంతంనుంచి ముత్యాలు, ముడిపట్టు, ఉన్ని, కర్జూరపు పండ్లు, ఎండబెట్టిన పళ్ళు, గులాబి పన్నీరు; అరేబియా నుంచి కాఫీ, బంగారం, ఓషధులు, తేనె; చైనా నుంచి తేయాకు, చక్కెర, పింగాణీ సామాగ్రి, పట్టు, టిబెట్ నుంచి బంగారం, కస్తూరి, ఉన్ని, వస్త్రాలు; సింగపూరు నుంచి తగరం; ఇండనేషియా దీవుల నుంచి సుగంధ ద్రవ్యాలు, అత్తరులు, కాపుసారా, చక్కెర; ఆఫ్రికా ఖండం నుంచి దంతం, ఓషధులు; యూరపునుంచి ఉన్ని బట్టలు, రాగి, ఇనుము, సీసం వగైరా లోహాలు, కాగితం దిగుమతి చేసుకొంది యావత్ ప్రపంచంలో భారతదేశ వస్త్రాలకు అమితమైన గిరాకి ఉండేది. నూలు వస్త్రాలే కాకుండా ముడిపట్టు, పట్టు బట్టలు, ఇనుప సామగ్రి, నీలిమందు, సూరేకారం, నల్లమందు బియ్యం, గోధుమ, చక్కెర, మిరియాలు, సుగంధ ద్రవ్యాలు, వజ్రవైఢూర్యాది విలువైన రాళ్ళు, ఓషధులు భారతదేశం విదేశాలకు ఎగుమతి చేసింది

చేతిపనుల తయారీలో , వ్యవసాయోత్పత్తుల్లో భారతదేశం దాదాపు స్వయం సమృద్ధంగా ఉండటం వల్ల విదేశ వస్తువుల్ని భారీ ఎత్తున దిగుమతి చేసుకోలేదు పై పెచ్చు, భారత పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులకు విదేశాలలో మంచి గిరాకీ ఉంది పర్యవసానంగా, భారతదేశం ఎగుమతి చేసిన సరుకుల విలువ దిగుమతుల విలువకన్నా హెచ్చుగానే ఉంది వెండి బంగారాల దిగుమతుల ద్వారా మన దేశం అనాడు వ్యాపార వాణిజ్యాలలో సమతుల్యం సాధించింది నిజానికి అనాడు భారతదేశాన్ని రత్నాల ఖని అనేవాళ్ళు.

18వ శతాబ్దంలో అనేక ప్రాంతాలలో ఎడతెగకుండా ప్రజ్వరిల్లిన యుద్ధాలు, శాంతిభద్రతల లోపం దేశంలో అంతర్గత వ్యాపారానికి హాని చేశాయి. కొన్ని దిశల్లో కొంత మేరకి విదేశ వ్యాపార వాణిజ్యాల్ని స్తంభింపజేశాయి అధికారం కోసం పోటీలు పడే ప్రతి స్పర్థులు, విదేశాల నుంచి విరుచుకుపడే దురాక్రమణ దార్లు అనేక వర్తక కేంద్రాల్ని లూటీ చేశారు. వర్తక మార్గాల నిండా సంఘటితులైన దోపిడీ తండాలు యథేచ్ఛగా సంచరించాయి వర్తకుల్ని, వాళ్ళ బిడార్లని నిలువు దోపిడీ చేశారు. ఆఖరికి, సామ్రాజ్యంలో ప్రధాన నగరాలైన ఢిల్లీ – ఆగ్రాల మధ్య రాజబాట మీద సైతం దోపిడీ ముఠాల ప్రాబల్యం వల్ల ప్రయాణ భద్రత లేకుండా పోయింది. పైగా, సంస్థానాధీశులు, స్థానిక నాయకులు అసంఖ్యాకంగా పెరిగి పోవటంతో సుంకాలు వసూలు చేసే చౌకీలు హద్దూ అపూ లేకుండా వృద్ధి అయ్యాయి. ప్రతి ఛోటాప్రభువూ రాబడిని పెంచుకోడానికి తన భూభాగం గుండా ప్రయాణం చేసే వ్యాపార సంస్థలపైన విపరీతంగా సుంకాలు విధించారు ఇవన్నీ వ్యాపార రంగాన్ని ఊహించలేనంత పెద్ద దెబ్బ తీశాయి. విలాస వస్తువుల్ని విపరీతంగా వాడే జాగీర్దార్ల వంటి కులీనులు దెబ్బతినిపోయిన విదేశ వాణిజ్యాన్నే కాకుండా, దేశంలోపల జరిగే వర్తక వ్యాపారాన్ని కూడా దెబ్బతీశారు.

వ్యాపారాన్ని దెబ్బ తీసిన రాజకీయ కారణాలు నగర పరిశ్రమల్ని సైతం భ్రష్టు పట్టించాయి పారిశ్రామికాభివృద్ధితో కల కలలాడే వ్యాపార కేంద్రాలు, అనేక సంపన్న నగరాలు కళావిహీనమై విధ్వంసమై పోయాయి. ఢిల్లీని నాదర్‌షా నిలువు దోపిడీ

చేసేశారు; లాహోర్, ఢిల్లీ, మథురా నగరాల్ని అహ్మద్‌షా అబ్దాలి కొల్లగొట్టాడు; ఆగ్రాని జాట్‌లు దోచేశారు; గుజరాత్ నగరాల్ని, సూరత్‌ని, దక్కన్ పట్టణాల్ని మహారాష్ట్ర సర్దార్లు పీల్చి పిప్పి చేశారు; సర్హింద్‌ని సిక్కులు పీక్కుతిన్నారు ఇట్లాంటి ఉదాహరణలు ఒకటా, రెండా కోకొల్లలు. అట్లాగే, ఫ్యూడల్ వర్గాల దర్బారులో కులీన వర్గాల అవసరాల్ని తీర్చే వృత్తి పనివాళ్ళు తమ పోషకులు దివాళా తియ్యటంతో తాము డీలా పడిపోయారు అంతర్గత, విదేశ వ్యాపార వాణిజ్యాలు క్షీణించిపోవటం వల్ల కూడా వృత్తి పనివాళ్ళ నోటి దగ్గర కూడు పడిపోయింది ఇంత అల్లకల్లోల పరిస్థితుల్లో కూడా దేశంలో కొన్ని ప్రాంతాల్లో యూరప్ వర్తక సంస్థల వ్యాపార కార్యకలాపాల ఫలితంగా కొన్ని పరిశ్రమలు బాగా పుంజుకున్నాయి.

ఏది ఏమైనా భారతదేశం విస్తృత వస్తూత్పాదక సీమగా నిలబడింది భారతీయ కర్మకారుల నైపుణ్యం దేశ దేశాల మారుమోగింది నూలు, పట్టు వస్త్రాలు, చక్కెర, జౌళి, రంగులు, ఖనిజ, లోహ వస్తువులు, సురేకారం, తైలాన్ని భారీ ఎత్తున ఉత్పత్తి చేసే దేశంగా భారతదేశం తన ప్రతిష్ఠ నిలుపుకొంది బెంగాల్‌లో ఢాకా, మూర్షిదాబాద్‌లు; బీహార్లో పాట్నా; గుజరాత్‌లో సూరత్, అహ్మదాబాద్, బ్రోచ్‌లు; మధ్యప్రదేశ్‌లో చందేరి; మహారాష్ట్రలో బుర్హాన్‌పూర్; ఉత్తరప్రదేశ్‌లో జౌన్‌పూర్, వారణాసి, లక్నో, ఆగ్రాలు; అవిభక్త పంజాబులో లాహోర్, ముల్తాన్‌లు; దక్కన్‌లో ఔరంగాబాదు; ఆంధ్రదేశంలో మచిలీపట్నం; చికాకోల్; విశాఖపట్టణం; కర్నాటకలో బెంగుళూరు; తమిళనాడులో మధురై, కోయంబత్తూర్‌లు నేత పరిశ్రమ ప్రధాన కేంద్రాలుగా వాసికెక్కాయి. కాశ్మీరు ఉన్ని వస్త్రాల తయారీలో వన్నె కెక్కింది మహారాష్ట్ర, ఆంధ్ర, బెంగాల్ రాష్ట్రాలలో నౌకా నిర్మాణ పరిశ్రమ అభివృద్ధి చెందింది ఈ సందర్భంగా భారతీయుల మహత్తర నైపుణ్యాన్ని ప్రశంసిస్తూ ఒక ఇంగ్లీషు పరిశీలకుడు ఇలా రాశాడు: "నౌకా నిర్మాణంలో భారతీయులు తాము ఇంగ్లీషు వాళ్ళ వద్ద నేర్చుకున్న దానికన్నా బహుశా ఇంకా ఎక్కువే తిరిగి ఇంగ్లీషు వాళ్ళకు నేర్పారు " భారతీయులు నిర్మించిన అనేక నౌకల్ని ఐరోపా వర్తక సంస్థలు తమ వాడకం కోసం కొనుగోలు చేశారు.

వాస్తవానికి, 18వ శతాబ్ది ప్రభాత కాలంలో భారతదేశం ప్రముఖ ప్రపంచ పారిశ్రామిక వాణిజ్య కేంద్రాల్లో ఒకటి

"భారత దేశ వాణిజ్యమంటే ప్రపంచ వాణిజ్యం అని గుర్తుంచుకోండి.... దాని మీద ఏకచ్ఛత్రాధిపత్యం చలాయించగలిగినవాడే ఐరోపాని శాసించే నియంత" అని రష్యా చక్రవర్తి పీటర్‌ది గ్రేట్ ఆశ్చర్యంతో అన్న మాటలివి!

విద్య: 18వ శతాబ్దపు భారతదేశంలో విద్య పూర్తిగా నిర్లక్ష్యానికి గురికాలేదు. మొత్తంమీద విద్యావిధానం లోపభూయిష్టంగా ఉంది. ఆనాటి విద్య సాంప్రదాయకమైంది పాశ్చాత్య ప్రపంచంలో సంభవించే శీఘ్ర పరిణామాలతో దానికి బొత్తిగా సంబంధం లేదు భారతీయ విద్య ఒసగిన జ్ఞానం సాహిత్యం, న్యాయశాస్త్రం, మతం, వేదాంతం, తర్కశాస్త్రాల మేరకే పరిమితమైంది భౌతిక, ప్రకృతి శాస్త్రాలు, సాంకేతిక విజ్ఞానం, భూగోళ శాస్త్రం వగైరాల అధ్యయనం భారతీయ విద్యలో కానరాలేదు సమాజం గురించి వాస్తవిక, హేతుబద్ధ అధ్యయనాన్ని సైతం అది పట్టించుకోలేదు అన్ని రంగాలలో మౌలిక ఆలోచనని అది నిరుత్సాహపర్చింది; ప్రాచీన విద్యనొక్కదాన్నే నమ్ముకుంది

దేశమంతటా ఉన్నత విద్యా కేంద్రాలు అల్లుకున్నాయి సాధారణంగా వాటికి నవాబులు, రాజులు, ధనిక జమీందార్లు ఆర్థిక సహాయం చేశారు. హిందువుల్లో సంస్కృతం మీద ఆధారపడ్డ ఉన్నతవిద్య బ్రాహ్మణుల వరకే పరిమితమైపోయింది. ఆనాటి అధికార భాష పర్షియన్ కావటం చేత పర్షియన్ విద్య హిందూ, ముస్లిం ప్రజలుభయుల్లో వ్యాప్తి చెందింది

ప్రాథమిక విద్య సర్వత్రా ఉండేది. హిందువుల బిడ్డలకు పల్లెల్లో, పట్నాల్లో వీధి బడుల ద్వారా విద్యాబోధన జరిగేది ముస్లిముల పిల్లలకు మసీదులలో మౌల్వీలు విద్యాబోధన చేసేవాళ్ళు. ఆ పాఠశాలల్లో చదవటం, రాయటం, ప్రాథమిక గణితం నేర్పేవాళ్ళు ప్రాథమిక విద్య సైతం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాల వరకే ఎక్కువగా పరిమితమైనా క్రింది కులాల పిల్లలు కూడా తరచు ప్రాథమిక విద్య నేర్చుకునే వాళ్ళు ఆనాడు అక్షరాస్యుల సగటు సంఖ్య బ్రిటిష్ ఇండియాలోకన్నా హెచ్చుగా ఉండేదంటే ఆశ్చర్యపోనక్కర్లేదు అధునిక ప్రమాణాలతో పోల్చి చూస్తే ఆనాటి ప్రాథమిక విద్యాప్రమాణాలు తక్కువ స్థాయిలో ఉన్నప్పటికీ, అప్పటి పరిమిత అవసరాలకు అది సరిపోయింది సంఘంలో ఉపాధ్యాయులకు గొప్ప గౌరవ ప్రతిష్ఠలుండటం అప్పటి విద్యా వ్యవస్థలో హర్షించదగ్గ విషయం. కాని ఆడపిల్లలకు చదువు చెప్పించకపోవటమనే చెడు లక్షణం ఆనాడు ఉంది అయితే, ఉన్నత కులాలకు చెందిన కొందరు మహిళలు ఆ నిషేధానికి అతీతులు

***సామాజిక, సాంస్కృతిక జీవనం:*** 18వ శతాబ్దంలో సామాజిక జీవనం, సంస్కృతి గతం మీద ఆధారపడి స్తబ్దంగా ఉండిపోయాయి. దేశమంతటా ఒకే రకమైన సాంస్కృతిక, సామాజిక ధోరణులు లేని మాటా నిజమే హిందువులంతా, ముస్లిములంతా రెండు వేర్వేరు సమాజాలుగా చీలిపోయి లేరు మతం, ప్రాంతం, తెగ, భాష, కులం అన్నవి ప్రజల్ని విడదీశాయి ఇంకా చెప్పాలంటే - మొత్తం జనాభాలో అత్యల్ప సంఖ్యాకులు ఉన్న ఉన్నత వర్గాల సామాజిక జీవనం, సంస్కృతి - క్రింది తరగతి ప్రజల జీవన, సంస్కృతులకు అనేక విషయాల్లో భిన్నంగా ఉండేది.

హిందువుల సామాజిక జీవనంలో కులం ప్రధానమైన అంశం. ధర్మశాస్త్రాల్లో చెప్పబడ్డ నాలుగు కులాలే కాకుండా, హిందూ ప్రజలు అసంఖ్యాక ఉపకులాలుగా చీలిపోయారు వాటి స్వభావం ప్రాంతాన్ని బట్టి మారిపోయేది. వర్ణ వ్యవస్థ ప్రజల్ని నిక్కచ్చిగా చీల్చి, సాంఘిక వర్గీకరణలో వేర్వేరు కులాల స్థానాన్ని శాశ్వతంగా నిర్ణయించింద బ్రాహ్మణుల నాయకత్వంలో అగ్రవర్ణాలు సమస్త సాంఘిక గౌరవ ప్రతిష్ఠల్ని, ప్రత్యేక హక్కుల్ని గుత్తగొన్నాయి కులాచారాలు అతి కఠోరంగా అమలు జరిగాయి. వర్ణాంతర వివాహాలకు వీలులేదు. భిన్న కులాలవారు కలిసి భోజనం తీసుకోడానికి సంబంధించి కూడా విధి నిషేధాలున్నాయి. చాలా సందర్భాల్లో, క్రింది కులాల వారు ముట్టుకున్న ఆహార పదార్థాల్ని అగ్రకులాల వారు అంటుకోరు కొద్ది మినహాయింపులున్నప్పటికీ, కులాలను బట్టి వృత్తులు నిర్ణయమయ్యాయి. కుల సంఘాలు, పంచాయితీలు, కుల పెద్దలు కుల నిబంధనల్ని అతి కఠినంగా అమలు పర్చారు. ఉల్లంఘన జరిగిన సందర్భాల్లో జరిమానాలు, ప్రాయశ్చిత్తాలు, కుల బహిష్కరణ వగైరా దండనలు విధించారు. ఆనాటి భారతదేశంలో కులం ప్రజల్ని చీల్చిన ప్రధాన శక్తి దేశ సమైక్యతని విచ్ఛిన్నం చేసిన శక్తి కూడా ఒకే గ్రామంలో లేదా

ప్రాంతంలో జీవించే హిందూ ప్రజల్ని కుల వ్యవస్థ అనేక కణాలుగా ఛేదించింది ఉన్నత పదవిలో, అధికారంలో ఉన్న వ్యక్తి ఉన్నత సామాజిక హోదా సంపాదించటం సాధ్యమైన విషయమే 18వ శతాబ్దపు హొల్కార్ వంశాన్ని ఉదాహరణగా తీసుకోవచ్చు అరుదే అయినప్పటికీ కొన్ని సందర్భాల్లో ఒక యావత్తు కులం వర్ణ వ్యవస్థలో పై మెట్టుకి ఎక్కింది

ఇస్లాం మతం సాంఘిక సమానతని నిర్దేశించినప్పటికీ ముస్లింలు సైతం జాతి, వర్ణ, తెగ , అంతస్థుల తేడాలతో చీలిపోయారు షియా, సున్నీ శాఖల కులీనులు మత విభేదాల కారణంగా పరస్పరం కలహించిన సందర్భాలు కొన్ని ఉన్నాయి ఇరానీ, తురానీ, అఫ్ఘన్, హిందుస్థానీ ముసల్మాను సర్దార్లు అధికార్లు ఒకరికొకరు వేరుగా దూరంగా ఉండేవాళ్ళు ఇస్లాం మతంలోకి మారిన అసంఖ్యాక హిందువులు తమ కులాన్ని కూడా కొత్త మతంలోకి తీసుకుపోయారు హిందువులుగా ఉన్నప్పుడు పాటించినంత కఠినంగా కాకపోయినా, అక్కడా కులం పట్టింపులు మర్చిపోలేదు కులీనులు, పండితులు, పురోహితులు, సైనికాధికార్లు మొదలైన షరీఫ్ ముస్లిములు క్రింది వర్గాలకు చెందిన అజ్‌లఫ్ ముస్లిముల్ని అగ్రవర్ణ హిందువులు అధమ వర్ణ హిందువుల్ని చూసినట్లుగానే చూశారు

18వ శతాబ్దం నాటి భారతీయ కుటుంబ వ్యవస్థ పితృస్వామికం; అంటే కుటుంబంలో అందరికన్నా పెద్దవాడైన పురుషుని అధిపత్యం కొనసాగే వ్యవస్థ; వారసత్వ హక్కు పురుషులకు మాత్రమే సంక్రమించే వ్యవస్థ కూడాను ఒక్క కేరళలో మాత్రం మాతృస్వామ్య కుటుంబ వ్యవస్థ ఉంది కేరళకు వెలుపలి దేశంలో స్త్రీల మీద పురుషులదే సంపూర్ణాధిపత్యం తల్లులుగా, భార్యలుగా జీవించటమే స్త్రీ ధర్మమని భావించబడింది అయితే, స్త్రీలు ఆ పాత్రల్ని నిర్వహించేటప్పుడు మర్యాద, మన్నన చూపబడ్డాయి యుద్ధకాలంలోనైనా, అరాచకత్వం తలెత్తిన రోజుల్లోనైనా స్త్రీలని సాధారణంగా ఎవరూ అవమానించేవాళ్ళు కాదు పైగా, వాళ్ళని గౌరవంగా ఆదరించేవాళ్ళు 19వ శతాబ్ది ప్రారంభంలో భారతదేశాన్ని సందర్శించిన Abbe J A Dubois అనే ఐరోపా యాత్రికుడు ఇలా రాశాడు: "ఒక హిందూ స్త్రీ ఎక్కడికైనా, , ఆఖరికి జనం కిటకిటలాడే ప్రదేశాలకైనా ఒంటరిగా వెళ్ళగలదు పనీపాటు లేకుండా తిరిగే సోమరిపోతుల తుంటరి చూపులు, జులాయి మాటలు రువ్వుతారేమోనని భయపడాల్సిన అగత్యం ఆమెకి కలగదు అందరూ స్త్రీలే నివసించే గృహం పవిత్ర స్థలం వంటిది బొత్తిగా సిగ్గూ ఎగ్గూ లేని స్వైర పురుషుడు సైతం ఆ పవిత్ర స్థలాన్ని కళంకితం చెయ్యాలని కలనైనా తలంచడు" కాని ఆనాటి స్త్రీలు స్వంత వ్యక్తిత్వమనేది ఎరుగరు. దీనికి మినహాయింపులు లేకపోలేదు. 1766 నుండి 1796 వరకు అహల్యాబాయి ఇండోర్‌ని ఘనంగా పరిపాలించింది 18వ శతాబ్ది రాజకీయాల్లో అనేక మంది హిందూ ముస్లింల మహిళలు ముఖ్యమైన పాత్ర నిర్వహించారు ఉన్నత వర్గాల స్త్రీలు ఇల్లు దాటిబైట పనిచేసే ప్రసక్తే లేదు రైతుల ఇల్లాళ్ళు సాధారణంగా పొలం పనులు చేసేవాళ్ళు ఇంకా పేద స్త్రీలు కుటుంబాన్ని పోషించుకోవటం కోసం బైట పనిపాట్లు చేసే వాళ్ళు. ఉత్తర హిందూస్థానంలో ఉన్న వర్గాల స్త్రీలలో పర్దా పద్ధతి సర్వసాధారణం. కాని, దక్షిణ భారతదేశంలో ఈ పద్ధతి ఉండేది కాదు

మగ పిల్లలు ఆడపిల్లలు కలిసి మెలిసి తిరగటాన్ని అనుమతించే వాళ్ళు

కాదు. కుటుంబ పెద్దలే వివాహాలు నిర్ణయించేవాళ్ళు ఒక్క స్త్రీ కన్నా ఎక్కువమందిని చేసుకునే హక్కు పురుషులకుండేది అయితే, బాగా డబ్బున్న వాళ్ళు తప్ప, మిగతా వాళ్ళంతా సాధారణంగా ఒక్క భార్యతోనే సంసార జీవనం సాగించేవాళ్ళు స్త్రీ మాత్రం జీవితంలో ఒక్కసారి మాత్రమే వివాహం చేసుకోవాలి అనాడు బాల్య వివాహాలు దేశమంతటా వ్యాప్తిలో ఉన్నాయి మూడు, నాలుగేళ్ళ వయస్సులోనే పిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవాళ్ళు

వరకట్నం, భారీ పెళ్ళి ఖర్చులు వంటి దురాచారాలు అనాడు ఉన్నత వర్గాలలో ప్రబలంగా ఉన్నాయి ముఖ్యంగా బెంగాల్, రాజపుటానాలలో వరకట్న దురాచారం బాగా బలిసిపోయి వుంది మహారాష్ట్రలో పీష్వాలు గట్టి చర్యలు తీసుకున్న కారణంగా ఈ దురాచారం కొంత వరకు సమసిపోయింది

వర్ణ వ్యవస్థ కాకుండా, ఆ శతాబ్దంలో భారతదేశాన్ని పీడించిన మరో రెండు సాంఘిక దురాచారాలు కూడా ఉన్నాయి ఒకటి: సతీసహగమనం, రెండు: వితంతువుల హైన్య స్థితి భర్త చనిపోతే, భార్య అతనితో పాటు చితిలో సజీవంగా దహనమయ్యే దారుణాన్ని సతీసహగమనం అంటారు ఈ దురాచారం రాజపుటానా, బెంగాల్, ఉత్తర భారతదేశంలోని ఇంకా కొన్ని ప్రాంతాల్లో ప్రబలంగా ఉండేది. దక్షిణాదిన దీని ఊసే తెలిదు మహారాష్ట్రులు కూడా సతీసహగమనాన్ని ప్రోత్సహించలేదు రాజపుటానా, బెంగాల్ రాష్ట్రాల్లో కూడా బడా జమీందార్లు, రాజులు, అగ్రవర్ణాల ఇళ్ళల్లో మాత్రమే ఈ ఆచారం అమలు జరిగింది ఉన్నతవర్గాలకు, అగ్రవర్ణాలకు చెందిన వితంతువులు పునర్వివాహం చేసుకునే వీలు లేదు కొన్ని ప్రాంతాలలో, కొన్ని కులాల్లో - ముఖ్యంగా మహారాష్ట్ర బ్రాహ్మణేతరుల్లో, ఉత్తర హిందుస్థానంలో పర్వత ప్రాంతాల జాట్ కులస్థుల్లో వితంతు వివాహాలు సర్వసాధారణం మామూలుగా హిందూ వితంతువు పరిస్థితి బహు దయనీయమైంది. ఆవిడ కట్టూ, బొట్టూ, తిండి కదలికలకి సంబంధించి నానా రకాల నియమ, నిషేధాలు ఉన్నాయి ఆవిడ ఈ ఐహిక సుఖాలన్నీ పరిత్యజించి భర్త తరఫు కుటుంబ సభ్యులకో, లేదా సోదరుని కుటుంబంలోని వాళ్ళకో నిస్వార్థంగా చాకిరీ చెయ్యాలి అంటే ఆమె తన శేష జీవితం ఎవరింట గడిపితే ఆ ఇంట్లో వాళ్ళకి బండెడు చాకిరీ చేసి పెట్టాలి వితంతువుల ఈ కర్కశ, కఠోర జీవితాన్ని చూసి సున్నిత మనస్కులైన భారతీయులు కొందరు స్పందించారు అంబర్ సంస్థానాన్ని పరిపాలించిన రాజావాయ్ జైసింగ్, మరాఠా సేనాపతి పరశురామ్ భావే వితంతు వివాహాలు జరిపించాలని ప్రయత్నం చేసి విఫలమయ్యారు

18వ శతాబ్దంలో భారతదేశం సాంస్కృతికంగా నిస్త్రాణ చెందిన జాడలు గోచరిస్తాయి. గతించిన శతాబ్దాలలో సాంస్కృతిక అవిచ్ఛిన్నత ఎండిపోకుండా జాలు వారింది కాని ఆ సంస్కృతి పూర్తిగా సాంప్రదాయకంగా నిలిచిపోయింది రాజదర్బారు, ప్రభువులు, జాగీర్దార్లు, నాయకులు అనాడు సాంస్కృతిక కార్యకలాపాలకు విరివిగా ధనసహాయం చేశారు వాళ్ళకి క్షీణ దశ ప్రాప్తించటంతో, క్రమేణా కళలు, సాహిత్యం వగైరాలు నిరాదరణకు గురయ్యాయి. ప్రధానంగా రాజులు, జాగీర్దార్ల పోషణ మీద బ్రతికిన సాంస్కృతిక శాఖలు వేగం క్షీణించిపోయాయి మొఘల్ వాస్తుశిల్పం చిత్రలేఖనం ఆ విధంగా దీన స్థితికి దిగజారిపోయినవే. మొఘల్ చిత్రకళా



1829లో అణచివేతకు కొన్ని సంవత్సరాల క్రితం చిత్రించిన "సతీసహగమనం" దృశ్యం

సంప్రదాయానికి చెందిన చిత్రకారులు చాలా మంది రాష్ట్రపాలకుల ఆస్థానాలకు వలసపోయి హైదరాబాద్, లక్నో, కాశ్మీర్, పాట్నాలలో మళ్ళీ తలెత్తారు. అదే సమయంలో నూతన చిత్రకళా సంప్రదాయాలు ఆవిర్భవించి, ఒక ప్రత్యేకతని సంతరించుకున్నాయి. కాంగ్రా, రాజపుత్ర కళారీతుల్లో సృష్టి అయిన చిత్తరువులు కొంగ్రొత్త జీవం అభిరుచి వ్యక్తీకరించాయి. వాస్తు శిల్ప కళారంగంలో లక్నోలోని ఇమాంబాడా సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించినప్పటికీ, అది క్షీణయుగ వాస్తుశిల్ప కళాభిరుచి మాత్రమే. మరో ప్రక్క, జైపూర్ నగరం, ఆ భవనాలు అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వచ్చే మన వాస్తు శిల్పుల సత్తాకు నిదర్శనాలు. 18వ శతాబ్దంలో సంగీతం అభివృద్ధి అవుతూనే ఉంది. మహమ్మద్‌షా పరిపాలనా కాలంలో సంగీత రంగంలో గణనీయమైన ప్రగతి సాధించబడింది.

దాదాపు అన్ని భారతీయ భాషల్లోనూ, కవిత్వం జీవితంతో స్పర్శ కోల్పోయి అలంకారప్రాయంగా, కృత్రిమంగా, ప్రేరణా రహితంగా, సాంప్రదాయకంగా తయారైంది. ఉత్తర హిందుస్థానంలో ఉన్నత వర్గాల మధ్య సాంఘిక సంపర్గానికి ఉర్దూ

క్రమేణా బాటలు పరచింది భారతదేశంలోని ఇతర భాషల సమకాలిక సాహిత్యంలో చోటుచేసుకున్న బలహీనతల్ని ఉర్దూ కవిత కూడా పంచుకున్నప్పటికీ, మీర్, సౌదా, నజీర్ వంటి ఉజ్వల కవితామూర్తుల్ని ఉర్దూ కవిత సృష్టించింది. 19 వ శతాబ్దంలో మహా ప్రతిభావంతుడైన మీర్జా గాలిబ్‌ని ప్రసాదించింది

అదే విధంగా, తిరువాన్కూరు ప్రభువులు మార్తాండ వర్మ, రామవర్మల పోషణలో మళయాళ సాహిత్యం పునర్వికసించింది. ప్రజల నిత్య వ్యావహారిక భాషలో బహుళ జనామోద కవిత రాసిన కేరళ మహాకవి కుంచన్ నంబియార్ ఇదే కాలంలో జీవించాడు 18వ శతాబ్దంలో కేరళలో కథాకళి సాహిత్య, నృత్య, నాటకాలు పరిపూర్ణ వికాసం పొందాయి. అద్భుత వాస్తు శిల్ప వైచిత్రితో, కుడ్య చిత్రాలతో అలరారే పద్మనాభన్ రాజప్రాసాదం 18 వ శతాబ్దంలోనే నిర్మించబడింది.

తాయూమనవర్ (1706-44) అనే కవి తమిళంలో శక్తివంతమైన కవిత చెప్పాడు ఆయన తన కవితలో కులవ్యవస్థకు, దేవాలయ నియమాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశాడు అస్సాంలో ఆహోం రాజుల పోషణలో సాహిత్యం అభివృద్ధి చెందింది గుజరాత్ గేయకారుల్లో సుప్రసిద్ధుడైన దయారామ్ 18వ శతాబ్ది ఉత్తరార్థంలో గీతరచన చేశాడు పంజాబీ భాషలో ప్రసిద్ధ ప్రణయ కావ్యమైన "హీర్ రంజా"ని వారిస్ షా ఇదే కాలంలో రచించాడు. సింధీ సాహిత్య జగత్తు అపూర్వ ప్రగతిని సాధించిన కాలం కూడా ఇదే. షా అబ్దుల్ లతీఫ్ ప్రసిద్ధ కవితా సంకలనం 'రిసాలో' వెలువడింది ఇంకా సచల్, సమీ అనే ఇతర సింధీ కవులు ఇదే కాలంలో గొప్ప కవితా సేవ చేశారు.

భారతీయ సంస్కృతి తాలూకు ప్రధాన బలహీనత విజ్ఞాన శాస్త్ర రంగంలో బైట పడింది. ఆ నూరు సంవత్సరాలూ భారతదేశం శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన రంగాలలో పాశ్చాత్య దేశాల కన్న చాలా వెనకబడి ఉంది. అప్పటికి 200 సంవత్సరాలుగా ఆర్థిక, విజ్ఞాన శాస్త్ర రంగాలలో పశ్చిమ ఐరోపా విప్లవాత్మకమైన మార్పులకు లోనవుతూ వచ్చింది తత్ఫలితంగా, అనేక నూతన విషయాలు కనిపెట్టబడ్డాయి నూతన ఖండాలు వెలుగులోకి వచ్చాయి. నూతన శాస్త్రీయ సాంకేతిక పరికరాలు వినియోగంలోకి తేబడ్డాయి. పాశ్చాత్య మేధ జగత్తులో శాస్త్రీయ దృక్పథం వెల్లివిరిసింది. యూరోపియన్ల, యూరోపియన్ సంస్థల, వ్యవస్థల తాత్విక, రాజకీయ, ఆర్థిక దృష్టిని ఈ పరిణామం విప్లవ విలసితం చేసింది. యూరప్‌లో పరిస్థితి యిలా వుండగా గణిత, ప్రకృతి శాస్త్రాలకు ఒకనాడు గణనీయ సేవచేసిన భారతీయులు ఈ శాస్త్రాల్ని గడచిన అనేక శతాబ్దాలుగా నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు భారతీయుని మనస్సు ఇంకా సంప్రదాయంతోనే ముడిపడి వుంది. కులీనవర్గాలు, సామాన్యజనం ఉభయులూ మూఢ విశ్వాసాల ఊబిలో కూరుకుపోయారు. పాశ్చాత్య దేశాల్లో సాధించబడ్డ శాస్త్రీయ, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక విజయాల్ని గురించి భారతీయులకు బొత్తిగా తెలియదు వాళ్ళొక అజ్ఞానాంధకారంలో ఉండిపోయారు. ఆ శతాబ్ది భారతీయ పాలకులు సైతం ఆయుధాలంటేను, సైనిక శిక్షణా పద్ధతులంటేను తప్ప వేరే పాశ్చాత్య విషయాల పట్ల ఆసక్తి ప్రదర్శించలేదు. విజ్ఞాన శాస్త్ర రంగంలో బహిర్గతమైన భారతదేశ బలహీనత వల్ల, ఆనాడు ఉన్నతస్థాయి ప్రగతి సాధించిన యూరప్ దేశాల్లో ఒక దేశం ఈ దేశాన్ని సంపూర్ణంగా స్వాధీన పర్చుకోగలిగింది.

అధికార, సంపదల కోసం సంఘర్షణ, ఆర్థిక పతనస్థితి, సామాజికమైన వెనుకబాటు తనం, సాంస్కృతిక నిస్తబ్ధత వగైరాలు భారతీయ ప్రజల్లో భాగమైన ఒక వర్గపు నైతిక స్థాయిని తీవ్రంగా దెబ్బతీశాయి ప్రభు వర్గీయులు ఇంటా-బయటా నైతికంగా దిగజారిపోయారు వ్యక్తిగత జీవితంలోగానీ, పబ్లిక్ జీవితంలో గానీ నీతి తప్పి వ్యవహరించసాగారు స్వార్థమే పరమార్థంగా, ఏకైక జీవిత లక్ష్యంగా బ్రతికే ప్రభు వర్గీయుల్లో విశ్వాసగుణం, కృతజ్ఞతాభావం, అడిన మాటకి కట్టుబడి వుండే నిజాయితీ వగైరా ఫ్యూడల్ విలువలు పూర్తిగా విలుప్తం కాసాగాయి. అధమాధపు దుర్నీతికి, మితిమీరిన విలాస భోగలాలసతకు ఎర అయ్యారు పదవిలో ఉన్నప్పుడు లంచాలు తినమరిగారు. కాని విచిత్రమేమంటే - సామాన్య ప్రజలు మాత్రం అట్లా నైతికంగా దిగజారిపోలేదు వ్యక్తిగతమైన నిజాయితీలో, నీతిలో ఉన్నత ప్రమాణాలు ప్రదర్శిస్తూనే వచ్చారు ఉదాహరణకు - 1821లో ప్రసిద్ధ బ్రిటిష్ అధికారి జాన్ మాల్కొమ్ ఇలా వ్యాఖ్యానించాడు: "ఈ దేశ జనాభాలో విశాల ప్రజానీకం అటువంటి పరిస్థితుల్లో రకరకాల మార్పులు సంభవిస్తూ క్రూర నిరంకుశ పరిపాలన సాగే ఆ యుగంలో అంతటి నైతిక స్థాయిని, ఉత్తమ లక్షణాల్ని కాపాడుకున్నారంటే చాలా గొప్ప విషయం ఇటువంటి ఉదాహరణ ఎక్కడా ఏ దేశ ప్రజానీకంలోనూ నాకు కనిపించలేదు "

"దొంగతనం, తాగుడు, హింసా దౌర్జన్యాల్లాంటి సర్వసామాన్యమైన నేరాలు, చెడ్డ పనులు సమాజంలో కనిపించకపోవటాన్ని" ఆయన ప్రత్యేకంగా ప్రశంసించాడు. అదే విధంగా, క్రాఫర్డ్ అనే మరొక యూరోపియన్ రచయిత కూడా ఇలా రాశాడు: "వాళ్ల నైతిక నియమనిబంధనలు గొప్ప ఔదార్య సూచకంగా ఉన్నాయి ఆతిధ్య గుణం, దానబుద్ధి వాళ్ళలో చాలా బలంగా నాటుకొని వుండడం ఒక్కటే కాకుండా, హిందువులు తప్ప మరెక్కడా, మరే జాతి ప్రజలూ ఇంత సార్వత్రికంగా ఈ గుణాల్ని ఆచరించి చూపుతారని నేను భావించను."

అనాడు హిందూ ముస్లిం ప్రజల మధ్య నెలకొన్న స్నేహసంబంధాలు నాటి భారతీయ జీవనంలో ఒక ఆరోగ్యకరమైన ధోరణి ప్రభువర్గీయులు, ముఠా నాయకులు తమలో తాము ఎడతెగకుండా పోరాడుకున్నా, వాళ్ళ పోరాటాలు, మైత్రీ సంబంధాలు మత సంబంధమైన తేడాల్ని బట్టి సాగలేదు మరో మాటలో చెప్పాలంటే, వాళ్ళవి లౌకిక రాజకీయాలు నిజానికానాడు మత వైషమ్యాలు గానీ, మత అసహనం గానీ మచ్చుకైనా లేవు ఉన్నత, దిగువ వర్గాల తేడా లేకుండా ప్రజలందరూ ఒకరి మతాన్ని మరొకరు గౌరవించారు అద్వితీయమైన సహన శీలం, సామరస్యం సమాజంలో వెల్లి విరిశాయి "హిందూ, ముస్లిం ప్రజల మధ్య పరస్పర సంబంధాలు అన్నదమ్ముల బాంధవ్యాన్ని తలపించాయి" పల్లెటూళ్ళలో గానీ పట్నాల్లోగానీ ప్రజలంతా మత విభేదాలు మరచిపోయి పరస్పరం తమ సుఖదుఃఖాలు పంచుకున్నారు

హిందూ ముస్లిములు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లాంటి మతేతర రంగంలో సైతం పరస్పరం సహకరించుకున్నారు. హిందూ ముస్లిం సమ్మిశ్రిత సంస్కృతి ఒకటి, లేదా తీరుతెన్నుల్లో జీవన వైఖరుల్లో ఏకీభావం అనేది అవిచ్ఛిన్నంగా కొనసాగింది హిందూ రచయితలు పర్షియన్ భాషలో రాశారు ముస్లిం రచయితలు

హిందీ, బెంగాలీ, ఇంకా తదితర దేశభాషల్లో గ్రంథ రచన చేశారు రాధాకృష్ణులు, సీతారాములు, నల-దమయంతులు మొదలైన పౌరాణిక కావ్యవస్తువుల్ని, హైందవ సమాజానికి, మతానికి సంబంధించిన విషయాల్ని స్వీకరించి కావ్య రచన చేశారు ఉర్దూ భాషా సాహిత్యాల వికాసం హిందూ-ముస్లిం ప్రజల మధ్య కొత్త ఉమ్మడి వేదికను రూపొందించింది

హిందూ ప్రజల్లో భక్తి ఉద్యమ వ్యాప్తి ఫలితంగానూ, ముస్లిం ప్రజల్లో సూఫీ మార్గ విస్తరణ ఫలితంగానూ గడచిన కొన్ని శతాబ్దాల్లో పెల్లుబికిన అన్యోన్య ప్రభావం, గౌరవం మత సంబంధమైన రంగంలో సైతం తరిగిపోకుండా పెరుగుతూనే వచ్చాయి అసంఖ్యాక హిందూ ప్రజలు ముస్లిం యోగులకు పూజలు చేశారు అలాగే ముస్లిం ప్రజలు హిందూ దేవతలకు, యోగులకు సమానభక్తి ప్రపత్తులు ప్రదర్శించారు ముస్లిం పాలకులు, ప్రభువులు, సామాన్య ప్రజలు హోలీ దీపావళి, దుర్గాష్టమి వగైరా హిందువుల పండగల్లో సంబరాల్లో ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొన్నారు అట్లాగే , హిందువులు మొహర్రం ఊరేగింపుల్లో పాల్గొన్నారు

సాంస్కృతిక, సామాజిక జీవనంలో మత ప్రాతిపదిక మీద ప్రజలు వేర్వేరు త్రోవలు పట్టి పోవటమనేది లేదని ప్రత్యేకంగా గమనించాలి ఉన్నత వర్గాల హిందూ ముస్లిముల జీవన పద్ధతులు మేళవించినట్లుగా ఉన్నత - దిగువ వర్గాల హిందువుల జీవన పద్ధతులు గానీ ఉన్నత-దిగువ వర్గాల ముస్లిం జీవన పద్ధతులు గానీ ఏకీభావం చెందలేదు అంటే - హిందువుల్లోను, ముస్లిముల్లోను, ఉన్నత దిగువ వర్గాల మధ్య జీవన పద్ధతుల్లో సమ్మేళనం లోపించింది అదే విధంగా, ప్రాంతీయ తేడాల్ని బట్టి కూడా జీవన పద్ధతులు వేర్వేరు త్రోవలు పట్టాయి విభిన్న ప్రాంతాల్లో జీవించే ఒకే మతస్థులైన ప్రజల కంటే కూడా ఒకే ప్రాంతంలో జీవించే ప్రజల మధ్య మతంతో నిమిత్తం లేకుండా అంతకన్నా గొప్ప సాంస్కృతిక సమన్వయం గోచరించింది అట్లాగే పల్లెలో జీవించే ప్రజలు పట్టణ వాసులకు భిన్నమైన సాంస్కృతిక, సామాజిక జీవన విధానం వేపు మొగ్గు చూపారు

# ఐరోపా వర్తక స్థావరాల ఆరంభం

యూరప్‌తో భారతదేశానికి వ్యాపార సంబంధాలు ప్రాచీన గ్రీకు కాలం నాటి నుంచి ఉన్నాయి మధ్య యుగాల కాలంలో యూరప్, భారతదేశం, ఆగ్నేయ ఆసియాల మధ్య అనేక మార్గాల గుండా వ్యాపారం సాగింది ఒకటి-పర్షియన్ సింధుశాఖ వెంబడి సముద్ర మార్గం, అక్కడ నుంచి ఇరాక్, టర్కీల గుండా భూమార్గం; ఆ తరువాత మళ్ళీ సముద్ర మార్గాన వెనిస్ జెనీవాలు చేరుకోవటం ఇక రెండవ మార్గం ఎర్ర సముద్రం గుండా ప్రయాణం చేసి భూమార్గాన ఈజిప్టులోని అలెగ్జాండ్రియా రేవు చేరుకొని అక్కడి నుండి సముద్రమార్గంలో వెనిస్, జెనీవాలు చేరుకోవటం ఇవి రెండూ కాక మూడవ మార్గం, ఇంకొకటి ఉంది అది వ్యాపారస్థులు తరచు ఉపయోగించని భూమార్గం ఆ మార్గం భారత వాయవ్య సరిహద్దు కనుమల గుండా పోయి మధ్యాసియా రష్యాలను దాటి బాల్టిక్ సముద్ర తీరాన్ని చేరేది ఆసియాకు సంబంధించిన వ్యాపారాన్ని అరబ్బు వర్తకులు, నావికులు నిర్వహించేవాళ్లు మధ్యధరా తీర ఆసియాకు సంబంధించిన వ్యాపారాన్ని అరబ్బు వర్తకులు, నావికులు నిర్వహించేవాళ్లు మధ్యధరా తీర ప్రాంతానికి, యూరప్‌కు సంబంధించిన వ్యాపారాన్ని ఇటాలియన్లు గుత్తగొన్నారు ఆసియా నుండి యూరప్‌కు వెళ్లే సరుకులు అనేక రాజ్యాల గుండా పయనించి, అనేక చేతులుమారేవి మార్గంలో ప్రతి రాజ్యం రహదారి సుంకాలు, వాణిజ్య సుంకాలు వసూలు చేసుకొనేది ప్రతి వర్తకుడూ దిట్టంగా లాభాలు తీసేవాడు ఇవికాక, మార్గమధ్యంలో దొంగల భయం, ప్రకృతి విభత్సాలు వగైరా అనేక చికాకులు చుట్టు ముట్టేవి. అయినప్పటికీ, వ్యాపారం అత్యంత లాభదాయకంగానే ఉండేది ఎంచేతనంటే, యూరప్ ప్రజలకు తూర్పు దేశాల సుగంధ ద్రవ్యాలు లేకపోతే పూట గడిచేది కాదు వాటికి యూరప్ మార్కెట్లలో అపరిమితమైన ధర పలికేది. శీతాకాలంలో యూరప్ ప్రజలు ఉప్పు, మిరియపు పొడిలో ఊరవేసిన మాంసాహారం మీద బ్రతికేవాళ్లు కాబట్టి, వాళ్ళకి సుగంధ ద్రవ్యాలు నిత్యజీవితావసరంగా మారాయి. ఫలితంగా, భారతీయుల ఆహారంలో మాదిరిగానే యూరప్ ప్రజల ఆహారంలో కూడా 17వ శతాబ్దం దాకా సుగంధ ద్రవ్యాల్నిపుష్కలంగా దట్టించేవాళ్ళు

ఒట్టమాన్ టర్కులు ఆసియా మైనర్ని జయించి, 1453లో కాన్స్టాంటినోపిల్ని పట్టుకోవటంతో తూర్పు, పడమటి దేశాల మధ్య వర్తక మార్గాలు టర్కుల చేతుల్లోకి వెళ్ళిపోయాయి పై పెచ్చు వెనిస్, జెనీవా వర్తకులు యూరప్-ఆసియాల మధ్య సాగే వ్యాపారం మొత్తాన్ని గుత్తగొని స్పెయిన్, పోర్చుగల్ లాంటి నూతన పశ్చిమ యూరప్ జాతీయ రాజ్యాల్ని ఈ పాత వర్తక మార్గాల గుండా జరిగే వ్యాపారంలో పాలు పంచుకోనీకుండా చేశారు.

కాని ఇండియా, ఇండోనేషియాలతో వ్యాపారం మహా విలువైంది. కాబట్టి పశ్చిమ యూరప్ దాన్ని తేలిగ్గా వదులుకోలేదు ఒకవేపు, సుగంధ ద్రవ్యాలకు విపరీతమైన

గిరాకీ, మరోవేపు, ఆ వ్యాపారం మీద వచ్చే అపార లాభాలు నోరూరించాయి. కథలుగా చెప్పుకునే భారతదేశ అత్యద్భుత సంపద ఇంకొక ఆకర్షణ. పైగా నాడు యూరప్ ఖండాన్ని తీవ్రమైన బంగారం కొరత వేధిస్తోంది. వ్యాపారం ఏ ప్రతి బంధకాలు లేకుండా సజావుగా సాగాలంటే బంగారం ఒక్కటే మారక సాధనం. కాబట్టి, భారతదేశానికి తూర్పిండియా దీవులుగా వాడుకపడ్డ సుగంధ ద్రవ్య ద్వీప సముదాయమైన ఇండొనేషియాకు పశ్చిమ యూరప్ రాజ్యాలు, వర్తకులు క్షేమకరమైన నూతన సముద్ర మార్గాల అన్వేషణకు పూనుకొన్నారు. వీళ్ళు అరబ్బు, వెనీషియన్ల వ్యాపార గుత్తాధిపత్యాన్ని బద్దలుకొట్టి, టర్కుల శత్రుత్వాన్ని తప్పించుకొని, తూర్పు దేశాలతో నేరుగా వర్తక సంబంధాల్ని నెలకొల్పుకోవాలని కోరిక పడ్డారు. దానికి తగిన సాధన సంపత్తి వాళ్ళకుంది. 15వ శతాబ్దంలో నౌకా నిర్మాణంలో, నౌకాయాన సాంకేతిక విజ్ఞానంలో అద్భుత ప్రగతి సాధించబడింది. పైగా, సాంస్కృతిక పునరుజ్జీవనం పశ్చిమ యూరప్ ప్రజల్ని కొత్త సాహసం చెయ్యటానికి ఉత్తేజపరిచింది.

ఈ దిశలో తొలిచర్యలు ప్రారంభించిన దేశాలు స్పెయిన్, పోర్చుగల్‌లు. ఆ ప్రభుత్వాల అధికారానికి లోబడి పనిచేసే నావికులు ప్రభుత్వ ప్రోద్బలం మీద నూతన భౌగోళిక విషయాల్ని కనిపెట్టటానికి బయలుదేరారు. ఆ విధంగా ఒక నూతన యుగావిర్భావానికి నడుం కట్టారు. 1494లో స్పెయిన్ దేశస్థుడు కొలంబస్ భారతదేశాన్ని చేరుకోవాలని బయల్దేరి అమెరికా ఖండాన్ని కనిపెట్టాడు. 1498లో పోర్చుగల్ దేశీయుడు వాస్కోడిగామా యూరప్ నుండి ఇండియాకు ఒక నూతన సముద్ర మార్గాన్ని కనిపెట్టాడు. వాస్కోడిగామా ఆఫ్రికా ఖండాన్ని చుట్టి గుడ్‌హోప్ అగ్రం మీదుగా ముందుకు పయనించి భారత పశ్చిమ తీరంలో కాలికట్‌ని చేరాడు. భారతదేశంలో ఓడ నిండా సరుకు నింపుకుని తిరిగి పోర్చుగల్ చేరాడు. సముద్రాయనంలో అతనికైన ఖర్చుకి అరవైరెట్ల రేటు మీద తెచ్చిన సరుకుని అమ్మేశాడు. ఇవీ నౌకాయానంలో కనిపెట్టిన తదితర నూతన విషయాలు ప్రపంచ చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని సృష్టించాయి. అమెరికా ఖండాన్ని కనిపెట్టడం, భారత దేశానికి గుడ్‌హోప్ అగ్రం మీదుగా నూతన సముద్ర మార్గాన్ని కనిపెట్టడం అనేవి "మానవజాతి చరిత్రలో నమోదయిన రెండు అత్యంత ప్రధానమైన, మహత్తర సంఘటనలు"గా ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త ఆడంస్మిత్ అభివర్ణించాడు. 17వ, 18వ శతాబ్దాలు ప్రపంచ వాణిజ్యంలో అమేయమైన అభివృద్ధిని వీక్షించబోతున్నాయి. సువిశాల అమెరికా ఖండం యూరప్‌కు ద్వారాలు తెరుచుకుంది. యూరప్-ఆసియాల మధ్య సంబంధాలు సమూల పరివర్తన చెందాయి. అమెరికా నూతన ఖండం విలువైన లోహాలతో సుసంపన్నమై ఉంది. అమెరికా ఖండపు వెండి, బంగారాలు యూరప్‌లోకి వెల్లువై పారాయి. ఈ ఊపుతో యూరప్ వ్యాపారం మూడు పూవులారుకాయలుగా ముమ్మరించింది. అమెరికా సంపద యూరప్ దేశాలకు పెట్టుబడి సమకూర్చి పెట్టింది. తద్వారా, వాణిజ్యంలో, పరిశ్రమల్లో, శాస్త్ర విజ్ఞానంలో యూరప్ జాతులు అత్యున్నత శిఖరాలు చేరుకోవటానికి దోహదపడింది. పై పెచ్చు యూరప్‌లో తయారైన వస్తువులకు అమెరికా తరగని మార్కెట్‌ని కూడా హాజరుపర్చింది.

యూరప్ దేశాల్లో మొదట్లో పెట్టుబడి పోగుబడ్డానికి లేదా సంపద పెంపొందడానికి మరొక ప్రధానమైన వనరు దొరికింది. అదే ఆఫ్రికా ఖండం.

యూరోపియన్లు 15వ శతాబ్ది మధ్యకాలంలో ఆఫ్రికాలోకి చొచ్చుకుపోయారు. తొలిదినాల్లో, ఆఫ్రికా బంగారం, దంతం విదేశీయుల్ని ఆకర్షించాయి. రాను రాను, వాళ్ళు బానిస వ్యాపారం మీద దృష్టి కేంద్రీకరించారు. 16వ శతాబ్దంలో స్పెయిన్, పోర్చుగల్‌లు ఈ వ్యాపారాన్ని గుత్తగొన్నాయి. ఆ తరువాత డచ్చి, ఫ్రెంచి, బ్రిటిషు వర్తకులు అధిక్యత సంపాదించారు. 1650 తరువాత, ఏటా వేలాది ఆఫ్రికన్ బానిసలు పడమటి దీవుల్లోను (వెస్టిండీస్), ఉత్తర దక్షిణ అమెరికాలలోను విరివిగా అమ్ముడుపోయారు. ఈ బానిస నౌకలు యూరప్‌లో తయారైన వస్తువుల్ని ఆఫ్రికా తీరంలో దించి, ఆ సరుకును మారకం వేసి ఆఫ్రికా మనుషుల్ని కొని పారేసి అట్లాంటిక్ మహాసముద్రం మీదుగా అమెరికా చేర్చాయి. యూరప్ వర్తకులు ఆఫ్రికా బానిసల్ని తోటలు, గనుల యజమాన్లకు తెగనమ్మి, వాళ్ళ సరుకుని ఓడల్లో నింపుకుని తిరిగి యూరప్‌లో లాభానికమ్ముకున్నారు. ఈ ముప్పేట వ్యాపారంలో మూటకట్టుకున్న ముల్లెమీదనే ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాల వాణిజ్యాధిక్యత ఆధారపడింది.

చెరకు, పత్తి, పొగాకు తోటల్లోను, పశ్చిమార్థగోళంలో అపారమైన గనుల్లోను బానిసలకు తరగని గిరాకీ ఉండేది. కఠోరమైన పని పరిస్థితులు , యజమానుల అమానుష ప్రవర్తన బానిసల్లో మరణాల సంఖ్య పెచ్చు పెరిగిపోవటానికి దారితీశాయి. ఆఫ్రికా ఖండం వాలుగా దొరకకపోతే యూరప్ పరిమిత జనాభా నూతన ఖండంలో సువిశాల భూ, గని వనరుల్ని పూర్తి వినియోగంలోకి తేవటానికి అవసరమైన



1860లో బానిసల వేలం

కారు చౌక కూలి జనాన్ని సరఫరా చెయ్యలేకపోయి వుండేది. ఎందరు ఆఫ్రికన్లని బానిస సంతల్లో తెగనమ్మి పారేశారనే ఖచ్చితమైన లెక్కలు చరిత్రలో దొరకకపోయినా, వాళ్ళ సంఖ్య 15-50 మిలియన్ల మధ్య (కోటిన్నర-అయిదుకోట్ల మధ్య) వుండవచ్చని చరిత్రకారుల అంచనా.

ఒక వైపు, భారీ ఎత్తున ఇలా మనుషుల్ని తరలించుకుపోవటం వల్ల ఆఫ్రికా దేశాలు, సమాజాలు అవిటివై పోయాయి. మరోవైపు, ఈ బానిస వ్యాపారం మీద ఆధారపడి పశ్చిమ యూరప్, ఉత్తర అమెరికాలు సౌభాగ్యవంతమయ్యాయి. బానిసల శ్రమమీద పండే తోటలు సిరులొలికాయి. ఇంకా ఈ బానిస వ్యాపారంలోను, వాణిజ్యపంటల తోటలమీద వచ్చినవర్ష లాభాలు 18,19 శతాబ్దాలలో ఆవిర్భవించిన పారిశ్రామిక విప్లవానికి పెట్టుబడులు సమకూర్చి పెట్టాయి. అట్లాగే భారతదేశం నుంచి గుంజుకున్న సంపద కూడా తరువాత అదే పాత్ర నిర్వహించింది.

బానిస వ్యాపారం ఒక ముఖ్యమైన ఆర్థిక పాత్ర నిర్వహించటం తగ్గిపోయాక, 19వ శతాబ్దంలో బానిసత్వం రద్దయింది. కాని, బానిస వ్యవస్థ లాభదాయకంగా ఉన్నంత కాలం వాళ్ళు దాన్ని బహిరంగంగా సమర్థించారు. ఆకాలానికెత్తేశారు రాజులు, మంత్రులు, పార్లమెంటు సభ్యులు, చర్చి అధికార్లు, ప్రజానాయకులు, వర్తకులు, పారిశ్రామిక వేత్తలు - అందరూ బానిస వ్యాపారాన్ని సమర్థించారు. ఉదాహరణకి ఇంగ్లండ్‌లో ఎలిజబెత్ మహారాణి, మూడవ జార్జి చక్రవర్తి, ఎడ్మండ్ బర్క్, నెల్సన్, గ్లాడ్‌స్టన్, డిస్రాలీ, కార్లయిల్ ప్రభృతులు బానిస వ్యాపారాన్ని సమర్థించిన వాళ్ళ జాబితాల్లో చేర్తారు.

16వ శతాబ్దంలో యూరప్ వర్తకులు, సైనికులు సైతం మొట్టమొదట ఆసియా సీమల్లో చొరబడ్డం, ఆ తరువాత క్రమేణా వాటి మీద ఆధిపత్యం సంపాదించటం అనే దీర్ఘకాలిక ప్రణాళికని ప్రారంభించారు. ఈ పరిణామ క్రమంలో ఇటలీ నగర సీమల, వర్తకుల సౌభాగ్యం అడుగంటిపోయింది ఇటాలియన్ల వాణిజ్యం, ఆ తరువాత వారి రాజకీయాధికారం క్రమేణా పశ్చిమ దిశలో అట్లాంటిక్ తీరం వేపు తరలిపోయాయి.

దాదాపు ఒక శతాబ్దం పాటు అత్యంత లాభదాయకమైన తూర్పు వర్తకం యావత్తు పోర్చుగీసుల పిడికిట్లో బిగిసిపోయింది. భారతదేశంలో కొచ్చిన్, గోవా, డయ్యూ, డామన్‌లలో పోర్చుగల్ తన వ్యాపార స్థావరాల్ని నిర్మించుకుంది మొట్టమొదటి నుంచి పోర్చుగీసులు సైనిక బలప్రయోగాన్ని వ్యాపారంతో ముడివేశారు. ఈ సందర్భంలో వాళ్ళ సాయుధ నౌకల ఆధిక్యత బాగా తోడ్పడింది. వాళ్ళ సముద్రాధిపత్యానికి ఆ సాయుధ నౌకల బలమే సహాయపడింది. పట్టుమని పాతికమందయినా నిండాలేని పోర్చుగల్ సైనికులు, నావికులు అమేయశక్తి సంపన్నమైన భారత, ఆసియా రాజ్యాలకు వ్యతిరేకంగా సముద్రాధిపత్యం సాధించగలిగారంటే దానికి కారణం వారి సాయుధ నౌకా బలాధిక్యతేనని చెప్పాలి పైగా, భారతదేశంలో రాజుల మధ్య నిరంతరం రగిలే పరస్పర ప్రతిస్పర్థల్ని ఉపయోగించుకొని తమ స్థానాన్ని బలపర్చుకోవచ్చని పోర్చుగీసులు గ్రహించారు మలబారు కోస్తాలో వ్యాపార స్థావరాల్ని, కోటల్ని నిర్మించుకోవటం కోసం కాలికట్, కొచ్చిన్ రాజుల మధ్య సంఘర్షణలో వాళ్ళు వేలుపెట్టారు. అక్కడి నుంచి అరబ్బు నౌకల మీద దాడి చేసి ధ్వంసం చేశారు. వందలాది అరబ్బు వర్తకుల్ని, నావికుల్ని పాశవికంగా వధించారు. మొఘల్ చక్రవర్తుల్ని బెదిరించి అనేక వ్యాపార రాయితీలు సంపాదించుకోగలిగారు.

1510లో గోవాని స్వాధీనపర్చుకున్న అల్ఫాన్సో-డి-అల్ బుకర్క్ వైస్రాయిగా ఉన్న కాలంలో పోర్చుగీసులు పర్షియన్ సింధుశాఖలోని ఆర్మజ్ ద్వీపం మొదలుకొని బలయాలో మలక్కా దాకా యావత్తు ఆసియా కోస్తా మీద ఆధిపత్యం సంపాదించారు. ఇండొనేషియా సుగంధ ద్రవ్యద్వీపాల మీద సైతం ఆధిపత్యం వహించారు భారత తీర ప్రాంతాన్ని ఆక్రమించి, తన వ్యాపారాన్ని, వ్యాపార స్థావరాల్ని విస్తరింపజేసుకోటానికి, యూరోపియన్ ప్రత్యర్థుల నుంచి తమ గుత్త వ్యాపారాధిపత్యాన్ని సంరక్షించుకోటానికి పోర్చుగీసులు ఎడతెగకుండా యుద్ధాలు సాగించారు ఒదల్ని దోచుకోవడానికి కూడా వాళ్ళు విడియపడలేదు 19వ శతాబ్ది ప్రముఖ బ్రిటిష్ చరిత్రకారుడు జేమ్స్ మిల్ మాటల్లో "పోర్చుగీసులు వ్యాపారాన్ని ప్రధాన వృత్తిగా పెట్టుకున్నారు అయితే డచ్చి, ఇంగ్లీషు వాళ్ళ మాదిరిగా పోర్చుగీసులు కూడా పరిస్థితి అనుకూలించినప్పుడు దోపిడీకి తెగబడ్డానికి వెనుకంజ వెయ్యలేదు "

మత సంబంధమైన విషయాల్లో పోర్చుగీసులు మహా అసహనంగా దురావేశ పూరితంగా ప్రవర్తించారు ప్రజల్ని బలవంతంగా క్రైస్తవమతంలోకి మార్పించారు క్రైస్తవ మతంలోకి మారతారా, కత్తికెరజెయ్యమంటారా? అని ప్రజలకు వేరే గత్యంతరం లేకుండా చేశారు ఈ సందర్భంగా పోర్చుగీసుల వైఖరిని భారత ప్రజలు అసహ్యించుకున్నారు పైగా,మత సహనమన్నది ఒక నియమంగా రూపొందిన దేశం ఇది పోర్చుగీసులు అమానుష ఘాతుకాలకు, చట్టబాహ్యమైన అరాచక ప్రవర్తనకు ఒడిగట్టారు అంత దుర్భరంగా వ్యవహరించినా వాళ్ళ స్థావరాలు ఈ దేశంలో ఒక శతాబ్దం పాటు మనగలిగాయంటే దానికి కారణం వాళ్ళ సముద్రాధిపత్యం వాళ్ళ సైనికులు, అధికార్లు కఠిన క్రమశిక్షణ పాటించారు దక్షిణాది మొఘల్ అధిపత్యానికి పెడగా ఉండబట్టి వాళ్ళు మొఘల్ సామ్రాజ్య మహాశక్తిని ఎదుర్కోవలసి రాలేదు 1631లో బెంగాల్ మొఘల్ అధికారాన్ని ధిక్కరించి ఘర్షణకు దిగిన కారణంగా, పోర్చుగీసులకు హుగ్లీ స్థావరం నుంచి ఉద్వాసన జరిగింది ఇంగ్లీషు వాళ్ళ రాకతో అరేబియా సముద్రం మీద పోర్చుగీసుల అధిపత్యం సన్నగిల్లిపోయింది గుజరాత్‌లో వాళ్ళ పలుకుబడి దిగదుడుచుకుపోయింది

ఏది ఏమైనా, తూర్పుదేశాల్లో పోర్చుగల్ తన గుత్త వ్యాపారాధిపత్యాన్ని గానీ, తన పలుకుబడిలోని భూభాగాల్ని గానీ నిలుపుకోలేని అసమర్థురాలయింది పోర్చుగల్ జనాభా అంతా కలిపి పదిలక్షల లోపు పోర్చుగల్ నిరంకుశ రాజ్యం, చీడపట్టిన ప్రభుత్వ వ్యవస్థ పోర్చుగల్ వర్తకులకు తమ దేశంలో భూకామందులకు ఉన్నపాటి గౌరవ ప్రతిష్టలైనా లేవు నౌకాయాన అభివృద్ధిలో వెనుకబడిపోయింది మత విషయాలలో పరమ మూర్ఖ వైఖరి అవలంభించింది 15వ శతాబ్దంలోను, 16వ శతాబ్ది ప్రథమార్థంలోను ఇంగ్లీషువాళ్ళు, డచ్చివాళ్ళు, పోర్చుగీసు, స్పెయిన్లకన్నా ఎంతో వెనుకబడి ఉండేవారు 16వ శతాబ్ది ఉత్తరార్థంలో మొదట ఇంగ్లండ్, హాలెండులు ఆ తరువాత ఫ్రాన్సు వాణిజ్యంలో, నౌకాబలంలో శర వేగంతో పురోగమించి శక్తివంతంగా తయారై పోర్చుగల్, స్పెయిన్‌ల ప్రపంచ గుత్తవ్యాపారాధిపత్యానికి వ్యతిరేకంగా భీషణ పోరాటం సాగించాయి ఈ పోరాటంలో పోర్చగల్, స్పెయిన్‌లు తలకిందులయ్యాయి పోర్చుగల్ 1580లో స్పెయిన్‌కు లోబడిపోయి పరాధీన దేశమైంది 1588లో ఇంగ్లండ్ స్పానిష్ నౌకా బలాధిక్యత మీద శాశ్వతంగా చావు దెబ్బతీసింది దీంతో ఇంగ్లీషు, డచ్చి

వర్తకులు గుడ్‌హోప్ అగ్రం మీదుగా భారతదేశాన్ని చేరే వర్తక మార్గాన్ని ఉపయోగించుకోటానికి వీలు కలిగింది. ప్రాచ్య ప్రపంచంలో సామ్రాజ్యం స్థాపించుకోడానికి సాగే పందెంలో పాల్గొనే అవకాశం దొరికింది. చిట్ట చివరికి డచ్చివాళ్ళు ఇండోనేషియా పైనా, ఇంగ్లీషు వాళ్ళు ఇండియా, సిలోన్, మలయాలపైనా ఆధిపత్యం సాధించారు.

డచ్చివాళ్ళు బహుకాలంగా తూర్పుదేశాల సరుకుని పోర్చుగల్‌లో కొని ఉత్తర యూరప్ అంతటా అమ్మేవాళ్ళు. ఈ కార్యకలాపాల మూలంగా డచ్చివాళ్ళు విశిష్టమైన నౌకాల్ని, శాస్త్రీయ నౌకాయాన పద్ధతుల్ని, సమర్థవంతమైన వ్యాపార వ్యవస్థని, విధానాల్ని అభివృద్ధిపర్చుకున్నారు. తమ మాతృభూమి నెదర్లాండ్సు మీద స్పెయిన్ ఆధిపత్యానికి వ్యతిరేకంగా తిరుగుబాటు, స్పెయిన్‌తో పోర్చుగల్ విలీనం కారణంగా సుగంధ ద్రవ్యాల కోసం డచ్చివాళ్ళు ప్రత్యామ్నాయ వనర్లని వెతుక్కోవలసి వచ్చింది. 1595లో నాలుగు డచ్చి ఓడలు గుడ్‌హోప్ అగ్రం మీదుగా ఇండియాకు బైల్దేరాయి 1602లో డచ్చి తూర్పిండియా కంపెనీ అవతరించింది. డచ్చి పార్లమెంటు ఆ కంపెనీకి యుద్ధాలు సాగించటానికి, సంధులు కుదుర్చుకోటానికి, కొత్త భూభాగాలు సంపాదించటానికి, కోటలు కట్టటానికి అధికారం ప్రసాదించింది

డచ్చి వాళ్ళకు భారతదేశం మీద దృష్టి లేదు. సుగంధ ద్రవ్యాలు ఉత్పత్తి అయ్యే ఇండోనేషియా దీవుల మీద వాళ్ళు ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. వెంటనే పోర్చుగీసుల్ని మలయా, ఇండోనేషియా దీవుల నుంచి తరిమివేశారు. ఇండోనేషియా దీవుల్లో స్థావరాలు స్థాపించుకుని స్థిరపడిపోవటానికి ఉద్యుక్తులైన ఇంగ్లీషువాళ్ళని 1623లో ఓడించారు. ఆ కాలంలో డచ్చివాళ్ళు ఆసియా వ్యాపారంలో అతి ముఖ్యమైన లాభదాయిక ప్రాంతాన్ని విజయవంతంగా స్వాధీనం చేసుకున్నట్లు తోస్తుంది. అయినా, వాళ్ళు భారత దేశంతో వ్యాపారాన్ని పూర్తిగా విడిచిపెట్టుకోలేదు. గుజరాత్‌లో సూరత్, బ్రోచ్, కాంబే, అహమ్మదాబాద్ నగరాల్లోను, కేరళలో కొచ్చిన్‌లోను, తమిళనాడులో నాగపట్నంలోను, ఆంధ్రలో మచిలీపట్నంలోను, బెంగాల్‌లో చిన్‌సురాలోను, బీహార్‌లో పాట్నాలోను, ఉత్తరప్రదేశ్‌లో ఆగ్రాలోను వాళ్ళు తమ డిపోలను తెరిచారు. 1658లో పోర్చుగీసుల నుంచి సింహళాన్ని స్వాధీనం చేసుకున్నారు. భారతదేశం నుండి నీలిమందు, ముడిపట్టు, నేతబట్టలు, సురేకారం, నల్లమందు ఎగుమతి చేశారు. వీళ్ళుకూడా పోర్చుగీసుల మాదిరి భారత ప్రజల పట్ల క్రూరంగా ప్రవర్తించారు, భారతీయుల్ని నిర్దాక్షిణ్యంగా దోచారు.


ఇంగ్లీషు వర్తకులకి కూడా ఆసియా వ్యాపారాన్ని చూసేసరికి కక్కుర్తి పుట్టింది. పోర్చుగీసుల విజయం, వాళ్ళు ఓడల నిండా నింపుకొచ్చిన సుగంధ ద్రవ్యాలు, తెల్లని నూలుబట్టలు, పట్టు, బంగారం, ముత్యాలు, ఓషధులు, పింగాణీ సామగ్రి, నల్లచేవమాను వగైరాలు, వాళ్ళు ఆర్జించిన అపరిమిత లాభాలు ఇంగ్లీషు వర్తకుల్లో ఉజ్వలమైన ఆశలు రేకెత్తించాయి అటువంటి అద్భుత లాభసాటి వ్యాపారంలో ఎప్పుడు పాలుపంచుకుందామా అని వాళ్ళు తహతహలాడిపోయారు. కాని, 16వ శతాబ్దాంతం దాకా పోర్చుగల్, స్పెయిన్‌ల నౌకా బలాన్ని ఎదుర్కొనే శక్తి ఇంగ్లీషు వాళ్ళకి లేదు పోర్చుగల్, స్పెయిన్‌ల ధాటి ముందు ఇంగ్లండ్ చాలా బలహీనంగా ఉన్న కాలం అది. దాదాపు 50 సంవత్సరాల పాటు భారతదేశానికి ప్రత్యామ్నాయ వర్తక మార్గం

కనిపెట్టాలని విఫలయత్నం చేశారు ఈలోగా వాళ్ళు కొంత శక్తి పుంజుకున్నారు 1579లో డ్రేక్ సముద్రాయానం చేసి ప్రపంచాన్ని చుట్టి వచ్చాడు 1588 స్పానిష్ నౌకాబలం ఇంగ్లీషు వాళ్ళ చేతుల్లో చిత్తుగా ఓడిపోవటంతో తూర్పు దేశాల్లో ప్రవేశించటానికి ఇంగ్లండుకు దేవ దొరికింది.

వర్తకయోధులని పేరు పెట్టుకున్న ఒక వర్తక బృదం 1599లో సంస్థగా లేదా కంపెనీగా ఏర్పడింది 1600 డిశంబర్ 31న ఎలిజబెత్ మహారాణి ఆ కంపెనీకి తూర్పు దేశాలతో వర్తకం చేసుకోటానికి గుత్తాధికారం ఇస్తూ అధికార పత్రాన్ని జారీ చేసింది ఆ సంస్థే ఇంగ్లీషు తూర్పిండియా కంపెనీగా ప్రసిద్ధి పొందింది ఆ సంస్థ మొట్టమొదటి నుండి బ్రిటిష్ రాజరికంతో ముడిపడి వుంది ఎలిజబెత్ మహారాణి ఇంగ్లీషు తూర్పిండియా కంపెనీలో ఒక వాటాదారు

ఇంగ్లీషు తూర్పిండియా కంపెనీ నౌకలు మొట్టమొదట 1601లో ఇండొనేషియా సుగంధ ద్రవ్య ద్వీపాలకు తెరచాపలెత్తాయి ఆ తరువాత 1608లో భారత పశ్చిమ తీరంలో సూరత్ వద్ద ఫ్యాక్టరీ (వ్యాపార డిపొని ఫ్యాక్టరీ అని అనాడు.అనేవాళ్ళు) పెట్టాలని నిర్ణయమైంది చక్రవర్తి అనుగ్రహం పొందటానికి క్యాప్టెన్ హాకిన్స్ జహంగీర్ దర్బారు సందర్శించాడు మొదట, క్యాప్టెన్ హాకిన్స్‌కు దర్బారులో ఉచిత మర్యాదలన్నీ జరిగాయి మన్‌సబ్‌హోదాతో పాటు జాగీరు కూడా ప్రసాదించబడింది. కాని పోర్చుగీసుల కుతంత్రాల వల్ల చక్రవర్తి క్యాప్టెన్ హాకిన్స్‌ను ఆగ్రా నుండి బహిష్కరించాడు దాంతో మొఘల్ ప్రభుత్వం నుంచి రాయితీలు రాబట్టటం సాధ్యం కాదని ఇంగ్లీషు వాళ్ళకి అర్థమైపోయింది 1612లో ఒకసారి, ఆ తరువాత మళ్ళీ 1614 లోను ఇంగ్లీషు వాళ్ళు సూరత్ సమీపంలో పోర్చుగీసు నౌకాదళాన్ని ఓడించారు. సముద్రజలాల్లో పోర్చుగీసుల బలాన్ని తిప్పికొట్టటానికి ఇంగ్లీషు వాళ్ళని ఉపయోగించుకోవచ్చుననే భావం మొఘలులకు కలగటానికి ఇంగ్లీషువారి ఈ విజయాలు దోహదం చేశాయి పై పెచ్చు, విదేశీ కొనుగోలు దార్ల మధ్యపోటీ భారతీయ వర్తకులకు తప్పకుండా లాభిస్తుందనే భావం కూడా ఉంది పర్యవసానంగా, ఇంగ్లీషు తూర్పిండియా కంపెనీ పడమటి కోస్తాలో అనేక చోట్ల డిపోలు తెరవటానికి ప్రభుత్వ ఫర్మానా లభించింది

ఈ ఫర్మానాతో ఇంగ్లీషు వాళ్ళు తృప్తిపడలేదు 1615లో ఇంగ్లండ్ రాయబారి సర్‌థామస్‌రో మొఘల్ దర్బారు సందర్శించాడు నౌకా బలంలో భారతదేశ బలహీనతను ఆసరాగా తీసుకొని, ఎర్ర సముద్రానికి, మక్కాకు పయనించే భారత నౌకల్ని వేధించుకుతింటూ ఇంగ్లీషువాళ్ళు మొఘల్ అధికారుల మీద అనేక విధాల ఒత్తిడులు తెచ్చారు అభ్యర్థనలు, బెదిరింపులు కలగలిపి, మొఘల్ సామ్రాజ్యంలో ఎక్కడైనా ఇంగ్లీషు తూర్పిండియా కంపెనీ తమ సరకుల డిపోలను నెలకొల్పుకోడానికి సర్‌థామస్‌రో చక్రవర్తిచేత ఫర్మానాను జారీ చేయించుకోగలిగాడు. రో సాధించిన ఈ విజయంతో పోర్చుగీసులకు కడుపు మండిపోయింది పోర్చుగీసులకు - ఇంగ్లీషువాళ్ళకు మధ్య 1620లో భీషణ యుద్ధం ప్రారంభమైంది. 1630 నాటికి ఉభయుల మధ్య శతృత్వం సమసిపోయింది ఇంగ్లండ్‌రాజు రెండవ ఛార్లెస్ పోర్చుగల్ రాకుమారిని వివాహం చేసుకున్న కారణంగా, 1662లో పోర్చుగీసులు బొంబాయి దీవిని చార్లెస్ రాజుకు కట్నంగా ఇచ్చివేశారు. కట్టకడపటికి, పోర్చుగీసులు భారతదేశంలో



1668లో హుగ్లీ నది తీరంలో యూరోపియన్లు నిర్మించిన వ్యాపార కేంద్రం-అందులోని ఆఫీసులు, ఇళ్ళు, తోటలు ముందున్నది డచ్ దేశీయులది. ప్రవాహానికి పైనున్నది 1690 లో ఆంగ్లేయులు స్థాపించింది. అదే, కాలక్రమంలో కలకత్తాగా మారింది.

గోవా, దయ్యూ, డామన్‌లను మినహాయించి తక్కిన స్థావరాలన్నిటిని పోగొట్టుకున్నారు. పోర్చుగీసుల పతనం డచ్చివాళ్ళకు, ఇంగ్లీషువాళ్ళకు, మహారాష్ట్రులకు లాభించింది. మహారాష్ట్రులు 1739లో పోర్చుగీసు వ్యాపార స్థావరాలైన సాల్సెట్టీ, బేసిన్‌లను ఆక్రమించుకున్నారు.

ఇండొనేషియా దీవుల్లో సుగంధ ద్రవ్యాల వ్యాపారాన్ని పంచుకోవటం మీద ఇంగ్లీషు వాళ్ళకి, డచ్చి వాళ్ళకి మధ్య సంబంధాలు చెడిపోయాయి. కొనకు, డచ్చివాళ్ళు ఇంగ్లీషువాళ్ళని సుగంధ ద్రవ్యాల ద్వీపాల నుంచి తరిమివేశారు. దాంతో ఇంగ్లీషువాళ్ళు ఇండియా మీద తమ దృష్టి కేంద్రీకరించారు. భారతదేశంలో పరిస్థితులు వాళ్ళకు అనుకూలంగా తోచాయి. ఇంగ్లీషు-డచ్చివాళ్ళ మధ్య 1654లో ప్రారంభమై 1667 వరకు ఎడతెగకుండా సాగిన యుద్ధం చివరకి ముగిసిపోయి ఇంగ్లీషువాళ్ళు ఇండొనేషియా దీవుల మీద తమ వ్యాపార హక్కు వదులుకున్నారు. భారతదేశంలో ఇంగ్లీషు వారి వ్యాపార స్థావరాల జోలికి రాకుండా వుండటానికి డచ్చివాళ్ళు ఒప్పుకున్నారు. అయినా కూడా డచ్చివాళ్లను భారతదేశం నుంచి పూర్తిగా తరిమి వేసే దాకా ఇంగ్లీషు వాళ్ళు నిద్రపోలేదు. 1795లో డచ్చివాళ్ళను వాళ్ళ ఆఖరి స్థావరాల నుండి ఇంగ్లీషు వాళ్ళు వెళ్లగొట్టగలిగారు.

***తూర్పిండియా కంపెనీ వ్యాపారం, పలుకుబడుల అభివృద్ధి – 1600–1744:*** ఇంగ్లీషు తూర్పిండియా కంపెనీ ఇండియాలో మొట్టమొదట చాలా చిన్న ఎత్తున ప్రారంభమైంది. 1687 వరకు కంపెనీ వ్యాపారం అంతటికీ సూరత్ ఒక్కటే కేంద్ర స్థానంగా ఉండేది. మొదట చాలా కాలం ఇంగ్లీషు వర్తకులు మొఘల్ అధికార్ల ముందు అర్జీదార్లుగా మిగిలిపోయారు. మొఘల్ చక్రవర్తి దయవల్ల 1623 నాటికి వాళ్ళు సూరత్, బ్రోచ్, అహమ్మదాబాద్, ఆగ్రా, మచిలీపట్నాలలో తమ సరుకుల డిపోలు తెరిచారు. అయితే, మొట్టమొదటి నుంచీ కూడా ఇంగ్లీషు వర్తక సంస్థ తన వ్యాపారాన్నీ, రాజకీయ చతురతనీ యుద్ధంతో, భూభాగాక్రమణతో జతపర్చింది. నిజానికి, 1619 లోనే, సర్‌థామస్‌రో ఇంగ్లీషు అధికార్లకి ఒక సలహా చెప్పాడు. భవిష్యత్తులో భారతదేశంతో బ్రిటిష్ సంబంధాలు రూపుదిద్దుకోవలసిన నమూనాకు ఆయన సలహా ప్రాతిపదిక వేసింది. ఆ సలహా యేమిటో ఆయన మాటల్లోనే విందాం: "ఒక చేత ఖడ్గం, మరొక చేత రాజదూత దండం పట్టుకుని ఈ ప్రజల్ని బుద్ధిగా ఉంచవచ్చని నాకు తెలుసు. ఈ విషయంలో నేను మీకు హామీ ఇస్తున్నాను" అని రాశాడు సర్‌థామస్ రో. "మనం ఏ ఆధారం నమ్ముకుని పని ప్రారంభించామో, ఏ ఆధారంతో మనం మనగల్గుదుమో దాని మీదనే ఇంగ్లీషు వాళ్ళు ఆధారపడాలి' అన్నాడాయన. దాని పేరే "భయం." తామంటే భయమనేది ఉంటేనే నెగ్గుకు రాగలమని ఆయన భావం.

1625 లో కంపెనీ అధికార్లు సూరత్‌లో తమ ఫ్యాక్టరీ చుట్టూ కోట కట్టుకోవాలని ప్రయత్నం చేశారు. మొఘల్ సామ్రాజ్యంలోని స్థానిక అధికార్లు తక్షణం కంపెనీ ముఖ్య అధికార్లకు సంకెళ్ళు వేసి కారాగారంలో పారేశారు. అప్పటికింకా మొఘల్ తేజం వెలుగుతూనే ఉంది. అట్లాగే, వాళ్ళు మొఘల్ నౌకల మీద దారి దోపిడీకి తెగించినప్పుడు దానికి ప్రతీకారంగా మొఘల్ అధికార్లు కంపెనీ అధ్యక్షుణ్ణీ, ఆయన కౌన్సిల్ సభ్యుల్నీ వెంటనే జైల్లో వేశారు. 18,000 పౌన్లు జరిమానాగా చెల్లించాక ఆ పెద్దలు విడుదలయ్యారు.

ఇంగ్లీషువాళ్ళకి దక్షిణాదిన పరిస్థితులు అనుకూలంగా కనిపించాయి. ఎంచేతనంటే అక్కడ శక్తివంతమైన స్వదేశీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవలసిన ఇబ్బంది లేదు. 1565 లో విజయనగర మహా సామ్రాజ్యం అస్తమించింది. దాని స్థానంలో అనేక చిల్లర మల్లర దుర్బల రాజ్యాలు అవతరించాయి. వాళ్ళని ప్రలోభపెట్టటంగానీ, ఆయుధ బలంతో హడలగొట్టడం గానీ తేలిక. ఇంగ్లీషు వాళ్ళు దక్షిణాదిన తమ మొట్ట మొదటి ఫ్యాక్టరీని 1611లో మచిలీపట్నంలో ప్రారంభించారు. అక్కడ నుంచి తమ కార్యకలాపాల్ని వేగం మద్రాసుకు మార్చారు. 1639 లో మద్రాసును చంద్రగిరి రాజా వద్ద నుంచి గుత్తకు తీసుకున్నారు. ఆనాడు మద్రాసు తూర్పు కోస్తాప్రాంతంలో ఒక పేలిక పాడవు ఆరుమైళ్ళు, వెడల్పు ఒక్కమైలు. ఇంగ్లీషువాళ్ళు అక్కడ కోట కట్టుకోటానికి, పరిపాలన జరుపుకోటానికి, ఒడరేవు మీద సుంకాల ద్వారా వచ్చే రాబడిలో సగ భాగం తనకు చెల్లించే షరతు మీద నాణాలు ముద్రించుకోటానికి చంద్రగిరి రాజు సర్వాధికారాలు ఇచ్చాడు. ఇక్కడే తమ ఫ్యాక్టరీ చుట్టూ వాళ్ళు ఒక చిన్న కోట కట్టుకున్నారు. అదే సెయింట్ జార్జి ఫోర్టు

17 వ శతాబ్దం ముగిసే నాటికి, ఇంగ్లీషు కంపెనీ మద్రాసు మీద సార్వభౌమాధికార హక్కు కోరింది. ఆ హక్కు సాధించుకోడం కోసం యుద్ధానికి తలపడ్డానికైనా సంసిద్ధంగా

వుంది విచిత్రమేమంటే లాభాలు చేసుకోటానికని వచ్చిన ఈ వర్తక సంస్థ భారతదేశాన్ని జయించి, అందుకుగాను భారతీయుల దగ్గరే డబ్బు వసూలు చేసుకోటానికి మొట్టమొదటి నుంచీ పట్టుదలతో ఉంది అంటే, భారతీయులు తమ మాతృదేశాన్ని కంపెనీ వాళ్ళు జయించినందుకు గాను వాళ్ళకు డబ్బు చెల్లించుకోవాలన్న మాట! ఉదాహరణకు వాటాదారులంతా కలసి ఏర్పర్చ "కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్" తమ కింది మద్రాసు అధికార్లకు 1683లో ఇలా రాశారు:

"అంచెలంచెలుగా మన కోటనీ, మన పట్నాన్నీ ఏ భారతీయ ప్రభువుగాని, లేదా డచ్చి కంపెనీ గాని దాడి చెయ్య శక్యం కానంతగా మీరు కట్టుదిట్టం చెయ్యాలి. మంచిగా మీరు మన వ్యాపారం కొనసాగిస్తూ మరమ్మత్తులకు, రక్షణ ఏర్పాట్లకు అవసరమైన డబ్బును పట్టణ పౌరులచేతనే పెట్టించాలి ."

తూర్పిండియా కంపెనీ 1668లో పోర్చుగీసుల నుంచి బొంబాయి ద్వీపాన్ని సంపాయించి, తక్షణం రక్షణ ఏర్పాట్లు పూర్తి చేసింది ఇంగ్లీషు వాళ్ళకి బొంబాయిలో తేలికగా రక్షించుకోగల ఒక విశాలమైన కోట దొరికింది అందువల్లా, ఇంకా అప్పుడే పైకి వస్తున్న మహారాష్ట్రులు వాళ్ళ వ్యాపారానికి ముప్పు తెచ్చిపెడుతున్నందువల్లా ఇంగ్లీషు వాళ్ళు పశ్చిమ కోస్తాలో సూరత్‌కు బదులుగా బొంబాయిని తమ ప్రధాన కార్యస్థానంగా చేసుకున్నారు

ఇక, తూర్పు భారత ప్రాంతంలో ఇంగ్లీషువాళ్ళు 1633లో ఒరిస్సాలో తమ మొట్టమొదటి ఫ్యాక్టరీలు స్థాపించుకున్నారు అక్కడ నుంచి బెంగాల్‌లోని హుగ్లీ వద్ద వ్యాపారం నడుపుకోటానికి 1651లో అనుమతి లభించింది వెనువెంటనే పాట్నా, బాలాసోర్, ఢాకా, ఇంకా బెంగాల్ బీహార్లలో మరి కొన్ని చోట్లా ఫ్యాక్టరీలు ప్రారంభించారు. బెంగాల్లో కూడా తమకొక స్వతంత్ర వ్యాపార స్థావరం కావాలని ఇంగ్లీషు వాళ్ళకి కోరిక పుట్టింది అట్టే కష్టపడకుండా వ్యాపారంలో కలిసి రావటం వల్ల, మద్రాసు, బొంబాయిలలో స్వతంత్ర, రక్షిత స్థావరాల్ని స్థాపించుకోవటం వల్ల, మొఘల్ చక్రవర్తి ఔరంగజేబ్ మహారాష్ట్ర దండయాత్రల్లో తలమునకలై ఉండటం వల్లా ఇంగ్లీషు వాళ్ళు అణుకువ ప్రదర్శించే తమ అర్జీదారు పాత్రని వదిలేశారు భారతదేశంలో రాజకీయాధికారాన్ని స్థాపించుకోవాలని కలలు కన్నారు రాజకీయాధికారం ద్వారా మొఘలుల మెడలు వంచి ఇష్టానుసారంగా వ్యాపారం నడుపుకోడానికి వీలవుతుంది చౌకగా అమ్మి ప్రియంగా కొనుక్కునేలా స్థానికుల్ని బలవంతపెట్టవచ్చు. వ్యాపారంలో పోటీకి దిగిన యూరప్ ప్రత్యర్థుల్ని బైటికి గెంటివేయవచ్చు స్వదేశ రాజుల రాజ్యవిధానాల్ని ఖాతరు చెయ్యకుండా తమ వ్యాపారాన్ని సర్వస్వతంత్రం చేసుకోవచ్చు వీటన్నిటితో పాటు, రాజకీయాధికారం ద్వారా భారతదేశం ఆదాయాన్ని స్వంతం చేసుకుని ఆ ఆదాయ వనరులతోనే దేశం మొత్తాన్ని జయించటం కూడా సాధ్యమవుతుంది అనాడు ఇంగ్లీషు వాళ్ళు అటువంటి పథకాల్ని దాపరికం లేకుండా బైటపెట్టారు బొంబాయి గవర్నరు లండన్‌లోని కోర్టు డైరెక్టర్లకి రాస్తూ , "చేతకత్తి పుచ్చుకొని మీ సాధారణ వాణిజ్యాన్ని నిర్వహించుకోవలసిన సమయం వచ్చింది" అని తేల్చి చెప్పాడు

భారతదేశంలో శాశ్వతమైన ఒక సువిశాల, సుదృఢ, సురక్షిత ఆంగ్ల అధీన రాజ్యానికి పునాదిగా ఉండేటట్లు పౌర, సైనిక ప్రభుత్వ విధానాలు రూపొందించుకొని,

రెంటినీ పోషించటానికి అవసరమైన భారీ ఆదాయ వనర్లని సృష్టించుకొని, ఫలితం రాబట్టుకొమ్మని కంపెనీ డైరెక్టర్లు 1687 లో మద్రాసు గవర్నరుకు సలహా యిచ్చారు

"మాకు మా వ్యాపారం ఎట్లాగో, ఆదాయంలో పెరుగుదల కూడా మా బాధ్యతకు లోబడిన విషయమే నూటొక్క దుస్సంఘటనలు వాటిల్లి మా వ్యాపారానికి విఘాతము సంభవించినప్పుడు మా సైనిక బలాన్ని మేం దాంతో నిలబెట్టుకోవాలి అదే మమ్మల్ని భారతదేశంలో ఒక జాతిగా రూపొందించాలి" అని 1689లో కంపెనీ డైరెక్టర్లు ప్రకటించారు

1686లో ఇంగ్లీషు వాళ్ళకి, మొఘల్ చక్రవర్తికి మధ్య శత్రుత్వం భగ్గుమన్నది. ఇంగ్లీషు వాళ్ళు హుగ్లీని కొల్లగొట్టి, చక్రవర్తి మీద యుద్ధం ప్రకటించటంతో ఈ ఉభయుల మధ్య శత్రుత్వపు సెగలు రేగాయి వాళ్ళు పరిస్థితిని తప్పుగా అర్థం చేసుకుని, మొఘల్ బలాన్ని తక్కువ అంచనా కట్టారు. ఔరంగజేబ్ మొఘల్ సామ్రాజ్యం ముందు తూర్పిండియా కంపెనీ బలగం బ్రహ్మాస్త్రం బారిపడ్డ పిచ్చుక గుంపు ఆ యుద్ధం ఇంగ్లీషు వాళ్ళని విధ్వంసం చేసింది మొఘలు ఇంగ్లీషు వాళ్లని బెంగాల్‌లో వాళ్ళ ఫ్యాక్టరీల నుంచి తరిమికొట్టారు వాళ్ళు గంగా ముఖద్వారంలో రోగాల పుట్టగా మారిన ఒక దీవిలో తలదాచుకోవలసి వచ్చింది సూరత్, మచిలీపట్నం, విశాఖపట్నాలలోని ఇంగ్లీషు ఫ్యాక్టరీల్ని మొఘలులు ఆక్రమించుకున్నారు బొంబాయి కోటని ముట్టడించారు. మొఘల్ శక్తి ఎదుర్కోగలిగే పాటి సత్తా తమకింకా రాలేదని వాళ్ళు అప్పటికి గ్రహించారు మళ్ళీ అర్జీదార్ల అవతారమెత్తారు తాము చేసిన నేరాలను క్షమించమని చేతులు జోడించారు స్వదేశ రాజుల రక్షణ కింద తాము మళ్ళీ వ్యాపారం ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పుకున్నారు స్పష్టంగా వాళ్ళు గుణపాఠం నేర్చుకున్నారు మొఘల్ చక్రవర్తి నుంచి వ్యాపార రాయితీలు పొందటానికి మళ్ళీ వెనకటి నాటకం మొదలు పెట్టారు మొఘల్ చక్రవర్తి ఉబ్బిపోయేటట్లు తీపి మాటలు చెప్పారు అతి వినయం నటించి వేడుకున్నారు

మొఘల్ అధికార్లు ఇంగ్లీషు వాళ్ళ తప్పుని అప్పటికప్పుడు క్షమించేశారు. పైకి అమాయకంగా, నిరపాయకారంగా కనిపించే ఈ విదేశ వర్తకులు ఒకనాడు దేశానికి పెద్ద పీడగా తయారవుతారని తెలుసుకునే అవకాశం వాళ్ళకి లేదు. పైగా, కంపెనీవాళ్ళు విదేశ వాణిజ్యం వల్ల ఇక్కడ వృత్తి పనుల వాళ్ళు, వ్యాపారస్థులు లాభం పొందుతారు గదా అనుకున్నారు. తద్వారా ఖజానా క్కూడా లాభం కలిసొస్తుందని భావించారు. ఇంగ్లీషు వాళ్ళు పదాతిబలంలో బలహీనంగా ఉన్నప్పటికీ, నౌకాబలంలో దిట్టంగా ఆరితేరి ఉన్నారు కాబట్టి ఇరాన్, పశ్చిమాసియా, ఉత్తర, తూర్పు ఆఫ్రికా, తూర్పు ఆసియా వగైరా విదేశ సీమలతో సాగుతున్న భారత వ్యాపార వాణిజ్యాల్ని, నౌకల్ని, పూర్తిగా ధ్వంసం చెయ్యగల శక్తి సామర్థ్యాలు ఇంగ్లీషు వాళ్ళకున్నాయి. ఈ కారణంగా, వాళ్ళు తిరిగి వ్యాపారాన్ని ఆరంభించుకోటానికి ఔరంగజేబ్ అనుమతి దయ చేశాడు. నష్టపరిహారం కింద లక్షా యాభైవేల రూపాయలు వాళ్ళ చేత కక్కించాడు. 1691లో బెంగాల్లో వాళ్ళకి వాణిజ్య సుంకాల నుంచి మినహాయింపు లభించింది. ఆ రాయితీకి ప్రతిఫలంగా వాళ్ళు ఏటా 3,000 రూపాయలు మొఘల్ ప్రభుత్వానికి కట్టటానికి ఒప్పుకున్నారు 1698లో సుతానతి, కలికతా, గోవింద్ పూర్ అనే మూడు గ్రామాల మీద కంపెనీ జమీందారీ హక్కు సంపాయించింది ఆ జమీలోనే వాళ్ళు ఫోర్ట్ విలియం

కట్టుకున్నారు. ఆ మూడు గ్రామాలు క్రమేణా పెరిగి మహాపట్టణం అయ్యాయి అదే నేటి కలకత్తా మహానగరం.

కడపటి మొఘల్ చక్రవర్తులలో ఒకరైన ఫరూక్ సియార్ 1717లో ఇంగ్లీషు కంపెనీకి ఒక ఫర్మానా జారీ చేశాడు. 1691లో ఇంగ్లీషు వాళ్ళకి ప్రసాదించబడ్డ ప్రత్యేక హక్కుల్ని ఈ ఫర్మానా ఖాయపర్చింది. ఆ ప్రత్యేక హక్కుల్ని గుజరాత్, దక్కన్‌లకు పొడిగించింది. అయితే 18వ శతాబ్ది ప్రథమార్ధంలో బెంగాల్‌ని ముర్షిద్ కులీఖాన్, అలివర్దీఖాన్ వంటి మహా బలవంతులైన నవాబులు పరిపాలించారు. ఆ ఇద్దరూ ఇంగ్లీషువాళ్ళని గట్టి అదుపులో పెట్టారు. వాళ్ళని తమ ఫ్యాక్టరీ చుట్టూ రక్షణ కట్టుదిట్టాలు ఎక్కువ చేసుకోవటానికి నవాబులు అనుమతించలేదు. అట్లాగే, కలకత్తా నగరాన్ని ఇంగ్లీషు వాళ్ళు స్వతంత్రంగా పరిపాలించటానికి కూడా అనుమతించ లేదు. ఈ ఒక్క చోట మాత్రం ఇంగ్లీషు వాళ్ళు నవాబు కింద కేవలం జమీందార్లుగా వున్నారు.

రాజ్యాధికారం గురించి కంపెనీ వాళ్ళ ఆశలు తలకిందులైనా, వాణిజ్యం కనీవినీ ఎరగనంతగా పెరిగిపోయింది. 1708లో ఇండియా నుండి ఇంగ్లండ్ చేరిన దిగుమతుల విలువ 5,00,000 పౌండ్లు అది 1740 నాటికి 17,95,000 పౌండ్లకి పెరిగింది ఇంగ్లండు విధించిన అనేక విధి, నిషేధాల్ని తట్టుకొని కూడా రికార్డు స్థాయిలో ఇండియా ఉత్పత్తులు ఇంగ్లండును ముంచెత్తాయి స్వదేశంలో బట్టల పరిశ్రమని బ్రతికించు కోవటానికి ఇంగ్లండ్ మన నేత, పట్టు వస్త్రాల వాడకాన్ని నిషేధించింది ఇంగ్లండ్ నుండి ఇండియాకు వెండిని పోనివ్వకుండా నిరోధించింది అయినా కూడా, 1740లో అంతటి బ్రహ్మాండమైన పెరుగుదల రికార్డయింది ఒకవేపు, ఇంగ్లీషు వాళ్ళు ఇండియాలో స్వేచ్ఛా వాణిజ్యం కోసం గోలపెడుతూ, మరోవేపు వాళ్ళ దేశంలో వ్యాపార స్వేచ్ఛమీద నిర్బంధాలు విధించారు. ఇండియాలో తయారైన కొన్ని వస్తువుల్ని ఇంగ్లండ్‌లో ప్రవేశించనివ్వ లేదు

మద్రాసు, బొంబాయి, కలకత్తాలలోని బ్రిటిష్ స్థావరాలు అవి మహానగరాలుగా వర్ధిల్లటానికి బీజం వేశాయి. వర్తకులు, బ్యాంకర్లు అసంఖ్యాకంగా ఈ నగరాల వేపు ఆకర్షితులయ్యారు అక్కడ నూతన వాణిజ్యావకాశాలు పుష్కలంగా అందుబాటు కావటం దానికి కొంత కారణం. మొఘల్ సామ్రాజ్య పతనం తరువాత వేరే చోట్ల అస్థిమిత పరిస్థితులు, భద్రతా రాహిత్యం నెలకొనటం వల్ల కూడా అంత ఎక్కువ మంది ఈ నగరాలకు ఎగబడ్డారు 18వ శతాబ్ది నడిమి కాలం నాటికి మద్రాసు జనాభా 3 లక్షలకు, కలకత్తా జనాభా 2 లక్షలకు, బొంబాయి జనాభా 70 వేలకు పెరిగింది. ఈ మూడు నగరాల్లోనూ బలిష్ఠమైన కోటలతో కూడిన పటిష్ఠమైన బ్రిటిషు స్థావరాలు ఉన్నాయి. నౌకాయానానికి అనువుగా ప్రక్కన సముద్రం ఉంది. సముద్రం మీద వాళ్ళని సవాలు చెయ్యగలవాళ్ళు లేరు. కాబట్టి, ఎప్పుడైనా ఏ భారతీయ రాజులతో నైనా సంఘర్షణ గనుక ప్రజ్వరిల్లితే, ఇంగ్లీషు వాళ్ళు ఈ నగరాల్ని వదిలిపెట్టి తుర్రున సముద్రంలోకి తప్పించుకు పోవచ్చు. దేశంలోని రాజకీయ కల్లోల పరిస్థితుల్ని తమకి అనుకూలంగా తిప్పుకునే సదవకాశం కలిసి వచ్చిన రోజున ఇంగ్లీషు వాళ్ళు భారతదేశాన్ని జయించటానికి వ్యూహాత్మక ప్రాముఖ్యం కలిగిన ఈ నగరాల్ని సాగుడు పలకలుగా ఉపయోగించుకోవచ్చు.

***కంపెనీ అంతర్ నిర్మాణం :*** 1600లో ఎలిజబెత్ రాణి ప్రసాదించిన రాయల్ చార్టరు (అధికార పత్రం) ప్రకారం గుడ్‌హోప్ అగ్రానికి తూర్పు భాగం మొత్తంలో వ్యాపారం చేసుకోవటానికి తూర్పిండియా కంపెనీకి గుత్త హక్కు లభించింది వర్తకులంతా కలిసి ఏర్పర్చ సంస్థ సర్వ సభ్యమండలి ఒక గవర్నరు, ఒక డిప్యూటీ గవర్నరు, 24గురు సభ్యులతో కూడిన ఒక కమిటీని ఎన్నుకునే నిబంధనని సైతం ఆ చార్టరు ప్రవేశపెట్టింది ఈ కంపెనీయే తరువాత 'కోర్ట్ ఆఫ్ డైరెక్టర్లు"గా వ్యవహరించబడింది ఆ కమిటీ సభ్యులంతా "డైరెక్టర్లు "

తూర్పిండియా కంపెనీ వెనువెంటనే ఇంగ్లండులో అత్యంత ముఖ్యమైన వర్తక సంస్థగా అభివృద్ధి చెందింది 1601-1612 సంవత్సరాల మధ్య కంపెనీ లాభం రేటు ఏటా రమారమి ఇరవై శాతానికి పెరిగింది ఈ లాభాలు కేవలం ఒక్క వ్యాపారం ద్వారా మాత్రమే కాకుండా ఓడల దోపిడీలవల్ల కూడా చేకూరాయి ఆ రోజుల్లో వ్యాపారాన్ని, దారిదోపిడీని వేరుగా ఎడదీసే కచ్చితమైన గీతంటూ లేదు. అవి రెండూ కలగలిసే ఉండేవి 1612లో కంపెనీ తను పెట్టిన 2 00 000 పౌండ్ల పెట్టుబడి మీద 10 లక్షల పౌండ్ల లాభం తీసింది. 17వ శతాబ్దం పొడుగునా లాభశాతం చాలా హెచ్చుగా ఉంది

తూర్పిండియా కంపెనీ ఒక గుత్త వ్యాపార సంస్థ ఆ సంస్థలో సభ్యుడు కాని వాడెవడూ తూర్పు దేశాలతో వ్యాపారం చేసే వీలు లేదు కంపెనీ లాభాల్లో భాగం పొందే హక్కు అంతకన్నా లేదు అయితే మొట్టమొదటి నుంచీ ఇంగ్లీషు పారిశ్రామికులు, కంపెనీలో చోటు దొరకని వర్తకులు తూర్పిండియా కంపెనీ లాంటి ప్రభుత్వ గుత్త సంస్థలకి వ్యతిరేకంగా దుమారం లేపుతూనే ఉన్నారు కాని, ఇంగ్లండ్ రాజు అండదండలు ఇటువంటి పెద్ద పెద్ద సంస్థల వేపునే ఉన్నాయి ఈ సంస్థలు రాజులకు, పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులకు భారీ ఎత్తున లంచాలు గుప్పించాయి. 1609 లగాయతు 1676 వరకు ఇంగ్లండు రాజు రెండవ ఛార్లెస్‌కు కంపెనీ లక్షా డెబ్బయి వేల పౌండ్లు అప్పు పెట్టింది అందుకు ప్రతిఫలంగా ఆయన కంపెనీ గుత్త హక్కుల్ని ఖాయపరుస్తూ కోటలు కట్టుకోటానికి, సైన్యం ఏర్పాటు చేసుకోటానికి, యుద్ధాలు ప్రకటించటానికి, శాంతి సంధులు కుదుర్చుకోటానికి, బ్రిటిషు స్థావరాలలో నివసించే ఇంగ్లీషు వాళ్ళకి, తదితరులకి సంబంధించి న్యాయ నిర్వహణ అమలు పర్చటానికి కంపెనీకి విశేషాధికారాలు ఇస్తూ అనేక అధికార పత్రాలు జారీ చేశాడు. ఆ విధంగా కంపెనీకి విస్తృత సైనిక, న్యాయ నిర్వహణ హక్కులు సమకూరాయి.

తూర్పు దేశాలలో వ్యాపారం చేసుకోడానికి ఒక్క తూర్పిండియా కంపెనీకి గుత్త హక్కులున్నా, తదితర ఇంగ్లీషు వర్తకులనేక మంది ఆసియాలో స్వంతంగా వ్యాపారం చేసుకుంటూనే ఉన్నారు. తాము "స్వతంత్ర వర్తకుల"మని పేరు పెట్టుకున్నారు. కాని, కంపెనీ మాత్రం వాళ్ళని అనుమతి లేకుండా దూరిన అక్రమదారి వర్తకులుగా అభివర్ణించింది చివరికి, ఈ అక్రమదారి వర్తకులకి సైతం కంపెనీలో భాగం ఇవ్వక తప్పలేదు. స్టువార్ట్ వంశం రాజు రెండవ జేమ్సును గద్దె దింపి, మూడవ విలియంని, ఆయన రాణి మేరీని ఇంగ్లండ్ సింహాసనం ఎక్కించిన 1688 విప్లవం ఫలితంగా పార్లమెంటు సర్వసత్తాకమైనప్పుడు కంపెనీ అదృష్టం వక్రించింది. "స్వతంత్ర వర్తకులు" తమ కోర్కెల్ని ప్రజలముందు, పార్లమెంటు ముందు పెట్టారు. కంపెనీ స్థానాన్ని పదిలపర్చుకోవటం కోసం రాజుకు, మంత్రులకు, పార్లమెంటు సభ్

విపరీతంగా లంచాలు గుప్పించింది. ఒక్క సంవత్సరంలో కంపెనీ లంచాలకు గాను 80వేల పౌండ్లు ఖర్చు పెట్టింది. ఒక్క రాజుకే 10వేల పౌండ్లు లంచం సమర్పించింది. చిట్టచివరికి, 1693లో కంపెనీ కొత్త చార్టర్‌ని సంపాదించింది.

కాని కంపెనీకి కాలం ఎదురు తిరిగింది. కొత్త చార్టరు సంపాయించిన సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. 1694లో పార్లమెంటు ఒక తీర్మానం ఆమోదించింది. "పార్లమెంటు చట్టం నిషేధం విధించనంతకాలం, ఇంగ్లీషు వారులందరికి తూర్పిండియా దీవుల్లో వ్యాపారం చేసుకోడానికి సమాన హక్కులుంటా"యని ఆ తీర్మానం సారాంశం. తూర్పిండియా కంపెనీ ప్రత్యర్థులంతా కలసి "నూతన వర్తక సంస్థ" (New Company) అనే పేరుతో వేరే సంస్థ స్థాపించారు. పాత సంస్థ ప్రభుత్వానికి ఏడు లక్షల కన్నా ఎక్కువ రుణం యివ్వలేనన్నప్పుడు, ఆ కొత్త సంస్థ ఇరవై లక్షల పౌండ్లు ప్రభుత్వానికి అప్పుగా ఇచ్చింది. పర్యవసానంగా, తూర్పు దేశాలతో వ్యాపారం చేసుకునే గుత్త హక్కుని పార్లమెంటు కొత్త సంస్థకి ప్రసాదించింది. లాభాలు తినమరిగిన పాత కంపెనీ అంత తేలిగ్గా వ్యాపారం వదులుకోడానికి నిరాకరించింది. పరస్పర సంఘర్షణ మూలంగా ఉభయ సంస్థలూ మూతబడిపోయే ముప్పు ముంచుకొచ్చింది. చివరికి, 1702లో ఈ పాత, కొత్త సంస్థలు రెండూ ఏకమయ్యాయి. 1708లో "సమైక్య ఆంగ్లేయ వర్తక ప్రాగ్దేశ వ్యాపార సంఘం" అనే పేరుతో కంపెనీ తన కార్యకలాపాలు ప్రారంభించింది.

***భారతదేశంలో తూర్పిండియా కంపెనీ పాలన, నిర్మాణం :*** క్రమేణా తూర్పిండియా కంపెనీ అధికారం విస్తరించి, భారతదేశంలో ఒక సర్వసత్తాక రాజ ప్రతిపత్తి సంతరించుకొంటున్న ఊపులో కంపెనీ స్థాపించిన ఫ్యాక్టరీల నిర్మాణ స్వరూపం కూడా మారిపోయి, తదనుగుణంగా వాటి అభివృద్ధి సాగింది. సాధారణంగా కంపెనీ ఫ్యాక్టరీ అంటే చుట్టూ కోట ఉన్న రక్షిత ప్రాంతం. కోట లోపలే కంపెనీ గిడ్డంగులు, కార్యాలయాలు, కంపెనీ ఉద్యోగుల నివాస గృహాలు ఉండేవి. కాని ఫ్యాక్టరీ లోపల సరుకుల ఉత్పత్తి అంటూ ఏమీ జరిగేది కాదని గుర్తుంచుకోవాలి.

కంపెనీ ఉద్యోగుల్లో మూడు శ్రేణులుండేవి. ఆఫీసు గుమాస్తాలు, క్రయ విక్రయాలు చూసే ప్రతినిధులు, వర్తకులు వీరంతా కంపెనీ ఖర్చుమీద వసతి గృహంలో మాదిరి ఒకేచోట కలిసి ఉంటూ, తింటూ కాలక్షేపం చేసేవాళ్ళు. గుమాస్తా సాలుసరి వేతనం 10 పౌండ్లు (100 రూపాయలు), ప్రతినిధికి 20 నుండి 40 పౌండ్లు (200-400 రూ.లు), వర్తకులకు 40 పౌండ్లు, లేదా అంతకన్నా కొంచెం ఎక్కువ. ఆవిధంగా వాళ్ళ జీతాలు చాలా తక్కువగా ఉండేవి. అంత తక్కువ జీతానికి అంతదూరం నుంచి ఇంత దూరం ఎందుకు వచ్చారంటే దానికి వేరే కారణం ఉంది. దేశం లోపల జరిగే వ్యాపారానికి సంబంధించి వాళ్ళు ప్రైవేటుగా పాల్గొనటానికి కంపెనీ అనుమతించింది. ఇండియా-యూరప్‌ల మధ్య జరిగే విదేశ వ్యాపారం మీద మాత్రం సంపూర్ణంగా కంపెనీకే హక్కు. కాబట్టి, ఉద్యోగుల అసలు రాబడి యావత్తు వాళ్ళు స్వంతంగా సాగించే ప్రైవేటు వ్యాపారం ద్వారా వచ్చేది.

ఫ్యాక్టరీని, దాని వ్యాపారాన్ని గవర్నరు అతని కౌన్సిలు అజమాయిషీ చేసే వాళ్ళు. గవర్నరంటే కేవలం కౌన్సిల్ అధ్యక్షుడు. కౌన్సిల్‌ని కాదని అతనికి ప్రత్యేక అధికారాలు లేవు. మెజారిటీ ఓటు ద్వారా కౌన్సిల్ నిర్ణయాలు తీసుకునేది. కౌన్సిల్ అంటే కంపెనీ సీనియర్ వర్తకులతో కూడిన సభ.

*దక్షిణ భారతదేశంలో ఫ్రెంచ్–ఇంగ్లీషు యుద్ధాలు :* భారతదేశంలో భూభాగాలు జయించి, రాజకీయాధిపత్యం సాధించటానికి ఇంగ్లీషు తూర్పిండియా కంపెనీ రూపొందించిన పథకాలు 17వ శతాబ్దం చివర్లో ఔరంగజేబ్ దెబ్బకి తుత్తునియలయ్యాయి మొఘల్ సామ్రాజ్య పతనంతో 1740 ప్రాంతంలో ఆ పథకాలు తిరిగి ప్రాణం పోసుకున్నాయి నాదర్‌షా దండయాత్ర కేంద్ర ప్రభుత్వం పతన స్థితిని బట్టబయలు చేసింది. పోతే, భారత పశ్చిమ ప్రాంతంలో మరాఠాలు విజృంభించి ఉండటం వల్ల, అక్కడికి విదేశీయులు చొచ్చుకు పోవటానికి పెద్దగా అవకాశం కనిపించలేదు. బెంగాల్‌లో అలి వర్దీఖాన్ ఇంగ్లీషు వాళ్ళని కఠినమైన కట్టడిలో ఉంచాడు ఇక, దక్షిణ భారతదేశంలో పరిస్థితులు క్రమేణా విదేశీయులకు అనుకూలంగా పరిణమించ సాగాయి. ఔరంగజేబు మరణంతో కేంద్ర ప్రభుత్వాధికారం దక్షిణాదిన అంతరించి పోయింది 1748లో నిజాం–ఉల్–ముల్క్ అసఫ్ జా అస్తమించడంతో నైజాం అధికృత కూడా నశించి పోయింది మహారాష్ట్రులు హైదరాబాదు మీదా, మిగతా దక్షిణ ప్రాంతం మీదా నిత్యం దాడులు చేస్తూ, చేతి పన్ను వసూలు చేసుకుంటున్నారు ఎడతెగని ఈ దాడుల వల్ల రాజకీయంగా అస్థిర పరిస్థితులు చోటు చేసుకున్నాయి పరిపాలనా వ్యవస్థ విచ్ఛిన్నమై పోయింది అధికారం కోసం సాగే అన్నదమ్ములు, దాయాదులు మారణ వారసత్వ యుద్ధాల్లో కర్నాటక అట్టుడికి పోతోంది.

విదేశీయులు తమ రాజకీయ పలుకుబడిని విస్తరింప జేసుకోడానికి, దక్షిణ భారత సంస్థానాల వ్యవహారాల్లో పెత్తనం చెయ్యటానికి ఈ పరిస్థితులు మహదవకాశం కల్పించాయి వాణిజ్య, రాజకీయ అధిపత్యం కోసం బారుతీరినవాళ్ళు ఒక్క ఇంగ్లీషు వాళ్ళేకాదు. 17వ శతాబ్దం ముగిసే నాటికి ఇంగ్లీషు వాళ్ళు పోర్చుగీసుల్ని, డచ్చివాళ్ళని గెంటి వేసిన మాట నిజమే అయినా, ఫ్రాన్సు కొత్తగా పోటీకి తలపడింది 1744 నుండి 1763 దాకా దాదాపు ఇరవయ్యేళ్ళు భారత వ్యాపారం, సంపద, భూభాగాల మీద అధిపత్యం కోసం ఫ్రెంచ్–ఇంగ్లీషు వాళ్ళ మధ్య భీషణ యుద్ధాలు సాగాయి

ఫ్రెంచి తూర్పిండియా కంపెనీ 1664లో ఆవిర్భవించింది. 1720 ప్రాంతంలో కంపెనీ పునర్నిర్మాణం పూర్తయ్యాక, అది చకచకా పైకొచ్చింది. తమకన్నా ఎంతో ముందుగా వచ్చిన ఇంగ్లీషు కంపెనీని అందుకున్నది. కలకత్తా సమీపంలోని చంద్రనాగూరులోను, తూర్పు కోస్తాలో పాండిచేరిలోను బలంగా వేళ్ళూనింది. పాండిచేరిని రక్షణ కట్టుదిట్టాలతో బలిష్టంగా తయారు చేసుకున్నారు ఈ రెండు చోట్ల మాత్రమే కాకుండా ఫ్రెంచి వాళ్ళు తూర్పు, పశ్చిమ కోస్తాల్లో ఇంకా అనేకచోట్ల ఫ్యాక్టరీలు ప్రారంభించారు. హిందూ మహా సముద్రంలోని మారిషస్, రీయూనియన్ దీవుల మీద కూడా అధిపత్యం సంపాదించారు.

ఫ్రెంచి తూర్పిండియా కంపెనీ ఫ్రెంచి ప్రభుత్వం మీద పూర్తిగా ఆధారపడిన సంస్థ. ఫ్రెంచి ప్రభుత్వం ఈ కంపెనీకి గ్రాంట్లు, సబ్సిడీలు, రుణాలు మంజూరు చేసింది. ఇంకా ఎన్నో విధాలుగా తోడ్పాటు అందించింది. ఫలితంగా, ఫ్రెంచి తూర్పిండియా కంపెనీ మీద పెత్తనమంతా ప్రభుత్వానిది. ప్రభుత్వమే 1723లో కంపెనీ డైరెక్టర్లని నియమించింది. కంపెనీలో పెద్ద వాటాల్ని ఫ్రెంచి కులీనులు, తేరగా తిని కూర్చునే సంపన్నులు కొని పారేశారు. వాళ్ళ దృష్టి తక్షణ లాభాల మీద తప్ప కంపెనీ

కలకాలం నిలిచే వాణిజ్య సంస్థగా వర్ధిల్లాలనే దానిమీద లేదు. ప్రభుత్వం ఋణాలు, సబ్సిడీలు మంజూరు చేసినంత కాలం, కంపెనీ లాభాలు ప్రకటించ గలిగింది. అంతేగాని, తాము తలపెట్టిన వాణిజ్య కార్యకలాపాల శాశ్వతం, విజయం గురించి డైరెక్టర్లు పట్టించుకోలేదు. కంపెనీ మీద ప్రభుత్వ యాజమాన్యం మరొక విధంగా కూడా హానికరంగా పరిణమించింది. ఆనాడు ఫ్రాన్సు నిరంకుశ అర్ధ భూస్వామ్య, ప్రజా వ్యతిరేక రాజ్యం, అవినీతి, అసమర్థత, అస్థిరత, తాండవిస్తున్నాయి. దానికి పురోగామి దృక్పథం లేదు. అది సంప్రదాయానికి కట్టుబడి పోయి, కాలదోషం పట్టిన క్షీణయుగ రాజ్య వ్యవస్థ. అటువంటి రాజ్యం యొక్క పెత్తనం కంపెనీ ప్రయోజనాలకు హానికరంగా తప్ప మరొక విధంగా ఉండటానికి ఆస్కారం లేదు.

1742లో యూరప్‌లో ఇంగ్లండ్-ఫ్రాన్సుల మధ్య యుద్ధం ప్రజ్వరిల్లింది. అమెరికాలో వలసల గురించి తలెత్తిన శత్రుత్వం ఆ యుద్ధానికి ఒక ప్రధాన కారణం. మొఘల్ సామ్రాజ్యం విచ్ఛిన్నమై పోతున్నదనే స్పృహ ఉభయ శిబిరాల్లో కలగడంతో ఆ స్పర్థ భారతదేశంలో కూడా తీవ్రతరమైంది. మొఘల్ సామ్రాజ్య విచ్ఛితితో భారతదేశంలో లోగడ కన్నా వ్యాపారంలో, భూభాగ ఆక్రమణలో ఇంకా విపరీతంగా కొట్టెయ్య వచ్చని ఇద్దరి మధ్యా స్పర్థ పెరిగింది. దాదాపు ఇరవయ్యేళ్ళ పాటు ఫ్రెంచ్ ఆంగ్లేయ యుద్ధాలు కొనసాగాయి. చివరికి, భారతదేశంలో బ్రిటిష్ రాజ్యాధికారానికి ఆ సంఘర్షణ దారితీసింది. వ్యాపారంలో ఆధిక్యతను బట్టి ఫ్రెంచి కంపెనీ కన్నా ఇంగ్లీషు కంపెనీ సంపన్నంగా ఉంది. ఇంకా ఇంగ్లీషు వాళ్ళకి నౌకా బలాధిక్యత ఉండనే ఉంది. పైగా, ఇక్కడ బ్రిటిషు స్థావరాలు చాలాకాలం నుంచి ఉన్నాయి. బలమైన కోటలతో బలిష్ఠంగా ఉన్నాయి, సుసంపన్నంగా ఉన్నాయి. కాబట్టి, భౌతిక సాధన సంపత్తి దృష్ట్యా బ్రిటిషు వారిది పై చెయ్యి.

ఇంగ్లండ్, ఫ్రాన్స్‌ల మధ్య యూరప్‌లో ప్రారంభమైన యుద్ధం ఇండియాకు విస్తరించింది. ఇక్కడ ఉభయ సంస్థల మధ్య సంఘర్షణ ప్రారంభమైంది. 1745లో ఇంగ్లీషు నౌకాబలం భారత ఈశాన్య తీరంలోని ఫ్రెంచి నౌకల్ని పట్టుకొని, పాండిచేరిని ముట్టడించింది. ఆ రోజుల్లో పాండిచేరికి డూప్లే గవర్నర్ జనరల్. ఆయన అఖండ ప్రతిభా, సామర్థ్యాలు కలిగిన రాజనీతిజ్ఞుడు. ఆయన ఉజ్వల నాయకత్వంలో ఫ్రెంచి సైన్యం ఇంగ్లీషు సైన్యాన్ని తిప్పికొట్టి పాండిచేరిని కాపాడు కోవటమే కాకుండా 1746లో మద్రాసును స్వాధీనం చేసుకొంది. ఆ సందర్భంలో ఒక అతి ముఖ్యమైన సంఘటన సంభవించింది. ఆనాడు మద్రాసు కర్నాటక నవాబు అధికార పరిధిలో ఉండేది. ఇంగ్లీషు వాళ్ళు కర్నాటక నవాబు సహాయాన్ని అర్థించారు. ఆ ప్రాంతాల మీద ఇంకా తనదే పెత్తనం అని విదేశ వర్తకులకు కనువిప్పు కలిగిద్దామనే ఉద్దేశ్యంతో కర్నాటక నవాబు ఫ్రెంచ్-ఇంగ్లీషు సంఘర్షణలో తల దూర్చటానికి అంగీకరించాడు. తన భూభాగంలో ఫ్రెంచి-ఇంగ్లీషు సేనలు పరస్పరం యుద్ధానికి తలపడ్డం ఆపటానికి నవాబు తన సైన్యాన్ని దూకించాడు. నవాబు పదివేల మహా సైన్యం బుల్లి ఫ్రెంచి సైన్యం మీద విరుచుకు పడింది. ఫ్రెంచి సైన్యంలో 230 మంది యూరోపియన్ సైనికులు, పాశ్చాత్య యుద్ధ పద్ధతుల్లో శిక్షితులైన 700 మంది భారత సైనికులు మాత్రమే ఉన్నారు. కాని నవాబు భారీ సైన్యం చిత్తుగా ఓడిపోయింది. భారత సైన్యాల మీద పాశ్చాత్య సైన్యాల ఆధిక్యత ఆ యుద్ధంలో స్పష్టంగా బైటపడింది. నిర్మాణంలో, సాధన సంపత్తిలో

పాశ్చాత్య సేనలు ఎంతో మెరుగ్గా ఉన్నాయి. భారతీయుల ఈటెలు పాశ్చాత్యుల తూటా ముందు దిగదుడుపయ్యాయి. భారత అశ్విక దళం పాశ్చాత్య శతఘ్ని దళం ముందు వెల వెల పోయింది. క్రమశిక్షణ, నిర్వహణా పాటవం లోపించిన భారీ భారత సైన్యాలు ఉత్తమ క్రమశిక్షణాయుతమైన స్వల్ప పాశ్చాత్య సైన్యానికి నిలబడలేక పోయాయి.

1748లో ఇంగ్లండ్-ఫ్రాన్సుల మధ్య సాధారణ యుద్ధం ముగిసింది. శాంతి ఒడంబడికకు అనుగుణంగా ఫ్రెంచి వాళ్ళు మద్రాసును తిరిగి ఇంగ్లీషు వాళ్ళకి అప్పగించేశారు. యుద్ధమైతే ముగిసింది గాని వ్యాపారంలో, స్థావరాల నిర్మాణంలో ఉభయుల మధ్య పోటాపోటీలు కొనసాగాయి. ఎవరిదో ఒకరిది అంతు తేలేదాకా అవి కొనసాగ వలసిందే. పైగా, కర్నాటక నవాబుతో జరిపిన యుద్ధం భారత ప్రభుత్వ బలహీనతను బట్టబయలు చేసింది. దాంతో, భారతదేశంలో భూభాగ విస్తరణ కోసం ఇరుపక్షాలకూ దురాశ పెరిగి పోయింది.

కర్నాటక నవాబుతో ముగిసిన ఇటీవలి యుద్ధంలో నేర్చుకున్న పాఠాలను డూప్లే వినియోగ పర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. భారతదేశంలో చిన్న చిన్న రాజ్యాల మధ్య రగులుకొంటున్న యుద్ధాలలో ఆధునిక ఫ్రెంచి సైన్యం జోక్యం కల్పించుకోటానికి అనువైన వ్యూహాన్ని డూప్లే రూపొందించాడు. ఒకరికి వ్యతిరేకంగా ఇంకొకర్ని భుజాన వేసుకొని విజేతల దగ్గర డబ్బు, వ్యాపార రాయితీలు, భూభాగం గుంజుకునే ఉపాయం తయారు చేసి పెట్టుకున్నాడు. ఆ ప్రకారం స్థానిక రాజాల, నవాబుల, నాయకుల వనర్లని, సైన్యాల్ని ఫ్రెంచి కంపెనీ ప్రయోజనాల కనుగుణంగా ఉపయోగించుకొని చివరికి ఇంగ్లీషు వాళ్ళని ఇంటిదారి పట్టించటానికి ఎత్తుగడలు సిద్ధంచేసుకున్నాడు. విదేశీ జోక్యాన్ని స్వదేశ రాజులు నిరాకరిస్తే, డూప్లే వ్యూహానికి పురిట్లోనే సంధి కొడుతుంది. కాని, మన రాజాలకు, నవాబులకు సంకుచితమైన వ్యక్తిగత దురాశ, స్వలాభాపేక్ష తప్ప దేశభక్తి శూన్యం. తమ అంతరంగిక సంఘర్షణల్లో అమీతుమీ తేల్చుకోడానికి విదేశీయుల సహాయాన్ని స్వీకరించటంలో వాళ్ళు కొంచెమైనా తటపటాయించలేదు.

డూప్లే కుతంత్రపు తెలివితేటలకు పూర్తి అవకాశం ఇచ్చిన సందర్భం ఒకటి 1748లో కలిసి వచ్చింది. కర్నాటకలో నవాబు అన్వరుద్దీన్‌కు వ్యతిరేకంగా చందా సాహెబ్ కుట్ర ప్రారంభించాడు. హైదరాబాద్‌లో నిజాం-ఉల్-ముల్క్ మరణంతో ఆయన కుమారుడు నాజర్‌జంగ్‌కు, మనుమడు ముజఫర్‌జంగ్‌కు మధ్య అంతర్యుద్ధం చెలరేగింది. డూప్లే ఈ అవకాశాన్ని వినియోగించుకొని చందాసాహెబ్ తోను, ముజఫర్‌జంగ్ తోను రహస్యంగా సంధి చేసుకున్నాడు. సుశిక్షితులైన తన ఫ్రెంచి, భారతీయ సైనికుల్ని వాళ్ళకు అనుకూలంగా మోహరిస్తానని హామీ ఇచ్చాడు. 1749లో ఈ ముగ్గురూ కలిసి అంబూరు యుద్ధంలో నవాబు అన్వరుద్దీన్‌ని ఓడించి చంపారు. నవాబు కుమారుడు మహమ్మద్ అలీ తిరుచునాపల్లి పారిపోయాడు. కర్నాటకని చందాసాహెబ్ దక్కించుకున్నాడు. ఫ్రెంచి సహాయానికి కృతజ్ఞతగా పాండిచేరి చుట్టూ వున్న 80 గ్రామాలను ఫ్రెంచి తూర్పిండియా కంపెనీకి దఖలు పర్చాడు.

హైదరాబాదులో కూడా ఫ్రెంచి వాళ్ళకు లాభం జరిగింది. నైజాం కుమారుడు నాజర్‌జంగ్ యుద్ధంలో ఓడిపోయి చనిపోయాడు. మనుమడు ముజఫర్ జంగ్ నిజాం



1748 పాండిచ్చేరి ముట్టడిలో డూప్లెక్స్

అయ్యారు ఫ్రెంచి సేవలకు ప్రతిఫలంగా ముజఫర్ జంగ్ ఫ్రెంచి కంపెనీకి పాండిచేరి దగ్గర కొన్ని గ్రామాలు, ఆంధ్రలో మచిలీపట్నం దానం చేశాడు 5 లక్షల రూపాయలు కంపెనీకి, మరో 5 లక్షలు సైన్యానికి ఇచ్చుకున్నాడు డూప్లేకు రెండు లక్షల రూపాయల నగదు, ఏటా లక్ష రూపాయల ఆదాయం తెచ్చిపెట్టే జాగీరు దక్కాయి ఇవన్నీ కాక, తూర్పు కోస్తాలో కృష్ణాతీరం మొదలుకొని కన్యాకుమారి దాకా మొఘల్ భూభాగం మీద డూప్లే గౌరవ గవర్నరు హోదా సంపాదించాడు తన అధికారుల్లో అతి సమర్థుడైన బుస్సీని ఫ్రెంచి సైన్యంతో సహా హైదరాబాద్‌లో కాపుంచాడు కొత్త నిజాంను శత్రువుల బారి నుంచి కాపాడ్డం కోసమే ఇన్ని ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది ఆయన దర్బారులో ఫ్రెంచి పలుకుబడిని నెలకొల్పటం డూప్లే ముఖ్య ఆశయం ముజఫర్ జంగ్ రాజధానివేపు పురోగమిస్తూ త్రోవలో అకస్మికంగా మరణించాడు బుస్సీ వెంటనే నిజాం-ఉల్-ముల్క్ మూడవ కుమారుడు సలబత్ జంగ్‌ని సింహాసనం ఎక్కించాడు

ఈ సహాయానికి ప్రతిఫలంగా, మళ్ళీ కొత్త నిజాం ఆంధ్రలో ఉత్తర సర్కారు జిల్లాల్ని ఫ్రెంచి వాళ్ళకు బహూకరించాడు. ఉత్తర సర్కార్లంటే ముస్తఫానగర్, ఏలూరు, రాజమండ్రి, చికాకోల్ అనే నాలుగు జిల్లాలు.

దక్షిణ భారతదేశంలో ఇప్పుడు ఫ్రెంచి అధికార ప్రభ మార్తాండ సూర్యునిలా వెలిగి పోయింది. డూప్లే పథకాలు అయన కలనైనా ఊహించని రీతిలో విజయవంత మయ్యాయి. భారతీయ సంస్థానాధీశుల్ని మిత్రులుగా చేసుకునే ప్రయత్నాలు ముమ్మరంగా ప్రారంభించారు. చిట్టచివరికి, భారత సంస్థానాలు ఫ్రెంచివారి ఉపగ్రహ రాజ్యాలుగా తయారయ్యాయి.

తమ ప్రత్యర్థుల విజయపరంపరని ఇంగ్లీషు వాళ్ళు మౌనంగా చూస్తూ మిన్నకుండి పోలేదు. ఫ్రెంచి పలుకుబడిని దెబ్బతీసి తమ ప్రతిష్ఠని పెంచుకోవటం కోసం ఇంగ్లీషువాళ్ళు నాజర్‌జంగ్‌తోను, మహమ్మద్ అలీతోను రహస్య మంతనాలు సాగించారు. 1750లో తమ యావచ్ఛక్తిని, బలాన్ని మహమ్మదాలీ వెనుక మోహరించారు. కంపెనీలో గుమాస్తాగా పనిచేసే రాబర్ట్ క్లైవ్ అనే యువకుడు ఆ యుద్ధంలో ఒక అద్భుతమైన సూచన ప్రతిపాదించాడు. తిరుచునాపల్లిలో మహమ్మదాలీపైన మోహరించిన ఫ్రెంచి బలాల ఒత్తిడిని మరొకవైపు మళ్ళించడానికి కర్నాటక రాజధాని ఆర్కాటుని ముట్టడించాలని క్లైవు ప్రతిపాదించాడు. క్లైవ్ ప్రతిపాదనని కంపెనీ అధికార్లు ఒప్పుకున్నారు. క్లైవ్ స్వయంగా సేనల్ని నడిపి ఆర్కాటుని ముట్టడించి ఆక్రమించాడు. అతని సైన్యం అంతా కలిపి కేవలం 200 మంది ఇంగ్లీషు సైనికులు, 300 మంది ఇండియన్ సైనికులు. అనుకున్నట్టుగానే, చందా సాహెబ్ అతని ఫ్రెంచి మిత్రులు తిరుచునాపల్లి మీద తమ ఒత్తిడిని సడలించారు, ఫ్రెంచి సేనలు ఆ యుద్ధంలో చిత్తుగా ఓడిపోయాయి. చందా సాహెబ్ పట్టుబడి వధించబడ్డాడు. ఫ్రెంచి బలం అధమ స్థాయికి దిగిపోయింది. ఇంగ్లీషు సేనాపతుల ముందు, సేనల ముందు ఫ్రెంచి సేనలు, సేనాపతులు పనికిరారని తేలిపోయింది.

వక్రించిన ఫ్రెంచి అదృష్ట రేఖని తిన్నగా మార్చటానికి డూప్లే నానా ప్రయాసపడ్డాడు. కాని ఫ్రెంచి ప్రభుత్వం గాని, ఫ్రెంచి కంపెనీ ఉన్నతాధికార్లు గానీ డూప్లే ప్రయత్నాలకు రవ్వంత మద్దతు ఇవ్వలేదు. పైపెచ్చు, ఫ్రెంచి ఉన్నతాధికార్లు, సైనిక నౌకాబలాల అధిపతులు అస్తమానం కీచులాడుకున్నారు. భారతదేశంలో జరిగిన యుద్ధాల్లో తగలడిపోయిన ఖర్చుకి విసిగి వేసారి పోయిన ఫ్రెంచి ప్రభుత్వం అమెరికా లోని వలసలు కూడా తుడిచి పెట్టుకు పోతాయనే భీతితో చివరికి శాంతి సంప్రదింపులకు దిగింది. ఇండియా నుండి డూప్లేని ఇంటికి పంపించాలని ఇంగ్లీషు వాళ్ళు విధించిన షరతుని ఫ్రెంచి ప్రభుత్వం 1754లో మన్నించింది. భారతదేశంలో ఫ్రెంచి కంపెనీ భాగ్యదశని అది పెద్ద దెబ్బ తీసింది.

ఉభయ వర్తక సంస్థలకి మధ్య తాత్కాలికంగా నెలకొన్న శాంతికి 1756లో మళ్ళీ విఘాతం కలిగింది. ఇంగ్లండ్-ఫ్రాన్సుల మధ్య తిరిగి యుద్ధం ప్రారంభమైంది. యుద్ధ ప్రారంభ దశలోనే, ఇంగ్లీషు వాళ్ళు బెంగాల్ మీద అధిపత్యం సాధించుకో గల్గారు. (తరువాతి అధ్యాయంలో ఇది సవివరంగా చర్చించబడింది). ఈ సంఘటన తరువాత భారతదేశంలో ఫ్రెంచి లక్ష్యసిద్ధికి ఆశ అడుగంటి పోయింది. బెంగాల్ సంపన్నమైన

వనరుల ఫ్రెంచి-ఇంగ్లీషు బలాబలాల తులాభారంలో ఇంగ్లీషువారి వేపు మొగ్గుకి బరువు పూన్చాయి. ఇంగ్లీషు వాళ్ళని ఈ తూరి ఎలాగైనా ఇండియా నుండి వెడల నడపాలనే కృతనిశ్చయంతో కౌంట్ డిలాలి నాయకత్వాన సాగిన ఫ్రెంచి దాడి విఫలమై పోయింది. ఇంగ్లీషు నౌకాబలం ఫ్రెంచి నౌకల్ని భారత సముద్ర జలాల నుంచి తరిమి వేసింది. కర్నాటకలో ఫ్రెంచి బలాల్ని ఓడించారు. నిజాం సంరక్షకులుగా తిష్ఠ వేసిన ఫ్రెంచి వాళ్ళని తొలగించి మచిలీపట్నాన్ని, ఉత్తర సర్కారు జిల్లాల్ని రాబట్టుకొన్నారు. 1760 జనవరి 22న వందివాష్ వద్ద జరిగిన నిర్ణయాత్మక మైన యుద్ధంలో ఇంగ్లీషు సేనాని సర్ ఐర్‌కూట్ ఫ్రెంచి సేనాని డిలాని ఓడించారు. సంవత్సరం తిరిగే సరికి ఫ్రెంచి వాళ్ళు భారతదేశంలో తమ స్థావరాల నన్నిటినీ ఘోరంగా పోగొట్టుకున్నారు.

పారిస్ శాంతిసంధి మీద సంతకాలు జరగగానే, 1763లో ఇంగ్లీషు-ఫ్రెంచి యుద్ధం అంతమైంది. భారతదేశంలోని ఫ్రెంచి ఫ్యాక్టరీలు తిరిగి ఫ్రెంచి తూర్పిండియా కంపెనీకి అప్పగించ బడ్డాయి. అయితే, వెనకటి లాగే రక్షణ కట్టుదిట్టాలు ఏర్పాటు చేసుకోడానికి గానీ, పూర్తిగా సైనికుల్తో నింపటానికి గానీ అవకాశం లేకుండా పోయింది. అవి కేవలం వర్తక కేంద్రాలుగా మాత్రమే పని చెయ్యటానికి అనుమతించబడింది. ఇప్పుడు ఫ్రెంచి వాళ్ళు ఇంగ్లీషు వారి రక్షణ క్రింద బ్రతకవలసిన దుస్థితి ఏర్పడింది. భారతదేశంలో సామ్రాజ్యం స్థాపించాలనే ఫ్రెంచివారి స్వప్నం తునాతునకలై పోయింది. ఇంగ్లీషు వాళ్ళు భారత సముద్ర జలాల మీద ఆధిపత్యం వహించారు. యూరోపియన్ పోటీదార్ల బెడద వదిలి పోయిన ఇంగ్లీషు వాళ్ళు భారతదేశాన్ని జయించే కర్తవ్యాన్ని చేపట్టారు.

ఫ్రెంచి వాళ్ళతో, వాళ్ళ మిత్ర రాజుల్తో జరిపిన యుద్ధాల్లో ఇంగ్లీషు వాళ్ళు కొన్ని విలువైన పాఠాలు నేర్చుకున్నారు. దేశంలో జాతీయవాదం పూర్తిగా అదృశ్యమై పోయిన పరిస్థితుల్లో స్వదేశ రాజుల పరస్పర యుద్ధాల్ని స్వప్రయోజనాలకి అనుకూలంగా ఉపయోగించుకొని తమ రాజకీయ లక్ష్యాన్ని నిరభ్యంతరంగా పరిపూర్తి చేసుకోవచ్చునన్నది ఇంగ్లీషు వాళ్ళు నేర్చుకున్న మొదటి పాఠం. రెండు - పాశ్చాత్య పద్ధతుల్లో సుశిక్షితమైన ఐరోపా, భారతీయ కాల్బలం ఆధునిక ఆయుధాలతో, శతఘ్నులతో పాత తరహా భారతీయ సైన్యాల్ని సులువుగా ఓడించవచ్చు. మూడు - యూరోపియన్ పద్ధతిలో శిక్షణ, ఆధునిక ఆయుధాలు కలిగిన భారతీయ సైనికుడు యూరోపియన్ సైనికుడితో సమవుజ్జీ కాగలడని రుజువయింది. భారతీయ సైనికుడి క్కూడా జాతీయ భావ ప్రేరణ పూర్తిగా లోపించింది. మంచి జీత భత్యాలిస్తే ఎవరివైపునైనా పని చేస్తాడు. కాబట్టి, ఇంగ్లీషు వాళ్ళు సిపాయిలని పిలవబడే భారత సైనికుల్తో ఒక శక్తివంతమైన సైన్యాన్ని నిర్మించి, వాళ్ళమీద ఇంగ్లీషు అధికార్ల అజమాయిషీని పెట్టటానికి ఉద్యుక్తులయ్యారు. ఈ శక్తివంతమైన సైన్యం ముఖ్య సాధనంగా, భారీ వ్యాపార వసర్లతో, విశాలమైన అధీన భూభాగంతో, ఇంగ్లీషు తూర్పిండియా కంపెనీ యుద్ధాల, ప్రాదేశిక విస్తరణల యుగంలో ప్రవేశించింది.

# బ్రిటిషువారి భారతదేశ ఆక్రమణ

## 1. సామ్రాజ్య విస్తరణ, 1756 – 1818

***బెంగాల్ ఆక్రమణ :*** భారతదేశంలో బ్రిటిషు రాజకీయాధిపత్యానికి 1757లో జరిగిన ప్లాసీ యుద్ధం నాంది పలికింది ఆ యుద్ధంలో ఇంగ్లీషు తూర్పిండియా కంపెనీ బలాలు బెంగాల్ నవాబు సిరాజ్ ఉద్దౌలాని ఓడించాయి మునుపు దక్షిణాదిన ఫ్రెంచి వాళ్ళతో ఇంగ్లీషు వాళ్ళు జరిపిన యుద్ధం అసలు నాటకం ప్రదర్శించడానికి ముందు చేసుకునే డ్రెస్ రిహార్సలు వంటిది ఆ యుద్ధాల్లో నేర్చుకున్న పాఠాలను ఇంగ్లీషు వాళ్ళు బెంగాల్‌లో లాభప్రదంగా వాడుకున్నారు

భారతదేశంలోని రాష్ట్రాల్లో బెంగాల్ మహా సస్యశ్యామలమైన సంపన్న రాష్ట్రం బెంగాల్‌లో పరిశ్రమలు, వాణిజ్యం ఉచ్చస్థితిలో ఉన్నాయి తూర్పిండియా కంపెనీకి గానీ, కంపెనీ ఉద్యోగులకు గానీ ఆ రాష్ట్రంలో అత్యంత లాభదాయకమైన వ్యాపార ప్రయోజనాలున్నాయి 1717లో మొఘల్ చక్రవర్తి ప్రసాదించిన ఫర్మానా పుణ్యమా అని ఇంగ్లీషు వాళ్ళకి బెంగాల్‌లో ప్రత్యేక హక్కులు, సౌకర్యాలు సమకూరాయి వ్యాపార సుంకాలు కట్టకుండానే బ్రిటిషు ఎగుమతి, దిగుమతుల స్వేచ్ఛ అక్కడ ఉంది ఎగుమతి దిగుమతి సరుకుల రవాణాకు పాసులు (దస్తక్‌లు) జారీ చేసే హక్కు ఇంగ్లీషు వాళ్ళకి ఆ ఫర్మానా ద్వారా దక్కింది కంపెనీ ఉద్యోగులకు ప్రైవేటు వ్యాపారం చేసుకునే హక్కు ఉండేదే గాని ఈ మొఘల్ ఫర్మానా వాళ్ళకి వర్తించదు భారతీయ వర్తకుల మాదిరిగా కంపెనీ ఉద్యోగులు సైతం తమ ప్రైవేటు వ్యాపార కార్యకలాపాల్లో సుంకాలు చెల్లించాలి కంపెనీకి – బెంగాల్ నవాబులకు మధ్య ఆరని చిచ్చు రగిల్చిన ఘనత ఆ ఫర్మానాదే ఒకటి – ఆ ఫర్మానా మూలంగా బెంగాల్ ప్రభుత్వం చాలా ఆదాయం నష్టపోయింది రెండు – కంపెనీ సరుకుల రాకపోకలకు సంబంధించి దస్తక్‌లు జారీచేసే హక్కు ఇంగ్లీషు వాళ్ళకి ఉండటం చేత కంపెనీ ఉద్యోగులు ఆ హక్కుని దుర్వినియోగ పర్చటానికి అలవాటు పడి పన్ను ఎగవేసేవాళ్ళు ముర్షిద్ కులిఖాన్ మొదలుకొని అలివర్ధిఖాన్ దాకా బెంగాల్‌ని ఏలిన నవాబు లెవరూ 1717 నాటి మొఘల్ ఫర్మానాకు ఇంగ్లీషు వాళ్ళిచ్చిన అర్థ వివరణతో ఏకీభవించలేదు. వాళ్ళు ఇంగ్లీషు వాళ్ళచేత ఏటా ఒక మొత్తంగా డబ్బు కట్టించుకున్నారు. దస్తక్‌లు జారీచేసే హక్కుని దుర్వినియోగ పర్చనివ్వకుండా కట్టడి చేశారు అయితే కంపెనీ ఉద్యోగులు మాత్రం తమ ప్రైవేటు వ్యాపారానికి సంబంధించి అవకాశం దొరికితే చాలు పన్నులు ఎగవేసి నవాబుల అధికారాన్ని ఎదిరించారు.

1756లో సిరాజ్ ఉద్దౌలా తన తాతగారైన అలివర్ధిఖాన్ అనంతరం రాజ్యానికి రాగానే వ్యవహారాలు ఒక కొలిక్కి వచ్చాయి సిరాజ్ యువకుడు, అతనికి ముక్కుమీద కోపం ముర్షిద్ కులిఖాన్ కాలంలో ఇంగ్లీషు వాళ్ళు ఏ ప్రాతిపదిక మీ

వ్యాపారం చేసుకున్నారో, అదే ఇప్పుడూ కొనసాగాలని సిరాజ్ స్పష్టం చేశాడు. దక్షిణాదిన ఫ్రెంచి వాళ్ళమీద దిగ్విజయాలు సాధించిన కైపు దిగని ఇంగ్లీషు వాళ్ళు సిరాజ్ ఉద్దౌలా విధించిన నిర్బంధాల్ని ఎదిరించారు. స్వదేశ రాజుల రాజకీయ, సైనిక బలహీనత వాళ్ళకిప్పుడు బాగా తెలుసు. అంచేత, తమ సరుకుల మీద నవాబుకు సుంకాలు చెల్లించటానికి నిరాకరించటమే కాకుండా, తమ అధీనంలోని కలకత్తా రేవులో ప్రవేశించే భారతీయ వర్తకుల సరుకుల మీద కంపెనీ వ్యాపార సుంకాలు పెంచింది. సహజంగానే యువ నవాబు మండి పడ్డాడు. బెంగాల్ సింహాసనం మీద తన ప్రత్యర్థుల్ని ఎక్కించాలనే దురుద్దేశంతో కంపెనీ తన మీద కత్తి కట్టిందని సిరాజ్‌కు మొదటి నుంచీ అనుమానం.

చంద్రనాగూర్‌లో బలంగా వేళ్ళూనిన ఫ్రెంచి ప్రత్యర్థుల్తో సంఘర్షణ వచ్చే సూచనలు కన్పించి ఇంగ్లీషు వాళ్ళు బెంగాల్ నవాబు అనుమతి లేకుండా కలకత్తాలో బలిష్ఠమైన రక్షణ ఏర్పాట్లు చేసుకోవటంతో సిరాజ్ సహించలేక పోయాడు. ఇంగ్లీషు వాళ్ళ చర్యని తన సార్వభౌమాధికారం మీద దాడిగా అతడు భావించాడు. ఐరోపా ప్రత్యర్థుల్ని బెంగాల్ గడ్డమీద కుమ్ములాడుకోనిస్తే కర్నాటక నవాబుకు పట్టిన గతి తనకూ ప్రాప్తిస్తుందని అతడు గ్రహించాడు. వెంటనే, ఇద్దర్నీ యుద్ధ సన్నాహాలు కట్టిపెట్టమని ఉత్తర్వులు జారీ చేశాడు. ఫ్రెంచివాళ్ళు ఆ ఉత్తర్వుని మన్నించారు; ఇంగ్లీషు వాళ్ళు నిరాకరించారు. నవాబు ఇష్టా ఇష్టాలతో నిమిత్తం లేకుండా కంపెనీ వాళ్ళు బెంగాల్‌లో తిష్టవేసి, తమ ఇష్టానుసారం వ్యాపారం సాగించటానికి పట్టుదల పూనారు. ఇది బెంగాల్ నవాబు సార్వభౌమాధికారం మీద ప్రత్యక్ష ధిక్కారం. ఏ ప్రభువూ ఇటువంటి పరిస్థితిని సహించబోడు. ఇంగ్లీషు వాళ్ళ పథకాల్లో గర్భితమైన దీర్ఘకాలిక పరిణామాల్ని సిరాజ్ గుర్తించాడు. మొక్కయి వంగనిది మానై వంగదు. కాబట్టి, ఈ దేశపు చట్టాలకు ఇంగ్లీషు వాళ్ళు బద్ధులై ఉండేలాగు వాళ్ళ మెడలు వంచాలని సిరాజ్ నిర్ణయించాడు.

కాని అనవసర తొందరపాటుతో, తగిన సన్నాహాలు చేసుకోకుండా సిరాజ్ ఉద్దౌలా కాశింబజారులోని ఇంగ్లీషు ఫ్యాక్టరీని పట్టుకొని, కలకత్తా వేపు పురోగమించి 1756 జూన్ 20న ఫోర్ట్ విలియంని ఆక్రమించాడు. ఇంగ్లీషు వాళ్ళు నౌక లెక్క పారిపోతుంటే చూసి ఊరుకొని, వాళ్ళమీద తేలిగ్గా సాధించిన విజయానికి ఉబ్బిపోయి సిరాజ్ కలకత్తా నుంచి నిష్క్రమించాడు. ఇది అతను చేసిన పెద్ద తప్పిదం; శత్రువు బలాన్ని తక్కువగా అంచనా వేశాడు.

సముద్రానికి సమీపంలో ఫుల్టాలో ఇంగ్లీషు అధికార్లు తలదాచుకున్నారు. మద్రాసు నుంచి సహాయం అందే దాకా నిరీక్షిస్తూ కూర్చున్నారు. ఈలోపు, నవాబు దర్బారులోని ప్రముఖుల్తో మంతనాలాడి ఇంగ్లీషు వాళ్ళు ఒక విద్రోహ ముఠాని తయారు చేసి ఉంచారు. మీర్‌బక్షీగా ఉన్న మీర్‌జాఫర్, కలకత్తా మీద అధికారిగా ఉన్న మానిక్‌చంద్, మహా ధనవంతుడు ఒమినాంద్, బెంగాల్‌లో పేరుమోసిన బ్యాంకరు జగత్ సేఠ్, నవాబు సైన్యాధికారి ఖాదింఖాన్ ఇంగ్లీషు వాళ్ళతో చేరి కుట్రదారుల ముఠాగా తయారయ్యారు. అడ్మిరల్ వాట్సన్, కల్నల్ క్లైవ్‌ల అధ్వర్యాన మద్రాసు నుంచి భారీ నౌకా సైనిక బలాలు కలకత్తా చేరాయి. 1757 ప్రారంభంలో క్లైవ్ కలకత్తాని తిరిగి స్వాధీనం చేసుకొని, ఇంగ్లీషు వాళ్ళ కోర్కెలన్నిటికి నవాబుని మెడలు వంచి ఒప్పించాడు.

అయినా, ఇంగ్లీషువాళ్ళు అంతటితో సంతృప్తి పడలేదు. వాళ్ళింకా గొంతెమ్మ కోరికలు పెట్టుకున్నారు వాళ్ళు చెప్పినట్లుగా వినే ఒక కీలు బొమ్మని సిరాజ్ ఉద్దౌలా స్థానంలో నిలపాలని నిశ్చయించుకున్నారు. యువ నవాబు శత్రువులంతా కలిసి పన్నిన కుట్రతో ఇంగ్లీషు వాళ్ళు ఏకమై మీర్‌జాఫర్‌ని బెంగాల్ సింహాసనం ఎక్కించటానికి పూనుకున్నారు. బుద్ధిపూర్వకంగా సిరాజ్ ఉద్దౌలాని హిరణ్యాక్ష వరాలన్నీ కోరారు ఒకరికొకరు తాడోపేడో తేల్చుకోవాలంటే అంతిమ యుద్ధం తప్పదని ఉభయులకూ తెలుసు 1757 జూన్ 23న ముర్షిదాబాద్‌కు ఇరవై మైళ్ళలో ప్లాసీ రణక్షేత్రంలో ఉభయ పక్షాలు ఢీకొన్నాయి. చరిత్రగతిని మలిచిన యుద్ధంగా దానికి ప్రాధాన్యం ఉన్నదే గాని అది నామ మాత్రపు యుద్ధం మొత్తంమీద ఇంగ్లీషు సైన్యంలో ఇరవై తొమ్మండుగురు, సిరాజ్ సైన్యంలో 500 మంది హతులయ్యారు. నవాబు సైన్యాన్ని నడిపించిన కుట్రదార్లు మీర్ జాఫర్, రాయ్ దుర్లభ్‌లు యుద్ధంలో పాల్గొననే లేదు. మీర్ మదన్, మోహన్‌లాల్ అనే ఇద్దరు విశ్వాసపాత్రులైన యోధుల నాయకత్వంలో కొద్దిమంది నవాబు సైనికులు ధైర్య సాహసాలతో పోరాడారు. నవాబు సిరాజ్ ఉద్దౌలా పారిపోతూ పట్టుబడి మీర్‌జాఫర్ కుమారుని చేత వధించ బడ్డాడు.

ప్లాసీ యుద్ధం ముగియటంతో "భారతదేశానికి అంతమెరుగని విషాద కాళరాత్రి దాపురించింది" అని బెంగాలి కవి నబిన్ చంద్రసేన్ వర్ణించాడు. ఇంగ్లీషు వాళ్ళు మీర్‌జాఫర్‌ని బెంగాల్ నవాబుగా ప్రకటించి, తమకు ముట్టవలసిన కట్నాలు, కానుకల కోసం ఎగబడ్డారు. మీర్‌జాఫర్ ఇంగ్లీషు వాళ్ళకి బెంగాల్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలలో స్వేచ్ఛా వర్తకం చేసుకునే నిర్నిరోధ హక్కు ప్రసాదించాడు కలకత్తా సమీపంలోని 24 పరగణాల మీద కంపెనీకి జమీందారీ హక్కు ఏర్పడింది. కలకత్తా మీద లోగడ జరిగిన దాడికి నష్ట పరిహారంగా కొత్త నవాబు కంపెనీకి, వర్తకులకి 1,70,00,000 రూపాయలు సమర్పించుకున్నాడు. ఇవిగాక, కంపెనీ ఉన్నతాధి కారులకి 'కానుకలు', లంచాల రూపేణా భారీ మొత్తాలు చెల్లించాడు. ఉదాహరణకి, క్లైవు 20 లక్షల రూపాయలకు పైగా కొట్టేశాడు. వాట్స్‌కు 10 లక్షలకు పైగా ముట్టింది. మొత్తం మీద, కంపెనీగానీ, కంపెనీ ఉద్యోగులు గానీ కీలుబొమ్మ నవాబు దగ్గర 3 కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసుకుని వుండవచ్చుని క్లైవు అంచనా. పైపెచ్చు బ్రిటిషు వర్తకులుగానీ, అధికార్లు గానీ ప్రైవేటుగా చేసుకునే వ్యాపారం మీద చిల్లిగవ్వ కూడా పన్నుగా చెల్లించనక్కర్లేదు.

ప్లాసీ యుద్ధం బెంగాల్‌మీద, ఆ తరువాత యావత్ భారతదేశం మీద బ్రిటిష్ ఆధిపత్యానికి బాటలు పరిచింది. బ్రిటిష్ ప్రతిష్ఠని ఆకాశానికెత్తింది. ఒక్క దెబ్బతో, అది ఇంగ్లీషు కంపెనీని భారత సామ్రాజ్యాధిపత్యానికి ప్రధాన అభ్యర్థి హోదాకి లేవనెత్తింది. బెంగాల్ నుంచి వచ్చిపడే పుష్కలమైన ఆదాయంతో ఇంగ్లీషు వాళ్ళు బలీయ సైన్యం నిర్మించుకోగలిగారు. బెంగాల్ మీద అధిపత్యం ఆంగ్లో-ఫ్రెంచి సంఘర్షణలో నిర్ణాయక పాత్ర వహించింది. ప్లాసీ యుద్ధ విజయం ద్వారా కంపెనీ గానీ, కంపెనీ ఉద్యోగులు గానీ బెంగాల్ నిస్సహాయ ప్రజల కడుపుకొట్టి కోటానుకోట్ల సంపద కాజేశారు.

బ్రిటిషు చరిత్రకారులు ఎడ్వర్డ్‌థాంప్సన్, జి.టి. గారెట్‌లు ఇంగ్లీషు వాళ్ళ ఆశపోతుతనాన్ని ఇలా వర్ణించారు :

"ఒక తిరుగుబాటుని ప్రేరేపించటమన్నది ప్రపంచంలో అతి గొప్ప లాభసాటి వ్యాపారంగా తేలిపోయింది. కార్టెజ్, పిజారోల యుగంలో స్పెయిన్ వాసుల్ని ఆవహించిన హిస్టీరియా తరవాత చరిత్రలో కనీవినీ ఎరుగని దారుణ ధనదాహం ఇంగ్లీషు వాళ్ళ మనస్సుల్లో నిండిపోయింది. ముఖ్యంగా, బెంగాల్ నెత్తురునంతా పూర్తిగా పీల్చేసే దాకా అక్కడ శాంతి అనేది ఉండబోదు "

మీర్‌జాఫర్ ఆ స్థితికి రావటానికి ఇంగ్లీషు వాళ్ళే కారణమైనా, అతను వాళ్ళతో జరిపిన లావాదేవీలకు ఇప్పుడు పశ్చాత్తాప పడ్డాడు కంపెనీ అధికార్లు అదేపనిగా డిమాండు చేసే కానుకలు, లంచాలకు ఖర్చుపెట్టిన డబ్బుతో ఖజానా ఖాళీ అయింది క్లైవ్ అంతటివాడే స్వయంగా, డబ్బు డబ్బని పదే పదే నవాబుని నిర్బంధిస్తున్నాడు. కల్నల్ మాలెసన్ చెప్పినట్లుగా, "అందినంత మట్టుకి డబ్బు దోచెయ్యటం; ఇష్టమొచ్చినప్పుడల్లా చేతులు దోపి దోసిళ్ళతో డబ్బు బైటికి తీసే బంగారు గొనె సంచిలా మీర్ జాఫర్‌ని వాడుకోవటం కంపెనీ అధికార్ల ఏకైక లక్ష్యం " కంపెనీకే తీరని ధనదాహం పట్టింది. కామితాలు తీర్చే కామధేనువు దొరికిందనుకొని బొంబే, మద్రాసు ప్రెసిడెన్సీల పరిపాలనా వ్యయం యావత్తూ బెంగాల్ ఒక్కటే భరించాలని కంపెనీ డైరెక్టర్లు తాఖీదులు పంపారు. అంతటితో ఆగకుండా ఇండియా నుంచి ఎగుమతి చేసే సరుకులు సమస్తం బెంగాల్లో వచ్చే ఆదాయంతో కొనుగోలు చేయాలని ఆ మహాశయులు ఆదేశాలు జారీ చేశారు. కంపెనీ భారతదేశంలో కేవలం వ్యాపారంతో సరిపెట్టుకోకూడదు. బెంగాల్ నవాబుమీద తన పెత్తనాన్ని ఉపయోగించుకొని, ఆ రాష్ట్ర సంపద యావత్తు జలగమాదిరి పీల్చి వేయాలి!

కంపెనీ వాళ్ళ గొంతెమ్మ కోరికల్ని తీర్చటం అసాధ్యమని మీర్‌జాఫర్‌కి బోధపడింది అతని మీద తాము పెట్టుకున్న ఆశలకు అనుగుణంగా, నవాబు తమ కోర్కెల్ని తీర్చటం లేదని కంపెనీ ఉద్యోగుల్లో అసంతృప్తి ప్రబలింది. అతణ్ణి చేతగాని వాజెమ్మ కింద కట్టారు. 1760 అక్టోబరులో కంపెనీ మీర్‌జాఫర్‌ని గద్దె దింపి అతని అల్లుడు మీర్ ఖాసింను నవాబుగా ప్రకటించింది.

మీర్‌ఖాసిం కంపెనీ వాళ్ళు తనకు చేసిన సహాయానికి ప్రతిఫలంగా బర్ద్వాన్, మిద్నపూర్, చిట్టగాంగ్ జిల్లాల మీద కంపెనీకి జమీందారి హక్కు దఖలు పర్చాడు. ఉన్నతాధికారులందరికి సుమారు 29 లక్షల రూపాయలు కానుకల కింద సమర్పించుకున్నాడు

అంతటితో కంపెనీవాళ్ళు సంతృప్తి పడి, పరిపాలనా వ్యవహారాల్లో తనని స్వేచ్ఛగా వ్యవహరించనిస్తారని మీర్ ఖాసిం భావించాడు కంపెనీ పెత్తనం నుంచి విముక్తుడు కావాలని అతను నిర్ణయించుకున్నాడు పైగా అతడు శక్తి, సామర్థ్యం, దక్షత కలిగిన పరిపాలకుడు. తన స్వతంత్రాన్ని పరిరక్షించుకోవాలంటే సమృద్ధిగా ఆదాయం, సమర్థవంతమైన సైన్యం ఉండి తీరాలని మీర్ ఖాసిం గ్రహించాడు. అతని ధోరణి ఇంగ్లీషు వాళ్ళని నిరుత్సాహ పర్చింది బెంగాల్‌లో ఇంగ్లీషు వాళ్ళ స్థానానికి ఎసరు తెచ్చేవానిలా తయారయ్యాడు.

రెవెన్యూ వ్యవహారాల నిర్వహణలోని అవినీతిని రూపుమాపి ప్రభుత్వ ఆదాయాన్ని వృద్ధి చెయ్యటానికి, పాశ్చాత్య పద్ధతుల్లో ఒక ఆధునిక, క్రమశిక్షణాయుత సైన్యాన్ని నిర్మించటానికి మీర్‌ఖాసిం సంకల్పించాడు. ఇది ఇంగ్లీషు వాళ్ళకి

రుచించలేదు. 1717 ఫర్మానా ప్రసాదించిన ప్రత్యేక హక్కుల్ని దుర్వినియోగ పర్చనివ్వకుండా నవాబు తీసుకునే చర్యలు అగ్నిలో ఆజ్యం పోశాయి. తమ సరుకులు ఎగుమతి కోసమైతేనేం, దేశంలోపల వ్యాపారానికైతేనేం నవాబు పట్టించుకో కూడదని కంపెనీ ఉద్యోగుల భావన. స్వంత వ్యాపారానికి ఉద్దేశించబడ్డ సరుకు మీద కూడా తాము సుంకాలు చెల్లించేది లేదని వాళ్ళు మొండికెత్తారు ఇది సహజంగా స్వదేశ వర్తకుల మనస్సుని గాయపర్చింది. విదేశీయులు చట్ట వ్యతిరేకంగా పన్ను మినహాయింపు అనుభవిస్తూ, దేశస్థులైన తమచేత పన్నులు కక్కించటం భారతీయ వర్తకులు సహించలేక పోయారు. పై పెచ్చు కంపెనీ అధికార్లు తమకు ఇష్టులైన భారతీయ వర్తకులకు చట్ట వ్యతిరేకంగా దస్తక్‌లు (ఫ్రీపాసులు) అమ్మటం ప్రారంభించారు. ఆవిధంగా చాలామందికి అంతర్ వాణిజ్య సుంకాలు ఎగవెయ్యటానికి వీలు పడింది. దానివల్ల నీతిగా, నిజాయితీగా వ్యాపారం చేసే దేశీయ వర్తకులు ఇతర్ల అక్రమ పోటీకి తట్టుకోలేక ఆరిపోయారు. ప్రభుత్వ ఖజానాకు విశేషంగా సమకూరే రాబడి పడిపోయింది. వీటికి తోడు, కంపెనీ ఉద్యోగులు తమకు కొత్తగా సంక్రమించిన అధికారపు కైపులో "మిరుమిట్లు కొల్పే సంపద" మీది ప్రలోభంతో తేరగా డబ్బు కొల్లగొట్టుకునే ప్రయత్నంలో నవాబు అధికారుల్ని అవమానిస్తూ పీడించుకు తినటం ప్రారంభించారు బెంగాల్ పేద ప్రజానీకాన్ని పీల్చి పిప్పి చెయ్యటానికి పూనుకున్నారు. కానుకల కోసం, లంచాల కోసం, అధికార్ల, జమీందార్లని వేధించారు. దేశంలోని వృత్తి పనుల వాళ్ళని, రైతాంగాన్ని, వర్తకుల్ని తమ సరుకుని చౌకగా అమ్మ, కంపెనీ సరుకుని ప్రియంగా కొనుక్కోమని నిర్బంధించారు. "అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి"లా తయారైన ఈ పరిస్థితిని ఎదిరించిన వాళ్ళని కొరడాల్తో కొట్టారు. జైళ్ళల్లో కుక్కారు ఈ కాలాన్ని "సిగ్గూశరం వదిలేసిన బహిరంగ దోపిడీ యుగం"గా ఆధునిక బ్రిటిష్ చరిత్రకారుడు పెర్సివల్ స్పియర్ వర్ణించాడు. అతులిత సంపదకు పేరుపడ్డ బెంగాల్ భాగ్యదీపం క్రమేణా కొడిగట్టి పోయింది.

ఈ అవినీతి, అవకతవకలు కొనసాగిన పక్షంలో బెంగాల్‌ని పటిష్టంగా తీర్చిదిద్దటం గానీ, కంపెనీ అదుపాజ్ఞల నుంచి బైటపడ్డం కానీ జరగని పనని మీర్ ఖాసిం గ్రహించాడు. దేశం లోపల జరిగే వర్తక వ్యాపారాల మీద పన్ను రద్దు చేశాడు. ఇది నిజంగా సాహసోపేతమైన చర్య. ఇంగ్లీషు వాళ్ళు బలవంతంగా గుంజుకున్న రాయితీని మీర్ ఖాసిం పన్ను రద్దు ద్వారా తన దేశస్థులైన వర్తకులకు ధైర్యంగా కల్పించాడు. తమకి, దేశస్థులకి మధ్య సమాన హోదా ఇవ్వటం ఇంగ్లీషు వాళ్ళు కంటగించుకున్నారు. భారతీయ వర్తకుల పైన మళ్ళీ పన్ను వెయ్యమని నవాబుని ఒత్తిడి పెట్టారు. తిరిగి యుద్ధం తప్పని పరిస్థితికిది నాందీ వాచకం. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవనేది అసలు విషయం బెంగాల్‌లో ఇద్దరు యజమానులు మనగలగ లేరు. తను స్వతంత్ర ప్రభువునని మీర్ ఖాసిం విశ్వాసం; అతను తమ చెప్పు చేతల్లో కేవలం ఒక పనిముట్టుగా అణగిమణగి పడి వుండాలని కంపెనీ వాళ్ళ పట్టుదల. ఇతగాణ్ణి గద్దెమీద కూర్చుంటబెట్టింది తాము కాదా యేం అని వాళ్ళ ధీమా.

1763లో వరుసగా జరిగిన యుద్ధాల్లో మీర్ ఖాసిం ఓడిపోయి, అవధ్‌కు పారిపోయాడు. అవధ్ నవాబు షుజా ఉద్దౌలాతోను, రాజ్యభ్రష్టుడైన మొఘల్ చక్రవర్తి రెండవ షా ఆలంతోను పొత్తు కుదుర్చుకున్నాడు. ఈ ముగ్గురూ కలిసి 1764 అక్టోబరు

22 న బక్సారు వద్ద ససైన్యంగా కంపెనీ వాళ్ళతో తలపడి, చిత్తుగా ఓడిపోయారు భారత చరిత్రలో జరిగిన అత్యంత నిర్ణయాత్మక యుద్ధాల్లో బక్సారు యుద్ధం ఒకటి ఈ యుద్ధంలో భారతదేశంలోని రెండు పెద్ద రాజ్యాల సంయుక్త సేనల మీద ఇంగ్లీషు ఆయుధబలం యొక్క ఆధిక్యత వెల్లడయింది. ఇది బెంగాల్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలకు ఇంగ్లీషు వాళ్ళని ప్రభువులుగా స్థిరపర్చింది; అవధ్ ఇంగ్లీషు వాళ్ళ దయాదాక్షిణ్యాలకు లోనయింది

1765లో బెంగాల్ గవర్నరుగా తిరిగి వచ్చిన క్లైవ్ ఇంగ్లీషు వాళ్ళ ప్రత్యక్ష రాజ్యాధికారాన్ని స్థాపించటం కోసం నవాబుల నుంచి సకల ప్రభుత్వాధికారాల్ని క్రమేణా కంపెనీకి బదలాయించటానికి పూనుకున్నాడు 1763లో కంపెనీ తిరిగి మీర్‌జాఫర్‌ని నవాబుగా చేసింది యథాప్రకారం కంపెనీ, కంపెనీ అధికార్లు కట్నాలు, కానుకలు గుంజుకున్నారు మీర్‌జాఫర్ చనిపోగానే, అతని కుమారుడు నిజాం-ఉ-ద్దౌలాని గద్దె ఎక్కించారు దానికి ప్రతిఫలంగా 1765 ఫిబ్రవరి 20 న అతని చేత ఒక కొత్త ఒడంబడిక మీద సంతకాలు చేయించారు దాని ప్రకారం, నవాబు తన సైన్యాన్ని పూర్తిగా తగ్గించుకోవాలి. కంపెనీ వాళ్ళు నియమించిన ఒక ఉప సుబేదారు ద్వారా పరిపాలన నిర్వహించాలి ఆ ఉప సుబేదారుని తొలగించాలంటే కంపెనీ వారి అనుమతి పొందాలి ఆ విధంగా ఇంగ్లీషు తూర్పిండియా కంపెనీ బెంగాల్ మీద సర్వాధిపత్యం సంపాయించింది బెంగాల్ కంపెనీ కౌన్సిలు సభ్యులు నవాబు దగ్గర మళ్ళీ 15 లక్షల రూపాయలు గుంజారు

మొఘల్ సామ్రాజ్యానికి నామమాత్రపు చక్రవర్తిగా వున్న రెండవ షా ఆలం నుంచి కంపెనీ దివానీ హక్కుని రాబట్టుకుంది దివానీ అంటే రెవెన్యూ వసూలు చేసుకునే హక్కు. తద్వారా బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో రెవెన్యూ వసూలు చేసుకునే హక్కు కంపెనీకి దక్కింది బెంగాల్ మీద ఇంగ్లీషు వాళ్ళ రాజ్యాధికార హక్కు చట్టబద్ధమైంది భారతదేశంలో సుసంపన్నమైన రాష్ట్రాలుగా పేరుబడ్డ బెంగాల్, బీహార్, ఒరిస్సాలు కంపెనీ వారి ఆధిపత్యం కిందికి వచ్చాయి. దివానీ హక్కు దక్కించుకున్నందుకు బదులుగా కంపెనీ వాళ్ళు రెండవ షా ఆలం చక్రవర్తికి 20 లక్షల రూపాయలు, కోరా, అలహాబాద్ జిల్లాలు ఇచ్చారు. షుమారు ఆరు సంవత్సరాల పాటు రెండవ షా ఆలం ఇంగ్లీషు వారి బందీగా అలహాబాద్ కోటలో జీవితం గడిపారు

అవధ్ నవాబు షుజా ఉద్దౌలా యుద్ధ పరిహారం కింద కంపెనీకి 50 లక్షల రూపాయలు చెల్లించాడు. ఉభయులకు మధ్య జరిగిన ఒడంబడిక ప్రకారం, ఇంగ్లీషు వాళ్ళు షుజా ఉద్దౌలాను శత్రుదాడి నుంచి ఆదుకుంటారు దానికి గాను అయ్యే సైనిక ఖర్చుని నవాబే భరించాలి దీనివల్ల నవాబు ఇంగ్లీషు వాళ్ళమీద పూర్తిగా ఆధారపడిపోయాడు. ఈ కంపెనీ వాళ్ళదేముంది; ఈ రోజుండి రేపు పోయేవాళ్ళే; కాని మహారాష్ట్రులు, ఆఫ్ఘన్లు తనకు నిజమైన శత్రువులు అని ఒక దురభిప్రాయంలో పడిపోయి నవాబు ఆ ఒడంబడిక మీద సంతోషంగా సంతకం చేశాడు అటు అవధ్‌కు, ఇటు దేశం మొత్తానికి అది దారుణమైన పొరపాటుగా పరిణమించింది. మరోపక్క, బ్రిటిషు వాళ్ళు బెంగాల్ మీద తమ ఆధిపత్యాన్ని పటిష్ఠం చేసుకోటానికి తెలివిగా వ్యవహరించి, తమ భూభాగానికి, మహారాష్ట్రులకు మధ్య అవధ్‌ను దిండులాగా వాడుకున్నారు

***బెంగాల్‌లో ద్వంద ప్రభుత్వం :*** కనీసం 1765 నుంచి తూర్పిండియా కంపెనీ బెంగాల్ రాష్ట్రానికి నిజమైన యజమానిగా అవతరించింది. రాష్ట్ర రక్షణ బాధ్యత యావత్తు కంపెనీ సైన్యం చేతుల్లోకి పోయింది. రాజకీయ సర్వాధికారం కంపెనీ హస్తగతమైంది. దివాన్‌గా కంపెనీ ప్రత్యక్షంగా పన్నులు వసూలు చేసుకుంది; ఉప సుబేదారుని నేరుగా నియమించి పాలనాధికారం చలాయించింది. అంటే పోలీసు, న్యాయాధికారాలు కంపెనీ చేతుల్లోకి పోయాయి. ఒకే వ్యక్తి కంపెనీ తరఫున ఉప దివాన్‌గాను, నవాబు తరఫున ఉప సుబేదారుగాను వ్యవహరించటం వల్ల పాలనా బాధ్యతలు, పన్ను వసూలు హక్కు దాదాపు కలగలిసి పోయి బ్రిటిషువారి ఏకచ్ఛత్రాధిపత్యాన్ని చాటాయి. ఈ పద్ధతి "ద్వంద ప్రభుత్వం" అన్న పేరుతో చరిత్రలో పేరు కెక్కింది. దీనివల్ల బ్రిటిషువారి కొక గొప్ప లాభం చేకూరింది. బాధ్యతల బెడద లేకుండా కంపెనీకి అధికారం సిద్ధించింది. ఇంగ్లీషు వాళ్ళు రాష్ట్ర ఆదాయాన్ని, సైన్యాన్ని నేరుగా తమ చేతుల్లో పెట్టుకొని పాలనా నిర్వహణ మీద పరోక్షంగా అజమాయిషీ చేశారు. నవాబు, అతని కింద అధికార్లు పాలనా బాధ్యతలు నెత్తిన వేసుకున్నా, ఆ బాధ్యతల్ని నిర్వర్తించే అధికారాలు వాళ్ళకు లేవు. కాబట్టి ప్రభుత్వ అవకతవకలకి భారతీయులు బాధ్యత వహిస్తే, ఆదాయాన్ని, లాభాల్ని బ్రిటిషు వాళ్ళు పిండుకున్నారు. ద్వంద ప్రభుత్వ దుష్ఫలితాల్ని బెంగాల్ ప్రజలు అనుభ వించారు. నవాబుగానీ, కంపెనీ గాని ప్రజల బాగోగులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఏదేలా ఉన్నా, కంపెనీ దారుణ ధన దురాశాపరత నుంచి ప్రజల్ని కాపాడే అధికారం నవాబు అధికార వర్గానికి లేనే లేదు. మరోవేపు, తమ అధికారాన్ని ఉపయోగించుకొని దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుందామనే ఆతురతలో వాళ్ళున్నారు.

బెంగాల్ యావత్తు కంపెనీ అధికార్ల కబంధ హస్తాల మధ్య ఇరుక్కు పోయింది. ఇష్టానుసారంగా ప్రజల్ని పీడించుకు తినడం పెచ్చు పెరిగి పోయింది. ఆ పరిస్థితిని క్లైవ్ స్వయంగా ఇలా వర్ణించాడు :

"అటువంటి అరాచకత్వం, గందరగోళం, అవినీతి, లంచగొండితనం, దోపిడీ ఒక్క బెంగాల్లోను తప్ప ప్రపంచంలో మరెక్కడా కానరాదని నేను ఘంటాపథంగా చెప్పగలను; అట్లాగే, అంత అక్రమంగా, దురాశా పూరితంగా సంపద పోగుజేసుకో వటం కూడా నేనెక్కడా చూడబోను. అక్షరాలా ముప్పై లక్షల పౌండ్ల ఆదాయం తెచ్చిపెట్టే బెంగాల్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలు మూడు మీర్‌జాఫర్‌ని మళ్ళీ గద్దె ఎక్కించినప్పటి నుంచి కంపెనీ అధికార్ల సంపూర్ణమైన ఏలుబడి కింద ఉన్నాయి. పౌర, సైనిక అధికారాలు రెండూ వాళ్ళవే. కాస్తో కూస్తో అధికారం,పలుకుబడి కలిగిన ప్రతి మనిషి దగ్గరా, నవాబు మొదలుకొని చోటా జమీందారు దాకా అందరి దగ్గరా కంపెనీ అధికార్లు విరాళాలు గుంజారు."

లండన్‌లోని కంపెనీ అధికార్లు తమవంతు కర్తవ్యంగా బెంగాల్ సంపదని యావత్తు పీల్చి బెంగాల్‌ని పిప్పి చెయ్యటానికి పూనుకున్నారు. భారతీయ వస్తువుల్ని కొనుగోలు చెయ్యటానికి వాళ్ళు డబ్బు పంపటం మానుకున్నారు. బెంగాల్ మీద వచ్చే ఆదాయంతో ఇక్కడ సరుకు కొని, ఇంగ్లండ్‌లో అమ్ముకున్నారు. వీటికి కంపెనీ పెట్టుబడి అని పేరు పెట్టారు. కంపెనీ సంపాయించే లాభాల్లో ఇవి ఒక భాగం. ఈ భాగోతం చాలక, బ్రిటిషు ప్రభుత్వం ఈ వేటలో వాటా పెట్టమని కంపెనీని ఏలదీసింది.

ఏటా, నాలుగు లక్షల పౌండ్లు తన వాటా కింద చెల్లించమని ప్రభుత్వం 1767లో ఉత్తరువులు జారీ చేసింది.

1766 నుండి 1768 వరకూ, ఒక్క మూడు సంవత్సరాల స్వల్ప కాలంలో తూర్పిండియా కంపెనీ బెంగాల్ నుంచి షుమారు 57 లక్షల పౌండ్లు పిండుకుంది. ద్వంద ప్రభుత్వ వ్యవస్థ అవకతవకలొక వేపు, ఉన్న సంపద యావత్తు ఊడ్చుకుపోయే దమన నీతి మరొక వేపు ఆ దురదృష్ట రాష్ట్రాన్ని పిప్పి చేసేశాయి. 1770లో బెంగాల్‌లో భయంకర క్షామం తాండవించింది దాని కరాళ నృత్యంలో జరిగిన ఘోరకలిని లెక్కగడితే, మానవ చరిత్రలో అంతటి భయానక కాటకం మరొకటి లేదని రుజువయింది. లక్షలాదిజనం పురుగుల్లా రాలిపోయారు బెంగాల్ జనాభాలో దాదాపు మూడవ వంతు కరువు రాక్షసి కరాళ దంష్ట్రల్లో నలిగి పోయారు. వానలు కరవై క్షామం సంభవించినప్పటికీ, దాని భయంకర పరిణామాలకు కారణం కంపెనీ విధానాలే.

***వారన్ హేస్టింగ్స్ (1772–1785), కార్న్‌వాలిస్ (1786–'93) ల హయాంలో యుద్ధాలు :*** 1772 నాటికి తూర్పిండియా కంపెనీ భారతదేశ ప్రముఖ రాజకీయాధికార శక్తిగా రూపొందింది ఇంగ్లండ్‌లోని కంపెనీ డైరెక్టర్లు, ఇండియాలోని కంపెనీ అధికార్లు నూతన దిగ్విజయ యాత్ర సాగించటానికి ముందుగా బెంగాల్ మీద తమ ఆధిపత్యాన్ని సుస్థిరం చేసుకోడానికి సిద్ధమయ్యారు ఏమైనా, భారత స్వదేశ సంస్థానాల అంతరంగిక వ్యవహారాల్లో వేలు పెట్టే అలవాటుని మాత్రం ఇంగ్లీషు వాళ్ళు మానుకోలేదు కొత్త భూభాగం కోసం, డబ్బు కోసం పుట్టిన పెర పెర వాళ్ళని అనేక యుద్ధాల్లో ఇరికించింది

1766లో వాళ్ళు నైజాం నవాబుతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు మైసూరు సంస్థానాధీశుడు హైదరాలీ నైజాం నవాబు మీద దాడిచేస్తే కంపెనీ సైన్యాలు వెళ్ళి అదుకోవాలి. దానికి ప్రతిఫలంగా నైజాం నవాబు ఇంగ్లీషు వాళ్ళకి ఉత్తర సర్కారు జిల్లాల్ని సమర్పించుకోవాలి ఇదీ ఒప్పందం కాని, హైదరాలీ సేనలకి కంపెనీ సైన్యం సమవుజ్జీ కాదు. హైదరాలీ బ్రిటిషు దాడిని తిప్పికొట్టడంతో ఆగకుండా 1769లో కంపెనీ స్థావరం మద్రాసుకే ఎసరు తెచ్చాడు మద్రాసు కౌన్సిలు గత్యంతరం లేక హైదరాలీతో సంధికి దిగివచ్చి, అతను విధించిన షరతుల మీద, శాంతి సంధి మీద సంతకాలు చేసింది హైదరాలీ తాను జయించిన భూభాగం తాను తీసేసుకున్నాడు ఇద్దర్లో ఏ ఒకరి మీదనైనా వేరే మూడవ పక్షం దండెత్తి వచ్చే సందర్భంలో పరస్పరం సహాకరించుకోడానికి అంగీకారం కుదుర్చుకున్నారు కానీ, 1771లో మహారాష్ట్రులు హైదరాలీ మీదికి దండెత్తి వచ్చినప్పుడు ఇంగ్లీషు వాళ్ళు మాటని నిలబెట్టుకోలేదు. దాంతో హైదరాలీకి ఇంగ్లీషు వాళ్ళంటే కంటగింపు, వాళ్ళమీద అపనమ్మకం కలిగాయి

1775లో ఇంగ్లీషు వాళ్ళకి మహారాష్ట్రులతో తగాదా వచ్చింది. మహారాష్ట్రుల మధ్య అధికారవారసత్వం కోసం సంఘర్షణ రగిలిన కాలం అది. పసివాడుగా ఉన్న రెండవ మాధవరావు పీష్వా తరఫున నానాఫడ్నవీస్, అతనికి వ్యతిరేకంగా రఘునాధరావు బరిలోకి దూకిన సమయం అది బొంబాయిలోని కంపెనీ అధికార్లు రఘునాధరావు తరఫున కొమ్మెనుకుని రంగంలోకి దిగారు. మద్రాసు, బెంగాల్ ప్రాంతాల్లో మాదిరిగా సంఘటనలు అక్కడా పునరావృతం అవుతాయని కంపెనీ వాళ్ళు ఆశించారు మద్రాసులో, బెంగాల్‌లో మాదిరిగా మహారాష్ట్రలో కూడా డబ్బు సంచులు

గుంజుకోవచ్చని ఆశపడ్డారు. 1775 నుండి 1782 దాకా మహారాష్ట్రులతో సాగిన సుదీర్ఘ యుద్ధంలో తలమునకలై పోయారు.

ప్రారంభంలో మహారాష్ట్రులు బ్రిటీషు బలాల్ని తలెగావ్ దగ్గర ఓడించి వడెగావ్ ఒడంబడిక మీద సంతకాలు పెట్టించారు. దాని ప్రకారం, ఇంగ్లీషువాళ్ళు తాము జయించిన భూభాగాన్ని తిరిగి అప్పగింతపెట్టారు. రఘునాథరావు పక్షం వదిలివేశారు. కాని, మళ్ళీ వెంటనే యుద్ధం మొదలయింది.

భారత దేశంలో బ్రిటీషు ఆధిపత్యానికి ఎసరొచ్చిన విషమకాలం అది. మరాఠా సర్దార్లు యావన్మంది పీష్వా తరఫున, పీష్వాను బలపరిచే నానాఫడ్నవీస్ తరఫున ఐక్యంగా నిలబడ్డారు. ఇంగ్లీషు వాళ్ళ వాసనగిట్టని హైదరాలీ, నైజాంలు కంపెనీకి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించారు. మహారాష్ట్రుల, హైదరాలీ, నైజాంల శక్తివంతమైన సంయుక్త ప్రతిఘటనని కంపెనీ ఏకాకిగా ఎదుర్కోవలసి వచ్చింది. పైగా అమెరికాలో 1776 లో ప్రజలు బ్రిటీషు వాళ్ళకి వ్యతిరేకంగా తిరగబడ్డారు. అమెరికా వలసయుద్ధాల్లో బ్రిటీషు వాళ్ళ ఓటమి దగ్గరపడింది. మరోవేపు, చుట్టుముట్టిన ఇబ్బందుల్లో ఊపిరాడక ఉక్కిరి బిక్కిరవుతున్న తమ పాత శత్రువుని నొక్కి పారవెయ్యటానికి ఫ్రెంచి వాళ్ళు సమాయత్తమయ్యారు.

అయితే, ఆనాడు బ్రిటీషు గవర్నర్‌జనరల్ వారన్ హేస్టింగ్స్ మహాపదునైనవాడు, సమర్థవంతుడు, అనుభవజ్ఞుడు. ధృఢమైన పట్టుదలతో, కృతనిశ్చయంతో వారన్ హేస్టింగ్స్ కూలిపోయే బ్రిటీషు అధికారాన్ని, ప్రతిష్టని నిలబెట్టాడు. గోదర్డ్ అనే బ్రిటిష్ సేనాని నాయకత్వంలో కంపెనీ బలాలు ఒక అద్భుత వ్యూహానుగుణంగా మధ్య భారతం గుండా పురోగమించి, మధ్యలో పరంపరగా విజయాలు సాధించి 1780 లో అహమ్మదాబాద్‌ని స్వాధీనం చేసుకున్నాయి. అమేయ సాధనసంపత్తితో, తీవ్ర అభినివేశంతో పోరుకు తలపడ్డ మహారాష్ట్రులు బ్రిటీషు సైన్యానికి కొరకరాని కొయ్య అయ్యారు. మహదాజీ సింధియా తన ప్రతాప ప్రభ ప్రదర్శించాడు. ఆయనతో పోటీకి దిగటానికి ఇంగ్లీషు వాళ్ళు జంకారు. ఇరు పక్షాల్లో విజయం ఎవర్నీ వరించలేదు. యుద్ధం నిలిచిపోయింది. మహదాజీసింధియా మధ్యవర్తిత్వం ద్వారా 1782 లో సాల్బే శాంతి సంధి మీద సంతకాలు జరిగాయి. యధా పూర్వస్థితికి ఉభయపక్షాలు సమ్మతించాయి. భారత సంస్థానాల సంయుక్త ప్రతిఘటన నుంచి ఇంగ్లీషు వాళ్ళు బైట పడ్డారు.

దీన్నే చరిత్రలో మొదట ఆంగ్ల-మహారాష్ట్ర యుద్ధం అంటాం. ఈ యుద్ధంలో ఏ పక్షానికీ విజయం కలగలేదు. అయితే, బ్రిటీషు వాళ్ళకి వేరే మేలు జరిగింది. ఆ తరువాత 20 సంవత్సరాలపాటు మహారాష్ట్రులతో శాంతియుతంగా జీవించే సదుపాయం కలిగింది. ఆనాడు, మహారాష్ట్రులంటే భారతదేశంలో ఒక దుర్నిరీక్ష శక్తి. మహారాష్ట్రుల్తో శాంతి వర్ధిల్లిన కాలంలో ఇంగ్లీషువాళ్ళు బెంగాల్ ప్రెసిడెన్సీ (రాష్ట్రం) లో తమ ప్రభుత్వాన్ని దృఢపర్చుకునే అవకాశం సద్వినియోగపర్చుకున్నారు. ఈ లోగా మారణ అంతఃకలహాల్లో మునిగిపోయి మహారాష్ట్రుల శక్తియుక్తులు ఉడిగిపోయాయి. సాల్బే సంధి ప్రకారం, హైదరాలీతో జరిగిన యుద్ధంలో పూర్వం కోల్పోయిన తమ భూభాగాన్ని పునరాక్రమించుకునే సందర్భం వచ్చినప్పుడు మహారాష్ట్రులు ఇంగ్లీషు వాళ్ళకి మద్దతు ఇస్తామని వాగ్దానం చేశారు. కాబట్టి, ఇంగ్లీషు వాళ్ళు మైసూరు మీద

తుపాకులు బారుచేశారు. స్వదేశసంస్థానాలు రెంటిని చీలదియ్యడంలో ఇంగ్లీషు వాళ్ళు మళ్ళీ కృతకృత్యులయ్యారు.

హైదరాలీతో యుద్ధం 1780 లో మొదలయింది. పూర్వం మాదిరిగానే, హైదరాలీ ఇంగ్లీషు వాళ్ళని దెబ్బమీద దెబ్బ తీశాడు. ఇంగ్లీషు సైన్యంలో అసంఖ్యాకులు లొంగిపోక తప్పలేదు. హైదరాలీ దాదాపు యావత్తు కర్నాటకని కైవసం చేసుకున్నాడు. కాని మళ్ళీ బ్రిటీషు వాళ్ళ రాజనీతిజ్ఞత, ఆయుధబలం వాళ్ళని కాపాడింది. గుంటూరు జిల్లాని అప్పగింత పెట్టటం ద్వారా నైజాంని లంచంతో లొంగదీసి అతణ్ణి బ్రిటిష్ వ్యతిరేక కూటమి నుంచి వేరుపర్చారు. వారన్ హేస్టింగ్స్, 1781-82 మధ్య మహారాష్ట్రుల్తో సంధి చేసుకొని, మహారాష్ట్ర సరిహద్దుల్లో కాపుంచిన సైన్యాన్ని ఉపసంహరించి మైసూరుకు వ్యతిరేకంగా మోహరించాడు. 1781 జూలై లో ఐర్‌కూట్ నాయకత్వంలో సాగిన బ్రిటిష్ సేనలు పోర్టోనోవో వద్ద హైదరాలీని ఓడించి మద్రాసును కాపాడుకున్నాయి. 1782లో హైదరాలీ మరణానంతరం, అతని కుమారుడు టిప్పు సుల్తాన్ యుద్ధాన్ని కొనసాగించాడు. ఉభయులూ ఒకరి నొకరు పడగొట్టుకోలేక పోరు విరమించి 1784 మార్చిలో శాంతి ఒప్పందం చేసుకున్నారు. బ్రిటీషు వాళ్ళు మహారాష్ట్రుల్ని గానీ, మైసూరునుగానీ ఓడించే చేవలేనివాళ్ళమని నిరూపించుకుని కూడా భారతదేశంలో తమ పట్టుని చేజారిపోకుండా నిలుపుకోగల తమ సత్తాని రుజువు పర్చుకున్నారు. వాళ్ళు దక్షిణ భారతదేశంలో పూర్తిగా తుడిచిపెట్టుకు పోకుండా కాపాడుకోగలగడమే కాకుండా, ఆ యుద్ధాల్లో భారతదేశంలోని మూడు అగ్రరాజ్యాల్లో ఒకటిగా బ్రిటిష్ రాజ్యం మొగ్గ దొడిగింది.

బ్రిటీషు వారి దృక్పథంలో, మైసూరుతో జరిగిన మూడవ యుద్ధం చాలా ఫలవంతమైంది. 1784 శాంతి సంధి టిప్పు సుల్తానుకు-బ్రిటీషువాళ్ళకి మధ్య సంఘర్షణ మూల కారణాల్ని తొలగించలేదు. కేవలం సంఘర్షణని వాయిదా వేసింది. నిజానికి, కంపెనీ అధికార్లకు టిప్పు సుల్తానంటే విపరీత ద్వేషం. దక్షిణాదిన అతణ్ణి తమ ప్రబల శత్రువుగా, దక్షిణ భారతంలో తమ సంపూర్ణాధిపత్యానికి పెద్ద అడ్డంకిగా టిప్పుసుల్తాన్‌ని ఇంగ్లీషువాళ్ళు పరిగణించారు. టిప్పుసుల్తాన్ కూడా ఇంగ్లీషు వాళ్ళని విపరీతంగా ద్వేషించాడు. తన స్వాతంత్ర్యానికి కంపెనీని ముఖ్య ప్రమాదంగా భావించాడు. అంచేత, ఎలాగైనా బ్రిటీషు వాళ్ళని ఈ దేశం నుంచి బహిష్కరించాలని ఆశలు పెట్టుకున్నాడు.

ఉభయుల మధ్య 1789లో తిరిగి యుద్ధం ప్రజ్వరిల్లింది. టిప్పు సుల్తాన్ ఆదర్శప్రాయమైన ధైర్యసాహసాలు ప్రదర్శించి పోరాడినా, అప్పటి గవర్నర్ - జనరల్ లార్డ్ కారన్‌వాలిస్ తన అమోఘ రాజనీతి చతురతతో అతణ్ణి ఏకాకిని చేశాడు. మహారాష్ట్రుల్ని, నైజాంను, తిరువాన్కూరు, కూర్గు రాజాలను తన వేపు తిప్పుకున్నాడు. సాటి దేశస్థుడైన సంస్థానాధీశునికి వ్యతిరేకంగా తాత్కాలిక ప్రయోజనాల కోసం విదేశీయులతో చేతులు కలిపే స్వదేశ రాజుల సంకుచిత దృష్టిని ఈ యుద్ధం మరొక తూరి బట్టబయలు చేసింది. శ్రీరంగ పట్నం సంధి ద్వారా టిప్పు సుల్తాన్ తన రాజ్యంలో సగం భూభాగాన్ని బ్రిటీషు-స్వదేశ రాజుల కూటమికి ధారాగతం చేసి, 3 కోట్ల 30 లక్షల రూపాయలు యుద్ధ పరిహారం కింద చెల్లించాడు. మూడవ ఆంగ్ల-కర్నాటక యుద్ధం దక్షిణ భారతదేశంలో టిప్పు సుల్తాన్ ఆధిక్యతని బద్దలు కొట్టి, బ్రిటీషు ఆధిపత్యాన్ని దృఢంగా నెలకొల్పింది.

***లార్డ్ వెల్లస్లీ (1798-1805) హయాంలో బ్రిటిష్ రాజ్య విస్తరణ :*** ప్రపంచ మంతటా ఫ్రాన్స్‌తో ఇంగ్లండ్ జీవన్మరణ పోరాటంలో నిమగ్నమైవున్న తరుణంలో లార్డ్ వెల్లస్లీ 1798లో భారతదేశానికి గవర్నర్ -జనరల్‌గా వచ్చారు. ఆయన కాలంలో భారతదేశంలో బ్రిటిష్ పరిపాలన మరో విధత విస్తృత స్థాయిలో విస్తరించింది.

అప్పటివరకు, బ్రిటీషు వాళ్ళు భారతదేశంలో తాము సాధించిన ఫలితాలను, సాధన సంపత్తిని సుస్థిర పర్చుకునే వైఖరిని అవలంభించారు. ప్రధాన స్వదేశ రాజ్యాలతో శత్రుత్వం పెట్టుకోనవసరం లేకుండా తేలికగా భారత భూభాగాన్ని కలుపుకోగలిగిన మేరకు ఆ ప్రయత్నం సాగించారు. లార్డ్ వెల్లస్లీ ఆ మొహమాటాలేమీ లేకుండా సాధ్యమైనంతవరకు వీలైనన్ని ఎక్కువ స్వదేశ రాజ్యాల్ని బ్రిటీషు అధిపత్యం కిందికి తేవాలని నిర్ణయించారు. ఆ విధంగా తేవటానికి సమయం అనుకూలంగా ఉందని గుర్తించారు. 1797 నాటికి బలియమైన రెండు స్వదేశ రాజ్యాలైన మహారాష్ట్ర, మైసూరుల బలం క్షీణించిపోయింది. మూడవ అంగ్ల-కర్నాటక యుద్ధంతో మైసూరు గత వైభవ అవశేషంగా మిగిలిపోయింది. పరస్పర అంతః కలహాలలో, అంతర్యుద్ధాలలో మునిగి తేల్తూ మహారాష్ట్రులు బలహీనులైపోయారు. మరో మాటల్లో భారతదేశంలోని రాజకీయ పరిస్థితులు బ్రిటిష్ విస్తరణ విధానానికి అనుకూలంగా ఉన్నాయి. దురాక్రమణ చాలా తేలిక, లాభకరం కూడా పైపెచ్చు, ఇంగ్లండ్ వ్యాపార, పారిశ్రామిక వర్గాలు భారతదేశంలో బ్రిటిష్ రాజ్యం ఇంకా విస్తరించాలని వాంఛిస్తున్నాయి. యుద్ధం వ్యాపారాన్ని దెబ్బ తీస్తుందనే భీతితో ఇప్పటి దాకా వాళ్ళు శాంతియుత విధానాన్ని బలపరుస్తూ వచ్చారు. 18వ శతాబ్దం ముగిసే నాటికి వాళ్ళ ఆలోచనలో మార్పు వచ్చింది. దేశం మొత్తం బ్రిటీషు అధిపత్యం కిందికి వస్తేనే, బ్రిటిష్ సరుకులు భారతదేశంలో భారీ ఎత్తున అమ్ముడవుతాయనే భావన వాళ్ళకి కలగజొచ్చింది. లాభాలకు లోటు రాకుండా, రాజ్య విస్తరణ విధానాన్ని విజయవంతంగా ముందుకు తీసుకుపోగలిగితే అదే మేలనే అభిప్రాయానికి కంపెనీ కూడా సుముఖంగా ఉంది. ఇవన్నీ కాకుండా, ఫ్రెంచ్ పలుకుబడిని ఇండియాలో పెరగనీకుండా దాన్ని కూకటి వేళ్ళతో పెకలించి వెయ్యటానికి బ్రిటీషువాళ్ళు పట్టుదల పట్టారు. కనుక ఏ సంస్థానమైనా ఫ్రాన్సుతో సంబంధాలు పెట్టుకోవటానికి ప్రయత్నించినట్లు కనబడితే చాలు, దాన్ని తక్షణం నుగ్గు నుగ్గు చెయ్యాలని వాళ్ళు నిశ్చయించుకున్నారు. భారతదేశంలో కంపెనీ రాజ్య భద్రతకు అఫ్ఘన్ రాజు జమన్ షా ప్రమాదం విరుచుకు పడబోతోంది. ఉత్తర హిందుస్థానంలోని ప్రభువుల అండదండలు అతనికున్నాయి. బ్రిటీషు వాళ్ళని ఈ దేశం నుంచి తన్ని తగలెయ్యటానికి టిప్పు సుల్తాన్ జమన్ షాని ఆహ్వానించాడు.

లార్డ్‌వెల్లస్లీ తన రాజకీయ లక్ష్యాలను సాధించటానికి మూడు పద్ధతుల మీద ఆధారపడ్డారు: ఒకటి, సైన్య సహకార పద్ధతి, రెండు, సూటిగా యుద్ధాలు, మూడు, వెనుక తాము ఓడగొట్టిన రాజుల, నవాబుల రాజ్యాల్ని బ్రిటిష్ రాజ్యంలో విలీనం చేసుకోవటం. సైనిక ఖర్చులు తీసుకొని ఒక స్వదేశరాజుకు సైన్య సహాయం చెయ్యటం పాత పద్ధతి. దానికి లార్డ్‌వెల్లస్లీ ఒక కొత్త నిర్దిష్ట రూపాన్ని ఇచ్చారు. ఈ కొత్త పద్ధతి ద్వారా స్వదేశ రాజ్యాల్ని బ్రిటిష్ సర్వాధికార శక్తికి దాసోహం చేయించటమనేది వెల్లస్లీ ప్రవేశపెట్టారు. దానికి సైన్య సహకార పద్ధతి (Subsidiary Alliance System) అని

పేరు పెట్టాడు. ఆ పద్ధతి కింద, బ్రిటిష్ మిత్రత్వాన్ని కోరే ఏ స్వదేశ రాజైనా తన సంస్థానంలో బ్రిటిష్ బలాలను శాశ్వతంగా నిలిపి ఉంచుకోటానికి సమ్మతి ప్రకటించాలి ఆ సైన్య పోషణకుగాను సబ్సిడీ చెల్లించాలి. ఇదంతా అతని రక్షణకి ఉద్దేశించిందే అన్నారు బ్రిటీషువాళ్లు. కాని, వాస్తవానికి బ్రిటీషు పాలకులు స్వదేశ రాజుల చేత కప్పం కట్టించుకునే ఒక మార్గం ఇ ది. ఏటా డబ్బు రూపంలో సబ్సిడీ చెల్లించే బదులు రాజ్యంలో కొంత భాగాన్ని బ్రిటీషు వారికి సమర్పించుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఇవికాక, ఈ పద్ధతిని ఆమోదించే స్వదేశ రాజులు తమ దర్బారులో బ్రిటిష్ ప్రతినిధి నియామకాన్ని అంగీకరించి తీరాలి ఆ ప్రతినిధి సంస్థాన దైనందిన రాజ్య వ్యవహారాల్లో వేలు పెట్టం కద్దు. ఇవన్నీ పోగా, ఇంకా .. స్వదేశ రాజులెవ్వరూ తమ దర్బారులో వేరే యూరోపియన్‌ని నియమించుకోకూడదు. గవర్నర్ -జనరల్ అనుమతి లేకుండా ఏ ఇతర స్వదేశ రాజుతో గానీ సంప్రదింపులు జరపకూడదు ఇన్నిటికి ఒడబడినందుకు బదులుగా బ్రిటీషువాళ్లు ఆ స్వదేశ రాజుల్ని శత్రుబారి నుంచి సంరక్షిస్తారు. సంస్థాన అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కల్పించు కోమని హామీ ఇస్తారు. కాని, ఈ హామీల్ని గౌరవించిన ఉదాహరణలు చాలా తక్కువ.

వాస్తవంలో - ఒక స్వదేశ సంస్థానం ఈ సైన్య సహకార పద్ధతి ఒప్పందం మీద సంతకం చెయ్యటం ద్వారా తన స్వాతంత్ర్యాన్ని పరాయివాళ్ళకి రాసిపారేసింది; ఆత్మ రక్షణ హక్కుని కోల్పోయింది; దౌత్య సంబంధాలు నెలకొల్పుకునే హక్కుని కోల్పోయింది విదేశ నిపుణుల్ని నియమించుకునే హక్కుని కోల్పోయింది; ఇరుగుపొరుగు రాజ్యాలతో విభేదాలు పరిష్కరించుకునే హక్కుని పోగొట్టుకుంది బైటి వ్యవహారాల్లో స్వదేశరాజు తన సార్వభౌమాధికార చిహ్నాల్ని సైతం పోగొట్టుకున్నాడు. దైనందిన దేశీయాంగ వ్యవహారాల్లో అస్తమానం జోక్యం కల్పించుకునే బ్రిటీషు ప్రతినిధికి ఇతోధికంగా లొంగిపోయాడు వీటన్నింటికి తోడు, ఒక రక్షిత రాజ్యాన్ని లోపలి నుంచి తొలిచివేసే రోగక్రిముల్ని ఇది ఎక్కించింది. బ్రిటిష్ సహకార సైన్య పోషణా వ్యయం స్వదేశ రాజులకు తలకు మించిన బరువుగా తయారైంది. వాళ్ళు చెల్లించవలసిన సబ్సిడీ ఆ సంస్థానపు తాహతుని మించి ఉండేది. ఏకపక్షంగా నిర్ణయించబడ్డ ఈ సబ్సిడీ చావు బరువు కింద సంస్థానాల ఆర్థిక పరిస్థితి కృశించి నశించి పోయింది. ప్రజలు దౌర్భాగ్యస్థితిలో కూరుకు పోయారు. సైన్య సహకార పద్ధతి రక్షిత రాజ్యాల సైనిక వ్యవస్థ రద్దుకు దోవ తీసింది. లక్షలాది సైనికులు, అధికార్లు తమ అనువంశిక జీవనోపాధిని కోల్పోయారు. దేశంలో హైన్యస్థితి, నైతిక భ్రష్టత అల్లుకు పోయాయి. ఉద్యోగాల నుండి ఉద్వాసితులైన అనేక మంది 19వ శతాబ్ది మొదటి రెండు దశాబ్దాల కాలంలో దేశమంతటా తెగబడి విజృంభించిన పిండారీ తండాలలో చేరిపోయారు. రక్షిత రాజ్యాల ప్రభువులు ప్రజల ప్రయోజనాల్ని విస్మరించి, ప్రజల వల్ల భయం లేనంతకాలం వాళ్లని పీడించుకు తినటానికి అలవాటు పడిపోయారు. ఇంటి, బైటి శత్రువుల బెడద లేకుండా బ్రిటీషువాళ్లు రక్షణ కల్పించారు గనుక ఉత్తమ పరిపాలనని ప్రోత్సహించే ప్రేరణ కరవైంది.

మరో వేపు ఈ సైన్య సహకార పద్ధతి బ్రిటీషు పాలకులకి ఎనలేని ప్రయోజనాలు చేకూర్చి పెట్టింది. వాళ్ళిప్పుడు స్వదేశ రాజుల ఖర్చుతో భారీ సైన్యాల్ని నిర్వహించుకోగల్గుతున్నారు. తమ స్థావరాలకి కడు దూరంగా యుద్ధాలు

సాగించటానికి వీలయింది యుద్ధమంటూ సంభవిస్తే, అది మిత్రరాజుల భూభాగాల్లోనే, శత్రురాజ్య సీమల్లోనే అయి వుంటుంది తమ అభయం పొందిన మిత్ర రాజ్యాల రక్షణ వ్యవహారాల్ని, విదేశ సంబంధాల్ని గుప్పెట్లో బిగించుకున్నారు. వాళ్ళ భూభాగాల నడి బొడ్డున బలీయమైన సైన్యాల్ని తిష్ఠ వేయించారు. కాబట్టి తమ కిష్టమైనప్పుడు ఫలానా ప్రభువు పనికిమాలిన వాడని ప్రకటించి అతని రాజ్యాన్ని గుటకాయస్వాహా చెయ్యవచ్చు బ్రిటిషు వాళ్ళకి సంబంధించినంతమట్టుకి, ఒక బ్రిటిష్ రచయిత మాటల్లో ఈ సైన్య సహకార పద్ధతి అన్నది "కోసుకు తినే తరుణం వచ్చే దాకా మనం ఎద్దుల్ని మేపినట్లుగా మిత్రుల్ని మేపి మింగేసే పద్ధతి "

లార్డ్‌వెల్లస్లీ 1798లో మొట్ట మొదట హైదరాబాద్ నిజాంతో ఈ సైన్య సహకార ఒడంబడిక మీద సంతకం చేశాడు నైజాం నవాబుగారు ఫ్రెంచి శిక్షణ పొందిన తన సైన్యాన్ని తక్షణం రద్దు చెయ్యాలి ఏటా 2 41710 పౌండ్ల ఖర్చుతో ఆరు బెటాలియన్ల బ్రిటిషు సైన్యాన్ని తన రాజ్యంలో పెట్టుకొని పోషించాలి దానికి ప్రతిఫలంగా, బ్రిటిషు వాళ్ళు నైజాం రాజ్యాన్ని మహారాష్ట్రుల బెడద నుంచి కాపాడ్డానికి అభయ మిచ్చారు 1800 లో చేసుకున్న ఇంకొక ఒప్పందం ప్రకారం సహకార సైన్యం సంఖ్య ఇంకా పెరిగింది వాళ్ళకయ్యే ఖర్చు నగదుగా చెల్లించటానికి బదులు నైజాం నవాబు తన రాజ్యంలో కొంత భాగాన్ని బ్రిటిషు వాళ్ళకి అప్పగింత పెట్టాడు

1801 లో అవధ్ నవాబుచేత సహకార సైన్య ఒడంబడిక మీద మెదలు పంచి



1781లో అవధ్ నవాబు చేత్‌సింగ్, బ్రిటిషు సైనికులపై ఐదరం

సంతకం పెట్టించారు భారీ సహకార సైన్యాన్ని భరించాల్సి వచ్చినందుకు అవధ్ నవాబు తన రాజ్యంలో సగభాగాన్ని అంటే రోహిల్‌ఖండ్‌ని, గంగా-యమునల మధ్య ప్రాంతాన్ని బ్రిటీషు వాళ్ళకి ధారాదత్తం చేశాడు. ఆ మిగిలిన సగం రాజ్యంలోనైనా అతడు స్వతంత్రుడు కాదు. రాజ్య అంతరంగిక పరిపాలనా వ్యవహారాల్లో సైతం బ్రిటిష్ అధికార్ల "సలహా"ని లేదా ఉత్తర్వుల్ని స్వీకరించి తీరాలి. బ్రిటిష్ అధికార్ల అదుపాజ్ఞల్లో, పర్యవేక్షణలో నవాబు తన పోలీసు బలాన్ని పునర్నిర్మించాలి నవాబు సైన్యం దాదాపు రద్దయింది. అతని రాజ్యంలో ఏ ప్రాంతంలోనైనా సరే బ్రిటీషు వాళ్ళు తమ సైన్యాన్ని కాపుంచవచ్చు

మైసూరు, కర్నాటక, తంజావూరు, సూరత్ సంస్థానాలతో వెల్లస్లీ ఇంకా కఠినంగా వ్యవహరించాడు. టిప్పు సుల్తాన్ సైన్య సహకార ఒడంబడికని అసలు ఆమోదించనే లేదు. 1072లో తన రాజ్యంలో సగం భూభాగాన్ని బ్రిటీషు వాళ్ళకి, వాళ్ళ మిత్రరాజ్యాలకి కట్టబెట్టటం వల్ల కలిగిన నష్టాన్ని ఇంకా మర్చి పోలేదు బ్రిటీషువాళ్ళతో జరగనున్న అనివార్య యుద్ధానికిగాను టిప్పు తన సైన్యాన్ని నిరంతరాయంగా పటిష్టం చేసుకుంటున్నాడు విప్లవాత్మకమైన ఫ్రాన్సుతో సంభాషణలు జరిపాడు. బ్రిటిషు వ్యతిరేక సంఘటనని నిర్మించటానికి అతడు ఆఫ్ఘనిస్తాన్, అరేబియా, టర్కీలకు తన రాయబారుల్ని పంపించాడు.

టిప్పు సుల్తానుకు బుద్ధి చెప్పటానికి వెల్లస్లీ కూడా పంతం పట్టాడు. ఫ్రెంచి వాళ్ళని తిరిగి భారత దేశంలో ప్రవేశించనివ్వకుండా చెయ్యటానికి పట్టుదల వహించాడు. బ్రిటిషు సైన్యం 1899లో టిప్పు మీద దండెత్తి ఓటమి చవి చూపించాయి అది జరిగింది కొద్ది రోజులే అయినా భయంకరంగా జరిగింది ఫ్రెంచి సహాయం అందేలోపుగానే టిప్పు ఓడిపోయాడు ఓడిపోయినా, అవమానకరమైన షరతుల మీద శాంతి సంధికి వేడుకోలేదు "మతంలేని మర్ధి వెధవల మీద ఆధారపడి హీనమైన బ్రతుకు బ్రతకటం కన్నా వీరుడుగా మరణించటం మేల"ని సగర్వంగా చాటాడు టిప్పు సుల్తాన్ పింఛను పుచ్చుకుని బ్రతుకు వెళ్ళబుచ్చే రాజాల, నవాబుల జాబితాలో తను చేరదలుచుకోలేదని ధీమాగా ప్రకటించాడు తన రాజధాని నగరం శ్రీరంగ పట్నాన్ని రక్షించుకునే ప్రయత్నంలో 1799 మే 4న మరణం పొందాడు అతని సైన్యం కడపటి నెత్తుటి బొట్టుదాకా విశ్వాసపాత్రంగా పోరాడింది భావిడ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్ ఆర్థర్ వెల్లస్లీ శ్రీరంగపట్టణ స్వాధీన ఘట్టాన్ని ఇలా వర్ణించాడు:

"4వ తేదీ రాత్రి జరిపిన ఘాతుకాన్ని మించింది ఎక్కడా, ఎప్పుడూ జరగబోదు. నగరంలో నిలువు దోపిడీకి గురికాని ఇల్లంటూ మిగలలేదు శిబిరంలో మన సైనికులు, సిపాయిలు, మన అనుచరులు మహా విలువైన రత్నాల్ని, బంగారపు కడ్డీల్ని, ఇంకా అనేక అమూల్య వస్తువుల్ని సైనిక బజార్లలో పెట్టి తెగనమ్మి పారేశారు. ప్రజలు నెమ్మదిగా తమ ఇళ్ళకు చేరుకుంటున్నారు. తమ వృత్తుల్ని మళ్ళీ చేపట్టటం మొదలు పెడుతున్నారు, కాని ప్రతి ఒక్క మనిషీ తన యావదాస్తీ పోగొట్టుకున్నాడు."

టిప్పు సుల్తాన్ రాజ్య భూభాగంలో సగభాగాన్ని బ్రిటీషువాళ్ళు, నైజాం నవాబు పంచుకున్నారు. మిగిలిన సగభాగం హైదరాలీకి ముందున్న అసలు రాజాలకు తిరిగి సంక్రమించింది వెల్లస్లీ కొత్త రాజాచేత సైన్య సహకార ప్రత్యేక ఒడంబడిక మీద సంతకం పెట్టించాడు దాని ప్రకారం, అవసరం ఆసన్నమైనప్పుడు రాజ్య

పాలనాధికారాన్ని స్వాధీనం చేసుకునే హక్కు గవర్నర్-జనరల్‌కి ఉంటుంది. నిజానికి, మైసూరు కంపెనీ మీద సంపూర్ణంగా ఆధారపడి పోయింది కంపెనీ సర్వాధీన రాజ్యంగా తయారైంది భారత దేశంలో బ్రిటిషు సర్వాధిపత్యానికి ఫ్రెంచి ప్రమాదం పూర్తిగా అంతరించిపోవటం నాల్గవ అంగ్లో - మైసూరు యుద్ధం సాధించిన ముఖ్య ఫలితం.

1801లో వెల్లస్లీ కర్నాటక కీలుబొమ్మ నవాబు మీద ఒక బలవంతపు ఒడంబడిక రుద్దాడు దాని ప్రకారం నవాబు సుఖప్రదమైన పింఛను మీద రాజ్యం యావత్తు బ్రిటిషు వాళ్ళకి అప్పగించేశాడు 1947 దాకా ఉన్న అవిభక్త మద్రాసు రాష్ట్రం అనాడు ఏర్పడ్డదే అదే విధంగా, తంజావూరు, సూరత్ సంస్థానాల్ని కంపెనీ స్వాధీనం చేసుకుని ప్రభువుల్ని పింఛను మీద పదవీ విరమణ చేయించింది

రాగాపోగా, బ్రిటిషు అధికార పరిధిలోకి రాకుండా ఒక్క మహారాష్ట్రులు మిగిలి పోయారు వెల్లస్లీ దృష్టి వెంటనే అటువేపు తిరిగింది మహారాష్ట్ర అంతరంగిక వ్యవహారాల్లోకి వెల్లస్లీ దూకుడుగా ప్రవేశించాడు

ఆ సమయంలో మహారాష్ట్ర సామ్రాజ్యం అయిదు సంస్థానాల కూటమిగా వుంది. పూనాలోని పీష్వా, బరోడాలోని గయక్వాడ్, గ్వాలియర్‌లోని సింధియా, నాగపూర్‌లోని భోన్స్లే, ఇండోర్‌లోని హోల్కార్ ఆ కూటమి నాయకులు. పూనా పీష్వా ఆ కూటమికి నామమాత్రపు పెద్ద దురదృష్టవశాత్తు, మహారాష్ట్రులు 18వ శతాబ్దాంతానికి తెలివి, అనుభవం పండిన నాయకులు యావన్మందిని పోగొట్టుకొన్నారు 1800వ సంవత్సరం ప్రవేశించే నాటికి మహాదాజీ సింధియా, తుకోజీ హోల్కార్, అహల్యాబాయి హోల్కార్, రెండవ మాధవరావు పీష్వా, మహారాష్ట్ర కూటమిని 30 ఏళ్ళపాటు చెక్కుచెదరకుండా కాపాడిన నానాఫడ్నవీస్ ప్రభృతులంతా కన్ను మూశారు. అన్నిటికన్నా ఘోరం యేమంటే, ఈ మరాఠా నాయకులంతా మెరుపువేగంతో దూసుకు వచ్చే విదేశ శక్తి అసలు ప్రమాదాన్ని గుర్తించకుండా దాయాదులు దారుణ మారణ యుద్ధాల్లో కూరుకుపోయి ఉన్నారు యశ్వంతరావ్ హోల్కార్ ఒక పక్షాన, దౌలత్‌రావ్ సింధియా, రెండవ బాజీరావు పీష్వాలు వ్యతిరేక పక్షాన నిలబడి పరస్పర మారణహోమానికి తెగబడ్డారు

వెల్లస్లీ తన సైన్య సహకార ఒడంబడికని పీష్వా, సింధియాలమీద రుద్దటానికి పదే పదే ప్రయత్నం చేశాడు దూరదృష్టి కలిగిన నానాఫడ్నవీస్ ఆ ఉచ్చులో పడటానికి నిరాకరించాడు ఏది ఏమైనా, 1802 అక్టోబరు 25న దీపావళి పర్వదినం నాడు హోల్కార్ సైన్యం పీష్వా, సింధియాల సంయుక్త సైన్యాల్ని ఓడించినప్పుడు పరమ భీరువు పీష్వా బాజీరావు పరుగున ఇంగ్లీషువాళ్ళ కౌగిలిలో వాలిపోయాడు. 1802వ సంవత్సరపు భావి నిర్ణాయక అంతిమ దినాన బేసిన్‌లో పీష్వా బాజీరావు బ్రిటిషు వాళ్ళ సైన్య సహకార ఒడంబడిక మీద చేవ్రాలు చేశాడు బ్రిటిషు వాళ్ళ వాంఛ చివరికి ఈడేరింది. 1802 డిసెంబరు 24న లార్డ్ వెల్లస్లీ ఇలా రాశాడు :

"ఏ పక్షంతోనూ ఢీకొనాల్సిన ఇబ్బంది లేకుండా, మహారాష్ట్ర సామ్రాజ్యంలో బ్రిటిషు రాజ్య ప్రయోజనాల్ని, హక్కుల్ని సంపూర్ణంగా నెలకొల్పుకునే ఒక మహదవకాశాన్ని ఈ సంక్షోభ పరిస్థితులు కల్పిస్తున్నట్టుగా నాకు తోచింది."

విజయం బహు తేలికగా సిద్ధించిన మాట నిజమే అయినా, వెల్లస్లీ ఒక్క విషయంలో పప్పులో కాలు వేశాడు. అభిమానధనులైన మహారాష్ట్ర నాయకులు

పోరాటం చెయ్యకుండా ఘనకీర్తి గల తమ స్వాతంత్ర్య సంప్రదాయాన్ని అర్పణ చెయ్యబోరు కాని, ఆ విషమ సమయంలో సైతం ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా వాళ్ళు సమైక్యం కాలేదు. సింధియా, భోన్స్లేలు బ్రిటిషు వాళ్ళతో పోరాడుతున్నప్పుడు హోల్కారు ఎడంగా నిలబడి పోయాడు గయక్వాడ్ బ్రిటిషు వాళ్ళకి సహాయం చేశాడు హోల్కార్ ఇంగ్లీషు వాళ్ళకి వ్యతిరేకంగా కత్తి పట్టినప్పుడు, భోన్స్లే, సింధియాలు పాత గాయాల్ని స్మరణకు తెచ్చుకున్నారు. పైగా, మరాఠా నాయకులు అపరిమితంగా పెరిగిపోయిన శత్రువు శక్తిని తక్కువ అంచనా కట్టి, తగిన సన్నాహం లేకుండా యుద్ధానికి దూకారు

దక్షిణాన, ఆర్థర్ వెల్లస్లీ నాయకత్వం వహించిన సైన్యం సింధియా, భోన్స్లేల సంయుక్త సేనల్ని 1803 సెప్టెంబర్‌లో అస్సీవద్దా, నవంబర్‌లో అర్‌గాంవ్ వద్ద ఓడించాయి ఉత్తరాన, లార్డ్ లేక్ నవంబర్ 1న లాస్వారీ వద్ద సింధియా సేనని ఓడించి అలీఘడ్ ఢిల్లీ ఆగ్రాలను ఆక్రమించాడు భారత దేశ అంధ చక్రవర్తి మళ్ళీ మరొకతూరి కంపెనీ పింఛను దారుడయ్యాడు మహారాష్ట్రులు సంధికి దిగి వచ్చారు; బ్రిటిషు వారి సైన్య సహకార ఒడంబడికని అంగీకరించారు; తమ రాజ్యాలలో కొంత భూభాగాన్ని బ్రిటిషు వారికి సమర్పించుకున్నారు; తమ దర్బారుల్లో బ్రిటిషు ప్రతినిధులకు ప్రవేశం కల్పించారు బ్రిటిషువారి ఆమోదం లేకుండా ఇతర యూరోపియన్ల కెవరికి ఉద్యోగాలు ఇవ్వమని మాట ఇచ్చారు మొత్తం ఒరిస్సా కోస్తా మీద ఇంగ్లీషు వాళ్ళు ఆధిపత్యం సాధించారు గంగా-యమునల మధ్య చాలా భూభాగం ఇంగ్లీషువాళ్ళ వశమైంది పీష్వా అసంతృప్తితో పొగిలిపోతూనే ఇంగ్లీషు వాళ్ళ చేతుల్లో కీలుబొమ్మ అయ్యాడు

వెల్లస్లీ దృష్టి ఇప్పుడిక హోల్కార్ మీద పడింది కాని యశ్వంతరావ్ హోల్కార్ బ్రిటిషు వాళ్ళకి అలవి కాలేదు ఒకచోట మాయమై మరొకచోట ప్రత్యక్షమయ్యే సాంప్రదాయక మరాఠా యుద్ధ వ్యూహాన్ని ఉపయోగించి, జాట్ యోధుల్ని పొత్తు కలుపుకొని హోల్కార్ బ్రిటిషు సైన్యాల్ని ముందుకు కదలనివ్వకుండా నిలబెట్టేశాడు. హోల్కార్ మిత్రుడు భరత్‌పూర్ రాజా తన కోటని ముట్టడించటానికి విఫలయత్నం చేసిన లార్డ్ లేక్ సైన్యాలకు అపార నష్టం కలగజేశాడు హోల్కార్ కుటుంబంతో అనాదిగా ఉన్న వైషమ్యాల్ని పక్కకి నెట్టి సింధియా తన శత్రువైన హోల్కార్‌తో చేతులు కలపాలని యోచన చేస్తున్నాడు మరోవేపు, యుద్ధం ద్వారా రాజ్య విస్తరణ సాధించాలన్న విధానం అమిత వ్యయంతో కూడుకొని, తమ లాభాల్ని కోత పెడుతున్నదని కంపెనీ వాటాదార్లు గ్రహించారు 1797లో కోటి డెభై లక్షలున్న కంపెనీ రుణం 1806 నాటికి 3 కోట్ల 10 లక్షల పౌండ్లకి పెరిగి పోయింది. దానికితోడు, యూరప్‌కు ప్రధాన ప్రమాదంగా నెపోలియన్ తయారైన తరుణంలో బ్రిటన్ ఆర్థిక పరిస్థితి అడుగంటి పోతున్నది. అక్కడితో విస్తరణ విధానాన్ని నిలుపు చెయ్యాలని, వినాశకారకమైన ఖర్చుని వెంటనే ఆపివెయ్యాలని, భారతదేశంలో ఇటీవల పొందిన విజయాలను లాభకరంగా కట్టుదిట్టం చేసుకోవాలని బ్రిటిషు రాజనీతిజ్ఞులు, కంపెనీ డైరక్టర్లు భావించారు. కంపెనీ లార్డ్ వెల్లస్లీని వెనక్కి పిలిపించి, 1806 జనవరిలో హోల్కార్‌తో సంధి ప్రయత్నాలు చేసింది. ఉభయుల మధ్యా జరిగిన రాజ్‌ఘాట్ సంధి ప్రకారం, హోల్కార్ భూభాగంలో చాలా భాగాన్ని అతనికే తిరిగి ఇచ్చివేశారు.

వెల్లస్లీ విస్తరణ విధానం చివరి దశలో మూలపడింది అయితేనేం, ఆ విధానం పుణ్యమా అని ఈస్టిండియా కంపెనీ భారత సీమలో ఒక సర్వాధిపత్య శక్తిగా రూపొందింది కంపెనీ న్యాయశాఖలో పని చేసే రాబర్ట్స్ అనే యువ అధికారి 1805లో ఇలా గర్వంగా రాసుకోగలిగాడు :

"ఇండియాలోని ఇంగ్లీషువాడు అభిమానవంతుడు, అభినివేశ పరుడు విజితులైన ప్రజల మధ్య తననొక విజేతగా సగర్వంగా భావించుకొంటాడు తనకన్నా కింద ఉన్న అందరి మీదా తాను అధికుణ్ణని ఆ అందర్నీ చులకనగా చూస్తాడు "

***లార్డ్ హేస్టింగ్స్ హయాములో రాజ్య విస్తరణ :*** రెండవ ఆంగ్ల-మహారాష్ట్ర యుద్ధం మరాఠా నాయకుల శక్తిని తుత్తునియలు చేసిందే తప్ప వాళ్ళ చైతన్యాన్ని కాదు స్వాతంత్ర్య నాశనం వాళ్ళ హృదయాల్ని ఇంకా కెలుకుతూనే ఉంది పోయిన స్వాతంత్ర్యాన్ని తిరిగి పొందటానికి, గత ప్రతిష్ఠని తిరిగి సాధించటానికి 1817 లో వాళ్ళు చిట్టచివరి ప్రయత్నానికి తెగించారు మరాఠా నాయకుల ఐక్య సంఘటనని రూపొందించడంలో పీష్వా నాయకత్వ పాత్ర నిర్వహించాడు పూనా దర్బారులోకి మొగుడై వచ్చి తిష్ట వేసిన బ్రిటిషు ప్రతినిధి (Resident) కఠోర అదుపాజ్ఞలకి తట్టుకోలేక పీష్వా పొగలు సెగలు కక్కాడు అందుకని, మహారాష్ట్ర నాయకుల్ని ఒక తాటిమీదికి తెచ్చే ప్రయత్నంలో పీష్వా చొరవ తీసుకున్నాడు కాని, మహారాష్ట్రులు ఈ తూరి కూడా ఒక నిర్దుష్టమైన సమైక్య కార్యాచరణ పథకాన్ని రూపొందించు కోవటంలో విఫలమయ్యారు 1817 నవంబరులో పీష్వా పూనాలోని బ్రిటిషు ప్రతినిధి కోఠిని ముట్టడించాడు నాగపూర్‌లో అప్పా సాహెబ్ బ్రిటిష్ కోఠీ మీద దాడి జరిపాడు. మాధవరావ్ హోల్కార్ యుద్ధ సన్నాహాలు ఆరంభించాడు

గవర్నరు-జనరల్ లార్డ్ హేస్టింగ్స్ విలక్షణ తీక్షతతో ఎదురుదెబ్బ తీశాడు సింధియా బ్రిటిష్ సార్వభౌమాధికారం ముందు తల వంచాడు పీష్వా, భోన్‌స్లే హోల్కార్‌ల సైన్యాలు ఓడిపోయాయి పీష్వా గద్దె దిగి, బ్రిటిషువాళ్ళు ఇచ్చిన పింఛను స్వీకరించి కాన్పూరు సమీపంలో బితూరుకి మూటాముల్లె సర్దుకున్నాడు. అతని రాజ్యంలో కొంత భాగాన్ని విశాల బొంబాయి రాష్ట్రంలో కలుపుకున్నారు హోల్కార్, భోన్‌స్లేలు సైన్య సహకార ఒడంబడికని అంగీకరించారు. మరాఠా నాయకులు యావన్మంది తమ సంస్థానాల్లో విశాల భూభాగాల్ని బ్రిటిషు వాళ్ళకి దఖలు పర్చారు. మరాఠా అభిమానాన్ని సంతృప్తి పర్చడానికి బ్రిటిషు వాళ్ళు పీష్వా భూభాగంలోని కొంత భాగంలో సతారా సంస్థానం ఏర్పాటు చేసి ఛత్రపతి శివాజీ వారసులకు ఇచ్చివేశారు సతారా పూర్తిగా బ్రిటిషు అధీన సంస్థానమైంది. భారతదేశంలో మిగతా ప్రభువుల మాదిరిగానే మరాఠా నాయకులు కూడా బ్రిటిషు వారి దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి మనుగడ సాగించారు.

రాజపుటానా సంస్థానాలు అనేక దశాబ్దాలుగా సింధియా, హోల్కారుల ఆధిపత్యం కింద పొద్దు బుచ్చుతున్నాయి మహారాష్ట్రుల పతనం తరువాత, ఆ సంస్థానాలేవీ తిరిగి స్వాతంత్ర్యం ప్రకటించే ఓపిక లేక బ్రిటిషు వారి ఆధిపత్యాన్ని అంగీకరించాయి

ఈ విధంగా, 1818 నాటికి పంజాబ్, సింధులు మినహా మిగిలిన భారత ఉపఖండం యావత్తు బ్రిటిషు వాళ్ళ ఆధిపత్యం కిందికి వచ్చేసింది. కొంత భూభాగాన్ని

బ్రిటిషు వాళ్ళు నేరుగా పరిపాలించారు మిగతా భూభాగాన్ని వాళ్ళ అడుగులకు మడుగులొత్తే స్వదేశ సామంత రాజులు పరిపాలించారు. అయితే, ఈ స్వదేశ సంస్థానాలకు ఒక సైన్యంగాని, విదేశ వ్యవహారాలు స్వతంత్రంగా నిర్వహించుకునే హక్కు గానీలేవు తమ భూభాగాల్లో విడిసిన కంపెనీ సైన్యాల పోషణకు భారీ మొత్తాలు చెల్లించారు. అంతరంగిక వ్యవహారాల్లో స్వతంత్ర్యం వున్నదన్న మాటేగాని, రెసిడెంటు రూపంలో దిగిన బ్రిటిషు అధికారం ముందు తల వంచారు. వాళ్ళు ఎల్లకాలం తమ సత్ప్రవర్తనని నిరూపించుకునే పరీక్షార్థుల్లాగా బ్రతికారు ఇకపోతే, బ్రిటిషు వాళ్ళు మాత్రం "భారతదేశపు ప్రకృతి సిద్ధమైన సరిహద్దుల్లోకి చొచ్చుకు పోవటానికి" స్వతంత్రులయ్యారు

## 2. బ్రిటిష్ అధికార స్థిరీకరణ– 1818–'57

1818 నుంచి 1857 నాటికి బ్రిటిషు వాళ్ళు యావద్భారత దేశాన్ని జయించే కర్తవ్యాన్ని పరిపూర్తి చేశారు. సింధ్, పంజాబుల్ని సైతం జయించారు అవధ్, మధ్యప్రదేశ్, అనేక చిల్లర మల్లర సంస్థానాలు బ్రిటిష్ సామ్రాజ్యంలో విలీనమై పోయాయి

***సింధ్ ఆక్రమణ*** : యూరప్, ఆసియాలలో ఇంగ్లీషు వాళ్ళకి, రష్యన్లకి మధ్య పెచ్చు పెరిగి పోయే ప్రతి స్పర్థల ఫలితంగాను, ఆఫ్ఘనిస్థాన్ పర్షియాల మీదుగా రష్యా భారతదేశం మీద దాడి చెయ్యవచ్చునే భయం కారణంగాను బ్రిటిషు వాళ్ళు సింధు రాష్ట్రాన్ని జయించారు. రష్యా ప్రభావాన్ని తిప్పి కొట్టడానికి బ్రిటిషు ప్రభుత్వం ఆఫ్ఘనిస్థాన్, పర్షియాలలో తన పలుకుబడిని పెంచుకోవాలని నిర్ణయం తీసుకుంది సింధ్‌ని తమ ఆధిపత్యం కిందికి తెచ్చుకున్నప్పుడే తమ రష్యా వ్యతిరేక విధానం విజయవంతం అవుతుందని బ్రిటిషువాళ్ళు భావించారు. సింధు నది ద్వారా అందుబాటయ్యే వాణిజ్యావకాశాలు ఒక అదనపు ఆకర్షణ.

1832లో చేసుకున్న ఒక ఒడంబడిక ద్వారా సింధ్‌లోని నదులు, రహదార్లు బ్రిటిషు వ్యాపార వాణిజ్యాలకు బార్లా తెరుచుకున్నాయి. అమీర్‌లని పిలవబడే సింధు ప్రభువులు 1839లో సైన్య సహకార ఒడంబడిక మీద సంతకాలు చేశారు. సింధ్ ప్రాదేశిక సమగ్రత పరిరక్షింపబడుతుందని లోగడ ఇచ్చిన వాగ్దానాల్ని ఖాతరు చెయ్యకుండా బ్రిటిషు వాళ్ళు 1843లో సింధ్‌ని స్వాధీనం చేసుకున్నారు. ఆ దండ యాత్రకి సారథ్యం వహించిన సర్ ఛార్లెస్ నేపియర్ తన డైరీలో ఇలా రాసుకున్నాడు:

"సింధ్‌ని ఆక్రమించుకునే హక్కు మనకు లేదు, అయినా ఆక్రమించు కుంటాం. ఇది బహు లాభసాటి, ఉపయోగకర దుర్మార్గానికి, ధూర్తతకి మానవ సహజమైన ప్రతీక అవుతుంది." ఈ కర్తవ్యాన్ని నెరవేర్చినందుకు గాను, సర్ ఛార్లెస్ నేపియర్‌కి ఏడు లక్షల రూపాయల నగదు బహుమతి ముట్టింది.

***పంజాబ్ ఆక్రమణ*** : 1839, జూన్‌లో మహారాజా రంజిత్‌సింగ్ మరణంతో పంజాబ్‌లో రాజకీయ అస్థిమిత పరిస్థితులు ఏర్పడ్డాయి. చక చకా ప్రభుత్వాలు మారాయి స్వార్థపరులు, అవినీతి పరులు నాయకులుగా రంగం మీద అవతరించారు. చిట్టచివరికి, అధికారం ధైర్యోపేత, దేశభక్తి ప్రేరిత సైన్యం చేతుల్లోకి మారింది. కాని, బొత్తిగా క్రమశిక్షణ లేని సైన్యం అది. 1809లో బ్రిటిషు వాళ్ళు మహారాజా

రంజిత్‌సింగ్‌తో అవిచ్ఛిన్న స్నేహసంధి చేసుకున్నా, ఈ పరిస్థితుల్లో వాళ్ళ కక్కుర్తి చూపు సట్లెజ్ నది కావల పంచనదులు ప్రవహించే సుజల, సుఫల పంజాబ్ మైదానం మీద ప్రసరించింది. పంజాబుని స్వాధీనం చేసుకోడానికి దండయాత్ర చెయ్యవలసిందే నని బ్రిటిషు అధికార్లు తెగ మోగారు

1844 నవంబర్‌లో సిక్కు ద్వేషిగా ప్రతీతి పొందిన మేజర్ బ్రాడ్‌ఫుట్ బ్రిటిషు ప్రతినిధిగా లూధియానా చేరాడు వెంటనే, పగబట్టినట్టు ప్రవర్తించి సిక్కుల్ని రెచ్చగొట్టే దుశ్చర్యలకి దిగాడు. రేపోమాపో సైన్యం తమ అధికారాన్ని, పదవుల్ని, ఆస్తిపాస్తుల్ని ఊడబెరుక్కుంటుందని అవినీతిపరులైన పంజాబ్ నాయకులు, అధికార్లు గ్రహించారు. కాబట్టి ఆ ప్రమాదం నుంచి బైట పడ్డానికి సైన్యాన్ని బ్రిటిష్ వ్యతిరేక యుద్ధంలోకి తోచేస్తే పీడ విరగడవుతుందని నాయకులు, అధికార్లు దురాలోచన చేశారు. ఇంతలో వంతెనలకు ఉపయోగపడే పడవలు బొంబాయి నుంచి ఫిరోజ్‌పూర్ చేరాయనే సమాచారం పంజాబ్‌లో గుప్పుమంది. ముందుతట్టు ప్రాంతంలో అదనపు బలాల కోసం బారకాసులు తయారయ్యాయి అదనపు రెజిమెంట్లు పంజాబ్ సరిహద్దులకు బైల్దేరాయి. బ్రిటిషువాళ్ళు పంజాబ్ ఆక్రమణకు సర్వ సంసిద్ధంగా ఉన్నారనేది పంజాబ్ సైన్యానికి బోధపడింది పంజాబ్ సైన్యం వెంటనే ప్రతికూల చర్యలు తీసుకోవడం ప్రారంభించింది గవర్నర్-జనరల్ లార్డ్ హార్డింజ్ కింద సర్వ సేనాధిపతి అయిన లార్డ్ గొఫ్ ఫిరోజ్‌పూర్ దిక్కుగా పురోగమిస్తున్నాడనే వార్త డిశంబరులో అందగానే, పంజాబ్ సైన్యం బ్రిటిషు బలాల్ని దెబ్బతీయడానికి నిర్ణయించింది. విదేశీ ప్రమాదం హిందూ, ముస్లిం, సిక్కుల్ని ఏకం చేసింది పంజాబ్ సైన్యంఆదర్శప్రాయమైన ధైర్య సాహసాల్తో వీరోచితంగా పోరాడింది కాని, పంజాబ్ నాయకులు కొందరు దేశద్రోహులుగా తయారయ్యారు. ప్రధానమంత్రి రాజా లాల్ సింగ్, సర్వ సేనాధిపతి మిజార్ తేజ్‌సింగ్‌లు శత్రువుతో రహస్యంగా మంతనాలు ప్రారంభించారు. పంజాబ్ సైన్యం చివరికి ఓటమి అంగీకరించింది. 1846 మార్చి 8న అవమానకరమైన షరతులతో కూడిన లాహొర్ సంధిపత్రం మీద సంతకాలు జరిగాయి. జలంధర్ అంతర్వేదిని బ్రిటిషువాళ్ళు ఆక్రమించుకున్నారు. జమ్మూ-కాశ్మీరులను 50 లక్షల రూపాయలకు రాజా గులాబ్‌సింగ్‌కు స్వాధీనం చేశారు. పంజాబు సైన్యం 20,000 కాల్బలానికి, 12,000 అశ్విక బలానికి తరిగి పోయింది. బలిష్ఠమైన బ్రిటిషు సైన్యం లాహొర్‌లో తిష్ఠ వేసింది

తరువాత, 1846 డిశంబరు 16న మరొక ఒప్పందం మీద సంతకాలు జరిగాయి. దాని ప్రకారం, రాష్ట్రంలోని ప్రతి శాఖ మీదా లాహొర్‌లోని బ్రిటిషు రెసిడెంటుకు సంపూర్ణాధికారాలు సంక్రమించాయి. ఆ రోజునుంచి బ్రిటిషు రెసిడెంటు పంజాబుకు వాస్తవ ప్రభుత్వాధినేత అయ్యాడు. పంజాబ్ తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయి, సామంత రాజ్యంగా దిగజారి పోయింది.

అయినా కూడా, బ్రిటిషు అధికారుల్లో సామ్రాజ్యవాద, దురాక్రమణ పూరిత వర్గాలు ఇంకా అసంతృప్తితోనే ఉన్నాయి. పంజాబ్ మీద బ్రిటిషువారి ప్రత్యక్ష పరిపాలన రుద్దాలని వాళ్ళు ఆరాట పడ్డారు 1848లో స్వాతంత్ర్య ప్రియులైన పంజాబీ ప్రజలు అసంఖ్యాక స్థానిక తిరుగుబాట్లు చేసినప్పుడు బ్రిటిషు సామ్రాజ్యవాద దురాక్రమణ పూరిత వర్గాల కోరిక ఈడేరే సమయం కలిసివచ్చింది. ముల్తాన్‌లో

మూల్‌రాజ్, లాహోర్ సమీపంలో చత్తర్ సింగ్ అత్తర్‌వాలా లేవదీసిన తిరుగుబాట్లు చాలా ప్రముఖమైనవి. పంజాబీ ప్రజలు మళ్ళీ మరొక తూరి నిర్దయాత్మక ఓటమి చవి చూశారు. లార్డ్ డల్‌హౌసీ ఈ అవకాశాన్ని వినియోగించుకొని పంజాబ్‌ని బ్రిటిషు రాజ్యంలో కలుపుకున్నాడు. ఆ విధంగా, భారతదేశంలోని ఆఖరి స్వతంత్ర రాజ్యం బ్రిటిషు సామ్రాజ్యంలో విలీనమైంది.

***డల్‌హౌసీ – రాజ్య విలీన విధానం (1848–56):*** లార్డ్ డల్‌హౌసీ 1848లో భారతదేశానికి గవర్నర్-జనరల్‌గా వచ్చాడు. ఇక్కడ వీలయినంత ఎక్కువ భూభాగంలో ప్రత్యక్ష బ్రిటిషు పరిపాలనని విస్తరింపజెయ్యాలని ఆదినుంచీ అతనికి పట్టుదల. "కొంచెం ముందు వెనుకలుగా భారత దేశంలో స్వదేశ రాజ్యాలు పూర్తిగా అంతరించిపోవటం తథ్యం" అని డల్‌హౌసీ ప్రకటించాడు స్వదేశ రాజుల అవినీతి మయ, ప్రజా పీడక పరిపాలన కన్నా బ్రిటిషు పరిపాలన వెయ్యి రెట్లు నయం అనే అతని నమ్మకం ఈ రాజ్య విలీన విధానానికి కారణం అంటారు. అయితే, ఇది కేవలం పైకి చెప్పే కారణం మాత్రమే. బ్రిటిష్ ఎగుమతుల్తో భారతదేశాన్ని నింపెయ్యాలనేదే దాని అంతర్యం. అదే అసలు లోగుట్టు. ఇతర దురాక్రమణ పూరిత సామ్రాజ్య వాదుల ఒరవడిలోనే డల్‌హౌసీ కూడా భారత స్వదేశ సంస్థానాల్లో బ్రిటిషు ఎగుమతులు దెబ్బ తినడానికి స్వదేశరాజుల అవక తవక పరిపాలనే కారణం అని నమ్మాడు. భారత దేశంలో బ్రిటిష్ సామ్రాజ్య నిర్మాణ కర్తవ్య పరిపూర్తిలో "స్వదేశ మిత్ర రాజుల"తో అవసరం తీరి పోయింది కాబట్టి, ఇక వాళ్ళని వదిలించుకోవటం తమకు క్షేమం అని తతిమ్మా సామ్రాజ్యవాద వర్గాలు భావించాయి.

ఈ రాజ్య విలీన విధానాన్ని అమలుపర్చటానికి డల్‌హౌసీకి ఉపయోగపడ్డ ప్రధాన సాధనం నిర్వారసత్వ సిద్ధాంతం. ఈ సిద్ధాంతం కింద, ఏ స్వదేశ రాజుగానీ నిస్సంతుగా మరణిస్తే, అతని రాజ్యం దత్తుడికి సంక్రమించదు. బిడ్డలు కలగకపోతే, ఎవరినైనా దత్తతకు స్వీకరించి దత్తుణ్ణి ఆస్తికి వారసుడుగా ప్రకటించటం భారతదేశంలో అనాది నుంచీ వస్తున్న సంప్రదాయం. దీనికి విరుద్ధంగా, నిస్సంతుగా మరణించిన స్వదేశరాజు సంస్థానం దత్తునికి కాకుండా బ్రిటిషు సామ్రాజ్యంలో కలిసిపోతుందని డల్‌హౌసీ ఒక కొత్త సిద్ధాంతం ప్రవేశపెట్టాడు. ఒకవేళ, బ్రిటిషు అధికార్లు అటువంటి దత్తతకి లోగడ స్పష్టంగా ఆమోద ముద్ర వేసిన సందర్భాలకు మాత్రమే ఇది వర్తించదు. 1848లో సతారా, 1854లో నాగపూర్, ఝాన్సీలు వగైరా అనేక రాజ్యాలు ఈ సిద్ధాంతం అమలు పర్చటం వల్ల బ్రిటిషు సామ్రాజ్యంలో విలీనమై పోయాయి.

డల్‌హౌసీ అనేకమంది మాజీ ప్రభువుల హక్కుల్ని కూడా గుర్తించడానికి నిరాకరించాడు. వాళ్ళకి పింఛను చెల్లించటానికి సైతం ఒప్పుకోలేదు. అట్లా కర్నాటక, సూరత్ నవాబులు, తంజావూరు రాజా తమ పింఛను హక్కులు కోల్పోయారు. అదే విధంగా మాజీ పీష్వా రెండవ బాజీరావు మరణానంతరం అతని దత్తపుత్రుడు నానా సాహెబ్‌కు వేతనం గానీ, పింఛనుగాని చెల్లించటానికి డల్‌హౌసీ నిరాకరించాడు.

ఎలాగైనా అయోధ్య రాజ్యాన్ని బ్రిటిష్ సామ్రాజ్యంలో కలిపేసుకోవాలని డల్‌హౌసీ తహతహ లాడాడు. కాని, దానికి కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. ఒకటి – అయోధ్య నవాబులు బక్సారు యుద్ధం నాటి నుంచి బ్రిటిషు వాళ్ళకి మిత్రరాజులు. పైగా, ఎన్నో ఏళ్ళుగా వాళ్ళు బ్రిటిషు ప్రభుత్వానికి పరమ విధేయులుగా వుంటూ

వచ్చారు. రెండు - అయోధ్య నవాబుకు సంతానం చాలా మంది ఉన్నారు కాబట్టి, నిర్వారసత్వ సిద్ధాంతం అతనికి వర్తించదు అతని రాజ్యాన్ని ఊదబెరుక్కోవాలంటే మరేదైనా సాకు వెతకాలి చివరికి, డల్‌హౌసీకి అయోధ్య ప్రజల్ని దైన్యస్థితి నుంచి కాపాడాలనే ఉదారబుద్ధి పుట్టింది. అయోధ్యని అవకతవకగా పరిపాలించాడనీ, సంస్కరణలు ప్రవేశ పెట్టడానికి నిరాకరించాడనీ నవాబ్ వజీద్ అలిషా మీద నిందారోపణలు చేసి డల్‌హౌసీ దాన్ని కూడా 1856లో బ్రిటిషు సామ్రాజ్యంలో విలీనం చేశాడు.

అయోధ్యలో పరిపాలన భ్రష్టమైపోయి ప్రజలకి బాధాకరంగా తయారైన మాట యధార్థమే అనాటి ఇతర నవాబుల మాదిరే అయోధ్య నవాబులు విషయ లోలతలో కూరుకుపోయిన స్వార్థపరులు సత్పరిపాలన గురించి గానీ, ప్రజా సంక్షేమం గురించిగానీ వాళ్ళు బొత్తిగా పట్టించుకోలేదు. అటువంటి హీనమైన పరిస్థితికి బ్రిటీషు వాళ్ళ బాధ్యత కూడా కొంత ఉంది కనీసం 1801 నుంచి అయోధ్యని బ్రిటీషువాళ్ళు తమ అదుపులో పెట్టుకొని, పరోక్షంగా పరిపాలించారు ఏది ఏమైనా నవాబులు దుష్పరిపాలన వల్ల అయోధ్యని బ్రిటీషు సామ్రాజ్యంలో విలీనం చెయ్యవలసి వచ్చిందని



1814 లో ఓడ్ నవాబు లక్నోలో యిచ్చిన విందులో హేస్టింగ్స్ సామంత ప్రభువు, ఆయన భార్య

చెప్పటం కేవలం సాకు మాత్రమే అసలు కారణం వేరే ఉంది మాంచెస్టర్‌లో తయారైన వస్తువులకు అయోధ్య బ్రహ్మాండమైన మార్కెట్‌గా ఉపయోగపడుతుందన్న అతి దురాశ డల్‌హౌసీని ప్రేరేపించింది అతనికి 'ప్రజోపకార' బుద్ధి పుట్టించిన అసలు కారణం అదీ అట్లాగే, ముడి పత్తి కోసం బ్రిటన్‌లో గిరాకీ మితిమీరి పోయినప్పుడు, అక్కడ పత్తి కొరత తీర్చటానికి డల్‌హౌసీ దండిగా పత్తి పండే బీరార్ రాష్ట్రాన్ని నైజాం నవాబు నుంచి 1853లో లాగేశాడు.

స్వదేశ రాజ్యాల సంరక్షణ, సంలీనాలకు సంబంధించిన ప్రశ్నకు ఈ సమయంలో సందర్భ శుద్ధి లేదని స్పష్టంగా గ్రహించవలసిన అవసరం ఉంది వాస్తవానికి, అప్పుడు భారతీయ రాజ్యాలంటూ లేనే లేవు ఉన్నవల్లా కేవలం రక్షిత రాజ్యాలు మాత్రమే కంపెనీ ప్రత్యక్షంగా పరిపాలించే ప్రాంతాల మాదిరే ఈ స్వదేశ రాజ్యాలు కూడా బ్రిటిషు సామ్రాజ్యంలో ఒక భాగంగా ఉన్నాయి ఈ రాజ్యలలో కొన్నిటి మీద బ్రిటిషు అధిపత్యం రూపంలో మారిందంటే అది బ్రిటీషు సౌకర్యార్థం మారిందన్న మాట. ఈ మార్పుకి ప్రజల ప్రయోజనాలతో ఎటువంటి నిమిత్తం లేదు

# బ్రిటిష్ ఇండియా ప్రభుత్వ నిర్మాణం, బ్రిటిష్ సామ్రాజ్య ఆర్థిక విధానాలు (1757-1857)

భారతదేశంలో సువిశాల సామ్రాజ్యాన్ని సంపాదించిన తూర్పిండియా కంపెనీ దాన్ని అదుపు చెయ్యటానికి, పరిపాలన నిర్వహించటానికి పనికి వచ్చే ప్రభుత్వ పద్ధతుల్ని రూపొందించుకోవలసి వచ్చింది. 1757-1857ల మధ్య వంద సంవత్సరాల కాలంలో కంపెనీ పరిపాలనా విధానం తరచు మార్పులకు లోనయింది. అయినా, కంపెనీ తన ప్రధాన లక్ష్యాలనుంచి దృష్టి మళ్ళించలేదు. కంపెనీ లాభాల్ని వృద్ధి చెయ్యటం, భారత దేశంలోని వ్యాపార స్థావరాల ద్వారా బ్రిటన్‌కు లాభాలు పెంపు చెయ్యటం, బ్రిటీషు ఆధిపత్యాన్ని కాపాడుకుంటూ ఇంకా పటిష్టవంతం చెయ్యటం అనే మూడు లక్ష్యాల్ని కంపెనీ సర్వదా దృష్టిలో పెట్టుకునే ఉంది. తతిమ్మా పనులన్నీ ఈ లక్ష్యాల పెంపునకు దోహదపడుతూ తలవొగ్గి వుండేవే. ఈ లక్ష్యాల సాధనకు అనుగుణంగా భారత ప్రభుత్వ పరిపాలనా యంత్రాంగం రూపు దిద్దుకొని, వృద్ధి పొందింది. ఈ సందర్భంలో శాంతిభద్రతల పరిరక్షణకు కంపెనీ పెద్ద పీట వేసింది. భారతదేశంతో కంపెనీ వ్యాపారం, భారతదేశ సాధన సంపత్తిని కంపెనీ స్వీయ ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగంలోకి తెచ్చుకోవటం అన్నవి ఏ అంతరాయం లేకుండా సజావుగా సాగిపోవాలంటే దేశంలో శాంతిభద్రతలు కావాలి.

*ప్రభుత్వ నిర్మాణం:* తూర్పిండియా కంపెనీ అధికార్లు 1765లో బెంగాల్ మీద ఆధిపత్యం సాధించినప్పుడు, బెంగాల్ పరిపాలనా నిర్వహణలో కొత్త మార్పు లేవనెత్తాలనే ఉద్దేశ్యమే వాళ్ళకి లేదు. లాభసాటిగా వ్యాపారం సాగిస్తూ, పన్నులు వసూలు చేసి ఇంగ్లండుకు జమకట్టటం ఒక్కటే వాళ్ళు కోరుకున్నది. 1765 మొదలు 1772దాకా, అంటే ద్వంద ప్రభుత్వం సాగిన కాలంలో స్వదేశ అధికారుల్ని లోగడ మాదిరిగా వాళ్ళ పనులు వాళ్ళని చేసుకు పోనిచ్చారు. అయితే బ్రిటీషు గవర్నరు, బ్రిటీషు అధికార్లు వాళ్ళ మీద పూర్తి అజమాయిషీ చలాయించారు. అంటే భారతదేశపు అధికార్లకి బాధ్యతలు తప్ప అధికారాలు లేవు; కంపెనీ అధికారులకి అధికారాలే తప్ప బాధ్యతలు లేవు. ఈ ఉభయ అధికార వర్గాలూ నీతి నియమాలు లేని అవినీతి పరులు. 1772లో కంపెనీ ద్వంద ప్రభుత్వాన్ని రద్దుచేసి, తన స్వంత ఉద్యోగుల ద్వారా బెంగాల్‌ని నేరుగా పరిపాలించింది. అయితే, నూటికి నూరుపాళ్ళ వాణిజ్య సంస్థ దేశ పరిపాలన చేస్తే ఆ పద్ధతిలో అంతర్నిహితంగా ఉండే చెడుగులేవో చప్పున బైటపడ్డాయి.

అనాడు తూర్పిండియా కంపెనీ తూర్పు దేశాలతో వర్తకం చేసుకోడానికి రూపెత్తిన ఒక వాణిజ్య సంస్థ. పైగా ఆ సంస్థ పై అధికారులు ఇండియాకు వేలమైళ్ళ దూరంలో

ఇంగ్లండులో కూర్చున్నారు అయినా అది కోట్లాది ప్రజల మీద రాజకీయాధిపత్యం చలాయించటానికి వచ్చింది ఈ క్రమ విరుద్ధమైన పద్ధతి, పరిస్థితి బ్రిటీషు ప్రభుత్వానికి చాలా సమస్యలు తెచ్చిపెట్టింది తూర్పిండియా కంపెనీకి, అది సంపాదించిన భూభాగాలకి బ్రిటీషు ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం ఉండాలి? ఎక్కడో సుదూర భారత దేశంలో రాశిపోసిన అసంఖ్యాక అధికార, సైనిక బాహుళ్యాన్ని బ్రిటన్‌లోని కంపెనీ అధికార్లు కంట్రోలు చేసేదెలాగు? బెంగాలు, మద్రాసు, బొంబాయిల్లో దూర దూరంగా విస్తరించిన భూభాగాలన్నింటికీ కలిపి ఒకే ఒక కంట్రోలు కేంద్రాన్ని సమకూర్చటం ఎలాగు?

ఈ ప్రశ్నల్లో మొట్ట మొదటిది మహా ఒత్తిడి పెట్టే, అతి ముఖ్యమైన ప్రశ్న అదీగాక, ఈ సమస్య బ్రిటన్‌లోని పార్టీ, పార్లమెంటరీ ప్రతిస్పర్థల్తో, బ్రిటీషు రాజనీతిజ్ఞుల రాజకీయ కాంక్షల్తో, ఇంగ్లీషు వర్తకుల వ్యాపార కక్కుర్తితో సన్నిహితంగా పెనవేసుకుపోయింది బెంగాల్ సౌభాగ్యవంతమైన వనర్లు కంపెనీ చేతుల్లో పడిన వెంటనే కంపెనీ యజమాన్లు వాటాదార్లకు పెట్టుబడి మీద ఇచ్చే లాభాన్ని 1767లో పది శాతానికి పెంచారు 1771లో దాన్ని 12 $^1/_2$ శాతానికి పెంచాలని ప్రతిపాదించారు కంపెనీ కింద పని చేసే ఇంగ్లీషు ఉద్యోగులు అక్రమ వ్యాపారం ద్వారాను, సంస్థానాధీశుల్ని, జమీందార్లని నిర్బంధించి కట్నాలు, కానుకలు, లంచాలు కాజేసి నదమంత్రపు సిరి సంపాదించారు క్లైవ్ తన 34వ ఏట ఇంగ్లండ్‌కు తిరిగి వచ్చినప్పుడు, ఏటా 40 000 పౌండ్ల ఆదాయం తెచ్చిపెట్టే ఆస్తి, సంపదా పోగేసుకున్నాడు కంపెనీ విరజిమ్మే అధిక లాభాల్ని, కంపెనీ అధికార్లు ఇంటికి తిరిగి వస్తూ వెంట తెచ్చుకునే అద్భుత సంపదనీ చూసి బ్రిటీషు సమాజం లోని ఇతర వర్గాలకు కన్ను కుట్టింది కంపెనీ గుత్త వ్యాపార హక్కు మూలంగా తూర్పు దేశాలతో వర్తకం సాగించే అవకాశం పొందని వాళ్ళు, పెరిగిపోయే పారిశ్రామిక వర్గం, బ్రిటన్‌లో తిన దినాభివృద్ధి చెందే స్వేచ్ఛా వ్యాపార శక్తులు భారతదేశపు లాభదాయక వ్యాపారంలోను, భారత సంపదలోను తమకూ వాటా ఉండాలని కోరారు. ఈ లాభాలు, భాగ్యాలు సమస్తం ఇప్పటిదాకా కంపెనీ, కంపెనీ ఉద్యోగులు మాత్రమే ఇతర్లకు చోటు పెట్టకుండా అనుభవిస్తూ వచ్చారు. కాబట్టి, కంపెనీ వ్యతిరేక వర్గాలు తూర్పిండియా కంపెనీ గుత్త పెత్తనాన్ని బద్దలు కొట్టటానికి శాయశక్తులా కృషి చేశాయి; తమ వాదనకు మద్దతుగా బెంగాల్‌లో కంపెనీ పరిపాలనని దుయ్యబట్టాయి. ఇండియా నుండి ఇంగ్లండ్‌కు వెనక్కి తిరిగి వచ్చిన కంపెనీ అధికారుల మీదికి ప్రత్యేకంగా ఈ వర్గాలు తమ బాణాలు ఎక్కు పెట్టాయి. ఈ అధికార్లని "నవాబు"అని ఎద్దేవే చేశారు పత్రికల్లోను, వేదికల మీదా వీళ్ళమీద విసుర్లు ఎక్కువయ్యాయి కులీన వర్గాలు వీళ్ళని వెలివేశాయి; భారత ప్రజా పీడకులుగా, దోపిడి దార్లుగా వీళ్ళని అభిశంసించాయి. ఈ "నవాబు"ల్ని అభిశంసించడం ద్వారా కంపెనీ వ్యతిరేకులు కంపెనీని ప్రజల్లో అభాసు పాల్జేసి, దించి వెయ్యవచ్చని ఆశించారు.

చాలామంది మంత్రులు, ఇతర పార్లమెంటు సభ్యులు బెంగాల్ అక్రమణ ద్వారా ఒనగూడే లాభాన్ని పంచుకోవాలని తహతహలాడారు. కంపెనీని బ్రిటీషు ప్రభుత్వానికి కప్పం కట్టించేలాగు ఒత్తిడి పెట్టడం ద్వారా వాళ్ళు ప్రజాభిప్రాయాన్ని తమకు అనుకూలంగా మలచుకోవాలని ఆశించారు తద్వారా భారత రెవెన్యూని

బ్రిటన్‌లో పన్నుల పబ్లిక్ రుణాల తగ్గింపునకు ఉపయోగించుకునే వీలు కలుగుతుంది తదనుగుణంగా పార్లమెంటు 1767 లో ఒక చట్టం చేసింది దాని ప్రకారం, కంపెనీ ఏటా బ్రిటీషు ఖజానాలో నాలుగు లక్షల పౌండ్లు జమకట్టాలి అనేక మంది రాజకీయ తత్వవేత్తలు, బ్రిటీషు రాజనీతిజ్ఞులు కంపెనీ కార్యకలాపాల్ని, కంపెనీ ఉద్యోగుల లావాదేవీల్ని కంట్రోలు చెయ్యవలసిన అవసరాన్ని ఉద్బోధించారు మహాశక్తిగా తయారైన కంపెనీ, దండిగా డబ్బు గడించిన కంపెనీ అధికార్లు ఇంగ్లీషు జాతినీ, ఇంగ్లండ్ రాజకీయాల్ని చెడుమార్గం తొక్కిస్తారని వాళ్ళు భయపడిపోయారు. అసలే, బ్రిటీషు పార్లమెంటరీ రాజకీయాలు 18వ శతాబ్ది రెండవ భాగంలో కుళ్ళు కంపు కొడుతున్నాయి. కంపెనీగానీ, కంపెనీలో పదవీ విరమణ చేసిన అధికార్లుగానీ పార్లమెంటు దిగువ సభలో తమ తాబేదార్లకు సీట్లుకొని పడేశారు ఇండియాలో దేచుకొన్న సంపదతో కంపెనీ, కంపెనీ అధికార్లు బ్రిటీషు ప్రభుత్వంలో ప్రాబల్యం, పలుకుబడి సంపాయించుకునే ప్రమాదాన్ని ఊహించి అనేకమంది బ్రిటీషు రాజనీతిజ్ఞులు కలవరపడ్డారు కంపెనీని, అది భారత దేశంలో సాధించిన సువిశాల సామ్రాజ్యాన్ని కంట్రోలు చేయాల్సివుందని వాళ్ళు భావించారు అలా కంట్రోలు చేయలేకపోతే, భారతదేశాధినేతగా కంపెనీ త్వరలో బ్రిటీషు పరిపాలనా వ్యవస్థనే కంట్రోలు చేసే స్థితికి చేరుకుని బ్రిటీషు ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలని హరించి వెయ్యగలదు

కంపెనీ ప్రత్యేక హక్కుల్ని, గుత్త పెత్తనాన్ని స్వేచ్ఛా వ్యాపార, పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానానికి ప్రాతినిధ్యం వహించే కొత్త అర్థిక వేత్తలు సైతం ఖండించారు ఆడం స్మిత్ తన ప్రపంచ ప్రసిద్ధ గ్రంథం "వెల్త్ ఆఫ్ నేషన్స్" (Wealth of Nauons)లో గుత్త పెత్తనం చలాయించే కంపెనీల్ని నిశితంగా దుయ్యబట్టాడు

"గుత్తహక్కులు సంపాయించిన ఇటువంటి కంపెనీలు అనేక సందర్భాల్లో రోత పుట్టిస్తాయి అవి కాలూనిన దేశాలకు సర్వదా కొద్దే గొప్పో చికాకు కలిగిస్తాయి, ఇక ఈ కంపెనీ ప్రభుత్వాల బారినపడ్డ మందభాగ్యుల్ని ఇవి నమిలి పారేస్తాయి"

అన్ని వేపుల నుంచి వచ్చే ఇన్ని విమర్శలు, విసుర్ల ఫలితంగా బ్రిటీషు రాజ్యానికి - కంపెనీ పాలక వర్గానికి మధ్య సంబంధాల్ని పునర్నిర్మించవలసిన అవసరం ఏర్పడ్డది కంపెనీ బ్రిటీషు ప్రభుత్వాన్ని పదిలక్షల పౌండ్ల రుణ సహాయం కావాలని అర్థించడంతో సమయం, సందర్భం కలిసి వచ్చాయి కంపెనీ శత్రువులు అసంఖ్యాకులు, బలవంతులూ అయినా, పార్లమెంటులో కంపెనీకి కూడా బలమైన స్నేహితులు లేక పోలేదు పైగా, సాక్షాత్తు మూడవ జార్జిరాజు అంతటివాడే కంపెనీకి పోషకుడుగా ఉన్నాడు కాబట్టి, కంపెనీ తన శత్రువుల్ని తిప్పి కొట్టింది. చివరికి, పార్లమెంటు ఒక రాజీ మార్గాన్ని రూపొందించింది ఆ రాజీ ద్వారా కంపెనీ ప్రయోజనాల, బ్రిటీషు సమాజంలో పలుకుబడిగల వివిధ వర్గాల ప్రయోజనాల మధ్య సున్నితమైన సమతౌల్యం సాధించబడింది బ్రిటీషు ప్రభుత్వం కంపెనీ పరిపాలన తాలూకు మూల విధానాల్ని కంట్రోలు చెయ్యటానికి నిర్ణయం జరిగింది తద్వారా, మొత్తం మీద బ్రిటన్ ఉన్నత వర్గాల ప్రయోజనాల కనుగుణంగా భారతదేశంలో బ్రిటీషు పరిపాలన సాగుతుంది అట్లాగే, కంపెనీకి తూర్పు దేశాల వర్తకంలో గుత్త హక్కు ఉంటుంది. భారతదేశంలో తన అధికార్లని నియమించుకునే విలువైన హక్కు కూడా చెక్కు చెదరదు

కంపెనీ వ్యవహారాలకు సంబంధించి, పార్లమెంటు 1773లో ఒక ముఖ్యమైన యాక్టుని ఆమోదించింది  అదే రెగ్యులేటింగ్ యాక్టు  ఈ యాక్టు కంపెనీ డైరెక్టర్ల సంఘం రాజ్యాంగంలో కొన్ని మార్పులు ప్రవేశ పెట్టింది. కంపెనీ డైరెక్టర్ల చర్యలు బ్రిటీషు ప్రభుత్వ పర్యవేక్షణ కిందికి వచ్చాయి  భారతదేశంలో పౌర, సైనిక, రెవెన్యూ వ్యవహారాలకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాల్ని డైరెక్టర్లు బ్రిటీషు మంత్రి వర్గానికి సమర్పించాలి  భారతదేశంలో, బెంగాల్ ప్రభుత్వాన్ని ఒక గవర్నర్ - జనరల్, అతని కౌన్సిల్ కలిసి నిర్వహించాలి  యుద్ధం, శాంతికి సంబంధించిన వ్యవహారాల్లో బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలపైన కంట్రోలు, పర్యవేక్షణాధికారాలు గవర్నర్-జనరల్‌కు, అతని కౌన్సిలుకు ఉంటాయి  యూరోపియన్లకు, వాళ్ళ కింద పని చేసే ఉద్యోగులకు, కలకత్తా పౌరులకు సంబంధించి న్యాయ నిర్వహణ జరపటానికి కలకత్తాలో ఒక సుప్రీం కోర్టుని స్థాపించాలని కూడా యాక్టు నిర్దేశించింది  కాని ఈ రెగ్యులేటింగ్ యాక్టు ఆచరణలో విఫలమైంది  దీనివల్ల, బ్రిటీష్ ప్రభుత్వానికి కంపెనీని అదుపు చేసే క్రియాశీల, నిర్ణాయక అధికారం లభించలేదు  ఇక, ఇండియాలో గవర్నర్-జనరల్‌ని అతని కౌన్సిల్ దయాధర్మం మీద ఆధార పడేటట్లు చేసింది  కౌన్సిలర్లు ముగ్గురూ కూడబలుక్కుని ఏ వ్యవహారంలోనైనా సరే గవర్నర్ - జనరల్‌ని ఓడగొట్టవచ్చు  ఆచరణలో, ఈ యాక్టు కింద మొట్ట మొదటి గవర్నర్-జనరల్‌గా వచ్చిన వారన్ హేస్టింగ్స్, అతన్ని కౌన్సిల్‌లో ముగ్గురు సభ్యులూ ఎడతెగకుండా కీచులాడుకుని పరిపాలనలో ప్రతిష్టంభన సృష్టించారు  బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలపైన గవర్నర్-జనరల్ కిచ్చిన అధికారాలు కూడా చాలీ చాలనివి  ఇక కంపెనీకి - ఇంగ్లండ్‌లో రోజు రోజుకు పెరిగిపోయే కంపెనీ వ్యతిరేక వర్గాలకు మధ్య ఇది సంఘర్షణని నివారించలేకపోవటం ఈ యాక్టులోని అన్నిటికన్నా ముఖ్యమైన లొసుగు  పైపెచ్చు, భారతదేశంలో కంపెనీ పరిపాలన అవినీతి పుట్టగా, ప్రజాకంటకంగా, ఆర్థిక వినాశకరంగా కొనసాగుతూ ఉండటంతో కంపెనీ ఇంగ్లండ్‌లోని తన శత్రువర్గాల దాడులకు అగ్గమైపోయే స్థితిలో పడిపోయింది

రెగ్యులేటింగ్ యాక్టులోని ఈ లొసుగుల వల్లా, బ్రిటీష్ రాజకీయాల్లో కొన్ని క్లిష్ట పరిస్థితులు ఉత్పన్నం కావటం వల్లా 1784లో వేరే ఇంకొక శాసనాన్ని చెయ్యవలసిన అవసరం ఏర్పడింది  అదే క్విట్ ఇండియా యాక్టు  ఈ యాక్టువల్ల బ్రిటీష్ ప్రభుత్వానికి కంపెనీ వ్యవహారాల మీదా, భారతదేశంలో కంపెనీ పరిపాలన మీదా సర్వాధికారాలు ఏర్పడ్డాయి  భారత వ్యవహారాల కోసం గాను ఆరుగురు కమీషనర్లతో కూడిన ఒక బోర్డ్ ఆఫ్ కంట్రోలు అవతరించింది  ఇద్దరు క్యాబినెట్ మంత్రులు ఇందులో సభ్యులు  ఈ బోర్డు కంపెనీ డైరెక్టర్ల సంఘం కార్యకలాపాలకు, భారత ప్రభుత్వ నిర్వహణకు అవసరమైన మార్గదర్శకత్వం వహిస్తూ కంట్రోలు చేస్తుంది  ముఖ్యమైన, అర్జంటు వ్యవహారాలలో డైరెక్టర్ల రహస్య కమిటీ ద్వారా భారతదేశానికి నేరుగా ఉత్తర్వులు పంపే అధికారం బోర్డ్ ఆఫ్ కంట్రోలు కుంది. ఈ యాక్టు భారత ప్రభుత్వాన్ని గవర్నర్-జనరల్, అతని త్రై సభ్య కౌన్సిల్ చేతుల్లో పెట్టింది  గవర్నర్-జనరల్ తన కౌన్సిల్ సభ్యుల్లో ఒక్కరి మద్దతు పొందితే చాలు, అతనికిక అడ్డులేదు  యుద్ధం, దౌత్యం, రెవెన్యూలకు సంబంధించిన వ్యవహారాల్లో బొంబాయి, మద్రాసు రాష్ట్రాలు బెంగాలుకి లోబడి వుండేలాగు ఈ యాక్టు స్పష్టంగా నిర్దేశించింది. ఈ

యాక్టుతో బ్రిటిషువారి భారతాక్రమణలో నూతన ఘట్టం ప్రారంభమైంది. ఈస్టిండియా కంపెనీ బ్రిటిషు జాతీయ విధానానికి కట్టుబడ్డ ప్రధానమైన పనిముట్టు కాగా, భారతదేశం బ్రిటన్ పాలకవర్గాల సకల విభాగాల ప్రయోజనాల్ని కనిపెట్టి ఉండే వలసగా తయారైంది. భారత చైనాలతో వ్యాపారం చేసే గుత్త హక్కు చెక్కు చెదరకుండా ఉన్నందుకు కంపెనీ సంతృప్తి పడింది. భారతదేశంలో కంపెనీ ఉద్యోగుల, అధికార్ల నియామకాలు, తొలగింపుల విషయంలో డైరెక్టర్లు తమ లాభదాయకమైన హక్కును నిలుపుకున్నారు. ఇవన్నీ కాక, భారత ప్రభుత్వ కార్యనిర్వహణ యావత్తు కంపెనీ ఏజెన్సీ ద్వారా నడుస్తుంది.

1857 వరకు భారతదేశంలో బ్రిటిషు ప్రభుత్వాన్ని నడవటానికి అవసరమైన సాధారణ చట్టాలన్ని పిట్ ఇండియా యాక్టు రూపొందిస్తే, ఆ తరువాత వచ్చిన యాక్టులు కంపెనీ అధికారాల్ని, ప్రత్యేక హక్కుల్ని క్రమేపీ తగ్గించివేసే అనేక ముఖ్య మార్పులు తెచ్చాయి. రాజ్యక్షేమం, శాంతి - లేదా భారత దేశంలో బ్రిటిషు సామ్రాజ్య ప్రయోజనాలకు సంబంధించిన ప్రధాన విషయాలలో గవర్నర్ - జనరల్‌కు తన కౌన్సిల్‌ని కాదని ముందుకు సాగటానికి 1786లో అధికారం లభించింది.

1813లో బ్రిటిషు పార్లమెంటు తెచ్చిన చార్టర్ యాక్టు భారతదేశంలో ఈస్టిండియా కంపెనీ గుత్త వ్యాపార హక్కుకు భరతవాక్యం పలికింది. బ్రిటిషు వారులందరికీ భారతదేశంతో వ్యాపారం చేసుకునే సదుపాయం అందుబాటయింది. అయితే, తేయాకు వర్తకంలోను, చైనాతో వ్యాపారంలోను కంపెనీ గుత్త పెత్తనం కొనసాగింది. భారతదేశంలో ప్రభుత్వం, ఆదాయం కంపెనీ చేతుల్లోనే నిలబడిపోయాయి. కంపెనీ ఇండియాలో తన ఉద్యోగుల్ని, అధికారుల్ని నియమించుకునే హక్కు లోగడ మాదిరిగా ఇప్పుడూ అవిచ్ఛిన్నంగా కొనసాగింది.

1833లో మరొక చార్టర్ యాక్టు వచ్చింది దానివల్ల తేయాకు వర్తకంలోను, చైనాతో వ్యాపారంలోను కంపెనీ గుత్తాధిపత్యం అంతమైంది. అదే సమయంలో, కంపెనీ రుణాల్ని బ్రిటిషు ఇండియా ప్రభుత్వం పైన వేసుకుంది. వాటాదార్లకు పెట్టుబడిమీద 10 $^1/_2$ శాతం లాభం చెల్లించే బాధ్యతని కూడా స్వీకరించింది. ఇంగ్లండ్‌లోని బోర్డ్ ఆఫ్ కంట్రోల్ కఠిన అదుపాజ్ఞల కింద బ్రిటిషు ఇండియా ప్రభుత్వ నిర్వహణ కొనసాగింది.

ఈ విధంగా బ్రిటిషు పార్లమెంటు చేసిన అనేక శాసనాలు కంపెనీని, కంపెనీ పరిపాలనని బ్రిటిషు ప్రభుత్వ పెత్తనం కిందికి తెచ్చాయి. ఎక్కడో 6,000 మైళ్ళ దూరంలో కూర్చుని ఇక్కడి దైనందిన పరిపాలనని చక్కబెట్టాలన్నా, కనీసం పర్యవేక్షించాలన్నా సాధ్యమయ్యే పనికాదని ఇంగ్లండ్‌లో పెద్దలు గ్రహించారు. అతి ముఖ్యమైన వ్యవహారాల్లో కౌన్సిల్‌ని త్రోసిపుచ్చి స్వయంగా నిర్ణయాలు తీసుకునే అధికారం పొందిన గవర్నర్ - జనరల్ బ్రిటిషు ప్రభుత్వ మార్గదర్శక సూత్రాల కిందా, పర్యవేక్షణ, కంట్రోలుల కిందా పనిచేస్తూ బ్రిటిషు ఇండియా ప్రభుత్వపు అసలు సిసలైన పరిపాలకుడయ్యాడు. తమ స్వంత దేశంలో నడిచే పరిపాలనలో భారతీయులకు చోటు లేదనే సంగతి ఇక్కడ మనం గుర్తుపెట్టుకోవాలి. ఇండియాకు సంబంధించి మూడు అధికార పీఠాలు వెలిశాయి ఒకటి-కంపెనీ డైరెక్టర్ల సంఘం. రెండు - బ్రిటిషు ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించే బోర్డ్ ఆఫ్ కంట్రోలు. మూడు - గవర్నర్-జనరల్. ఈ మూడు అధికార పీఠాల్లోనూ భారతీయుడన్న వానికి ఏ స్థాయిలో గానీ ఏ రూపంలో గానీ చోటు లేదు.

## భారతదేశంలో బ్రిటిష్ ఆర్థిక విధానాలు (1757–1857)


*వాణిజ్య విధానం:* 1600 లగాయతు 1757 వరకు ఈస్టిండియా కంపెనీ భారతదేశంలో ఒక వ్యాపార సంస్థ పాత్ర నిర్వహించింది. ఆభరణాలుగా పనికివచ్చే విలువైన రాళ్ళు, ఇతర సరుకులు ఇండియాలో దించి, వాటికి బదులుగా ఇండియానుంచి నేత వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు వగైరా పట్టుకుపోయి విదేశాల్లో అమ్ముకునేది. భారతదేశ వస్తువుల్ని బైటి దేశాల్లో అమ్ముకోటం ద్వారా కంపెనీకి లాభాలు వచ్చాయి. కాబట్టి, కంపెనీ భారతదేశ వస్తువులకు ఇంగ్లండ్‌లోను, ఇంకా ఇతర దేశాల్లోను కొత్త మార్కెట్లు సంపాయించాలని నిర్విరామంగా ప్రయత్నాలు చేసింది. ఆ విధంగా భారతదేశ ఉత్పత్తుల ఎగుమతిని పెంచింది. ఎగుమతులు పెరగటం వల్ల ఇక్కడ ఉత్పత్తికి ప్రోత్సాహం కలిగింది. ఈ కారణం మూలానే స్వదేశ రాజులు కంపెనీ వాళ్ళని సహించారు, కంపెనీ ఫ్యాక్టరీలు కట్టుకోటానికి ప్రోత్సాహం ఇచ్చారు

కాని, మొట్టమొదటి నుంచి బ్రిటిష్ పారిశ్రామికులకి తమ దేశంలో భారతీయ వస్త్రాలు విశేష జనాదరణ పొందటం చూసి కన్ను కుట్టింది. హఠాత్తుగా వస్త్ర ధారణ, ఫ్యాషన్లు మారిపోయాయి. ఇంగ్లీషు ముతక ఊలు బట్టల్ని నెట్టేస్తూ తేలికపాటి నూలు బట్టలు మార్కెట్‌ను ముంచెత్తాయి."భారతీయ వస్త్రాలు మన ఇళ్ళల్లోకి, బీరువాలోకి, పడకగదుల్లోకి చొరబడ్డాయి. మన గుమ్మాలకి,కిటికీలకు కట్టే తెరలు, మన మెత్తలు, మన కుర్చీ కవర్లు, ఆఖరికి మన పక్కల్తో సహా అన్నిటికీ ఇండియాబట్టే! " అని రాబిన్‌సన్ క్రూసో నవలలో రచయిత డెఫో వ్రాసాయాడు. ఇంగ్లండ్‌లో భారతీయ వస్తువుల్ని బహిష్కరించమని, వాటిమీద నిర్బంధాలు విధించమని బ్రిటీషు ఉత్పత్తిదార్లు ప్రభుత్వాన్ని ఒత్తిడి పెట్టారు. 1720 నాటికి అద్దకపు నేత బట్టల వాడకం మీద నిషేధం వచ్చింది. 1760 లో ఇండియా నుండి దిగుమతయిన నేత చేతి రుమాలు వాడినందుకు ఒక బ్రిటీషు మహిళ 200 పౌండ్ల జరిమానా చెల్లించుకోవలసి వచ్చింది! సాదా బట్ట దిగుమతులమీద భారీ సుంకాలు విధించబడ్డాయి. ఒక్క హాలెండు తప్ప తతిమ్మా యూరవ్ దేశాలు సైతం భారతీయ వస్త్రాల దిగుమతుల్ని నిషేధించటం గానీ, భారీ సుంకాలు విధించడంగానీ చేశాయి. ఇన్ని చట్టాలు చేసినా భారతీయ పట్టు, నేత బట్టలకు విదేశాలలో గిరాకి తగ్గలేదు. బాగా అభివృద్ధి చెందిన నూతన సాంకేతిక విజ్ఞానం ఆధారంగా 18వ శతాబ్దం మధ్యలో ఇంగ్లీషు బట్టల పరిశ్రమ పైకి రావటం ప్రారంభమయ్యేదాకా భారతీయ వస్త్రాలకు విదేశాలలో మార్కెట్టు పదిలంగానే ఉంది.

1757 లో ప్లాసీ యుద్ధం తరువాత, భారతదేశంతో కంపెనీ వాణిజ్య సంబంధాల నమూనా గుణాత్మకంగా మార్పు చెందింది. కంపెనీ భారతదేశంలో తన వ్యాపారాన్ని పెంపు చేసుకోడానికి బెంగాల్‌లో సాధించిన రాజకీయ పెత్తనాన్ని ఉపయోగించుకో గల్గింది. పైగా బెంగాల్ మీద వచ్చే ఆదాయంతో భారతీయ సరుకుల ఎగుమతులకు పెట్టుబడి పెట్టింది. కంపెనీ వ్యాపార కార్యకలాపాలు భారతీయ ఉత్పత్తిదార్లకి ప్రోత్సాహం ఇచ్చి వుండాల్సింది. కాని, అలా జరగలేదు. కంపెనీ తన రాజకీయాధికారాన్ని ఉపయోగించి బెంగాల్ చేనేతపనివాళ్ళమీద జులుం చలాయించింది. నష్టం వచ్చినాసరే, కంపెనీ నిర్ణయించిన కారు చౌక వెలకి చేనేత పనివాళ్ళు తాము నేసిన బట్టల్ని అమ్ముకోవలసి వచ్చింది. పైగా, తమ ఇచ్ఛానుసారం శ్రమించే స్వేచ్ఛ కూడా వాళ్ళకి లేకుండా పోయింది. చాలా మంది నేత పనివాళ్ళు

కంపెనీ కింద బలవంతంగా అతి తక్కువ కూలికి పని చేయవలసి వచ్చింది. భారతీయ వర్తకులకు బట్టలు నేసిపెట్టకూడదని కంపెనీ నిషేదాజ్ఞలు జారీ చేసింది. స్వదేశీ, విదేశీ పోటీదార్లని కంపెనీ మూలకి నెట్టేసింది బెంగాల్ చేతి వృత్తుల పనివాళ్ళకి హెచ్చు వేతనాలుగానీ, గిట్టుబాటు ధరలుగానీ ఇవ్వటానికి వీల్లేదని వాళ్ళని హెచ్చరించింది కంపెనీ ఉద్యోగులు ముడిప్రత్తి అమ్మకం మీద గుత్తపెత్తనం సంపాయించారు. చేనేత పనివాళ్ళకి అవసరమైన దూదికి విపరీతంగా ధర పెంచేశారు. అవిధంగా చేనేత పనివాళ్ళు క్రయ, విక్రయదార్లుగా రెండిందాలా నష్ట పోయారు అప్పుడే, ఇంగ్లండ్‌లో ప్రవేశించే భారతీయ వస్త్రాల మీద తలకి మించిన సుంకం పడింది. బ్రిటిషు ప్రభుత్వం ఇంగ్లండ్‌లో పైకి వస్తున్న యంత్ర పరిశ్రమని ఎలానైనా బ్రతికించుకోవాలని కృత నిశ్చయంతో ఉంది కాని, నాణ్యతలో మన్నికైన, ధరలో సరసమైన భారతీయ నేత బట్టతో మిల్లు బట్టపోటీ పడలేకపోయింది. ఇండియా చేతిపనుల మీద 1813 తరువాత ఘోరమైన దెబ్బ పడింది. భారతీయ వస్తువులకు మార్కెట్టు విదేశాలలో పడిపోవటమే కాకుండా, ఆఖరికి స్వదేశంలో సహితం పడిపోయింది

బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం బ్రిటిషు ఆర్థిక వ్యవస్థని, భారతదేశంలో బ్రిటిషు వాణిజ్య సంబంధాల్ని సమూలంగా మార్చివేసింది 18వ శతాబ్దం రెండవ భాగంలోను, 1వ శతాబ్దం మొదటి ఒకటి రెండు దశాబ్దాల్లోను బ్రిటన్ బ్రహ్మాండమైన



పారిశ్రామిక విప్లవం మొదటి రోజులలో ఇంగ్లండ్‌లోని ఒక ఇనుము, ఉక్కు కర్మాగారము

సామాజిక, ఆర్థిక పరివర్తన పొందింది. ఆధునిక యంత్రాలు, ఫ్యాక్టరీ వ్యవస్థ, పెట్టుబడిదారీ విధానం వగైరాల ప్రాతిపదిక మీద బ్రిటిషు పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెంది, చకచకా విస్తరించింది. ఈ వికాసానికి చాలా కారణాలు దోహదం చేశాయి.

బ్రిటన్ సముద్రాంతర వ్యాపారం గడచిన శతాబ్దాలలో వేగంగా విస్తరిల్లింది. యుద్ధం, వలస తత్వం అనే సాధనాలతో బ్రిటన్ అనేక విదేశ మార్కెట్లను పట్టుకొని, గుత్త హక్కులు సాధించుకుంది. ఉత్పత్తిలో, నిర్మాణ వ్యవస్థలో వచ్చిన అధునాతన సాంకేతిక పద్ధతుల ఆధారంగా బ్రిటన్ ఎగుమతి సరుకుల పరిశ్రమలు తమ ఉత్పత్తిని వేగంగా పెంచుకోడానికి ఈ ఎగుమతి మార్కెట్లు దోహదం చేశాయి. ఆఫ్రికా, పడమటి ఇండియాదీవులు (వెస్టిండీస్), లాటిన్ అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, చైనా, అన్నిటినీ మించి ఇండియా ఇంగ్లీషు సరుకుల ఎగుమతులకు అనంతమైన అవకాశాలు కల్పించాయి. ఇంగ్లండ్‌లో పారిశ్రామిక విప్లవ వికాసానికి మధ్యవర్తిగా ఉపయోగపడ్డ బట్టల పరిశ్రమకి సంబంధించి ఇది పూర్తిగా నిజం. బ్రిటన్ అప్పటికే వలస వ్యాపార నమూనాని సిద్ధం చేసింది. అది పారిశ్రామిక విప్లవానికి తోడ్పడింది. పారిశ్రామిక విప్లవం తన వంతుగా ఈ నమూనాని పటిష్టవంతం చేసింది. వలసదేశాలు, బడుగుదేశాలు వ్యావసాయిక, ఖనిజ ముడిపదార్థాల్ని బ్రిటన్‌కు ఎగుమతి చేశాయి. ఆ ముడి పదార్థాలతో తయారుచేసిన వస్తువుల్ని బ్రిటన్ తిరిగి వలస, బడుగుదేశాలకు అమ్మింది.

రెండు - నూతన యంత్రాలకు, ఫ్యాక్టరీ వ్యవస్థకు అవసరమైన పెట్టుబడులకు తగినంత మూలధనం ఇంగ్లండ్‌లో పోగుబడివుంది. పైగా, ఈ ధనం ఫ్యూడల్ వర్గాల చేతుల్లో పోగుబడిలేదు. పోగుబడి ఉన్నా, ఫ్యూడల్ వర్గాలు ఆ డబ్బుని తమ జల్సాలకు వెదజల్లివుండేవి. అట్లా కాకుండా, వ్యాపారంలో పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టాలని తహతహలాడే వర్తకులు, పారిశ్రామిక యజమాన్ల చేతుల్లో ఆ డబ్బు మూలుగుతోంది. ఈ సందర్భంలో కూడా ఆఫ్రికా, ఆసియా, వెస్టిండీస్, లాటిన్ అమెరికాల నుంచి పీల్చిన అపార సంపదా, తూర్పిండియా కంపెనీ, కంపెనీ అధికార్లు ప్లాసీ యుద్ధం తరువాత భారతదేశం నుంచి కొల్లగొట్టిన అపరిమిత సంపదా పారిశ్రామిక విస్తరణకు పెట్టుబడిగా అతి ముఖ్యమైన పాత్ర నిర్వహించాయి.

మూడు - వేగంగా పెరిగిన జనాభా పెరిగే పరిశ్రమల్లో ఎక్కువ సంఖ్యలో, తక్కువ కూలికి పని చెయ్యటానికి అవసరమైన పనివాళ్ళ కొరతని తీర్చింది. 1740 తరవాత బ్రిటన్ జనాభా వేగంగా పెరిగింది. 1780 తరవాత యాభై యేళ్ళలో జనాభా రెట్టింపయింది.

నాలుగు-వాణిజ్య, పారిశ్రామిక ప్రయోజనాల పలుకుబడి చెల్లుబడి అయ్యే ప్రభుత్వం బ్రిటన్‌ది. కాబట్టి, ఆ ప్రభుత్వం మార్కెట్లకోసం, వలసలకోసం ఇతర దేశాలతో కృతనిశ్చయంతో పోరాడింది.

అయిదు - అధిక ఉత్పత్తి గురించి గిరాకీ సాంకేతిక విజ్ఞానం సాధించిన ప్రగతి ద్వారా తీరింది. హార్‌గ్రీవ్స్, వాట్, క్రాంప్టన్, కార్ట్‌రైట్ వగైరా అనేక మంది ప్రముఖులు కనిపెట్టిన నూతన సాధనాల మీద బ్రిటన్ వర్ధమాన పారిశ్రామిక వ్యవస్థ ఆధారపడగలిగింది. అప్పుడు వినియోగించుకొంటున్న సాధనాలు శతాబ్దాల వెనక నుంచి ఉన్నవే. వీటినిగానీ, ఆవిరిశక్తినిగానీ పూర్తిగా వినియోగించుకోవటానికని

ఉత్పత్తినంతా ఫ్యాక్టరీలలో విపరీతంగా కేంద్రీకరించారు. శాస్త్రజ్ఞులు కనిపెట్టిన నూతన విషయాల ద్వారా పారిశ్రామిక విప్లవం రాలేదని ఈ సందర్భంలో మనం గుర్తుపెట్టుకోవాలి. పెరిగే మార్కెట్లకి అనుగుణంగా శరవేగాన ఉత్పత్తి పెంచాలనే పారిశ్రామిక ఉత్పత్తిదార్ల కోరికా, అందుకవసరమైన పెట్టుబడి పెట్టగలిగిన వాళ్ళ స్థామతా పారిశ్రామిక విప్లవానికి నారూ, నీరూ పోశాయి. పెట్టుబడి పెట్టగలిగిన అస్థామతే అప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగ పర్చుకోటానికిగానీ, కొత్తవి కనిపెట్టటానికిగానీ ప్రోత్సాహం, ప్రోద్బలం ఇచ్చింది. నిజానికి, పారిశ్రామిక నవనిర్మాణం సాంకేతిక పరివర్తనని మానవ వికాసపు శాశ్వత లక్షణంగా చేయాల్సి ఉంది. ఈ అర్థంలో, పారిశ్రామిక విప్లవం ఎప్పుడూ ముగిసిపోలేదు. ఎంచేతనంటే, 18వ శతాబ్దం మధ్య నుంచీ ఆధునిక పరిశ్రమ, సాంకేతిక విజ్ఞానం ఒకమెట్టు నుంచి మరొక పైమెట్టుకి ఎగబాకి పోతూనే ఉన్నాయి.

పారిశ్రామిక విప్లవం బ్రిటీషు సమాజాన్ని మౌలికంగా మార్చివేసింది. ఇది సత్వర ఆర్థికాభివృద్ధికి దారితీసింది. బ్రిటన్, యూరప్, రష్యా, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జపాన్‌లలో ఈనాటి ఉన్నత జీవన ప్రమాణానికి ఆ ఆర్థికాభివృద్ధే పునాది. ఈనాడు ఆర్థికంగా సంపన్న, ఐదుగుదేశాలుగా పిలవబడుతున్న వాటి మధ్య జీవన ప్రమాణాల్లో తేడా 19వ శతాబ్దపు తొలి దినాల దాకా చాలా స్వల్పం. ఆర్థికంగా వెనుకబడ్డ దేశాల్లో పారిశ్రామిక విప్లవం రాకపోవటం వల్ల ఈనాడు ప్రపంచంలో మనం చూస్తున్న ఆదాయపు లోటు చోటు చేసుకుంది.

పారిశ్రామిక విప్లవ ఫలితంగా బ్రిటన్‌లో గ్రామీణ లక్షణాలు రూపుమాసి పట్టణాల సంఖ్య పెరిగిపోయింది. మరింతగా జనం ఫ్యాక్టరీలు పెట్టిన పట్టణాలకు ఎగబాకారు. బ్రిటన్‌లో 50,000 జనాభాని మించిన పట్టణాలు 1750లో రెండే రెండు ఉండేవి. 1851 నాటికి వాటి సంఖ్య 29కి పెరిగింది.

సమాజంలో పూర్తిగా కొత్త వర్గాలు రెండు పుట్టాయి. స్వంత ఫ్యాక్టరీలు కలిగిన పారిశ్రామిక పెట్టుబడిదారులు ఒక వర్గం; రోజుకూలికి శ్రమని అమ్ముకునే కార్మికులు రెండవ వర్గం. అపూర్వ సౌభాగ్యం అనుభవించే పెట్టుబడిదారీ వర్గం అమిత వేగంగా అభివృద్ధి చెందింది. పొట్టకోసం కష్టం చేసే నిరుపేద కార్మికులకు మొట్టమొదట్లో దుఃఖం, కన్నీళ్ళే మిగిలాయి. అనాదిగా జీవిస్తున్న పల్లెపట్టుల్తో వాళ్ళకి రుణం తీరిపోయింది. వాళ్ళ సాంప్రదాయిక జీవన పద్ధతి విచ్ఛిన్నమైపోయింది. పొగతో, మురుగుతో కంపుకొట్టే పట్టణాల్లో వాళ్ళు జీవయాత్ర సాగించవలసి వచ్చింది. చాలీచాలని కొంపల్లో, దుర్గంధపూరిత పరిసరాల్లో బ్రతుకీడ్చవలసి వచ్చింది. వేలాది కూలి జనం ఎండపొడ ఎరగని చీకటి మురికివాడల్లో జీవించారు. ఆ దుర్భర పరిస్థితుల్ని ప్రసిద్ధ బ్రిటిషు నవలాకారుడు చార్లెస్ డికెన్స్ తన నవలల్లో కళ్ళకు కట్టారు. ఫ్యాక్టరీలలో, గనుల్లో వాళ్ళు రోజుకి 14 - 16 గంటల చొప్పున పరిశ్రమించారు. కూలి చూడబోతే చాలా తక్కువ. కడుపు నిండని ఆ కూలి డబ్బులకే ఆడవాళ్ళు, పిల్లలు కఠోర శ్రమ చెయ్యాల్సి వచ్చింది. ఆఖరికి, నాలుగైదు సంవత్సరాలు నిండిన పసికందులకు సైతం ఫ్యాక్టరీల్లో, గనుల్లో పనులిచ్చారు. మొత్తం మీద, కూలివాడు పేదరికం, వెనుచాకిరీ, రోగం, అనారోగ్యం, పోషకాహార లోపం నిండిన హీనమైన బ్రతుకు గడిపాడు. 19వ శతాబ్ది రెండవ భాగంలో వాళ్ళ బ్రతుకు కొంత మెరుగుపడింది.

ఒక బలియమైన పారిశ్రామిక వర్గం ఆవిర్భావం బ్రిటీషు ఇండియా పరిపాలనా నిర్వహణపైన, విధానాలపైన ముఖ్యమైన ప్రభావం చూపింది. ఈ వర్గం రాశిలో, బలంలో, రాజకీయ పలుకుబడిలో విశేషంగా పెరగ్గానే, తూర్పిండియా కంపెనీ గుత్త వ్యాపార హక్కు మీద దాడి చేసింది. ఈ వర్గానికి లభించే లాభాలు వ్యాపారం నుంచి కాక, సరుకుల ఉత్పత్తి మీద కావటం చేత ఇండియా నుండి దిగుమతయ్యే వస్తువులు ఈ వర్గం కావాలనలేదు. తాము తయారుచేసే సరుకుని భారతదేశానికి ఎగుమతి చెయ్యటం, భారతదేశం నుంచి ముడిపత్తి వంటి ముడి సరుకుని దిగుమతి చేసుకోవటం ఈ వర్గానికి లాభకరం. అంచేత, ఏటా 380,000 పౌండ్లకుపైన బ్రిటీషు ఉత్పత్తుల్ని కంపెనీ భారతదేశానికి దిగుమతి చేసుకునేటట్లుగా చట్టం రావాలని బ్రిటీషు పరిశ్రమల యజమాన్లు 1769లో డిమాండు చేశారు. ఈ లావాదేవీల్లో కంపెనీ నష్టపడ్డాసరే బ్రిటీషు ఎగుమతుల్ని కంపెనీ ప్రోత్సహించాలని వాళ్ళు కోరారు. కంపెనీ ఓడలు ఏటా కనీసం 3,000 టన్నుల బ్రిటీషు సరుకుని మోసుకుపోవాలని కూడా వాళ్ళు కంపెనీ మీద ఒత్తిడి తెచ్చారు.

తూర్పుదేశాలకు, ముఖ్యంగా భారతదేశానికి ఎగుమతయిన బ్రిటీషు మిల్లు బట్ట విలువ 1794లో కేవలం 156 పౌండ్లు. 1813 నాటికి అది 110,000 పౌండ్లకు పెరిగింది. అంటే ఇరవై యేళ్ళలో 700 రెట్లు పెరిగిందన్నమాట! తాము ఉత్పత్తి చేసే సరుకుని భారతదేశానికి ఎగుమతి చెయ్యటానికి గల ఇతోధిక అవకాశాల గురించి చురుగ్గా పరిశోధనలు ప్రారంభించిన లాంకషైరు పారిశ్రామికులకి ఈ పెరుగుదల ఆనలేదు. 1901లో ఆర్.సి.దత్తు తన "భారతదేశ ఆర్థిక చరిత్ర" (Economic History of India) లో ఎత్తిచూపినట్లు, "భారతదేశ ఉత్పత్తుల్ని పడగొట్టి బ్రిటీషు ఉత్పత్తుల్ని ఎలా పైకెత్తాలా, భారతదేశ పరిశ్రమల పొట్టగొట్టి బ్రిటీషు పరిశ్రమల్ని ఎలా ప్రోత్సహించాలా అన్నదే" 1812 నాటి పార్లమెంటరీ కమిటీ చేసిన ప్రయత్నమంతా.

తూర్పిండియా కంపెనీ, ప్రాగ్దేశ వర్తకంలో దాని గుత్త పెత్తనం, భారతదేశం ఆదాయాన్ని, ఎగుమతి వ్యాపారాన్ని గుప్పెట్లో పెట్టుకుని భారతదేశాన్ని దివిపారేసే దాని పద్ధతులు తమ కలలు ఫలించకుండా అడ్డుపడుతున్నాయని బ్రిటీషు పారిశ్రామికులు ఉక్రోషం పట్టలేకపోయారు. కంపెనీని తమ పాలిట సైంధవునిగా వాళ్ళు భావించారు. 1793-1812 సంవత్సరాల మధ్య వాళ్ళు కంపెనీకి, కంపెనీ వ్యాపార హక్కులకి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం లేవదీశారు. చివరకి 1813లో భారతదేశ వ్యాపారంలో కంపెనీ గుత్త పెత్తనాన్ని రద్దు చేయించగలిగారు.

ఈ సంఘటనతో, భారతదేశంతో బ్రిటీషు ఆర్థిక సంబంధాలలో ఒక నూతన ఘట్టం ప్రారంభమైంది. వ్యావసాయిక భారతదేశాన్ని పారిశ్రామిక బ్రిటన్‌కు ఆర్థిక వలసగా తయారు చేశారు.

బ్రిటీషు ఇండియా ప్రభుత్వం ఇప్పుడు స్వేచ్ఛా వాణిజ్య విధానాన్ని అవలంభించింది. అంటే బ్రిటీషు వస్తువులు భారత దేశంలో ప్రవేశించటానికి ఏ అటంకాలు లేవు. బ్రిటన్‌లో యంత్రాల మీద తయారైన వస్తువులతో భారతదేశంలో చేతివృత్తుల్లో తయారైన వస్తువులు భీకరమైన, అసమానమైన పోటీకి నిలవలేక అంతరించిపోయాయి. బ్రిటీషు వస్తువులు నామమాత్రపు దిగుమతి సుంకాలు కట్టిగానీ లేదా అసలు కట్టకుండా గానీ భారతదేశంలో ప్రవేశించాయి. దానికి తోడు, అవధ్

లాంటి రక్షిత రాజ్యాలను బ్రిటీషు సామ్రాజ్యంలో విలీనం చేసుకోడం ద్వారాను, కొత్త రాజ్యాలను జయించటం ద్వారాను బ్రిటీషు వస్తువుల కొనుగోలు మార్కెట్లను బ్రిటీషువాళ్ళు విస్తృతపర్చుకున్నారు. ఇండియాలో భూమి శిస్తుని తగ్గిస్తే, రైతుల పరిస్థితి బాగుపడి బ్రిటీషు వస్తువుల్ని కొనగలుగుతారని బ్రిటీషు అధికారులు, రాజకీయ నాయకులు, వ్యాపారస్థులు భావించారు. కాబట్టి, భారతదేశంలో భూమిశిస్తు తగ్గించాలని వాళ్ళు ప్రచారం చేశారు. పాశ్చాత్య వస్తువుల మీద భారతీయులకు మోజు పెరగటం కోసం భారతదేశాన్ని ఆధునీకరణ చెయ్యాలని కూడా వాళ్ళు వాదించారు.

యంత్ర సాధనాల్ని, ఆవిరిశక్తిని విస్తారంగా ఉపయోగించుకోవటం ద్వారా అతివేగంగా ఉత్పాదక శక్తిని పెంచుకుంటున్న బ్రిటీషు మిల్లులలో తయారయ్యే చౌక వస్తువులతో చేతి పనితో తయారయ్యే భారతీయ వస్తువులు పోటీకి నిలవలేక పోయాయి. పూర్తిగా భారతీయ ప్రయోజనాలకే అంకితమైన ఏ ప్రభుత్వమైనా భారీ దిగుమతి సుంకాల దిగ్బంధాల ద్వారా భారతదేశ పరిశ్రమల్ని పరిరక్షించుకోగలిగి ఉండేది. ఆ విధంగా అదా అయిన కాలంలో పాశ్చాత్య దేశాల నుంచి నూతన సాంకేతిక విజ్ఞానాన్ని దిగుమతి చేసుకోగలిగి వుండేది. 18వ శతాబ్దంలో బ్రిటన్ తన పరిశ్రమలకు సంబంధించినంత వరకు ఇదే పని చేసింది. ఫ్రాన్సు, జర్మనీ, అమెరికాలు సైతం ఈ సమయంలో ఇదే పని చేస్తున్నాయి. స్వతంత్రభారత దేశం ఇప్పుడు ఇదే పని చేస్తోంది. ఏది ఏమైనా, భారత పరిశ్రమల్ని విదేశ పాలకులు రక్షించకపోగా, విదేశ వస్తువుల్ని స్వేచ్ఛగా దేశం లోపలికి రానిచ్చారు. విదేశ ఎగుమతులు వెర్రిగా పెరిగిపోయాయి. బ్రిటన్ నుంచి ఒక్క బట్టల దిగుమతులే 1813లో 110,000 పౌండ్ల నుంచి 1856 నాటికి 6,300,000 పౌండ్లకు పెరిగాయి.

విదేశ సరుకులకు భారతదేశ ద్వారాలు బార్లా తెరుచుకున్నాయి. బ్రిటన్‌లో ప్రవేశించే భారత దేశ వస్తువులు తలకు మించిన సుంకాలు చెల్లిస్తున్నాయి. భారత చేతివృత్తుల మీద బ్రిటిష్ పరిశ్రమలు సాంకేతికమైన ఆధిక్యత సాధించిన ఈ దశలోనైనా బ్రిటీషువాళ్ళు భారతదేశ వస్తువుల్ని న్యాయమైన సమాన నిష్పత్తిలో స్వీకరించరు. 1824లో భారతీయ నేత వస్త్రాలు బ్రిటన్‌లో $67^1/_2$ శాతం దిగుమతి సుంకం చెల్లించాయి. భారతదేశపు చక్కెర దాని అసలు ధర మీద మూడు రెట్లు సుంకం చెల్లించింది. కొన్ని సందర్భాల్లో బ్రిటన్‌లో విదేశాల నుండి దిగుమతయ్యే వస్తువుల మీద సుంకాలు 400 శాతం దాకా పెరిగాయి. ఈ అన్యాయమైన బ్రిటన్ వాణిజ్య విధానాన్ని బ్రిటీషు చరిత్రకారుడు H. H.విల్సన్ ఇలా వర్ణించాడు :

"ఇప్పటి వరకు ఇండియా నూలు, సిల్కు వస్త్రాల్ని ఇంగ్లండ్‌లో నేసే వస్త్రాల మీద కన్నా 50 నుంచి 60 శాతం తక్కువ రేటు మీద లాభానికి అమ్మవచ్చని సాక్షాధారం ఉంది. పర్యవసానంగా, ఇంగ్లీషు బట్టల పరిశ్రమని రక్షించటం కోసం ఇండియా వస్త్రాల మీద వాటి విలువని మించి 70 నుంచి 80 శాతం దాకా సుంకాలు వసూలు చెయ్యటంగానీ, వాటిని నిషేధించడంగానీ జరిగింది. మొయ్యలేని పన్నుల బరువూ, విధి నిషేధాలు విధించకపోయి వుంటే పైస్లే, మాంచెస్టర్ మిల్లులు ఆదిలోనే మూతపడి వుండేవి. ఆవిరి శక్తితో సైతం అవి మళ్ళీ పని చెయ్యటం ప్రారంభించి వుండేవే కాదు భారతీయ ఉత్పత్తిని బలిపెట్టి అవి సృష్టించబడ్డాయి. భారతదేశం స్వతంత్ర దేశమే గనుక అయివుంటే, అది తిప్పికొట్టి వుండేది. బ్రిటిష్ సరుకులమీద అంతకన్నా

ఎక్కువ దిగుమతి సుంకాలు వేసి తన పరిశ్రమలు అంతరించి పోకుండా కాపాడుకోగలిగి వుండేది. ఈ ఆత్మ రక్షణా చర్య తీసుకునే హక్కు కూడా ఆ దేశానికి లేదు. పరాయివాడి దయాధర్మ భిక్ష మీద అది ఆధారపడి వుంది.

ఏ సుంకాలూ చెల్లించనవసరం లేకుండా బ్రిటీషు ఉత్పత్తులు ఆ దేశం మీద రుద్దబడ్డాయి. సమానషరతుల మీద ఒక పోటీదారుని ఎదుర్కోలేక, విదేశ పరిశ్రమ యజమాని అక్రమ రాజకీయాధికారాన్ని ఉపయోగించి పోటీదారుని మెదలు వంచి చివరకి గొంతు నులిమి పారేశాడు".

తయారైన వస్తువుల్ని ఎగుమతి చేసుకోటానికి బదులు, ఇండియా ఇప్పుడు బ్రిటీషు పరిశ్రమలకి అత్యవసరంగా కావలసిన ముడి ప్రత్తి, ముడి సిల్కులాంటి ముడి పదార్థాల్ని, తోటల్లో పండే నీలిమందు తేయాలకులాంటి వాటిని, బ్రిటన్‌లో కొరతగా వున్న తిండి గింజల్ని ఎగుమతి చేయాల్సిన దుస్థితిలో పడింది. పరాయి ప్రభుత్వపు బలవంతం ఈ దుస్థితిని తెచ్చి పెట్టింది. 1856లో ఇండియా 4,300,000 పౌండ్ల విలువగల ముడి ప్రత్తిని, 810,000 పౌండ్ల విలువ మాత్రమే గల వస్త్రాల్ని, 2,9000,000 పౌండ్ల తిండి గింజల్ని, 1,730,000 పౌండ్ల నీలిమందుని, 770,000 పౌండ్ల ముడి సిల్కుని ఎగుమతి చేసింది. బ్రిటీషు వాళ్ళు చైనాలో ఇండియా నల్లమందు అమ్మకాన్ని సైతం ప్రోత్సహించారు. చైనా ప్రభుత్వం విషతుల్యమైన ఈ నల్లమందు వాడకాన్ని నిషేధించినా కంపెనీ తన అపార లాభాల కోసం ఇండియా నుండి నల్ల మందుని ఎగుమతి చేసింది. విచిత్రమేమంటే ఇదే నల్లమందు దిగుమతి బ్రిటన్‌లో నిషేధించబడింది.

ఆ విధంగా, తూర్పిండియా కంపెనీ వాణిజ్య విధానం 1813 దరిమిలా బ్రిటీషు పరిశ్రమల అవసరాల కనుగుణంగా రూపొందించబడింది. భారతదేశాన్ని బ్రిటీషు ఉత్పత్తుల వాడకందారుగా, ముడి పదార్థాల సరఫరా దారుగా మార్చి వెయ్యటమే కంపెనీ వాణిజ్య విధానం ధ్యేయం.

***భారతదేశ సంపద హరణం :*** వలస పాలకులు బ్రిటన్‌కు ఎగుమతి చేసిన భారతదేశ సంపద, సాధన సంపత్తుల్లో కొంత భాగానికి ఆర్థికంగాగాని, వస్తూరూపేణా గానీ ప్రతిఫలం అనేది ముట్టలేదు. ఈ "ఆర్థికపరమైన ఒడికి" బ్రిటీషు పరిపాలన యొక్క ఒక ప్రత్యేకత. పరమ నికృష్టమైన పూర్వపు భారత ప్రభుత్వాలు సైతం అవి గుంజిన రెవెన్యూని దేశంలోపలే ఖర్చుపెట్టాయి. ఆ పాలకులు దేశం ఆదాయాన్ని నీటి పారుదల కాల్వల మీద లేదా భవనాలు, గుళ్ళు, గోపురాలు, మసీదుల మీద, లేదా యుద్ధాలు ఇతర రాజ్యాల ఆక్రమణల మీద, లేదా వ్యక్తగత భోగ విలాసాల మీద ఖర్చు పెట్టినా ఆ వ్యయం భారతదేశ వ్యాపార, పరిశ్రమల్ని ప్రోత్సహించింది. కనీసం ఈ దేశస్థులకు ఉపాధి అయినా కల్పించింది. ఉదాహరణకి మొఘలులు విదేశాల నుంచి వచ్చినా ఈ దేశంలో స్థిరపడి ఈ దేశాన్నే తమ మాతృ దేశంగా భావించారు. కాని బ్రిటీషు వాళ్ళు మాత్రం ఈ దేశంలో సర్వకాల సర్వావస్థల్లో విదేశీయులుగానే ఉండిపోయారు. ఇంగ్లీషు వాళ్ళు ఎంతో కాలం ఇక్కడే పనిచేసి, ఇక్కడే వ్యాపారాలు సాగించి కూడా బ్రిటన్‌కు తిరిగి వెళ్ళిపోవటానికే ఏర్పాటు చేసుకున్నారు. బ్రిటీషు ఇండియా ప్రభుత్వాన్ని ఒక విదేశ వర్తక కంపెనీ, బ్రిటన్‌ని పాలించే ప్రభుత్వం కలిసి కంట్రోలు చేశాయి. ఫలితంగా, భారత ప్రజల నుంచి వసూలు చేసిన ఆదాయాన్ని బ్రిటీషువాళ్ళు భారతదేశంలో కాకుండా, బ్రిటన్‌లో ఖర్చు పెట్టారు.

కంపెనీ ఉద్యోగులు స్వదేశ రాజుల వద్ద నుంచీ, జమీందార్ల నుంచీ, వర్తకుల వద్ద నుంచీ, ఆఖరికి సామాన్యప్రజల వద్ద నుంచి గుంజుకున్న అపారమైన డబ్బునీ, సంపదనీ మాతృ దేశానికి వెంటతీసుకుపోయే రోజుల్లో, అంటే 1757లో బెంగాల్ సంపదని పీల్చివెయ్యటం ప్రారంభమైంది. 1758-1765 సంవత్సరాల మధ్య వాళ్ళు సుమారు 60 లక్షల పౌండ్ల దాకా ఇంగ్లండ్‌కు పంపుకున్నారు 1765లో బెంగాల్ నవాబుకు భూమిశిస్తు మీద వచ్చిన మొత్తం ఆదాయానికి ఇది నాలుగు రెట్లు వాళ్ళు పీల్చివేసిన ఈ మొత్తంలో వ్యాపార లాభాలు కలపలేదు 1765లో బెంగాల్‌లో కంపెనీ దివానీ హక్కు సంపాయించి, బెంగాల్ రెవెన్యూని తన పరిధిలోకి తెచ్చుకుంది. కంపెనీ ఉద్యోగుల కన్నా కంపెనీయే ఎక్కువగా బెంగాల్ సంపదని పిండి పారేసింది బెంగాల్‌లో వసూలు చేసుకున్న ఆదాయంతో ఇక్కడ సరుకు కొని బ్రిటన్‌కు, ఇతర దేశాలకు ఎగుమతి చేసింది ఈ రకం కొనుగోళ్ళకి "పెట్టుబడు"లని పేరు పెట్టింది ఆ విధంగా "పెట్టుబడు"ల రూపంలో బెంగాల్ రెవెన్యూని ఇంగ్లండుకు పంపింది. ఉదాహరణకి, 1765-1770 సంవత్సరాల మధ్య రమారమి 40 లక్షల పౌండ్లని వస్తువుల రూపేణా ఇంగ్లండ్‌కి పంపింది బెంగాల్ నికరాదాయంలో ఇది దాదాపు మూడవ వంతు అసలు ఓడిక ఇంతకన్నా చాలా ఎక్కువ కంపెనీ ఉద్యోగుల వేతనాలు, అధికార్ల వేరేరాబడి, ఇంగ్లీషు వర్తకుల అపార వ్యాపార లాభాలు - వీటిలో చాలా భాగం ఇంగ్లండుకే సరాసరి ప్రవహించింది

నిక్కచ్చిగా ఎంత సంపద హరింపబడిందీ ఇప్పటికింకా లెక్కలు తేలలేదు. రాశికి సంబంధించి చరిత్రకారులు విభేదించారు. బెంగాల్ సంపదని విపరీతంగా పీల్చివేశారన్న వాస్తవాన్ని బ్రిటిషు అధికారులంతా ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు. ఇండియా బ్రిటన్‌కు ఏటా 20-30 లక్షల పౌండ్లు పంపవలసి వుందని పార్లమెంటు ఎగువసభ సెలెక్ట్ కమిటీ అధ్యక్షుడు, తరువాత ఇండియాకు గవర్నర్ - జనరలు అయిన లార్డ్ ఎలెన్‌బరో 1840లో ఒప్పుకున్నాడు కొద్దిపాటి విలువ చేసే సైనిక సామగ్రి తప్పించి ఆ మొత్తం మీద ఇండియాకు ముట్టిన ప్రతిఫలం శూన్యం అని కూడా ఆయన ఒప్పుకున్నాడు మద్రాసు బోర్డ్ ఆఫ్ రెవెన్యూ అధ్యక్షుడు సుమలివాన్ వ్యాఖ్యానించినట్లుగా బ్రిటిషు విధానం ఎలాంటిదంటే "గంగ ఒడ్డున గల మంచినంతా పీల్చేసి థెమ్సు నది ఒడ్డున కక్కే స్పాంజి వంటిది".

*రవాణా, కమ్యూనికేషన్ల అభివృద్ధి* : 19వ శతాబ్దం మధ్యకాలం దాకా భారతదేశంలో రవాణా సాధనాలు చాలా వెనకబడి ఉన్నాయి. ఎద్దుబండి, ఒంటె, బరువు మోసే గుర్రం మించి వేరే రవాణా సాధనాలంటూ లేవు బ్రిటిషు సరుకులు భారీ ఎత్తున దేశం నల్లదలా విస్తరించాలన్నా, బ్రిటిషు పరిశ్రమలకవసరమైన ఇండియా ముడిపదార్థాల్ని సేకరించి పంపాలన్నా ఒక చౌక రకపు సులభ రవాణా పద్ధతి తప్పనిసరని బ్రిటిష్ పరిపాలకులకు కనువిప్పు కలిగింది. నదుల మీద ఆవిరి నౌకలు ప్రవేశపెట్టారు రహదార్ల అభివృద్ధికి పూనుకున్నారు. 1839లో కలకత్తా నుండి ఢిల్లీ వరకు గ్రాండ్ ట్రంక్ రోడ్డు మీద పని ప్రారంభించి 1850 ప్రాంతంలో పూర్తిచేశారు. ప్రధాన నగరాల్ని, రేవు పట్టణాల్ని, మార్కెట్లని కలిపే రహదార్ల నిర్మాణానికి ప్రయత్నాలు ప్రారంభించారు. రవాణాలోనిజమైన అభివృద్ధి అనేది రైలు మార్గాల నిర్మాణం తరువాత మాత్రమే వచ్చింది.

జార్జి స్టీఫెన్‌సన్ రూపకల్పన చేసిన మొట్టమొదటి రైలింజను ఇంగ్లండులో 1814లో పట్టా మీదికెక్కింది 1830 1840 ప్రాంతాల్లో ఇంగ్లండ్‌లో రైలు మార్గాలు చకచకా అభివృద్ధి అయ్యాయి భారతదేశంలోనైతం రైళ్ళని వేగం ప్రవేశపెట్టమని ఒత్తిడి పెరిగింది. భారతదేశంలో రైలు మార్గాల నిర్మాణం ద్వారా దేశం మూల మూలలకి తమ సరుకు చొచ్చుకు పోగల్గుతుందనీ, మూల మూలల నుంచి సేకరించే ముడి పదార్థాలు, తిండి గింజలతో తమ యంత్రాల, పనివాళ్ళ ఆకలి తీరుతుందని బ్రిటిషు పరిశ్రమల యజమాన్లు ఆశించారు. బ్రిటిషు బ్యాంకర్లు, పెట్టుబడిదార్లు భారతదేశంలో రైలు మార్గాల అభివృద్ధికి తమ మిగులు ధనాన్ని పెట్టుబడి పెట్టటానికి ఉవ్విళ్ళూరారు. భారతదేశంలో విరివిగా రైలు మార్గాలు వేస్తే పట్టాలు, రైలు ఇంజన్లు, వాగన్లు, ఇంకా తదితర యంత్రసామాగ్రి ఎగుమతి అవుతాయని బ్రిటిషు ఉక్కు పరిశ్రమ యజమాన్లు ఆశించారు. బ్రిటిషు ఇండియా ప్రభుత్వం తదనుగుణంగా వెంటనే రంగంలోవేశించింది ఈ దేశాన్ని పటుతరంగా, సమర్థవంతంగా పరిపాలించటానికి, ఒక చోటు నుంచి వేరొక చోటుకి సైన్యాన్ని వేగంగా ఉరికించటం ద్వారా తమ పరిపాలనని అంతరంగిక తిరుగుబాట్ల నుంచి, విదేశ దండయాత్రల నుంచి పరిరక్షించుకోటానికి రైలు మార్గాల నిర్మాణం తోడ్పడుతుందని వలస పాలకులు ఆలోచించారు

భారతదేశంలో రైలు మార్గం నిర్మించాలనే సూచన మొట్టమొదట 1831లో మద్రాసులో జరిగింది కాని రైలు వ్యాగన్లని గుర్రాల చేత లాగించాల్సి వచ్చింది ఆవిరితో నడిచే రైలు బండ్లని ప్రవేశపెట్టాలనే ప్రతిపాదన 1834లో ఇంగ్లండ్‌లో వచ్చింది. రైల్వేల ఏర్పాటుకోసం ప్రచారం చేసేవాళ్ళు, పెట్టుబడి పెట్టే వాళ్ళు, ఇండియాతో వ్యాపారం సాగిస్తున్న వర్తక సంస్థలు ఈ ప్రతిపాదనకు బలమైన మద్దతిచ్చారు చివరికి, రైల్వేల నిర్మాణం, నిర్వహణ ప్రైవేటు సంస్థల కప్పగించాలని నిర్ణయమైంది భారత ప్రభుత్వం ఆ ప్రైవేట్ సంస్థలకి తమ పెట్టుబడి మీద కనీసం అయిదు శాతం రాబడిని గ్యారంటీ చేసింది బొంబాయి నుంచి ధానా వరకు ప్రయాణానికి మొట్టమొదటి రైలు మార్గం 1853లో అవతరించింది.

1849లో భారతదేశానికి గవర్నర్ జనరల్‌గా వచ్చిన లార్డ్‌డల్‌హౌసీ రైల్వే మార్గాల శీఘ్ర నిర్మాణానికి గట్టి మద్దతిచ్చాడు. 1853లో తయారుచేసిన తన నివేదికలో ఆయన రైల్వేల అభివృద్ధికి విస్తృత కార్యక్రమం రూపొందించాడు. సముద్ర తీరానికి దూరంగా వున్నప్రాంతాన్ని పెద్ద పెద్దరేవు పట్టణాలతో కలపటానికి, దేశంలోని వివిధ ప్రాంతాల్ని పరస్పరం కలపటానికి ఆయన నాలుగు ప్రధాన రైలు మార్గాల ఏర్పాటుకి ప్రతిపాదన చేశాడు.

1869 నాటికి దేశంలో 4,000 మైళ్ళకు పై చిలుకు రైలు మార్గాలు ఏర్పడ్డాయి. వీటిని 5 శాతం గ్యారంటీ పొందిన ప్రైవేటు సంస్థలు నిర్మించాయి. అయితే ఈ పద్ధతి చాలా వ్యయంతో కూడుకున్నదిగా, మందకొడిగా కనిపించడంతో ప్రభుత్వమే స్వయంగా నూతన రైలు మార్గల నిర్మాణం చేపట్టటానికి సంకల్పించింది. అయినా కూడా, రైలు మార్గాల విస్తృతీకరణ అనుకున్నంత వేగంగా సాగటం లేదని ఇండియాలోని అధికార్లు, ఇంగ్లండ్‌లోని వ్యాపారస్థులు అసంతృప్తి చెందారు. 1880 తరువాత ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు రెండూ రైల్వే నిర్మాణాన్ని చేపట్టాయి. 1905 నాటికి 28,000 మైళ్ళ రైలు మార్గాల నిర్మాణం పూర్తయింది. ఈ సందర్భంలో, ఇండియన్ రైల్వే అభివృద్ధికి

సంబంధించి మూడు ముఖ్యమైన అంశాలు జ్ఞాపకం పెట్టుకోవాలి. ఒకటి - రైల్వేల నిర్మాణానికి అయిన 350 కోట్ల రూపాయలూ బ్రిటిషు పెట్టుబడిదార్లే పెట్టుబడి పెట్టారు. అందులో ఇండియా ప్రభుత్వపు వాటా అతి స్వల్పం. రెండు - మొట్టమొదటి 50 సంవత్సరాలూ అవి నష్టం మీద నడిచాయి పెట్టిన పెట్టుబడి మీద వడ్డీ కూడా కట్టలేని స్థితిలో వున్నాయి. మూడు - వాటి కార్యప్రణాళికా రచనలో, నిర్మాణంలో, నిర్వహణలో భారత ప్రజల్ని గురించి గానీ, భారతదేశ ఆర్థిక, రాజకీయాభివృద్ధి గురించిగానీ పట్టించుకున్న వాళ్ళు లేరు. పోగా, ఇండియాలో బ్రిటిషు సామ్రాజ్యవాద ఆర్థిక, సైనిక ప్రయోజనాలకి తోడ్పడటమే వాటి ప్రాథమిక లక్షణంగా పరిగణనలోకి తీసుకున్నారు. ప్రాథమికంగా ఏ ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకొని బ్రిటిషు వాళ్ళు రైల్వే మార్గాల నిర్మాణాన్ని చేపట్టారో మనకు విదితమే. ఇండియాలో ముడి పదార్థాలు దొరికే మారుమూల తావుల్ని ఎగుమతి రేవుల్తో కలుపుతూ మొదట రైలు మార్గాలు వేశారు. అంతేగాని భారతదేశంలోని పరిశ్రమల అవసరాల్ని వాళ్ళు పూర్తిగా విస్మరించారు రైల్వే రేట్ల నిర్ణయం కూడా దేశంలోపల సరుకుల అంతర్గత రవాణా పట్ల వివక్ష చూపుతూ బ్రిటిషు ఎగుమతి, దిగుమతులకు లాభించే రీతిలో జరిగింది. బర్మాలోను, వాయువ్య భారత ప్రాంతంలోను బ్రిటిషు సామ్రాజ్యవాద ప్రయోజనాల కనుగుణంగా భారీ ఖర్చుతో రైలు మార్గలు నిర్మించబడ్డాయి.

బ్రిటిషు వాళ్ళు సమర్థవంతమైన ఆధునిక తంతి తపాలా వ్యవస్థని ప్రవేశ పెట్టారు. కలకత్తా నుంచి ఆగ్రాకు మొట్టమొదటి టెలిగ్రాఫ్ లైను (తంతి మార్గం) 1853లో ప్రారంభమైంది. లార్డ్ డల్‌హౌసీ పోస్టేజి స్టాంపులు (పోస్టల్ బిళ్ళలు) ప్రవేశపెట్టాడు. అంతకుముందు, ఉత్తరం పోస్టుచేటప్పుడు రుసుము చెల్లించాల్సి వుండేది. ఆయన పోస్టల్ రేట్లని కూడా తగ్గించాడు. దేశంలో ఎక్కడికి చేరాల్సిన ఉత్తరానికైనా అర్థణా రేటు సర్వత్రా చలామణిలో ఉంది. లార్డ్ డల్‌హౌసీ సంస్కరణలకు ముందు, ఉత్తరం చేరాల్సిన దూరంబట్టి పోస్టేజి వసూలుచేసే పద్ధతి అమల్లో ఉండేది. కొన్ని సందర్భాల్లో, నిపుణుడైన భారతీయ కార్మికుని నాలుగు దినాల వేతనానికి సమానమైన మొత్తాన్ని పోస్టేజిగా నిర్ణయించడం కూడా జరిగింది.

***భూమి శిస్తు విధానం:*** కంపెనీ వ్యాపారానికి, లాభాలకు, పరిపాలనా నిర్వహణకయ్యే ఖర్చుకి, ఈ దేశంలో బ్రిటిషు సామ్రాజ్య విస్తరణకోసం సాగించిన యుద్ధాలకు డబ్బు సమకూర్చవలసిన బరువు, బాధ్యతలు భారతదేశపు రైతు భరించాల్సి వచ్చింది. నిజానికి, రైతు చేత తలకి మించిన పన్ను కక్కించకపోతే బ్రిటిషు వాళ్ళు భారతదేశంలో ఇంతటి సువిశాల సామ్రాజ్యాన్ని నిర్మించకనే పోదురు.

స్వదేశ ప్రభుత్వం అతి పురాతన కాలం నుంచి పండిన పంటలో కొంత భాగాన్ని భూమి శిస్తు కింద వసూలు చేసేది. నేరుగా అధికారుల్ని నియమించి, లేదా జమీందార్లు వగైరా మధ్యవర్తుల్ని పెట్టి భూమి శిస్తు వసూలు చేసుకుంది. జమీందార్లు మొదలైన వాళ్ళు ప్రభుత్వానికి శిస్తు వసూలు చేసి పెట్టి నందుకు గాను శిస్తులో కొంత భాగాన్ని తమ కమిషన్ కింద అట్టే పెట్టుకునే వాళ్ళు. ఈ మధ్యవర్తులు ప్రాథమికంగా భూమి శిస్తు వసూలు చేసే కలెక్టర్లు. తాము శిస్తు వసూలు చేసే ప్రాంతంలో వాళ్ళకి స్వంతంగా కొంత భూమి ఉండటం కూడా కద్దు.

***శాశ్వత శిస్తు పద్ధతి:*** *తూర్పిండియా* కంపెనీ 1765లో బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో దివానీ హక్కు (రెవెన్యూ మీద పెత్తనం) సంపాయించిందని పాఠకులకు విదితమే.

మొదట్లో, శిస్తు వసూలుకు సంబంధించి పాత పద్ధతిని కొనసాగించటానికే కంపెనీ ప్రయత్నించింది. వసూలు చెయ్యాల్సిన రెవెన్యూ మొత్తాన్ని 1722 లో 14,290,000 రూపాయల నుంచి, 1764లో 8,180,000 రూపాయలనుంచి 1771 నాటికి 23,400,000 రూపాయలకు పెంచేసింది. పాత పద్ధతికి స్వస్తి చెప్పి, నేరుగా తనే రెవెన్యూ వసూళ్ళని నిభాయించాలని కంపెనీ 1773లో నిర్ణయం తీసుకుంది. వారన్ హేస్టింగ్స్ వేలం పాట పెట్టి, అందరికన్నా ఎక్కువ మొత్తం పాడిన వాడికి రెవెన్యూ వసూలు హక్కు కట్టబెట్టాడు. కాని, ఈ ప్రయోగం విజయవంతం కాలేదు వసూలు చేసే రెవెన్యూ మొత్తానికి సంబంధించి జమీందార్లు ఒకరిమీద ఒకరు పోటాపోటీలు పడి పాటని విపరీతంగా పెంచేసినప్పటికీ, తీరా అసలు వసూళ్ళుచేస్తే ఏయేటికాయేడు రకరకాలుగా మారిపోయి అధికార్ల అంచనాల దరిదాపులకి చేరుకోలేదు. కంపెనీ డబ్బు గురించి కటకటలాడిపోయే కష్ట సమయంలో ఈ వేలంపాట పద్ధతి కంపెనీ రెవెన్యూలు అస్థిమిత పరిస్థితికి తావిచ్చింది. పైగా రైతుకి గానీ, జమీందారుకి గానీ సాగుని మెరుగుపర్చుకోవాలనే ఆసక్తి లేదు. ఎంచేతనంటే, వచ్చే ఏడు ఎంత శిస్తు కట్టాల్సివస్తుందో రైతుకి తెలీదు. శిస్తు వసూలు హక్కు పైయేడు ఏ జమీందారు పాటలో కొట్టేస్తాడో అంతకన్నా తెలీదు.

ఈ దశలో, భూమి శిస్తుని శాశ్వతంగా నిర్ణయించాలనే ఆలోచన మొట్టమొదటిసారి కలిగింది సుదీర్ఘ చర్చలు, సంవాదాలు, తర్జన భర్జనలు పూర్తయి, చివరికి 1793లో బెంగాల్, బీహార్లలో కార్న్ వాలిస్ శాశ్వత శిస్తు పద్ధతిని ప్రవేశ పెట్టాడు ఈ పద్ధతిలో రెండు ప్రత్యేక లక్షణాలు కన్పిస్తాయి ఒకటి - జమీందార్లు, ఇంకా శిస్తు వసూలు చేసే ఇతర్లు అమాంతం పెద్ద పెద్ద భూకామందులుగా మారిపోయారు రైతుల దగ్గరనుంచి ప్రభుత్వానికి శిస్తు వసూలు చేసిపెట్టే ఏజెంట్లుగా మాత్రమే కాకుండా వాళ్ళు తమ జమీందారీలోని యావత్తు భూమికి స్వంతదార్లు అయ్యారు. భూమి మీద వాళ్ళ యాజమాన్య హక్కు వంశపారంపర్యంగా స్థిరపడ్డమే కాక, బదిలీ చేసే అధికారం కూడా వాళ్ళకి సంక్రమించింది మరో ప్రక్క, భూమిని సాగుచేసే రైతులు కౌలుదార్ల స్థాయికి దిగజారిపోయారు. భూమి మీద వాళ్ళకి దీర్ఘ కాలిక హక్కు, అనాదిగా వస్తున్న ఇతర సాంప్రదాయిక హక్కులు చెల్లిపోయాయి. పచ్చిక బీళ్ళు, అటవీ భూములు, కాలువలు, చేపల చెరువులు, దొరువులు, క్షేత్రావాసాలు వగైరాల్ని ఉపయోగించుకొనే హక్కు, శిస్తు పెరుగుదల నుంచి రక్షణ మంట గలిశాయి. నిజానికి, బెంగాల్ కౌలుదార్ల యావన్మంది సొంతం జమీందార్లు దయా దాక్షిణ్యాలకి లోబడిపోయారు. కంపెనీ వాళ్ళు విపరీతంగా నిర్ణయించిన రెవెన్యూ మొత్తాన్ని జమీందార్లు రైతుల ముక్కు పిండి వసూలు చేసి కట్టగలగడానికి వీలుగా ఇంత అక్రమం జరిగింది. రెండు - జమీందార్లు రైతుల వద్ద గుంజిన పదకొండు వంతుల్లో పదివంతులు కంపెనీకి కట్టి ఒక వంతు తాముంచుకోవాలి. అయితే, భూమిశిస్తు రూపేణా వాళ్ళు కట్టవలసిన మొత్తం శాశ్వతంగా నిర్ణయమైంది సాగు భూమి పెరగటం, వల్లనే, వ్యవసాయం అభివృద్ధి కావటం వల్లనే, లేదా కౌల్దార్ల వద్ద ఎక్కువ గుంజుకునే తాహతు వుంటేనే, ఇంకే ఇతర కారణాల మూలంగా ఆదాయం ఎక్కువ వస్తేనే దక్కే అదనపు ఆదాయం యావత్తు జమీందార్లే జేబులో వేసుకునే వాళ్ళు. ప్రభుత్వం వాళ్ళని ఎక్కువ కట్టమని నిర్బంధించదు. అదే విధంగా జమీందారు నిర్ణీత తేదీ నాటికి ప్రభుత్వ ఖజానాలో

సొమ్ము చెల్లించిరావాలి పంటలు పాడయ్యాయనే, ఇంకేదే కారణం చెప్పుకునే వాయిదా కోరే వీలులేదు. నిర్ణీత తేదీకి కట్టలేకపోతే భూములనమ్మి సొమ్ము చెల్లించాలి

మొట్టమొదట నిర్ణయించిన శిస్తు జమీందార్లతో సంప్రదించకుండా ఏకపక్షంగా, నిరంకుశంగా వాళ్ళ మీద రుద్దబడింది. ఫలితంగా, రెవెన్యూ రేట్లు చాలా ఎక్కువ స్థాయిలో నిర్ణయించబడ్డాయి. శాశ్వత శిస్తు పద్ధతిని రూపొందించిన వాడు, కారన్ వాలిస్ తరువాత గవర్నర్ - జనరల్‌గా వచ్చినవాడు జాన్‌షోర్ ఆయన ఎవరెవరు ఎంతెంత ఆదాయం కొట్టేస్తుందీ లెక్క గట్టాడు. బెంగాల్ మొత్తం ఫలసాయం 100 అనుకుంటే, అందులో ప్రభుత్వ వాటా 45 జమీందార్లు, ఇత మధ్యవర్తుల వాటా 15 నిజంగా కష్టపడి పండించిన రైతుకి మిగిలింది 40

1793 కి పూర్వం బెంగాల్, బీహార్లలో జమీందార్లకి ఎక్కువ భూమి మీద యాజమాన్య హక్కు అనుభవించలేదని ఆ తరువాత అధికార్లు, అనధికార్లు యావన్మంది ఒప్పుకున్నారు. అప్పుడొక ప్రశ్న తలెత్తుతుంది. మరి, బ్రిటీషు వాళ్ళు జమీందార్లని ఆ విధంగా ఎందుకు గుర్తించాల్సి వచ్చింది? కొంత వరకు ఒక పొరబాటు అవగాహనవల్ల సంభవించిందని ఒక సంజాయిషీ ఇంగ్లండ్‌లో ఆనాడు వ్యవసాయంలో ప్రధానవ్యక్తి భూస్వామి కాబట్టి, బ్రిటిష్ అధికార్లు ఇంగ్లీషు భూస్వామికి భారతదేశంలో ప్రతిరూపం జమీందారే అనుకుని పప్పులో కాలేశారు. అయితే, ఆ ఇద్దరి మధ్యా తారతమ్యావలోకనానికి సంబంధించిన ఒక కీలకమైన అంశంలో మాత్రం బ్రిటిష్ అధికార్లు తెలివి ప్రదర్శించారు బ్రిటన్‌లో భూస్వామి తనకింద కౌల్దార్లకి సంబంధించినంతవరకే కాకుండా రాజ్యానికి సంబంధించి కూడా భూమి మీద యజమానే కాని, బెంగాల్‌లో జమీందారు తన కౌల్దార్లమీద మాత్రమే భూకామందు; రాజ్యానికి లొంగిపోయి విధేయుడుగా వుండవలసిన వాడే వాస్తవానికి అతడు కంపెనీ వాళ్ళ కౌల్దారు స్థాయికి దిగజారిన వాడు. బ్రిటన్‌లో భూస్వామి ప్రభుత్వానికి ఏ బహు కొద్ది మొత్తమో శిస్తుగా చెల్లించినట్లుగా కాకుండా, ఇక్కడ జమీందారు పదకొండు రూపాయల్లో ఒక రూపాయి మాత్రమే తను ఉంచుకుని మిగిలిన పది రూపాయలూ కంపెనీకి కక్కాలి అందువల్ల అతనికి భూమి మీద యాజమాన్యపు హక్కు దక్కింది. సకాలంలో సొమ్ము కట్టక పోతే ప్రభుత్వం అతణ్ణి జమీందారీ నుంచి గెంటివేసి, జమీని తెగనమ్మి పారేస్తుంది.

జమీందార్లని భూ యజమాన్లుగా గుర్తించాలనే కంపెనీ నిర్ణయం ఆనాటి రాజకీయ, ఆర్థిక, పరిపాలనావసరాల్ని బట్టి జరిగిందని కొందరు చరిత్రకారుల భావన ఈ సందర్భంలో మార్గసూచక కారణాలు మూడు: మొదటిది యుక్తి యుక్తమైన రాజ్యతంత్రం నుంచి ఉద్భవించిన కారణం; అంటే, రాజకీయ మద్దతుదార్లని సృష్టించుకోవలసిన అవసరం అన్నమాట భారతదేశంలో తాము పరాయివాళ్ళమనేది బ్రిటిషు అధికారులు గుర్తించారు; కాబట్టి స్థానికంగా తమని బలపర్చే వర్గమంటూ లేకపోతే తమ పరిపాలన అస్థిరంగా ఊగులాడుతుంది. ఈ పరిస్థితిని నివారించటానికి బ్రిటీషువాళ్ళు తమకి - భారత ప్రజలకి మధ్య జమీందార్లని మెత్తని దిండులాగా పెట్టుకున్నారు. 18వ శతాబ్ది చివరి పాతిక సంవత్సరాల కాలంలో బెంగాల్‌లో ప్రజల తిరుగుబాట్లు అనేక విజృంభించడాన్ని బట్టి ఈ వాదనికి తక్షణ ప్రాముఖ్యం కనిపిస్తుంది. కనుక, బ్రిటీషు వాళ్ళు ప్రత్యేక హక్కులనుభవించే సంపన్న జమీందారీ

వర్గానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. వాళ్ళ ఉనికికి బ్రిటీషు పరిపాలన కారణం. కాబట్టి జమీందార్లు తమ మౌలిక ప్రయోజనాల కోసం బ్రిటీషు పాలనని బలపర్చక తప్పదు. ఇంగ్లీషు వాళ్ళు ఆశించింది నబబేనని తరువాతి సంఘటనలు నిరూపించాయి. బ్రిటీషు పాలనని ప్రతిఘటిస్తూ ఉవ్వెత్తున లేచిన స్వాతంత్ర్యోద్యమానికి వ్యతిరేకంగా జమీందార్లంతా ఒక వర్గంగా విదేశ పాలన కొమ్ము కాశారు. రెండవది ఆర్థిక భద్రత. బహుశా ఇది ప్రబలాంశం అయివుండవచ్చు. 1793కి ముందు కంపెనీకి ప్రధానమైన ఆదాయపు వనరుగా వుంటూ వచ్చిన భూమిశిస్తు నిలకడ లేకుండా అస్థిమితంగా ఊగులాడింది. ఈ శాశ్వత శిస్తు విధానం స్థిరమైన రాబడిని గ్యారంటీ చేసింది. కొత్తగా సృష్టించిన జమీందారీ ఆస్తి దీనికి హామీగా నిలబడింది. గతంలో ఎన్నడూ లేనంత హెచ్చురేటులో భూమి శిస్తుని నిర్ణయించటం వల్ల ఈ శాశ్వత శిస్తు విధానం ద్వారా కంపెనీకి అత్యధిక రాబడి పొందే అవకాశం కలిగింది. లక్షలాది రైతుల వద్దనుంచి శిస్తు వసూలు చేసే తల నొప్పికి బదులు కొద్దిమంది జమీందార్లని అడ్డం పెట్టుకుని శిస్తు జుర్రుకోవటం కంపెనీకి చాలా తేలికగా, చౌకగా కనిపించింది. మూడు- ఈ పద్ధతి వల్ల వ్యవసాయోత్పత్తి పెరుగుతుందని పాలకులు ఆశించారు.

ఈ శాశ్వత శిస్తు పద్ధతి తరువాత ఒరిస్సాకు, అవిభక్త మద్రాసు రాష్ట్రంలోని ఉత్తర జిల్లాలకు, వారణాసి జిల్లాకు విస్తరింపజేశారు.

మధ్య భారతంలో కొన్ని ప్రాంతాల్లోను, అవధ్‌లోను బ్రిటీషు వాళ్ళు ఒక తాత్కాలిక జమీందారీ విధానాన్ని ప్రవేశ పెట్టారు. ఆ పద్ధతి కింద, జమీందార్లకు భూమి మీద యాజమాన్య హక్కు లభించింది. కాని, వాళ్ళు విటా ప్రభుత్వానికి చెల్లించవలసిన రెవెన్యూని మధ్య మధ్య సవరించటం జరిగింది. విదేశ పాలకులకు విశ్వాస పాత్రంగా సేవ చేసిన వ్యక్తులకు ప్రభుత్వం భూములివ్వటం మొదలు పెట్టటంతో మరొక భూస్వామ్య వర్గం రూపెత్తింది.

*రైత్వారీ పద్ధతి* : దక్షిణాది ప్రాంతంలోను, నైరుతి ప్రాంతంలోను బ్రిటీషు పరిపాలనా స్థాపన వల్ల భూ సెటిల్మెంటుకి సంబంధించి కొత్త సమస్యలు ఉత్పన్న మయ్యాయి. ఈ ప్రాంతాలలో పెద్ద పెద్ద ఎస్టేట్లు కలిగిన జమీందార్లు లేరని కంపెనీ అధికార్లు భావించారు. కొత్తగా జమీందారీ పద్ధతిని గనుక ఈ ప్రాంతాల్లో ప్రవేశపెట్టినట్లయితే అప్పుడున్న పరిస్థితి తారుమారయ్యే ప్రమాదం వస్తుందని వాళ్ళు భావించారు. రీడ్, మన్రోల సారథ్యంలో మద్రాసు బ్రిటీషు అధికార్లు నిజమైన వ్యవసాయ దార్లకే నేరుగా భూమి మీద హక్కు యిచ్చే పద్ధతిని సిఫార్సు చేశారు. శాశ్వత శిస్తు పద్ధతి కింద కంపెనీ జమీందార్లతో కలిసి రెవెన్యూని పంచుకోవాల్సి రావటంచేతా, భూమి మీద పెరిగే ఆదాయంలో భాగం పెట్టమని అడిగే వీలు లేనందునా అది నష్టపోతున్నదని కూడా ఆ అధికార్లు వెల్లడి చేశారు. పైగా, రైతు జమీందారు దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండాల్సి రావటంతో, జమీందారు రైతుని పీడించుకుతినే వీలుంది. వాళ్ళు ప్రతి పాదించిన రైత్వారీ పద్ధతి కింద రైతు సక్రమంగా భూమి శిస్తు చెల్లించిన మేరకు అతనికి తను సాగుచేసుకునే భూమి మీద హక్కు ఏర్పడుతుంది. లోగడ నుంచీ ఉన్న భూవ్యవస్థని తొలగించకుండా ముందుకు కొనసాగించటమేనని కూడా రైత్వారీ పద్ధతిని బలపర్చేవాళ్ళు వాదించారు. "భారతదేశంలో సర్వదా అమల్లో వున్న వ్యవస్థే ఇది" అన్నారు మన్రో అనే బ్రిటీషు

అధికారి చివరికి ఈ రైత్వారీ పద్ధతిని 19వ శతాబ్ది ప్రారంభంలో బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీలలో (రాష్ట్రాలలో) కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రవేశ పెట్టింది రైత్వారీ పద్ధతి కింద శిస్తుని శాశ్వతంగా నిర్ణయించలేదు. 20,30 సంవత్సరాల తరువాత రెవెన్యూ డిమాండుని పెంచినప్పుడు శిస్తు రేటుని మధ్య మధ్య సవరిస్తూ వచ్చారు.

రైత్వారీ పద్ధతి రైతాంగ భూ యాజమాన్య వ్యవస్థని రూపొందించలేదు బోలెడు మంది చిల్లర మల్లర జమీందార్ల స్థానంలో ప్రభుత్వమే అతి పెద్ద జమీందారుగా మారిందనే సత్యాన్ని రైతులు త్వరలోనే గ్రహించారు. భూమిశిస్తు అంటే భూమిని వాడుకున్నందుకు చెల్లించే కౌలు పైకమే గాని పన్ను కాదని తరువాత ప్రభుత్వము బాహాటంగా ప్రకటించింది. రైతులకు తాము సాగుచేసుకునే భూముల మీద యాజమాన్యపు హక్కులు మరో మూడు కారణాల వల్లకూడా వట్టిపోయాయి: (1) చాలా ప్రాంతాల్లో భూమి శిస్తు మరీ విపరీతంగా నిర్ణయించబడింది అన్నీ అనుకూలంగా ఉండి సక్రమంగా పండినప్పుడుకూడా రైతుకి కేవలం అస్తుబిస్తుగా బ్రతకటానికి సరిపోయినంత మాత్రమే మిగిలింది; ఉదాహరణకి, రైత్వారీ శిస్తు పద్ధతిని ప్రవేశ పెట్టిన కొత్త రోజుల్లో ప్రభుత్వం మద్రాసు రాష్ట్రంలో పండిన మొత్తం పంటలో 45 నుంచి 55 శాతాన్ని శిస్తుగా నిర్ణయించింది. బొంబాయి రాష్ట్రంలో పరిస్థితి కూడా అంత హీనంగానూ ఉంది; (2) భూమిశిస్తుని పెంచే హక్కుని ప్రభుత్వం చెక్కు చెదరకుండా అట్టిపెట్టుకుంది; (3) వర్షాభావం వల్లనే, వరదల వల్లనే పంట ధ్వంసమైపోయినా రైతుకి భూమిశిస్తు చెల్లించక తప్పలేదు.

*మహల్వారీ పద్ధతి* : ఇది జమీందారీ విధానానికి సవరణ దీన్ని ప్రభుత్వం గంగానది లోయలోను, వాయువ్య ప్రాంతంలోను, మధ్య భారతంలో కొన్ని ప్రాంతాల్లోను, పంజాబులోను ప్రవేశ పెట్టింది. మహల్ అంటే ఎస్టేటు. గ్రామాల వారీగా లేదా ఎస్టేట్ల వారీగా ఏర్పాటు చేసిన శిస్తు నిశ్చయ పద్ధతిని మహల్ వారీ పద్ధతి అన్నారు. భూకామందులు లేదా కొన్ని కుటుంబాల పెద్ద తలలూ కలిసి ఆయా గ్రామాలకు లేదా ఎస్టేట్లకు తామే సమిష్టిగా భూస్వాములమని ప్రకటించుకున్నారు. పంజాబులో ఈ మహల్ వారీ పద్ధతిని కొంత సవరించి ప్రవేశపెట్టారు మహల్ వారీ పద్ధతి అమల్లో వున్న ప్రాంతాల్లో కూడా శిస్తుని మధ్య మధ్య సవరించటమనేది ఉంది.

జమీందారీ, రైత్వారీ విధానాలు రెండూ కూడా దేశంలో పూర్వం నుంచి అమల్లో వున్న సాంప్రదాయిక భూవ్యవస్థలతో ప్రాథమికంగా విభేదించాయి. భూమి పైన స్వంత ఆస్తి హక్కు అనే ఒక కొత్త రూపాన్ని బ్రిటిషు వాళ్ళు సృష్టించారు. ఈ కొత్త సృష్టివల్ల ఒనగూడే లాభం రైతుకి చేరకుండా వుండేలాగు చేశారు. దేశమంతటా ఇప్పుడు భూమిని అమ్ముకోవచ్చు; బదిలీ చెయ్యవచ్చు; తాకట్టు పెట్టవచ్చు; అన్యాధీనం చెయ్యవచ్చు. ఈ హక్కులన్నీ ఎందుకిచ్చారంటే ప్రాథమికంగా ప్రభుత్వ రెవెన్యూని పరిరక్షించుకోడానికే అని వేరే చెప్పనవసరం లేదు. భూమిని అమ్ముకోడానికి, బదిలీ చెయ్యటానికి హక్కు గనక ఇవ్వకపోతే రైతు దగ్గర శిస్తు పైకం వసూలు చేసుకోడానికి ఇబ్బంది రావచ్చు ఈ హక్కు కూడా లేక పోతే రైతు యేంపెట్టి ప్రభుత్వ బాకీ తీరుస్తాడు? అమ్మకం, బదిలీ, తాకట్టు వగైరా హక్కులన్నీ ఇచ్చారు కాబట్టి రైతు భూమిని తాకట్టుపెట్టి తెచ్చిన అప్పుతో శిస్తు కడతాడు, లేదా కొద్ది భూమి తెగనమ్మి కడతాడు. ఇవేమీ చెయ్యనని మొరాయిస్తే, ప్రభుత్వమే అతని భూమిని వేలం వేసి శిస్తు

కింద చెల్లు వేసుకుంటుంది స్వంత ఆస్తి హక్కు ఇవ్వటానికి ఇంకొక కారణం కూడా ఉంది ఆ భూమి తనదనే భావం వల్ల భూస్వామి గాని, రైతుగాని పొలం బాగుచేసుకుంటాడనే నమ్మకంతో బ్రిటిషువాళ్ళు స్వంత ఆస్తి హక్కు ప్రవేశ పెట్టారు

వాళ్ళు భూమిని స్వేచ్ఛగా అమ్ముకునే, కొనుక్కునే సరుకుగా తయారు చెయ్యటం ద్వారా దేశంలోని గ్రామీణ వ్యావసాయిక వ్యవస్థలో ఒక ప్రాథమిక మార్పుని ప్రవేశ పెట్టారు భారతదేశ గ్రామాల నిలకడ, అవిచ్ఛిన్నత (Continuity) గజ గజ లాడాయి నిజానికి, గ్రామీణ సమాజం కట్టడం నిలువెల్లా కూలిపోసాగింది

# పరిపాలనా వ్యవస్థ, సామాజిక సాంస్కృతిక విధానం

మొట్ట మొదట్లో తూర్పిండియా కంపెనీ తన అధీన రాజ్యంలో పరిపాలనా నిర్వహణని భారతీయుల చేతుల్లో పెట్టి, కేవలం పర్యవేక్షణా కార్య కలాపాలకి మాత్రమే పరిమితమైంది పాత పరిపాలనా పద్ధతుల్ని అనుసరించటం వల్ల బ్రిటిషు లక్ష్యాలు సముచితంగా నెరవేరవని అది సత్వరం గ్రహించింది పర్యవసానంగా, కంపెనీ పరిపాలనకి సంబంధించిన అన్ని అంశాలనీ తన చేతుల్లోకి తీసేసుకొంది వారన్ హేస్టింగ్స్, కారన్ వాలిస్‌ల హయాంలో బెంగాల్ పరిపాలనా వ్యవస్థలో ఏ భాగానికాభాగాన్ని ఊడదీసి పడవేసి ఇంగ్లీషు నమూనా ప్రాతి పదికమీద ఒక నూతన పరిపాలనా వ్యవస్థకి పునాదులు వేసే పని సాగింది నూతన ప్రదేశాల్లో బ్రిటిషు అధికార వ్యాప్తి, నూతన సమస్యలు, అవసరాలు, అనుభవాలు, నూతన భావాలు పరిపాలనా వ్యవస్థలో మార్పులకు త్రోవ తీశాయి అయినా, బ్రిటిషు లక్ష్యాలనేవి మొత్తం మీద దృష్టి పథం నుంచి జారిపోలేదు

భారతదేశంలో బ్రిటిష్ పరిపాలనా వ్యవస్థ సివిల్ సర్వీసు (సైన్యేతర ప్రభుత్వ శాఖలు) సైన్యం, పోలీసు అనే మూడు మూల స్తంభాల ఆధారం మీద నిలబడింది దీనికి రెండు కారణాలున్నాయి ఒకటి: బ్రిటిషు ఇండియా పరిపాలన ముఖ్య లక్ష్యం- శాంతి భద్రతల పరిరక్షణ, భారతదేశంలో బ్రిటిషు పాలన శాశ్వతత్వం శాంతి భద్రతలు లోపిస్తే బ్రిటిషు వర్తకులు, పరిశ్రమ యజమాన్లు భారతదేశంలో మూల మూలలా తమ సరుకుని అమ్ముకోగలమని ఆశించలేరు వాళ్ళు ఈ దేశంలో పరాయి వాళ్ళు కాబట్టి ఈ దేశస్థుల ప్రేమాభిమానాల్ని చవి చూడలేరు. కాబట్టి భారతదేశంలో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోడానికి ప్రజాభిమానం మీద కన్నా బలాధిక్యత మీద వాళ్ళు ఆధారపడ్డారు లార్డ్ వెల్లస్లీ కింద పని చేసిన అతని సోదరుడు డ్యూక్ ఆఫ్ వెల్లింగ్‌టన్ భారతదేశం నుంచి యూరప్‌కి తిరిగి వెళ్ళాక బ్రిటిష్ ఇండియా పరిపాలనా వ్యవస్థ గురించి ఇలా వ్యాఖ్యానించారు:

"భారతదేశంలో ప్రభుత్వం వ్యవస్థా, అధికార పునాదీ, దాన్ని బలపరిచే పద్ధతులూ, ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణ తీరూ వగైరాలు యూరప్‌లో అదే ప్రయోజనం కోసం ఏర్పాటైన పద్ధతులు, రీతులకు పూర్తిగా భిన్నం .... సమస్త అధికారానికి అక్కడ (భారతదేశంలో) పునాదీ, పనిముట్టూ - కరవాలం (బల ప్రదర్శన)".

**సివిల్ సర్వీసు (సైనికేతర ప్రభుత్వ శాఖలు):** సివిల్ సర్వీసుకు మూల పురుషుడు లార్డ్ కారన్ వాలిస్ తూర్పిండియా కంపెనీ ఈ దేశంలో అడుగుపెట్టింది లగాయతు తను ఇంగ్లండ్‌నుంచి అతి తక్కువ జీతం మీద తెచ్చి పెట్టుకున్న ఉద్యోగుల్తో వ్యాపార కార్యకలాపాలు సాగించిందన్న సంగతి మనకు తెలిసిందే. అయితే, ఆ

ఉద్యోగులు ప్రైవేటు వ్యాపారం చేసుకోటానికి అనుమతి ఇచ్చింది. తరువాత, కంపెనీ ప్రాదేశిక రాజ్యంగా మార్పు చెందాక ఆ ఉద్యోగులే పరిపాలనా బాధ్యతలు స్వీకరించారు. అప్పటికే వాళ్ళు అవినీతి పుట్టలుగా పెరిగిపోయారు. స్థానిక నేతపని వాళ్ళనీ, చేతివృత్తుల వాళ్ళనీ వర్తకుల్ని జమీందార్లని అదిరించి, బెదిరించి, రాజాల దగ్గర నవాబుల దగ్గర కట్నాలనీ, కానుకలనీ లంచాలు తినమరిగి అపారంగా డబ్బు వెనకేసుకుని ముల్లెతో సహా ఇంగ్లండ్ వెళ్ళిపోయారు. వాళ్ళ లంచగొండితనాన్నీ అవినీతిని అంతం చెయ్యాలని క్లైవ్, వారన్ హేస్టింగ్స్ చాలా ప్రయత్నాలు చేశారు. పాక్షికంగా మాత్రమే విజయం సాధించారు.

1786లో ఇండియాకి గవర్నర్ జనరల్‌గా వచ్చిన కారన్‌వాలిస్ పరిపాలనా వ్యవస్థని క్షాళనం చెయ్యటానికి కంకణం కట్టుకున్నాడు. వాళ్ళకి చాలినంత వేతనం ఇస్తేనే తప్ప వాళ్ళు నిజాయితీగా, సమర్థవంతంగా పని చెయ్యరనేది వెంటనే గ్రహించాడు. ప్రైవేటు వ్యాపారానికి వ్యతిరేకంగాను, కానుకలు, లంచాలు స్వీకరించటానికి వ్యతిరేకంగాను కారన్ వాలిస్ తీవ్ర నియమ నిబంధనల్ని అమలులో పెట్టాడు. అదే సమయంలో, వాళ్ళ జీత భత్యాలూ పెంచాడు. ఉదాహరణకి, జిల్లా కలెక్టరుకు నెలకో 1500 రూపాయల జీతం నిర్ణయించాడు వాళ్ళు వసూలు చేసే రెవెన్యూలో 1 శాతం కమీషను కూడా నిర్ణయించాడు. నిజానికి, కంపెనీ సివిల్ సర్వీసు ప్రపంచంలో కెల్లా అత్యధిక వేతనాలు ముట్టే ప్రభుత్వ శాఖ అయింది అట్లాగే, ఉద్యోగంలో పై పదవులకు ఎక్కటానికి పదవీకాలాన్ని ప్రమాణంగా నిర్ణయించాడు ఆ విధంగా అయితే ఉద్యోగులు బైటి వారి పలుకుబడికి అతీతంగా వుంటారని అతని భావన.

1800లో లార్డ్ వెల్లస్లీ గవర్నర్ జనరల్‌గా వచ్చాక సివిల్ సర్వీసులోని మరొక లోపాన్ని కూడా ఎత్తి చూపాడు. సివిల్ అధికార్లు విశాల భూభాగం మీద అధికారం చలాయిస్తున్నా, వాళ్ళు 18 ఏళ్ళు లేదా అంతకన్నా కొంచెం ఎక్కువ వయస్సులో ఇండియాకు వచ్చారు. వాళ్ళకి శిక్షణ, అనుభవం పూజ్యం. ఈ దేశంలో మాట్లాడే భాషలు వాళ్ళకి అయోమయం. అంచేత, వెల్లస్లీ ఆ కనుగాయలకి శిక్షణ ఇప్పించటం కోసం కలకత్తాలో ఫోర్ట్ విలియం కళాశాల ఒకటి స్థాపించాడు కంపెనీ డైరెక్టర్లకి వెల్లస్లీ చేసిన పని నచ్చక ఇంగ్లండ్‌లోనే 1806లో ఒక కళాశాల పెట్టించారు. అంటే కలకత్తా కళాశాలని ఎత్తివేయించారు.

1853వరకు సివిల్ సర్వీసు నియామకాలన్నీ కంపెనీ డైరెక్టర్ల చేతుల మీదుగా సాగాయి. బోర్డ్ ఆఫ్ కంట్రోలు సభ్యుల్ని మంచి చేసుకోడానికి వాళ్ళ తరవు అభ్యర్థులు కొందరికి అధికార పదవులు కట్టబెట్టారు. వాళ్ళ అధికార దర్పానికి చిహ్నమైన ఈ మహాలాభసాటి ఉద్యోగ నియామక హక్కుని చేజారి పోనివ్వకుండా నిలబెట్టుకోటానికి నానా ప్రయాసా పడ్డారు. ఆర్థిక, రాజకీయ ప్రత్యేక హక్కుల్ని పార్లమెంటు లాగివేసినా, ఈ ఉద్యోగ నియామకపు హక్కుని వదులుకోడానికి ససేమిరా నిరాకరించారు. చిట్ట చివరికి, 1853లో ఈ హక్కూ ఊడిపోయింది. సివిల్ సర్వీసులో అన్ని నియామకాలూ పోటీ పరీక్షల ద్వారానే జరగాలని శాసిస్తూ 1853లో పార్లమెంటు ఒక చార్టర్ యాక్టు ఆమోదించింది.

కారన్ వాలిస్ కాలం నుంచి ఇండియన్ సివిల్ సర్వీసులో భారతీయుడన్న

వానికి స్థానం లేక పోవటం ప్రత్యేకంగా గమనించవలసిన అంశం. సంవత్సరానికి 500 పౌండ్ల జీతం మించి ముట్టే అన్ని పై పదవులకూ ఇంగ్లీషు వాళ్ళనే నియమించాలనేది 1793లోనే అధికార విధానంగా ప్రకటించబడి అమల్లో వుంది. ఇదే విధానం సైన్యం, పోలీసు, న్యాయ వ్యవస్థ, ఇంజనీరింగు శాఖలక్కూడా వర్తిస్తుంది. కారన్ వాలిన్ తరువాత అధికారం స్వీకరించిన జాన్ షోర్ మాటల్లో చెప్పాలంటే, "మన మంచికోసం, ప్రయోజనాల కోసం సమస్త భారత జాతిని వీలైన మేరకి అన్ని విధాలా పరాధీనంగా ఉంచటమే ఇంగ్లీషు వారి ప్రాథమిక నీతి. అతి నిమ్నస్థాయి ఇంగ్లీషు వాణ్ణి సైతం ఒప్పించి అతగానికి అంటుగట్టే ప్రతి గౌరవ ప్రతిపత్తికి, హోదాకి, అధికార పదవికి భారతీయుల్ని కదగా నిలిబెట్టాం."

బ్రిటీషు వాళ్ళు అటువంటి పద్ధతికి ఎందుకు పాల్పడ్డారు? దానికి చాలా కారణాలున్నాయి. ఒకటి - బ్రిటీషు భావాలు, సంస్థలు, ఆచరణల మీద ఆధారపడ్డ ఒక పరిపాలనా వ్యవస్థ పూర్తిగా ఇంగ్లీషు వాళ్ళ చెప్పు చేతల్లో మాత్రమే స్థిరపడగలదని వాళ్ళ దృఢ విశ్వాసం. ఉదాహరణకి, కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ అధ్యక్షుడు చార్లెస్ గ్రాంట్ భారత ప్రజల్ని "ఘోరంగా దిగ జారిపోయిన, నీతిమాలిన జాతిగా, బొత్తిగా నైతిక కర్తవ్యం నశించి పోయిన వాళ్ళుగా, తాము స్వయంగా తవ్వుకున్న దుర్నీతి కూపంలో దిగబడిపోయిన వాళ్ళు"గా అభిశంసించాడు. అట్లాగే, కారన్‌వాలిన్ కూడా "భారతీయుడుగా పుట్టిన ప్రతి ఒక్కడూ అవినీతి పరుడే" అని నమ్మాడు. ఆనాడు అతి కొద్దిమందిగా ఉండే భారతదేశ అధికార్లకి, జమీందార్లకి ఈ విమర్శ కొంత వరకు వర్తిస్తుంది. కాని, భారతదేశంలో పని చేసే బ్రిటీషు వాళ్ళకి కూడా ఈ విమర్శ సమానంగా వర్తిస్తుందని గమనించాలి. మరి, కారన్ వాలిన్ ఇంగ్లీషు ఉద్యోగుల జీత భత్యాలు ఎందుకు పెంచాడు? డబ్బుకోసం గడ్డి తినే ప్రలోభం మానుకుని వాళ్ళు నిజాయితీగా, విశ్వాసపాత్రంగా పనిచేస్తారనే కారన్‌వాలిన్ వాళ్ళ వేతనాలు సవరించాడు. స్వదేశ అధికార్లలో అవినీతిని రూపుమాపటానికి కూడా అదే ఔషధం వాడాలని అతనికి తట్టనే లేదు.

వాస్తవం చెప్పాలంటే, ప్రభుత్వ శాఖల్లో పైపదవుల్లో భారతీయుల్ని నియమించకూడదనేది వాళ్ల ఉద్దేశ్యపూర్వక విధానం. భారతదేశంలో బ్రిటీషు పాలనని నెలకొల్పి, నిలబెట్టటానికి ఈ ప్రభుత్వ శాఖలు ఆనాడు అవసరమయ్యాయి. కాబట్టి, ఇంగ్లీషు వాళ్ల మాదిరిగా బ్రిటీషు ప్రయోజనాల పట్ల సానుభూతిగానీ, ఆ ప్రయోజనాల అవగాహనగానీ లేని భారతీయులకు ఈ కర్తవ్యాన్ని అప్పగించలేరు. పైపెచ్చు, బ్రిటీషు సమాజంలో పలుకుబడిగల వర్గాలు ఇండియన్ సివిల్ సర్వీసులోను, తదితర శాఖల్లోను పెద్ద పెద్ద ఉద్యోగాలన్నీ తమ పిల్లల గుత్త హక్కుగా ఉండిపోవాలని ఆరాటపడ్డాయి. ఈ నియామకాలు గురించే వాళ్ళు పరస్పరం హోరా హోరి పోరాడారు. కంపెనీ డైరెక్టర్లకు-బ్రిటిష్ మంత్రివర్గ సభ్యులకు మధ్య ఆరని చిచ్చు రేపిన వివాదం ఈ నియామకపు హక్కే. అటువంటప్పుడు, భారతీయుల్ని ఈ పదవుల్లో పెట్టటానికి ఇంగ్లీషు వాళ్ళు ఎలా ఒప్పుకుంటారు! అయితే, ఈ దేశస్థుల్ని చిల్లర మల్లర ఉద్యోగాల్లో చాలా మందిని పెట్టుకున్నారు. ఎందుకంటే, ఈ చిన్న ఉద్యోగాలకి ఇంగ్లీషు వాళ్ళకన్నా ఇండియన్లు చౌకగా, విరివిగా దొరికారు.

ఇండియన్ సివిల్ సర్వీసు క్రమేణా ప్రపంచంలో కెల్లా అత్యంత సమర్థవంతమైన, పటుతర శాఖగా పరిణతి చెందింది. ఈ సర్వీసులో సభ్యులు

విస్తృతాధికారాలు చలాయించారు. విధాన నిర్ణయంలో పాలుపంచుకున్నారు. స్వతంత్రంగా, నిజాయితీగా, కార్యపరతతో పనిచేసే సంప్రదాయాలు నెలకొల్పారు. అయితే, ఇవి స్పష్టంగా బ్రిటీషు ప్రయోజనాల్నే తప్ప భారతదేశ ప్రయోజనాల్ని తీర్చలేదు. పైగా ఇండియన్ సివిల్ సర్వీసు సభ్యులు మహామితవాద, సంకుచిత దృష్టి అలవర్చుకుని పరాయి పొత్తు గిట్టని ఒక ప్రత్యేక, నైష్ఠిక గర్విష్ఠి వర్గంగా తయారయ్యారు. భారతదేశాన్ని పరిపాలించటానికి తమకు దైవదత్తమైన అధికారం ఉన్నట్లుగా భావించారు. ఈ దేశంలో బ్రిటీషు పాలనని పెంచి పోషించిన "ఉక్కు చట్రంగా" ఇండియన్ సివిల్ సర్వీసును వ్యవహరిస్తూ ఉంటారు. భారతీయ జీవనంలోని ప్రతి ప్రగతిశీల, పురోగామి అంశాన్ని ప్రతిఘటించే ప్రధాన సాధనంగా ఇది రూపొందింది. భారతదేశంలో విజృంభించిన జాతీయోద్యమ దాడికి ఇది ప్రధానంగా గురయింది.

**సైన్యం:** భారతదేశంలో బ్రిటీషు పాలనకు రెండవ మూల స్తంభం సైన్యం. అది మూడు పనులు పూర్తి చేసింది. స్వదేశ రాజుల్ని జయించడానికి అది సాధనంగా ఉపయోగపడింది. విదేశ శత్రుదారులనుంచి అది బ్రిటీషు సామ్రాజ్యాన్ని పరిరక్షించింది. అంతరంగిక తిరుగుబాట్ల నిరంతర ప్రమాదం నుంచి అది బ్రిటీషు అధిపత్యాన్ని కంటిరెప్పగా కాపాడింది.

కంపెనీ సైన్యంలో భారతీయ సైనికులదే అత్యధిక సంఖ్యాబలం. ఇప్పుడు ఉత్తరప్రదేశ్, బీహార్లుగా వ్యవహరింపబడే ప్రాంతాలనుంచి ఆనాడు వాళ్ళు సైన్యంలో చేర్చుకోబడ్డారు. ఉదాహరణకి, 1857 లో బ్రిటీషు ఇండియా సైనిక బలాలు మొత్తం కలిపి 3,11,400. ఇందులో 2,65,900 మంది భారతీయులు. సైనికాధికారులు యావన్మంది ఇంగ్లీషు వాళ్ళే. 1856లో భారత సైన్యం మొత్తంలో నెలకి 300 రూపాయల జీతం అందుకున్న భాగ్యశాలురు ముగ్గురంటే ముగ్గురు. సైన్యంలో భారతీయులందుకున్న అత్యున్నత పదవి - సుబేదారు. సిపాయి నుంచి సుబేదారు దాకా కూడా అందర్నీ ఇంగ్లీషు వాళ్ళనే చేర్చుకుంటే ఖర్చు తడిసి మోపెడవుతుందన్న భయంతో భారతీయుల్ని సిపాయిలుగా చేర్చుకున్నారు. పైగా, సువిశాల భారతదేశాన్ని జయించటానికి అవసరమైనంత మంది బలాన్ని తక్కువ జనాభాగల బ్రిటన్ సమకూర్చి పెట్టలేక పోవటం కూడా కారణం కావచ్చు. పరితూకంగా, సైన్యంలోని పదవులన్నిటిని బ్రిటీషువాళ్ళతో నింపేశారు. భారతీయ సైనికుల్ని అదుపులో ఉంచటానికి ఒక నిర్దిష్టమైన సంఖ్యలో బ్రిటీషు సైనిక బలాన్ని సైతం ప్రత్యేకంగా నిలిపి వుంచారు. అయినప్పటికీ కూడా, పట్టుమని పిడికెడు మంది కూడా లేని విదేశీయులు అసంఖ్యాక భారతీయ సైనికుల అండతో భారతదేశాన్ని జయించి, అధిపత్యాన్ని నిలబెట్టుకున్నారంటే ఇప్పుడు మనకు ఆశ్చర్యం వేస్తుంది. ఇది సాధ్యపడ్డానికి రెండు కారణాల్ని చెప్పుకోవచ్చు. ఒక ప్రక్క, దేశంలో ఆనాడు అధునిక జాతీయ భావం శూన్యం. బీహారునుంచో, అయోధ్యనుంచో వచ్చిన సిపాయి మహారాష్ట్రుల్నో పంజాబీలనో జయించడానికి కంపెనీకి సాయపడ్డం దేశ వ్యతిరేక చర్య అవుతుందని భావించలేదు. మరో ప్రక్క, ఎవరి ఉప్పుతింటున్నామో వారికి విశ్వాసపాత్రంగా సేవ చెయ్యాలనే సుదీర్ఘ సంప్రదాయం ప్రబలంగా ఉన్న కాలం కూడా అది. మరో మాటల్లో, భారతీయుడు నికార్సయిన కిరాయి సైనికుడు. కంపెనీ మాట తప్పకుండా సక్రమంగా

జీత భత్యాలు ముట్ట జెప్పేది. ఈ సంప్రదాయం స్వదేశ రాజులు, చోటా ప్రభువులు పాటించేవాళ్ళు కాదు.

**పోలీసు:** కారన్‌వాలిస్ సృష్టించిన పోలీసు బలగం బ్రిటీషు పాలనకి ఈ దేశంలో మూడవ మూలస్తంభం. పోలీసు బాధ్యతల నుంచి జమీందార్లని తప్పించి, కారన్‌వాలిస్ రెగ్యులర్ పోలీసు బలాన్ని నెలకొల్పారు. శాంతిభద్రతల పరిరక్షణ పోలీసు బాధ్యత. ఇండియాలో పూర్వం నుంచీ ఉన్న పోలీసు ఠాణా పద్ధతి కారన్ వాలిస్ సంస్కరించి ఆధునికంగా తీర్చిదిద్దారు. ఈ విషయంలో ఇండియా బ్రిటన్ కన్నా ఒక అడుగు ముందే వుండటం ఒక విశేషం. అప్పటికి బ్రిటన్‌లో పోలీసు వ్యవస్థ ఇంకా అభివృద్ధి కాలేదు. కారన్‌వాలిస్ ఠానాలనబడే సర్కిళ్ళను నెలకొల్పి, వాటిమీద 'దరోగా'ల్ని నియమించారు. దరోగా పదవిని భారతీయులే నిర్వహించారు. తరువాత జిల్లా పోలీసు యంత్రాంగాన్ని చక్కదిద్ది, అధికారం నెరపటానికి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (సూపర్నెంటు) పదవి సృష్టించబడింది. ఇక్కడ మళ్ళీ భారతీయుల్ని మినహాయించారు. గ్రామాల్లో పోలీసు విధుల్ని గ్రామస్థులు నియమించు కున్న వాచ్‌మెన్‌లే నిర్వహించారు. బందిపోటు దొంగతనం, దోపిడీల్లాంటి తీవ్ర నేరాల్ని పోలీసుశాఖ క్రమేణా నిరోధించగల్గింది. ముఖ్యంగా మధ్య భారతంలో అనాడు విశృంఖలంగా సంచరిస్తూ విపరీతంగా దారిదోపిడీలు సాగించిన థగ్గుల అణచివేత పోలీసు శాఖ సాధించిన ఘనవిజయం. తరువాత, విదేశ పరిపాలనకి వ్యతిరేకంగా దేశంలో పెల్లుబికిన జాతీయోద్యమాన్ని అణగ దొక్కడానికి కూడా పోలీసులు ఉపయోగపడ్డారు. ప్రజలతో ప్రవర్తించేటప్పుడు, ఇండియన్ పోలీసులు నిర్దయాత్మక వైఖరి అవలంభించారు.

"ప్రజల్ని దోచుకు తింటున్నారని థగ్గుల్ని అణచివెయ్యటానికి నియమితులైన పోలీసులు, థగ్గులు ప్రజల్ని దోచుకుతిన్న పద్ధతుల ఒరవడిలోనే శాంతియుతంగా జీవించే ప్రజల్ని దోచిపారేశారు" అని బ్రిటీషు పార్లమెంటరీ కమిటీ 1813లో ఒక నివేదిక ప్రకటించింది. 1832లో గవర్నర్-జనరల్ విలియం బెంటింక్ పోలీసు శాఖ నిర్వాకాన్ని ఇలా వర్ణించాడు:

"ఒక దోపిడి జరిగిందంటే దోపిడీకి గురయిన అభాగ్యులు ఫిర్యాదు చేస్తేనే తప్ప పోలీసులు విచారణ జరపాల్సిన అవసరం లేదన్న ఇటీవలి నిబంధనవల్ల ప్రజలకు రక్షణగా వుండవలసిన పోలీసులు ఆ ధర్మానికి దూరమైపోయారు. వాళ్ళ పట్ల ప్రజాభిప్రాయం ఎలా ఉంటుందో ఈ నిబంధన ఒక ఉదాహరణ. అంటే, తోడేలు కన్నా కూడా గొర్రెలు కాచేవాడే గొర్రెల్ని చంపుకుతినే క్రూర జంతువయ్యాడు."

**న్యాయ వ్యవస్థ:** వేర్వేరు స్థాయిల్లో సివిల్, క్రిమినల్ న్యాయస్థానాల్ని నెలకొల్పడం ద్వారా బ్రిటీషు ప్రభుత్వం ఒక నూతన న్యాయ పరిపాలనా వ్యవస్థకి పునాదులు వేసింది. దీనికి అంకురార్పణ చేసింది వారన్ హేస్టింగ్స్ అయినా, ఈ వ్యవస్థని 1793లో స్థిరీకరించినవాడు కారన్‌వాలిస్. ప్రతి జిల్లాలో ఒక దివానీ అదాలత్ (సివిల్ కోర్టు) స్థాపించబడింది. ఆ సివిల్ కోర్టుకు సివిల్ సర్వీసుకు చెందిన జిల్లా జడ్జి అధ్వర్యం వహించాడు. తద్వారా కారన్‌వాలిస్ కలెక్టర్, జిల్లా జడ్జి పదవుల్ని వేరు చేశాడు. జిల్లా కోర్టు నుంచి పైకి వెళ్లే అప్పీలు కేసుల నిమిత్తం రాష్ట్ర స్థాయిలో నాలుగు సివిల్ అప్పీలు కోర్టులు నెలకొల్ప బడ్డాయి. ఇక కొట్ట కొస కోర్టు లేదా అత్యున్నత

న్యాయస్థానం -సదర్ దివానీ అదాలత్. జిల్లా కోర్టు కింద రిజిస్ట్రారు కోర్టుండేవి. వీటికి యూరోపియన్ అధికారులే న్యాయమూర్తులుగా ఉండేవాళ్ళు. వాటికన్నా కింద వుండే సబార్డినేట్ కోర్టులకు భారతీయులు అధికార్లుగా ఉండేవాళ్ళు. ఈ భారతీయ న్యాయాధికార్లని మున్సిఫ్‌లనీ, అమీన్లనీ వ్యవహరించేవాళ్ళు. క్రిమినల్ కేసుల విచారణకు కారన్‌వాలిస్ బెంగాల్ రాష్ట్రాన్ని నాలుగు మండలాలుగా విభజించాడు. ప్రతి మండలంలో సివిల్ అధికారులు అధ్వర్యం వహించే సర్క్యూటు కోర్టులు వెలిశాయి. ఈ కోర్టుల కింద చిన్న చిన్న చిల్లర మల్లర నేరాల్ని విచారించే అనేక మేజిస్ట్రేటు కోర్టులు స్థాపించబడ్డాయి. మేజిస్ట్రేట్లుగా భారతీయులే ఎక్కువమంది ఉండేవాళ్ళు. సర్క్యూటు కోర్టు నుంచి అప్పీలు చేసుకోవాలంటే సదర్ నిజామత్ అదాలత్ అనే పై కోర్టు ఉండేది. క్రిమినల్ న్యాస్థానాలలో ముస్లిం క్రిమినల్ చట్టం ప్రకారం నేర విచారణ జరిగేది. అయితే ముస్లిం చట్టంలో కన్నా శిక్షలు కొంత ఉదారంగా ఉండేవి. కాళ్ళూ, కీళ్ళూ తొలగించటం లాంటి అవయవ విచ్ఛేద శిక్షలు నిషేధించబడ్డాయి. సివిల్ కోర్టులు ఆయా ప్రాంతాల్లో అమల్లోవుండే, లేదా ఆయా ప్రజల్లో అనాదిగా వుండే సాంప్రదాయక చట్టాల్ని అనుసరించి న్యాయప్రదానం చేశాయి. 1831లో విలియం బెంటింక్ గవర్నర్-జనరల్‌గా ఉండగా, రాష్ట్ర స్థాయిలో ఉన్న అప్పీలు, సర్క్యూటు కోర్టులు రద్దయ్యాయి. వాటి పనిని ఆయన మొదట కమిషనర్లకు తరువాత జిల్లా జడ్జీలు, జిల్లాలకలెక్టర్లకు అప్పగించాడు. న్యాయ వ్యవస్థలో భారతీయ అధికార్ల హోదా, అధికారాల్ని పెంచి డిప్యూటీ మేజిస్ట్రేట్లుగా, సబార్డినేట్ జడ్జీలుగా, ప్రధాన సదర్ అమీన్లుగా నియమించారు. 1865లో కలకత్తా, బొంబాయి, మద్రాసు నగరాల్లో హైకోర్టులు నెలకొల్ప బడ్డాయి.

కొత్త చట్టాలు చేస్తూ, పాతవి క్రోడీకరిస్తూ బ్రిటిషువాళ్ళు ఒక కొత్త న్యాయవ్యవస్థ నెలకొల్పారు. తరతరాలుగా అమల్లోవున్న సంప్రదాయం, ఆచరణల్లోంచి మొలకెత్తిన రివాజు మీద భారత దేశంలోని సాంప్రదాయిక న్యాయవ్యవస్థ విశేషంగా ఆధారపడింది. ఈ రివాజు లేదా ఆనవాయితీ అన్నది శాస్త్రాలలో, షరియత్‌లో, సామ్రాజ్యాధిపతుల అధికార చట్టాల్లో వేళ్ళూని వుంది. బ్రిటిషువాళ్ళు సాధారణంగా ఈ ఆనవాయితీ న్యాయాన్ని పాటించినప్పటికీ, క్రమ క్రమంగా ఓ నూతన న్యాయ వ్యవస్థని రూపొందించారు. నిబంధనలు ప్రవేశ పెట్టారు. అప్పటికి అమల్లోవున్న చట్టాలు క్రోడీకరించారు; వాటిని న్యాయశాస్త్ర అర్థ వివరణ ద్వారా క్రమబద్ధం చేశారు. ఆధునాతనం చేశారు. 1833లో వచ్చిన చార్టర్ యాక్టు చట్ట నిర్మాణాధికారం యావత్తు గవర్నర్ జనరల్‌కి అప్పగించింది. అంటే దీనర్థం, ఇక మీదట భారత దేశస్థులంతా మానవ కల్పిత చట్టాల కింద బ్రతకవలసి వుంది. అవి మంచివీ కావచ్చు, చెడ్డవీ కావచ్చు. కానీ, అవి మానవుని హేతుబుద్ధి నుంచి రూపుదిద్దుకొన్నవి. వెనకటి మాదిరిగా, చట్టాలంటే దేవుడు చేసినవనీ, అవి ధిక్కరించటానికి వీలులేని పరమ పవిత్రమైనవనీ, వాటిని గుడ్డిగా పాటిస్తూ బ్రతికే పరిస్థితికి కాలం చెల్లిపోయింది.

1833లో ప్రభుత్వం భారతీయ న్యాయచట్టాల్ని క్రోడీకరించటం కోసం మెకాలే అధ్యక్షతన ఒక న్యాయ సంఘాన్ని నియమించింది. ఆ సంఘం చేసిన కృషి, వర్థ క్రమ భారత శిక్షాస్మృతిగా, పాశ్చాత్య తరహా సివిల్, క్రిమినల్ కార్య పద్ధతి స్మృతులుగా ఫలించాయి. అవే ఇప్పటికీ దేశంలో అమల్లో ఉన్నాయి. ఒకే తరహా న్యాయవ్యవస్థ

దేశమంతటా వాటిని అమలుపరుస్తూ వుంది. ఆ విధంగా, భారతదేశంలో న్యాయశాస్త్ర విషయాల్లో సమైక్యత సిద్ధించిందని చెప్పవచ్చు.

***న్యాయ ప్రధాన పరిపాలన (Rule of law):*** బ్రిటిష్ ప్రభుత్వం న్యాయ ప్రధాన పరిపాలన (Rule of law) అనే ఆధునిక దృక్పధాన్ని ప్రవేశ పెట్టింది. అంటే, బ్రిటిష్ పరిపాలనా నిర్వహణ కనీసం సిద్ధాంతరీత్యా అయినా ప్రభువుల చపలచిత్తత, వ్యక్తిగత ఇష్టా ఇష్టాల బట్టి కాకుండా, పాలితుల హక్కుల్ని, విశిష్టాధికారాల్ని, విద్యుక్త ధర్మాల్ని స్పష్టంగా నిర్వచించిన చట్టాల కనుగుణంగా జరగాలని దీనర్థం. ఆచరణలో అధికార వర్గం, పోలీసులు నిరంకుశాధికారాల్ని అనుభవించారు. ప్రజల హక్కులు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్లో జోక్యం కల్పించుకున్నారు. అయితే, న్యాయ ప్రధాన పరిపాలన అనే ఈ సిద్ధాంతంలో ఒక్క సుగుణం ఉంది. అదేమంటే, అధికార విధుల్ని ఉల్లంఘించినందుకు లేదా తన అధికారాన్ని మించి మితిమీరిన పనులు చేసినందుకు ఏ అధికారినయినా న్యాయస్థానానికి యీడ్చుకురావచ్చు. ఈ రూల్ ఆఫ్ లా అనేది కొంత మేరకి ఒక మనిషి వ్యక్తిగత స్వేచ్ఛకి గ్యారంటీ అనవచ్చు. భారతదేశాన్ని పాలించిన పూర్వపు రాజులు సంప్రదాయ, ఆచార నియమాలకు సాధారణంగా కట్టుబడి వుండే వాళ్ళనేది నిజమే. కాని, వాళ్ళు అనుకున్న ప్రకారం ఏ పరిపాలనా చర్య తీసుకోవాలన్నా వాళ్ళకి చట్టబద్ధమైన హక్కు ఉండేది. వాళ్ళ చర్యల్ని సవాలు చేసే సత్తా కలిగిన వేరే అధికార పీఠం అంటూ లేదు. భారతదేశ పాలకులు, ప్రభువులు తమ ఇచ్ఛానుసారం అధికారం చెలాయించారు. బ్రిటీషు రాజ్యంలో పరిపాలన న్యాయస్థానాలు అర్థ వివరణ చేసిన చట్టాలకు అనుగుణంగా నడిచింది. అయితే, ఆ చట్టాలు తరచు లోపభూయిష్టంగా ఉన్నాయి. ఎంచేతనంటే, అవి ఒక ప్రజాతంత్ర పద్ధతిలో ప్రజలు రూపొందించినవి కావు. విదేశ పాలకులు నిరంకుశంగా చేసిన చట్టాలవి. కాబట్టి విశేషాధికారాలు ప్రభుత్వాధికారులు, పోలీసుల చేతుల్లో పోగుబడ్డాయి. విదేశీ పరిపాలనలో అది బహుశా అనివార్యమేమో! అసలు దాని స్వభావంలోనే ప్రజాతంత్ర సంప్రదాయం ఉండే అవకాశం లేదు.

***చట్టం దృష్టిలో సమానత్వం:*** బ్రిటీషు హయాంలో భారత న్యాయవ్యవస్థ "చట్టం దృష్టిలో సమానత్వం" అనే సిద్ధాంతం మీద ఆధారపడింది. అంటే, చట్టం దృష్టిలో మనుషులంతా సర్వసమానులే అని అర్థం. కుల, మత, వర్గ విచక్షణ లేకుండా ఒకే చట్టం అందరకీ ఒకే మాదిరిగా వర్తిస్తుంది. ఒకప్పుడు ఈ దేశంలో న్యాయవ్యవస్థ వర్ణ విచక్షణ పాటించింది. అగ్రకులాల్లో పుట్టిన వాళ్ళకొక న్యాయం, అధమ కులాలనబడే వాట్లలో పుట్టిన వాళ్ళకి వేరొక న్యాయం అమలు జరిగింది. నేరం ఒకటే అయినా బ్రాహ్మణుడు చేస్తే తేలిక శిక్ష, బ్రాహ్మణేతరుడు చేస్తే కఠిన శిక్ష విధించే వాడుక ఉండేది. అట్లాగే, ఆచరణలో సామాన్యుడి విషయంలో ఇచ్చిన తీర్పుకన్నా జమీందార్లు, జాగీర్దార్ల విషయంలో ఇచ్చిన తీర్పు సుతిమెత్తగా ఉండేది. నిజానికి, వాళ్ళు చేసిన పనులకి వాళ్ళని న్యాయస్థానాల్లో నిలబెట్టటమంటూనే జరిగేది కాదు. ఇప్పుడు సామాన్యుడు సైతం న్యాయ యంత్రాంగాన్ని కదపవచ్చు.

కాని, చట్టం దృష్ట్యా సమానత అన్న ఈ మహత్తర సూత్రానికి ఒక్క మినహాయింపు ఉంది. యూరోపియన్లకు, వాళ్ళ వారసులకు వేరుగా కోర్టులున్నాయి. చట్టాలు కూడా వేరుగా ఉన్నాయి. క్రిమినల్ కేసుల్లో వాళ్ళని యూరోపియన్

న్యాయమూర్తులే విచారించాలి. అనేక మంది ఇంగ్లీషు అధికార్లు, సైనికాధికార్లు, తోటల యజమాన్లు, వ్యాపారస్థులు భారతీయులతో మహా దురుసు, పొగరుగా, అఖరికి పశువుల మాదిరిగా కూడా ప్రవర్తించారు. అటువంటి వాళ్ళని కోర్టుకిడ్చే ప్రయత్నాలు జరిగిన సందర్భాల్లో, వాళ్ళకి పరోక్ష అపాత్ర రక్షణ ఇవ్వటం జరిగింది. ఫలితంగా, యూరోపియన్ న్యాయమూర్తులు తేలిక శిక్షలు విధించేవాళ్ళు. లేదా అసలు శిక్ష వెయ్యకుండా విడిచి పెట్టేవాళ్ళు. పర్యవసానంగా తరచు న్యాయ విఘాతం సంభవించింది.

ఆచరణలో, మరొక తరహా చట్ట సంబంధమైన అసమానత చోటుచేసుకొంది. న్యాయం చాలా ఖరీదైపోయింది. కోర్టు ఫీజులు చెల్లించుకోవాలి. వకీలుని పెట్టుకోవాలి. సాక్షులకయ్యే ఖర్చులు భరించాలి. పైగా, కోర్టులు ఎక్కడో దూరంగా పట్టణాల్లో ఉండేవి. కోర్టు వ్యాజ్యాలు ఒకంతట తెగేవి కాదు. సంవత్సరాల తరబడి సాగేవి. న్యాయశాస్త్రంలోని చిక్కులు, తికమకలు చదువురాని రైతులకు బోధపడేవి కావు. కాబట్టి, డబ్బున్న వాళ్ళు తప్పనిసరిగా చట్టాల్ని మెలికలు తిప్పగలిగారు. కోర్టుల్ని తమకనుకూలంగా తిప్పుకోగలిగారు. కోర్టు చుట్టూ తిప్పి, ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తాం జాగ్రత్త అని బెదిరిస్తే చాలు పేదవాళ్ళు దాసోహం అన్నారు. పోలీసుల్లో, అధికార యంత్రాంగంలో చిక్కగా అల్లుకున్న అవినీతి, లంచగొండితనం పేదలకు న్యాయం జరక్కుండా అడ్డుపడ్డాయి. అధికార్లు సంపన్నులే అభిమానించారు. జమీందార్లు నిర్భయంగా రైతుల్ని పీడించుకుతిన్నారు. దీనికి విరుద్ధంగా, బ్రిటీషువాళ్ళు రాక పూర్వం ఉన్న న్యాయవ్యవస్థే తులనాత్మకంగా మెరుగ్గా వుంది. అది అనవసరపు లాంఛనా లేవీ లేకుండా, తక్కువ ఖర్చుతో త్వరితంగా వివాదాలు పరిష్కరించింది. ఒకవేపు, ఈ కొత్త న్యాయవ్యవస్థ న్యాయ ప్రధాన పరిపాలన, చట్టం దృష్ట్యా సమానత వగైరా మానవ కల్పితమైన మహత్తర సూత్రాల మీద ఆధారపడి ఉన్నప్పటికీ, మరోవేపు అనేక తదితర విషయాల్లో దిగనాసిల్లింది. న్యాయం ఖరీదు తలకి మించిన బరువయింది. విపరీతమైన కాలవిలంబనకి ఆకరమైంది.

***సామాజిక, సాంస్కృతిక విధానం:*** 1813 వరకు బ్రిటీషు పాలకులు భారతదేశ మత సామాజిక, సాంస్కృతిక జీవనంలో జోక్యం కల్పించుకోలేదు. 1813 తరువాతనే భారతీయ సమాజాన్ని సంస్కృతిని మార్చాలని చరుకు పుట్టింది. 19వ శతాబ్దంలో బ్రిటన్‌లో నూతన శక్తులు, నూతన భావాలు విజృంభించటంతో ఇక్కడ కూడా మన సమాజ, సంస్కృతుల్ని మార్చే ప్రయత్నాలకు అంకురార్పణ జరిగింది. 18వ శతాబ్దం మధ్యలో ప్రారంభమైన పారిశ్రామిక విప్లవం, దాని పర్యవసానంగా విలసిల్లిన పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థ బ్రిటీషు సమాజాన్ని అన్ని రంగాలలో వేగంగా మార్చి వెయ్యసాగాయి. బ్రిటన్‌లో బలం పుంజుకొన్న పరిశ్రమల యజమాన్లు తమ సరుకులకోసం భారతదేశాన్ని బడా మార్కెట్‌గా తయారుచెయ్యాలని ఊగారు. కేవలం శాంతిని సంరక్షించే పాత విధానాన్ని పట్టుకుని వేళ్లాడితే ఇది సాధ్యం కాదు. భారత సమాజం పాక్షికంగానైనా పరివర్తన పొంది, ఆధునికత సంతరించుకోవాలి. కాబట్టి, ప్రసిద్ధ బ్రిటీషు చరిత్రకారులు థాంప్సన్, గారెట్‌ల మాటల్లో, "పాత బందిపోటు మనస్తత్వం, పద్ధతులు మారిపోయి ఆధునిక పారిశ్రామికోద్యమ, ధనస్వామ్య వ్యవస్థల మనస్తత్వాన్ని, పద్ధతుల్ని అలవర్చుకొంటున్నాయి."

విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలు మానవ ప్రగతికి కొత్త బాటలు పరచాయి. 18, 19వ శతాబ్దాల్లో బ్రిటన్‌లోను, యూరప్‌లోను నూతన భావాలు పెల్లుబుకుతున్నాయి. భారతదేశ సమస్యల పట్ల బ్రిటీషు పాలకవర్గ దృష్టిని అవి ప్రభావితం చేశాయి. యూరప్ అంతటా "నూతన మానసిక దృక్పథాలు, నూతన సంస్కారం, నూతన నైతిక సూత్రాలు వెల్లివిరుస్తున్నాయి" స్వాతంత్ర్యం, సమభావం, సౌహార్ద్ర భావాలు చాటిన 1789 - ఫ్రెంచి మహావిప్లవం పటుతరమైన జాతీయ భావావేశాన్ని ప్రజ్వలింపజేసింది. నూతన జాతీయతావాద శక్తికి తెరచాపలెత్తింది ఆలోచనా జగత్తులో బేకన్, లాక్, వోల్టేర్, రూసో, కాంట్, ఆడంస్మిత్, బెంథామ్ ప్రభృత మేధావులు, సాహిత్య జగత్తులో వర్డ్స్‌వర్త్, బైరన్, షెల్లీ, చార్లెస్ డికెన్స్ మొదలైన కవులు, రచయితలు సరికొత్త ధోరణుల్ని ఆవిష్కరించారు. 18వ శతాబ్ది మేధో విప్లవం, ఫ్రెంచి మహావిప్లవం, పారిశ్రామిక విప్లవం కలిసి రూపుదిద్దిన కొత్త ఆలోచనల ప్రభావం సహజంగా భారతదేశం మీద పడింది. ప్రభుత్వాన్ని గురించిన అధికారిక సిద్ధాంతాల్ని కుదిపివేశాయి

హేతువాద దృక్పథం, మానవతావాదం, ప్రగతిసాధనలో మానవ ప్రజ్ఞపట్ల విశ్వాసం అనే ఈ మూడు నూతన ఆలోచనా విధానం యొక్క ప్రముఖ లక్షణాలుగా భాసించాయి మానవుని హేతు బుద్ధికి అనుగుణంగా వర్తిస్తూ, ఆచరణకు నిలబడగలిగే సత్తా ఉన్నదే సత్యం అని హేతువాద, శాస్త్రీయ దృక్పథం స్పష్టం చేసింది. 17,18 19వ శతాబ్దాల వైజ్ఞానిక ప్రగతి, పరిశ్రమలలో శాస్త్రీయ విజ్ఞాన నైపుణిని ఉపయోగించటం ద్వారా సాధించిన అపూర్వ ఉత్పాదక శక్తి మానవుని బుద్ధి కుశలతకు ప్రత్యక్ష తార్కాణాలు ప్రతి మనిషి అతనికతడే సర్వస్వం అతణ్ణి ఆ విధంగానే ఆదరించి గౌరవించాలనే భావన మానవతా వాదానికి ప్రాతిపదిక. ఒక మనిషి సాటి మనిషిని తన సుఖ సంతోషాలకు సాధనంగా భావించటానికి హక్కులేదు ఈ మానవతా దృక్పథం వైయక్తిక వాదం, ఉదార వాదం, సామ్యవాదం వంటి సిద్ధాంతాలకు ఊపిరిపోసింది ప్రగతి సిద్ధాంతం ప్రకారం, అన్ని సమాజాలూ కాలంతో పాటు మారక తప్పదు ఏదీ కూడా జడ ప్రాయమైంది కాదు. కాలేదు. సహేతుక, న్యాయబద్ధ పంథాలో ప్రకృతికి, సమాజానికి కొత్తరూపు దిద్దే సామర్థ్యం మానవునికుంది

యూరప్‌లో ఈ నూతన విచార వెల్లువ పాతవైఖరితో, దృక్పథంతో సంఘర్షించింది. భారత విధాన నిర్ణేతల లేదా పరిపాలనా సారథుల వైఖరుల్లో వైరుధ్యం సృష్టించింది పాత వైఖరి మితవాద లేదా సంప్రదాయవాద ధోరణి. భారతదేశంలో సాధ్యమైనంత వరకి అతి తక్కువ మార్పులే తేవటంతో సరిపుచ్చుకోవటం మేలనే సనాతన వైఖరి అది. వారన్ హేస్టింగ్స్, ఎడ్మండ్ బర్క్‌లు ఈ వైఖరికి ప్రాతినిధ్యం వహించిన మొట్ట మొదటి పెద్దలు. ఎడ్మండ్ బర్క్ ఇంగ్లండ్‌లో ప్రసిద్ధ రచయిత, పార్లమెంటులో ప్రముఖ వక్త. వారి తరువాత మన్రో, మాల్కొం, ఎల్ఫిన్‌స్టన్, మెట్కాఫ్ మొదలైన ప్రముఖ అధికార్లు సంప్రదాయ వాద ధోరణిని అవలంభించారు. భారతీయ నాగరికత యూరప్ నాగరికతకి భిన్నమైందనీ, అంత మాత్రం చేత యూరప్ నాగరికతకి తీసిపోయింది కాదనీ సంప్రదాయ వాదులు వాదించారు వారిలో చాలా మంది భారతీయ తత్వచింతనని, సంస్కృతిని గౌరవించారు, అభిమానించారు. భారతదేశానికి కొన్ని పాశ్చాత్య భావాల్ని, ఆచరణల్ని పరిచయం చెయ్యాల

అవసరమని వాళ్ళు భావించినా, వాటిని నిదానంగా, మెలుకువగా పరిచయం చెయ్యాలన్నది వాళ్ళ ప్రతిపాదన. అన్నిటికన్నా సాంఘిక సుస్థిరత పట్ల వాళ్ళు ఎక్కువ మొగ్గు చూపటం వల్ల, సత్వర ఆధునికీకరణని ప్రతిఘటించారు. యూరప్‌ని ప్రభావితం చేసిన నూతన విషయాల్ని, కల్పనల్ని దూకుడుగా, తొందరపాటుతో భారతదేశంలో ప్రవేశపెడితే, అది తీవ్రమైన దుమారం లేపవచ్చని సంప్రదాయ వాదులు భావించారు. సంప్రదాయ వాదానికి ఇంగ్లండ్‌లోను, బ్రిటిష్ పాలన అంతమైనదాకా ఇండియాలోను అశేషమైన పలుకుబడి ఉంది. వాస్తవానికి, భారతదేశంలో పనిచేసిన బ్రిటిష్ అధికార్లలో ఎక్కువమంది సనాతన విశ్వాసాలు కలవాళ్ళే. అయితే, బ్రిటన్‌లో ప్రభుత్వ విధానాల్ని నిర్ణయించే వాళ్ళలో ఈ సంప్రదాయవాద వైఖరి క్రమేణా మాసిపోతున్నది. ఎంచేతనంటే, ఈ మితవాద సంప్రదాయ వాద ధోరణివల్ల ఆశించిన మేరకి వాణిజ్యవిస్తరణ జరిగే అవకాశాలు గానీ బ్రిటిషు ఆధిపత్యానికి శాశ్వతత్వం సమకూరే అవకాశాలు గానీ లేవని నాటి వ్యాపార సరళి, సంఘటనలు నిరూపించాయి.

1800 నాటికి సంప్రదాయవాద వైఖరి స్థానే వేరే ఒక కొత్త వైఖరి తలెత్తింది. భారత సమాజాన్ని, సంస్కృతిని నిశితంగా విమర్శించిన వైఖరి అది. భారతీయ నాగరికత జడప్రాయమని దుయ్యబట్టిన వైఖరి అది. ఆ వైఖరికి చెందినవాళ్ళు భారతీయ సంస్కృతిని చీదరించుకున్నారు. భారతీయ ఆచారాలు అనాగరికమైన వన్నారు. భారతీయ సంస్థలు, వ్యవస్థలు క్షీణయుగ ప్రతీకలు, అవినీతి పుట్టలు అని యీసడించారు. భారతీయ ఆలోచనా విధానం సంకుచితం, అశాస్త్రీయం అన్నారు. భారత దేశాన్ని రాజకీయ, ఆర్థిక దాస్య శృంఖలాల్లో బంధించిన తమ చర్యని సమర్థించుకోడానికి, ఈ దేశానికి అభివృద్ధి పథంలో పయనించే యోగ్యత లేదు కాబట్టి శాశ్వతంగా బ్రిటీషు వాళ్ళ పాదాలకింద పడివుండాలని సిద్ధాంతీకరించడానికి బ్రిటిషు అధికార్లు, రచయితలు, రాజనీతిజ్ఞులు ఈ వైఖరి అవలంభించారు. అయితే అతి వాదులైన కొద్దిమంది బ్రిటీషువాళ్ళు మాత్రం ఈ సంకుచిత విమర్శనాత్మక ధోరణిని, సామ్రాజ్యవాద దృక్పథాన్ని అధిగమించి వాళ్ళు భావించినటువంటి భారత పరిస్థితికి ఉన్నతస్థాయి పాశ్చాత్య మానవతా వాదాన్ని, హేతువాద ఆలోచనా విధానాన్ని అన్వయించారు. హేతుబుద్ధిని, శాస్త్రీయ విజ్ఞానాన్ని ఉపయోగించుకోడం ద్వారా అన్ని సమాజాలకు ప్రగతి పథంలో పయనించే సామర్థ్యం వుంటుంది. కాబట్టి భారతదేశం ఎల్లకాలం పతిత దేశంగా ఉండే అవసరం లేదని వాళ్ళు హేతుబద్ధంగా ఆలోచించారు. మానవతా దృక్పథంతో భారత ప్రజల అభ్యుదయాన్ని ఆకాంక్షించారు. భారతీయులు తప్పకుండా ముందంజ వేస్తారని ప్రగతి సిద్ధాంతం వాళ్ళ కొక దృఢమైన నమ్మకాన్ని కలిగించింది. కాబట్టి, బ్రిటిషు సమాజంలో ప్రగతి శక్తులకు ప్రాతినిధ్యం వహించే ఈ అతివాదులు భారతదేశాన్ని శాస్త్రవిజ్ఞానం, మానవతా వాదం వెల్లివిరిసే ఆధునిక ప్రగతిశీల ప్రపంచంలో ఒక భాగంగా చెయ్యాలని ఉవ్విళ్ళూరారు.

కుల విభజన, అంటరానితనం వంటి వ్యవస్థలు, సతీ సహగమనం, శిశు హత్యలు, సమాజంలో స్త్రీల-ముఖ్యంగా వితంతువుల అధోగతి వంటి దురాచారాలు ఆ వ్యక్తుల్లో మానవతా దృక్పథాన్ని మేల్కొల్పాయి. భారత ప్రజల మనస్సుల్లో మబ్బు తెరలు కమ్మిన మూఢ విశ్వాసాలు, దేశంలో శాస్త్రీయ దృక్పథమన్నది పూర్తిగా మృగ్యమై

పోయిన పరిస్థితి చూసిన వాళ్ళ శాస్త్రీయమైన మనస్సులు ఉడుకెత్తి పోయాయి. ఆధునిక పాశ్చాత్య శాస్త్ర విజ్ఞానం, తత్వశాస్త్రాలు, సాహిత్యం ప్రవేశ పెట్టటం ఒక్కటే భారతదేశాన్ని ఈ చెదుగు నుంచి తప్పించటానికి ఏకైక మార్గమని వాళ్ళు భావించారు. సత్వర, సంపూర్ణ ఆధునికీకరణ జరగాలని వాళ్ళు వాంఛించారు. భారతదేశంలో బ్రిటీషు విధానాల్ని ప్రభావితం చేసే అవకాశం వాళ్ళకి జేమ్స్‌మిల్ ద్వారా ఒనగూడింది. జేమ్స్‌మిల్ ఆనాడు ఇంగ్లండ్‌లో ప్రముఖ అతివాద తత్వవేత్త. ఆయన 1817 లో కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ కార్యాలయంలో ప్రధాన తనిఖీ అధికారి అయ్యాడు. 1829లో మరొక అతివాది విలియం బెంటింక్ భారతదేశానికి గవర్నర్ జనరల్‌గా వచ్చారు. 1820 తరువాత భారతదేశానికి వచ్చిన అధికార్లలో కొంత మంది అతివాద దృక్పథం కలవాళ్ళే కావటం మరొక విశేషం. పైపెచ్చు, అదే కాలంలో సంస్కరణాభిలాషులైన విగ్గులు (విగ్‌రాజకీయ పక్షం వాళ్ళు) అధికారంలోకి వచ్చారు.

భారతదేశంలో బ్రిటీషు పాలనకి సంబంధించినంతవరకు నిజాయితీ, ఉదారభావాలు కలిగిన ఆ ప్రగతివాదులు బహుకొద్ది మంది. వాళ్ళ పలుకుబడి, ప్రభావం ఏనాడూ నిర్ణయాత్మకంగా లేవు. బ్రిటీషు ఇండియా పరిపాలనా వ్యవస్థలోని అధికార వర్గాలు సామ్రాజ్యవాద దృక్పథం, దోపిడీ ధోరణి మానుకోలేదు. కొత్త భావాల్ని వాళ్ళు అంగీకరిస్తారు. తమ వాణిజ్య ప్రయోజనాలకు, లాభార్జనకు ముప్పుతెచ్చి పెట్టని స్వల్ప సంస్కరణ చర్యలు తీసుకుంటారు. ఆధునికీకరణ విషయంలోనూ అంతే. భారతదేశ వనరుల్ని సాధన సంపత్తిని సునాయాసంగా, సంపూర్ణంగా కొల్లగొట్టటానికి యేవి అవసరమో, ఆ అవసరాలు గీసిన గిరిలో మాత్రమే భారతదేశంలో ఆధునికీకరణ జరగాలి. ఈ ఆధునికీకరణ భారతీయుల్ని బ్రిటీషు సరుకులకి భేషైన ఖాతాదార్లుగా మారుస్తుందనీ, విదేశ పాలనతో వాళ్ళు రాజీ పడిపోయేలా మెదలు వంచుతుందనీ బ్రిటీషు అధికార్లు, వ్యాపారస్థులు, రాజనీతిజ్ఞులు ఆశించారు. కాబట్టి ఈ దేశంలో ఆధునికీకరణ జరగటానికి ఆమోదం తెల్పారు. పెద్ద పెద్ద కబుర్లు దంచే అతివాదులు (రాడికల్స్) భారతదేశంలో బ్రిటిష్ విధానం చర్చకు వచ్చే సరికి తమ నమ్మకాలకు కట్టుబడివుండలేదు. బ్రిటన్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వం కోసం కృషిచేసిన వాళ్ళే భారతదేశం విషయంలో రంగు ఫిరాయించారు. అధికార బలంతో పాలన సాగించే ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు కావాలని వాంఛించారు. పైగా, దాన్ని పితృస్వామిక ప్రభుత్వంగా వర్ణించారు. ఈ విషయంలో రాడికల్ నామధారులు సంప్రదాయవాదుల్తో పూర్తిగా ఏకీభవించారు. బ్రిటీషు ప్రభుత్వం భారత ప్రజల్ని బిడ్డలుగా భావించి పరిపాలనా నిర్వహణలో వాళ్ళకి చోటు పెట్టని పితృస్వామిక ప్రభుత్వాన్ని సంప్రదాయవాదులు భుజాన వేసుకున్నారు. ఈ సందర్భంలో ఇండియాలోని బ్రిటీషు పాలకులు ఒక సందిగ్ధావస్థలో పడ్డారు. భారతదేశంలో బ్రిటీషు ప్రయోజనాలు నెరవేరాలంటే ఎంతో కొంత ఆధునికీకరణ జరగాలి. అలా కాకుండా సంపూర్ణ ఆధునికీకరణ జరిగిందో బ్రిటీషు ప్రయోజనాలకు భంగం వాటిల్లుతుంది. భవిష్యత్తులో ఈ దేశంలో బ్రిటీషు ఆధిపత్యానికి ప్రమాదం ముంచుకొస్తుంది. కాబట్టి, పాక్షిక ఆధునికీకరణ అనే సమతూక విధానాన్ని అవలంభించవలసి వచ్చింది. అంటే కొన్ని రంగాలలో ఆధునికీకరణని ప్రవేశ పెట్టటం, మిగతా రంగాలలో దాన్ని విరోధించటం అన్నమాట.

భారతీయ సమాజ, సంస్కృతుల అధునికీకరణ విధానాన్ని క్రైస్తవ మిషనరీలు, విలియం విల్బర్‌ఫోర్స్, చార్లెస్ గ్రాంట్‌వంటి మతాభిమానులు ప్రోత్సహించారు. చార్లెస్ గ్రాంట్ కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ అధ్యక్షుడు. భారతదేశంలో క్రైస్తవ మత వ్యాప్తి జరగాలని తపించిన వాడుకూడా. వీళ్ళు భారత సమాజాన్ని మత కారణాల్ని పురస్కరించుకొని దుయ్యబట్టారు. క్రైస్తవ మతం ఒక్కటే సిసలైన మత మనీ, మిగతావన్నీ నకిలీవనీ వాళ్ళ ప్రగాఢ విశ్వాసం. ఈ "నకిలీ" మతాల్లో నమ్మకం వున్న వాళ్ళని అనాగరికులనీ, మూర్ఖులనీ, అర్ధబర్బరులనీ అడిపోసుకున్నారు. భారతదేశాన్ని పాశ్చాత్యీకరించాలనే కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు. తద్వారా, దేశం మొత్తం క్రైస్తవ మతాన్ని కౌగలించుకొంటుందని వాళ్ళ ఆశ. పాశ్చాత్యజ్ఞాన జ్యోతి భారత ప్రజల స్వీయ మత విశ్వాసాల్ని ధ్వంసంచేసి వాళ్ళని క్రైస్తవమతం వేపు నడిపిస్తుందని వాళ్ళు అనుకున్నారు. అంచేతనే, క్రైస్తవ మిషనరీలు దేశంలో అధునిక విద్యాలయాల్ని, వైద్యశాలల్ని తెరిచారు. తమ మత ప్రచార కృషికి దేశంలో శాంతిభద్రతలు, బ్రిటీషు అధిపత్యం తప్పనిసరి కాబట్టి మిషనరీలు బ్రిటీషు పాలకుల పితృస్వామిక, సామ్రాజ్యవాద విధానాల్ని బలపర్చారు. క్రైస్తవమతం పుచ్చుకున్న భారతీయులు బ్రిటీషు వస్తు వినిమయదార్లుగా మారిపోతారని బ్రిటీషు వర్తకులకి, పారిశ్రామికులకి ఒక ఆశ కలిగించి, తమ మత ప్రచార కృషికి మద్దతు కోరారు.

రాజారామమోహన్‌రాయ్, ఆయన భావాల్ని పంచుకున్న ఇతర భారతీయులు బ్రిటీషు అతివాదులకు గట్టి మద్దతు ఇచ్చారు. భారత ప్రజలు, సమాజం ఎటువంటి హీనస్థితికి దిగజారిపోయిందీ వాళ్ళకి తెలుసు. కుల విభేదాల్ని, ఇంకా తదితర సామాజిక అవలక్షణాల్ని వాళ్ళు అసహ్యించుకున్నారు. శాస్త్రీయ విజ్ఞానం, మానవతా వాదలమీద భారతదేశ విముక్తి అధారపడివుందని వాళ్ళు నమ్మారు. ఇన్ని కారణాల వల్ల రాజారామమోహన్‌రాయ్ ప్రభృతులు బ్రిటీషు రాడికల్స్‌ని బలపర్చవలసి వచ్చింది.

అయితే, బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం ఏకబిగిని సంపూర్ణ అధునికీకరణ కార్యక్రమాన్ని చేపట్టకుండా నిదానంగా, జాగ్రత్తగా కొత్త మార్పులు ప్రవేశ పెట్టే విధానాన్ని ఎంచుకోడానికి కొన్ని వేరే కారణాలున్నాయి. ఇండియాలో ఉండే బ్రిటీషు అధికారవర్గంలో సనాతన దృక్పథం అప్పటికింకా ప్రబలంగా కొనసాగుతూనేవుంది. భారతీయుల మత విశ్వాసాలలో, సాంఘికాచారాలలో జోక్యం పెట్టుకుంటే, ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవలసి రావచ్చుననే అభిప్రాయం కూడా వాళ్ళకుంది. తీవ్ర అతివాదులమని చెప్పుకునేవాళ్ళు కూడా తదితర బ్రిటీషు పాలవర్గాలతో పాటే ఈ హెచ్చరికకి చెవి ఒగ్గారు. భారతదేశంలో బ్రిటీషు పాలన సజావుగా, శాశ్వతంగా సాగాలని వాళ్ళకి ఉంది. కాబట్టి మిగతా ఆలోచనలన్నీ దీని తరువాతే. నిజానికి, ఈ అధునికీకరణ విధానాన్ని 1858 తరువాత క్రమేణా విడిచి పెట్టేశారు. ఎంచేతనంటే భారతీయులు చురుకుపాలు కలిగిన శిష్యులుగా నిరూపించుకున్నారు. సందు దొరకగానే, వాళ్ళు తమ సమాజాన్ని అధునికంగా మలుచుకునే దిశలో వేగంగా కదిలారు. తమ సంస్కృతిని దృఢంగా సమర్థించారు. స్వాతంత్ర్యం, సమానత్వం, జాతీయతా సిద్ధాంతాల కనుగుణంగా పరిపాలన జరగాలని పట్టుబట్టారు.

**మానవతా చర్యలు :** భారతీయ సమాజాన్ని పీడిస్తున్న చెడుగుల్ని తొలగించి, దాన్ని సంస్కరించటానికి బ్రిటీషు అధికార్లు చేసిన కృషి మొత్తం మీద చాలా నీరసంగా

ఉండటంచేత పెద్దగా ఫలించలేదు. వాళ్ళు సాధించిన ఘన విజయమల్లా 1829లో సతీసహగమన నిషేధం. అప్పుడు విలియం బెంటింక్ గవర్నర్ జనరల్‌గా ఉన్నాడు. చనిపోయిన భర్తతో పాటు అతని భార్యని చితిమీదికెక్కించటం నేరంగా ఆయన శాసనం చేశాడు. ఆ దురాచారంతో సంబంధం ఉన్న అందర్నీ ఆయన నేరస్థులుగా ప్రకటించాడు. హిందూ ఛాందసుల ఆగ్రహానికి గురి కావలసి వస్తుందేమోనని వెనుకటి అధికార్లు జంకారు. రాజారామమోహన్‌రాయ్, సంస్కారవంతులైన ఇతర భారతీయులు, మిషనరీలు ఈ భయంకర దురాచారానికి వ్యతిరేకంగా పట్టువీడని ఆందోళన చేపట్టటంతో ప్రభుత్వం ఈ మానవతా చర్యని తీసుకోడానికి అంగీకరించింది. అక్బర్, ఔరంగజేబు, పీష్వాలు, జైపూర్ ప్రభువు జైసింగ్ ప్రభృతులు లోగడ ఈ దురాచారాన్ని అరికట్టటానికి విఫల యత్నం చేశారు. ఏదెలావున్నా, బెంటింక్ ఈ విషయంలో దృఢంగా, ధైర్యంగా నిలబడి సతీసహగమనాన్ని నిషేధించినందుకు, ఆయనని అభినందించాలి. 1815-1818 సంవత్సరాల మధ్య ఒక్క బెంగాల్‌లో 800 ప్రాణాలు ఈ దురాచారానికి బలయ్యాయి.

ఆడపిల్లల్ని పురిటిలోనే చంపివేసే దురాచారం కొన్ని రాజపుత్ర వంశాలలోను, కొన్ని కులాల్లోను ఉండేది. యుద్ధాల్లో పెద్ద సంఖ్యలో యువకులు హతులైపోవటం వల్ల పెళ్ళి కుమారుల కొరత ఏర్పడ్డం, పంటలు పండని నిస్సార ప్రాంతాల్లో బ్రతుకుగడవని దుర్భర పరిస్థితులు, భారత పశ్చిమ, మధ్య ప్రాంతాల్లో కొన్ని చోట్ల వరకట్న దురాచారం భయంకర రూపంలో తాండవించటం వంటి కారణాల మూలంగా ఈ దారుణ దురాచారం పాకిపోయింది. 1795-1802 సంవత్సరాల మధ్య ఈ దురాచారాన్ని నిషేధిస్తూ ఎన్ని చట్టాలు చేసినా, వాటిని కఠినంగా అమలుపరచిన వాళ్ళు విలియం బెంటింక్, హార్డింజ్‌లే. గోండ్ ఆదిమ తెగలో ప్రబలంగా ఉండే నరబలి ఆచారాన్ని కూడా హార్డింజ్ అరికట్టాడు. 1856లో బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం వితంతు పునర్వివాహ చట్టాన్ని చేసింది. ఈ సంస్కరణకు అనుకూలంగా పండిత ఈశ్వర చంద్ర విద్యాసాగర్, ఇంకా తదితర సంస్కర్తలు సుదీర్ఘ ఆందోళన చేసిన మీదట ప్రభుత్వం ఈ చర్య తీసుకుంది. అయితే, ఈ చట్టం వల్ల తక్షణ ఫలితాలు చేకూరలేదు.

ఈ ప్రభుత్వం సంస్కరణలు భారత సామాజిక వ్యవస్థ మూలల్ని, అంచుల్ని మించి స్పృశించ లేదు. విశాల భారత ప్రజానీకపు జీవితాన్ని కొంచెమైనా కదిలించలేదు. అంతకుమించి చెయ్యటం ఒక విదేశ ప్రభుత్వానికి బహుశా అసాధ్యం కావచ్చు.

***ఆధునిక విద్యా వ్యాప్తి:*** ఆధునిక విద్యని ప్రవేశ పెట్టడం ద్వారా భారతీయ మేధా సంబంధమైన జీవితాన్ని విప్లవింపజెయ్యడంలో బ్రిటిషు వాళ్ళు కృతకృత్యులయ్యారు. కాని, ఆధునిక విద్యావ్యాప్తికి ఒక్క ప్రభుత్వ కృషి మాత్రమే కారణం కాదు. క్రైస్తవ మిషనరీలు, చైతన్యవంతులైన అనేక మంది భారతీయులు ఆధునిక విద్యా వ్యాప్తిలో ప్రముఖ పాత్ర నిర్వహించారు.

వ్యాపార లాభార్జనా సంస్థగా ప్రవేశించిన తూర్పిండియా కంపెనీ ఈ దేశంలో రాజ్యాధికారం సాధించిన మొదటి 60 సంవత్సరాల కాలంలో తన పౌరుల విద్యా వికాసాలు గురించి పట్టించుకోలేదు. ఈ సందర్భంలో రెండు అతి స్వల్ప మినహాయింపులు మాత్రం ఉన్నాయి. 1781లో వారన్ హేస్టింగ్స్ ముస్లిం న్యాయశాస్త్రం,

దాని అనుబంధ విషయాల అధ్యయనానికి, బోధనకు కలకత్తాలో ఒక మదరసా (పాఠశాల) స్థాపించారు. 1791లో జోనాథన్ డంకన్ వారణాసిలో ఒక సంస్కృత కళాశాల పెట్టించాడు. డంకన్ అనాడు రాజప్రతినిధిగా (రెసిడెంట్) ఉండేవాడు. హిందూ న్యాయ, తత్వశాస్త్రాల అధ్యయనానికి గాను అయన ఆ సంస్కృత కళాశాల స్థాపించాడు. కంపెనీ వారి న్యాయస్థానాల్లో న్యాయ పరిపాలన నిర్వహణకుగాను యోగ్యత కలిగిన భారతీయుల్ని సమకూర్చి పెట్టటానికి ఈ రెండు సంస్థల్ని రూపొందించారు.

భారతదేశంలో ఆధునిక, లౌకిక పాశ్చాత్య విద్యని ప్రోత్సహించి, పెంపొందించాలని మిషనరీలు, వాళ్ళ అనుయాయులు, ఇంకా అనేకమంది మానవతా వాదులు ప్రభుత్వం మీద ఒత్తిడి ప్రారంభించారు. భారతదేశాన్ని పీడించే సామాజిక, ఆర్థిక, రాజకీయ అవలక్షణాలమీద ఆధునిక విజ్ఞాన విరుగుడుగా పని చేస్తుందని భారతీయ మేధావుల్తో సహా చాలా మంది మానవతా వాదులు భావించారు. కాని, క్రైస్తవ మిషనరీలు భావించిన తీరు వేరు. ఆధునిక విద్య ఈ దేశ ప్రజల స్వీయ మత విశ్వాసాల్ని ధ్వంసం చేసి, క్రైస్తవ మత వ్యాప్తికి దోహదపడుతుందని వాళ్ళు ఆశించారు. భారతీయ విద్వాంసుల్ని ప్రోత్సాహపరచడానికి, దేశంలో ఆధునిక విజ్ఞాన శాస్త్ర అధ్యయనాన్ని పెంపొందించడానికి వీలు కల్పిస్తూ 1813లో వచ్చిన చార్టర్ యాక్టుతో ఆధునిక విద్యా వ్యాప్తికి నాంది ప్రస్తావన జరిగింది. ఈ కార్యానికి గాను ఒక లక్ష రూపాయలు కేటాయించమని చార్టర్ యాక్టు కంపెనీని నిర్దేశించింది. అయినా కూడా, 1823వరకు కంపెనీ ఈ స్వల్ప మొత్తాన్ని సైతం విద్యావ్యాప్తికి కేటాయించలేదు.

ఈ కొద్ది మొత్తాన్ని ఏ రూపంలో ఖర్చు పెట్టాలనే తర్జన భర్జనలు ఏళ్ళ తరబడి నడిచాయి. ఆధునిక పాశ్చాత్య విద్యాభివృద్ధికి మాత్రమే ఈ మొత్తం ఖర్చుపెట్టాలని ఒక వర్గం వాదిస్తే, ఉద్యోగాలకు యోగ్యత కల్పించే విధంగా పాశ్చాత్య విజ్ఞాన శాస్త్రాల్ని, సాహిత్యాన్ని బోధించడానికి మాత్రమే ఈ నిధి కేటాయించబడాలని మరొక వర్గం వాదించింది. సాంప్రదాయక భారతీయ విద్యా వ్యాప్తికి ప్రాధాన్యం వుండాలని కూడా వాదించబడింది. పాశ్చాత్య విద్యా వ్యాప్తి జరగాలని పట్టుపట్టిన వాళ్ళలో ఏ భాషలో విద్యాబోధన జరగాలన్న అంశం పైన విభేదాలొచ్చాయి. ప్రాంతీయ భాషల్లో విద్యాబోధన జరగాలని ఒక వర్గం వాదిస్తే, ఇంగ్లీషులో మాత్రమే జరగాలని మరో వర్గం వాదించింది. దురదృష్టవశాత్తు, ఈ అంశంపైన పెద్ద గందరగోళం లేచింది. ఇంగ్లీషుని బోధనా భాషగా చెయ్యటానికి- పాఠ్య విషయంగా చెయ్యటానికి మధ్యగల తేడాని చాలా మంది గ్రహించలేకపోయారు. అదే విధంగా, భారతీయ భాషల్ని బోధనా భాషగా-ప్రధాన పాఠ్య విషయంగా చెయ్యటంలో గల తేడాని కూడా గుర్తించలేకపోయారు.

చివరకి 1835లో బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం ఇంగ్లీషు మీడియంలో పాశ్చాత్య విజ్ఞానశాస్త్రాల్ని, సారస్వతాన్ని బోధించే విద్యా కార్యక్రమానికి మాత్రమే తన పరిమిత నిధుల్ని కేటాయించటానికి నిర్ణయం తీసుకోవటంతో ఈ వివాదం పరిష్కారమైంది. గవర్నర్ జనరల్ కౌన్సిల్‌లో న్యాయశాస్త్ర సభ్యుడుగా ఉన్న లార్డ్‌మెకాలే తన ప్రసిద్ధ నివేదికలో పాశ్చాత్య విద్యా, విజ్ఞాన బోధనకు తగినట్లుగా భారతీయ భాషలేవీ అభివృద్ధి పొందలేదని గట్టిగా వాదించాడు. "ఐరోపా విజ్ఞానంతో పోలిస్తే ప్రాచ్య విజ్ఞానం పూర్తిగా అధమ స్థాయిలో ఉంది" అని అయన రాశాడు. ఈ మాటల్లో ప్రాచ్య విద్యా, విజ్ఞానాల పట్ల అయన అయిష్టత, విజ్ఞాన, విచార రంగాలలో భారతదేశ గత ఔన్నత్యం గురించి

ఆయన అజ్ఞానం ధ్వనిస్తున్నాయి. కాని భౌతిక, సామాజిక శాస్త్రాల్లో ఐరోపా పాండితి ఆనాటి భారతీయ పాండితిని ఎంతగానో మించి ఉన్నదనే ఆయన అభిప్రాయాన్ని త్రోసి పుచ్చలేం. ఒకనాడు ఆ రంగాలలో భారతీయులు ఉన్నత శిఖరాలు తాకిన మాట నిజమే. కాని ఆతరువాత భారతీయ పాండితి నిలవ నీరుగా కుళ్ళిపోయి, వాస్తవంతో సంబంధం తెంచుకుంది. అంచేతనే, రాజారామమోహన్ రాయ్ నాయకత్వాన ఆనాటి భారతీయ మేధావులు పాశ్చాత్య విజ్ఞాన అధ్యయనం యొక్క అవసరాన్ని గట్టిగా నొక్కి చెప్పారు "అది ఆధునిక పాశ్చాత్య దేశాల శాస్త్రీయ , ప్రజాస్వామ్య విచార నిధి నిక్షేపాల్ని కనుగొనే కీలకం" అని వాళ్ళు భావించారు భారత దేశంలో సాంప్రదాయిక విద్య మూఢ నమ్మకాల్ని, భయాన్ని అధికార విధేయతని పెంచి పోషించిందని వాళ్ళు గ్రహించారు. మరో మాటల్లో చెప్పాలంటే, ఈ దేశానికి విముక్తి ముందుకు త్రోసుకుపోతేనే ఉంది గాని వెనక్కి తిరిగి చూస్తే లేదు అని వాళ్ళు స్పష్టంగా గ్రహించారు

1835లో తీసుకున్న నిర్ణయం ప్రకారం, బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం తక్షణ కార్యాచరణకి దిగింది ముఖ్యంగా బెంగాల్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో, ఇంగ్లీషుని బోధనా భాషగా నిర్ణయించింది. అధిక సంఖ్యలో ప్రాథమిక పాఠశాలల్ని తెరవటానికి బదులు కొద్ది ఇంగ్లీషు స్కూళ్ళని, కాలేజీల్ని తెరిచింది. ప్రజాబాహుళ్యానికి చదువు అందనికుండా చేసిన ఈ విద్యా విధానం తరువాత తీవ్ర విమర్శలకు గురయింది. నిజానికి ఆధునిక ఉన్నత విద్యా కేంద్రాల్ని స్థాపించటంలో తప్పులేదు. ప్రాథమిక పాఠశాలలకు అవసరమైన ఉపాధ్యాయ సిబ్బందిని తయారు చెయ్యాలన్నా ఉన్నత పాఠశాలలు, కళాశాలలు తెరవక తప్పదు. అయితే ఉన్నత విద్యా వ్యాప్తితో పాటుగా ప్రజా బాహుళ్యానికి విద్యా వికాసాలు కల్పించే కార్యక్రమాన్ని కూడా చేపట్టాల్సి వుంది. కాని, ప్రభుత్వం ఆ పని చెయ్యటానికి సిద్ధంగా లేదు. విద్యాపద్దు కింద అది ఖర్చు చెయ్య తలపెట్టిన మొత్తం అతి స్వల్పం కాబట్టి, ఈ లోపాన్ని పూరించటానికి వాళ్ళు ఒక కొత్త పద్ధతి కనిపెట్టారు. దాన్ని "కిందికి వడగట్టే" పద్ధతి అన్నారు విద్యకి కేటాయించిన స్వల్ప మొత్తంతో ఉన్నత, మధ్య తరగతుల వ్యక్తులు కొద్ది మందిని విద్యావంతుల్ని చేసి, వాళ్ళ ద్వారా ప్రజా బాహుళ్యంలో విద్యా గంధాన్ని ఆధునిక భావాల్ని వ్యాపింప చెయ్యాలని నిర్ణయించారు. అంటే విద్య, ఆధునిక భావాలు పై వర్గాల నుంచి దిగువ జనానికి దిగాలన్న మాట! ఈ విధానాన్ని అధికారికంగా 1854లోనే వదులుకున్నప్పటికీ, ఇది దాదాపు బ్రిటిష్ పాలన అంతమయ్యే దాకా కొనసాగింది. ఈ వడపోత పద్ధతిలో విద్య కిందికి దిగిరాలేదు గాని ఆధునిక భావాలు మాత్రం కొంత వరకు ప్రజల్లో వ్యాప్తి చెందాయి. అయితే, అది పాలక వర్గాలు ఆశించిన రూపంలో కాదు. ఇంగ్లీషు బళ్ళు, పాఠ్యపుస్తకాల ద్వారా కాకుండా రాజకీయ పార్టీలు, పత్రికలు, కరపత్రాలు, సభావేదికలు వగైరాలు ద్వారా మన విద్యావంతులు, మేధావులు పట్టణ, గ్రామీణ ప్రజానీకంలో ప్రజాస్వామ్యం జాతీయవాదం, సామ్రాజ్యవాద వ్యతిరేకత, సామాజిక ఆర్థిక సమానత, న్యాయాలు గురించి నూతన భావాలు ప్రచారం చేశారు.

1854లో భారత రాజ్య కార్యదర్శి విద్యకి సంబంధించి పంపిన ఆదేశాలు భారత దేశంలో విద్యా వికాసానికి బాగా తోడ్పడ్డాయి. ఆ ఆదేశాల ఫలితంగా అన్ని రాష్ట్రాలలో విద్యా శాఖలు అవతరించాయి. కలకత్తా, బొంబాయి, మద్రాసులలో 1857లో అనుబంధ

విశ్వ విద్యాలయాలు స్థాపించబడ్డాయి. ప్రసిద్ధ బెంగాలీ నవలా కారుడు బంకించంద్ర ఛటర్జీ 1858లో కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రులైన మొదటి ఇద్దరిలో ఒకడు.

ఎన్ని గొప్పలు చెప్పుకున్నా, మొదటి కంపెనీ ఆధ్వర్యాన, తరువాత బ్రిటిషు చక్రవర్తి కింద భారతదేశాన్ని ఏలిన బ్రిటిషు ప్రభుత్వం పాశ్చాత్య విద్యావ్యాప్తికిగానీ, లేదా తదితర విజ్ఞాన వ్యాప్తికిగానీ నిజంగా ఎటువంటి గాఢమైన శ్రద్ధా తీసుకోలేదు. ఈ దిశలో ఎంతో కొంత పరిమిత ప్రయత్నమైనా జరిగిందంటే, దానికి వేరే కారణాలున్నాయి. వాటికి బ్రిటిష్ సంస్కరణవాదుల ఉదార ఆశయాలతో ఎటువంటి సంబంధం లేదు. ఆ పరిమిత ప్రయత్నమైనా జరిగిందంటే దానికి కారణం - ఆధునిక విద్యా వ్యాప్తి కోసం అభ్యుదయం కాముకులైన భారతీయులు, విదేశ క్రైస్తవ మిషనరీలు, మానవతావాదులైన అధికార్లు, ఇంకా ఇతర ఇంగ్లీషు పెద్ద మనుషులు జరిపిన ఆందోళనే అని చెప్పాలి. అతి ముఖ్యమైన అసలు కారణం వేరే వుంది. పరిపాలనా నిర్వహణలోను, బ్రిటిష్ వ్యాపార సంస్థల్లోను అపరిమితంగా ఏర్పడ్డ చిన్న చిన్న ఉద్యోగాల్ని భర్తీ చెయ్యటానికి ఇంగ్లీషు చదువు నేర్చుకున్న భారతీయులు కావలసి వచ్చారు. వాళ్ళని నియమించటం ద్వారా పరిపాలనా వ్యయాన్ని బాగా తగ్గించుకోవచ్చునన్న ఆదుర్దా కూడా బ్రిటిషు పాలకులకుంది. ఆ ఖాళీల్లో భారతీయులకు బదులు ఇంగ్లీషు ఉద్యోగుల్ని నింపితే ఖర్చు తడిసిమోపెడవుతుంది. కాబట్టి, గుమాస్తాల చౌక సరఫరా అనేది ఉన్నత పాఠశాలల్లో, కళాశాలల్లో ఆధునిక విద్యాబోధన ప్రధానోద్దేశం. కంపెనీ పాశ్చాత్య తరహా పరిపాలనకు ఈ కళాశాలల్లో తయారయ్యే విద్యావంతులు బేషుగ్గా సరిపోతారు. అందుకోసమే ప్రభువుల భాష, పరిపాలనా భాష అయిన ఇంగ్లీషుని విద్యా సంస్థలన్నీ గట్టిగా పట్టుకుని వేళ్లాడాయి. విద్యావంతులైన భారతీయులు తమ దేశంలో బ్రిటిష్ సరుకులకు మార్కెట్‌ని విస్తృతపరుస్తారనే ఆశ కూడా ఈ విద్యావిధానాన్ని సమర్థించటానికి మరొక కారణం. ఇవన్నీ కాక ఇంకొక కారణం కూడా ఉంది. పాశ్చాత్య విద్య భారత విజేతలైన బ్రిటిషు వాళ్ళనీ, వాళ్ళ పరిపాలననీ ప్రత్యేకంగా ఆకాశానికి ఎత్తేసింది. కాబట్టి అది భారత ప్రజల్ని బ్రిటిషు పాలనకు సుముఖుల్ని చేస్తుందనీ కూడా విదేశ పాలకులు ఆశించారు. ఉదాహరణకి, మెకాలే ఈ కింది మాటల్లో బ్రిటిషు పాలకవర్గ ఉద్దేశ్యం స్పష్టమవుతుంది.

"మనకూ-మనం పాలించే కోట్లాది జనానికీ మధ్య దుబాసీలుగా పనిచేసే ఒక వర్గాన్ని సృష్టించటమే ప్రస్తుతం మనం శాయశక్తులా చెయ్యవలసిన కృషి. ఆ వర్గం మనుషులు రక్తంలో , రంగులో భారతీయులు. కాని అభిరుచిలో, అభిప్రాయాల్లో, గుణగణాల్లో, బుద్ధిలో ఇంగ్లీషు మానసపుత్రులు."

దేశంలో తమ రాజకీయాధికార పునాదిని పటిష్టం చేసుకోవడం కోసం బ్రిటిష్ వాళ్ళు ఆధునిక విద్యను ఉపయోగించుకోవాలనుకున్నారు.

ప్రభుత్వ ప్రాపకం లేకా, ప్రభుత్వోద్యోగాలకి ఇంగ్లీషు పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలని 1844లో అధికార ప్రకటన వెలువడ్డం వల్లా సాంప్రదాయిక భారతీయ విద్యా వ్యవస్థ వాడి వత్తలై పోయింది. ఈ ప్రకటనతో ఇంగ్లీషు మీడియం బడులకి గిరాకీ హెచ్చింది. అనేకానేక మంది విద్యార్థులు సాంప్రదాయిక పాఠశాలల్ని వదిలి వెయ్యాల్సి వచ్చింది.

ప్రజా బాహుళ్యానికి వాటిల్లిన చదువు కొరత ఇంగ్లీషు విద్యా విధానంలోని ప్రధాన బలహీనత. ఫలితంగా 1821 నాటికన్నా 1921 నాటికి ప్రజల్లో అక్షరాస్యత మెరుగుపడలేదు. 1911లో ప్రజల్లో నిరక్షరాస్యులు నూటికి 94గురు. 1921లో నూటికి తొంభై ఇద్దరు. భారతీయ భాషల స్థానంలో ఇంగ్లీషుని బోధనా భాషగా చేసి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల కూడా ప్రజల్లో అక్షరాస్యత పెరగకుండా పోయింది. ఇది ఒక విధంగా అక్షరాస్యతని నిరోధించింది కూడా. విద్యావంతులకు-జనసామాన్యానికి మధ్య ఈ ఇంగ్లీషు చదువు ఒక పెద్ద అగాధాన్ని సృష్టించడానికి తోడ్పడింది. ఉన్నత విద్య ఖరీదైంది కావడంతో అది సంపన్న వర్గాల, పట్టణ వాసుల గుత్త సొమ్మయింది.

స్త్రీ విద్య పట్ల పూర్తి నిర్లక్ష్యం తొట్ట తొలి విద్యా విధానంలోని ప్రధానమైన లొసుగు. ఆడ పిల్లల చదువు నిమిత్తం అసలు నిధులే కేటాయించలేదు. హిందూ ఛాందసుల మనోభావాల్ని గాయపరచకూడదనే ప్రభుత్వ ఆదుర్దా స్త్రీ విద్యపట్ల నిర్లక్ష్యానికి కొంత కారణం. పైగా విదేశ పాలకుల దృష్టిలో స్త్రీ విద్య వల్ల ఒనగూడే తక్షణ ప్రయోజనాలేమీ లేవు. ప్రభుత్వోద్యోగాలలో స్త్రీలను గుమాస్తాలుగా నియమించుకునే ప్రసక్తి లేదు. ఫలితంగా 1921లో భారత స్త్రీలలో నూటికిద్దరు అక్షరాస్యులు. 1919లో బెంగాల్ ప్రెసిడెన్సీ మొత్తంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే బాలికల సంఖ్య 490.

కంపెనీ ప్రభుత్వం శాస్త్రీయ, సాంకేతిక విద్యని కూడా నిర్లక్ష్యం చేసింది. 1857 నాటికి దేశం మొత్తంలో కలకత్తా, బొంబాయి, మద్రాసు నగరాల్లో మూడు వైద్యకళాశాల లున్నాయి. ఒకే ఒక్క ఇంజనీరింగ్ కళాశాల రూర్కీలో ఉండేది. అందులో యూరోపియన్లకు, యూరేషియన్లకు మాత్రమే ప్రవేశార్హత ఉండేది.

ఈ బలహీనతలన్నిటికీ మూలకారణం ఆర్థిక సమస్య. విద్యకోసం నిధులు కేటాయించటంలో ప్రభుత్వం ఎప్పుడూ పిసినారితనమే ప్రదర్శించింది. మెతుకు రాల్చినట్టుగా విద్యాపద్దు కింద కొద్ది మొత్తం కేటాయించింది. సాలీనా వచ్చే 47 కోట్ల నికరాదాయం నుంచి కేవలం కోటి రూపాయలు విద్యకి కేటాయించింది. అదీ 1886లో.

ప్రభుత్వ విద్యా విధానంలో ఎన్ని లొసుగులున్నా, ఆధునిక విద్యా పరిమిత వ్యాప్తి భారతదేశంలో నూతన భావ వ్యాప్తికి బాటలు పర్చిందనేది మనం అంగీకరించక తప్పదు. తద్వారా భారతదేశ ఆధునికీకరణకు దోహదపడింది.

# 19వ శతాబ్ది ప్రథమార్థంలో సామాజిక, సాంస్కృతిక జాగృతి

ఆధునిక పాశ్చాత్య సంస్కృతి తాకిడికి భారతదేశంలో ఒక నవ జాగృతి రేకెత్తింది. పాశ్చాత్యుల విజయం భారతీయ సమాజ బలహీనతని, పతనావస్థని బట్టబయలు చేసింది. ఆలోచనా పరులైన భారతీయులు తమ సమాజంలోని లోపాల్ని కనుక్కొని, వాటిని తొలగించే ఉపాయాల్ని అన్వేషించటం ప్రారంభించారు. ఒక వేపు, భారత ప్రజల్లో ఎక్కువ మంది పాశ్చాత్య సంస్కృతిలో రాజీపడ్డం ఇష్టంలేక, భారతీయ సాంప్రదాయిక భావాలన్నా, వ్యవస్థలన్నా ఇంకా నమ్మకం పెంచుకుంటోంటే ఇతర్లు దానికి విరుద్ధంగా ఆధునిక పాశ్చాత్య ఆలోచనా విధానం తమ సమాజాన్ని పునరుజ్జీవింప జేసే కీలకంగా భావిస్తూ వచ్చారు. ముఖ్యంగా పాశ్చాత్య శాస్త్ర విజ్ఞానం, హేతువాదం, మానవతావాదం వాళ్ళని ముగ్ధుల్ని చేశాయి. పైగా, నూతన సామాజిక వర్గాలు - అంటే పెట్టుబడిదారులు, కార్మికులు, కొత్త మేధావులు స్వీయ ప్రయోజనాల దృష్ట్యా ఆధునికీకరణని వాంఛించారు.

ఈ జాగృతి వికాసంలో ప్రముఖ పాత్ర నిర్వహించిన వ్యక్తి రాజా రామమోహన్‌రాయ్. ఆయనని నవభారత తొలి మహానాయకునిగా పరిగణించడం సముచితమే. తన దేశమన్నా, తన ప్రజలన్నా గాఢానురాగం కలిగిన రాజా రామమోహన్‌రాయ్ తన దేశ ప్రజల సాంఘిక, రాజకీయ, మత పునరుజ్జీవనానికి జీవితాంతం అనేక కష్టాలకోర్చి పాటుపడ్డాడు. సమకాలీన భారతీయ సమాజంలో పేరుకుపోయిన స్తబ్దత, అవినీతి చూసి ఆయన మహా వేదన చెందాడు. ఆనాడు మన సమాజాన్ని కులతత్వం, పాత ఆచారాలు పట్టి పీడిస్తున్నాయి. జనం కొలిచే మతం మూఢ విశ్వాసాల్లో నిండివుంది. అజ్ఞానులు, అవినీతి పరులు అయిన పురోహితులు మతం ముసుగులో దేచుకుంటున్నారు. ఉన్నత వర్గాల స్వార్థబుద్ధితో తమ స్వంత సంకుచిత ప్రయోజనాల కోసం సామాజిక ప్రయోజనాల్ని బలిపెడుతున్నారు.

రాజా రామమోహన్‌రాయ్‌కి సాంప్రదాయక ప్రాచ్య దర్శన పద్ధతుల మీద ప్రగాఢ గౌరవం, అభిమానం ఉన్నాయి. అట్లాగే, పాశ్చాత్య సంస్కృతి ఒక్కటే భారతీయ సమాజ పునరుజ్జీవనానికి దోహద పడుతుందనే నమ్మకమూ ఉంది. తన దేశ ప్రజలు ముఖ్యంగా హేతుబద్ధమైన శాస్త్రీయ దృక్పథాన్ని, సమస్త స్త్రీ పురుషుల సామాజిక సమానత్వాన్ని, మానవ మర్యాదని ఆమోదించాలని ఆయన వాంఛించాడు. దేశంలో ఆధునిక పెట్టుబడిదారీ విధానం, పరిశ్రమలు ప్రవేశించాలని కూడా ఆయన కోరాడు.

రాజా రామమోహన్‌రాయ్ ప్రాక్పశ్చిమ ఆలోచనా విధానాల సమ్మేళనానికి ప్రతినిధి. ఆయన మహాపండితుడు. సంస్కృతం, పర్షియన్, అరబిక్, ఇంగ్లీషు, ఫ్రెంచి, లాటిన్, గ్రీకు, హీబ్రూ వగైరా చాలా భాషలు ఆయనకు క్షుణ్ణంగా తెలుసు.

వారణాసిలో సంస్కృత సాహిత్యాన్ని, హిందూ వేదాంతాన్ని అధ్యయనం చేశాడు. పాట్నాలో కొరాన్, పర్షియన్ అరబిక్ సాహిత్యం అధ్యయనం చేశాడు. జైనం, ఇంకా తదితర మతోద్యమాల్ని చక్కగా ఆకళింపుచుకున్నాడు. ఆ తరువాత, పాశ్చాత్య సంస్కృతిని, ఆలోచనా విధానాన్ని లోతుగా అధ్యయనం చేశాడు. బైబిల్ గ్రంథాన్ని మూలభాషలో చదవటం కోసం గ్రీకు, హిబ్రూ భాషల్ని నేర్చుకున్నాడు. 1809లో ఆయన "ఏకేశ్వరోపాసకుల కొక కానుక" అనే ప్రసిద్ధ పర్షియన్ గ్రంథాన్ని రచించాడు. ఏకేశ్వరోపాసనకు అనుకూలంగాను, బహుదేవతోపాసనకు వ్యతిరేకంగాను ఆయన ఆ పుస్తకంలో విపుల చర్చ చేశాడు.

ఆయన చివరికి 1814లో కలకత్తాలో స్థిరపడిపోయి అనేక మంది యువకుల్ని ఆకర్షించాడు. వాళ్ళ సహకారంతో 'ఆత్మీయ సభ'ని స్థాపించాడు. అప్పటి నుంచి బెంగాలీ హిందువుల్లో విశేషంగా ప్రబలి వున్న మత, సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా అకుంఠిత పోరాటం జరిపాడు. ముఖ్యంగా విగ్రహారాధనని, కులమౌఢ్యాన్ని, అర్థంలేని మత కర్మ కాండాల్ని ఆయన తీవ్రంగా నిరసించాడు. ఈ ఆచార కాండని ప్రోత్సహించి, జనం మనస్సులలో కెక్కించే పురోహిత వర్గాన్ని ఖండించాడు. ప్రాచీన హిందూ మూల గ్రంథాలన్నీ కూడా ఏకేశ్వరోపాసననే ప్రబోధించాయని ఆయన వాదించాడు. వేదాల్ని, అయిదు ముఖ్య ఉపనిషత్తుల్ని బెంగాలీ భాషలోకి అనువదించి తన వాదాన్ని సమర్థించుకున్నాడు. ఏకేశ్వరోపాసనని సమర్థిస్తూ ఆయన అనేక కరపత్రాల్ని, చిన్న చిన్న పుస్తకాల్ని వరంపరంగా రాశాడు.

తన తాత్విక అభిప్రాయాలకు ప్రాచీన ప్రమాణాల్ని ఉటంకిస్తూ, ఆయన మానవ హేతుబుద్ధి మీద అంతిమంగా ఆధారపడ్డాడు. ప్రాక్పశ్చిమ సిద్ధాంత సత్యాలకు మానవ హేతుశక్తి గీటురాయిగా ఆయన భావించాడు. వేదాంత తత్వం హేతుసూత్రం మీద ఆధారపడి వుందని ఆయన విశ్వాసం. ఏది ఏమైనా, మానవ హేతుబుద్ధి వేరే విధంగా నిర్దేశించినప్పుడుగానీ, సంప్రదాయాలు సమాజానికి హానికరంగా పరిణమించి నప్పుడుగానీ మనిషి పవిత్ర మత గ్రంథాల్ని తిరస్కరించటానికి కూడా జంక కూడదని ఆయన మతం. అయితే ఆయన తన హేతువాద వైఖరిని హిందూమత, సంప్రదాయాల మేరకి మాత్రమే పరిమితం చెయ్యలేదు. ఈ సందర్భంలో ఆయన తన మిషనరీ మిత్రులనేక మందిని నిరాశపర్చాడు. హిందూమతం మీద రామమోహన్‌రాయ్ సవిమర్శకంగా చేసిన ఖండన మండనల వల్ల హిందువులు చాలా మంది క్రైస్తవ మతంలోకి మారగలరేమోనన్న మిషనరీల ఆశ నిరాశ అయింది. క్రైస్తవ మతానికి సైతం హేతువాదాన్ని అన్వయించాలని ఆయన గట్టిగా వాదించాడు. క్రైస్తవ మతాన్ని గుడ్డిగా అనుసరించటానికి సంబంధించిన అంశాల్ని ఆయన సమర్థించలేదు. 1820లో ప్రచురించిన "జీసస్ సూక్తులు" అనే పుస్తకంలో ఆయన బైబిల్ నూతన నిబంధనలలోని (New Testament) నైతిక, తాత్విక సందేశాన్ని మానవాతీతమైన అద్భుత శక్తుల్ని వర్ణించే కథల నుంచి వేరుపర్చటానికి ప్రయత్నించాడు. జీసస్ ఉన్నత నైతిక సందేశం హిందూ ధర్మంలోకి ఇంకిపోవాలని ఆయన కోరాడు. ఆ విధంగా ఆయన మిషనరీల శత్రుత్వాన్ని కొని తెచ్చుకున్నాడు.

కాబట్టి రామమోహన్‌రాయ్‌కి సంబంధించినంత వరకు భారత గత ప్రశస్తి మీద గుడ్డిగా ఆధారపడడంగానీ, పాశ్చాత్యుల్ని గుడ్డిగా అనుకరించటంగానీ పనికిరాదు. హేతుపథంలో నూతన భారతదేశం ప్రాక్పశ్చిమాల ఉత్కృష్టతని స్వీకరించి

పదిలపర్చుకోవాలని ఆయన ఆకాంక్షించాడు. ఆ విధంగా భారతదేశం పశ్చిమ సీమల నుంచి చాలా నేర్చుకోవాలని కోరాడు. మనం నేర్చుకునేది మేధా వికాసప్రదమైన, సృజనాత్మకమైన ప్రక్రియగా ఉండాలి. తద్వారా భారతీయ సంస్కృతి, ఆలోచనా విధానం కొత్త పూలెత్తాలి. అంతేగాని, భారతదేశం మీద పాశ్చాత్య సంస్కృతిని బలవంతంగా రుద్దడాన్ని ఆయన ప్రతిపాదించలేదు. కాబట్టి రామమోహన్‌రాయ్ హిందూ మత సంస్కరణ కోసం నడుం కట్టాడు. హిందూమతాన్ని త్రోసివేసి క్రైస్తవ మతానికి పట్టం కట్టే ప్రయత్నాల్ని ప్రతిఘటించాడు. మిషనరీలు తమ అజ్ఞానంతో చేసే దాడుల్నుంచి హిందూ మతాన్ని, వేదాంతాన్ని శక్తివంతంగా రక్షించాడు. అయితే ఆయన ఇతర మతాల పట్ల అత్యంత సమరస ధోరణిని ప్రదర్శించాడు. అన్ని మతాలూ మౌలికంగా ఒకే ప్రాథమిక సందేశాన్ని చాటుతున్నాయనీ, ఆయా మతస్థులంతా అన్నదమ్ములనీ ఆయన దృఢంగా నమ్మాడు.

సాహసోపేతమైన మత దృక్పథాన్ని అవలంభించినందుకు రామమోహన్‌రాయ్ తన జీవిత కాలమంతా అనేక కష్టనష్టాలు పొందాడు. విగ్రహారాధనని ఖండించినందుకు, క్రైస్తవ, ఇస్లాం మతాలకు తాత్వికపరమైన ప్రశంసలిచ్చినందుకు హిందూ ఛాందసులందరూ ఆయన్ని సాంఘికంగా వెలివేశారు. ఆయనకి వ్యతిరేకంగా ఆయన తల్లి కూడా ఆ బహిష్కరణోద్యమంలో నిలబడింది. పాషండుడనీ, కులభ్రష్టుడనీ సంఘం ఆయన మీద ముద్రవేసింది.

ఆయన 1820లో బ్రహ్మసభ అనే ఒక కొత్త మత సంస్థని స్థాపించాడు. అదే తరువాత బ్రహ్మ సమాజంగా ప్రాచుర్యం పొందింది. హిందూ మతంలోని మాలిన్యాన్ని కడిగివేసి, ఏకేశ్వరోపాసనని బోధించడానికి ఆయన ఈ కొత్త మతాన్ని ప్రారంభించాడు. హేతువాదం, వేదోపనిషత్తులు ఈ మతానికి రెండు మూల స్తంభాలు. ఇతర మత ప్రబోధాల్ని సైతం ఈ మతం తనలో లీనం చేసుకుంటుంది. బ్రహ్మ సమాజం మానవగౌరవానికి ప్రాధాన్యం ఇచ్చింది. విగ్రహారాధనని ఖండించింది. సతీసహగమనం వంటి సామాజిక దురాచారాల్ని ప్రతిఘటించింది.

రామమోహన్‌రాయ్ గొప్ప ఆలోచనాపరుడు. ఆచరణశీలి కూడా. జాతి నిర్మాణానికి సంబంధించి ఆయన స్పృశించని అంశం లేదు. హిందూ మతాన్ని అంతర్గతంగా సంస్కరించటానికి నడుం కట్టినట్లుగానే, భారతీయ సమాజ సంస్కరణకు సైతం పునాదులు నిర్మించాడు. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఆయన జీవితాంతం జరిపిన సమరంలో చరిత్రాత్మకమైన సతీసహగమన వ్యతిరేక ఆందోళన ఒక ప్రతీక. ఈ అమానుష దురాచారానికి వ్యతిరేకంగా ఆయన 1818లో ప్రజాభిప్రాయాన్ని సమీకరించటానికి తలపడ్డాడు. దీనికి వ్యతిరేకంగా అతి ప్రాచీన ధర్మగ్రంథాల ప్రామాణ్యాన్ని చూపాడు. సతీసహగమనానికి వ్యతిరేకంగా విధవల బంధువులకు నచ్చచెప్పటానికి ఆయన కలకత్తా స్మశాన వాటికల్ని సందర్శించాడు. తన భావాలతో ఏకీభవించే వ్యక్తుల్ని చేర్చి, బృందాలుగా కూడగట్టి ఈ దురాచారాన్ని నిరోధించటానికి పురికొల్పాడు. బెంటింక్ చేసిన సతీసహగమన నిషేధ చట్టాన్ని ఆమోదించవద్దని పార్లమెంటుకు మహజరు సమర్పించిన సనాతన హిందువుల చర్యకు వ్యతిరేకంగా ఆయన సంస్కారవంతులైన హిందువుల్ని సమీకరించి బెంటింక్ చట్టానికి అనుకూలంగా వేరే మహజరు సమర్పించాడు.

రామమోహన్‌రాయ్ స్త్రీల హక్కుల కోసం నిలబడ్డ ధీరుడు. స్త్రీల బానిసత్వాన్ని ఆయన తీవ్రంగా ఎదిరించాడు. బుద్ధిలో, నీతిలో స్త్రీలు మగవాళ్ళ కన్నా తక్కువ అనే జనాభిప్రాయాన్ని ఖండించాడు. బహు భార్యత్వం మీద దాడి చేశాడు. వితంతువుల్ని దయనీయస్థితికి దిగజార్చే ఆచారాన్ని నిరసించాడు. స్త్రీల స్థితిని మెరుగుపర్చడానికి వాళ్ళకి ఆస్తి, వారసత్వ హక్కులివ్వాలని వాదించాడు.

భారతదేశంలో ఆధునిక విద్యని ప్రవేశపెట్టాలని ప్రచారోద్యమం సాగించిన మొట్టమొదటి వాళ్ళలో రామమోహన్‌రాయ్ ప్రముఖుడు. దేశంలో నవీన భావాలు వ్యాప్తి కావడానికి ఆధునిక విద్య ప్రధాన సాధనం అని ఆయన భావించాడు. 1800లో వాచీలు తయారు చెయ్యటానికని వచ్చిన డేవిడ్ హేర్ తన జీవితమంతా ఆధునిక విద్యాభివృద్ధి కోసం వెచ్చించాడు. 1817లో హిందూ కళాశాలని స్థాపించిన ప్రముఖుడతడు. హేర్ తలపెట్టిన విద్యాభివృద్ధి కార్యక్రమాలకు రామమోహన్‌రాయ్ ప్రోత్సాహ, సహకారాలు అందించాడు. పై పెచ్చు, ఆయన తన సొంత ఖర్చుతో 1817 నుంచి కలకత్తాలో ఒక ఇంగ్లీషు పాఠశాలని నడిపించాడు. ఆ పాఠశాలలో ఇతర విషయాలతో పాటు యంత్ర శాస్త్రాన్ని, వాల్టేర్‌తత్వ చింతనని బోధనా విషయాలుగా పెట్టించాడు. 1825లో ఒక వేదాంత కళాశాలని స్థాపించి, భారతీయ విద్యని, పాశ్చాత్య సామాజిక, భౌతిక శాస్త్రాల్ని బోధనా విషయాలుగా ప్రవేశపెట్టాడు.

బెంగాల్‌లో వంగభాషని మేధావుల చర్చా సంవాదాలకు ఉచితమైన భాషగా తీర్చి దిద్దడంలో రామమోహన్‌రాయ్ శ్రద్ధాసక్తులు ప్రదర్శించాడు. స్వయంగా బెంగాలీ వ్యాకరణాన్ని తయారుచేశాడు. తన అనువాదాలు, కరపత్రాలు, పత్రికల ద్వారా బెంగాలీ భాషలో ఆధునిక సుందర వచన శైలి రూపు దిద్దుకోవడానికి ఆయన తోడ్పడ్డాడు.

భారతదేశంలో జాతీయ చైతన్యావిర్భావపు తొలి లేత వెలుగుల కాయన ప్రతీక. పునరుజ్జీవనం పొందిన స్వతంత్ర భారతం ఆయన స్వప్నం. అదే ఆయన ఆలోచనల్ని, ఆచరణని నడిపించింది. భారతీయ మతాల్లోంచి, సమాజంలోంచి అవినీతికర శక్తుల ఏరివేతకి ప్రయత్నించడం ద్వారా, ఏకేశ్వరోపాసన అనే వేదాంత సందేశాన్ని ప్రబోధించడం ద్వారా పరస్పర విరుద్ధమైన ముఠాలుగా చీలిపోయిన భారత జాతి సమైక్యతకు తాను పునాదులు వేస్తున్నానని ఆయన బలంగా నమ్మాడు. ముఖ్యంగా, ఆయన కులవ్యవస్థ కాఠిన్యాన్ని ప్రతిఘటించాడు. "మనలో ఐక్యత లోపించటానికి మూలకారణం కులవ్యవస్థ" అని ఆయన ఉద్ఘాటించాడు. ఇది రెండు విధాల చెరుపు చేసిందని ఆయన తలచాడు. ఒకటి-ఇది అసమానతని సృష్టించింది. రెండు-ఇది ప్రజల్ని చీల్చి వాళ్ళలో దేశభక్తి భావాలు లేకుండా చేసింది. కాబట్టి, ఆయన దృష్టిలో మత సంస్కరణ లక్ష్యాలలో రాజకీయ ఉద్ధరణ ఒకటి.

భారతీయ పత్రికా రచనలో ఆయన ఆది పురుషుడు. ప్రజల్లో శాస్త్రీయ, సాహిత్య, రాజకీయ పరిజ్ఞానాన్ని వ్యాప్తి చెయ్యటానికి, ఆనాడు ఆసక్తిని రేకెత్తించే విషయాలమీద ప్రజాభిప్రాయాన్ని సుశిక్షితం చెయ్యటానికి, ప్రజల కోర్కెల్ని, బాధల్ని, ప్రభుత్వ దృష్టికి తేవటానికి ఆయన బెంగాలీ, పర్షియన్, హిందీ, ఇంగ్లీషు భాషల్లో పత్రికలు ప్రారంభించాడు.

దేశంలో రాజకీయ సమస్యల మీద ప్రజాందోళనని ప్రారంభించినవాడు కూడా ఆయనే. రైతాంగపు దుస్థితికి కారకులైన బెంగాలీ జమీందార్ల పీడనకి వ్యతిరేకంగా

ఆయన కత్తి కట్టాడు. భూమిని సాగుచేసే రైతులు కట్టే కౌలుని శాశ్వతంగా నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశాడు. అప్పుడే 1793నాటి శాశ్వత శిస్తు నిర్ణయ పద్ధతి ఫలితాలు రైతుకు అందుబాటవుతాయని ఆయన వాదించాడు. పన్నుల నుండి మినహాయింపబడిన భూముల మీద పన్నులు విధించడాన్ని ఆయన ప్రతిఘటించాడు కంపెనీ వ్యాపార హక్కులు రద్దు కావాలనీ, భారతీయ వస్తువుల మీద భారీ ఎగుమతి సుంకాల్ని తొలగించాలనీ ఆయన డిమాండు చేశాడు ఉన్నతోద్యోగాల్లో భారతీయుల ప్రవేశం, కార్యనిర్వాహక, న్యాయశాఖల విభజన, జూరీ చేత న్యాయవిచారణ, భారతీయులకు-యూరోపియన్లకు మధ్య న్యాయవిషయాల్లో సమానత మొదలైన కోర్కెల్ని ఆయన ప్రకటించాడు

రామమోహన్‌రాయ్ అంతర్జాతీయ వాది. జాతుల మధ్య సత్యతంత్ర సహకారం వర్ధిల్లాలని ఆయన వాంఛించాడు. "ఆధునిక యుగ ప్రాధాన్యాన్ని సమకాలంలో మానవ జగత్తులో గుర్తించిన ఏకైక వ్యక్తి రామమోహన్‌రాయ్ మానవ నాగరికతాదర్శం వేరుగా, స్వతంత్రంగా ఉండటంలో లేదు. విచార, కార్యరంగాలన్నింటా వ్యక్తులు, జాతులు పరస్పరం ఆధారపడి జీవించే సహోదరత్వంలో మాత్రమే ఉంది అని ఆయనకు తెలుసు" అని విశ్వకవి రవీంద్రనాథ టాగోర్ వ్యాఖ్యానించాడు. అంతర్జాతీయ సంఘటనల పట్ల ఆయన అమిత శ్రద్ధాసక్తులు ప్రదర్శించాడు ప్రపంచంలో స్వాతంత్ర్యం కోసం, ప్రజాస్వామ్యం కోసం, జాతీయవాదం కోసం ఎక్కడ ఉద్యమాలు జరిగినా ఆయన బలపర్చాడు అన్యాయం, పీడన, నిరంకుశత్వం ఏ రూపంలో జరిగినా ఆయన ప్రతిఘటించాడు. 1821లో నేపుల్సులో విప్లవం విఫలమైనప్పుడు ఆయన తీవ్ర వేదన చెంది, తన సామాజిక కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకున్నాడు 1823లో స్పానిష్ అమెరికాలో విప్లవం విజయవంతమైన సందర్భంలో ఆయన పొంగిపోయి విందు ఏర్పాటు చేశాడు. పరోక్ష భూస్వామ్య పీడకుల పాలనలో ఐర్లండ్ దుస్థితి పట్ల ఆయన తన తీవ్ర నిరసన ప్రకటించాడు. సంస్కరణ చట్టాన్ని పార్లమెంటు అంగీకరించిన పక్షంలో తాను బ్రిటిషు సామ్రాజ్యాన్ని వదిలి పెట్టి వలసపోతానని బహిరంగంగా ప్రకటించాడు.

రామమోహన్‌రాయ్ సింహంలా నిర్భయుడు. న్యాయమైన లక్ష్యాన్ని బలపర్చడానికి ఎన్నడూ వెనుకంజ వెయ్యలేదు. సమాజంలో కరుడుగట్టిన దురన్యాయానికి, అసమానతకి వ్యతిరేకంగా వ్యక్తిగత కష్టనష్టాల్ని ఖాతరు చేయకుండా జీవితాంతం పోరాడాడు సమాజ సేవే జీవితాశయంగా పెట్టుకున్న రామమోహన్‌రాయ్ తరచు తన కుటుంబంతో, ధనిక జమీందార్లతో, అధికార బలం కలిగిన మిషనరీల్తో, ఉన్నతాధికారుల్తో, విదేశ పాలకుల్తో ఘర్షణపడ్డాడు. అయినప్పటికీ ఆయన భయమన్నది ఎరుగడు. తను నిర్దేశించుకున్న బాట నుంచి వైదొలగలేదు.

19వ శతాబ్ది ప్రథమార్థంలో భారతాకాశ వథంలో ఆయన ఒక ఉజ్వల తార అయితే ఆయన ఒంటరి చుక్క కాదు. ఆయనతో పాటు సుప్రసిద్ధులైన ఆయన సహచరులు, అనుచరులు, వారసులు అనేక మంది ఉన్నారు. విద్యారంగంలో ఆయనకి డేవిడ్ హేర్, స్కాటిష్ మిషనరీ అలెగ్జాండర్ డఫ్ తోడ్పాటు అందించారు. ఆయనతో కలిసి పనిచేసిన సహచరుల్లో ద్వారకానాథ్ టాగోర్ అగ్రగణ్యుడు. ప్రసన్న కుమార్ టాగోర్, చంద్రశేఖర దేవ్, తారాచంద్ చక్రవర్తి ప్రభృతులు ఆయన అనుచరుల్లో ప్రముఖులు.

1820, 1830 ప్రాంతాల్లో బెంగాలీ మేధావి వర్గంలో ఒక అతివాద ధోరణి తలెత్తింది. రామమోహన్‌రాయ్ కన్నా కూడా వాళ్ళింకా ఆధునికులు. వాళ్ళది యువవంగ ఉద్యమం. ఆ ఉద్యమాన్ని ఉత్తేజపర్చినవాడు, దానికి నాయకుడు ఒక ఆంగ్లో-ఇండియన్ యువకుడు. అతని పేరు హెన్రీ వివియన్ దెరోజియో. అతడు 1809లో జన్మించాడు. 1826-31 సంవత్సరాల మధ్య హిందూ కళాశాలలో అధ్యాపకుడుగా పనిచేశాడు. దెరోజియో ఉజ్వల మేధాశక్తి కలవాడు. ఫ్రెంచి మహా విప్లవాదర్శాలతో ఉత్తేజితుడైనాడు. సమకాలీన అతివాద భావాలకు ప్రతినిధి వయసులో చిన్నవాడైనా, అధ్యాపకుడుగా చాలా పెద్దవాడు. అతణ్ణి ఆరాధించే అశేష శిష్యగణం ఉండేది. అతని అనుచరుల్ని దెరోజియన్లు అనే వాళ్ళు. వాళ్ళంతా ప్రచండ దేశభక్తులు దెరోజియో బహుశా ఆధునిక భారతదేశపు తొట్ట తొలి జాతీయ కవి కావచ్చు దేశమాత గతాన్ని కీర్తిస్తూ, వర్తమానానికి వేదన చెందుతూ, భవిష్యత్తు మీద ఆశలు నిలుపుకుంటూ అతడు అమోఘమైన కవితలు రాశాడు. కాని, దురదృష్ట వశాత్తు కలరా సోకి 22 సంవత్సరాల లేత వయస్సులో అస్తమించాడు. "దెరోజియన్లు బెంగాల్ ఆధునిక నాగరికతకు అగ్రగాములు మన జాతి నిర్మంధ జనకులు. వాళ్ళ గొప్ప గుణాలు ఆరాధనా భావాన్ని ఉప్పొంగజేస్తాయి. వాళ్ళ వైఫల్యాల్ని జాతి అతి సున్నితమైన మనస్సుతో మన్నిస్తుంది" అని జాతీయోద్యమ నేత సురేంద్రనాథ్ బెనర్జీ వాళ్ళని వర్ణించాడు.

ఈ లోగా బ్రహ్మ సమాజం నత్తనడక నడుస్తూ కొనసాగింది రవీంద్రనాథ్ టాగోర్ తండ్రి దేవేంద్రనాథ్ టాగోర్ మళ్ళీ దానికి జీవం పోశాడు. 1839లో ఆయన రామమోహన్‌రాయ్ భావాలను ప్రచారం చెయ్యటానికి తత్వబోధిని సభని స్థాపించాడు. రాను రాను అది రామమోహన్‌రాయ్ ప్రముఖ అనుచరుల్ని, దెరోజియో అనుయాయుల్ని, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, అక్షయ కుమారదత్తువంటి స్వతంత్ర ఆలోచనా పరుల్ని కలుపుకొంది. తత్వబోధిని సభ, తత్వబోధిని పత్రిక కలిసి బెంగాలీ భాషలో భారతదేశ గతాన్ని గురించి ఒక క్రమబద్ధమైన అధ్యయనాన్ని పెంపొందించాయి. బెంగాలీ మేధావుల్లో హేతువాద దృక్పథాన్ని వికసింపజేసింది. 1843లో దేవేంద్రనాథ్ టాగోర్ బ్రహ్మ సమాజాన్ని పునర్నిర్మాణం చేసి కొత్త ఊపిరి పోశాడు వితంతు పునర్వివాహం, బాహుభార్యత్వ నిషేధం, స్త్రీ విద్య, రైతాంగ పరిస్థితి మెరుగుదల వగైరా సమస్యల మీద ఉద్యమాల్ని బ్రహ్మ సమాజం బలపర్చింది.

రామమోహన్‌రాయ్ తరువాత భారత సామాజిక రంగంలో అవతరించిన సమున్నత మూర్తి పండిత ఈశ్వర చంద్ర విద్యాసాగర్. విద్యాసాగర్ తన యావజ్జీవితం సామాజిక సంస్కరణ లక్ష్యం కోసం అంకితం చేశాడు. ఆయన మహాపండితుడు, సంస్కర్త 1820లో ఒక నిరుపేద కుటుంబంలో పుట్టి, దుర్భర ఆర్థిక ఇబ్బందుల కోర్చి విద్యాభ్యాసం చేసి 1851 నాటికి ఒక సంస్కృత కళాశాల ప్రిన్సిపల్ పదవికి ఎదిగాడు. ఆయన సంస్కృత మహా పండితుడయినా, పాశ్చాత్య విచార ధారలో అత్యుత్తమమైన దాన్ని గ్రహించడానికి తన మనస్సు తెరిచి పెట్టుకున్నాడు. భారత, పాశ్చాత్య సంస్కృతుల మేలు కలయికకి ఆయన ప్రతీక అయ్యాడు. అన్నిటికన్నా ఆయన స్వచ్ఛమైన శీలం, ఉజ్వల మేధాసంపత్తులలో ఆయన గొప్పదనం నిక్షిప్తమైవుంది. అపార ధైర్యంతో, నిర్భయమైన మనస్సుతో ఆయన తాను నమ్మింది ఆచరణలో చేసి

చూపాడు. ఆయన సిద్ధాంతాలకి -కార్యాచరణకి, ఆలోచనకి -ఆచరణకి మధ్య అంతరం లేదు. వేషధారణలో, అలవాట్లలో ఆయన నిరాడంబరుడు. ప్రవర్తనలో సంస్కారంలో అతి సూటి వ్యక్తి. ఆయన గొప్ప మానవతా వాది. నిరుపేదలు, నిర్భాగ్యులు, పీడితుల పట్ల ఆయన సహానుభూతి అపారమైంది.

ఆయన ఉత్తమ శీలం, నైతిక గుణాలు, ప్రగాఢ మానవత్వం గురించి బెంగాల్‌లో ఈనాటికీ ప్రజలు కోకొల్లలుగా కథలు చెప్పుకుంటారు. అనుచితమైన అధికార్ల జోక్యానికి నిరసనగా ఆయన ప్రభుత్వోద్యోగాన్ని వదులుకున్నాడు. పేదలపట్ల ఆయన ఔదార్యం అనంతం. ఆయనకి ఎన్నడూ వెచ్చని కోటుంటూ వుండేదే కాదు. ఎంచేతనంటే, రోడ్డు మీద కనిపించిన మొట్టమొదటి అర్ధనగ్న దరిద్రుడికి ఆయన తన ఒంటి మీద వలువలు ఒలిచి యిచ్చేవాడు.

ఆధునిక భారత నిర్మాణానికి ఆయన చేసిన సేవ బహుముఖమైంది. సంస్కృత భాషా బోధనలో ఆయన ఒక అపూర్వ పద్ధతి కనిపెట్టాడు. ఆయన రూపొందించిన బెంగాలీ ప్రాథమిక వాచకం ఈనాటికీ వాడుకలో ఉంది. బెంగాలీ భాషలో ఆధునిక వచన శైలి వికసించడానికి ఆయన రచనలు దోహదం చేశాయి. బ్రాహ్మణేతర విద్యార్థుల కోసం ఆయన సంస్కృత కళాశాల ద్వారాలు బార్లా తెరిచాడు. సంస్కృత విద్యాభ్యాసం పురోహిత వర్గపు గుత్త హక్కు కాదని ఆయన భావించాడు. పరభాషల, విద్యల పొడ పడకుండా మడికట్టుకున్న సంస్కృత విద్యని తద్వారా కలిగే హానికర పరిణామాల నుంచి సంరక్షించటానికి పాశ్చాత్య ఆలోచనా విధాన అధ్యయన విభాగాన్ని సంస్కృత కళాశాలలో ప్రవేశపెట్టాడు. ప్రస్తుతం ఆయన పేరు పెట్టుకుని నడుస్తున్న ఒక కళాశాల స్థాపనకు ఆనాడు ఆయన విశేష కృషి చేశాడు.

వీటన్నిటికన్నా, అణగారి పోయిన భారత మహిళల్ని ఉద్ధరించటానికి ఆయన చేసిన సేవని భారత ప్రజలు కృతజ్ఞతాభావంతో సంస్మరిస్తారు. ఈ విషయంలో ఆయన రామమోహన్‌రాయ్‌కి తగిన వారసుడుగా నిరూపించుకున్నాడు. వితంతు పునర్వివాహాల కనుకూలంగా ఆయన సుదీర్ఘ పోరాటం సాగించాడు. హిందూ వితంతువుల కన్నీళ్ళు, కడగళ్ళు ఆయనలోని మానవత్వాన్ని మేల్కొల్పాయి. వాళ్ళ దుస్థితిని దూరం చెయ్యటానికి ఆయన తన సర్వస్వం ధారపోశాడు. తన ఆర్థిక వినాశనం కొని తెచ్చుకున్నాడు. తన అపార సాంప్రదాయక పాండితీ గరిమతో ఆయన 1855లో వితంతు పునర్వివాహాన్ని సమర్థిస్తూ తన బలమైన గళం విప్పాడు. ఆ ఆదర్శాని కనుకూలంగా వెంటనే ఒక పటుతర ఉద్యమం ప్రారంభమైంది. అది ఈనాటికీ ఇంకా కొనసాగుతూనే ఉంది. వితంతు పునర్వివాహాన్ని చట్టబద్ధం చెయ్యమని అభ్యర్థిస్తూ 1855లో బెంగాల్, మద్రాస్, బాంబే, నాగపూర్, ఇంకా తదితర నగరాల నుంచి అసంఖ్యాకంగా మహజర్లు సమర్పించబడ్డాయి. ఆ ఆందోళన ఫలించింది; చట్టం అమల్లోకి వచ్చింది. మన దేశంలో అగ్రవర్ణాల్లో మొట్టమొదటి హిందూ వితంతు పునర్వివాహం విద్యాసాగర్ అధ్వర్యంలో, ఆయనిచ్చిన ఉత్తేజంతో 1856 డిశంబర్ 7న కలకత్తాలో జరిగింది. ఆ వివాహ మహోత్సవాన్ని ఒక పరిశీలకుడు ఇలా వర్ణించాడు:

"ఆ రోజుని నేనెన్నడూ మరువలేను. ఒక బ్రహ్మాండమైన ఊరేగింపు అగ్రభాగాన ఈశ్వర చంద్ర విద్యాసాగరుడు తన మిత్రుడైన వరుణ్ణి వెంట బెట్టుకొని నడిచినప్పుడు, ఆ ఊరేగింపుని తిలకించడానికి తొడతొక్కిడిగా అసంఖ్యాక జనం

పోగయ్యారు. కాలు కదపటానికి జాగాలేదు. ఆ రోజుల్లో కలకత్తా వీధుల కిరువైపులా కనిపించే పెద్ద పెద్ద మురుగు కాల్వల్లో అనేక మంది పడిపోవటం చూశాను. వివాహ వేడుక ముగిశాక, ఎక్కడ విన్నా ఆ వివాహ చర్చే. బజార్లలో, దుకాణాల్లో, సందులు గొందుల్లో, చౌరాస్తాల్లో, విద్యార్థి వసతి గృహాల్లో, కులీనుల డ్రాయింగు రూముల్లో, కార్యాలయాల్లో, వాడవాడా ప్రజలు ఆ వివాహాన్ని గురించి వింతగా చెప్పుకున్నారు. ఆఖరికి, మారుమూల పల్లెటూరి గుడిసెల్లో కూడా ఆడవాళ్ళు గుసగుస లాడారు. శాంతిపూర్ చేనేత పనివాళ్ళు ఒక విచిత్రమైన చీర నేశారు. ఆ చీర అంచున 'విద్యాసాగరుడు వర్ధిల్లు గాక!' అనే పల్లవితో ప్రారంభమయ్యే ఒక నూతన గీతికని కూర్చారు."

వితంతు పునర్వివాహాన్ని సమర్థించిన నేరానికి, విద్యాసాగర్ హిందూ ఛాందసుల తీవ్ర శత్రుత్వాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. ఆయన ప్రాణానికి హాని తలపెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. కాని ఆయన తాను నమ్మినబాటని నిర్భయంగా అనుసరించాడు. తన అవిరళ కృషి ద్వారా, పేద దంపతులకు ఆర్థిక సహాయం అందించడం ద్వారా ఆయన 1855-60 సంవత్సరాల మధ్య ఇరవై వితంతు వివాహాలు జరిపించాడు.

1850లో ఆయన బాల్య వివాహాలకు వ్యతిరేకంగా తన నిరసన తెల్పాడు. బహుభార్యత్వానికి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడాడు. స్త్రీ విద్య కోసం ఎంతో శ్రమించాడు. ప్రభుత్వ స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్‌గా ఆయన సుమారు 35 బాలికా పాఠశాలల్ని పెట్టించాడు. వాటిలో ఎక్కువ భాగం ఆయన ఖర్చుమీదే నడిచాయి. బెతూన్ స్కూలు కార్యదర్శిగా ఆయన స్త్రీల ఉన్నత విద్య కోసం కృషి చేసిన ప్రప్రథముడు.

1840, 1850 ప్రాంతంలో స్త్రీ విద్య కోసం నడిచిన శక్తివంతమైన ఉద్యమం ఫలితంగా 1849లో కలకత్తాలో బెతూన్ స్కూలు ప్రారంభమైంది. అది స్త్రీ విద్యాభివృద్ధి ఉద్యమం పల్లవించిన తొలిరేకు. స్త్రీ విద్య భారతదేశానికి కొత్త కాకపోయినా, దానిపట్ల ఆనాడు చాలా వ్యతిరేకత ఉండేది. చదువుకున్న ఆడవాళ్ళు మొగుళ్ళని వదిలేస్తారట! అని కొందరు నోళ్ళు నొక్కుకున్నారు. ఆడపిల్లలను ఆధునిక విద్య ప్రసాదించే తొట్ట తొలిచర్యలు 1821లో క్రైస్తవమిషనరీలు తీసుకున్నారు. క్రైస్తవ మత విషయకమైన విద్యాబోధన జరగాలని పట్టుబట్టటంతో ఆ ప్రయత్నాలు వమ్మయి పోయాయి. బెతూన్ స్కూలుని మొట్టమొదట ప్రారంభించినప్పుడు, అభ్యర్థినులు దొరకటం కష్టమైపోయింది. అందులో చేరిన విద్యార్థినుల్ని అల్లరిపెట్టారు. వాళ్ళని కారుకూతలు కూశారు. వాళ్ళ తల్లిదండ్రుల్ని సాంఘికంగా వెలివేశారు. పాశ్చాత్య విద్య నేర్చిన వడతులు తమ భర్తల్ని బానిసలుగా చేసుకుంటారని అనేకమంది అజ్ఞానులు దురభిప్రాయపడ్డారు.

పాశ్చాత్య భావాల ప్రభావం మహారాష్ట్రలో కన్నా బెంగాల్‌లోనే ముందుగా పడింది. 1818నాటికి గాని మహారాష్ట్ర బ్రిటీషు వాళ్ళ ఆధిపత్యం కిందికి రాలేదు. 1849లో మహారాష్ట్రలో పరమహంస మండలి అనే సంస్థ ప్రారంభమైంది. ఆ సంస్థ స్థాపకులు ఒకే దేవునిలో విశ్వాసం ఉన్నవాళ్ళు. కుల నియమాల్ని ఛేదించటం వాళ్ళు తమ ప్రథమ కర్తవ్యంగా పెట్టుకున్నారు. ఆ సంస్థ సమావేశాల్లో పాల్గొనే సభ్యులంతా

క్రింది కులాలవారి చేతి వంట రుచి చూసేవాళ్ళు. 1848లో అనేకమంది విద్యావంతులైన యువకులు కలిసి విద్యార్థి సాహిత్య, విజ్ఞాన సంఘం అనే సంస్థని ప్రారంభించారు. అందులో రెండు శాఖలుండేవి. ఒకటి గుజరాతీ జ్ఞాన ప్రసారక మండలి. రెండవది మరాఠీ జ్ఞాన ప్రసారక మండలి. ఆ సంస్థ ప్రజల కుపయోగపడే విజ్ఞాన శాస్త్ర విషయాల మీద, సాంఘిక సమస్యల మీద ఉపన్యాసాలు ఏర్పాటు చేసేది. స్త్రీ విద్యాభివృద్ధి కోసం పాఠశాలలు నెలకొల్పడం ఆ సంస్థ ఆశయాల్లో ఒకటి. జోతిబాఫూలే, ఆయన సతీమణి కలిసి 1851లో పూనాలో ఒక బాలికల పాఠశాల తెరిచారు. వెనువెంటనే, మహారాష్ట్రలో అనేక బాలికా పాఠశాలలు ఏర్పాటయ్యాయి. ఈ పాఠశాలల్ని నెలకొల్పడంలో జగన్నాథ్ సర్కార్ సేత్, భౌదాజీలు అగ్రగాములు. మహారాష్ట్రలో వితంతు పునర్వివాహోద్యమంలో ఫూలే అగ్రగామి. విష్ణుశాస్త్రి పండిట్ అనే సంస్కరణాభిలాషి 1850లో వితంతు పునర్వివాహ సంస్థని స్థాపించాడు. ఈ రంగంలో మరొక ప్రముఖ కార్యకర్త, కర్సన్‌దాస్ మూల్జి. వితంతు వివాహాల్ని ప్రోత్సహించడానికిగాను ఆయన 1852లో గుజరాతీ భాషలో సత్యప్రకాశ్ అనే పత్రికని ప్రారంభించాడు.

మహారాష్ట్రలో నూతన విద్య కోసం, సాంఘిక సంస్కరణల కోసం ప్రముఖంగా నిలబడ్డ వ్యక్తి- గోపాల్ హరిదేశ్‌ముఖ్. "లోకహితవాది" అనే కలం పేరుతో ఆయన సుప్రసిద్ధుడయ్యాడు. భారతీయ సమాజం హేతువాద సూత్రాల మీద, ఆధునిక మానవతావాద, లౌకిక విలువల మీద పునర్ నిర్మాణం కావాలని ఆయన వాదించాడు. జోతిబాఫూలే తక్కువ కులంలో పుట్టినవాడు కాబట్టి మహారాష్ట్రలో బ్రాహ్మణేతరుల, అస్పృశ్యుల సాంఘిక అధోగతి ప్రత్యక్షంగా ఎరుగును. అంచేత ఆయన అగ్రవర్ణాల పెత్తనానికి, బ్రాహ్మణాధిక్యతకి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడాడు.

దాదాభాయ్ నౌరోజీ బొంబాయిలో మరొక ప్రముఖ సాంఘిక సంస్కర్త. జొరాష్ట్రియన్ మతాన్ని సంస్కరించటానికి ఒక సంస్థని స్థాపించిన వాళ్ళలో ఆయనొకరు. పార్సీ మహిళలకు చట్టబద్ధమైన హోదా, వివాహ, వారసత్వాలలో ఒకే మాదిరి నియమ నిబంధనల కోసం ఆందోళన సాగించిన పార్సీ లా అసోసియేషన్ స్థాపకుల్లో కూడా నౌరోజీ ఒకరు.

19వ శతాబ్ది ఉత్తరార్థంలో ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం పంతులుగారు స్త్రీ విద్య కోసం, వితంతు పునర్వివాహాల కోసం, సంఘంలో మూఢాచార నిర్మూలనం కోసం నిర్భయంగా పోరాడారు. ఐదారు పత్రికలు నిర్వహించారు. 1874లో వివేకవర్ధనిని స్థాపించారు. పంతులుగారి స్వీయచరిత్ర ఆధునికాంధ్ర దేశపు సంఘ సంస్కరణ చరిత్ర.

# 1857 తిరుగుబాటు

1857లో ఉత్తర, మధ్య భారతదేశంలో ఒక ప్రచండమైన ప్రజా తిరుగుబాటు విజృంభించి బ్రిటిషు పాలనని దాదాపు ఊడ్చివేసింది. మొదట సిపాయి పితూరీగా ప్రారంభమైన తిరుగుబాటు వెంటనే విశాల భూభాగాన్ని, ప్రజానీకాన్ని ముంచెత్తింది. లక్షలాది రైతాంగం, కర్మకారులు, సిపాయీలు ఏడాది పై చిలుగ్గా వీరోచితంగా పోరాడారు. తమ ధైర్య సాహసాల్తో, బలిదానంతో భారత ప్రజల ఇతిహాసంలో ఒక మహోజ్వల అధ్యాయాన్ని విరచించారు.

1857 తిరుగుబాటు కేవలం సిపాయిల అసంతృప్తి నుంచి పుట్టిన నిప్పురవ్వ మాత్రమే కాదు; కంపెనీ పరిపాలన పట్ల, విదేశ ప్రభుత్వం పట్ల ప్రజల్లో పేరుకుపోయిన అసంతృప్తి, అయిష్టతలు భగ్గున మండిన మంట. దాదాపు శతాబ్దం పై చిలుగ్గా బ్రిటిషు వాళ్ళు ఒక్కొక్క ముక్కా జయిస్తూ దేశాన్ని మొత్తం కైవసం చేసుకున్నారు. భారత సమాజంలో విభిన్న వర్గాల ప్రజల్లో పరాయిపాలనకి వ్యతిరేకంగా అసంతృప్తి, ద్వేషం పెచ్చుపెరిగిపోయాయి. ఈ పెను అసంతృప్తే ప్రచండ ప్రజా విప్లవంగా విజృంభించింది.

బ్రిటిషు వాళ్ళ ఆర్థిక దోపిడీ ప్రజల్లో అసంతృప్తి ప్రబలి పోవటానికి ప్రధాన కారణం కావచ్చు. వాళ్ళు ఈ దేశంలో అనాదిగా కొనసాగుతున్న సాంప్రదాయిక, ఆర్థిక వ్యవస్థని ఛిన్నాభిన్నం చేసివేశారు. విశాల రైతాంగాన్ని, కర్మకారుల్ని, చేతివృత్తుల వాళ్ళని, ఇంకా సాంప్రదాయక జమీందార్లని, చిన్న చిన్న ప్రభువుల్ని పిప్పిచేశారు. కంపెనీ ప్రభుత్వ తొలి పరిపాలన తాలూకు వినాశకర దుష్పరిణామాల్ని లోగడ చెప్పుకున్నాం. బ్రిటిషు వాళ్ళ భూమి, భూమిశిస్తు విధానాలూ, న్యాయవ్యవస్థ, పరిపాలన వగైరాలు తిరుగుబాటుకు తదితర సాధారణ కారణాలుగా చెప్పుకోవచ్చు. ముఖ్యంగా, భూమి మీద ఆస్తి హక్కులు కలిగిన అనేక మంది రైతులు తమ ఆస్తిపాస్తుల్ని వర్తకులకి, వడ్డీ వ్యాపారస్థులకు కట్టబెట్టి అప్పుల్లో మునిగి బికారులైపోయారు. పైపెచ్చు, సామాన్య ప్రజలు పరిపాలనా యంత్రాంగంలో దిగువస్థాయి ఉద్యోగుల్లో బలిసిపోయిన అవినీతి, లంచగొండితనాలకు బలైపోయారు. పోలీసుల్లో, ఛోటా అధికార్లలో, క్రింది కోర్టుల్లో అవినీతి భయంకరంగా ప్రబలిపోయింది. 1859లో విలియం ఎడ్వర్డ్స్ అనే ఓ బ్రిటిషు అధికారి తిరుగుబాటు కారణాల్ని చర్చిస్తూ పోలీసుల్ని "ప్రజల పాలిటి యముళ్ళు"గా వర్ణించాడు. "వాళ్ళహింస పీడనలు, అన్యాయార్జన మన ప్రభుత్వమంటే ప్రజలకు రోత పుట్టటానికి కారణ భూతమయ్యాయి" అన్నాడాయన. ఛోటా అధికార్లు రైతుల్ని, జమీందార్లని కొల్లగొట్టి డబ్బు మూట కట్టుకున్నారు. గందరగోళపు న్యాయవ్యవస్థ ధనికులు దరిద్రుల్ని అణచటానికి వీలు కల్పించింది. రోజు రోజుకి పెరిగిపోయే దారిద్ర్యపు బరువు కింద

జనంలో తెగింపు కలిగి, తమ పరిస్థితి మెరుగుపడుతుందనే ఆశతో సాధారణ తిరుగుబాటులో చేరిపోయారు.

ఉన్నత, మధ్య వర్గాల ప్రజలు ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో పరిపాలనా వ్యవస్థలో పై పదవుల కెక్కే అవకాశం లేకుండా మినహాయింపబడ్డం వల్ల బాగా దెబ్బతిన్నారు. స్వదేశ రాజ్యాలు క్రమేణా అంతరించిపోవడంతో, ఆయా ఆస్థానాల్లో ఉన్నత పదవుల్లో పనిచేసిన వాళ్ళు పదవులు కోల్పోయి బ్రతకు తెరువులేక అల్లాడిపోయారు. సాంస్కృతిక, వృత్తి విద్యల ద్వారా పొట్ట పోసుకునే కళాకారులు మొదలైన వాళ్ళు బ్రిటిషు రాజ్యంలో మట్టి గలిసిపోయారు. స్వదేశ రాజులు సాహిత్యాన్ని, కళల్ని పోషించారు. దైవజ్ఞుల్ని మత గురువుల్ని పోషించారు. ఈస్టిండియా కంపెనీ వచ్చి స్వదేశ రాజుల్ని జయించి దేశంలో రాజ్యాధికారం సంపాయించడంతో, కళలు, సాహిత్యం, శాస్త్రాల మీద ఆధారపడి జీవించేవాళ్ళ నోళ్ళలో దుమ్ముపడింది. తమ్మ యావత్ భవిష్యత్తుకి ముప్పు ముంచుకు వచ్చిందని గ్రహించిన మత గురువులు, పండితులు, మౌల్వీలు విదేశ పాలనకి వ్యతిరేకంగా ప్రజల్లో అసహ్యం పుట్టించటంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు.

బ్రిటిషు పరిపాలన పట్ల ప్రజల్లో అయిష్టత పెరగటానికి మూలకారణం అది విదేశీయం కావటమే. బ్రిటిషు వాళ్ళు ఈ దేశంలో శాశ్వత విదేశస్తులుగా మిగిలిపోయారు. వాళ్ళకి-భారతీయులకి మధ్య సామాజిక సంబంధం అనేది లేదు. వాళ్ళకి ముందు వచ్చిన విదేశ విజేతల మాదిరిగా కాకుండా, బ్రిటిషు వాళ్ళు కనీసం ఉన్నత వర్గాల భారతీయుల్తోనైనా సాంఘిక జీవనంలో కలిసిమెలిసి మెలగలేదు. వాళ్ళు జాత్యహంకారంతో ప్రవర్తిస్తూ, భారతీయుల్ని అసహ్యంగా నికృష్టంగా చూశారు. పైగా, వాళ్ళు ఈ దేశంలో స్థిరపడ్డానికిగానీ, ఈ దేశాన్ని తమ స్వస్థానం చేసుకోడానికిగానీ రాలేదు. అందినంత మట్టుకి డబ్బుమూట గట్టుకుని, ఆ ముల్లెతో సహా బ్రిటన్ తిరిగి వెళ్ళి పోవటమే వాళ్ళ ధ్యేయం. కొత్తపాలకుల మౌలికమైన ఈ విదేశ స్వభావం భారతీయులకు తెలిసిపోయింది. భారతీయులు వాళ్ళని తమ హితాభిలాషులుగా గుర్తించడానికి నిరాకరించారు. వాళ్ళ ప్రతిచర్యని అనుమానాస్పదంగా గమనించారు. ఆవిధంగా, దేశస్థులకి ఒక అస్పష్టమైన బ్రిటిషు వ్యతిరేకభావం ఏర్పడింది. ఆ భావమే లోగడ దేశంలో పలుచోట్ల ఉప్పతిల్లిన తిరుగుబాట్లలో వ్యక్తమైంది. తిరుగుబాటు సమయంలో కూడా బ్రిటిషు పాలకులకు విధేయుడుగా ఉండిపోయిన మున్షీమోహన్‌లాల్ అనే ఢిల్లీ పెద్ద మనిషి, "బ్రిటిషు పాలనలో ధనవంతులైన వాళ్ళు సైతం బ్రిటిష్ పరాజయాన్ని చూసి మనస్సులో సంబరపడిపోయా"రని తరువాత రాశాడు. భారత ప్రజలు బ్రిటిషు పాలకుల్ని "అక్రమ విదేశ కబ్జాదార్లు"గా పరిగణించారని మొయినుద్దీన్ హసన్ ఖాన్ అనే మరొక బ్రిటిషు గులాం నిష్కర్షగా చెప్పాడు.

బ్రిటిషు ఆయుధ బలం అజేయత మీద విశ్వాసం సడలింపజేసిన కొన్ని సంఘటనలు ప్రజల్లో అసంతృప్తి రగులుకొంటున్న ఇదే కాలంలో సంభవించాయి. బ్రిటిషు పాలనకు రోజులు లెక్కపెట్టే సమయం వచ్చిందని ప్రజలు అపోహపడ్డానికి ఈ సంఘటనలు దారితీసాయి. మొదటి ఆఫ్ఘన్ యుద్ధంలోను (1838-42), పంజాబు యుద్ధాల్లోను (1845-49), క్రిమియా యుద్ధంలోను (1854-56) బ్రిటిషు సైన్యం ఘోర

ఓటమి చవి చూసింది. 1855-56 సంవత్సరాల మధ్య బీహార్, బెంగాల్ సంతాల్ ఆదివాసులు గొడ్డళ్ళు, విల్లంబులు ధరించి తిరుగుబాటు జరిపి తమ ప్రాంతంలో బ్రిటిషు పాలనని తాత్కాలికంగా తుద ముట్టించారు. ఈ యుద్ధాల్లో బ్రిటీషువాళ్ళు అంతిమ విజయం సాధించినా, సంతాల్ ఆది వాసుల తిరుగుబాటుని అణచివేసినా బ్రిటిషు సైన్యం అదిలో పొందిన అపజయాలవల్ల దాన్ని ఆసియా సైన్యం కృత నిశ్చయంతో ఎదుర్కొంటే ఓడించటం కష్టమేమీ కాదనేది వెల్లడయింది. నిజానికి, బ్రిటిషు బలాన్ని తక్కువ అంచనా కట్టటం ద్వారా భారతీయులు రాజకీయ విశ్లేషణలో తీవ్ర తప్పిదం చేశారు. ఈ తప్పిదం 1857 తిరుగుబాటుకు తీవ్ర నష్టం కలిగించింది. అయితే, బ్రిటిష్ సైన్యాన్ని జయించి తీరగలమనే ఈ విశ్వాసానికి చారిత్రక ప్రాధాన్యం వుంది. ఈ అంశాన్ని మనం మరువకూడదు. పాలకుల్ని పడగొట్టాలని కోరిక ఉన్నంత మాత్రాన ప్రజలు తిరగబడరు. పడగొట్టి తీరుతామనే ఆత్మ విశ్వాసం కూడా వాళ్ళకి ఉండి తీరాలి.

1856లో డల్హౌసీ అయోధ్యని బ్రిటిష్ రాజ్యంలో కలిపేసుకున్నారు. దేశమంతటా ప్రత్యేకంగా అయోధ్య రాజ్యంలో ప్రజలంతా ఈ చర్యని గర్హించారు. ముఖ్యంగా అయోధ్యలోను, కంపెనీ సైన్యంలోను ఈ చర్య తిరుగుబాటు వాతావరణాన్ని సృష్టించింది. డల్హౌసీ దుందుడుకు పని కంపెనీ సిపాయిల్లో ఆగ్రహం రేకెత్తించింది. వాళ్ళలో చాలామంది అయోధ్యవాసులే. జాతీయభావం లోపించబట్టి, మిగతా భారతదేశాన్ని బ్రిటీషువాళ్ళు జయించటానికి ఈ సిపాయిలు తోడ్పడ్డారు. కాని వాళ్ళకి స్థానిక, ప్రాంతీయ అభిమానాలున్నాయి. కాబట్టి తమ మాతృసీమ పరాయివాళ్ళకి స్వాధీనం కావటం వాళ్ళకి బాధగా ఉంది. పైగా, అయోధ్య బ్రిటీషువాళ్ళకి స్వాధీనం కావటం వాళ్ళ డబ్బు మీద దెబ్బ తీసింది. అయోధ్యలో వాళ్ళ కుటుంబాలు సాగు చేసుకుంటున్న భూమి మీద విపరీతంగా శిస్తులు కట్టవలసి వచ్చింది.

నవాబు, అతని తాలూకాదార్ల పీడన నుంచి ప్రజల్ని విముక్తి చేసే సాకు చెప్పి డల్హౌసీ అయోధ్యని స్వాధీనం చేసుకున్నారు. కాని, బ్రిటీషు రాజ్యంలో సైతం ప్రజలకి కించిత్తు లాభం కలగలేదు. ఆ మాటకొస్తే, ప్రజలు లోగడకన్నా ఇంకా ఎక్కువ భూమి శిస్తు కక్కవలసి వచ్చింది. ఆహారం, ఇళ్ళు, పడవలు, నల్లమందు, న్యాయ విచారణ వగైరాల మీద అదనంగా పన్నులు కట్టవలసి వచ్చింది. భారత దేశంలో మిగతా ప్రాంతాల్లో మాదిరిగా రైతులు, పాత జమీందార్లు తమ భూమి, పుట్రా కొత్త జమీందార్లకి, వడ్డీ వ్యాపారస్థులకు కట్టబెట్టసాగారు. నవాబు పరిపాలనా యంత్రాంగం రద్దు కావటంతో వేల మంది ఉద్యోగాలు, బ్రతుకుతెరువు కోల్పోయారు. ప్రతి కుటుంబం నిరుద్యోగ వాతపడింది. అదే విధంగా అయోధ్య రాజసభకి, సరదార్లకి వస్తువులు వగైరా సరఫరా చేస్తూ జీవనం సాగించే వ్యాపారస్థులు, కర్మకారులు జీవనోపాధి కోల్పోయారు. బ్రిటిష్ పాలకులు వీళ్ళకెవరికీ ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించలేదు. పైగా తాలూకాదార్ల, జమీందార్ల భూములు లాక్కుంది. భూములు కోల్పోయిన ఈ తాలూకాదార్లు బ్రిటిష్ పాలనకి బద్ధ శత్రువులుగా తయారయ్యారు.

డల్హౌసీ స్వదేశ రాజ్యాల బలవంతపుటాక్రమణ స్వదేశ సంస్థానాధీశుల గుండెల్లో రైళ్ళు పరుగెత్తించింది. మానం మర్చిపోయి బ్రిటీషువాళ్ళకి గులాంగిరీ

చేస్తున్నా బ్రిటీషువాళ్ళు దురంత రాజ్య విస్తరణ దురాశ చల్లార లేదని స్వదేశ రాజులు గ్రహించారు. స్వదేశ రాజులకు వాచ్యంగా, లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను పదే పదే ఉల్లంఘించటం వల్లా, పైకి మిత్రులుగా రక్షకులుగా నటిస్తూ స్వదేశ రాజుల్ని దాసులుగా మార్చటం వల్లా బ్రిటీషు వాళ్ళ రాజకీయ ప్రతిష్ఠ ఘోరంగా దెబ్బ తింది. డల్‌హౌసీ అనుసరించిన ఈ రాజ్యవిలీన విధానం నానాసాహెబ్, ఝాన్సీరాణి, బహదూర్‌షాలు బ్రిటీషువాళ్ళకి బద్ధశత్రువులుగా మారటానికి ప్రత్యక్ష కారణమైంది. 1851లో మరణించిన రెండవ బాజీరావుకు అతడు బ్రతికివున్నంత కాలం, బ్రిటీషువాళ్ళు భరణం చెల్లించారు. కాని అతనివారసుడైన నానాసాహెబ్‌కు భరణం చెల్లించటానికి నిరాకరించారు. భర్తని కోల్పోయి, రాజ్యాన్ని తన దత్తపుత్రునికి అప్పగించాలని సంకల్పించిన అభిమానవతి ఝాన్సీ లక్ష్మీబాయిని ఝాన్సీ ఆక్రమణతో విరోధిగా చేసుకున్నారు. బహదూర్‌షా వారసుడు చరిత్రాత్మకమైన ఎర్రకోటని విడిచిపెట్టి ఢిల్లీ పరిసరాలలో కుతుబ్‌మినార్ వద్ద ఒక సామాన్య గృహంలోకి మారితేగాని వీల్లేదని 1849లో డల్‌హౌసీ ప్రకటించి, మొఘల్ వంశ ప్రతిష్ఠని మట్టి పాల్జేశాడు. బహదూర్‌షా మరణించాక, ఆయన మొఘల్ వారసు లెవరూ రాజ బిరుదం ధరించకూడదని 1856లో కానింగ్ ప్రకటించాడు. ఆ విధంగా బ్రిటిష్ పాలకులు స్వదేశ రాజులందర్నీ శత్రు శిబిరంలోకి తరిమారు.

బ్రిటీషు పాలనలో మత హాని జరుగుతుందనే భీతి ప్రజల్ని బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిప్పటంలో ప్రధాన పాత్ర వహించింది. క్రైస్తవ మిషనరీల కార్యకలాపాలే ఈ భయానికి కారణం. "పాఠశాలల్లో, వైద్యశాలల్లో, కారాగృహాల్లో, సంతవీధుల్లో - ఎక్కడ చూసినా మిషనరీలు ప్రత్యక్షమయ్యారు." భారత ప్రజల్ని క్రైస్తవ మతంలోకి మార్పించటానికి వాళ్ళు తీవ్రంగా ప్రయత్నించారు. హిందూ మతాన్ని ఇస్లాముని వాళ్ళు బహిరంగంగా దుయ్యబట్టారు. అనాదిగా అభిమానంతో ఆరాధించే, ఆచరించే ప్రజల మత సంప్రదాయాల్ని, ఆచారాల్ని వాళ్ళు బాహాటంగా ఎద్దేవ చేశారు.

మిషనరీలు చేయించే మతం మార్పిడి హిందూ, ఇస్లాం మతాలకు వాటిల్లబోయే ప్రమాదానికి సజీవ ఉదాహరణగా ప్రజలకు గోచరించింది. పరాయి ప్రభుత్వం మిషనరీల కార్యకలాపాల్ని బలపరుస్తున్నదనే ప్రజల అనుమానం కొన్ని ప్రభుత్వ చట్టాలతో, కొందరు అధికార్ల చర్యల్తో ధృవపడింది. క్రైస్తవ మతం స్వీకరించిన వ్యక్తికి అతని పూర్వీకుల ఆస్తిపాస్తులు సంక్రమించే వీలు కలగజేస్తూ 1850 లో ప్రభుత్వం ఒక చట్టం చేసింది. సైనిక పటాలాల్లో క్రైస్తవ మత బోధ చెయ్యటానికి ప్రభుత్వం సొంత ఖర్చుమీద మత గురువుల్ని నియమించింది. స్కూళ్ళలో, ఆఖరికి జైళ్ళలో సైతం క్రైస్తవమత ప్రచారాన్ని ప్రోత్సహించడం తమ విద్యుక్త ధర్మంగా బ్రిటిష్ పౌర, సైనిక అధికార్లు భావించారు. అధికార్ల ఈ మత తత్వ కార్యకలాపాలు ప్రజల్లో భీతి పుట్టించాయి. 1857లో ఆర్.డి. మేంగ్సిల్స్ పార్లమెంటు దిగువ సభలో చెప్పింది చదివాక ప్రజలు తమ భయం సకారణమైందని గ్రహించారు.

"భారతదేశంలో ఆసేతు హిమాచలం క్రీస్తు పతాకం విజయగర్వంతో రెప రెప లాడాలనే ఉద్దేశ్యంతో భగవంతుడు సువిశాల భారత సామ్రాజ్యాన్ని ఇంగ్లండుకు అప్పగించాడు. హిందూస్థాన్‌ని క్రైస్తవ సీమగా మార్చే గురుతర కర్తవ్యాన్ని ప్రతిఒక్కరూ, యావచ్ఛక్తి ఒడ్డి కొనసాగించాలి."

మత హాని గురించి ప్రజల భయాందోళనలే కాకుండా, భారతీయ సంస్కరణవాదుల సలహామీద ప్రభుత్వం తీసుకున్న కొన్ని మానవతా చర్యలు అనేకమంది హిందూ ప్రజలు సాంప్రదాయిక మతావేశాన్ని రెచ్చగొట్టాయి. ఒక పరాయి క్రైస్తవ ప్రభుత్వానికి తమ మతంలో, ఆచారాల్లో జోక్యం కల్పించుకునే హక్కు లేదని వాళ్ళు అభిప్రాయ పడ్డారు. సతీ సహగమన నిషేధం, వితంతు పునర్వివాహచట్టం, పాశ్చాత్య విద్య బోధించే బాలికా పాఠశాలల స్థాపన వంటి ప్రభుత్వ చర్యల్ని వాళ్ళు అనుచిత జోక్యంగా భావించారు. దేవాలయాలకు, మసీదులకు చెందిన భూముల మీద ప్రభుత్వం పన్నులు విధించినందుకు మత పరమైన ప్రజల మనోభావాలు గాయపడ్డాయి. దేవదాయ భూముల్ని పూర్వం స్వదేశ రాజులు పన్నులనుంచి మినహాయించారు. ఆ భూముల మీద ఆధారపడ్డ బ్రాహ్మణ, ముస్లిం కుటుంబాలు కోపంతో మండిపడిపోయాయి. భారతదేశంలోని మతాలను బ్రిటిష్ ప్రభుత్వం కించపరుస్తున్నదని వాళ్లంతా ప్రచారం లేవ దీశారు.

1857 తిరుగుబాటు కంపెనీ సిపాయిలు తిరగబడ్డంతో ప్రారంభమైంది. భారతదేశాన్ని జయించటానికి కంపెనీకి అంకితమైపోయి సేవ చేసిన సిపాయిలు హఠాత్తుగా తిరగబడ్డానికి కారణాలేమిటో మనం సమగ్రంగా విచారించాలి. ఈ సిపాయిలు భారత సమాజంలో ఒక భాగమే నన్న అంశాన్ని ఈ సందర్భంలో మొట్ట మొదట గుర్తుంచుకోవాలి. కాబట్టి, తతిమ్మా దేశస్థులంతా ఏ సంవేదనలు పొందారో, ఏ బాధలు అనుభవించారో సిపాయిలూ కొంత మేరకి అదే విధంగా అనుభూతులూ, అనుభవాలూ పొందారు. సమాజంలోని ఇతర వర్గాల ఆశలు, ఆకాంక్షలు, ఆశాభంగాలు వీళ్ళలోనూ ప్రతిఫలించాయి. బ్రిటిష్ పాలన వినాశకర ఆర్థిక దుష్పరిణామాల కారణంగా వాళ్ళ సన్నిహితులు, ఆత్మీయులు కడగండ్ల పాలయితే, ఆ బాధ సిపాయిల్ని తాకింది. బ్రిటీషు వాళ్ళు తమ మత విషయాలలో అనుచిత జోక్యం పెట్టు కొంటున్నారనే సాధారణ జనాభిప్రాయాన్ని సిపాయిలూ పంచుకున్నారు. వాళ్ళ స్వీయానుభవమే వాళ్ళని ఆ నమ్మకానికి ఆయత్తపర్చింది. సైన్యం ప్రభుత్వ ఖర్చుమీద క్రైస్తవ మత గురువుల్ని, ప్రచారకుల్ని పోషిస్తున్న వాస్తవాన్ని వాళ్ళు ప్రత్యక్షంగా చూస్తున్నారు. మతతత్వ ఉత్సాహం పట్టలేని సైనికాధికార్లు కొందరు స్వయంగా సిపాయిల్లో క్రైస్తవమత ప్రచారం చేశారు. కుల, మత విషయాల్లో సిపాయిలు ప్రభుత్వం మీద గుర్రుగా ఉన్నారు. కులం, మతం సూచించే నామాలు, బొట్లు, గడ్డాలు, తల పాగాలు వగైరాలు సిపాయిలిక ముందు ధరించరాదని ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొత్తగా సైన్యంలో చేరే ప్రతి ఒక్క సిపాయి అవసర సమయంలో తాను సముద్రాంతర సీమల్లో సైతం పని చేస్తానని హామీ ఇవ్వాలని 1856లో ఒక కొత్త చట్టం అమల్లోకి వచ్చింది. ఇవన్నీ సిపాయిల మనో భావాల్ని గాయపర్చాయి. ఆనాడు హిందూ మత విశ్వాసం ప్రకారం సముద్ర యానం నిషిద్ధం. ఆ నియమాన్ని ఉల్లంఘించిన వ్యక్తి కుల భ్రష్టుడవుతాడు.


తమ పైవాళ్ల మీద సిపాయిల కింకా చాలా ఫిర్యాదులున్నాయి. బ్రిటీషు అధికార్లు ఈ సిపాయిల్ని హీనంగా చూసేవాళ్ళు. "అధికార్లు, జవాన్లు పరస్పరం మిత్రులుగా మెలిగేవాళ్ళు కాదు. వాళ్ళు ఒకరికొకరు అపరిచితులు. సిపాయంటే అల్పజీవి, హీన మానవుడు. అధికార్లు అతణ్ణి బండ బూతులు కూస్తారు. బూతు కూతలతో

తంటారు. "ఏయ్,పందీ!" అని కేకేస్తారు. యువ అధికార్లయితే అతణ్ణి హీన మృగంలా చూస్తారు........". భారత సిపాయి బ్రిటిషు సిపాయికి సమ వుజ్జీ అయినా, అతనికిచ్చే జీత భత్యాలు చాలా తక్కువ. ఆహారం, వసతి అతి హీనం. ఇక పైకి పోయే అవకాశాలు మృగ్యం. సుబేదారు పదవికి మించి భారతీయులకు పై హోదా పొందే అర్హత లేదు. సుబేదారు జీతం అంతా కలిసి నెలకి 60-70 రూపాయలు. సిపాయి బ్రతుకు చాలా కఠోరమైంది. కాబట్టి బలవంతంగా రుద్దిన ఈ కృత్రిమ అధమ స్థాయి పట్ల సిపాయికి రోత పుట్టింది. బ్రిటిషు చరిత్ర కారుడు టి. ఆర్. హొమ్స్ స్వదేశ సిపాయి హీన స్థితిని ఇలా వర్ణించాడు:

"హైదరంతటి అద్భుత సైనిక ప్రతిభ కనబరచినా, ఇంగ్లీషు సుబేదారు జీతం అందుకోలేనని స్వదేశ సిపాయికి తెలుసు. ముప్పయ్యేళ్ళు విశ్వాసంగా సేవచేసి ఆ పదవికి ఎదిగినా కూడా, ఇంగ్లండ్ నుంచి కొత్తగా దిగిన సామాన్య సిపాయి జులుం నుంచి అది అతణ్ణి రక్షించలేదు."

సిపాయిల అసంతృప్తికి తక్షణ కారణం వేరే వుంది. సింధ్‌లో గానీ, పంజాబ్‌లో గానీ పని చేసేప్పుడు ఇచ్చేటటువంటి బత్తాని రద్దు చేస్తూ కొత్త ఉత్తర్వులు జారీ అయ్యాయి. చాలా మంది సిపాయిల జీతాల్లో కోతపడింది. వీటన్నిటికీ తోడు, అత్యధిక సిపాయిల జన్మభూమి అయోధ్యని బ్రిటిషువాళ్ళు అక్రమంగా స్వాధీనం చేసుకోవటంతో వాళ్ళ గుండెలు రగిలాయి.

సిపాయిల అసంతృప్తికి చాలా పెద్ద కథ వుంది. అది ఈనాటిది కాదు. ఎన్నడో 1764 లో బెంగాల్‌లో సిపాయి తిరుగుబాటు జరిగింది. ఫిరంగి మూతులకు కట్టి 30 మంది సిపాయిల్ని పేల్చి పారేసి బ్రిటిషు వాళ్ళు ఆ తిరుగుబాటుని క్రూరంగా అణచివేశారు. 1806లో వెల్లూరులో సిపాయిలు తిరగబడ్డారు. బ్రిటిషు వాళ్ళ పైశాచిక హింసాకాండకి అది నేలమట్టమైంది. 1824లో బారక్‌పూర్‌లోని 47వ రెజిమెంటుకి



తిరుగుబాటు చేసిన సిపాయిలను ఫిరంగి (తుపాకి)తో తునాతునకలు చేయడం.
తిరుగుబాటు కాలంలో ఆంగ్లేయులు ఈ అణచివేత పద్ధతిని ఎక్కువగా పాటించారు.

చెందిన సిపాయిలు సముద్ర మార్గాన బర్మాకు వెళ్ళటానికి నిరాకరించారు. ఫలితంగా ఆ రెజిమెంటు రద్దయింది బ్రిటిష్ ఫిరంగిదళం నిరాయుధులైన సిపాయిల్ని కాల్చి చంపింది సిపాయి నాయకుల్ని ఉరి తీశారు 1844లో జీతభత్యాల సమస్యపైన ఏడు సిపాయి పటాలాలు తిరుగుబాటు చేశాయి ఆఫ్గన్ యుద్ధ సమయంలో సిపాయిలు తిరగబడ్డానికి సిద్ధమయ్యారు సైన్యంలో అసంతృప్తి రెచ్చగొట్టారనే నేరం మోపి ఒక హిందూ సుబేదారుని, ఒక ముస్లిం సుబేదారుని కాల్చి చంపారు భారత ప్రజల్లోను, కంపెనీ సైన్యంలో పని చేసే స్వదేశ సిపాయిల్లోను విదేశ పాలనపట్ల తీవ్ర అయిష్టత, అసహ్యం విస్తృతంగా అల్లుకు పోయాయి బ్రిటిష్ పాలన పట్ల సిపాయిల్లో వ్యాపించిన ఈ వ్యతిరేక భావాన్ని సయ్యద్ అహమద్‌ఖాన్ "భారత తిరుగు బాటుకి కారణాలు" అన్న పుస్తకంలో ఇలా వర్ణించాడు:

"తమని హీనస్థితికి దిగజార్చి నాశనం చెయ్యటానికి, తమని తమ దేశస్థుల్ని స్వమత హీనులుగా మార్చటానికి ప్రభుత్వం ఈ చట్టాలన్నీ చేస్తున్నదనే భావనకు భారతీయులు అలవాటు పడిపోయారు. బ్రిటిషు ప్రభుత్వాన్ని ప్రజలంతా తమని నెమ్మదిగా ప్రాణం తీసే విషంగా, ఇసుకమోకుగా, కుటిలాగ్ని జ్వాలగా పరిగణించే సమయం చివరికి ఆసన్నమైంది. ఈ రోజు ప్రభుత్వపు ఉచ్చునుంచి తప్పించుకున్నా, రేపయినా ఆ ఉచ్చులో పడక తప్పదు. రేపు తప్పించుకున్నా ఆ మర్నాడయినా తాము ఆ ఉచ్చులో బిగిసి పోతాం అనే ఆలోచన వాళ్ళని వెంటాడ సాగింది ప్రభుత్వం మారాలని ప్రజలు ఆకాంక్షించారు బ్రిటిషు ప్రభుత్వాన్ని తోసివేసి మరొక ప్రభుత్వం వస్తుందనే భావమే వాళ్ళని ఆనంద వివశుల్ని చేసింది."

అదే విధంగా, ఢిల్లీ తిరుగుబాటుదార్ల ప్రకటన ఇలా ఫిర్యాదు చేసింది:

"బ్రిటిషు వాళ్ళు భారతదేశంలో 200 రూపాయలు వసూలు చేసే చోట 300లు వసూలు చేశారు 400 కట్టించుకునే చోట 500 కట్టించుకున్నారు. అయినా వాళ్ళు తీరని దాహంతో తమ డిమాండ్లని పెంచుకుంటూ పోతూనే ఉన్నారు. ప్రజలు నాశనమై పోయి వీధుల్లో అడుక్కు తినాలి. చౌకీదారీ పన్నుని పదింతలు పెంచేసి ప్రజల్ని సర్వనాశనం చెయ్యాలనుకున్నారు. మర్యాదస్తులకు, విద్యాధికులకు వృత్తులు పోయాయి. కనీస జీవితావసరాలకు నోచుకోని జనం లక్షోపలక్షలయ్యారు. ఉద్యోగం కోసం, ఉపాధికోసం ఒక జిల్లానుంచి మరొక జిల్లాకి ప్రయాణం కట్టిన అభాగ్యుడి మీద ఆరు పైసల రహదారి పన్ను రుద్దారు. ప్రతి ఒక్క బండికి నాలుగణాలనుంచి ఎనిమిదణాల దాకా రహదారి సుంకం విధించారు. ఆ పన్ను చెల్లించగలవాడికే పబ్లిక్ రోడ్డుమీద నడిచే హక్కు ఈ క్రూర నిరంకుశుల పీడనని ఇంకా ఎంతని ఏకరువుపెట్టగలం! ఆఖరికి ఈ దేశస్థుల్లో ప్రతి ఒక్కని మతాన్ని ధ్వంసం చేసే కిరాతకానికి ఈ ప్రభుత్వం ఒడిగట్టింది.

బ్రిటిషు విధానాలకు, సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ప్రజల్లో పెల్లుబికిన అసంతృప్తికి పరాకాష్టగా 1857 తిరుగుబాటు ప్రజ్వరిల్లింది. అది అకస్మాత్తుగా సంభవించిన సంఘటన కాదు. దీర్ఘకాలంగా ప్రజల మనస్సుల్లో అసంతృప్తి గూడు కట్టింది. తెలివిగల బ్రిటిషు అధికార్లు అనేకమంది పరిస్థితుల్ని గ్రహించారు. తీవ్ర హెచ్చరికలు చేశారు. 1757లో బ్రిటిష్ వాళ్ళ అధికారం మొట్టమొదట పాదుకొన్న ప్పట్నుంచి పరంపరగా జరిగిన తిరుగుబాట్ల తోరణమే రానున్న తుఫానుకు

కచ్చితమైన సంకేతం. అటువంటి వందలాది తిరుగుబాట్లని చరిత్రకారులు నమోదు చేశారు. కచ్ తిరుగుబాటు, 1831 కోల్ తిరుగుబాటు, 1855 సంతాల్ తిరుగుబాటు వాట్లలో చెప్పుకోదగ్గవి. కచ్‌తిరుగుబాటు 1816 నుంచి 1832 వరకి ఏదో ఒక రూపంలో పదహారేళ్ళపాటు కొనసాగింది. ఛోటా నాగపూర్‌కి చెందిన కోల్ ఆదివాసులు బైటి వాళ్ళని తమ నేలమీద వడ్డీ వ్యాపారస్థులుగా, భూకామందులుగా దింపినందుకు బ్రిటీషు వాళ్ళకి వ్యతిరేకంగా తిరగబడ్డారు. సంతాల్ గిరిజనులు వడ్డీ వ్యాపారస్థుల దోపిడీకి, వాళ్ళని కాపాడే కంపెనీ అధికార్లకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. వేలాది ఆదివాసులు ఒక్క మనిషై తిరగబడి, భగల్పూర్-రాజ్‌మహల్ పట్టణాల మధ్య ఉన్న గిరిజన ప్రాంతంలో స్వతంత్ర ప్రభుత్వాన్ని ప్రకటించారు. బ్రిటీషువాళ్ళు సంతాల్ ఆదివాసుల తిరుగుబాటుని 1856లో అణచి వేశారు.

***తక్షణ కారణం:*** 1857 నాటికి విశాల ప్రజా విజృంభణకి సామగ్రి యావత్తు సిద్ధంగా ఉంది భగ్గున మండటానికి ఒక్క నిప్పు నెరసు చాలు. గుండెల్లో గూడు కట్టుకున్న అసంతృప్తి ఉప్పెనలా విరుచుకు పడటానికి ఒక తక్షణ ప్రేరేపణ కావాలి. పంది కొవ్వు, ఆవు కొవ్వు పూసిన తుపాకీ తూటాల ఉదంతం దూది గుట్టలో నిప్పు నెరసులా పడింది. సిపాయిలు చెలరేగారు. జనం తిరగబడ్డానికి సందర్భం కలిసివచ్చింది. బ్రిటీషువాళ్ళు అప్పుడే కొత్త బారుతుపాకులు (Enfield Rifles) ప్రవేశపెట్టారు. వాటి తూటాలకు కొవ్వు పూసిన కాగితం అంటించి వుండేది. సిపాయిలు ఆ తూటాల చివరను కొరికి తుపాకీలలో పెట్టాల్సి వచ్చింది. ఆ తూటాలపైన ఆవు కొవ్వు, పంది కొవ్వు పూసినట్లు సిపాయిలకు తెలిసిపోయింది. ఆవు హిందువులకు పవిత్రం. పంది ముస్లిములకు నిషేధం. హిందూ, ముస్లిం సిపాయిలుభయులూ రెచ్చిపోయారు. ఈ తూటాలు తమ మతాలకే ముప్పు తెచ్చి పెట్టాయని వాళ్ళు నమ్మారు. ప్రభుత్వం బుద్ధి పూర్వకంగా తమ మతాన్ని బుగ్గి చెయ్యటానికి పూనుకున్నదనే నమ్మకం వాళ్ళలో గట్టిపడింది. తిరగబడ్డానికి సమయం వచ్చింది.

**తిరుగుబాటు ఆరంభం:** 1857 తిరుగుబాటు ఒక పథకం పాడూ లేకుండా హఠాత్తుగా సంభవించిందా లేక ఒక రహస్య సంస్థ అతి జాగరూకతతో రూపొందించిన కార్య ప్రణాళికా ఫలితంగా ప్రజ్వరిల్లిందా అనేది ఇంకా నిర్ధారణగా తెలీదు. ఈ తిరుగుబాటు చరిత్రకి సంబంధించిన అధ్యయనం యావతు బ్రిటీషు రికార్డుల మీద సొంతం ఆధారపడి కొనసాగించవలసిరావటం ఒక అసాధారణమైన అంశం. తిరుగుబాటుదార్లు యే ఛోగట్టా మిగిల్చిపోలేదు. బహుశా వాళ్ళు చట్టవ్యతిరేకంగా పనిచెయ్యటంవల్ల యే రికార్డులూ తయారు చెయ్యలేదేమో! పైగా, వాళ్ళు ఓడిపోయి ప్రాణాలు ఒడ్డారు. కాబట్టి తిరుగుబాటు గురించి వాళ్ళ వివరణ వాళ్ళతో పాటే అంతరించిపోయింది. తిరుగుబాటు ముగిసిన కొన్ని సంవత్సరాల తరువాత, దానికి సంబంధించిన అనుకూల సమాచారాన్ని బ్రిటీషువాళ్ళు అణచిపెట్టారు. ఎవరైనా తమ తరఫు కథ వినిపించటానికి ప్రయత్నిస్తే, బ్రిటీషు పాలకులు వాళ్ళకి వ్యతిరేకంగా తీవ్ర చర్యలు తీసుకున్నారు.

తిరుగుబాటు గురించి చరిత్రకారుల్లో విభిన్నాభిప్రాయాలు ఉన్నాయి. బహు మెళుకువతో రూపొందించిన బహుళ వ్యాప్తమైన తిరుగుబాటుగా దీన్ని ఒక వర్గం చరిత్రకారులు వర్ణించారు. రహస్య సంకేతాలు పెట్టి పంపిన చపాతీలు, ఎర్రకలువల

గురించి, దిమ్మర్లుగా తిరిగే సన్యాసులు, ఫకీర్లు, మాదరీలు గురించి వాళ్ళు ప్రస్తావించారు. అనేక భారత సిపాయి పటాలాలు ఒక రహస్య సంస్థగా కూడి 1857 మే 31న సిపాయిలు యావన్మంది తిరుగుబాటు చెయ్యాలని నిర్ణయించుకున్నట్లు వాళ్ళు వాదిస్తారు. నానాసాహెబ్ ఫడ్నవీస్, ఫైజాబాద్‌కు చెందిన మౌల్వీ అహ్మదుల్లా ఈ కుట్రలో నాయకత్వ పాత్ర నిర్వహించారని వాళ్ళ కథనం. తిరుగుబాటుకు ముందు ఏ సన్నాహాలూ జరగలేదని మిగిలిన చరిత్రకారులు గట్టిగా వాదించారు. కుట్రని పకడ్బందీగా రూపొందించినట్లుగా సూచించే ఆనవాలు కూడా తిరుగుబాటుకు ముందుగానీ, తరువాతగానీ దొరకలేదని వీళ్ళు వాదించారు. అట్లాంటి కుట్ర ఒకటి ముందుగా జరిగిందని చెప్పే సాక్షి ఒక్కడైనా ముందుకు రాలేదనే వాస్తవాన్ని వీళ్ళు ప్రముఖంగా ఎత్తి చూపారు. నిజం ఈ పరస్పర పూర్తి విరుద్ధ కథనాలకు మధ్యస్థంగా ఉండి ఉంటుంది. తిరుగుబాటు చెయ్యటానికి పథకం రూపొందింది. కాని దానికి సంబంధించిన సంస్థా నిర్మాణం చాలినంతగా ముందుకు పోక మునుపే తిరుగుబాటు కాకతాళీయంగా సంభవించినట్లు తోస్తుంది.

1857 మే 10 న ఢిల్లీకి 36 మైళ్ళ దూరాన మీరట్‌లో తిరుగుబాటు రెక్కవిప్పింది. పెనువేగంతో బలంపుంజుకొని ఉత్తర హిందూస్థానంలో ఆ చివరనుండి ఈ చివరికి కత్తివేటు వేసింది. ఉత్తరాన పంజాబు మొదలు దక్షిణాన నర్మదా నది వరకు, తూర్పున బీహారు వరకు, పశ్చిమాన రాజస్థాన్ వరకుగల విశాల భూభాగంలో అది సుడిగాలై వీచింది.

మీరట్‌లో తిరుగుబాటు చెలరేగకముందే, బారక్‌పూర్‌లో మంగళ్‌పాండే మృతవీరుడయ్యాడు. ఒంటరిగా తన పైఅధికార్లపైన తిరగబడి దాడిచేసిన కారణంగా యువసైనికుడు మంగళ్‌పాండేని బ్రిటీషు వాళ్ళు 1857 మార్చి 29న ఉరితీశారు. ఇట్లాంటివే ఇంకా ఎన్నో సంఘటనలు సిపాయిల్లో రాజుకుంటున్న అసంతృప్తికి, తిరుగుబాటు తత్వానికి సంకేతాలు. వీటి తర్వాత అసలు సంఘటన మీరట్‌లో పేలింది. ఏప్రిల్ 24న మూడవ దేశీయ అశ్వికదళానికి చెందిన 90 మంది జవాన్లు క్రొవ్వుపూసిన తూటాల్ని తాకటానికి నిరాకరించారు. మే 9న ఆ 90 మందిలో 85 గురు ఉద్యోగాలనుంచి బర్తరఫ్ అయ్యారు. బేడీలువేసి పది సంవత్సరాల కఠిన కారాగారవాస శిక్ష విధించారు. మీరట్‌లో మజిలీచేసిన సిపాయిల్లో ఇది తిరుగుబాటు రేపింది. ఆ మర్రోజు, అంటే మే 10 న మీరట్ సిపాయిలు తిరగబడి తమ కామ్రేడ్లని జైలునుంచి విడుదల చేశారు. అధికార్లని వధించారు. తిరుగుబాటుబావుటా ఎగురవేశారు. ఏదో సూదంటురాయిచేత ఆకర్షితులైనట్లుగా సూర్యాస్తమయం తరువాత వాళ్ళు ఢిల్లీ వేపు పురోగమించారు. మర్రోజు ఉదయం మీరట్ సోదరులు ఢిల్లీలో ప్రత్యక్షం కాగానే స్థానిక పదాతిదళం వాళ్ళతో చేరిపోయింది. వెంటనే తెల్ల అధికారుల్ని తెగటార్చివేశారు. నగరాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఏళ్ళు ముదిరిన, కీళ్ళు సడలిన బహదూర్‌షాని భారత చక్రవర్తిగా ప్రకటించారు. ఈ మహోద్భుతమైన తిరుగుబాటుకి ఢిల్లీ కేంద్రం కానున్నది. బహదూర్‌షా దానికి ప్రతీక కానున్నాడు. ఈ చిట్టచివరి మొఘల్ పాదుషాని అప్పటికప్పుడు చక్రవర్తిగా చేశారంటే, మొఘలుల సుదీర్ఘ ప్రభుత్వ భారత రాజకీయ సమైక్యతకి సాంప్రదాయిక ప్రతీక అన్న వాస్తవానికి అర్పించిన నివాళి. ఈ ఒక్క చర్యతో సిపాయిలు సైనిక తిరుగుబాటుని విప్లవ సమరంగా మార్చివేశారు. ఆ

కారణంగానే దేశం నల్లదలనుంచి సిపాయిలు యావన్మంది అమాంతం ఢిల్లీ దిక్కుగా అడుగు కదిపారు. తిరుగుబాటులో భుజం భుజం కలిపిన సమస్త స్వదేశ ప్రభువులు మొఘల్ చక్రవర్తికి తమ విధేయత ప్రకటించటానికి బారుతీరారు. బహదూర్‌షా సిపాయిల ప్రేరేపణతో, ఒత్తిడితో స్వదేశ రాజ్యాల సమాఖ్యని ఏర్పాటు చేసి బ్రిటీషు ప్రభుత్వంతో పోరాడ్డానికి, దాన్ని గద్దె దింపటానికి సమాయత్తం కండని స్వదేశ ప్రభువులందరికీ విజ్ఞప్తి పంపాడు.

యావత్తు బెంగాల్ సైన్యం తిరుగుబాటు చేసింది. అది వెనువెంటనే పెనుగాలై వ్యాపించింది. అయోధ్య, రోహిల్‌ఖండ్, బుందేల్‌ఖండ్, మధ్యభారత్, బీహార్, తూర్పు పంజాబులు బ్రిటీషు అధిపత్యాన్ని యాడ్చి కొట్టాయి. కాని, చాలా స్వదేశ సంస్థానాలలో ప్రభువులు బ్రిటిష్ సార్వభౌమత్వానికి విధేయులుగానే ఉండిపోయారు. అయితే వాళ్ళ సైనిక బలగాలు బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాయి. లేదా తిరుగుబాటుకి సమాయత్తమయ్యాయి. గ్వాలియర్ సైన్యంలో 20 వేలమంది సైనికులు తాంతియాతోపే, ఝాన్సీరాణీల పక్షాన చేరిపోయారు. రాజస్థాన్, మహారాష్ట్రలలో ప్రజల పత్తాసుతో ఛోటా ప్రభువులు తిరుగు బాటు ధ్వజమెత్తారు. హైదరాబాద్, బెంగాల్‌లో స్థానిక తిరుగుబాట్లు తలెత్తాయి.


తిరుగుబాటు యొక్క ప్రచండమైన ఎనురుకు, ఎరివికి దీటుగా అది ప్రజాసామాన్యంలోకి విస్తృతంగా చొచ్చుకు పోయింది. ఉత్తర, మధ్యభారతంలో ప్రతిచోటా సిపాయిల తిరుగుబాట్లని వెన్నంటి ప్రజల తిరుగుబాట్లు చెలరేగాయి. భారత సిపాయిలు బ్రిటీషు అధికారాన్ని బద్దలుకొట్టిన తక్షణం సామాన్య ప్రజలు సాయుధులై విజృంభించారు. అనేకచోట్ల సిపాయిలకన్నా ముందుగా ప్రజలే ఆయుధాలు ధరించి తిరగబడ్డారు. సిపాయి పటాలాలు లేని చోట్ల కూడా ప్రజలు పరాయి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధిక్కారం వ్యక్తం చేశారు. రైతాంగం, చేతివృత్తులు చేసుకునేవాళ్ళు ఒక్కుమ్మడిగా తిరుగుబాటులో చేరిపోవడంవల్ల, దానికి నిజమైన ప్రజాబలం చేకూరింది. అది ప్రజా విప్లవ స్వభావం సంతరించుకుంది. ముఖ్యంగా ఇప్పటి ఉత్తరప్రదేశ్, బీహార్‌లకు చెందిన ప్రాంతాల్లో రైతులు, పాత జమీందార్లు, వడ్డీ వ్యాపారస్థుల పైనా, కొత్త జమీందార్లపైనా తీవ్రంగా దాడులుచేసి తమ కసి తీర్చుకున్నారు. తిరుగుబాటు పుణ్యమా అని వాళ్ళు వడ్డీ వ్యాపారస్థుల చిట్టా అవర్జాల్ని, ప్రామిసరీ నోట్లని, ధ్వంసం చేశారు. బ్రిటీషు ప్రభుత్వం నెలకొల్పిన న్యాయస్థానాలను, తహశీలు కచేరీలను, ఠాణాలను, రెవెన్యూ రికార్డులను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో, యుద్ధాల్లో సిపాయిలకంటే సామాన్య ప్రజలే ఎక్కువ సంఖ్యలో పాల్గొనడం గమనార్హం. ఉదాహరణకు - అయోధ్యలో బ్రిటీషు సైన్యాలతో తలపడి నేల కొరిగిన లక్షా యాభై వేల మందిలో లక్షమందికి పైగా సాధారణ పౌరులు.

ప్రజలు తిరుగుబాటులో ప్రత్యక్షంగా పాల్గొనని ప్రాంతాలలో సైతం, వాళ్ళు తిరుగుబాటుదార్ల పట్ల ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. తిరుగుబాటుదార్లు విజయం సాధిస్తొంటే ఆ ప్రజలు హర్షంతో పులకించిపోయారు. తిరుగుబాటులో చేరకుండా, పరాయి సర్కారుకింద గులాములుగా పనిచేసే సిపాయిల్ని ప్రజలు సాంఘికంగా వెలివేశారు. బ్రిటీషు సైనిక బలాలపట్ల క్రియాశీల శత్రుత్వం ప్రదర్శించారు. వాళ్ళకి సమాచారం ఇవ్వటానికిగాని, స్వల్పసహాయం

చెయ్యటానికిగాని ప్రజలు నిరాకరించారు. తప్పుడు సమాచారం ఇచ్చి శత్రువుని బోల్తా కొట్టించిన సందర్భాలు చాలా ఉన్నాయి. 1858, 1859 సంవత్సరాల్లో భారత దేశంలో పర్యటించిన లండన్ టైమ్స్ విలేఖరి W.H. రస్సెల్ ఇలా రాశాడు:

"తెల్లవాడు ఎక్కి వెళ్ళే వాహనం వేపు స్నేహ పూర్వకంగా చూసిన మనిషిలేడు... ఓహ్! ఆ కళ్ళలో ఏమా భాష? ఆ చూపుల్లో భావాన్ని చదవలేని వాడెవడు? తప్పుగా వ్యాఖ్యానించగలిగేవాడెవడు? మనజాతి అంటే కనీసం భయపడేవాళ్ళు అట్టే లేరు సరిగదా, పైగా అందరూ మనల్ని అసహ్యించుకుంటారని ఆ చూపుల్లో నేను గ్రహించాను."

1857 తిరుగుబాటు యొక్క ప్రజాస్వభావం - బ్రిటీషు ప్రభుత్వం ఆ తిరుగుబాటును అణచినప్పుడు స్పష్టంగా వెల్లడయింది. తిరగబడ్డ సిపాయి మూకల్ని నిర్దాక్షిణ్యంగా అణచటానికి మాత్రమే కాకుండా, ఢిల్లీ, అయోధ్య, వాయవ్యరాష్ట్రం, ఆగ్రా, మధ్యభారత్, పశ్చిమ బీహార్‌లలో ప్రజలకు వ్యతిరేకంగా భీషణ యుద్ధాలు చెయ్యవలసి వచ్చింది. బ్రిటీషు మూకలు గ్రామాలకు గ్రామాలు తగులబెట్టారు. జనాన్ని ఊచకోత కోశారు. ప్రజల్ని ఖైదీలు చెయ్యటానికి బహిరంగంగా ఉరితీశారు. విచారణ లేకుండా పల్లెల్ని వధించారు. ఈ ప్రాంతాల్లో తిరుగుబాటు ఎటువంటి లోతులు ముట్టిందో, ఈ బ్రిటీషు పాశవిక హత్య, దహన కాండలే వెల్లడి చేస్తాయి. సిపాయిలుగాని, ప్రజాసామాన్యంగాని తమ ఆఖరి నెత్తురు బొట్టుదాకా వీరోచితంగా పోరాడారు. చివరికి వాళ్ళు ఓడిపోయారు. కాని ఆ పోరాట పటిమ,



బ్రిటీషు సిపాయిలచే ఉరితీయబడుతున్న భారతీయ విప్లవకారులు

చైతన్యం చెక్కుచెదరకుండా నిలిచాయి. "అది సిపాయి పితూరీ కాదు; తిరుగుబాటు; విప్లవం; దాన్ని అర్పివేయటానికి పడినపాట్లు, అణుమాత్రం ఫలించలేదంటేనే దాని విప్లవ స్వభావం రుజువవుతుంది," అని వ్యాఖ్యానించాడు రివరెండ్ డఫ్. బ్రిటీషువాళ్ళు ఆనాడు భారతదేశాన్ని తిరిగి జయించవలసివచ్చింది అని రాశాడు లండన్ టైమ్స్‌విలేఖరి.

1857 తిరుగుబాటు పటుత్వం హిందూ - ముస్లిం ఐక్యతలో ఉంది. సిపాయిల్లోగాని, సామాన్య ప్రజల్లోగాని హిందూ - ముస్లిముల మధ్య సంపూర్ణ సహకారం ఏలసిల్లింది. తిరుగుబాటుదార్లు యావన్మంది ముస్లిం బహదూర్‌షాను తమ చక్రవర్తిగా ఆమోదించారు. హిందూ - ముస్లిం తిరుగుబాటుదార్లు తమ మత విశ్వాసాలను పరస్పరం గౌరవించుకున్నారు. ఉదాహరణకి, తిరుగుబాటు జయప్రదమైన ప్రతిచోటా గోవధని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. హిందువుల మనోభావాలపట్ల గల గౌరవానికి సూచనగా ఆ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నాయకత్వం తాలూకు వివిధ అంతస్థుల్లో హిందూ - ముస్లింలకు సమాన ప్రాతినిధ్యం అమలు జరిపారు. తిరుగుబాటులో హిందూ - ముస్లిం ఐక్యత నిర్వహించిన పాత్రని ఒక సీనియర్ బ్రిటీషు అధికారి పరోక్షంగా అంగీకరించాడు. "ఈ సందర్భంలో మాత్రం హిందువులకు వ్యతిరేకంగా ముస్లింను రెచ్చగొట్టలేకపోయాం" అని ఆయన వాపోయాడు.

మధ్యయుగంలో గానీ, 1858కి ముందుగానీ భారత ప్రజలు, భారతదేశ రాజకీయాలు మౌలికంగా మతతత్వపూరితమైనవి కాదనే వాస్తవాన్ని 1857లో జరిగిన సంఘటనలు స్పష్టంగా వెల్లడించాయి.

1857 తిరుగుబాటుకు ఢిల్లీ, కాన్పూర్, లక్నో, బెరెల్లీ, ఝాన్సీ, బీహార్‌లోని అరా ప్రధాన కేంద్రాలు. ఢిల్లీలో తిరుగుబాటకు నామమాత్రపు సంకేతపరమైన నాయకత్వం బహదూర్‌షా చక్రవర్తిది. అసలు నాయకత్వం జనరల్ భక్త్‌ఖాన్ అనే సేనాని ఆధ్వర్యంలో ఏర్పాటయిన ఒక సైనిక మండలి చేతుల్లో ఉంది. భక్త్‌ఖాన్ బెరెల్లీ సైనిక పటాలాన్ని తిరుగుబాటు చేయించి ఢిల్లీకి నడిపించాడు. బ్రిటీషుసైన్యంలో అతను ఫిరంగి దళానికి సంబంధించిన ఒక సామాన్య సుబేదారు. తిరుగుబాటు కేంద్ర కార్యస్థానంలో సామాన్య సైనికులకు భక్త్‌ఖాన్ ప్రతినిధి. 1857 సెప్టెంబరులో ఢిల్లీ బ్రిటీషు సేనల వశమయ్యాక, అతడు లక్నో వెళ్ళిపోయి 1859 మే 13న జరిగిన ఒక యుద్ధంలో మరణించేటంతవరకు స్వాతంత్ర్య సమరం కొనసాగించాడు. తిరుగుబాటును నడిపిన నాయకత్వంలో బహదూర్‌షా చక్రవర్తి బహుశా అతిబలహీనమైన లింకు. తిరుగుబాటును బలపర్చడంలోనయినా ఆయన దృఢంగా లేడు. అతిసామాన్యమైన సిపాయిలపట్ల ఆయనకు నిజమైన సహానుభూతి లేదు. సిపాయిలు కూడా చక్రవర్తిని సంపూర్ణంగా విశ్వసించలేదు. సిపాయి నాయకులు అధికారం హస్తగతం చేసుకోవడం ఆయనకి కోపం తెప్పించింది. ఒకవేపు చక్రవర్తిగా రాజ్యచక్రం తిప్పాలనే కోరిక, మరోవేపు బ్రిటిషు వాళ్ళు తిరుగుబాటును అణచివేస్తే తన ప్రాణం ఎలా కాపాడుకోవాలా అన్న ఆదుర్దా - ఈ రెంటి మధ్యా ఆయన ఊగిసలాడాడు. ఆయన ముద్దులరాణి జీనత్‌మహల్ కూడా ఆయన స్థానానికి ఎసరు తెచ్చింది. కొడుకులు కుట్రదారులుగా మారిపోయి శత్రువు మోచేతినీళ్ళు తాగారు.



నానా సాహెబ్

బహదూర్‌షా దుర్బల వ్యక్తిత్వం, వృద్ధాప్యం, నాయకత్వ లక్షణాలు లోపించడం వగైరా అవగుణాలు తిరుగుబాటు నాడీ కేంద్రంలో రాజకీయ బలహీనతను సృష్టించాయి; తిరుగుబాటుకు ఎనలేని హాని కలిగించాయి.

కాన్పూరులో తిరుగుబాటుకు ఆఖరు పీష్వా అయిన రెండవ బాజీరావు దత్తపుత్రుడు నానా సాహెబ్ నాయకత్వం వహించాడు. నానా సాహెబ్ సిపాయిల సహాయంతో కాన్పూర్ నుంచి బ్రిటీషువాళ్లని తరిమివేసి, పీష్వాగా ప్రకటించుకున్నాడు. బహాదుర్‌షాను చక్రవర్తిగా గుర్తించి, తాను ఆయన కింద గవర్నరునని ప్రకటించాడు. నానాసాహెబ్ తరఫున పోరాడే భారమంతా అతనికి అత్యంత విధేయుడయిన తాంతియాతోపే మీద పడింది. తాంతియాతోపే తన అసమాన దేశభక్తితో, దృఢ సంకల్పయుత పోరాటపటిమతో, సమర్థవంతమైన గెరిల్లాయుద్ధ చర్యలతో చరిత్రలో అమరుడయ్యాడు. నానాసాహెబ్ విశ్వాస పాత్రుల్లో తాంతియాతోపే తర్వాత అజీముల్లా పేరు చెప్పుకోవాలి. అజీముల్లా రాజకీయ ప్రచారంలో అత్యంత సమర్థుడు. కాని నానాసాహెబ్ కాన్పూర్ దుర్గ రక్షణదళానికి అభయమిచ్చి మోసంతో వాళ్ళని చంపించి తన చరిత్రకి మచ్చ తెచ్చుకున్నాడు.

లక్నో తిరుగుబాటుకు అయోధ్య బేగం సారథ్యం వహించింది. తన చిన్న కుమారుడు బిర్జిస్‌ఖాదర్‌ని అయోధ్యకు నవాబుగా ప్రకటించింది. లక్నో సిపాయిల సహకారంతో, అయోధ్య జమీందార్లు రైతాంగం మద్దతుతో బేగం బ్రిటీషు వాళ్ళని నలువైపులనుంచి ముట్టడించింది. లక్నో నగరాన్ని విడిచిపెట్టి వలసిన విషమస్థితిలో,

బ్రిటీషువాళ్ళు రెసిడెన్సీ భవనాన్ని రక్షణ దుర్గంగా చేసుకున్నారు. బ్రిటీషు సైనికులు చాలా తక్కువమందే అయినా, అదర్శప్రాయమైన ధైర్యస్థైర్యాలతో పోరాడి రెసిడెన్సీపైన తిరుగుబాటు సైనికుల ముట్టడిని తిప్పికొట్టారు.

1857 తిరుగుబాటుని నడిపిన మహానాయకుల్లో మాత్రమే కాకుండా బహుశా భారత చరిత్రలోని మహోజ్జ్వల వీరనారీమణుల్లోనే ఝాన్సీలక్ష్మీబాయి ఒకరు. ఆమె తరుణవయస్సులోనే భర్తని పోగొట్టుకుంది. సింహాసనానికి వారసులు లేరు. వారసుణ్ణి దత్తుతీసుకునే సాంప్రదాయిక హక్కుని బ్రిటీషువాళ్ళు హరించి, ఆమె రాజ్యాన్ని బ్రిటీషు ఇండియాలో కలుపుకున్నారు భారతదేశంలో మిగతాచోట్ల విజృంభించి నట్లుగానే ఝాన్సీలోని భారతీయ సిపాయి పటాలం బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటుచేసింది. ఆ తిరుగుబాటుకు ఆమే కారణమని ఆరోపించి బెదిరింపులకు దిగారు. తరుణ వయస్సులో ఉన్న లక్ష్మీబాయి మొదట్లో ఎటూ తేల్చుకోలేక ఊగిస లాడింది. కాని తిరుగుబాటులో చేరిపోవాలని ఒకసారి నిర్ణయం తీసుకున్నాక ఆమె నిజమైన వీర వనితలా పోరాడింది. ఆమె ధైర్య సాహసాల్ని, కదన కౌశలాన్ని వర్ణిస్తూ అల్లిన కథలు అనాటినుంచీ ఈ దేశ వాసుల్ని ఆవేశపరిచాయి. లక్ష్మీబాయిని ఝాన్సీనుంచి వెడల నడప టానికి బ్రిటీషువాళ్ళు భీషణ యుద్ధం చేయాల్సి వచ్చింది. ఆ యుద్ధంలో "మహిళలు సైతం సిపాయిలకు మందుగుండ్లు అందిస్తూ, ఫిరంగుల్లో మందు దట్టించి పేలుస్తూ పోరాడారు". "మా స్వహస్తాలతో మేం మా స్వతంత్ర పాలనని (అజాద్ షాహి) సమాధి కానివ్వం" అని లక్ష్మీబాయి తన అనుచరు లందరిచేత ప్రతిజ్ఞ చేయిం చింది. తాంతియాతోపే సహాయంతోను, తనకు విశ్వాస పాత్రులయిన అఫ్ఘన్ కావలి భటుల అండతోను లక్ష్మీబాయి గ్వాలియర్‌ని స్వాధీనం చేసుకుంది. బ్రిటీషు తొత్తు మహారాజా సింధియా లక్ష్మీబాయిని ఎదుర్కోడానికి ప్రయత్నం చేశాడేగాని అతని సైన్యం ఆమె వేపు తిరిగి పోయింది. సింధియా ఆగ్రాలో ఇంగ్లీషువాళ్ళ శరణు వేడాడు.



కున్వర్‌సింగ్

ఝాన్సీలక్ష్మి యథోచిత దుస్తులు ధరించి, యుద్ధాశ్వం అధిరోహించి వీరోచితంగా పోరాడుతూ 1858 జూన్ 17న యుద్ధ క్షేత్రంలో వీరమరణం పొందింది. జీవితాంతం ఆమెని వెన్నంటివున్న ఆమె ముస్లిం చెలికత్తె కూడా ఆమెతోపాటే ఆమె పక్కనే నేల కొరిగింది.

బ్రతికిచెడి, అసంతృప్తితో పొగిలిపోయే జగదీశ్ పూర్ జమీందారు కున్వర్ సింగు బీహార్ సిపాయి తిరుగు బాటుకు ప్రధాన రథసారథిగా పనిచేశాడు. అప్పుడాయన 80 ఏళ్ళ వయో వృద్ధుడు. 1857 తిరుగుబాటులో బహుశా ఆయనంతటి ప్రముఖ సైనిక నాయకుడు, యుద్ధవ్యూహ నిపుణుడు మరిలేరు. ఆయన బీహార్‌లో బ్రిటీషు వ్యతిరేక సమరం సాగించాడు. ఆ తరువాత నానా సాహెబ్ ఆధ్వర్యంలోని సైన్యంతో కలిశాడు. అయోధ్యలో, మధ్య భారత్‌లో తిరుగుబాటు దార్లతో కలసి యుద్ధాల్లో పాల్గొన్నాడు. మళ్ళీ శరవేగంతో స్వరాష్ట్రం చేరుకుని బీహార్‌లో అరా అనేచోట బ్రిటీషు సేనల్ని ఓడించాడు అదే ఆయన అంతిమ యుద్ధం అయ్యింది. యుద్ధంలో తీవ్రంగా గాయపడ్డాడు. చివరికి 1858 ఏప్రిల్ 27న స్వగ్రామమైన జగదీశ్‌పూర్‌లో పురాతన స్వగృహంలో కన్ను మూశాడు

ఫైజాబాద్‌కు చెందిన మౌలీఅహ్మదుల్లా తిరుగుబాటు నాయకుల్లో మరొక ప్రముఖుడు. ఆయన జన్మస్థానం మద్రాసు. ఆయన మొదట అక్కడే సాయుధ తిరుగుబాటును ప్రబోధం చేశాడు. 1857 జనవరిలో ఉత్తరాదికి పయనమై ఫైజాబాద్‌లో ఆగిపోయాడు. రాజద్రోహం ప్రబోధించకుండా మౌల్విని నిరోధించటానికి కంపెనీ సైన్యం ఫైజాబాదుకు ఉరికి వచ్చింది. ఫైజాబాదులో సాగిన ఆ భారీ యుద్ధంలో మౌల్వి అహ్మ దుల్లా పాల్గొని పోరాడాడు. మే నెలలో సార్వత్రిక తిరుగుబాటు చెలరేగిన సమయంలో అయోధ్యలో ఆయనని తిరుగుబాటు నాయకుల్లో ఒకరుగా ప్రజలు గుర్తించారు. లక్నోలో ఓటమి పొందిన తరువాత మౌల్విఅహ్మదుల్లా రోహిల్ ఖండ్‌లో తిరుగుబాటు నడిపాడు. పువైన (Puwain) రాజ ద్రోహిగా మారి మౌల్విని మోసంతో చంపి వేశాడు. బ్రిటీషువాళ్ళు ఆ ద్రోహికి 50వేల రూపాయల నగదు బహుమతి చెల్లించారు. మౌల్వి అమహ్మదుల్లా దేశభక్తిని, శౌర్య ప్రతాపాలను సైన్య నిర్వహణాదక్షతని ఆఖరికి బ్రిటీషు చరిత్రకారులు సైతం మహా ప్రశంసించారు. కల్నల్ మాలెసన్ మౌల్విని గురించి ఇలా రాశాడు:

"అక్రమంగా విధ్వంసం కాబడ్డ తన మాతృదేశ స్వాతంత్ర్యంకోసం కుట్రపన్ని, యుద్ధంచేసే మనిషి దేశభక్తుడయినట్లయితే, మౌల్వి అహ్మదుల్లా తప్పకుండా నిజమయిన దేశభక్తుడే.... తన దేశాన్ని ఆక్రమించిన పరాయి దేశస్థులకు వ్యతిరేకంగా రణరంగంలో ఆయన పౌరుషంగా, గౌరవనీయంగా, అకుంఠితంగా పోరాడాడు. ఆయన స్మృతి అన్ని దేశాల్లో ధైర్యవంతుల, సహృదయుల శ్రద్ధాంజలికి అర్హమైంది."

తిరుగుబాటులో నిజమైన మహావీరులు సిపాయిలే. సిపాయిల్లో అనేకమంది యుద్ధరంగంలో మహత్తర ధైర్యసాహసాలు ప్రదర్శించి నిస్వార్థంగా ప్రాణార్పణ చేశారు. అన్నిటికంటే ముఖ్యంగా, వాళ్ళ కృతనిశ్చయం, బలిదానాలే బ్రిటీషువాళ్ళని ఈ దేశం నుంచి దాదాపు పారద్రోలడానికి దోహదం చేశాయి. ఈ దేశభక్తి ప్రపూరిత పోరాటంలో వాళ్ళు తమ ప్రగాఢ మతపక్షపాతాలను సైతం త్యజించారు. కొవ్వు పూసిన తూటాలకు సంబంధించిన సమస్యమీద వాళ్ళు తిరుగుబాటు చేశారు. అయితే తాము

అసహ్యించుకునే విదేశీ పాలకుల్ని మాతృదేశం నుంచి తరిమి కొట్టటానికి అవే తూటాల్ని యుద్ధరంగంలో నిస్సంకోచంగా ఉపయోగించారు.

తిరుగుబాటు ఒక సువిశాల ప్రాంతమంతటా పాకినా, అశేష జనసామాన్యంలో అల్లుకుపోయినా అది యావత్ దేశాన్ని ముంచెత్తలేదు. భారతీయ సమాజంలోని అన్ని తరగతులను, వర్గాలను ఆకట్టుకోలేక పోయింది. నిలువెత్తునా స్వార్థం నిండిపోయి, బ్రిటిషు అధికార శక్తికి గడగడలాడిపోయిన అనేకమంది స్వదేశ సంస్థానాధీశులు, బడాజమీందార్లు తిరుగుబాటులో పాల్గొనడానికి నిరాకరించారు. అంతేకాకుండా - గ్వాలియర్ సింధియా, ఇండోర్ హొల్కారు, హైదరాబాదు నిజాము, జోధపూర్ రాజా, అతనితోపాటు మరికొందరు రాజపుత్ర రాజులు, భోపాలు నవాబు, పాటియాలా, నభాజింద్, కాశ్మీర్ ప్రభువులు, నేపాల్ రాణాలు, ఇంకా అనేకమంది ఛోటాప్రభువులు, లెక్కలేనంతమంది బడా జమీందార్లు తిరుగుబాటు అణచివేతకు బ్రిటిషువాళ్ళకు క్రియాశీల సహకారం అందించారు. వాస్తవానికి, భారత దేశ ప్రభు వర్గంలో నూటికొక్కరు కన్నా మించి తిరుగుబాటులో పాల్గొనలేదు. ఈ సంస్థానాధీశులు, ఛోటా ప్రభువులు " ఆ తుఫానులో అలల తీవ్రతని తగ్గించే అడ్డుగోడగా ఉపయోగపడ్డారు. లేకపోతే అది మనల్ని ఒక్కుమ్మడిగా ఊడ్చిపారేసి ఉండేది" అని గవర్నర్-జనరల్ కానింగ్ వ్యాఖ్యానించాడు. మద్రాసు, బొంబాయి, బెంగాల్, పశ్చిమ పంజాబ్ రాష్ట్రాలలో సామాన్య ప్రజల మనోభావాలు తిరుగుబాటుపట్ల అనుకూలంగా ఉన్నప్పటికీ, అవి అలజడికి, కల్లోలానికి దూరంగా తామరాకుమీది నీటిబొట్లలా ఉండిపోయాయి. జమీలు పోగొట్టుకొని అసంతృప్తితో పొగిలిపోయే జమీదార్లు మినహా సంపన్నవర్గం, మధ్యతరగతి ప్రజలు చాలా మట్టుకు తిరుగుబాటుదార్ల చర్యని ప్రశ్నించే ధోరణిలో ఉండిపోయారు. డబ్బూ, ఆస్తీ "కలవాళ్ళు" తిరుగుబాటుదార్లపట్ల ఉదాశీన వైఖరి అవలంభించటమో లేదా బాహాటంగా శతృభావం వహించటమో చేశారు. ఆఖరికి అయోధ్య రాజ్యంలోని తాలూకాదార్లు సైతం మొదట తిరుగుబాటులో చేరి, ఆ తరువాత వాళ్ళ ఎస్టేట్లని తిరిగి ఇచ్చివేస్తామని బ్రిటిషు ప్రభుత్వం ప్రకటించిన వెంటనే తిరుగుబాటునుంచి విరమించుకున్నారు. దాంతో అయోధ్య రైతాంగం, సిపాయిలు సుదీర్ఘ గెరిల్లాయుద్ధం కొనసాగించడం కష్టసాధ్యమైపోయింది. .

గ్రామస్థుల దాడులకు ప్రధానంగా గురయినవాళ్లు వడ్డీవ్యాపారస్థులు. కాబట్టి, వాళ్ళంతా తిరుగు బాటుపట్ల శత్రుత్వం వూనారు. వ్యాపారస్థులు కూడా క్రమేపీ తిరుగుబాటుదార్లపట్ల స్నేహభావం విడనాడారు. ఎంచేతనంటే, యుద్ధానికవసరమైన ఆర్థిక వనర్లకోసం తిరుగుబాటుదార్లు వ్యాపారస్థుల మీద భారీ పన్నులు విధించారు. సిపాయిలకు తిండి సమకూర్చటానికి వాళ్ళ ఆహార నిల్వల్ని వశపర్చుకున్నారు. వ్యాపారస్థులు తమ సరుకుని, సంపదని తిరుగుబాటుదార్ల కంట పడకుండా దాచేశారు. ఉచితంగా సరుకు సరఫరా చెయ్యటానికి నిరాకరించారు.

బెంగాల్ జమీందార్లు కూడా బ్రిటిషువాళ్ళకి విశ్వాసపాత్రంగా ఉన్నారు. వాళ్ళు బ్రిటిషువాళ్లు సృష్టించిన వర్గమే. అదీగాక జమీందార్లకు వ్యతిరేకంగా బీహార్ రైతాంగం కత్తి కట్టటంతో, బెంగాలీ జమీందార్లు గడగడ లాడిపోయారు. అదేవిధంగా బొంబాయి, కలకత్తా, మద్రాసు నగరాల్లో బడావర్తకులంతా బ్రిటిషువాళ్ళనే బలపర్చారు. మరి వాళ్ళ లాభాలు విదేశ వాణిజ్యం నుంచి, బ్రిటిషు వర్తకులతో ఆర్థికపరమైన లింకుల నుంచి వస్తున్నాయి.

పాశ్చాత్య సంస్కృతి వ్యామోహం పెంచుకున్న ఆధునిక విద్యావంతులు తిరుగుబాటును సమర్థించలేదు. అంధవిశ్వాసాల కనుగుణంగా తిరుగుబాటుదార్ల విజ్ఞప్తులు, ప్రగతిశీల సామాజిక సంస్కరణచర్యల పట్ల వాళ్ళ ప్రాతికూల్యం గమనించి విద్యావంతులు తిరుగుబాటుదార్ల పట్ల విముఖులయ్యారు. విద్యావంతులయిన భారతీయులు తమదేశం యొక్క వెనుకబాటుతనాన్ని తుద ముట్టించాలనే వాంఛతో ఉన్నారని లోగడ చెప్పుకున్నాం. దేశాన్ని ప్రగతిపథంలో పెట్టే కర్తవ్య పరిపూర్తికి బ్రిటీషు పరిపాలన తోడ్పడుతుందనే తప్పుడు అభిప్రాయంలో విద్యావంతులున్నారు. తిరుగుబాటుదార్లు దేశాన్ని ఇంకా వెనుకకి తీసుకు పోతారనే దురభిప్రాయంలో పడ్డారు వాళ్లు. అయితే, ఆ తరువాత వాళ్లు అనుభవపూర్వకంగా అసలు వాస్తవాన్ని గ్రహించారు. విదేశ పరిపాలన తమ దేశాన్ని ఆధునిక పథంలో పెట్టలేదు సరిగదా, అదింకా ఈ దేశాన్ని కృంగదీసి వెనుకబాటు స్థితిలో ఉంచుతుందనేది వాళ్ళు అనుభవం మీద తెలుసుకున్నారు. 1857 తిరుగుబాటులో పాల్గొన్న విప్లవకారులే ఈ సందర్భంలో ఇతోధిక దూరదృష్టి ప్రదర్శించారు. విదేశ పరిపాలనలోని చెడుగుల్ని గురించి వాళ్ళకే మేలయిన అవగాహన ఉంది. సహజాతమైన అవగాహన అది. కాబట్టే, విదేశ పాలన విరగడ చేసుకోవలసిన అవసరాన్ని విప్లవకారులు సరిగ్గా అవగాహన చేసుకున్నారు. కాని, విద్యావంతులయిన మేధావి వర్గం మాదిరిగా విప్లవకారులు ఒక్క విషయం గ్రహించలేకపోయారు. ఈ దేశం కుళ్ళిపోయిన, కాలదోషం పట్టిన ఆచారాలకు, సంప్రదాయాలకు, వ్యవస్థకు అంటిపెట్టుకుపోయినందునే విదేశస్థుల బారి పడిందనే వాస్తవాన్ని విప్లవకారులు గ్రహించలేదు. ఫ్యూడల్ రాజరికంలోకి తిరోగమించడం ద్వారా కాకుండా, ఆధునిక ప్రగతి పథంలో పురోగమించడం ద్వారా భారత జాతి ఈ సంక్షోభం నుంచి బయటపడుతుందనే సత్యాన్ని విప్లవకారులు గ్రహించలేకపోయారు. నూతన ఆర్థిక వ్యవస్థ, శాస్త్రీయవిద్య, ఆధునిక రాజకీయ వ్యవస్థల వేపు దేశం. పురోగమిస్తేనే యీ పీడ, పీడన విరగడవుతాయని గ్రహించడంలో వాళ్లు విఫలమయ్యారు. ఏదిఏమైనా, విద్యావంతులయిన భారతీయులు జాతీయ వ్యతిరేకులని గానీ, విదేశపాలనకు విశ్వాసపాత్రులని గానీ చెప్పలేం. 1858 తరువాత జరిగిన సంఘటనలు వాళ్ళ స్వభావాన్ని విప్పి చెప్పాయి. బ్రిటీషుపాలనకు వ్యతిరేకంగా విద్యావంతులయిన భారతీయులు ఒక శక్తి వంతమైన నూతన జాతీయోద్యమాన్ని నడిపించారు.

భారతీయుల అనైక్యతకి కారణాలేమయినా, ఆ అనైక్యత తిరుగుబాటుకు వినాశన హేతువుగా పరిణమించింది. అయితే, తిరుగుబాటుదార్ల ఆశయం దెబ్బ తినడానికి ఈ ఒక్కటే బలహీనత కాదు. ఇంకా మరి కొన్ని బలహీనతలవల్ల కూడా వాళ్ళ ఆశయం విఫలమైంది. వాళ్ళకి ఆధునిక ఆయుధాల లోటు ఉంది. ఇంకా తదితర యుద్ధసామగ్రి కూడా అందుబాటులో లేదు. బల్లేలు, కత్తులు వంటి పురాతనకాలపు ఆయుధాలతో వాళ్ళు పోరాడారు. వాళ్ళు సరిగ్గా సంఘటితం కూడా కాలేదు. నిర్మాణ సంబంధమైన లోపం ఉంది. సిపాయిలు సాహసోపేతులు, స్వార్థరహితులు. కాని క్రమశిక్షణారహితులు కూడా. కొన్ని సందర్భాల్లో వాళ్ళు అల్లరి మూకల్లా ప్రవర్తించారే గాని క్రమశిక్షణాయుతమైన సైన్యంలా వ్యవహరించ లేదు. తిరుగుబాటు దళాలకు ఒక ఉమ్మడి కార్యచరణ పథకం లేదు. అదుపు చేయగలిగిన

అధినేతలు లేరు. కేంద్రీకృత నాయకత్వం లేదు. దేశంలో వివిధ ప్రాంతాలలో విజృంభించిన తిరుగుబాట్ల మధ్య కొత్తిగా సమన్వయం లేదు. విదేశ పాలనపట్ల సార్వత్రిక ద్వేషభావం అనేది నాయకుల్ని ఒక వేదిక మీదికి తెచ్చింది. అంతకన్నా వేరే ప్రాతిపదిక లేదు. ఒక ప్రాంతంలో బ్రిటీషు అధికారాన్ని తుదముట్టించేక, దానిస్థానే ఏ రకమైన అధికారాన్ని నెలకొల్పాలో వారికి ఆలోచనే లేదు. ఐక్య కార్యాచరణని రూపొందించుకోవటంలో వాళ్ళు విఫలమయ్యారు. పరస్పరం అనుమానం, అసూయ పెంచుకొని ఆత్మహత్యా సదృశకరమైన ఘర్షణల్లో మునిగారు. ఉదాహరణకి - అయోధ్య బేగం మౌల్వీ అహ్మదుల్లాతో కయ్యానికి దిగింది. మొఘల్ రాకుమారులు సిపాయి సేనాపతుల్తో ఘర్షణపడ్డారు. నానా సాహెబ్ రాజకీయ సలహాదారు అజీముల్లా నానాసాహెబ్‌ను ఢిల్లీ సందర్శించవద్దని సలహా చెప్పాడు. ఢిల్లీ వెళ్తే నానాసాహెబ్ చక్రవర్తికి లోకువైపోతాడని ఒక అనుమానం. ఆ విధంగా, తిరుగుబాటు నాయకుల స్వార్థం, మతాతత్వం తిరుగుబాటుయొక్క పటుత్వాన్ని తెగటార్చాయి. తిరుగుబాటు బలంగా వేరూనుకోనీ కుండా నిరోధించాయి. రైతాంగం రెవెన్యూ రికార్డుల్ని, వడ్డీ వ్యాపారస్థుల చిట్టాల్ని, పత్రాల్ని నాశనం చేసేశాక, కొత్త జమీందార్లని కూలదోసేశాక తరువాత చెయ్యాల్సిన పనేమిటో వాళ్ళకి దిక్కుతోచలేదు. బ్రిటీషువాళ్ళు తిరుగు బాటు నాయకుల్లో ఒకరి తర్వాత ఒకర్ని అణచి పారెయ్యడంలో సఫలీకృతులయ్యారు.

తిరుగుబాటు యొక్క బలహీనతకు వ్యక్తుల లోపాలు, వైఫల్యాలకంటే లోతయిన కారణాలున్నాయి. అధికారం కైవసం చేసుకున్న తరువాత అమలుపరచవలసిన పురోగామి దృష్టి కలిగిన ఏకీకృత కార్యక్రమం అనేది మొత్తం ఉద్యమానికే లోపించింది. బ్రిటీషు పరిపాలనపట్ల ఉమ్మడి ద్వేషభావంతో ఏకం కావడం తప్ప. స్వతంత్ర భారతదేశ రాజకీయాలు గురించి భిన్న ఉద్దేశ్యాలు, ఎవరికి వారి వేర్వేరు కష్ట సుఖాలు కలిగిన విరుద్ధ శక్తుల కూడికగా ఉద్యమం రూపొందింది. ఒక నూతన ప్రగతిశీల కార్యక్రమం లోపించడంవల్ల అభివృద్ధి నిరోధకులయిన రాజులు, జమీందార్లు విప్లవోద్యమం వివిధ స్థాయిలలో ఆధిపత్యం వహించడానికి వీలు చిక్కింది. లోగడ తమ తమ రాజ్యాల స్వాతంత్ర్యాన్ని సంరక్షించుకోడంలో విఫలమయి పోయిన ఆ ఫ్యూడల్ నాయకులు, మొఘలులు, మహారాష్ట్రులు, ఇంకా తదితరులు మళ్ళీ ఇప్పుడు ఒక అఖండ భారత రాజ్యాన్ని స్థాపించగలరని ఎవ్వరూ ఆశించరు. కాని, తిరుగుబాటు ఫ్యూడల్ స్వభావాన్ని కొండంతగా చిత్రించడం సబబు కాదు. క్రమేణా సైనికులు, సామాన్య ప్రజలు ఇక వేరే తరహా నాయకత్వాన్ని రూపొందించుకోసాగారు. తిరుగుబాటును జయప్రదం చెయ్యాలనే వాళ్ళ ప్రయత్నం, కృషి సంస్థాగతమైన నూతనరూపాలు సృష్టించటానికి వాళ్ళని ముందుకు తోశాయి. బ్రిటీషు ప్రభుత్వం తిరుగబాటుని సకాలంలో అణచి వెయ్యలేకపోతే, స్వదేశరాజుల్తోనే కాకుండా రంగంమీద అవతరించే ఇంకా ఇతరేతర కొత్త పాత్రలతో, శక్తులతో తలపడవలసి వుంటుందని బెంజమిన్ డిస్రేలి అనాడు బ్రిటీషు ప్రభుత్వాన్ని హెచ్చరించాడు.

భారత చరిత్ర ఈ దశలో భారతీయులమధ్య ఐక్యత లోపించడం బహుశా తప్పనిసరి కావచ్చు. నివసించే ప్రదేశం లేదా ప్రాంతం, ఇంకా మహాఅయితే రాష్ట్రం మేరకి మాత్రమే పరిమితమైన ప్రేమ, అభిమానం యావద్భారత సమష్టి

ప్రయోజనాలను గురించిన స్పృహ, ఈ ప్రయోజనాలే యావద్భారత ప్రజల్ని ఒకే సూత్రం బంధిస్తాయనే చైతన్యం ఇంకా ముమ్ముందు రావలసి వున్నాయి. వాస్తవానికి 1857 తిరుగుబాటు భారత ప్రజానీకాన్ని ఒక దగ్గరికి తీసుకురావటంలోను, తామంతా ఒకే దేశస్థులం అనే స్పృహ కలిగించటం లోను గణనీయమైన పాత్ర నిర్వహించింది.

ప్రపంచమంతటా బ్రిటీషు సామ్రాజ్యవాదం ప్రభ వెలిగిపోతోంది. భారత దేశంలో దానికి స్వదేశ రాజుల, చోటా ప్రభువుల సంపూర్ణమైన మద్దతు ఉంది. సైనికపరంగా అటువంటి బ్రిటీషు సామ్రాజ్యవాద శక్తిని తరుగుబాటుదార్లు ఎదిరించే స్థితిలో లేరు. బ్రిటీషు ప్రభుత్వం దేశంలోకి అసంఖ్యాకమైన మంది మార్బలాన్ని డబ్బుని, ఆయుధాల్ని గుప్పించింది. తరువాత భారతీయులు తమని అణచి వేసేందుకు పరాయి ప్రభుత్వం పెట్టిన ఆ ఖర్చు మొత్తాన్ని తలకు చుట్టుకోవలసి వచ్చింది. ప్రతి అడుగూ ఒక పద్ధతి ప్రకారం వేస్తూ పట్టుదలతో, పటుతర శక్తితో రంగంలోకి దిగిన శత్రువుని కేవలం ధైర్యమొక్కటే ఢీ కొనలేదు. ఒక సుదీర్ఘ భీషణ యుద్ధం తరువాత బ్రిటీషు సైన్యాలు 1857 సెప్టెంబరు 20న ఢిల్లీని ఆక్రమించినప్పుడు, తిరుగుబాటు దార్లు గట్టిదెబ్బ తిన్నారు. వృద్ధచక్రవర్తి బహదూర్‌షా బందీగా పట్టుబడ్డారు. రాకుమారులు అక్కడికక్కడే ముక్కలుగా నరకబడ్డారు. బ్రిటీషు ప్రభుత్వం చక్రవర్తిని విచారించి రంగూన్‌కు ప్రవాసం పంపింది. బహదూర్‌షా 1862లో రంగూన్‌లో మరణించాడు. పుట్టిన ఢిల్లీ నగరానికి సుదూరాన, పరాయి దేశంలో సమాధి అయ్యాడు. మహాయశస్కరమైన మొఘల్ వంశం అంతిమంగా, సంపూర్ణంగా అంతరించిపోయింది.



ఆంగ్లేయులచే ఢిల్లీ ముట్టడి

ఢిల్లీ పతనంతో తిరుగుబాటు కేంద్ర బిందువు కరిగిపోయింది. ఇతర నాయకులు ధైర్యోపేతంగా పోరాటం కొనసాగించినా అది సమవుజ్జీకాని సమరం. బ్రిటీషువాళ్ళు తిరుగుబాటు నాయకులపైన తమ బలాలు మోహరించారు. జాన్ లారెన్స్, ఔట్రామ్, హేవలక్, నీల్, కాంపెబెల్, హ్యారోజ్ మొదలైనవాళ్ళు ఈ యుద్ధంలో సైనిక పరంగా గొప్ప కీర్తి ఆర్జించారు. ఒకరి తరువాత ఒకరుగా, తిరుగుబాటు నాయకులందరూ నేల కరిచారు. నానాసాహెబ్ కాన్పూర్ యుద్ధంలో ఓడిపోయాడు. చివరివరకు లొంగిపోవటానికి నిరాకరించి 1859లో నేపాలు పారిపోయాడు. ఆ తరువాత అతని పేరే వినిపించలేదు. తాంతియాతోపే మధ్య భారత్ అరణ్యాల్లోకి తప్పించుకొనిపోయి 1859 ఏప్రిల్ దాకా అద్భుతంగా గెరిల్లా యుద్ధం నడిపాడు. చివరికి, ఒక జమీందారు మిత్రుడు చేసిన ద్రోహంతో నిద్రిస్తూ వుండగా పట్టుబడ్డాడు. 1859 ఏప్రిల్ 15న బ్రిటీషు ప్రభుత్వం తాంతియాతోపే మీద హడావుడిగా విచారణ జరిపి, మరణశిక్ష విధించింది. 1858 జూన్ 17న ఝాన్సీలక్ష్మీబాయి యుద్ధరంగంలో వీరమరణం పొందింది. 1859 నాటికి కున్వర్‌సింగ్, భక్త్‌ఖాన్, బెరైలీకి చెందిన ఖాన్‌బహదూర్‌ఖాన్, నానాసాహెబ్ సోదరుడు రావుసాహెబ్, మౌల్వీ అహ్మదుల్లా ప్రభృత యోధాగ్రేసరులందరూ మరణించారు. అయోధ్యా బేగం మాత్రం నేపాల్‌లో దాక్కోవలసి వచ్చింది.

1859 అంతానికి భారతదేశంలో బ్రిటీషు ఆధిపత్యం తిరిగి సంపూర్ణంగా నెలకొన్నది. కాని తిరుగుబాటు వృధా కాలేదు. అది మన చరిత్రలో ఒక మహోజ్వల ఘట్టం; ఒక మైలురాయి. అది మాతృదేశ రక్షణకు పాతపద్ధతిలో, సాంప్రదాయిక నాయకత్వంలో తెగింపు కూడిన ఒక ప్రయత్నమే కావచ్చు. కాని అది బ్రిటీషు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భరత ప్రజలు స్వాతంత్ర్యం కొరకు సాగించిన ప్రప్రథమ మహాయుద్ధం. అది నూతన జాతీయోద్యమ ఆవిర్భావానికి బాటలు పరిచింది. 1875 నాటి ఆ వీరోచిత, దేశభక్తి ప్రపూరిత పోరాటం భారత ప్రజల మనస్సులలో చెరగని ముద్ర వేసింది. ఆ తరువాత కొనసాగిన స్వాతంత్ర్య పోరాటంలో అది భారత ప్రజల్ని నిరంతరాయంగా ఆవేశపర్చింది. ఉత్తేజం ప్రసాదించింది. ఆ సమరవీరుల్ని దేశంలో ఇంటింటా స్మరించారు. వాళ్ళ పేర్లు ఉచ్చరిస్తేనే పాలకులు మండిపడ్డారు కూడా. భారత ప్రజలు ఆ వీరుల్ని ఆప్యాయంగా తలచుకున్నారు.

# 1858 తరువాత పాలనలో మార్పులు

1857 తిరుగుబాటు భారతదేశంలో బ్రిటిషు పాలనని భయంకరంగా కుదిపివేసింది; పాలనా వ్యవస్థని పునర్ వ్యవస్థీకరించడం తప్పనిసరయింది. వాస్తవానికి, తిరుగుబాటు తరువాతి సంవత్సరాల్లో భారతీయ సమాజం, భారత ఆర్థిక వ్యవస్థ గణనీయమైన మార్పులకు లోనయ్యాయి.

**ప్రభుత్వ నిర్వహణ :** 1858 పార్లమెంటు చట్టం పరిపాలనాధికారాన్ని ఈస్టిండియా కంపెనీ చేతుల్లోంచి లాగివేసి బ్రిటిషు చక్రవర్తికి అప్పగించింది. లోగడ కంపెనీ డైరెక్టర్లు, కంట్రోలు బోర్డు (Board of Control) భారతదేశ పరిపాలన వ్యవహారాల మీద పెత్తనం చేసేవి. ఇప్పుడు ఆ అధికారం ఒక సలహా మండలి (Council) తో కూడిన భారత రాజ్య కార్యదర్శి (Secretary of State for India) చేతుల్లోకి మారింది. భారత రాజ్య కార్యదర్శి బ్రిటిషు మంత్రివర్గంలో సభ్యుడు కావటాన అతడు పార్లమెంటుకు జవాబుదారు. ఇండియా కౌన్సిల్ అని వ్యవహరింపబడే భారతరాజ్యకార్యదర్శి సలహామండలి అతనికి సలహాలిస్తూ సహాయ పడాలి. అయితే కార్యదర్శికి కౌన్సిల్ నిర్ణయాల్ని త్రోసిపుచ్చే అధికారం ఉంది. ఆర్థిక విషయాలలో మాత్రమే కౌన్సిల్ ఆమోదం తప్పని సరి. 1869 నాటికి ఇండియా కౌన్సిల్ పూర్తిగా భారతరాజ్య కార్యదర్శికి లోబడి వుండే స్థితికి దిగిపోయింది. కౌన్సిల్ సభ్యుల్లో పదవీ విరమణ చేసిన బ్రిటిషు ఇండియా అధికారులే ఎక్కువమంది.

ఈ చట్టం ప్రకారం, గవర్నర్-జనరల్ లోగడ మాదిరిగానే ప్రభుత్వాన్ని నిర్వహించాలి. అతన్ని కొత్తగా వైస్రాయి లేదా రాజప్రతినిధి అని కూడా వ్యవహరించారు. అతనికి మామూలుగా ముట్టే అనేకానేక ఖత్తాలకు అదనంగా రెండున్నర లక్షల రూపాయల సాలుసరి వేతనం నిర్ణయించబడింది. కాని, కాలక్రమేణా వైస్రాయి అధికారాలు క్షీణించాయి. విధాన నిర్ణయంలో, నిర్వహణలో అతడిప్పుడు బ్రిటిషు ప్రభుత్వం చెప్పుచేతల్లో ఉండే సబార్డినేటు అధికారి. ఈ ధోరణి ఇప్పుడు కొత్తగా వచ్చిందేమీ కాదు. రెగ్యులేటింగ్ చట్టం, పిట్టిండియా చట్టం ఆ తరువాత వచ్చిన చార్టర్ చట్టాల ఫలితంగా లండన్‌లో కొలువు తీరిన పెద్దలే భారత ప్రభుత్వాన్ని దృఢంగా అదుపుచేస్తూ వచ్చారు. ఈస్టిండియా కంపెనీ తన స్వంత లాభాలకోసం భారతదేశాన్ని స్వాధీనం చేసుకున్నా, అది క్రమేపి బ్రిటిషు సమాజంలో పలుకుబడిగల వర్గాల ప్రయోజనాల కనుగుణంగా పాలింపబడుతూ రావడం జరిగింది. 1858 భారత ప్రభుత్వ రాజ్యాంగ చట్టం ఈ ధోరణి ఇంకా బలపడేట్లు చేసింది. కాని, గతంలో విధాన నిర్ణయాధికారం ఆచరణలో గవర్నర్ - జనరల్ చేతుల్లో ఉండేది. లండన్ నుంచి ఆదేశాలు అందటానికి కొద్ది వారాలు పట్టేది. ఈలోగా భారత ప్రభుత్వం అతి జరూరుగా

కొన్ని ముఖ్యమైన విధానాల మీద నిర్ణయాలు తీసుకోవలసి ఉండేది. కాబట్టి లండన్ నుంచి వచ్చే ఆదేశాలు ఇక్కడ భారత ప్రభుత్వం అప్పటికే తీసుకున్న నిర్ణయాలకు ఆమోదముద్ర వేసే స్వభావం సంతరించుకున్నాయి. లండన్‌లోని అధికారుల అదుపు నిజమైన విధాన నిర్దేశకత్వంలో లేకుండా మదింపు, సమీక్షలకు పరిమితిమైంది. మరో మాటలో చెప్పాలంటే లండన్‌లోని అధికారులు భారతదేశంలో పరిపాలనా నిర్వహణని అజమాయిషీ చేశారు; అంతేగాని పరిపాలనని నడపలేదు. 1870 నాటికి ఇంగ్లండ్-ఇండియాల మధ్య ఎర్ర సముద్రం గుండా జలాంతర్గామి కేబుల్ పడింది. ఇప్పుడు లండన్ నుంచి ఆదేశాలు గంటల మీద ఇండియా చేర్తాయి. భారత రాజ్య కార్యదర్శి ఇప్పుడు ప్రభుత్వ వ్యవస్థలో ప్రతి సూక్ష్మాంశాన్ని అదుపు చెయ్యవచ్చు. రోజంతా ప్రతిగంటా అదేపనిలో నిమగ్నుడై పోవచ్చు. ఆ విధంగా భారతదేశ వ్యవహారాల్లో ప్రత్యంశాన్ని నడిపించే, అదుపు చేసే అధికారపీఠం ఇండియాకు వేల మైళ్ళ దూరంలో ఉన్న ఇంగ్లండ్ రాజధాని లండన్‌లో ఏర్పాటయింది. ఇండియా కౌన్సిల్‌లో గాని, బ్రిటిషు మంత్రివర్గంలో గాని, పార్లమెంటులోగాని భారతీయుని వాణి వినబడదు. అటువంటి దూరపు యజమానుల్ని భారతీయులు సమీపించే అవకాశమే లేదు. ఆ పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలపైన లోగడకన్నా కూడా భారత ప్రజాభిప్రాయానికి ప్రభావమనేది లేకుండా పోయింది. మరొకచెంప - భారత ప్రభుత్వం మీద బ్రిటీషు పారిశ్రామిక యజమానులు, వ్యాపారస్థులు, బ్యాంకర్లు తమ పలుకుబడిని విశేషంగా పెంచుకున్నారు. ఇందువల్ల భారత ప్రభుత్వ వ్యవస్థ 1858 ముందు రోజుల నాటికంటే ఇప్పుడు మరింత అభివృద్ధి నిరోధకంగా తయారయింది. ఉదారవాదం అంటూ చేసినటువంటి కూడా క్రమేపీ మటు మాయమైపోయింది.

భారతదేశంలో 1858 చట్టం ద్వారా గవర్నర్ - జనరల్ తన బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించటానికి ఒక కార్యనిర్వాహకమండలి ఏర్పాటయింది. మండలి సభ్యులు ప్రత్యేక పాలనాశాఖలకు అధిపతులుగా ఉండేవాళ్ళు. గవర్నర్ - జనరల్‌కు అధికార సలహాదార్లు వారే. వారిది క్యాబినెట్ మంత్రులతో సరిసమానమైన హోదా. మొట్టమొదట ఈ కార్యనిర్వాహకమండలిలో అయిదుగురు సభ్యులు ఉండే వారు. 1918 నాటికి వీరి సంఖ్య ఆరుకు పెరిగింది. ఈ ఆరుగురే కాక అదనంగా సైనికశాఖకు అధ్యర్యం వహించే కమాండర్ - ఇన్ - చీఫ్ (సర్వ సైన్యాధిపతి) ఉండనే ఉన్నాడు. ఈ మండలి అన్ని ముఖ్య వ్యవహారాల్ని చర్చించి, మెజారిటీ వోటు ద్వారా నిర్ణయాలు తీసుకుంటుంది. అయినా మండలి ముఖ్య నిర్ణయాన్ని త్రోసిపుచ్చే అధికారం గవర్నర్ -జనరల్ కుండేది. క్రమేణా, సర్వాధికారాలు గవర్నర్ - జనరల్‌కే దఖలు పడ్డాయి.

1861 శాసనసభల చట్టం (Indian Councils Act-of 1861) శాసననిర్మాణం దృష్ట్యా గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలి సంఖ్యని పెంచింది. దానికి సామ్రాజ్య విధాన పరిషత్తు హోదా (Imperial Legislative Council) ఇవ్వబడింది. శాసనాలను చర్చించి ఆమోదం పొందడానికి అవసరమైనప్పుడు గవర్నర్ జనరల్ ఆరు మొదలు 12గురు సభ్యుల వరకు నియమించుకోవచ్చు. వీరిలో అనధికార సభ్యుల్ని కూడా చేర్చుకోవచ్చు. ఆ అనధికార సభ్యులు భారతీయులయినా కావచ్చు, బ్రిటీషువాళ్ళయినా కావచ్చు. అయితే వీరిలో అధికారవర్గ సభ్యులు సగంకన్నా ఎక్కువ ఉండకూడదు. అలాగే, అనధికార సభ్యులు సగంకన్నా తక్కువ ఉండరాదు.

ఈ విధాన పరిషత్తుకు నిజమైన అధికారాలంటూ యేవీలేవు. కాబట్టి దీన్ని ప్రాథమిక రూపంలో ఉన్న పార్లమెంటు అని గానీ, దుర్బలమైన పార్లమెంటు అనిగానీ భావించడం పొరపాటు.

అది కేవలం ఒక సలహాసంఘం. ముఖ్యమైన పరిపాలనా చర్యని దేన్నీ అది చర్చించే వీలులేదు. ఆర్థిక విషయాల మీద అసలు నోరే తెరవకూడదు. సభ్యులు వాటికి సంబంధించి ప్రశ్నలు సైతం అడక్కూడదు. మరో మాటల్లో - విధాన పరిషత్తుకు ప్రభుత్వ కార్యనిర్వాహకశాఖపైన పెత్తనం లేదు. పరిషత్తు ఆమోదించిన ముసాయిదా చట్టాలు గవర్నర్ - జనరల్ ఆమోదం పొందితేనే తప్ప శాసనరూపం ధరించవు. ఇదిలా వుండగా, ఈ శాసనాలు వేటినైనా లండన్‌లో కూర్చుండే భారతరాజ్య కార్యదర్శి నిరభ్యంతరంగా తోసి పారేయవచ్చు. ఇకపోతే, విధాన పరిషత్తు పూర్తి చేయాల్సిన ఏకైక ముఖ్య నిర్వాకమల్లా ప్రభుత్వ చర్యలకు చట్టాలకు చేతులెత్తి ఒక శాసనసభ ఆమోదించినట్టుగా వాటిని బైటికి కన్పించేట్టు చెయ్యాలి. సిద్ధాంతరీత్యా భారతీయుల అభిప్రాయానికి ప్రాతినిధ్యం కల్పించడం కోసం అనధికార భారతీయ సభ్యులకు విధానపరిషత్తులో ప్రవేశం కల్పించారు. భారతీయుల మనోభావాలు పాలకులు తెలిసివుంటే 1857 తిరుగుబాటు వచ్చేదికాదని బోలెడుమంది బ్రిటిషు అధికారులు, రాజనీతివేత్తలు భావించిన మూలాన విధాన పరిషత్తులో భారతీయులకిమాత్రం రాయితీ కల్పించారట! అనధికార భారతీయ సభ్యుల్ని ఒంటిచేతి వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. కొద్ది మందే వుంటే వుండనీ - ఆ కొద్ది మందీ కూడా ప్రజలెన్నుకున్న వాళ్ళు కారు. గవర్నర్ - జనరల్ గారి కృపారసదృష్టిపడ్డవాళ్ళు - అంటే, స్వదేశరాజులు, వాళ్ళ దివాన్లు, బడా జమీందార్లు, వ్యాపారస్థులు; ప్రభుత్వ పదవులు వెలిగించి పింఛను పుచ్చుకునే మాజీ అధికార్లు. వీళ్ళు భారత ప్రజల ప్రతినిధులు కారు. వర్ధమాన జాతీయోద్యమ భావాల్ని ప్రతిబింబించేవాళ్ళు కాదు వీళ్ళు. కాబట్టి, ప్రభుత్వ వ్యవహారాలలో భారతీయుల ప్రమేయమే లేదు. 1858కి ముందు ఉన్న మాదిరిగానే భారత ప్రభుత్వం ఇప్పుడూ విదేశీ నిరంకుశ పాలక వ్యవస్థ గానే ఉండిపోయింది. ఇదేదో కాకతాళీయం కాదు, బుద్ధిపూర్వకంగా రుద్దిన విధానం. ఈ 1861 శాసనసభల చట్టాన్ని ప్రవేశపెడుతూ భారతరాజ్య కార్యదర్శి చార్లెస్ ఉడ్ స్పష్టం చేశాడు: "అధికృత కలిగిన ఒక జాతి వేరొక జాతిని పాలిస్తున్న చోట నిరంకుశ పాలనమే అత్యంత సమాధానపూర్వకమైన ప్రభుత్వ పద్ధతి."

రాష్ట్రపాలన : బ్రిటిషు పాలకులు పరిపాలనా సౌలభ్యం కోసం ఈ దేశాన్ని రాష్ట్రాలుగా విభజించారు. బెంగాల్, మద్రాసు, బొంబాయిల్ని ప్రెసిడెన్సీ లన్నారు. ఈ ప్రెసిడెన్సీల్ని ముగ్గురు సభ్యులతో కూడిన కార్యనిర్వాహక మండలి సహాయంతో గవర్నర్లు పరిపాలించారు. ఈ గవర్నర్లను బ్రిటిష్ చక్రవర్తి నియమించేవాడు. మిగతా రాష్ట్రాలలో కన్నా ప్రెసిడెన్సీ గవర్నర్లకు హెచ్చు అధికారాలు, హక్కులు ఉండేవి. ప్రెసిడెన్సీలని పిలవబడని రాష్ట్రాలకు లెఫ్టినెంట్ గవర్నర్లు, చీఫ్ కమీషనరు పాలకులు. వాళ్ళని గవర్నర్ జనరల్ నియమించేవాడు.

1833కు ముందు రాష్ట్ర ప్రభుత్వాలకు చాలా ఎక్కువ స్వపరిపాలనాధికారం, స్వతంత్రం ఉండేది. 1833లో రాష్ట్రాలకు చట్ట నిర్మాణాధికారం ఊడిపోయింది. వాళ్ళు పెట్టే ఖర్చుమీద కేంద్రప్రభుత్వం అదుపు తీవ్రమయింది. భారతదేశం లాంటి ఒక

సువిశాల దేశాన్ని ఖచ్చితమయిన కేంద్రీకరణ ప్రాతిపదిక మీద సమర్థవంతంగా పరిపాలించడం సాధ్యం కాదనేది వెంటనే అనుభవం మీద తేలింది.

1861 భారత రాజ్యాంగ చట్టం ఈ కేంద్రీకరణ ఉధృతిని కొద్దిగా మార్చింది. కేంద్ర విధాన పరిషత్తు నమూనాలో బెంగాల్, మద్రాసు, బొంబాయిలలో, ఆ తరువాత మిగిలిన రాష్ట్రాలలో రాష్ట్ర విధాన పరిషత్తులు నెలకొల్పబడాలని ఆదేశించింది. ఇవి కూడా కేవలం సలహా సంస్థలే. వీటిలో నలుగురి నుంచి ఎనిమిది వరకు అనధికార సభ్యులుంటారు. అనధికార సభ్యులు భారతీయులయినా కావచ్చు, బ్రిటిషు వారయినా కావచ్చు. ఈ రాష్ట్ర విధాన పరిషత్తులకు కూడా ప్రజాస్వామిక పార్లమెంటు కుండే అధికారాలేవీ లేనే లేవు.

మితిమీరిన కేంద్రీకృత వ్యవస్థ తాలూకు చెడుగు ఆర్థిక రంగంలో మరీ బాహాటంగా వ్యక్తమైంది. దేశం మొత్తంలో ఆదాయాన్నంతా కేంద్రం వసూలు చేసుకునేది. ఆదాయంలో కొంత భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిణీ చేసేది. రాష్ట్ర వ్యయంలో ప్రతి చిన్న పద్దు మీదా కూడా కేంద్రం కఠినమయిన కంట్రోలు అమలు జరిపింది. ఆచరణలో ఈ పద్ధతి మహా నిరర్ధకమని రుజువయింది. రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థవంతంగా ఆదాయం సేకరిస్తున్నదీ లేనిదీ పర్యవేక్షించడం గానీ, వాటి వ్యయాన్ని సరైన అదుపులో ఉంచటం గానీ కేంద్ర ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. ఒక వైపు - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలన, వ్యయాలకు సంబంధించి అతి సూక్ష్మాంశాల మీద సైతం పరస్పరం నిరంతరం కలహించాయి; మరో వైపు - రాష్ట్ర ప్రభుత్వానికి పొదుపుగా ఉండాలన్న ధ్యాస లేదు. అందుచేత, ప్రభుత్వ విత్తంలో (Public Finance) వికేంద్రీకరణ ప్రవేశపెట్టాలని అధికార్లు నిర్ణయించారు.

ఈ దిశలో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక శాఖల్ని విడగొట్టే మొట్టమొదటి చర్యని 1870లో లార్డ్‌మేయో తీసుకున్నాడు. పోలీసు, జైళ్ళు, విద్య, ఆరోగ్యం, రహదార్లు వంటి శాఖల నిర్వహణకు గాను కేంద్ర ఆదాయం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్ణీత మొత్తాలు మంజూరు చేయటం ఆరంభమైంది. ఈ శాఖల్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్ఛానుసారంగా నిర్వహించుకోవచ్చు. ఈ శాఖల్లో దేనికైనా నిధుల కేటాయింపు హెచ్చించనూ వచ్చు, తగ్గించనూ వచ్చు. అయితే కేంద్రం మంజూరు చేసిన మొత్తం నిధికి ఈ మార్పులు చేర్పులు హెచ్చింపులు, తగ్గింపులు వుండాలి. లార్డ్‌మేయర్ గారి పథకాన్ని 1877లో లార్డ్ లిట్టన్ ఇంకా కొంత ముందుకు తీసుకువెళ్ళాడు. భూమిశిస్తు, ఎక్సయిజు, సాధారణ పరిపాలన, న్యాయనిర్వహణ వంటి కొత్త పద్దులు కేంద్ర పరిధి నుంచి రాష్ట్ర పరిధికి బదిలీ అయ్యాయి. ఈ శాఖల మీద అయ్యే వ్యయాన్ని భరించడానికి గాను అదనంగా మరికొంత ఆదాయం రాష్ట్రప్రభుత్వాలకు చూపాలి. అందుకోసం స్టాంపులు, ఎక్సయిజు పన్నులు, ఆదాయపు పన్ను వంటి ఆర్థిక వనరులలోఒక నిర్ణీత వాటా రాష్ట్ర ప్రభుత్వాలకు కేటాయించబడింది. 1882లో లార్డ్ రిప్పన్ వైస్రాయిగా ఉన్న కాలంలో కేంద్ర రాష్ట్ర ఆర్థిక సంబంధాలలో మరికొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు నిర్ణీత మొత్తాలు మంజూరు చేసే పద్ధతి రద్దయింది. దాని స్థానే రాష్ట్రాలకు కొన్ని ప్రత్యేక ఆదాయ వనరులు పూర్తిగా ఇచ్చివేయబడ్డాయి. రాష్ట్రం లోపల వాటిద్వారా వసూలయ్యే ఆదాయం మొత్తం రాష్ట్రప్రభుత్వాలదే. ఇంకా అదనంగా, రాష్ట్రాలు ఇతర ఆదాయ వనరుల్లో వాటాలు పొందాయి. ఆ విధంగా ఆదాయ

మార్గాలన్నీ మూడుగా విడగొట్టబడ్డాయి 1) కేంద్ర ప్రభుత్వ ఆదాయం 2) రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం 3) కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిర్ణీత నిష్పత్తిలో పంపిణీ అయ్యే ఆదాయం కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య రూపొందించబడ్డ ఈ ఆర్థిక ఏర్పాట్లు ప్రతి అయిదేళ్ళకొక తూరి సమీక్షించబడతాయి

ఆర్థిక వికేంద్రీకరణకు సంబంధించిన పైన చర్చించిన వివిధ చర్యలు రాష్ట్రాల నిజమైన స్వతంత్ర ప్రతిపత్తికి శ్రీకారం చుట్టాయని గానీ, రాష్ట్రపరిపాలనా నిర్వహణలో భారతీయులు పాల్గొనే పరిణామానికి ఆరంభం అని గానీ భావించగూడదు ఇవన్నీ పరిపాలనలో చేసే పునర్వ్యవస్థీకరణ చర్యల కిందికి వస్తాయి. వాటి ప్రధాన లక్ష్యం వ్యయాన్ని తగ్గించడం, ఆదాయాన్ని పెంచటం సిద్ధాంతంలో, ఆచరణలో కేంద్ర ప్రభుత్వం సర్వాధిపత్యం వహించే ఉంది. రాష్ట్ర ప్రభుత్వాల మీద దాని అదుపు సమర్థవంతంగా, విస్తృతంగా కొనసాగుతూనే ఉంది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెంటికీ ఇది అనివార్యం. ఈ రెండూ కూడా లండన్‌లో కూర్చుని అధికారం చలాయించే భారత రాజ్య కార్యదర్శికి, బ్రిటిషు ప్రభుత్వానికి సంపూర్ణంగా లోబడి ఉన్నాయి.

**స్థానిక సంస్థలు:** ఆర్థిక ఇబ్బందులు ప్రభుత్వ దృష్టిని ఇతోధిక వికేంద్రీకరణ పద్ధతి మీదికి మళ్ళించాయి పర్యవసానంగా మున్సిపాలిటీలు (పురపాలక సంస్థలు), జిల్లా బోర్డుల్ని ప్రోత్సహించాలనే ఆలోచన ప్రభుత్వానికి కలిగింది. దీనికి కొంత నేపథ్యం కూడా ఉంది. పారిశ్రామిక విప్లవం 19వ శతాబ్దంలో యూరపు ఆర్థిక వ్యవస్థని, సమాజాన్ని క్రమేణా మార్చివేసింది. యూరప్‌తో పెరిగే భారత సంబంధాల కారణంగాను, సామ్రాజ్యవాదం, ఆర్థిక దోపిడీల నూతన రూపాల మూలంగాను ఆర్థిక వ్యవస్థలో, పారిశుధ్యంలో, విద్యలో ఐరోపా సాధించిన అభివృద్ధిని భారతదేశంలో పాదుకొలపడం అవసరమైంది. అదీగాక, పౌర జీవితంలో ఆధునిక సదుపాయాలు ప్రవేశపెట్టాలని అప్పుడే పురివిప్పుతున్న భారత జాతీయోద్యమం ఒత్తిడి పెట్టింది. ప్రజాబాహుళ్యానికి విద్య, పారిశుధ్యం, మంచినీరు, మేలైన రహదార్లు, ఇంకా తదితర పౌర సౌకర్యాల అవసరం ప్రజల మనసుల్లో గాఢంగా నాటుకుంది. ప్రభుత్వం ఈ విషయంలో ఇంకా నిర్లక్ష్యం వహించటం కుదిరేటట్లు కనపడలేదు. కాని, ప్రభుత్వం సైన్యం మీద, రైలు మార్గాల మీద భారీవ్యయం చెయ్యటం వల్ల ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా తయారయింది. కొత్త పన్నులు వేసి ఆదాయాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం లేదు అప్పటికే పేదప్రజల మీద విధించిన పన్నులు తడిసి మోపడయ్యాయి. ఆ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రజలమీద అదనంగా పన్నులభారం మోపితే ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసంతృప్తి ప్రబలిపోయే ప్రమాదం ఉంది. మరొక వైపు ప్రభుత్వం ఉన్నత వర్గాల మీద పన్నులు పెంచటానికి సుముఖంగా ఉంది. కొత్తపన్నుల ద్వారా వసూలయ్యే మొత్తం తమ సౌకర్యాల నిమిత్తమే ఖర్చవుతుందనే భావం ప్రజలకు కలిగితే, అటువంటి కొత్త పన్నులు కట్టటానికి ప్రజలు బాధపడరని అధికార్లు గుర్తించారు అందుచేత విద్య, వైద్యం, పారిశుధ్యం, మంచినీటి సరఫరాల్ని ప్రభుత్వం స్థానిక సంస్థలకు బదలాయించింది. స్థానిక సంస్థలు ఈ సౌకర్యాలకయ్యే ఖర్చుని ప్రజలనుండి పన్నుల ద్వారా వసూలు చేస్తాయి. వేరే ఇంకొక కారణాన్ని దృష్టిలో ఉంచుకుని కూడా అనేకమంది ఇంగ్లీషు అధికార్లు స్థానిక సంస్థల ఏర్పాటుకై ఒత్తిడి తెచ్చారు. పరిపాలనా కార్యకలాపాలలో భారతీయుల్ని ఏదో ఒక రూపంలో,

హోదాలో భుజం కలిపేటట్టు చేస్తే, రాజకీయ అసంతృప్తిని అరికట్టవచ్చని వాళ్ళ నమ్మిక. ఈ సన్నిహితత్వం స్థానిక ప్రభుత్వ సంస్థల స్థాయిలో ఏర్పడితే భారతదేశంలో బ్రిటిషు గుత్తాధికారానికేమీ ప్రమాదం వాటిల్లదు.

స్థానిక సంస్థలు మొట్టమొదట 1864-68 సంవత్సరాల మధ్య ఏర్పాటయ్యాయి. ఆనాడు దాదాపు ప్రతి స్థానికసంస్థ ప్రభుత్వం నియమించిన సభ్యులతో నిండిపోయింది. జిల్లా మేజిస్ట్రేటు అధ్యక్షత వహించేవాడు కాబట్టి ఆ సంస్థలకు స్థానిక స్వపరిపాలనా ప్రతిపత్తి లేకుండా పోయింది. విద్యావంతులైన భారతీయులు సైతం స్థానిక సంస్థల్ని ఆ రూపంలో ఆమోదించలేదు. వాటిని ప్రజల వద్దనుంచి అదనపు పన్నులు రాబట్టే సాధనాలుగా మాత్రమే గుర్తించారు.

1882లో లార్డ్‌రిప్పన్ ప్రభుత్వం సంకోచిస్తూనైనా ఒక్క అడుగు ముందుకు వేసింది. అదికూడా అసమగ్రమైన చర్యే. అయినప్పటికి ఎక్కువమంది అనధికార సభ్యులతో కూడిన గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల ద్వారా మాత్రమే స్థానిక వ్యవహారాలు నిర్వహింప బడాలని ప్రభుత్వం తీర్మానించింది. ఎన్నికలు ప్రవేశపెట్టటం ఎప్పుడు ఎక్కడ సాధ్యమని అధికారులు భావిస్తే అప్పుడు అక్కడ అనధికార సభ్యుల్ని ప్రజలే ఎన్నుకుంటారు. స్థానిక సంస్థ చైర్మన్‌గా (అధ్యక్షుడు) అనధికార సభ్యుని ఎన్నికకి ప్రభుత్వ తీర్మానం సమ్మతి తెల్పింది. ఈ తీర్మానం అమలుకు రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేశాయి. కాని అన్ని జిల్లా బోర్డుల్లో ఎక్కువ భాగం పురపాలక సంస్థల్లో ప్రజలెన్నుకున్న సభ్యులు మైనారిటీగా ఉన్నారు. ఓటుహక్కు కొద్దిమందికి మాత్రమే పరిమితం కావటాన ఎన్నికైన సభ్యులు కూడా కొద్దిమంది ఓటర్లతో ఎన్నిక కాబడ్డవారే. జిల్లా అధికార్లు జిల్లా బోర్డు అధ్యక్షులుగా కొనసాగారు. మున్సిపల్ కమిటీలకు మాత్రం క్రమేణా అనధికార్లు చైర్మన్లు అయ్యారు. స్థానిక సంస్థల కార్యకలాపాలను ఖచ్చితంగా, గట్టిగా అదుపుచేసే హక్కు ప్రభుత్వం ఉంచుకుంది. వాటిని ప్రభుత్వం లాగివేసుకోవచ్చు. తాత్కాలికంగా వాటిని స్తంభింప జేయవచ్చు. అది ప్రభుత్వం వారి ఇష్టం. ఫలితంగా కలకత్తా, బొంబాయి, మద్రాసు ప్రెసిడెన్సీ నగరాల్లో తప్ప మిగతా అన్నిచోట్లా స్థానిక సంస్థలు ప్రభుత్వ శాఖల మాదిరిగా పనిచేసాయి. అవి ఏ విధంగానూ స్థానిక స్వపరిపాలనకు చక్కని ఉదాహరణలుగా లేవు. అయినప్పటికీ కూడా రాజకీయ చైతన్యం కలిగిన భారతీయులు రిప్పన్ తీర్మానానికి స్వాగతం పలికారు. అవి మున్ముందు సమర్థవంతమైన స్థానిక స్వపరిపాలనా సంస్థలుగా రూపుదిద్దుకుంటాయనే ఆశతో వాళ్ళు ఈసంస్థల్లో చాలా చురుకుగా పనిచేశారు.

**సైన్యంలో మార్పులు:** 1858 తరువాత బ్రిటిషు పాలకులు భారత సైన్యాన్ని జాగరూకతతో పునర్ వ్యవస్థీకరించారు. రాజ్యాధికారం బ్రిటిషు చక్రవర్తికి బదిలీ కావడంతో కొన్ని మార్పులు అవసరమయ్యాయి. మళ్ళీ ఇంకొక తిరుగుబాటు చెలరేగకుండా నివారించే లక్ష్యంతో సైన్యం పునర్ వ్యవస్థీకరణ జరిగింది. తమ పరిపాలనకు బాయ్‌నెట్టే (తుపాకి సన్నీలే) శ్రీరామ రక్షగా పాలకులు గుర్తించారు. భారతీయ సిపాయిలు తిరిగి తిరుగుబాటు చెయ్యగలిగే శక్తిని పూర్తిగా పరిహరించ లేకపోయినా, బాగా తగ్గించటానికి అవసరమైన అనేక చర్యలు తీసుకోబడ్డాయి. మొట్టమొదట సైన్యంలో యూరోపియన్ విభాగం యొక్క ఆధిక్యతను చెక్కు చెదరకుండా నిలిపారు. యూరోపియన్ సైనికుల దామాషాను పెంచి బెంగాల్ సైన్యంలో

ప్రతి ఇద్దరు భారతీయ సిపాయిలకు ఒక ఇంగ్లీషు సైనికుడు. మద్రాసు, బొంబాయి సైన్యాలలో ప్రతి అయిదుగురు భారతీయ సైనికులకు ఇద్దరు ఇంగ్లీషు సైనికులు అనే నిష్పత్తిని నిర్ణయించారు. పైపెచ్చు కీకల భౌగోళిక, సైనిక స్థావరాలలో ఇంగ్లీషు సైనికుల్ని నిలిపారు. సైన్యంలో శతఘ్నుదళం వంటి కీలక శాఖల్ని తెల్ల సైన్యాల అధీనంలో ఉంచారు. తరువాత 20 వ శతాబ్దంలో ఉక్కు కవచాలు కలిగిన మోటార్లు టాంకుల సైన్య విభాగాల్ని కూడా ఇంగ్లీషు సైన్యం చేతుల్లో పెట్టారు. భారతీయుల్ని అధికార పదవులకెక్కనీకుండా తొక్కిపట్టే పూర్వ పద్ధతి కొనసాగింది. 1914 వరకు భారతీయుడనే వాడెవడూ సుబేదారు పదవిని దాటి పైకి పోయిన ఉదాహరణ లేదు. రెండు-భారత సిపాయిలు బ్రిటిషు వ్యతిరేక తిరుగుబాటులో ఒకే మనిషై విజృంభించకుండా అరికట్టేందుకు బ్రిటిషు పాలకులు 'చీలించి పాలించే' విధానాన్ని ప్రాతి పదికగా తీసుకుని భారత సైన్య విభాగాన్ని పునర్ నిర్మించారు. సైన్యంలో కొత్తవారిని చేర్చుకునే సందర్భంలో కుల, మత వివక్ష పాటించబడింది. భారతీయుల్లో యుద్ధప్రియవర్గం, యుద్ధ ప్రియులు కాని వర్గం అంటూ ఒక కృత్రిమ విభజన చేసి చీలిక సృష్టించారు. మొట్టమొదట బ్రిటిషువాళ్ళు ఈదేశాన్ని జయించటానికి తోడ్పడి, ఆ తరవాత 1857 తిరుగుబాటులో బ్రిటిషు వాళ్ళకి వ్యతిరేకంగా పోరాడిన అయోధ్య, బీహార్, మధ్య భారత్ సిపాయిల్ని యుద్ధ ప్రియులు కాని వర్గం కింద చేర్చారు. వాళ్ళని భారీ ఎత్తున సైన్యంలోకి చేర్చుకోలేదు. తిరుగుబాటు అణచివేతకు భుజం భుజం కలిపి పోరాడిన సిక్కులు, గూర్ఖాలు, పఠాన్లని క్షాత్ర వర్గంగా పరిగణించారు. వీళ్ళని భారీ ఎత్తున సైన్యంలో చేర్చుకున్నారు. ఇదిగాక వివిధ కులాలవార్ని, గ్రూపు వార్ని కలగా పులగం చేసి పటాలాలు తీర్చిదిద్దారు. తద్వారా ఒకరికొకర్ని పోటీగా పెట్టి సమతూకం సాధించారు. సైనికుల్లో జాతి, మతం, కుల, ప్రాంతీయ అభిమానాల్ని ప్రోత్సహించారు. అప్పుడు సైనికుల్లో జాతీయ భావం పెంపొందదని వాళ్ళ భావన. ఉదాహరణకు అనేక రెజిమెంట్లలో జాతి, కుల దళాల్ని ఏర్పాటు చేశారు. భారత రాజ్య కార్యదర్శి చార్లెస్ ఉడ్ 1861 లో వైస్రాయి కానింగ్‌కు ఇలా రాశాడు :

"అనుభూతుల్లో, సంవేదనల్లో, అభిమానాల్లో, పరస్పర సంబంధ బాంధవ్యాల్లో ఏకీభావం కలిగి తమ బలంలో విశ్వాసం పెంచుకుని, అందరూ కలిసి ఒక్కుమ్మడిగా తిరగబడ్డానికి అవకాశముండే ఒక మహా సైన్యాన్ని మళ్ళీ చూడ్డం నాకు గిట్టదు. ఒక రెజిమెంటు గనుక తిరగబడితే దానికి పూర్తిగా పరాయిదైన మరొక రెజిమెంటు తిరగబడ్డ రెజిమెంటు మీదికి కాల్పులు జరపటానికి సిద్ధంగా ఉండాలి. నాకు కావల్సింది అదే".

ఆ విధంగా భారత సైన్యం పదహారణాల కిరాయి బలగంగా ఉండిపోయింది. అదీగాక, సైన్యాన్ని మిగిలిన జనాబా జీవితానికి, ఆలోచనలకు విడంగా వేరుపర్చి ఉంచడానికి అన్ని చర్యలూ తీసుకోబడ్డాయి. సాధ్యమైనన్ని విధాలుగా సైన్యాన్ని జాతీయ భావాలకు దూరం చేశారు. వార్తా పత్రికల్ని, జర్నల్స్‌ని, జాతీయ భావాల్ని ప్రతిబింబించే పుస్తకాల్ని సైనికులకు అందుబాటులో లేకుండా చేశారు. ఎన్ని చేసినా, చిట్టచివరకు అటువంటి ప్రయత్నాలన్నీ కొరగాకుండా పోయాయి. భారత సైన్యంలో కొన్ని విభాగాలు స్వాతంత్ర్య సమరంలో ముఖ్యమైన పాత్ర నిర్వహించాయి.

**ప్రభుత్వోద్యోగాలు:** భారత ప్రభుత్వం మీద భారతీయులకు ఏమాత్రం

పట్టులేదని లోగడ చెప్పుకున్నాం. చట్టనిర్మాణంలోగానీ, పరిపాలనా విధానాల నిర్ణయంలోగానీ, భారతీయులకు ఏ పాత్రా లేకుండా చేశారు. దానికి తోడు ఈ విధానాలను అమలులో పెట్టే బ్యురోక్రసీ (ఉన్నద్యోగి వర్గం) తో భారతీయులకు చోటు పెట్టలేదు. పరిపాలనలో అధికారం, బాధ్యత కలిగిన పదవులన్నిటిని ఐసియన్ అధికార్లు ఆక్రమించేశారు. వీరంతా లండన్‌లో నిర్వహింపబడ్డ వార్షిక పోటీ పరీక్షల్లో నెగ్గి నియమితులైన వాళ్ళు. భారతీయులు కూడా ఈ పోటీ పరీక్షలో పాల్గొనవచ్చు. రవీంద్రనాథ టాగోర్ సోదరుడు సత్యేంద్రనాథ టాగోర్ 1863 లో జరిగిన పోటీ పరీక్షల్లో నెగ్గిన మొట్టమొదటి భారతీయుడు ఆ తరువాత దాదాపు ప్రతి యేటా ఒకరో ఇద్దరో భారతీయులు, అందరూ ఆర్రులు చాచే ఈ ఐసియన్ అధికార పదవిని అలంకరిస్తూ వచ్చారు. కాని ఇంగ్లీషు వాళ్ళతో పోలిస్తే భారతీయుల సంఖ్య అతి తక్కువ ఆచరణలో ఈ అత్యున్నత పరీక్ష ప్రవేశ ద్వారాలు ఈ దేశస్తులకు మూసుకు పోయినట్లే లెక్క ఎంచేతనంటే మనకు అనేక అవరోధాలు పోటీ పరీక్ష ఎక్కడో సుదూరంలో ఉన్న లండన్‌లో జరిగేది. మనకు విదేశీ భాష అయిన ఇంగ్లీషు మాధ్యమం (medium) లో ఈ పరీక్ష వ్రాయాలి పైగా, ప్రాచీన గ్రీకు, లాటిను పాండిత్య ప్రాతిపదిక మీద ఈ పరీక్ష ఆధారపడింది వాటిలో ప్రావీణ్యం పొందాలంటే లండన్‌లో బహుకాలం ఉండిపోయి, బోలెడు డబ్బు వెదజల్లి ఆ కోర్సు చదవాలి ఇవన్నీ గాక ఐసియన్‌లో చేరటానికి గరిష్ఠ వయోపరిమితి 1859 లో 23 సంవత్సరాలు. 1878 లో అది 19 సంవత్సరాలకు తగ్గించబడింది. ఇరవై మూడేళ్ళ భారతీయ అభ్యర్థికే అందులో నెగ్గడం కష్టతరమని అనిపిస్తే ఇంక పంతొమ్మిదేళ్ళ అభ్యర్థికి అది అందని మానుపండు.

పోలీసు, పబ్లిక్ వర్క్స్, వైద్యం, తంతి తపాల, అడవులు, ఇంజనీరింగ్, కస్టమ్స్, రైల్వే వగైరా ఇతర పరిపాలనా శాఖల్లో కూడా అత్యధిక వేతనాలు ముట్టే అత్యున్నత పదవులన్నీ బ్రిటిషు వారుల కోసం ప్రత్యేకించ బడ్డాయి.

కీలక పదవుల్లో యూరోపియన్ల మితిమీరిన ఈ మొగ్గు కాకతాళీయం కాదు భారతదేశంలో బ్రిటిష్ ఆధిపత్య పరిరక్షణకు ఇది అత్యవసరమని పరాయి పాలకుల విశ్వాసం. కనుకనే, భారత రాజ్య కార్యదర్శి లార్డ్ కింబర్లే 1893 లో "సివిల్ సర్వీసులో యూరోపియన్లు చాలినంత మంది ఉండడం తప్పనిసరి" అని నిర్దేశించాడు. వైస్రాయి లార్డ్ లాన్స్‌డేన్ ఇంకో అడుగు ముందుకు వేసి, "బ్రిటిషు సామ్రాజ్యం నిలబడాలంటే విశాల వ్యాప్తమైన సామ్రాజ్య ప్రభుత్వ వ్యవస్థ శేషరతుగా యూరోపియన్ల చేతుల్లో ఉండడం అవసరం" అని ఉద్ఘాటించాడు.

భారతీయుల ఒత్తిడి వల్ల 1918 తరువాత వివిధ ప్రభుత్వ సర్వీసుల్లో క్రమేణా భారతీయులు అల్లుకు పోగాసారు. అయినప్పటికీ అత్యున్నత అధికార పదవుల్లో కంట్రోలు స్థానాల్లో బ్రిటిషర్లే తిష్ఠవేశారు. ఈ సర్వీసుల్లో భారతీయులు అపరిమితంగా చొరబడ్డా రాజ్యాధికారం రవ్వంత కూడా వాళ్ళ చేతుల్లోకి రాలేదన్నది ప్రజలు సత్వరం గ్రహించారు. ఈ ఉద్యోగాల్లో భారతీయులు బ్రిటిషు పరిపాలనకు ఏజెంట్లుగా పని చేశారు. బ్రిటిషు సామ్రాజ్య ప్రయోజనాలకు విశ్వాసపాత్రంగా కొలువు చేశారు.

***స్వదేశ సంస్థానాలతో సంబంధాలు:*** 1857 తిరుగుబాటు ఫలితంగా బ్రిటిషువాళ్ళు స్వదేశీ సంస్థానాల పట్ల తమ వైఖరిని, విధానాన్ని మార్చుకున్నారు. 1857 కి ముందు స్వదేశ సంస్థానాల్ని బ్రిటిషు రాజ్యంలో విలీనం చేసుకోవడానికి

చేతికంది వచ్చిన ప్రతి అవకాశాన్ని వాడుకున్నారు. ఆ విధానాన్ని ఇప్పుడు వదిలేశారు. చాలామంది స్వదేశ రాజులు బ్రిటీషు ప్రభుత్వానికి విశ్వాసపాత్రులుగా ఉండడమే కాకుండా, తిరుగుబాటును అణచి వెయ్యడంలో సర్వ శక్తులు ఒడ్డి సహాయపడ్డారు. లార్డ్‌కానింగ్ ప్రశంసించినట్లుగా వాళ్ళు "తుఫానులో తరంగ విజృంభణని ఛేదించే అడ్డుగోడ" మాదిరిగా పనిచేశారు. వాళ్ళ రాజభక్తికి ప్రతిఫలంగా విక్టోరియా మహారాణి అభయ ముద్ర లభించింది. సంతతి లేనివారుగానీ, వారి వారసులు గానీ దత్తత చేసుకునే హక్కుని గౌరవిస్తామనీ, భవిష్యత్తులో వాళ్ళ సంస్థానాల ప్రాదేశిక సమగ్రతకు భంగం రానివ్వమనీ ప్రకటన వెలువడింది. ప్రజలు వ్యతిరేకత ప్రదర్శించే లేదా తిరగబడే సందర్భాలలో స్వదేశ సంస్థానాలు తమకు మద్దతుదార్లుగా మిత్రపక్షంగా వ్యవహరిస్తాయని 1857 తిరుగుబాటు అనుభవం బ్రిటీషు వాళ్ళకి నమ్మకం కలిగించింది. 1860లో లార్డ్ కానింగ్ ఇలా రాశాడు :

"మనం మొత్తం భారతదేశాన్ని జిల్లాలుగా విభజించి ఉంటే మన సామ్రాజ్యం 50 సంవత్సరాలపాటు కూడా మనగలిగే పరిస్థితిలో ఉండదని సర్‌జాన్ మాల్కోమ్ ఏనాడో చెప్పారు. రాజకీయాధికారం లేకుండా ఎన్ని సంస్థానాలనైనా మన ప్రభుత్వపు పనిముట్లుగా చేసుకొని వుంటే మన నౌకా బలాధిక్యం సాగినంతకాలం భారతదేశంలో మనకు భీకా ఉండదు. ఆ అభిప్రాయంలోని తిరుగులేని నిజం గురించి నాకెలాంటి అనుమానం లేదు. ఇటీవల జరిగిన సంఘటనల వెలుగులో దీని ప్రాధాన్యం ఎప్పుడూ లేనంత ఎక్కువగా మన దృష్టికి గోచరిస్తున్నది".

కాబట్టి, భారతదేశంలో బ్రిటీషు పాలనకు స్వదేశ సంస్థానాలను పటిష్టమైన ఆధారంగా చేసుకోవడానికి నిర్ణయం జరిగింది. "స్వదేశ సంస్థానాలను సామ్రాజ్యానికి బురుజులాగా వదిలపర్చుకోవటమనేది ఆనాటి నుంచి బ్రిటీషు విధానానికి మూలసూత్రమైంది." అని ఇంగ్లీషు చరిత్రకారుడు రాబర్ట్స్ సైతం గుర్తించాడు.

వాటిని చిరస్థాయిగా నిలబెట్టటం స్వదేశ సంస్థానం పట్ల బ్రిటీషు రాజనీతిలోని ఒక అంశం. ఇదిగాక, మరొక అంశం కూడా బ్రిటీషు విధానంలో గర్భితమైవుంది. అది- బ్రిటీషు పాలకులకు సంస్థానాల సంపూర్ణమైన లొంగుబాటు. 1857 తిరుగుబాటుకు ముందునుంచీ కూడా బ్రిటీషు వాళ్ళు సంస్థానాల అంతరంగిక వ్యవహారాల్లో ఆచరణ రీత్యా జోక్యం కల్పించుకొంటూనే ఉన్నారు. సిద్ధాంత రీత్యా అవి సర్వ స్వతంత్రాధికారం కలిగిన అధీన రాజ్యాలు. ఆ పరిస్థితి ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. సంస్థానాధీశులు అవిచ్ఛిన్నంగా కొనసాగేందుకు ఖరీదు చెల్లించాల్సి వచ్చింది. వాళ్ళు బ్రిటీషు సర్వసమున్నతత్వాన్ని (Paramountacy) అంగీకరించవలసి వచ్చింది. బ్రిటీషు రాజు అఖిల భారతానికి సర్వసమున్నత అధిపతిగా, తిరుగులేని పాలకుడుగ అగ్రాసనం అధిష్ఠించాడని 1862లో లార్డ్ కానింగ్ ప్రకటించాడు. యావత్ భారత ఉపఖండం మీద బ్రిటీషు సార్వభౌమత్వాన్ని నిరూపించడం కోసం 1876లో విక్టోరియా మహారాణి భారత సామ్రాజ్ఞిగా బిరుదు ధరించింది. స్వదేశ సంస్థానాధీశులు కేవలం బ్రిటీషు రాజ ప్రభుత్వ ఏజెంట్లుగా మాత్రమే తమ సంస్థానాల్ని పరిపాలిస్తారని లార్డ్ కర్జన్ తరువాత స్పష్టం చేశాడు. సంస్థానాధీశులు ఈ పరాధీన స్థితిని అంగీకరించారు. తమ సంస్థానాల్ని పరిపాలించుకునే సౌకర్యం కొనసాగుతుందనే అభయముద్ర పొందిన కారణంగా సంస్థానాధీశులు బ్రిటిషు సామ్రాజ్యంలో తక్కువ శ్రేణి భాగస్వాములు

కావడానికి సుముఖులయ్యారు.

సర్వోన్నత అధిపతిగా బ్రిటీషువాళ్ళు స్వదేశ సంస్థానాల అంతరంగిక ప్రభుత్వ నిర్వహణని అజమాయిషీ చేసే హక్కుని స్వాయత్తం చేసుకున్నారు. తమ రాజప్రతినిధుల ద్వారా (Residents) దైనందిన ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం కలిగించుకోవడమే కాకుండా సంస్థానాల్లో మంత్రులు మొదలైన ఉన్నత పదవులకు నియామకాలు, తొలగింపులు కూడా వాళ్ళు శాసించారు. కొన్ని సందర్భాల్లో సంస్థానాధీశుల్నే తొలగించారు; లేదా వాళ్ళ అధికారాన్ని ఊడబెరికారు. బ్రిటీషు ఇండియాలో సంస్థానాల సంలీనాన్ని సమగ్రవంతం చేసేందుకు వాటికి ఆధునిక పరిపాలనా వ్యవస్థ ప్రసాదించాలనే కాంక్ష వాళ్ళని అడుగడుగునా జోక్యం కలిగించుకునేలా ప్రేరేపించింది. బ్రిటీషు ఇండియాలో వాటి సంలీనం, తద్వారా వాటి అంతరంగిక వ్యవహారాల్లో పెచ్చు పెరిగిన బ్రిటీషువారి జోక్యం - ఈ రెంటికీ అఖిల భారత రైలు మార్గాలు, తంతి తపాలా వ్యవస్థ, కరెన్సీ విధానం (ద్రవ్య చలామణీ), సమిష్టి ఆర్థిక జీవనం తోడ్పడ్డాయి. చాలా సంస్థానాల్లో ప్రజాతంత్ర జాతీయోద్యమాలు వృద్ధి పొందటం వల్ల కూడా బ్రిటీషు వాళ్ళ జోక్యం చోటు చేసుకుంది. ఒక వైపు బ్రిటీషు అధికార్లు ఈ ఉద్యమాల అణచివేతకు సంస్థానాధీశులకు సాయపడ్డారు. మరొకవైపు, ఆ సంస్థానాల్లో అదుపు మీరిన అక్రమ పరిపాలనకు స్వస్తి చెప్పడానికి ప్రయత్నించారు.

స్వదేశ సంస్థానాల పట్ల బ్రిటీషు విధానంలో వచ్చిన మార్పు మైసూరు, బరోడా సంస్థానాల విషయంలో స్పష్టంగా వెల్లడయింది. లార్డ్‌బెంటింక్ 1831లో మైసూరు సంస్థానాధీశుణ్ణి పదవీభ్రష్టుణ్ణి చేసి, సంస్థాన పరిపాలనని స్వాధీనం చేసుకున్నాడు. 1868 తరువాత బ్రిటీషు ప్రభుత్వం పాత సంస్థానాధీశుని దత్తపుత్రుణ్ణి రాజ్యవారసుడుగా గుర్తించి సంస్థానం మొత్తాన్ని అతనికి అప్పగింత పెట్టింది. బరోడా రాజు మల్హరరావు గయక్వాడ్ అసమర్థుడని, అక్రమపాలన సాగిస్తున్నాడనీ, బ్రిటీషు రెసిడెంటు (అధివాసి) కు విషమిచ్చి చంపించడానికి ప్రయత్నిస్తున్నాడనే నేరం ఆరోపించి బ్రిటీషు ప్రభుత్వం అతణ్ణి తొలగించింది. అయితే, బరోడా సంస్థానాన్ని మాత్రం బ్రిటీషు ఇండియాలో కలిపివేసుకోకుండా, అతని వంశంలో మరొక చిన్నవానిని సంస్థానాధీశుడుగా నిర్ణయించింది.

**పాలనా విధానాలు:** భారతదేశం పట్ల బ్రిటీషువారి వైఖరీ, తత్ఫలితంగా వారి విధానాలు 1857 లో తిరుగుబాటు తరువాత దిగజారిపోయాయి. 1857 కు ముందు పెద్దగా ఉత్సాహం ప్రదర్శించక పోయినా, నత్తనడకలు నడుస్తూ అయినా భారతదేశాన్ని ఆధునిక పథంలో పెట్టడానికి కొంత ప్రయత్నించారు. 1857 తరువాత బుద్ధిపూర్వకంగా అభివృద్ధి నిరోధక విధానాలు అవలంభించటం ప్రారంభించారు. పెర్సివల్ స్పియర్ అనే చరిత్రకారుని మాటల్లో "అభ్యుదయంతో బ్రిటీషు శృంగారదాంపత్య యాత్ర ముగిసిపోయింది".

పరిపాలనలో సమర్థవంతమైన భాగస్వామ్యం దక్కనివ్వకుండా భారతీయుల్ని పరిపాలనా నియంత్రణాంగాల నుంచి, భారత సైన్యం నుంచి, ఉన్నత ప్రభుత్వోద్యోగాల నుంచి ఎలా మినహాయించారో లోగడ పరిశీలించాం. బ్రిటీషు వాళ్ళు భారతీయుల్ని "స్వపరిపాలన" కొరకు సంసిద్ధుల్ని చేస్తున్నారన్న భావనకు కనీసం నోటిమాటగానైనా

కొద్ది గౌరవం ఉండేది. ఇప్పుడదీ పోయింది. భారతీయులు తమను తాము పరిపాలించుకునేపాటి అర్హత కూడా లేనివాళ్ళని ప్రచారం సాగింది. వాళ్ళని నిరవధికంగా బ్రిటీషువాళ్ళే పరిపాలించాలని బాహాటంగా ప్రచారం చేశారు. ఈ ప్రగతి నిరోధక విధానం అనేక రంగాలలో బహిర్గతమైంది.

***చీలించి పాలించు:*** భారత స్వదేశ రాజుల మధ్య అనైక్యతని ఆసరాగా తీసుకొని, వాళ్ళని ఒకరిమీదికొకరిని కవ్వించి బ్రిటీషువాళ్ళు భారతదేశాన్ని జయించారు. 1858 తరువాత కూడా వాళ్ళు అదే చీలించి పాలించే విధానాన్ని అనుసరించి ప్రజలకు వ్యతిరేకంగా స్వదేశ సంస్థానాధీశుల్ని, ఒకరాష్ట్రానికి వ్యతిరేకంగా మరొక రాష్ట్రాన్ని, ఒక కులానికి వ్యతిరేకంగా మరొక కులాన్ని, హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలని ఉసిగొల్పారు.

1857 తిరుగుబాటు కాలంలో హిందూ ముస్లిములుభయులూ ప్రదర్శించిన ఐక్యత విదేశ పాలకుల గుండెల్ని కలచివేసింది. దినదినాభివృద్ధి చెందే జాతీయోద్యమాన్ని బలహీనపర్చటానికి బ్రిటీషువాళ్ళు హిందూ - ముస్లిముల మధ్య ఈ ఐక్యతని, సఖ్యతని బద్దలు కొట్టాలని పట్టుపట్టారు. ఈ సందర్భంగా పనికి వచ్చే ఏ అవకాశాన్ని వాళ్ళు జారవిడుచుకోలేదు. తిరుగుబాటు ముగిసిపోయిన తక్షణం వాళ్ళు ముస్లిముల్ని అణచివేశారు; వాళ్ళ ఆస్తిపాస్తుల్ని, భూముల్ని పెద్ద ఎత్తున ఆక్రమించుకున్నారు. హిందువులు తమకు అభిమాన పాత్రులని ప్రకటించుకున్నారు. 1870 తరువాత ఈ విధానం తారుమారయింది. ఉన్నత, మధ్య వర్గాల ముస్లిం ప్రజల్ని జాతీయోద్యమానికి వ్యతిరేకంగా తిప్పటానికి ప్రయత్నం జరిగింది.

విద్యావంతులైన భారతీయుల మధ్య మతతత్వ ప్రాతిపదిక మీద చీలిక తేవటానికి ప్రభుత్వం ప్రభుత్వోద్యోగాల ఆకర్షణని తెలివిగా వాడుకున్నది. పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా వెనుకబడి ఉండటం వల్లా, సాంఘిక సంక్షేమ కార్యకలాపాలు దాదాపూ మృగ్యం కావటంవల్లా విద్యావంతులైన భారతీయులు పూర్తిగా ప్రభుత్వోద్యోగాల మీద ఆధారపడ్డారు. ఇతర రంగాలలో ఎక్కడా ఉద్యోగావకాశాలనేవి దాదాపూ లేవు. కాబట్టే ఉన్న కొద్ది ప్రభుత్వోద్యోగాలకోసం తీవ్రమైన పోటీ ఏర్పడింది. ప్రభుత్వం ప్రాంతీయ, కుల, మత వైరుధ్యాల్ని, వైషమ్యాల్ని రెచ్చగొట్టటానికి ఈ పోటీని వాడుకుంది. రాజభక్తికి ప్రతిఫలంగా మతతత్వ ప్రాతిపదిక మీద అధికారిక పక్షపాతం చూపడానికి ఆశపెట్టింది. విద్యావంతులైన ముస్లిములను విద్యావంతులైన హిందువులకు వ్యతిరేకంగా ఉసిగొల్పింది.

***విద్యావంతులైన భారతీయులపట్ల శత్రుత్వభావం:*** బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం 1833 తరువాత ఆధునిక విద్యని చురుగ్గా ప్రోత్సహించింది. 1857లో కలకత్తా, బొంబాయి, మద్రాసు విశ్వవిద్యాలయాలు ప్రారంభమయ్యాయి. అది మొదలు ఉన్నత విద్య వేగంగా వ్యాప్తి చెందింది. 1857 తిరుగుబాటులో చేరటానికి నిరాకరించిన విద్యావంతులైన భారతీయుల్ని బ్రిటీషు ప్రభుత్వం ప్రశంసించింది. కాని విద్యావంతులపట్ల ప్రభుత్వ అనుకూల వైఖరి చప్పున మారిపోయింది. ఎంచేతనంటే విద్యావంతుల్లో కొందరు కొత్తగా తాము సంపాయించిన ఆధునిక విజ్ఞానం వెలుగులో బ్రిటీషు పరిపాలన యొక్క సామ్రాజ్యవాద స్వభావాన్ని విశ్లేషించడం మొదలు పెట్టారు. పరిపాలనలో భారతీయులకు భాగస్వామ్యం ఉండాలని డిమాండు చెయ్యసాగారు. ఈ

విద్యావంతులు ప్రజల్లో జాతీయోద్యమ నిర్మాణానికి పూనుకొని 1885లో భారత జాతీయ కాంగ్రెస్‌ని స్థాపించడంతో, ఉన్నత విద్యపట్ల, విద్యావంతులైన భారతీయుల పట్ల బ్రిటీషు అధికార్లకి కంపరం పుట్టింది. ఉన్నత విద్య మీద కోత విధించటానికి అధికార్లు గట్టి చర్యలకు పూనుకున్నారు. విద్యావంతులైన భారతీయులందర్నీ ఒకే గాట కట్టి "బాబు"లని అవహేళన చేశారు.

ఆధునిక పాశ్చాత్య విజ్ఞానాన్ని ఆకళించుకుని, ఆధునిక పంథాలో అభ్యుదయం కోసం దీక్ష పూనిన భారతీయుల వర్గానికి వ్యతిరేకంగా బ్రిటీషు వాళ్ళు కత్తికట్టారు. భారతదేశంలో బ్రిటీషు సామ్రాజ్యవాద మౌలిక ప్రయోజనాలకు, విధానాలకు అటువంటి అభ్యుదయం గొడ్డలిపెట్టు. భారతదేశంతో అభ్యుదయ సాధనకు బ్రిటీషు పరిపాలనకున్న వనర్లు యావత్తూ ఖాళీ అయిపోయాయన్న వాస్తవం విద్యావంతులయిన భారతీయుపట్ల, ఉన్నత విద్యపట్ల అధికార్లు ప్రదర్శించే ప్రాతికూల్యం ద్వారా బహిర్గతమైంది.

***జమీందార్లపట్ల బ్రిటిష్ వైఖరి:*** పురోగామి దృక్పథం కలిగిన విద్యావంతులయిన భారతీయుల పట్ల శత్రుత్వం పూనిన బ్రిటిషు ప్రభుత్వం ఇప్పుడు దేశంలో మహా అభివృద్ధి నిరోధక ముఠా అయిన జమీందార్లని, రాజుల్ని, భూస్వాముల్ని దువ్వటం మొదలుపెట్టింది. అభివృద్ధి చెందుతున్న జాతీయోద్యమానికి అడ్డకట్టగా స్వదేశ రాజుల్ని ఉపయోగించుకోవాలనే బ్రిటిషు రాజనీతి విధానాన్ని గురించి లోగడ చర్చించాం. ప్రభుత్వం జమీందార్లనీ, భూస్వాముల్ని అదేవిధంగా లోడగొట్టింది. ఉదాహరణకు, అయోధ్య రాజ్యంలో తాలూకాదార్లకి లోగడ వశపరుచుకున్న భూముల్ని తిరిగి అప్పజెప్పింది. భారత ప్రజల సాంప్రదాయక, 'సహజ' నాయకులుగా జమీందార్లని, భూస్వాముల్ని కీర్తించింది. వాళ్ళ ప్రయోజనాల్ని, ప్రత్యేక హక్కుల్ని పరిరక్షించింది. రైతాంగం పొట్టకొట్టి, జమీందార్లకి భూములు అప్పగింత పెటింది. జాతీయ భావాలు కలిగిన మేధావి వర్గానికి పరితూకంగా జమీందారీ, భూస్వామ్య వర్గాల్ని ఉపయోగించుకుంది. ఇక మీదట "శక్తివంతమయిన దేశీయకులీన వర్గపు ఆశలతో, ఆకాంక్షలతో, సహానుభూతులతో, ప్రయోజనాలతో బ్రిటిషు రాజప్రభుత్వం తాదాత్మ్యం ప్రదర్శిస్తుంద"ని వైస్రాయి లార్డ్ లిట్టన్ 1876లో బహిరంగంగా ప్రకటించాడు. జమీందార్లు, భూస్వాములు తమ స్థానం బ్రిటిషు పరిపాలన సాగుదలతో ముడిపడి ఉందని గ్రహించారు. కాబట్టి వాళ్ళకు గట్టి మద్దతుదార్లుగా నిలబడ్డారు.

***సామాజిక సంస్కరణ పట్ల బ్రిటిష్‌వాళ్ళ వైఖరి:*** బ్రిటిషువాళ్ళు సాంప్రదాయ పరాయణ వర్గాలతో పెట్టుకున్న మైత్రిలో భాగంగా, సంఘ సంస్కర్తలకు సహాయపడే పూర్వపు విధానాన్ని ఇప్పుడు మానుకున్నారు. సతీ సహగమన పద్ధతి రద్దు, వితంతు పునర్వివాహాలకు మద్దతువంటి సాంఘిక సంస్కరణలు 1857 తిరుగుబాటుకు ప్రధాన కారణం అయ్యాయని వాళ్ళు నమ్మారు. దాంతో, పూర్వాచార పరాయణుల వైపు మొగ్గి సంస్కర్తలకు తమ మద్దతు ఉపసంహరించుకున్నారు

జవహర్‌లాల్ నెహ్రూ తన "డిస్కవరీ ఆఫ్ ఇండియా" గ్రంథంలో ఇలా రాశారు: "భారతదేశంలోని అభివృద్ధి నిరోధకులతో బ్రిటిషు ప్రభుత్వపు ఈ సహజమైత్రి కారణంగా, అది అన్యథా ఖండించే అనేక దురాచారాల్ని సంరక్షించి పైకెత్తటానికి తయారయింది". నిజానికి బ్రిటిషు ప్రభుత్వం ఈ సందర్భంలో గొప్ప

సందిగ్ధంలో కొట్టుమిట్టాడింది. సాంఘిక సంస్కరణని అభిమానించి, తదనుగుణంగా చట్టాలు చేస్తే ఛాందసులు ప్రతిఘటిస్తారు; భారతీయుల అంతరంగిక సాంఘిక వ్యవహారాల్లో పరాయి ప్రభుత్వం జోక్యం కలిగించుకొనే హక్కులేదని వాళ్ళు గొంతు చించుకుంటారు. పోనీ, సంస్కరణలకు అనుకూలంగా చట్టాలు చెయ్యటం విరమించుకుంటే సాంఘిక దురాచారాలు కొనసాగడానికి తోడ్పడిన వాళ్ళవుతారు. భారతీయుల్లో ప్రగతిశీల భావాలు కలిగిన వర్గం బ్రిటిషు వాళ్ళని దుయ్యబడుతుంది. సామాజిక సమస్యకు సంబంధించి, బ్రిటిషు పాలకులు సర్వదా తటస్థంగా లేరనే అంశాన్ని ఈ సందర్భంలో మర్చిపోకూడదు. యధాతధ స్థితికి మద్దతు ఇవ్వటమంటే సాంఘిక దురాచాలకు పరోక్షంగా రక్షణ కల్పించటమే. పైపెచ్చు రాజకీయ ప్రయోజనాల కోసం కుల, మత తత్వాన్ని ఎగదొయ్యడం ద్వారా బ్రిటిషు వాళ్ళు ఈ దేశంలో సామాజికంగా అభివృద్ధి నిరోధకత్వాన్ని చురుగ్గా ప్రోత్సహించారు.

***సాంఘిక శ్రేయో కార్యక్రమాల్లో విపరీతమైన వెనుకబాటుతనం:*** విద్య, పారిశుధ్యం, ప్రజారోగ్యం, నీటిసరఫరా, గ్రామీణ రహదారుల వంటి సామాజిక సేవా కార్యక్రమాలు 19 వ శతాబ్దంలో యూరప్‌లో శీఘ్ర పురోగతి చెందాయి. కాని, భారతదేశం మాత్రం ఈ రంగంలో అతి వెనుకబడి ఉంది. బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం తన రాబడిలో అత్యధిక భాగం సైన్యం మీద, యుద్ధాల మీద, పరిపాలన యంత్రాంగం మీద ఖర్చుపెట్టి సాంఘిక సంక్షేమ కార్యక్రమాల్ని ఎండగట్టింది. ఉదాహరణకు 1986లో మొత్తం నికరాదాయం 47 కోట్లలో 19.41 కోట్లు సైన్యానికి, 17 కోట్లు పౌర పరిపాలన నిర్వహణకు ఖర్చయ్యాయి. విద్య, వైద్యం, ప్రజారోగ్యం వగైరా సాంఘిక సంక్షేమ కార్యక్రమాలకు ముష్టి రెండు కోట్లు ఖర్చుపెట్టింది. పారిశుధ్యం, నీటి సరఫరా, ప్రజారోగ్యం మొదలైన శ్రేయో కార్యక్రమాలు కూడా సాధారణంగా పట్టణ ప్రాంతాలకు మాత్రమే పరిమిత మయ్యాయి. పట్టణ ప్రాంతాల్లో కూడా బ్రిటిషు వాళ్ళు నివసించే వాడలకు, కొత్తగా కట్టిన పేటలకు మాత్రమే ఈ సౌకర్యాలు సమకూరాయి. పట్టణాల్లో యూరోపియన్లు, ఉన్నత వర్గాల భారతీయులు నివసించే ప్రాంతాలకు మాత్రమే ఈ సదుపాయాలు అందుబాటయ్యాయి.

***కార్మిక చట్టాలు :*** 19 వ శతాబ్దంలో ఆధునిక కర్మాగారాల్లో, కాఫీ, తేయాకువంటి తోటల్లో పని చేసే కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది. రోజుకి 12-16 గంటలపాటు రెక్కలు ముక్కలు చేసుకునేవాళ్ళు. వారానికి ఒక్కరోజయినా శలవనేది లేదు. పురుషులతోపాటే స్త్రీలు, పిల్లలు కూడా 12 నుండి 16 గంటలు పాటు అవిరామంగా పరిశ్రమించేవాళ్ళు. ఫ్యాక్టరీలు లొద తొక్కిడిగా ఉండేవి. కనీసం సరయినా గాలి, వెలుతురు ప్రసరించేవి కావు. అతి అనారోగ్యకర వాతవరణంలో కార్మికులు పనిచేసేవాళ్ళు. యంత్ర భూతపు పెనుకోరల్లో ప్రమాదాలు సర్వసాధారణమై పోయాయి.

సాధారణంగా పెట్టుబడిదారీ విధానానికి అనుకూలంగా ఉండే బ్రిటిషు ఇండియా ప్రభుత్వం ఈ దుర్భర పరిస్థితుల్ని చక్కదిద్దటానికి చాలీచాలని కొన్ని కంటితుడుపు చర్యలు తీసుకున్నది. ఆనాడు చాలా ఫ్యాక్టరీలు భారతీయుల యాజమాన్యంలో ఉండేవి. ఫ్యాక్టరీ చట్టాలు తెమ్మని బ్రిటిషు పారిశ్రామికులు ప్రభుత్వాన్ని నిరంతరం ఒత్తిడి పెట్టారు. కారుచౌకగా లభించే కార్మిక శక్తితో భారత పారిశ్రామిక యజమాన్లు

ఇండియన్ మార్కెట్‌లో తమని అధిగమించి పోతారేమోనని బ్రిటిషు పరిశ్రమల యజమాన్ల భయం. అయితే, బ్రిటిష్ ప్రభుత్వం కార్మికులకు సంబంధించి పాక్షికంగా నయినా మానవతా దృష్టితో వ్యవహరించింది. మొట్టమొదటి ఫ్యాక్టరీ చట్టం 1881లో ఆమోదించ బడింది. ఈ చట్టం ప్రాథమికంగా బాలకార్మికులకు సంబంధించింది. ఏడేళ్ళలోపు పిల్లలు ఫ్యాక్టరీల్లో పనిచేయకూడదని ఈ చట్టం నిర్దేశించింది. 7-12 సంవత్సరాల మధ్య వయస్సుగల పిల్లలు రోజుకు 9 గంటలకన్నా ఎక్కువ పని చెయ్యకూడదని కూడా నిర్దేశించింది. ప్రమాద భరితమైన యంత్రాలకు చుట్టూ కంచె ఏర్పాటు చెయ్యాలని కూడా ఈ చట్టం ఆదేశించింది. 1891లో రెండవ ఫ్యాక్టరీ చట్టం పాసయింది. దీని ప్రకారం, కార్మికులుకు వారంలో ఒకరోజు శలవు లభించింది. స్త్రీల చేత రోజుకి 11 గంటలు మాత్రమే పని చేయించాలని నిబంధన ఏర్పరిచింది. పిల్లలు 7 గంటలకన్నా ఎక్కువ పనిచెయ్యకూడదని కట్టడి చేసింది. పురుషులకు సంబంధించినంత వరకూ పనిగంటల విషయంలో మార్పులేదు.

ఈ రెండు చట్టాలూ కూడా బ్రిటిషువారి యాజమాన్యంలోని కాఫీ, తేయాకు తోటల్లో పనిచేసే కార్మికులకు వర్తించలేదు. పైగా ప్రభుత్వం ఈ విదేశ యజమానులకు కార్మికుల్ని నిర్దాక్షిణ్యంగా దోచుకోవడానికి అన్ని వసతులూ కల్పించింది. తేయాకు తోటల్లో ఎక్కువభాగం అస్సాంలో ఉండేవి. అస్సాము స్వల్ప జనాభా కలిగిన రాష్ట్రం; పైగా అనారోగ్య వాతావరణం. కాబట్టి అస్సాం తేయాకు తోటల్లో పనిచేయించటానికి కార్మికుల్ని బయటినుండి తేవలసి వచ్చింది. హెచ్చు కూలి ఇస్తామని టీ తోటల యజమాన్లు బయటి కార్మికుల్ని ప్రలోభ పెట్టలేదు. బలవంతంగానూ, తప్పుడు పద్ధతులు ద్వారాను కార్మికుల్ని రప్పించి , తోటల్లో కట్టుబానిసల క్రింది కట్టిపడవేశారు. బ్రిటిషు ఇండియా ప్రభుత్వం టీ తోటల యజమానులకు సంపూర్ణమైన మద్దతు అందించింది. 1863, 1865, 1870, 1873, 1882 సంవత్సరాల్లో టీ తోటల యజమానులకు అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకంగా పీనల్ చట్టాలు (శిక్ష విధించే శాసనాలు) చేసింది. కార్మికుడు ఒకసారి కాంట్రాక్టులో చేవ్రాలు చేస్తే, అతనికి విముక్తి లేదు. బ్రతికినంతకాలం తోటకి అంకితమై పోవలసిందే. తోటల్లో పనిచెయ్యనని నిరాకరించే వీలులేదు. ఒప్పందానికి భిన్నంగా ప్రవర్తించటం శిక్షార్హమైన నేరం. ఆ విధంగా ప్రవర్తించిన కార్మికుణ్ణి యజమాని అరెస్టు చెయ్యవచ్చు.

కిర్మాకులకు కొంతమేలు చేసే చట్టాలు 20వ శతాబ్దంలో అమలులో కొచ్చాయి. ట్రేడ్ యూనియన్ (కార్మిక సంఘం) ఉద్యమం వృద్ధి కావటం వల్ల ఇది సాధ్యమైంది. అయినప్పటికీ, భారత కార్మికవర్గ పరిస్థితులు దయనీయంగా, శోచనీయంగా మిగిలిపోయాయి.

***పత్రికలపై నిర్బంధాలు :*** బ్రిటిషు వాళ్ళు భారతదేశంలో అచ్చు యంత్రాల్ని ప్రవేశపెట్టటం ద్వారా ఆధునిక పత్రికా ప్రచురణ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ప్రజాభిప్రాయాన్ని చైతన్యవంతంగా తీర్చిదిద్దడానికిగాని, విమర్శ అభిశంసనలద్వారా ప్రభుత్వ విధానాన్ని ప్రభావితం చేయడానికిగాని పత్రిక గొప్ప ప్రచార సాధనమని విద్యావంతులయిన భారతీయులు గుర్తించారు. రామమోహనరాయ్, విద్యాసాగర్, దాదాభాయ్ నౌరోజీ, జస్టిస్ రానడే, సురేంద్రనాథ్ బెనర్జీ, లోకమాన్య తిలక్, జి. సుబ్రమణ్య అయ్యర్, సి.కరుణాకరమీనన్, మదనమోహనమాలవీయ,

లాలాలజపత్ రాయ్, బిపిన్ చంద్రపాల్ ప్రభృత ప్రముఖ భారతీయ నాయకులు వార్తా పత్రికల్ని ప్రారంభించి, వాటిని శక్తివంతమైన రాజకీయ ఆయుధంగా తీర్చిదిద్దటంలో ముఖ్యపాత్ర నిర్వహించారు. క్రమేణా, పత్రికలు జాతీయోద్యమానికి ప్రధానమైన ఆయుధంగా పరిణతి చెందాయి.

చార్లెస్ మెట్కాఫ్ 1835లో భారతీయ పత్రికలమీద నిర్బంధాలు తొలగించాడు విద్యావంతులైన భారతీయులు ఈ చర్యని గొప్పగా హర్షించారు. విద్యావంతులు భారతదేశంలో బ్రిటిషు పాలనని కొంతకాలంపాటు సమర్థించటానికి ఇది కూడా ఒక కారణం. కాని జాతీయవాదులు ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని ఉద్దీపింపచెయ్యడానికి, ప్రభుత్వ ప్రగతి నిరోధక విధానాల్ని దుయ్యబట్టడానికి పత్రికని ఆయుధంగా ఉపయోగించటం ప్రారంభించేసరికి అధికార్లు భారతీయ పత్రికలమీద కత్తికట్టారు. పత్రికా స్వేచ్ఛని అణచివెయ్యాలని నిర్ణయించారు. 1878లో చేసిన దేశభాషా పత్రికల చట్టం ఈ దిశలో మొట్టమొదటి చర్య. ఈ చట్టం భారతీయ భాషల్లో వెలువడే పత్రికలమీద తీవ్ర నిర్బంధాలు విధించింది భారత ప్రజాభిప్రాయం ఈ చట్టానికి వ్యతిరేకంగా ఉవ్వెత్తున లేచింది. ఈ ప్రతిఘటన ఫలితంగా 1882లో ఈ చట్టానికి ఉద్వాసన జరిగింది ఆ తరువాత దాదాపు 25 సంవత్సరాలపాటు భారతీయ పత్రికా ప్రపంచం గణనీయమైన స్వేచ్ఛ అనుభవించింది. 1905 దరిమిలా సమరశీల స్వదేశీ ఉద్యమం, బహిష్కరణోద్యమం ఉప్పొంగటంతో అణచివేత చట్టాలు అమలులోకి వచ్చాయి.

**జాతి వైషమ్యం:** భారతదేశంలో బ్రిటిషు వాళ్ళు సర్వదా భారతీయులకి దూరంగా తప్పుకుని తిరిగారు. జాతిపరంగా భారతీయులకన్నా తాము అధికులమనే భావంతో విర్రవీగారు. 1857 తిరుగుబాటుగానీ ఆ తిరుగుబాటులో ఉభయ పక్షాలూ చేసిన ఘాతుకాలుగానీ బ్రిటిషు వాళ్ళకి భారతీయులకు మధ్య అగాధాన్ని మరింత పెంచాయి. బ్రిటిషువాళ్ళు తమ జాతి ఆధిక్యతని బాహాటంగా చాటుకోవడం, జాత్యంహంకారాన్ని ప్రదర్శించటం ప్రారంభించారు. రైలుపెట్టెల్లో, విశ్రాంతి గదుల్లో, పార్కుల్లో, హోటళ్ళలో, ఈత కొలనుల్లో, క్లబ్బుల్లో ఇంకా అనేక విషయాల్లో "యూరోపియన్లకు మాత్రమే" అని బోర్డులు తగిలించి తమ జాత్యహంకారాన్ని ప్రదర్శించుకున్నారు. భారతీయులు తమకు అవమానం జరిగినట్టుగా భావించారు. జవహర్‌లాల్ నెహ్రూ మాటల్లో:

"బ్రిటిషుపాలన మొదలయిందిలగాయతు భారతదేశంలో మనకు ఈ జాతివివక్ష విశ్వరూపం ప్రత్యక్షమైంది. యజమాని జాతి అనేది ఈ పాలనకు సైద్ధాంతిక పునాది. యజమాని జాతి అనే భావన సామ్రాజ్యవాదంలో అంతర్నిహితంగా ఉంది. నా మాటల్లో ఆక్షేపణ లేదు. అధికారంలో ఉన్నవాళ్ళు దీన్ని నిర్ద్వందంగా ప్రకటించారు. మాటలకన్నా ఆ తరువాత చేసి చూపిన చేష్టలు ఇంకా పటుతరమైనవి. తరతరాలు ఏళ్ళకి ఏళ్ళు భారతదేశం ఒక జాతిగా, భారతీయులు వ్యక్తులుగా అవమానానికి, తీవ్ర తిరస్కారానికి, ఘోర నిరాదరణకి గురి అయ్యారు. ఇంగ్లీషువాళ్ళు సామ్రాజ్య చక్రం తిప్పే జాతి అనీ, మనల్ని పాలించటానికి, బానిసలుగా అణచిపెట్టి ఉంచటానికి వాళ్ళకి దైవదత్తమైన హక్కు ఉందనీ మనకు నూరిపోశారు. మనం ప్రతిఘటించినప్పుడు రాజ్యమేలే ఆ జాతి పెద్దపులి లక్షణాల్ని గుర్తు చేశారు"

# భారతదేశ-పొరుగు రాజ్యాలు

బ్రిటిషు పరిపాలనలో భారతదేశం తన పొరుగుదేశాలతో ఒక నూతన ప్రాతిపదికమీద సంబంధాలు పెంపొందించుకుంది. ఇది రెండు కారణాలవల్ల కలిగిన పర్యవసానం బ్రిటిషు ఇండియా ప్రభుత్వం భారతదేశ సహజ భౌగోళిక సరిహద్దుల్లోకి చొచ్చుకుపోవడానికి ఆధునిక ప్రయాణ సాధనాల అభివృద్ధి, దేశంలో రాజకీయ, పరిపాలనా సుస్థిరత ఒత్తిడిపెట్టాయి. ఇది దేశ రక్షణకు, అంతరంగిక సమగ్రతకు తప్పనిసరి. కాని దురదృష్టవశాత్తు భారతప్రభుత్వం కొన్ని సందర్భాల్లో తన సహజ, సాంప్రదాయిక సరిహద్దుల్ని దాటి ఇంకా ముందుగా చొచ్చుకుపోయింది అది అనివార్యంగా సరిహద్దు సంఘర్షణలకు దారితీసింది. ఇక్కడ బ్రిటిషు ఇండియా ప్రభుత్వపు విదేశీ స్వభావం మరొక కొత్త కారణాంశం ఒక స్వతంత్రదేశపు విదేశాంగ విధానం పరాయి దేశపు పాలన క్రింద మగ్గే ఒక పరాధీన దేశపు విదేశాంగ విధానానికి భిన్నంగా ఉంటుంది స్వతంత్ర దేశంయొక్క విదేశాంగ విధానం ఆ దేశ ప్రజల అవసరాలకు, ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుంది. పరాధీన దేశంలో అయితే అది పాలనదేశపు ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటుంది భారతదేశం ఆనాడు పరాధీన దేశం కాబట్టి భారత విదేశాంగ విధానాన్ని లండన్‌లోని బ్రిటిషు ప్రభుత్వం శాసించింది.

ఆసియా, ఆఫ్రికాలలో బ్రిటిషు ప్రభుత్వం రెండు లక్ష్యాలు పెట్టుకుంది ఒకటి- అమూల్యమైన భారత సామ్రాజ్య పరిరక్షణ రెండు- ఆసియా, ఆఫ్రికాలలో బ్రిటిషు వాణిజ్య తదితర ఆర్థిక ప్రయోజనాల విస్తరణ ఈ రెండు లక్ష్యాలు భారతదేశ సహజ సరిహద్దులకావల బ్రిటిషు విస్తరణకు, ప్రాదేశిక ఆక్రమణకు దారితీశాయి. ఈ లక్ష్యాలే బ్రిటిషు ప్రభుత్వాన్ని యూరపులోని ఇతర సామ్రాజ్యవాద దేశాల్తో ఘర్షణకు పురికొల్పాయి ఆ దేశాలు కూడా ఆసియా, ఆఫ్రికా సీమల్లో తమ స్థావరాల్ని పెంపుచేసుకోవాలని, వాణిజ్యాన్ని విస్తరింపజేసుకోవాలని వాంఛించాయి.

1870-1914 సంవత్సరాల మధ్యకాలంలో ఆసియా, ఆఫ్రికాలలో వలసలకోసం, మార్కెట్ల కోసం ఐరోపా రాజ్యాల మధ్య భీషణ సమరం నడిచింది. ఐరోపాలో అభివృద్ధిచెందిన పెట్టుబడిదారీ దేశాలూ, ఉత్తర అమెరికా ఉత్పత్తి చేసిన సరుకులు మిగులు నిల్వల్ని అమ్ముకోడానికి మార్కెట్లు కావాలి. మిగులు ధనాన్ని పెట్టుబడి పెట్టడానికి కొత్త సదుపాయాలు దొరకాలి. పైగా తమ పరిశ్రమలు సాగటానికి వ్యవసాయిక, ఖనిజ ముడిపదార్థాలు సమకూరాలి ఈ అవసరాలు ఐరోపా రాజ్యాల మధ్య తీవ్ర వాణిజ్య స్పర్థలకు దారితీశాయి. ఐరోపా రాజ్యాల ప్రభుత్వాలు తమ వాణిజ్య ప్రయోజనాల పెంపుకోసం ప్రతిస్పర్థల్లో బలప్రయోగానికి దిగటానికి కూడా సిద్ధంగా ఉన్నాయి. తాము చొచ్చుకుపోవాలనుకున్న దేశంతో దెబ్బలాటకయినా తయారై ఉన్నాయి. అదిగాక ఆర్థికంగా వెనుకబడివున్న దేశాలలో రాజకీయాధికారాన్ని

వశపర్చుకోవడం ద్వారా ఒక సామ్రాజ్యవాద దేశానికి తన విల్వ సరుకుని, పెట్టుబడిని సద్వినియోగం చేసుకునే సురక్షితమైన మార్కెట్ దొరికే వీలు కలిగింది. ముడిపదార్థాలు సమకూర్చే వనరులు దొరికాయి ప్రత్యర్థిని దూరంగా నెట్టేసే అవకాశం అందుబాటయింది. ఈ విధంగా విభిన్న సామ్రాజ్యవాద దేశాలు ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో తమ ఆధిపత్యాన్ని విస్తరింపచేసుకోడానికి పరస్పరం పోరాడాయి ఈ కాలంలోనే ఐరోపా రాజ్యాలు ఆఫ్రికా ఖండాన్ని చీల్చి తలొక ముక్క పంచేసుకున్నాయి. మధ్యాసియాలోను, తూర్పు ఆఫ్రికాలోను రష్యా చొరబడింది టర్కీలో క్షీణదశలో ఉన్న ఒటోమాన్ సామ్రాజ్యం పశ్చిమాసియా, ఇరాన్‌లలో ఆధిపత్యం కోసం జర్మనీ, రష్యా, బ్రిటన్ల పోటాపోటీలు వచ్చాయి. 1880 లో ఫ్రాన్స్ ఇండోచైనాను ఆక్రమించుకుంది. బ్రిటన్, ఫ్రాన్స్ ఉభయదేశాలూ థాయ్‌లాండ్, ఉత్తర బర్మాలమీద ఆధిపత్యం కోసం పోటీ పడ్డాయి. ఉత్తర అమెరికా 1898 లో హవాయ్, ఫిలిప్పైన్స్‌ని ఆక్రమించింది. 1905 లో జపాన్ కొరియాని వశపర్చుకుంది 1895 లగాయతు చైనా సామ్రాజ్యంలోని విభిన్న ప్రాంతాలకోసం ఈ రాజ్యాల మధ్య విపరీతంగా పోటీ పెరిగింది ప్రపంచాన్ని వలసలుగా చీల్చివేసిన కార్యక్రమంలో అందరికన్నా పెద్ద ముక్క కాజేసిన బ్రిటన్‌కు చుట్టూ శత్రువులు పెరిగారు ఉదాహరణకు - వివిధ దశల్లో బ్రిటిషు లక్ష్యాలు, ఆశలు ఫ్రాన్స్, జర్మనీ, రష్యాల లక్ష్యాలు - ఆశలతో సంఘర్షించాయి.

తమ భారత సామ్రాజ్యాన్ని కాపాడుకోవాలనే దుగ్ధతో, తన ఆర్థిక ప్రయోజనాల్ని పెంపొందించుకోవాలనే కాంక్షతో, ఇతర ఐరోపా రాజ్యాల్ని ఇండియా దరిదాపులకు చేరనివ్వకూడదనే పట్టుదలతో బ్రిటిషు ఇండియా ప్రభుత్వం భారతదేశపు ఇరుగు పొరుగు రాజ్యాలమీద తరచు దురాక్రమణకు దిగింది. మరో మాటల్లో చెప్పాలంటే భారతదేశంలో బ్రిటిషు ఆధిపత్యం కొనసాగే కాలంలో తన పొరుగు దేశాలతో భారతదేశ సంబంధాలు అంతిమంగా బ్రిటిషు సామ్రాజ్యవాద ప్రయోజనాల కనుగుణంగా నిర్ణయించబడ్డాయి.

అయితే భారత విదేశాంగ విధానం బ్రిటిషు సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం పనిచేసినా, దాన్ని ఆచరణలో పెట్టడానికైన ఖర్చుని భారతదేశమే భరించింది సొమ్ము భారతదేశానిది, పేరు బ్రిటన్‌ది. బ్రిటిషు ప్రయోజనాల కోసం భారతదేశం తన పొరుగు దేశాలతో అనేక యుద్ధాలు చేయవలసి వచ్చింది. భారతీయ సిపాయిలు తమ రక్తం చిందించవలసి వచ్చింది. పన్నులు కట్టే భారత దేశస్థులు బ్రిటన్ చేసిన భారీ వ్యయాన్ని భరించవలసి వచ్చింది. అంతేకాదు ఆసియా, ఆఫ్రికా దేశాలలో బ్రిటన్ తరఫున భారత సైన్యం యుద్ధాలు చేసింది. పర్యవసానంగా భారత ప్రభుత్వాదాయంలోని అత్యధిక భాగం సైనిక ఖర్చుల కింద చెల్లిపోయింది ఉదాహరణకు 1904 లో భారత ప్రభుత్వాదాయంలో సగానికి పైచిలుకు అంటే దాదాపు 52 శాతం సైన్యానికే ఖర్చయిపోయింది.

***1814–నేపాల్‌తో యుద్ధం!*** నేపాల్ లోయని 1768 లో గూర్ఖాలనబడే ఒక పశ్చిమ హిమాలయ తెగ జయించింది. గూర్ఖాలు క్రమేణా ఒక శక్తివంతమైన సైన్యాన్ని నిర్మించుకున్నారు. తూర్పున భూటాన్ నుంచి పశ్చిమాన సట్లెజ్ నదివరకు తమ ప్రతిభ వెలిగించారు అప్పుడు నేపాల్ తరాయ్ నుంచి దక్షిణాభిముఖంగా గూర్ఖా దండు కదిలింది. ఈ లోగా 1801 లో బ్రిటిషువాళ్ళు గోరఖ్‌పూర్‌ని జయించారు. అది

మునుముందుకు దూసుకుపోతున్న ఈ రెండు శక్తుల్ని ఇదమిద్ధంగా నిర్ణయంకాని ఒక సరిహద్దు వద్ద ముఖాముఖి స్థాయికి తెచ్చింది.

1814 అక్టోబరులో ఈ రెండు రాజ్యాల సరిహద్దు గస్తీదళాల మధ్య రాజుకున్న సరిహద్దు ఘర్షణ బహిరంగ యుద్ధానికి బాటవేసింది. 600 మైళ్ళు విస్తరించిన సరిహద్దు పొడవునా తమ సైన్యాలు దాడికి తలపడ్డాయి. కాబట్టి గూర్ఖా సైన్యాల్ని సునాయాసంగా మన్ను కరిపించవచ్చని బ్రిటిషు అధికార్లు పగటి కలలు కన్నారు. గూర్ఖాలు అసమాన ధైర్య సాహసాల్తో ఆత్మరక్షణ చేసుకున్నారు. బ్రిటిషు సైన్యాలు పదే పదే ఓడిపోయాయి. చార్లెస్ మెట్కాఫ్ అనే ఓ సీనియర్ బ్రిటిషు ఇండియా అధికారి ఆ రోజుల్లో ఇలా రాశాడు:

"మన సైన్యాలకన్నా నిర్ణయాత్మకంగా గొప్ప ధైర్యం, అత్యుత్తమ స్థైర్యం కలిగిన శత్రువుతో మనం తలపడ్డాం. ఈ తలకిందు స్థితిలో ముగింపు ఎలా ఉండబోతుందో చెప్పటం అసాధ్యం. కొన్ని సందర్భాల్లో యూరోపియన్లు, దేశీ సిపాయీలు కలగలిసిన మన సైన్యాన్ని కేవలం కట్టెలు, రాళ్ళతో మనకంటే తక్కువ సంఖ్యలో ఉన్న శత్రుసైన్యం తిప్పికొట్టింది. మరికొన్ని సందర్భాల్లో, కత్తి చేతధరించి కదనరంగంలో విజృంభించిన శత్రువుధాటికి మన సైన్యాలు గొర్రెల మందల్లా మైళ్ళదూరం కాలికి బుద్ధిచెప్పాయి. క్లుప్తంగా చెప్పాలంటే, భారతదేశంలో మన అధికారం ఊగులాడిపోయే స్థితిలో ఉందని అనుమానం చెప్పే నేను ఇప్పుడు మన పతనం ప్రారంభమైందని అనుకోకుండా ఉండలేను. మన అధికారం పూర్తిగా మన సైనిక బలాధిక్యత మీద ఆధారపడివుంది. ఒక శత్రువుమీద గౌరవంతో చెప్తున్నాను. మన బలాధిక్యత పోయింది......".

కాని గూర్ఖాలు దీర్ఘకాలం నిలవలేకపోయారు. సైనిక సంఖ్యాబలంలో, ధనబలంలో, సాధన సంపత్తిలో బ్రిటిషువాళ్ళు అధికులు. 1815 ఏప్రిల్‌లో బ్రిటిషు సైన్యం కుమావూన్‌ని ఆక్రమించింది. మే 15 న అద్భుత సేనాధిపతి అమర్‌సింగ్ థాపా లొంగిపోవలసి వచ్చింది. నేపాల్ ప్రభుత్వం శాంతి సంప్రదింపులకు దిగివచ్చింది. అయితే సంప్రదింపులు వెంటనే భగ్నమయ్యాయి. నేపాల్ రాజధాని ఖాట్మండ్‌లో బ్రిటిషు రెసిడెంటు నియామకానికి నేపాల్ ప్రభుత్వం అంగీకరించలేదు. బ్రిటిషువాళ్ళతో సైన్య సహకార ఒడంబడికమీద చేవ్రాలు పెట్టటమంటే దేశ స్వాతంత్ర్యాన్ని బ్రిటిషు వాళ్ళకి రాసివ్వటమేనని నేపాల్ గ్రహించింది. 1816 లో తిరిగి యుద్ధం ప్రజ్వరిల్లింది. బ్రిటిషు బలాలు అనేక ముఖ్య విజయాలు సాధించి ఖాట్మండ్‌కు 50 మైళ్ళ దూరంలోకి చేరుకున్నాయి. చిట్టచివరికి నేపాల్ రాజ్యం బ్రిటిషు వాళ్ళు పెట్టిన షరతులకు లోబడి శాంతిసంధి చేసుకోవలసి వచ్చింది. ఖాట్మండ్‌లో బ్రిటిషు రెసిడెంట్ నియామకానికి నేపాల్ ప్రభుత్వం అంగీకరించింది. గఢ్‌వాల్, కుమావూ జిల్లాల్ని ధారాదత్తం చేసింది. తరాయ్‌ప్రాంతం మీద హక్కు వదులుకుది; సిక్కింనుంచి ఉపసంహరించుకుంది. ఈ ఒప్పందం వల్ల బ్రిషువాళ్ళకి అనేక ప్రయోజనాలు ఒనగూడాయి. భారత సామ్రాజ్యం ఇప్పుడు హిమాలయాల్ని చేరుకుంది. మధ్యాసియాతో వాణిజ్యానికి అనేక సౌకర్యాలు సమకూరాయి. సిమ్లా, ముస్సోరి, నైనితాల్ వంటి ముఖ్యమైన వేసవి విడుదలకు చోటు దొరికింది. వీటన్నిటికన్నా గూర్ఖాలు అధిక సంఖ్యలో బ్రిటిషు ఇండియా సైన్యంలో చేరడం ద్వారా దానికి వెయ్యేనుగుల బలం అబ్బింది.

ఆ తరువాత బ్రిటిషు వాళ్ళకి - నేపాల్‌కు మధ్య సంబంధాలు స్నేహపూర్వకంగా సాగాయి. 1814 యుద్ధంలో పోరాడిన ఉభయ పక్షాలూ పరస్పర పోరాట పటిమను గౌరవించటం నేర్చుకున్నాయి. పరస్పరం శాంతియుతంగా జీవించడానికే ప్రాధాన్యం ఇచ్చాయి.

***బర్మామీద విజయం:*** 19 వ శతాబ్దంలో వరుసగా మూడుతూర్లు జరిగిన యుద్ధాల్లో బ్రిటిషు వాళ్ళు బర్మా స్వతంత్ర రాజ్యాన్ని జయించారు. బర్మాకు-బ్రిటిషు ఇండియాకు మధ్య యుద్ధం సరిహద్దు సంఘర్షణతో ప్రారంభమైంది. విస్తరణకాంక్ష అగ్నిలో ఆజ్యం పోసింది. బ్రిటిషు వర్తకుల ఆశపోతు దృష్టి బర్మా అటవీ సంపదమీద పడింది. బ్రిటిషు సరుకుల్ని బర్మాలో అమ్ముకోవాలని తపించారు. బర్మాలోను, మిగతా ఆగ్నేయ ఆసియాలోను ఫ్రెంచి పలుకుబడి వ్యాప్తి చెందకుండా నిరోధించాలని బ్రిటిషు అధికార్ల కోరిక.

***మొదటి బర్మా యుద్ధం, 1824-26:*** 18 వ శతాబ్దాంతం నాటికి బర్మాకు, బ్రిటిషు ఇండియాకు ఉమ్మడి సరిహద్దు, ఉభయ రాజ్యాలూ రాజ్య విస్తరణ కాంక్షతో ఊగిపోతున్నాయి. శతాబ్దాల అంతరంగిక సంక్షోభం తరువాత, 1752-60 సంవత్సరాల మధ్య అలాంగ్‌పాయా అనే బర్మా రాజు దేశం మొత్తాన్ని సమైక్యపర్చి ఒకే జండా కిందికి తెచ్చాడు. అలాంగ్‌పాయా తరువాత అధికారానికి వచ్చిన బోదాపాయా ఐరావతీ నదిమీద ఉన్న అవా నుంచి సయాం మీద పదే పదే దాడులు చేశాడు; చైనా దాడుల్ని తిప్పికొట్టాడు. మణిపూర్, అరకాన్ సరిహద్దు రాజ్యాల్ని జయించి బర్మాని బ్రిటిష్ ఇండియా సరిహద్దుల్లో నిలబెట్టాడు. 1822 లో బర్మీయులు అస్సాంని జయించారు. అరకాన్, అస్సాం ప్రాంతాల్ని బర్మా ఆక్రమించుకోవటంతో సందిగ్ధంగా వున్న సరిహద్దు పొడుగునా బెంగాల్-బర్మాల మధ్య ఎడతెగకుండా వివాదాలు, ఘర్షణలు చోటు చేసుకున్నాయి.

అరకాన్ నుంచి పారిపోయి వచ్చినవాళ్ళు చిట్టగాంగు జిల్లాలో తలదాచుకోవడం ఈ ఘర్షణలు జరగడానికి గల కారణాలలో ఒకటి. శరణార్థులు చిట్టగాంగు జిల్లాలోనుండి బర్మా ఆక్రమిత అరకాన్ ప్రాంతంపైన విడువకుండా దాడులు జరిపారు. బర్మా సేనల చేతుల్లో ఓడిపోగానే బ్రిటిషు ఆక్రమిత ప్రాంతంలోకి పారిపోయి వచ్చి తలదాచుకున్నారు. ఈ తిరుగుబాటుదార్ల మీద చర్య తీసుకుని తమకు అప్పగించవలసిందిగా బర్మా బ్రిటిషు అధికారుల మీద ఒత్తిడి తెచ్చింది. తిరుగుబాటుదార్లని వెంటాడి తరిమే ప్రయత్నంలో బర్మా సైనికులు అనేక తూర్లు బ్రిటిషు ఇండియా ప్రాంతంలోకి చొచ్చుకు వచ్చారు. షాపురీ దీవి ఎవరి అధీనంలో ఉండాలనే సమస్యమీద అరకాన్-చిట్టగాంగ్ సరిహద్దు రేఖ మీద బర్మీయులకి బ్రిటిషు వాళ్ళకి మధ్య చెలరేగిన వివాదం ఒక కొలిక్కి వచ్చింది. ఈ దీవిని మొదట బర్మీయులు ఆక్రమించారు. ఆ తరువాత బ్రిటిషు వాళ్ళు ఆక్రమించారు. షాపూర్ దీవిని తటస్థ మండలంగా ఉంచాలన్న బర్మా ప్రతిపాదనను బ్రిటిషు వాళ్ళు నిరాకరించారు. దాంతో ఉభయ పక్షాల మధ్య ఉద్రిక్తత పెచ్చు పెరగసాగింది.

మణిపూర్, అస్సాంలను బర్మా ఆక్రమించుకోవటం ఉభయ రాజ్యాల మధ్య స్పర్థలకు మరొక కారణం.

ఇది భారతదేశంలో తమ స్థానానికి ఎసరు తెచ్చే తీవ్ర ప్రమాదంగా బ్రిటిషు

వాళ్ళు పరిగణించారు. మణిపూర్, అస్సాంల ఆక్రమణకు ప్రతిచర్యగా బ్రిటీషు వాళ్ళు కీలక సరిహద్దు ప్రాంతాలైన కచార్, జాంతియ ప్రాంతాలలో తమ పలుకుబడిని పెంచుకున్నారు. బర్మీయులకిది కోపాన్ని తెప్పించింది. తక్షణం బర్మా సైన్యాలు కచార్‌లో ప్రవేశించాయి. బర్మా బ్రిటీషు సైన్యాల మధ్య ఘర్షణ జరిగింది. బర్మీయులు మణిపూర్ నుంచి ఉపసంహరించుకోక తప్పలేదు.

బ్రిటీషు ఇండియా అధికారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని బర్మాపై యుద్ధం ప్రకటించారు. అనేక దశాబ్దాలుగా బ్రిటీషువాళ్ళు బర్మా ప్రభుత్వం చేత వాణిజ్య ఒడంబడిక మీద సంతకం పెట్టించాలనీ, బర్మా నుంచి ఫ్రెంచి వర్తకుల్ని తరిమి వెయ్యాలనీ శతపోరుతున్నారు. ఇప్పుడు బర్మాని లొంగదియ్యడానికి అవకాశం వచ్చింది

1824 ఫిబ్రవరి 24న అధికారికంగా యుద్ధం ప్రకటించబడింది. బ్రిటీషు సైన్యాలు బర్మీయుల్ని అస్సాం, మణిపూర్, కచార్, అరకాన్ రాష్ట్రాల నుంచి తరిమివేశాయి. బ్రిటీషు నౌకా బలాలు 1824 మేలో రంగూన్‌ని ఆక్రమించాయి. బర్మా సువిఖ్యాత సేనా నాయకుడు మహా బందూలా బ్రిటీషు వాళ్ళ చేతుల్లో హతమైపోయాడు. బర్మా గెరిల్లాలు అడవుల్లో గొప్ప ప్రతిఘటనా సమరం నడిపారు. వర్షాకాలం దాన్ని వెన్నంటి తీవ్ర రోగాలు యుద్ధ భీభత్సానికి తోడయ్యాయి. జ్వరం, రక్త విరేచనాలు యుద్ధ రక్కసిని మించి వేలాది మందిని పొట్టన పెట్టుకున్నాయి. ఒక్క రంగూన్‌లోనే 3160 మంది ఆస్పత్రుల్లో మరణించారు. యుద్ధ రంగంలో మరణించిన వాళ్ళు కేవలం 166గురు మాత్రమే! మొత్తంమీద 40,000 బ్రిటీషు ..న్యంలో 15వేలమంది హతులయ్యారు. పైగా ఈ యుద్ధం ఆర్థికంగా బ్రిటీషువాళ్ళని కృంగదీసింది. ఉభయులూ శాంతి సంధికోసం తహతహలాడారు. 1826 ఫిబ్రవరిలో ఉభయ పక్షాల మధ్య యాండబు సంధి కుదిరింది.

బర్మా ప్రభుత్వం (1) యుద్ధ పరిహారం కింద కోటి రూపాయలు చెల్లించటానికి; (2) కోస్తా రాష్ట్రాలైన .అరకాన్, టనెస్సరిమ్‌లను బ్రిటీషువాళ్ళకు ధారదత్తం చెయ్యటానికి; (3) అస్సాం, అచార్ జాంతియా ప్రాంతాలపైన తన హక్కుల్ని ప్రభుత్వంతో వాణిజ్య ఒడంబడిక మీద సంతకం పెట్టటానికి; (6) అవా నగరంలో బ్రిటీషు రెసిడెంటు, కలకత్తాలో బర్మా రాయబారి నియామకాలకు అంగీకరించింది. ఈ సంధివల్ల బ్రిటీషువాళ్ళు బర్మాకి తీరరేఖ లేకుండా చేశారు. బర్మాలో భావి విస్తరణకు పునాది వేసుకున్నారు.

***రెండవ బర్మా యుద్ధం 1852:*** సరిహద్దు సంఘర్షణల ఫలితంగా మొదటి బర్మా యుద్ధం జరిగితే, బ్రిటీషు పేళ్ళ అపరిమిత వాణిజ్య దురాశ కారణంగా 1852లో రెండవ బర్మా యుద్ధం ముంచుకొచ్చింది. ఎగువ బర్మా అపారమైన కలప వనరులపైన బ్రిటీషు కలప వ్యాపార సంస్థల కన్ను పడింది. బ్రిటీషు వస్త్రాలకు, తదితర ఉత్పత్తులకు జనసమృద్ధమైన బర్మా వెలలేని మార్కెట్టుగా కళ్ళు మిరుమిట్లు గొలిపింది. అప్పటికే బర్మా కోస్తా రాష్ట్రాలు రెండూ బ్రిటీషు అధీనంలో ఉన్నాయి వాణిజ్యపరంగా మిగిలిన బర్మా అంతటా అల్లుకుపోవాలనే కాంక్ష వాళ్ళకి కలిగింది. బ్రిటీషు సామ్రాజ్యవాదం మధ్యాహ్న మార్తాండ బింబంలా వెలిగిపోతున్న రోజులవి. బ్రిటీషువాళ్ళు తాము అధికులమని విర్రవీగే రోజులు కూడా అవి. అదే సమయంలో

దురాక్రమణ బుద్ధికి ప్రతీక అయిన లార్డ్ డల్‌హౌసీ భారతదేశానికి గవర్నర్ జనరల్‌గా వచ్చాడు బర్మాలో బ్రిటీషు సామ్రాజ్య ప్రతిష్ఠకి పతాకస్థాయి కల్పించడానికి, బ్రిటీషు ప్రయోజనాలకు ఎదురులేకుండా చెయ్యడానికి లార్డ్ డల్‌హౌసీ కృత నిశ్చయుడయ్యాడు రంగూన్ గవర్నరు ఇద్దరు బ్రిటీషు ఓడ క్యాప్టెన్లసర్ధ వెయ్యిరూపాయలు గుంజాడనే ఒక అల్ప, అప్రధాన ఆరోపణని సాకుగా తీసుకుని లార్డ్ డల్‌హౌసీ ఒక బ్రిటీషు దూతని రంగూన్‌కి పంపాడు చూసి రమ్మంటే కాల్చివచ్చే స్వభావంగల ఆ దూత అతి దుందుడుకుగా ప్రవర్తించి, రంగూన్ గవర్నర్‌ని తొలగిస్తేనే తప్ప సంభాషణలు జరిగేది లేదని బర్మా ప్రభుత్వాన్ని బెదిరించాడు. ఆవానగరంలోని బర్మా రాజాస్థానం బ్రిటీషు బలం చూసి బెదిరిపోయి రంగూన్ గవర్నర్‌ని వెనక్కి పిలిపించడానికి అంగీకరించింది కాని బ్రిటీషు దూత గిల్లికజ్జం పెట్టుకోడానికి వచ్చాడు గనుక రంగూన్ రేవుని దిగ్బంధనం చేసి, దాదాపు 150 చిన్న చిన్న నౌకల్ని ధ్వంసం చేయించాడు రంగూన్‌లో బ్రిటీషు రెసిడెంటు నియామకానికి, బ్రిటీషువాళ్ళు కోరినంత నష్టపరిహారం చెల్లించడానికి బర్మా ప్రభుత్వం అంగీకరించింది దాంతో బ్రిటీషు ఇండియా ప్రభుత్వానికి కైపెక్కిపోయి హిరణ్యాక్షవరాలు కోరింది అవి ఏ స్వతంత్ర ప్రభుత్వంగానీ అంగీకరించజాలని డిమాండ్లు బర్మాలో తమ ఫ్రెంచి, అమెరికన్ ప్రత్యర్థులు కాలూనక ముందే శాంతి ద్వారా గానీ, యుద్ధం ద్వారాగానీ తమ స్థానాన్ని బలపర్చుకోవాలనేది బ్రిటీషు వాళ్ళ ధ్యేయం

1852 ఏప్రిల్‌లో సమగ్రమైన బ్రిటీషు దళాలు బర్మాకు ఉరికించబడ్డాయి బ్రిటీషువాళ్ళు నిర్ణయాత్మక విజయం సాధించారు రంగూన్ బ్రిటీషువాళ్ళ స్వాధీనమైంది బేసిన్, పెగూ, ప్రోమే వరుసగా పడిపోయాయి సరిగ్గా అదే సమయంలో బర్మా రాజవంశీకుల్లో అంతః కలహాలు జరుగుతున్నాయి. కాబట్టి సంధి, సంప్రదింపులు వగైరా లేకుండానే బ్రిటీషువాళ్ళు పెగూని ఆక్రమించేశారు. బర్మాలో బ్రిటీషువాళ్ళ వశం కాకుండా వున్న కోస్తా రాష్ట్రం అదొక్కటే. అదీ ఇప్పుడు బ్రిటీషువాళ్ళ స్వాధీనమైంది మూడేళ్ళపాటు హోరాహోరీ గెరిల్లా యుద్ధం నడిచింది. ఏమైనా బర్మా యావత్తూ కోస్తా బ్రిటీషువాళ్ళకి స్వాధీనమైంది సముద్ర వ్యాపారం మొత్తం బ్రిటీషు కంట్రోలు కిందికొచ్చింది.

ఈ యుద్ధంలో ప్రధాన బాధ్యత వహించి పోరాడినవాళ్ళు భారతీయ సిపాయిలు; ఈ యుద్ధానికైన ఖర్చు భరించింది భారత ప్రభుత్వం.

***మూడవ బర్మా యుద్ధం – 1885:*** పెగూ ఆక్రమణ తర్వాత బర్మా, బ్రిటీషు ఇండియాల మధ్య చాలాకాలంపాటు శాంతియుతమైన సంబంధాలు వర్ధిల్లాయి. బర్మాలో వాణిజ్యపరంగా బ్రిటీషువాళ్ళు కోరుకున్నవన్నీ సమకూరాయి. బ్రిటీషు వర్తకులు బర్మాలో తమ ఇష్టం వచ్చిన ప్రాంతంలో నిరాఘాటంగా స్థిరపడవచ్చు తమ నౌకల్ని ఐరావతి నదిమీదుగా చైనాకి రాకపోకలు చేయించుకోవచ్చు.

1878లో బర్మారాజు మిందాన్ మరణించాడు. అతని కుమారుడు థీబా రాజయ్యాడు 1885 లో థీబా ఫ్రాన్స్‌తో ఒక వర్తకపు సంధి చేసుకున్నాడు బర్మాలో ఫ్రెంచి పలుకుబడి పెరుగుదల చూసి బ్రిటీషువాళ్ళు ఈర్ష్యపడ్డారు. బ్రిటన్‌లోని వర్తకులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ఎగువ బర్మాని కబళించమని బ్రిటీషు ప్రభుత్వాన్ని ఒత్తిడిపెట్టారు. బ్రిటీషు ప్రభుత్వం అందుకు సిద్ధంగానే ఉంది కేవలం సాకు కోసం

వేచివుంది. బాంబే-బర్మా ట్రేడింగు కార్పోరేషను ద్వారా ఈ సాకు దొరికింది. అది ఒక బ్రిటీషు వ్యాపార సంస్థ; బర్మాలో టేకు అడవుల్ని గుత్తకు తీసుకుంది. ఆ సంస్థ స్థానిక అధికారులకు లంచాలు ఎరచూపి ఒప్పందం ప్రకారం తీసుకుపోవాల్సిన టేకుకన్నా రెట్టింపుని తరలించుకుపోతున్నదని బర్మా ప్రభుత్వం ఆరోపించింది. ఎగువ బర్మాని కాజేయడానికి బ్రిటీషు ప్రభుత్వం అప్పటికే పథకం సిద్ధం చేసుకుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకొని బ్రిటీషువాళ్లు బర్మా ప్రభుత్వాన్ని అడగకూడనివన్నీ డిమాండు చేశారు. ఆఖరికి బర్మా విదేశీ వ్యవహారాలు భారత గవర్నర్-జనరల్ అధీనంలో ఉండాలన్నంత దూరం వెళ్ళారు. తన స్వాతంత్ర్యాన్ని హరించే అటువంటి డిమాండ్లను బర్మా ప్రభుత్వం ఆమోదించలేదు. 1885 నవంబర్ 13న బర్మామీద బ్రిటీషు దురాక్రమణ దాడి ప్రారంభమైంది. ఇది బ్రిటీషువాళ్ళు వచ్చి దురాక్రమణ. ఒక స్వతంత్రదేశంలో బర్మా విదేశీయులపైన వర్తక నిర్బంధాలు పెట్టవచ్చు. దానికా హక్కుంది. యూరపులో రోజూ జరుగుతున్నదిదే. అట్లాగే బర్మాకు ఏ విదేశ రాజ్యంతోనైనా సంబంధాలు నెలకొల్పుకునే హక్కుంది; ఎక్కడి నుండయినా ఆయుధాలు తెప్పించుకునే హక్కుంది.

బ్రిటీషు బలం ముందు బర్మా ప్రతిఘటన వెలవెలపోయింది. తైబా 1885 నవంబర్ 25న లొంగిపోయాడు. తైబా రాజ్యం బ్రిటీషువారి భారత సామ్రాజ్యంలో కలిసిపోయింది. దేశభక్తులైన బర్మా సైనికులు, అధికార్లు అడవుల్లోకి నిష్క్రమించి ప్రతిఘటనా పోరాటం సాగించారు. దిగువ బర్మా ప్రజలు బ్రిటీషువాళ్ళకి వ్యతిరేకంగా తిరుగబడ్డారు. బ్రిటీషు ప్రభుత్వం ఆ ప్రజా తిరుగుబాటును అణచటానికి నలభై వేల సైన్యాన్ని నియోగించి అయిదేళ్ళపాటు హోరాహోరీ పోరాడవలసి వచ్చింది. మళ్ళీ ఈ యుద్ధానికైన ఖర్చు, తిరుగుబాటును అణచటానికయిన వ్యయమూ భారతదేశమే భరించవలసి వచ్చింది.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత బర్మాలో బలమైన ఆధునిక జాతీయోద్యమం ఆవిర్భవించింది. విదేశవస్తు బహిష్కరణోద్యమం తీవ్రరూపం దాల్చింది. స్వరాజ్య సాధనకోసం బర్మీయులు రంగంలోకి దూకారు; భారత జాతీయ కాంగ్రెసుతో చేతులు కలిపారు. బర్మా ప్రజల స్వాతంత్ర పోరాటాన్ని బలహీనపర్చే ఉద్దేశ్యంతో బ్రిటీషు పాలకులు 1935లో భారతదేశంనుంచి బర్మాని విడగొట్టారు. బర్మా జాతీయవాదులు ఈ చర్యని ఖండించారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో యుఅంగ్‌సాన్ ఆధ్వర్యంలో బర్మా జాతీయోద్యమం అపారంగా ఎదిగిపోయింది. చిట్టచివరకి బర్మా 1948 జనవరి 4న స్వాతంత్ర్యం సాధించింది.

**ఆఫ్ఘనిస్తాన్‌తో సంబంధాలు:** ఆఫ్ఘనిస్థాన్‌తో సంబంధాలు కుదుట పడటానికి ముందు బ్రిటీషు ఇండియా ప్రభుత్వం ఆఫ్ఘనిస్థాన్‌తో రెండు యుద్ధాలు జరిపింది. 19వ శతాబ్దంలో భారత-ఆఫ్ఘన్ సంబంధాలకు సంబంధించిన సమస్య ఆంగ్లో-రష్యన్ ప్రతిస్పర్థలతో ముడిపడివుంది. పశ్చిమ, దక్షిణ, తూర్పు ఆసియాలో బ్రిటన్ సామ్రాజ్యవాద శక్తిగా తయారై పశ్చిమ, తూర్పు ఆసియాలో ప్రాదేశిక విస్తరణ కోసం వెంపర్లాడింది. పర్యవసానంగా ఈ ఉభయ సామ్రాజ్యవాద శక్తులూ ఆసియా అంతటా పరస్పర ఘర్షణలకు తలపడ్డాయి. 1855 లో బ్రిటన్-ఫ్రాన్స్, టర్కీలతో పొత్తుపెట్టుకుని రష్యాతో యుద్ధం చేసింది. దాన్నే క్రిమియా యుద్ధం అంటాం.

ముఖ్యంగా బ్రిటన్ భారతదేశంలో తన రాజ్యానికి సంబంధించిన భద్రత గురించి ఆందోళన చెందింది. ఆఫ్ఘనిస్థాన్‌గుండా భారత వాయువ్య సరిహద్దుగుండా రష్యా భారతదేశం మీద దాడి చేస్తుందనే భయం 19వ శతాబ్దారంభం నుంచి అంతందాకా బ్రిటన్‌ని వెన్నాడుతూనే ఉంది. కాబట్టి రష్యాని ఎలానైనా భారత సరిహద్దులకు బహుదూరంగా అట్టేపెట్టాలని బ్రిటన్ ప్రయత్నించింది. మధ్యాసియా వ్యాపార వాణిజ్యాలలో ఇంగ్లీషువాళ్ళకి, రష్యన్లకి మధ్య పోటీ కూడా ఈ పరిస్థితికి దోహదం చేసింది. మధ్యాసియా మొత్తాన్ని రష్యా తన వలస భూభాగంగా మార్చగలిగిందంటే, మధ్యాసియా వాణిజ్య కార్యకలాపాల్లో బ్రిటన్ పాలు పంచుకోవటం భవిష్యత్తులో కల్ల.

బ్రిటన్ దృష్టిలో ఆఫ్ఘనిస్థాన్ భౌతికంగా చాలా కీలక స్థానంలో ఉంది. రష్యానుంచి రాబోయే సైనిక ప్రమాదాన్ని అరికట్టడానికిగానీ, మధ్యాసియాలో బ్రిటన్ తన వాణిజ్య ప్రయోజనాల్ని పెంపొందింపజేసుకోవటానికి గాని ఆఫ్ఘనిస్థాన్ భారత సరిహద్దు కావల అగ్రగామి స్థావరంగా ఉపయోగపడుతుంది. ఇవేమీ కాకున్నా అది రెండు శత్రు రాజ్యాల మధ్య సంఘర్షణ నివారించే చిన్న రాజ్యంగానైనా ఉంటుంది.

బ్రిటన్‌లో విగ్గుపార్టీ అధికారం చేపట్టి పామర్‌స్టన్ విదేశాంగ కార్యదర్శి అయిన సమయంలో, అంటే 1835 నాటికి ఆఫ్ఘనిస్థాన్ పట్ల బ్రిటీషు విధానం చురుకెక్కింది. ఆనాడు ఆఫ్ఘనిస్థాన్‌ని దోస్త్ మహమ్మద్ పరిపాలిస్తున్నాడు. దోస్తు మహమ్మద్ తన దేశంలో పాక్షికంగా సుస్థిరత నెలకొల్పినా, అతనికి ఇంటా బయట శత్రువులు పెరిగారు. ఉత్తరాన అంతరంగిక శత్రువుల నుంచి, రష్యా నుంచి ప్రమాదం పొంచుంది. దక్షిణాన అతని సోదరుల్లో ఒకరు కాందహార్‌లో పాతుకుని దోస్త్ మహమ్మద్ అధికారాన్ని సవాల్ చేశారు. తూర్పున సిక్కు రాజ్యాధినేత రంజిత్‌సింగ్ పెషావరుని ఆక్రమించాడు. ఆయనకి దిగువన బ్రిటీషువాళ్ళు ఉండనే ఉన్నారు. పశ్చిమాన హీరట్‌లో అంతరంగిక శత్రువులు పొంచున్నారు; పర్షియా కత్తికట్టింది. ఎటు చూసినా ప్రమాదాలు పొంచున్నాయి. అయితే దోస్త్ మహమ్మద్‌కు ఇంగ్లీషు వాళ్ళ బలంమీద అపార గౌరవం ఉంది. బ్రిటీషు ఇండియా ప్రభుత్వంతో మైత్రి కోరాడు.

రష్యా దోస్త్ మహమ్మదుని తనవేపు తిప్పుకోడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అతని దృష్టి ఇంగ్లీషువాళ్ళ మీదే ఉంది. కాని ఇంగ్లీషువాళ్ళు నాలుక మీంచి సానుభూతి ఒలుకబోశారే తప్ప ఒక ఒప్పందానికి రాలేదు. ఆఫ్ఘనిస్థాన్‌లో రష్యా ప్రభావాన్ని తుదముట్టించాలని వాళ్ళకున్న మాట వాస్తవమేగాని, ఆఫ్ఘనిస్థాన్ పటిష్టమైన రాజ్యంగా పరిణతి చెందడం వాళ్ళకిష్టం లేదు. అంతః కలహాలతో చీలిపోయి బలహీనంగా ఉండే ఆఫ్ఘనిస్థాన్‌లో అయితే తాము ఆడింది ఆటగా చెల్లుబడి కొతుంది. భారత ప్రభుత్వం తన రాయబారి క్యాప్టెన్ బర్న్సుకి ఇలా రాసింది:

"మన సరిహద్దులో ఒక శక్తివంతమైన సుసంఘటిత మహమ్మదీయ రాజ్యం మనకు ఎంత మాత్రం క్షేమకరంగానీ, ఉపయోగకరం గానీ కాదు. కాబూల్, కాందహార్, హీరట్‌ల మధ్య ఇప్పుడున్న చీలికే మనం కోరుకోదగ్గది".

రష్యా ప్రమాదం నుంచి భారతదేశాన్ని కాపాడుకోవటం ఒక్కటే బ్రిటీషు ధ్యేయం కాదు. ఆఫ్ఘనిస్థాన్‌లోకి, మధ్యాసియాలోకి చొరబడ్డంకూడా వాళ్ళ లక్ష్యం. స్వదేశ రాజుల మీద అవమానకరమైన సైన్య సహకార ఒడంబడిక రుద్దిన పద్ధతిలో ఇండియా గవర్నర్ జనరల్ లార్డ్ ఆక్లాండ్, దోస్త్ మహమ్మదుకు ఒక ప్రతిపాదన చేశాడు. దోస్త్

మహమ్మదు సంపూర్ణ సమానతా సూత్రం మీద బ్రిటిష్ ఇండియా ప్రభుత్వంతో మైత్రి నెరపుకోవాలని కోరాడేగాని దాని చేతుల్లో భారతీయ స్వదేశ రాజుల్లాగా కీలుబొమ్మగా ఉండటానికి అంగీకరించలేదు బ్రిటిషు ప్రభుత్వంతో సఖ్యతకోసం ప్రయత్నించి విఫలుడైపోయిన దోస్త్ మహమ్మదు గత్యంతరం లేక రష్యాతో మైత్రికోసం ప్రయత్నించారు.

**మొదటి ఆఫ్ఘన్ యుద్ధం:** దోస్త్ మహమ్మదుని తొలగించి అతని స్థానంలో ఒక కీలుబొమ్మని అధికారంలోకి తేవాలని లార్డ్ ఆక్ లాండ్ సంకల్పించారు. అతని దృష్టి షాషుజా మీద పడింది. షాషుజా 1809 లో రాజ్యభ్రష్టుడై లూధియానాలో బ్రిటిషు పింఛనుదారుగా కాలం వెళ్ళబుచ్చుతున్నారు. భారత ప్రభుత్వం, మహారాజా రంజిత్‌సింగ్, షాషుజాలు ముగ్గురూ కలిసి 1838 జూన్ 26న లాహోర్‌లో ఒక ఒప్పందం కుదుర్చుకున్నారు. షాషుజా తిరిగి ఆఫ్ఘనిస్థాన్‌కి ప్రభువు కావటానికి భారత ప్రభుత్వం, రంజిత్ సింగ్ తోడ్పాటు ఇవ్వటం ఆ ఒప్పందంలోని ప్రధానాంశం.

ఈ ముగ్గురూ కలిసి 1838 ఫిబ్రవరిలో ఆఫ్ఘనిస్థాన్ మీద దాడి చేశారు. రంజిత్ సింగ్ మాత్రం తెలివిగా పెషావరు దగ్గర ఆగిపోయారు. ఇంగ్లీషు సైన్యాలు ముందుకు దూసుకు పోయాయి. అప్పటికే ఆఫ్ఘనిస్థాన్‌లోని వివిధ తెగల్ని ఇంగ్లీషు వాళ్ళు లంచాలతో లొంగదీసుకున్నారు. 1839 ఆగస్టు 7న కాబూల్ ఇంగ్లీషు సేనల వశమైంది షాషుజా గద్దె ఎక్కారు.

కాని షాషుజాని ఆఫ్ఘన్ ప్రజలు అసహ్యించుకున్నారు. ముఖ్యంగా విదేశీ తుపాకుల్తో, తూటాల్తో తిరిగి అధికారంలోకి వచ్చినందుకు ప్రజల దృష్టిలో అతనికి విలువ లేకుండా పోయింది. షాషుజా రాజుగా కాబూల్ నగర ప్రవేశం చేసిన దృశ్యాన్ని "శవ ఊరేగింపు"గా వర్ణించారు బ్రిటిషు చరిత్రకారుడు విలియం కేయే ఆఫ్ఘన్ ప్రజలు తమ దేశ వ్యవహారాలలో బ్రిటిషు జోక్యాన్ని తీవ్రంగా నిరసించారు. క్రమేణా, దేశభక్తులు, స్వాతంత్ర్య ప్రియులు అయిన ఆఫ్ఘన్లు ఆగ్రహావేశంతో బ్రిటిషు వాళ్ళకి వ్యతిరేకంగా విజృంభించసాగారు, దోస్త్ మహమ్మద్, అతని అనుచరులు బ్రిటిషు సైన్యాన్ని చీకాకు పర్చారు. 1840 నవంబరులో దోస్త్ మహమ్మదు బ్రిటిషు వాళ్ళకి చిక్కారు. ఖైదీగా భారతదేశానికి తరలింపబడ్డారు. ఆఫ్ఘన్ ప్రజల ఆగ్రహం ఇంకా పెరిగిపోయింది. ఆఫ్ఘన్ తెగలన్నీ తిరుగుబాటు చేశాయి. 1841 నవంబర్ 2న అకస్మాత్తుగా కాబూల్‌లో తిరుగుబాటు ప్రజ్వరిల్లింది దృఢకాయులైన ఆఫ్ఘన్లు ఇంగ్లీషు సైనికుల మీద దాడి చేశారు.

1841 డిసెంబర్ 11న బ్రిటిషువాళ్ళు ఆఫ్ఘన్‌లతో సంధికి దిగిరాక తప్పలేదు ఆఫ్ఘనిస్థాన్ నుంచి నిష్క్రమించటానికి, దోస్త్ మహమ్మదుని తిరిగి రాజుగా నెలకొల్పటానికి ఇంగ్లీషువాళ్ళు అంగీకరించారు. కాని ఇక్కడితో కథ పూర్తి కాలేదు. ఇంగ్లీషు సేనలు మూటా ముల్లె సర్దుకుని తిరుగు ముఖం పట్టిన సమయంలో దేవ పొడుగునా ఆఫ్ఘన్ తెగలు మారణ కాండ సాగించాయి. 16,000 మంది బ్రిటిషు సైనికులకుగాను ఒకే ఒక్కడు ప్రాణాలతో భారతదేశం చేరాడు. ఆఫ్ఘనిస్థాన్‌లోకి బ్రిటిషు సాహసయాత్ర ఆ విధంగా ఘోర వైఫల్యంగా ముగిసిపోయింది. భారత సామ్రాజ్యంలో బ్రిటిషు అయుధ శక్తి ఎదుర్కొన్న విపత్తులలో ఇది అత్యంత దారుణమైంది.

ఈ మొదటి అప్ఘన్ యుద్ధం సామ్రాజ్యవాద పూరితమైందని, నీతిమాలినదని, వివేక రహితమైందని, రాజకీయంగా వినాశకరమైందని ఖండించటంలో చరిత్రకారులు యావన్మంది అపూర్వమైన ఏకీభావం ప్రదర్శించారు భారతదేశం ఒకటిన్నర కోట్ల రూపాయల వ్యర్థ యుద్ధ వ్యయాన్ని భరించవలసి వచ్చింది. రమారమి ఇరవై వేలమంది సైనికులు హతమైపోయారు. అప్ఘనిస్థాన్‌కు బ్రిటీషు ఇండియావట్ల అపనమ్మకం ఏర్పడింది. అఖరికి శత్రుభావం కూడా ఏర్పడిందని చెప్పాలి అప్ఘనిస్థాన్ అపనమ్మకం కొంతమట్టుకయినా ఉపశమించటానికి అనేక సంవత్సరాలు పట్టింది.

*విర్ జోక్య విధానం:* 1855లో దోస్త్ మహమ్మద్ - బ్రిటీషు ఇండియా ప్రభుత్వాల మధ్య మిత్రత్వ సంధి మీద సంతకాలు కావడంతో ఇంగ్లీషు వాళ్ళకి, అప్ఘన్లకి మధ్య ఒక నూతన స్నేహదశ విగురించింది. ఉభయ ప్రభుత్వాలు తమ నడుమ స్నేహపూర్వక, శాంతియుత సంబంధాలు కాపాడుకోవగటానికి, పరస్పర ప్రాదేశిక సమగ్రతను గౌరవించుకోటానికి, ఒకరి అంతరంగిక వ్యవహారాల్లో మరొకరు జోక్యం పెట్టుకోకుండా ఉండటానికి వాగ్దానం చేసుకున్నాయి. "ఈస్టిండియా కంపెనీ స్నేహితులకు స్నేహితుడుగా కంపెనీ విరోధులకు విరోధిగా" ఉండటానికి దోస్త్ మహమ్మద్ అంగీకరించాడు. 1857 తిరుగుబాటు ప్రజ్వరిల్లిన కాలంలో దోస్త్ మహమ్మదు తను ఇంగ్లీషు వారికిచ్చిన మాటకు కట్టుబడి తిరుగుబాటు దార్లకి ఎలాంటి సహాయం చెయ్యలేదు.

౧863లో దోస్త్ మహమ్మద్ మరణించాడు. అయినా లార్డ్ లారెన్సుగానీ అతని తరువాత వచ్చిన మరో ఇద్దరు గవర్నర్ జనరల్సుగానీ అప్ఘనిస్థాన్‌లో విర్ జోక్య విధానాన్ని గట్టిగా పాటించారు

*రెండవ అప్ఘన్ యుద్ధం:* విర్ జోక్య విధానం ఎక్కువకాలం నడవలేదు. 1870 లగాయతు ప్రపంచమంతటా సామ్రాజ్యవాదం మళ్ళీ జడలు విప్పింది. ఆంగ్లో-రష్యన్ ప్రతిస్పర్థలు తీవ్రతరమయ్యాయి. బ్రిటీషు ప్రభుత్వం ఆర్థిక వాణిజ్య రంగాలలో మధ్యాసియాలోకి దూసుకుపోవాలని తహతహలాడింది. బ్రిటీషువాళ్ళు, రష్యన్లు బాల్కన్సులో, పశ్చిమాసియాలో బాహాటంగా ఘర్షణకు దిగారు.

మధ్యాసియాలో బ్రిటీషు విస్తరణకి అప్ఘనిస్థాన్ ప్రాపుగా ఉపయోగపడుతుందనే ఆశతో బ్రిటీషు రాజనీతిజ్ఞులు అప్ఘనిస్థాన్‌ని తమ ప్రత్యక్ష రాజకీయ అధిపత్యం కిందికి తెచ్చుకోవాలని మళ్ళీ తలపెట్టారు. బ్రిటీషు సామ్రాజ్య కిరీటంలో 'కలికితురాయి' అయిన భారతదేశం మీదికి రష్యా వచ్చిపడుతుందనే భయోన్మాదంతో బ్రిటీషు అధికార్లు, ప్రజలు కొట్టుకులాడారు. కాబట్టి లండన్‌లోని దొరలు అప్ఘనిస్థాన్‌ని అనుబంధ రాజ్యంగా చేసుకుని అప్ఘన్ విదేశ వ్యవహారాల్ని రక్షణ విధానాన్ని బ్రిటీషు కంట్రోలులో పెట్టేసుకోమని భారత ప్రభుత్వానికి ఆదేశాలు పంపారు.

ఆ రోజుల్లో అప్ఘన్ అమీరు షేర్ అలీ. తన దేశ స్వాతంత్ర్యానికి రష్యావల్ల వచ్చే ముప్పు అతనికి పూర్తిగా తెలుసు గనుక బ్రిటీషు వాళ్ళతో సహకరించడానికి సుముఖంగా ఉన్నాడు. రష్యా నుంచి రక్షణకు, రష్యాపైకి దాడికి అనువుగా బ్రిటీషు ఇండియా ప్రభుత్వంతో ఒప్పందం పెట్టుకోవటానికి అతను ముందుకొచ్చాడు. ఇంటా బైటా శత్రువుల నుంచి ఆత్మ రక్షణ చేసుకోవాల్సిన సమయం ఉత్పన్నమైనప్పుడు విస్తృత సైనిక సహాయం చేసేట్లుగా బ్రిటీషు ప్రభుత్వ హామీని కోరాడు. అటువంటి

అన్యోన్య, నిర్నిబద్ధమైన ఒప్పందానికి బ్రిటిషు ఇండియా ప్రభుత్వం ఒప్పుకోలేదు. పైగా కాబూల్‌లో బ్రిటిషు దౌత్యవర్గాన్ని నిలపాలనీ, అఫ్ఘనిస్థాన్ విదేశ వ్యవహారాలు బ్రిటిషు ప్రభుత్వం అదుపాజ్ఞల్లో ఉండాలనీ తన ఏకపక్ష హక్కుగా డిమాండు చేసింది. షేర్ అలీ బ్రిటిషు కోర్కెల్ని నిరాకరించాడు. బ్రిటిషు ప్రభుత్వం వెంటనే షేర్ అలీని బ్రిటిషు వ్యతిరేకిగా, రష్యా అనుకూలుడుగా ముద్రవేసింది. 1876 భారత గవర్నర్ జనరల్‌గా దిగిన లార్డ్ లిట్టన్ "షేర్ అలీని రష్యా చేతుల్లో పనిముట్టుని కానివ్వను; అటువంటివాడు రష్యాకు పనిముట్టుగా ఉపయోగపడక ముందే, ఆ పనిముట్టుని విరిచేస్తాను" అని బహిరంగంగా ప్రకటించాడు. మొదటి అఫ్ఘన్ యుద్ధంలో బ్రిటిషువాళ్ళ శృంగభంగానికి కారకుడైన లార్డ్ ఆక్ లాండ్ అడుగుజాడల్లో లార్డ్ లిట్టన్ "అఫ్ఘన్ అధికార శక్తిని క్రమేణా చెదరగొట్టి నిర్వీర్య పరచడానికి" ప్రతిపాదన చేశాడు.

అమీరుపైన బ్రిటిషు షరతుల్ని బలవంతంగా రుద్దటానికి 1878లో అఫ్ఘనిస్థాన్ మీద బ్రిటిషు దాడి మొదలయింది. 1879 మేలో ఉభయుల మధ్య శాంతి సంధి జరిగింది. షేర్ అలీ అప్పటికే రష్యా పారిపోయాడు. అతని కుమారుడు యాకూబ్‌ఖాన్ అఫ్ఘనిస్తాన్‌కి అమీరైనాడు. 1879 మే 26న యాకూబ్‌ఖాన్ బ్రిటిషు ప్రభుత్వంతో సంధి చేసుకున్నాడు. బ్రిటిషు వారికి తాము కోరినవన్నీ లభించాయి. కుర్రం మొదలైన సరిహద్దు రాష్ట్రాలు బ్రిటిషు ప్రభుత్వానికి దక్కాయి. కాబూల్‌లో బ్రిటిషు రెసిడెంటు నియామకాన్ని సాధించింది. అఫ్ఘన్ విదేశ వ్యవహారాలు తన అదుపులో ఉండేటట్లు అమీర్ మెడలు వంచింది.

కాని ఈ బ్రిటిషు విజయం మూన్నాళ్ళ ముచ్చటయింది. అఫ్ఘన్ జాతి గౌరవం దెబ్బతిన్నది. అఫ్ఘన్ ప్రజలు తమ స్వాతంత్ర్యాన్ని రక్షించుకోడానికి మళ్ళీ తిరగబడ్డారు. 1879 సెప్టెంబరు 3న అఫ్ఘన్ తిరుగుబాటుదార్లు బ్రిటిషు రెసిడెంటు మేజర్ కవాగ్నరిని, అతని సైనిక అనుచరుల్ని చంపివేశారు. అఫ్ఘనిస్థాన్ మీద తిరిగి బ్రిటిషు దాడి ప్రారంభమైంది. అఫ్ఘనిస్థాన్‌ని బ్రిటిషు వాళ్ళు ఆక్రమించారు. కాని అఫ్ఘన్లు తమ స్వాతంత్ర్య కాంక్షని విరమించుకోలేదు. 1880లో బ్రిటన్‌లో ప్రభుత్వం మారింది. లార్డ్ లిట్టన్‌కు స్వదేశం నుంచి పిలుపొచ్చింది. లార్డ్ రిప్పన్ భారత దేశానికి కొత్త వైస్రాయిగా వచ్చాడు. లిట్టన్ దురాక్రమణ పూరిత విధానాన్ని లార్డ్ రిప్పన్ తారుమారు చేసి శక్తివంతమైన మిత్రదేశపు అంతరంగిక వ్యవహారాల్లో తలదూర్చని నిర్ జోక్య విధానాన్ని తిరిగి చేపట్టాడు. దోస్త్ మహమ్మద్ మనుమడైన, అబ్దుల్ రహ్మాన్‌ని అఫ్ఘనిస్థాన్‌కు కొత్త అమీరుగా గుర్తించాడు. అఫ్ఘనిస్థాన్‌లో బ్రిటిషు రెసిడెంటు ఉండి తీరాలన్న డిమాండును ఉపసంహరించుకున్నాడు. వీటికి ప్రతిఫలంగా, కొత్త అమీరు అబ్దుల్ రహ్మాన్ ఒక్క బ్రిటన్‌తో తప్ప మరే ఇతర రాజ్యంతో రాజకీయ సంబంధాలు పెట్టుకోకుండా ఉంటానని మాట ఇచ్చాడు. భారత ప్రభుత్వం అమీరుకి వార్షిక సబ్సిడీ చెల్లించటానికి, విదేశ దురాక్రమణ జరిగే సందర్భంలో అఫ్ఘనిస్థాన్‌కి అండగా రావటానికి అంగీకరించింది. అఫ్ఘన్ అమీరు తన విదేశాంగ విధానం మీద కంట్రోలు కోల్పోయాడు. ఆ మేరకు అతడు అధీన ప్రభువయ్యాడు. అయితే దేశ అంతరంగిక వ్యవహారాల్లో మాత్రం సర్వ సంపూర్ణ స్వతంత్రాధికారం అమీరుదే.

***మూడవ ఆంగ్లో—అఫ్ఘన్ యుద్ధం:*** మొదటి ప్రపంచ యుద్ధం, 1917 రష్యా విప్లవం ఆంగ్లో—అఫ్ఘన్ సంబంధాలలో కొత్త పరిస్థితిని సృష్టించాయి. ప్రపంచ యుద్ధం ముస్లిం

దేశాలలో తీవ్ర బ్రిటిషు వ్యతిరేక భావాన్ని రేకెత్తించింది. రష్యా విప్లవం అఫ్ఘనిస్థాన్‌లో - ఆ మాటకొస్తే ప్రపంచమంతటా సామ్రాజ్యవాద వ్యతిరేక నూతన భావాలు రేకెత్తించింది. సామ్రాజ్యవాద రష్యా అంతరించి పోవడంతో నిరంతరం పట్టి పీడించిన దురాక్రమణ భయం తొలగిపోయింది. అఫ్ఘన్ ప్రజలిప్పుడు బ్రిటిషు వారి పెత్తనం నుంచి సంపూర్ణ స్వాతంత్ర్యం వాంఛించారు. అబ్దుల్ రహమాన్ తరువాత 1901లో అధికారానికొచ్చిన హబీబుల్లా 1919 ఫిబ్రవరి 20న హత్య కావించబడ్డాడు. హబీబుల్లా కుమారుడు అమానుల్లా కొత్త అమీరుగా అధికారం స్వీకరించి బ్రిటీషు వాళ్ళమీద బహిరంగ యుద్ధం ప్రకటించాడు. 1921లో శాంతి సంధి కుదిరింది. అఫ్ఘనిస్థాన్ విదేశ వ్యవహారాల నిర్వహణలో తన పూర్వ స్వాతంత్ర్యాన్ని తిరిగి సాధించుకుంది.

***టిబెట్‌తో సంబంధాలు*** : భారత దేశానికి ఉత్తరాన హిమాలయ పర్వతాలలో ఉంది టిబెట్. హిమాలయ పర్వత శిఖరాలు టిబెట్‌ని భారతదేశం నుంచి వేరు చేస్తున్నాయి. టిబెట్‌ని అనాడు బౌద్ధలామాలు పరిపాలిస్తుండేవాళ్ళు. వాళ్ళు స్థానిక ప్రజానీకాన్ని కూలీలుగా, ఆఖరికి బానిసలుగా మార్చివేశారు. దలైలామా అత్యున్నత రాజకీయాధిపత్యం చలాయించేవాడు. తాను బుద్ధుని సజీవ అవతారమని ఆయన చెప్పుకున్నాడు. రాజ్యాధికారం చలాయించే లామాలు టిబెట్‌ని మిగిలిన ప్రపంచం నుంచి వేరుగా ఉంచాలనుకున్నారు. అయితే 17వ శతాబ్దారంభం నుంచి టిబెట్ చైనా నామమాత్ర సార్వభౌమాధికారాన్ని గుర్తించింది. భారతదేశం-టిబెట్‌ల మధ్య పరిమిత వ్యాపార కార్య కలాపాలు, తీర్థయాత్రలు కొద్దిమేరకు సాగినా భారతదేశంతో సంబంధాలు పెంపొందించుకోనీకుండా చైనా ప్రభుత్వం టిబెట్‌ను నిరుత్సాహ పర్చింది.

19వ శతాబ్ద కాలంలో మంచూ రాజుల అధిపత్యం కింద ఉన్న చైనా సామ్రాజ్యం క్షీణయుగంలోకి ప్రవేశించింది. బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, జర్మనీ, జపాన్, అమెరికాలు వాణిజ్యపరంగా, రాజకీయంగా చైనాలోకి చొచ్చుకు వచ్చాయి. మంచూ రాజుల మీద పరోక్ష రాజకీయ పెత్తనం చలాయించాయి. 19వ శతాబ్దాంతం నాటికి చైనా ప్రజలు ఒక బలియమైన మంచూ వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయోద్యమాన్ని నిర్మించారు. 1911లో మంచూ రాజరికాన్ని కూలదోశారు. కాని డాక్టర్ సన్‌యట్‌సెన్ నాయకత్వంలో జాతీయవాదులు చైనాలో తమ అధికారాన్ని పటిష్టపర్చుకోలేకపోయారు. కొన్నేళ్ళపాటు చైనాలో అంతర్యుద్ధం చెలరేగింది. ఫలితంగా అంతరంగికంగా నిర్వీర్యమైపోయిన చైనా టిబెట్‌పైన నామమాత్రపు అధిపత్యాన్ని కూడా చలాయించలేకపోయింది. ఇతర విదేశ రాజ్యాలు టిబెట్ లోపలికి చొచ్చుకురాకుండా వుండటానికని, టిబెట్ చైనా సార్వభౌమత్వాన్ని సిద్ధాంతరీత్యా ఆమోదించింది. కాని టిబెట్ ఎవరితో సంబంధం లేకుండా ఏకాకిగా ఎంతోకాలం ఉండలేకపోయింది.

టిబెట్‌తో సంబంధాలు అభివృద్ధి పర్చుకోవటానికి బ్రిటన్, రష్యాలు రెండూ ఆశక్తి చూపాయి. టిబెట్ పట్ల బ్రిటీషు విధానాన్ని ఆర్థిక, రాజకీయ యోచనలు శాసించాయి. ఆర్థిక దృష్ట్యా బ్రిటీషు వాళ్ళు ఇండో-టిబెట్ వ్యాపార వాణిజ్యాలని అభివృద్ధి పర్చి, టిబెట్ సంపన్న ఖనిజ వనరుల్ని కొల్లగొట్టాలని ఆశపడ్డారు. రాజకీయంగా భారతదేశ ఉత్తర సరిహద్దుని పరిరక్షించుకోవాలని ఆకాంక్షించారు.

కాబట్టి బ్రిటిషు ప్రభుత్వానికి టిబెట్‌లో ఏదో ఒక విధంగా రాజకీయ పెత్తనాన్ని చలాయించాలని ఉన్నట్లు తోస్తుంది. 19వ శతాబ్దాంతం దాకా టిబెటన్లు బ్రిటిషువారిని తమ దేశంలో చోటు చేసుకోనీకుండా అటకాయించగలిగారు. అదే సమయంలో రష్యా దృష్టి కూడా టిబెట్‌పైన పడింది. టిబెట్‌లో రష్యా పలుకుబడి పెరుగుతూ వచ్చింది. దీన్ని బ్రిటిషు ప్రభుత్వం సహించలేకపోయింది. మహా ఉత్సాహవంతుడయిన సామ్రాజ్య నిర్మాత లార్డ్ కర్జన్ నేతృత్వంలో బ్రిటిషు ఇండియా ప్రభుత్వం టిబెట్‌లో రష్యా ఎత్తుగడల్ని తుదముట్టించి, టిబెట్‌ని రక్షిత సరిహద్దు రాష్ట్ర వ్యవస్థలోకి లాగాలని నిశ్చయించింది. కొంతమంది చరిత్రకారుల కథనం ప్రకారం రష్యా ప్రమాదమనేది వాస్తవం కాదు; టిబెట్‌లో జోక్యం కల్పించుకునేందుకు లార్డ్ కర్జన్ ఉపయోగించుకున్న సాకు మాత్రమే.

లార్డ్ కర్జన్ 1904 మార్చిలో ఫ్రాన్సిస్ యంగ్ హస్బెండ్ ఆధ్వర్యంలో టిబెట్ రాజధాని లాసా మీదికి సైన్యాన్ని తరలించాడు. దాదాపు నిరాయుధులైన టిబెట్లను ఆధునిక ఆయుధాలనేవి బొత్తిగా లేకుండానే ధైర్యోపేతంగా బ్రిటిషు సైన్యాన్ని ఎదుర్కొన్నారు. కాని ఫలితం లేకపోయింది. గురు అనే ఒక్క చోటనే 700 మంది టిబెటన్లు బలయ్యారు. 1904 ఆగస్టులో బ్రిటిషు సైన్యం లాసా చేరుకుంది. దారిలో ఒక్క రష్యన్ కూడా తటస్థపడలేదు. సుదీర్ఘ సంభాషణల అనంతరం సంధి జరిగింది. యుద్ధ పరిహారం కింద టిబెట్ 25 లక్షల రూపాయలు కక్కవలసి వచ్చింది. మూడేళ్ళ పాటు చుంబీలోయని బ్రిటిషు సైన్యాలు ఆక్రమించుకుని ఉంటాయి. బ్రిటిషు వ్యాపార ప్రతినిధి వర్గం గ్యాంట్సేలో తిష్ఠ వేస్తుంది. ఇన్నిటికి ప్రతిఫలంగా బ్రిటిషు ప్రభుత్వం టిబెట్ అంతరంగిక వ్యవహారాల్లో జోక్యం కల్పించుకోదు. టిబెటన్లు తమ దేశంలోకి ఏ విదేశ ప్రతినిధి ప్రవేశాన్ని గాని అనుమతించబోమని మాట ఇచ్చారు. టిబెట్ దండయాత్ర వల్ల బ్రిటిషువాళ్ళు పెద్దగా సాధించిందేమీ లేదు. రష్యా ఉపసంహారణకి సంబంధించి బ్రిటిషువాళ్ళ పంతం నెరవేరింది. టిబెట్‌పైన చైనా సార్వభౌమత్వాన్ని ఖరారు చేస్తూ రష్యా ఉపసంహారణకు ఖరీదు చెల్లించారు. ఆ తర్వాత ప్రపంచ సంఘటనల ప్రవాహ సరళినిబట్టి ఉమ్మడి శత్రువైన జర్మనీకి వ్యతిరేకంగా బ్రిటన్, రష్యాలు దగ్గరయ్యాయి. 1907లో జరిగిన ఆంగ్లో-రష్యన్ సమావేశం ద్వారా శత్రుత్వం సమసిపోయి ఉభయులూ పరస్పరం మిత్రులయ్యారు. ఆ సమావేశం ఆమోదించబడ్డ ఒక నిబంధన ప్రకారం బ్రిటన్, రష్యాలు రెండూ టిబెట్‌లో ప్రాదేశిక రాయితీలు కోరకుండా ఉండటానికి అంగీకరించాయి. ఆఖరికి దౌత్య ప్రతినిధుల్ని సైతం పంపకుండా ఉండటానికి సమ్మతించాయి. చైనా ద్వారానే తప్ప టిబెట్‌తో ప్రత్యక్ష రాయబారాలు జరపకుండా ఉండటానికి అంగీకరించాయి. అంటే బ్రిటన్, రష్యాలు రెండూ టిబెట్ పైన చైనా సర్వాధిపత్యాన్ని ఖరారు చేశాయి. క్షీణ దశలో ఉన్న మంచూ రాజులు టిబెట్‌పైన ఎలాగూ తమ సార్వభౌమత్వాన్ని కొనసాగించలేరన్న ధీమాతో ఈ రెండు రాజ్యాలు అలా చేశాయి. కాని చైనాలో ఒక మహా శక్తివంతమైన స్వతంత్ర ప్రభుత్వం అవతరించే రోజు వస్తుందని ఉభయులూ ఊహించలేక పోయారు.

*సిక్కింతో సంబంధాలు!* బెంగాల్‌కి ఉత్తరంగా, నేపాల్‌ని ఆనుకుని టిబెట్ - భారత దేశాల మధ్య సరిహద్దు మీద సిక్కిం ఒక చిన్న పర్వత రాజ్యం. 1835లో రాజా బ్రిటిషువాళ్ళు ఏటా ఇస్తామన్న ధన సహాయానికి ప్రతిఫలంగా డార్జిలింగ్ చుట్టూ ఉన్న

ప్రాంతాన్ని దానం చేశారు సిక్కిం-బ్రిటిష ప్రభుత్వాల మధ్య కొనసాగిన స్నేహ సంబంధాలు 1849లో విచ్ఛిన్నమయ్యాయి ఒక చిన్న తగాదాను పురస్కరించుకొని దలహౌసి సిక్కిం మీదికి సైన్యాన్ని తరలించాడు. సిక్కింరాజు సుమారు 1700 చదరపు మైళ్ళ భూభాగాన్ని బ్రిటిష ఇండియాకు సమర్పించుకున్నాడు.

1860లో మళ్ళీ మరొక సంఘర్షణ జరిగింది 1861లో కుదిరిన శాంతి సంధి ద్వారా సిక్కిం దాదాపు బ్రిటిష రక్షిత రాజ్యం స్థాయికి దిగజారిపోయింది సిక్కిం రాజు బ్రిటిష వ్యతిరేక పంథాను చేపట్టిన తన దివాన్‌ని, అతని బంధువుల్ని సిక్కింనుంచి బహిష్కరించాడు 7,000 రూపాయల జరిమానాను కట్టటానికి అంగీకరించాడు. బ్రిటిష వ్యాపార వాణిజ్యాలకు సిక్కింద్వారాలు బార్లా తెరిచాడు. సిక్కిం గుండా ఇండియా టిబెట్ల మధ్య రవాణా అయ్యే వస్తువుల మీద రవాణా సుంకాన్ని బ్రిటిష వారు కోరిన మేరకు పరిమితం చెయ్యటానికి అంగీకరించాడు.

1880లో తిరిగి రభస ప్రారంభమైంది టిబెట్‌కు అనుకూలంగా ఉన్న సిక్కిం ప్రభు వర్గంతో కుమ్మక్కయిన టిబెటన్లు సిక్కింను తమ అదుపులోకి తెచ్చుకోడానికి ప్రయత్నం చేశారు. బ్రిటిష ఇండియా ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని సాగనివ్వలేదు. బ్రిటిష ప్రభుత్వం సిక్కింని, ముఖ్యంగా డార్జిలింగ్‌ని అక్కడి తేయాకు తోటల్ని తమ ఉత్తర సరిహద్దు భద్రతకి అత్యవసర ప్రాంతంగా పరిగణించింది. కాబట్టి 1888లో సిక్కింలోని టిబెటన్లకు వ్యతిరేకంగా బ్రిటిష సైన్యాలు కదిలాయి. 1890లో ఆంగ్లో-చైనా ఒడంబడిక ద్వారా అంతిమ పరిష్కారం జరిగింది. ఆ ఒడంబడిక ప్రకారం సిక్కిం బ్రిటిష వారి రక్షిత దేశం (Protectorate) అయ్యింది సిక్కిం అంతరంగిక పరిపాలనలోను విదేశ వ్యవహారాలలోను భారత ప్రభుత్వం పూర్తి పెత్తనం చేసే హక్కు పొందింది.

**భూటాన్‌తో సంబంధాలు:** సిక్కింకి తూర్పుగా, భారత ఉత్తర సరిహద్దులో భూటాన్ ఒక విశాల పర్వత రాజ్యం 1774 తర్వాత వారన్ హేస్టింగ్స్ భూటాన్ రాజుతో స్నేహసంబంధాలు నెలకొల్పాడు తన భూభాగం గుండా బెంగాలు టిబెట్‌తో వ్యాపారం సాగించుకోడానికి భూటాన్ రాజు అనుమతి ప్రసాదించాడు 1815 తరువాత ఉభయుల మధ్య సాగుతున్న స్నేహ సంబంధాలు చెడిపోయాయి భూటాన్ కొండల దిగువన ఉన్న సుమారు వెయ్యి చదరపు మైళ్ళ భూటాన్ భూభాగం మీద బ్రిటిష ప్రభుత్వం కన్ను పడింది ఈ ప్రదేశాన్నే ద్వార్‌లు లేదా కనుమలు అంటారు. ఆ భూభాగం స్వాధీనమైతే భారతదేశానికి సురక్షితమైన సరిహద్దు ఏర్పడుతుంది. బ్రిటిష తోటల యజమానులకు తేయాకు పండే చక్కని భూములు దక్కుతాయి. 1863లో బ్రిటిష రాయబారిగా భూటాన్ వెళ్ళిన ఆష్లే ఈడెన్ భూటాన్‌కు చెందిన ద్వార్‌లను ఆక్రమించుకుంటే కలిగే ప్రయోజనాల్ని ఇలా వర్ణించాడు:

"భారతదేశంలోని అత్యుత్తమమైన రాష్ట్రాల్లో అది ఒకటి మన ప్రభుత్వం కింద అది కొద్ది కాలంలో అత్యంత సంపన్నవంతమైన ప్రాంతంగా రూపొందుతుంది. భారతదేశంలో నేను చూసిన ఈ ఒకే ఒక్క ప్రాంతంలో యూరోపియన్ స్థావరాల ఏర్పాటుకు సంబంధించిన సిద్ధాంతం నిజమైన ఆచరణ రూపం తీసుకోగలదని నా అభిప్రాయం".

లార్డ్ ఆక్‌లాండ్ 1841లో అస్సాం ద్వార్‌లను ఆక్రమించాడు బెంగాల్ సరిహద్దు

ప్రాంతం మీద అస్తమాను దాడులు జరిపే భూటియాల వెధవల్ల బ్రిటీషు ఇండియా–భూటాన్‌ల మధ్య సంబంధాలు మరీ చెడిపోయాయి. చివరికి 1865లో భూటాన్–బ్రిటీషు ఇండియాల మధ్య యుద్ధం ప్రజ్వరిల్లింది. అది ఏకపక్ష యుద్ధంలా సాగింది. 1865 నవంబర్‌లో సంధి కుదిరింది. భూటాన్ తన బెంగాల్, అస్సాం ద్వార్‌లను బ్రిటీషు ప్రభుత్వ పరం చేసింది. అందుకు ప్రతిఫలితంగా బ్రిటీషు ప్రభుత్వం భూటాన్ రాజుకు ఏటా 50 వేల రూపాయలు ముట్టజెప్పటానికి అంగీకరించింది. భూటాన్ రక్షణ, విదేశ వ్యవహారాలు బ్రిటీషు ఇండియా ప్రభుత్వ అధీనంలోకొచ్చాయి. భూటాన్ అంతరంగిక వ్యవహారాల్లో ప్రమేయం పెట్టుకోకుండా ఉండటానికి బ్రిటీషువాళ్ళు అంగీకరించారు.

# 10

# బ్రిటిష్ పరిపాలన ఆర్థిక ప్రభావం

బ్రిటిష్ విజయం భారతదేశంమీద ఒక ప్రస్ఫుట, ప్రగాఢ ఆర్థిక ప్రభావాన్ని చూపింది. బ్రిటిషు వాళ్ళు భారతదేశాన్ని ఆక్రమించుకుని 1947 వరకు పరిపాలించినంత కాలం మంచికో, చెడుకో, భారత ఆర్థిక వ్యవస్థలో మారని అంశమంటూ లేదు.

***సాంప్రదాయిక ఆర్థిక వ్యవస్థ విచ్ఛిత్తి:*** బ్రిటిషువాళ్ళు అనుసరించిన ఆర్థిక విధానాలు భారత ఆర్థిక వ్యవస్థ వలస ఆర్థిక వ్యవస్థగా త్వరితగతిని పరివర్తన చెందటానికి త్రోవ తీశాయి. బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థ తాలూకు అవసరాలు ఈ వలస ఆర్థిక వ్యవస్థ స్వభావ, నిర్మాణాల్ని నిర్ణయించాయి. ఈ సందర్భంలో బ్రిటిషు విజయం పూర్వం భారతదేశం మీద సాధించిన వివిధ విదేశ విజయాలకు పూర్తిగా భిన్నమైంది. పూర్వం భారతదేశాన్ని ఆక్రమించినవాళ్ళు స్వదేశ రాజుల్ని కూలద్రోశారేగాని దేశ ఆర్థిక వ్యవస్థలో మౌలికమైన మార్పు అనేది చేసి ఎరుగరు. భారత ఆర్థిక, రాజకీయ జీవనంలో వాళ్ళు ఒక భాగమైపోయారు. రైతు, వృత్తికారులు, వ్యాపారస్తులు మునుపటిలాగానే జీవనం కొనసాగించారు. స్వయం సంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తాలూకు మౌలిక ఆర్థిక నమూనా చెక్కుచెదరకుండా కొనసాగింది. పాలకుల మార్పు అంటే రైతుల మిగులును గుంజుకునే ప్రభువుల సిబ్బంది మార్పుగా మాత్రమే తోచేది. కాని బ్రిటిషు విజేతలు పూర్తిగా భిన్నమైన వాళ్ళు. వాళ్ళు భారత ఆర్థిక వ్యవస్థ సాంప్రదాయిక కట్టడాన్ని పూర్తిగా కూలగొట్టారు. పైగా, వాళ్ళెన్నడూ భారతీయ జీవనంలో అంతర్భాగం కాలేదు. వాళ్ళి దేశంలో పరాయివాళ్ళుగానే మిగిలిపోయారు. ఈ దేశపు వనర్లని కొల్లగొట్టి, ఈ దేశ సౌభాగ్యాన్ని మూటగట్టుకొనిపోయే విదేశస్థులుగా వాళ్ళు కొనసాగారు.

బ్రిటిషు వాణిజ్య, పారిశ్రామిక ప్రయోజనాలకోసం భారత ఆర్థిక వ్యవస్థ లోబడిపోయినందువల్ల కలిగిన ఫలితాలు అనేకం, బహుముఖం.

***వృత్తికళాకారుల, హస్తనిపుణుల వినాశనం:*** సమస్త నాగరిక ప్రపంచ విపణి వీధుల్లో అద్భుత హస్త కళా నైపుణికి మారుపేరుగా భారతదేశాన్ని మారుమోగించిన పట్టణ చేతి వృత్తులు అకస్మాత్తుగా కుప్ప కూలిపోయాయి. బ్రిటన్‌నుంచి యంత్రాలమీద తయారయి ఈ దేశానికి చౌకగా దిగుమతయిన వస్తువుల పోటీకి తట్టుకోలేక పోవటమే దీనికి కారణం. బ్రిటిషువాళ్ళు తమ సరుకులకు సంబంధించి మాత్రమే స్వేచ్ఛా వాణిజ్య విధానం అవలంభించారని లోగడ చెప్పుకున్నాం. వాళ్ళు దిగుమతి చేసే సరుకుల మీద సుంకాలు లేవు. మన వస్తువులమీద మాత్రం భారీగా సుంకాలు విధించారు. ముఖ్యంగా బ్రిటన్‌నుంచి మిల్లు వస్త్రాలు వెల్లువలా మన మార్కెట్‌ని ముంచెత్తాయి. ఆ పరిస్థితుల్లో, ఆవిరితో నడిచే యంత్రాలమీద అతి పెద్ద

ఎత్తున తయారైన వస్తువులతో పురాతన పద్ధతుల ద్వారా తయారైన మన వస్తువులు పోటీకి నిలవలేక పోయాయి.

భారత పరిశ్రమల్లో ముఖ్యంగా గ్రామీణ చేతి వృత్తులు రైలు మార్గాల నిర్మాణంతో అతి వేగంగా అడుగంటిపోయాయి. రైళ్ళు పడ్డంవల్ల బ్రిటీషు వస్తువులు మారుమూల పల్లె ప్రాంతాలకు సైతం పాకిపోయి సాంప్రదాయిక స్వదేశీ పరిశ్రమల్ని కూకటివేళ్ళతో పెకలించివేశాయి. అమెరికన్ రచయిత D.H. Buchanan వర్ణించినట్లు "బైటి ప్రపంచంతో సంబంధం లేకుండా వేరుగా ఉన్న స్వయం సంపూర్ణ గ్రామ కవచాన్ని ఉక్కు పట్టాలు తూట్లు పొడిచాయి. వాటి జీవరక్తం కారిపోయింది".

నూలు, నేత పరిశ్రమలు అన్నిటికన్నా ఎక్కువగా దెబ్బతిన్నాయి. పట్టు, ఊలు, చేనేత వస్త్రాలకూ అదే గతి పట్టింది. ఇంకా ఇనుము, కుండలు, గ్లాసు, కాగితం, లోహాలు, నౌకలు, నూనె, తోలు, అద్దకం వగైరా పరిశ్రమలు కూడా మూలపడ్డాయి.

విదేశ వస్తువుల దాడి ఒక్కటే కాకుండా, బ్రిటీషు విజయంవల్ల తలెత్తిన మరికొన్ని పరిణామాలు కూడా భారతీయ పరిశ్రమల పతనానికి దారితీశాయి. ఈస్టిండియా కంపెనీ, కంపెనీ అధికార్లు, 18వ శతాబ్ది రెండవ పాదంలో బెంగాల్ వృత్తి పనివాళ్ళని నానా చెరలు పెట్టడంతో వాళ్ళు తమ పురాతన వృత్తుల్ని వదులుకున్నారు. మార్కెట్ వెలకన్నా ఇంకా తక్కువ వెలకి వాళ్ళచేత వస్తువులమ్మించి, బైట అందరూ ఇచ్చే కూలికన్నా తక్కువ కూలికి వాళ్ళచేత పని చేయించుకుని బెంగాల్ వృత్తి పనివాళ్ళని కంపెనీ నానాబాధలు పెట్టింది. మామూలు పరిస్థితుల్లో అయితే భారతదేశపు చేతిపనులు కంపెనీ ప్రోత్సాహంతో పుష్కలంగా ఎగుమతి అయ్యేవే, కాని ఈ దారుణమైన అణచివేత వ్యతిరేక ఫలితాన్ని కలుగజేసింది

బ్రిటన్‌లో, యూరప్‌లో దిగుమతయ్యే భారతీయ వస్తువులమీద 18, 19 శతాబ్దాలలో విధించిన భారీ దిగుమతి సుంకాలు, ఇతర నిర్బంధాలకు తోడు బ్రిటన్‌లో ఆధునిక పరిశ్రమల వికాసం 1820 తరువాత భారతీయ వస్తువులు బరోపా మార్కెట్లు ప్రవేశించే అవకాశాల్ని సంపూర్ణంగా మూసివేశాయి. పట్టణ ప్రాంతాల్లో తయారయ్యే ఈ చేతి పనుల్ని విశేషంగా ప్రోత్సహించిన స్వదేశరాజులు, వాళ్ళ ఆస్థానాలు క్రమేణా అదృశ్యం కావడం వల్ల కూడా చేతివృత్తుల నిపుణుల నేటిదగ్గర కూడు పడిపోయింది. ఉదాహరణకు - ఆయుధ ఉత్పత్తి పూర్తిగా స్వదేశ సంస్థానాల మీద ఆధారపడి ఉండేది. బ్రిటీషువాళ్ళు తమకు కావలసిన సైనిక స్టోర్స్ మొత్తం బ్రిటన్‌లో కొనుగోలు చేసేవాళ్ళు; స్వదేశ రాజుల్ని, సరదార్లని త్రోసివేసి అధికారానికొచ్చిన బ్రిటీషు సివిల్, మిలిటరీ అధికార్లు తమదేశంలో తయారైన సైనిక ఆయుధాలు, పరికరాల్ని తప్ప దేశీ సరుకు జోలికి పోలేదు. ఈ దేశం నుంచి ముడిపదార్థాలను బ్రిటన్‌కు ఎగుమతి చేసే కంపెనీ విధానం కూడా చేతివృత్తుల్ని దెబ్బతీసింది. పత్తి, తోలు మొదలైన ముడి సరుకుల ధరల్ని విపరీతంగా పెంచేసి భారతీయ చేతివృత్తుల పతనానికి కంపెనీ కంకణం కట్టుకుంది. ముడి సరుకు ధరల పెరుగుదల చేతిపనుల ఉత్పత్తి వ్యయాన్ని పెంచి, విదేశ వస్తువులతో పోటీ చెయ్యగల వాటి పాటవాన్ని తగ్గించి వేసింది.

చేతిపనులు నాశనం కావటంతో, వాటి ఉత్పత్తికి ప్రసిద్ధిపొందిన బస్తీలు, పట్టణాలు నాశనమయ్యాయి. యుద్ధ భీభత్సాన్ని, దోపిడీని తట్టుకుని నిలిచిన

పట్టణాలు బ్రిటీషు విజయాన్ని తట్టుకుని బ్రతికి బట్టకట్టలేకపోయాయి. జనసమ్మర్దం కలిగి, కళాకళలాడే ఢాకా, సూరత్, మూర్షిదాబాద్ మొదలైన అనేక పట్టణాలు, పారిశ్రామిక కేంద్రాలు నిర్జనమైపోయి, నిర్జీవమయ్యాయి. గవర్నర్-జనరల్ విలియం బెంటింక్ 1834-35లో ఒక నివేదికలో ఇలా వర్ణించాడు:

"ఇటువంటి దైన్యస్థితికి వాణిజ్య చరిత్రలో ఎక్కడా పోలిక దొరకదు. చేనేత పనివాళ్ళ ఎముకల్తో భారత మైదాన సీమలు తెల్లబారాయి".

సాంప్రదాయిక పరిశ్రమల శిథిలాలమీద బ్రిటన్, పశ్చిమ యూరపులలో మాదిరిగా ఆధునిక యంత్ర పరిశ్రమలు భారతదేశంలో అభివృద్ధి కాకపోవడంతో మన దైన్యస్థితి పతాకస్థాయి చేరింది. పర్యవసానంగా మనవృత్తి పనివాళ్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కరువైంది వ్యవసాయంలోకి మూకుమ్మడిగా చొరబడ్డంకన్నా వాళ్లకి మార్గాంతరం లేదు. గ్రామాలలో ఆర్థిక జీవన సమతూకాన్ని కంపెనీ పాలన విచ్ఛిన్నం చేసింది. గ్రామీణవృత్తులు క్రమేణా విధ్వంసం కావటంతో గ్రామసీమల్లో వ్యవసాయానికి, గృహ పరిశ్రమకి మధ్యగల అనుబంధం తెగిపోయింది తద్వారా స్వయం సంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నమైంది ఒకవేపు, తీరిక సమయంలో నూలువడికి నేతనేసి వేన్నీళ్లకు చన్నీళ్ళు తోడుగా కొద్దో గొప్పో ఆదాయం తీసే లక్షలాది రైతాంగం ఇప్పుడు పూర్తిగా వ్యవసాయం మీదే ఆధారపడవలసి వచ్చింది. మరోవేపు లక్షలాది చేతివృత్తి కార్మికులు తన సాంప్రదాయక జీవనోపాధి కోల్పోయి వ్యవసాయ కార్మికులుగానో, ఖుల్లి కౌలుదార్లుగానో జీవితం వెళ్లబుచ్చ వలసి వచ్చింది. వీళ్లరాకతో భూమి మీద ఒత్తిడి యింకా ఎక్కువయింది

ఆ విధంగా బ్రిటీషు వాళ్ల భారతదేశాక్రమణ దేశీ పరిశ్రమల విచ్ఛిత్తికి, దేశప్రజలు అపరిమితంగా వ్యవసాయంమీద ఆధారపడే పరిస్థితికి దారితీసింది. జనాభా లెక్కల ప్రకారం 1901-1941 సంవత్సరాల మధ్య వ్యవసాయంమీద ఆధారపడిన ప్రజలు 7 శాతం పెరిగారు అంటే 1941 నాటికి నూటికి 70 మందికి వ్యవసాయమే జీవనం. వ్యవసాయం మీద పెచ్చు పెరిగిన ఈ ఒత్తిడి బ్రిటీషు పాలనలో భారతదేశ భయంకర దారిద్ర్యానికి ప్రధాన కారణాలలో ఒకటి.

వాస్తవానికి భారతదేశం ఇప్పుడు పారిశ్రామిక బ్రిటన్‌కు వ్యవసాయిక వలసగా మారింది. బ్రిటన్‌లోని పరిశ్రమలకు భారతదేశం ముడిపదార్థాలు సరఫరాచేసే ఒక ప్రధానమైన వనరు. ఈ మార్పు అన్నిటికన్నా ముఖ్యంగా బట్టల పరిశ్రమలో కొట్టవచ్చినట్లు కానవస్తుంది. శతాబ్దాలుగా నూలు వస్త్రాలు ఎగుమతిచేసే అత్యంత ప్రధానమైన దేశంగా ప్రపంచమంతటా ప్రసిద్ధిపొందిన భారతదేశం ఇప్పుడు (బ్రిటీషు పాలనలో) బ్రిటన్ నుండి వస్త్రాలు దిగుమతి చేసుకునే దేశంగా, బ్రిటన్‌కు ముడి పత్తి ఎగుమతి చేసే దేశంగా దిగజారిపోయింది.

***రైతాంగం పేదరికం*** : బ్రిటీషు పాలనలో రైతు క్రమేణా పేదస్థితి పొందారు. ప్రస్తుతం దేశంలో యుద్ధాలపీడ నుంచి విముక్తుడైనా, రైతు భౌతిక జీవన పరిస్థితులు కృంగి కృశించిపోయాయి. రైతు పేదరికంలో కూరుకుపోయాడు.

బెంగాల్‌లో బ్రిటీషు పరిపాలన తొట్టతొలి దశలోనే రైతాంగాన్ని పీడించి అత్యధిక భూమిశిస్తు పిండుకున్న క్లైవ్, వారన్ హేస్టింగుల విధానం దేశాన్ని ఎంతగా పాడు పెట్టిందంటే, బెంగాల్‌లో మూడవ వంతు "క్రూరమృగాలు సంచరించే

అరణ్యం"గా మారిపోయిందని ఆఖరికి గవర్నర్ జనరల్ కారన్ వాలిస్ అంతటివాడు మొత్తుకున్నాడు. ఆ తరువాత కూడా ఏమీ అభివృద్ధి జరగలేదు. శాశ్వత, తాత్కాలిక శిస్తు పద్ధతులు ప్రవేశపెట్టిన జమీందారీ పరగణాల్లో కూడా రైతు దుస్థితి మార్పు లేకుండా కొనసాగింది. బ్రిటీషు పాలకులు రైతాంగాన్ని జమీందార్ల దయాదాక్షిణ్యాలకు వదలివేశారు. జమీందారు విపరీతంగా శిస్తు పెంచేశారు; అక్రమ వసూళ్ళకు పాల్పడి రైతుల్ని తిప్పలు పెట్టారు; రైతుల చేత వెట్టి చాకిరీ చేయించుకున్నారు. ఇంకా అనేకరకాలుగా రైతుల్ని పీడించుకు తిన్నారు; పీల్చి పిప్పిచేశారు.

రైత్వారీ, మహల్వారీ పద్ధతులు సాగిన ప్రాంతాల్లో కూడా రైతుల పరిస్థితి మెరుగ్గా లేదు. ఇక్కడ జమీందార్ల స్థానంలో ప్రభుత్వం కూర్చుని భూమి శిస్తుని అక్రమంగా, అపరిమితంగా పెంచేసింది. పండిన పంటలో మూడవ వంతుని భూమిశిస్తుగా మొదట్లో నిర్ణయించి, తరువాత దాన్ని పండిన పంటలో సగానికి పెంచింది. ఈ దుర్భర శిస్తు విధానం దారిద్ర్యం పెరిగిపోవటానికి, వ్యవసాయం క్షీణించిపోవటానికి దారితీసిన ప్రధాన కారణాల్లో ఒకటి. సమకాలీన రచయితలు, అధికార్లు ఈ వాస్తవాన్ని గమనించారు. ఉదాహరణకు, బిషప్ హెబెర్ 1826లో ఇలా వర్ణించాడు.

"భారతదేశంలోగానీ, యూరపులోగానీ వ్యవసాయదారుడనేవాడు ఇప్పటి పన్నురేటు తట్టుకొని పైకి రాగలడని నేననుకోను. పండిన మొత్తం పంటలో సగం ప్రభుత్వంమే డిమాండు చేస్తోంది .. స్వదేశ సంస్థానాలలోని రైతాంగంకన్నా కంపెనీ పాలనలో వున్న రాష్ట్రాలలో రైతులు ఇంకా అన్యాయంగా, పేదగా, దైన్యంగా ఉన్నట్లుగా మన రాజోద్యోగులు భావిస్తున్నట్లు నాకు గోచరించింది. భూమి ఇంకా పేదగా ఉన్న ఈ మద్రాసు రాష్ట్రంలో తేడా ఇంకా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. మనం విధించినంత భూమిశిస్తు ఏ స్వదేశ రాజు కూడా విధించలేదనేది వాస్తవం".

విపరీతంగా పెంచి వసూలు చేసుకొనే ఈ భూమి శిస్తువల్ల రైతుకు మిగిలింది శూన్యం. ప్రభుత్వం అత్యధిక భూమిశిస్తు వసూలు చేసుకుందేగాని వ్యవసాయాభివృద్ధికోసం పైసా ఖర్చుపెట్టలేదు. రాబట్టుకున్న రాబడి మొత్తాన్ని పరిపాలనావసరాల నిమిత్తం ఖర్చుపెట్టింది. ఇంగ్లండుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కప్పం చెల్లించటానికి ఖర్చుపెట్టింది. బ్రిటీషు వ్యాపారం, పరిశ్రమలు పైకిరావటానికి పాటుపడింది. ఆఖరికి శాంతి భద్రతల రక్షణసైతం వర్తకుడికి, వడ్డీ వ్యాపారస్థుడికి లాభించిందే తప్ప రైతుకి ఉపయోగపడలేదు.

శిస్తురేటు పెంచినందువల్ల కలిగిన దుష్ఫలితాలు దాన్ని వసూలుచేసే కసాయి పద్ధతుల వల్ల మరిన్ని కష్టాలు తెచ్చిపెట్టాయి. శిస్తు పైకాన్ని నిర్ణీత తేదీనాటికల్లా ఖచ్చితంగా కక్కాలి. పంటలుపాడైనా, అసలు పండకపోయినా శిస్తు కట్టితీరాల్సిందే. పంటలుపాడైపోయిన చెడుకాలంలో శిస్తు కట్టడమంటే రైతుకు సాధ్యమయ్యే పనికాదు.

ఎప్పుడైనా రైతు శిస్తు కట్టలేకపోయాడే, ప్రభుత్వం తక్షణం అతని భూమికి వేలం పెట్టించి బకాయిల్ని వసూలు చేసుకునేది. చాలా సందర్భాల్లో రైతే స్వయంగా కొంత భూమి తెగనమ్మి, శిస్తు బకాయిలు తీర్చేయటం కద్దు. ఎలా జరిగినా, అతని భూమికి మాత్రం కాళ్ళొచ్చేవి.

శిస్తు కట్టలేని అశక్తతవల్ల రైతు అతి తరుచుగా వడ్డీ వ్యాపారస్థుణ్ణి ఆశ్రయించి, విపరీతమైన వడ్డీ రేటుకి డబ్బు అప్పు తీసుకునేవాడు. ఎకాఎకిని గత్యం

పోగొట్టుకోవటంకన్నా వడ్డీ వ్యాపారస్థుడికో, ధనిక రైతుకో భూమి తాకట్టుపెట్టి రుణం తీసుకోవడమంటేనే రైతుకి ఇష్టం. ఇల్లు జరక్కపోయినా రైతు వడ్డీ వ్యాపారస్థుడి దగ్గరకే పోయాడు. ఒకసారి అప్పుల్లో పడ్డాడే, మరి బైటపడ్డం కల్ల. వడ్డీ వ్యాపారస్థుడు విపరీతమైన వడ్డీ గుంజుకోవడమే కాకుండా, తప్పుడు లెక్కలు చూపించి, ఇచ్చిన మొత్తంకంటే ఎక్కువ రాసుకుని, దొంగ సంతకాలు చేయించి రైతుని గోతిలో దింపి అతని భూమిని కాజేసేదాకా నిద్రపోయేవాడు కాదు.

నూతన న్యాయవిధానం, నూతన శిస్తు విధానం వడ్డీ వ్యాపారస్థులకు గొప్పలాభం చేకూర్చిపెట్టాయి. బ్రిటీషువాళ్ళు రాకపూర్వం వడ్డీ వ్యాపారస్థుడు గ్రామ సంఘానికి లోబడి వుండేవాడు. గ్రామం యావత్తు అసహ్యించుకునే పద్ధతిలో అతను ప్రవర్తించేవాడు కాదు. వడ్డీరేటు కూడా అప్పటి వాడుకని, ప్రజాభిప్రాయాన్ని బట్టి ఉండేది. రుణగ్రహీత భూమిని ఆక్రమించుకునే సంప్రదాయం లేదు. తప్పని పరిస్థితుల్లో అప్పు తీసుకున్నవాడి నగానట్రా, లేదా పంటలో కొంతభాగం స్వాధీనం చేసుకునేవాడు. బ్రిటీషు వాళ్ళు భూమి బదలాయింపుని ప్రవేశపెట్టి వడ్డీ వ్యాపారస్థుడికి, ధనిక రైతుకి మేలు చేశారు. చట్టం వడ్డీ వ్యాపారి చేతుల్లో అపరిమితమైన హక్కులుంచింది. డబ్బు బలంతో వడ్డీ వ్యాపారస్థుడు ఖరీదైన కోర్టు లావాదేవీల్ని, పైపెచ్చు దొక్కశుద్ధి, తెలివి తేటలు ఉన్న వడ్డీ వ్యాపారస్థుడు రైతుల అజ్ఞానాన్ని, నిరక్షరాస్యతని ఉపయోగించుకుని తేలిగ్గా కొరుకుడుపడని చట్టాన్ని మెలికలు తిప్పి, మడత పేచీలుపెట్టి తనకనుకూలంగా న్యాయ నిర్ణయం జరిగేటట్టు చూచుకునేవాడు.

క్రమేణా, రైత్వారీ, మహల్వారీ ప్రాంతాల్లోని రైతులు అప్పుల్లో మునిగిపోయి, వడ్డీ వ్యాపారస్థులకు ధనిక రైతులకు, ఇంకా ఇతరేతర సంపన్న వర్గాలకు తమ భూముల్ని కట్టేశారు. జమీందారీ ప్రాంతాల్లో కూడా ఇదే పద్ధతి పునరావృతమైంది. అక్కడ కౌల్దార్లు తమ కౌలు హక్కులు కోల్పోయి, భూమినుంచి గెంటివేయబడ్డారు. లేదా వడ్డీ వ్యాపారస్థుల కింద ఉపకౌల్దార్లయ్యారు.

కరువు కాటకాల కాలంలో రైతుల నుంచి భూములు అన్యాక్రాంతం అయ్యే పరిణామం మరీ తీవ్రతరమైంది. కష్టకాలంలో అదుకుందుకు రైతు దగ్గర పొదుపు మొత్తమంటూ ఏమీలేదు. పంటలు పోయాయంటే, వడ్డీ వ్యాపారస్థుడి శరణుకోరవలసిందే. కేవలం శిస్తు కట్టటానికే కాదు. ఇల్లు జరగాలంటే కూడా రైతు వడ్డీ వ్యాపారినే ఆశ్రయించాడు.

19వ శతాబ్దాంతం నాటికి, వడ్డీ వ్యాపారస్థుడు గ్రామసీమల పాలిట శాపంగా తయారయ్యాడు. పల్లెప్రజల పెరిగే పేదరికానికి ప్రధాన కారకుడయ్యాడు. 1911లో మొత్తం గ్రామీణ రుణం 300 కోట్ల రూపాయలదాకా ఉండవచ్చని అంచనా. 1937 నాటికది 1800 కోట్లకు పెరిగిపోయింది. పన్నుల ఒత్తిడి, పెరిగే దారిద్ర్యం రైతాంగాన్ని అప్పులపాల్జేశాయి. దాంతో దారిద్ర్యం ఇంకా పెరిగిపోయింది. నిజానికి, సామ్రాజ్యవాద దోపిడీ యంత్ర నిర్మాణంలో వడ్డీ వ్యాపారస్థుడు ఒక తప్పనిసరి పల్లు అనేది రైతులు గ్రహించలేకపోయారు. తమ పేదరికానికి ప్రత్యక్ష కారణంగా ఎదుట కన్పిస్తున్నాడు. కాబట్టి అతనిపట్ల రైతుల ఆగ్రహం పెరిగిపోయింది. ఉదాహరణకు 1857 తిరుగుబాటు కాలంలో రైతాంగం తిరుగుబాటు చేసిన ప్రతి సందర్భంలో వడ్డీ

వ్యాపారస్థుడు వాళ్ళ దాడికి గురయ్యాడు. అతని లెక్కల పుస్తకాలు కూడా రైతుల దాడికి గురయ్యాయి. రైతాంగం ఆవిధంగా విరుచుకుపడ్డం సర్వసాధారణమైపోయింది

వ్యవసాయంలో వ్యాపారీకరణ పెరిగిపోయి వడ్డీ వ్యాపారస్థుడు, వర్తకుడు తానే అయి రైతుని దోపిడీ చెయ్యటానికి వీలయింది. ధాన్యం నూర్పిడి కాగానే రైతుకు తన పంట అమ్ముకోక తప్పదు. ప్రభుత్వానికి, భూస్వామికి, వడ్డీ వ్యాపారికి డబ్బు కట్టటానికిగాను ఆనాడున్న రేటుకి ధాన్యం పారబోస్తాడు. అంటే అతనికున్న డబ్బు ఒత్తిడివల్ల, రైతు ధాన్యం వర్తకుడి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడతాడు. మార్కెట్ ధరకన్నా చాలా తక్కువ రేటుకి ధాన్యం వర్తకుడు కొంటాడు. రేటు నిర్ణయం అతనిష్టం. ఆ విధంగా వ్యవసాయోత్పత్తులలో పెరిగే వ్యాపారంలోని అత్యధిక లాభాలు వర్తకుడు కొట్టేశాడు. ఆ వర్తకుడే గ్రామంలో వడ్డీ వ్యాపారస్థుడు కూడా.

ఉన్న భూమి కాస్తా ఊడ్చుకుపోవటం, దేశి వృత్తులు, పరిశ్రమలు నాశనమైపోయి జనం భూమికేసి ఎగబడ్డం, ఆధునిక పరిశ్రమలు బొత్తిగా లేకపోవటం ఈ కారణాలవల్ల భూమిలేని వ్యవసాయ కూలీలు, వృత్తులు కోల్పోయి సర్వనాశనమైపోయిన చేతిపనులవాళ్ళు వడ్డీ వ్యాపారస్థులకిందా, జమీందార్లు లేదా భూకామందుల కిందా దుర్భరమైన గుత్త చెల్లించే కౌల్దార్లుగానే, చాలీ చాలని కూలికి చాకిరీ చేసే వ్యవసాయ కూలీలుగానే చేరక తప్పలేదు. ఆ విధంగా ప్రభుత్వం, జమీందారు లేదా భూస్వామి, వడ్డీ వ్యాపారస్థుడు అనే మూడు జలగలు రైతాంగాన్ని పీల్చి పిప్పి చేశాయి. ఈ ముగ్గురూ ఎవరి కందింది వాళ్ళు కట్టుకుపోయాక రైతుకు, అతని కుటుంబానికి మిగిలింది చాలా తక్కువ బ్రతకటానికది చాలదు 1950-51లో భూమి శిస్తు, వడ్డీ వ్యాపారస్థుడి వడ్డీ కలిపి 1400 కోట్ల రూపాయలకు లెక్క తేలింది. అంటే సంవత్సరం మొత్తం మీద పండిన వ్యవసాయోత్పత్తి మొత్తంలో అది మూడవ వంతుకు పరిసమానమవుతుంది. రైతాంగం యొక్క దీదరికం అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది. కరువు కాటకాలు సంభవించడం ఎక్కువైంది. దుర్భిక్షం, వరదలు వగైరా ప్రకృతి వైపరీత్యాలవల్ల పంటలు పాడైపోయి ఆహార కొరత ఏర్పడినప్పుడల్లా ప్రజలు లక్షల సంఖ్యలో రాలిపోయారు.

***పాత జమీందార్ల పతనం – నూతన భూస్వామ్య అవతరణ :*** బ్రిటీషు పాలన ఆరంభమైన మొదటి ఒకటి రెండు దశాబ్దాల కాలంలో బెంగాల్, మద్రాసు రాష్ట్రాల్లో పాత జమీందార్లు అంతరించి పోయారు. ముఖ్యంగా వారన్ హేస్టింగ్సు శిస్తు వసూలు అధికారం అప్పగించేందుకు వేలం పాడించి, అందరికన్నా ఎక్కువ పాడిన ఇజారాదారుకి ఆ హక్కు కట్టబెట్టే పద్ధతి ప్రవేశపెట్టటంతో పాత జమీందార్లు కూలిపోయారు. 1793నాటి శాశ్వత శిస్తు పద్ధతిలో కూడా మొదట్లో ఇదే జరిగింది. జమీందార్లు వసూలు చేసే శిస్తులో పదకొండింట పదివంతులు ప్రభుత్వమే పుచ్చుకోవటం వల్లా, వసూలుకు సంబంధించిన కఠిన శాసనం వల్లా చాలా జమీలు శిస్తు చెల్లింపులో జరిగిన జాప్యానికి నిర్దాక్షిణ్యంగా తెగనమ్మి వేయబడ్డాయి. బెంగాల్‌లో పెద్ద పెద్ద జమీందార్లందరూ పూర్తిగా చితికిపోయారు. 1815 నాటికి సగం భూములు పాత జమీందార్లనుండి వ్యాపారస్థులకు, ఇతర ధనిక వర్గాలకు బదిలీ అయ్యాయి. పాత జమీందార్లు గ్రామాల్లో నివసించేవాళ్ళు; వాళ్ళకు కొన్ని సంప్రదాయాలంటూ ఉండేవి; రైతులపట్ల దయా దాక్షిణ్యాలు ఉండేవి. కొత్తగా జమీందార్లయిన వ్యాపారస్థులు, ధనిక

వర్గాలు పట్టణవాసులు ఆఖరి పైసాదాకా నిర్దాక్షిణ్యంగా వసూలుచేశారు. కష్టకాలంలో సైతం కౌలుదార్ల పట్ల సానుభూతి ప్రదర్శించే వాళ్ళు కాదు. నీతి, సంప్రదాయం లక్ష్యపెట్టని ఈ కొత్త జమీందార్లు రైతుల దగ్గర అందినంత మట్టుకి పిండి, తరచు భూముల్నుంచి వెళ్ళగొట్టేవాళ్లు.

ఉత్తర మద్రాసు ప్రాంతంలో శాశ్వత శిస్తు పద్ధతి, దక్షిణ మద్రాసు ప్రాంతంలో రైత్వారీ పద్ధతి స్థానిక జమీందార్లని వేపుకుతిన్నాయి.

అయితే ఆ తరువాత కొద్దికాలంలోనే జమీందార్ల పరిస్థితి అతి శీఘ్రంగా మెరుగుపడింది. జమీందార్లు సకాలంలో శిస్తు చెల్లించటానికి వీలుగా వాళ్లకి ప్రభుత్వం హెచ్చు అధికారాలు ఇచ్చింది. కౌల్దార్ల సాంప్రదాయిక హక్కుల్ని హరించి వేసింది. దాంతో జమీందార్లు తెగబడి కౌలు రేట్లు విపరీతంగా పెంచేశారు. ఫలితంగా, జమీందార్లు సంపన్నులయ్యారు.

రైత్వారీ పద్ధతి అమల్లో ఉన్న ప్రాంతాల్లో కూడా భూస్వామి-కౌల్దారు సంబంధాలు క్రమేణా వ్యాప్తిచెందాయి. లోగడ మనం చెప్పుకున్నట్లుగా భూమి ఇంకా ఇంకా వడ్డీ వ్యాపారస్థులు, వర్తకులు, ధనిక రైతుల చేతుల్లోకి పోయింది. వాళ్లంతా భూమి సాగు చేయించుకొటానికి కౌల్దార్లను పెట్టుకున్నారు. భారతదేశంలోని ధనిక వర్గాలు భూములు కొనిపారెయ్యడానికి, విశేషమైన ఆసక్తి ప్రదర్శించటానికి ఒక కారణం ఉంది. తమ డబ్బుని పరిశ్రమల్లో పెట్టుబడి పెట్టటానికి సరైన అవకాశాలు మృగ్యం కావటమే అసలు కారణం. ఈ కొత్త భూస్వామి విధానం ప్రబలి పోవటానికి మరొక కారణం కూడా ఉంది. స్వంత భూములు సాగు చేయించుకొనే వాళ్ళు భూమి స్వాధీనం చేసుకొని శాశ్వతహక్కు అనుభిస్తున్న కౌలుదార్లు తాము స్వయంగా స్వంతంగా వ్యవసాయం చెయ్యటంకన్నా భూమికోసం తపించిపోయే సాగుదార్లకి అధిక గుత్తకి కౌలుకివ్వటమే లాభసాటని గ్రహించారు. కాలక్రమేణా ఈ కొత్త భూస్వామ్య విధానం జమీందారీ ప్రాంతాల్లోనే కాకుండా రైత్వారీ ప్రాంతాల్లో సైతం వ్యావసాయిక సంబంధాల్లో ప్రధానాంశం అయింది.

ఈ భూస్వామ్య విధానం యొక్క వ్యాప్తిలో మధ్య దళారీల పెరుగుదల ప్రముఖ లక్షణంగా భాసించింది. సాగుచేసే కౌల్దార్లకు సాధారణంగా రక్షణ లేకపోవటంవల్లా, భూమికోసం విపరీతంగా ఎగబడ్డం వల్లా , కౌల్దార్లు భూములకోసం పరస్పరం తీవ్రంగా పోటీపడ్డారు. కౌలురేటు అంతులేకుండా పెరిగిపోయింది. జమీందార్లు, కొత్త భూకామందులు తమకి శిస్తు వసూలు చేసిపెట్టటానికి లాభసాటి షరతుల మీద తమ హక్కుని ఇతర్లకి ఇచ్చారు. వాళ్లు మళ్లీ దళారుల్ని నియమించుకున్నారు. ఇది ఒక గొలుసు పద్ధతిలో అల్లుకుపోయి వాస్తవంగా సాగుచేసే కౌల్దారుకు-ప్రభుత్వానికి మధ్య దళారీలు అసంఖ్యాకంగా పెరిగిపోయారు. బెంగాల్లో కొన్ని సందర్భాల్లో వీళ్ల సంఖ్య యాభై దాకా పెరిగింది. అంతిమంగా ఈ భారాన్ని భరించవలసినవాడు నిస్సహాయుడైన రైతు. తనకి-ప్రభుత్వానికి మధ్య ఇంత పెద్ద గుంపుని పోషించటమంటే ఊహాకందని ప్రమాదకర విషయం.

ఈ జమీందార్లు, భూస్వాముల వృద్ధిమూలంగా అత్యంత హానికరమైన మరొక పరిణామం సంభవించింది. భారత స్వాతంత్ర్య సమరంలో వీళ్ళు నిర్వహించిన రాజకీయ పాత్ర ఆ దుష్ట పరిణామం. స్వదేశ సంస్థానాధీశులతో పాటు వీళ్లు విదేశ

పాలకుల కొమ్ముకాశారు ఉప్పొంగే జాతీయోద్యమాన్ని ప్రతిఘటించారు వాళ్ళు బ్రిటిష్ పాలనకి పుట్టిన శిశువులు కాబట్టి, దాన్ని శాశ్వతంగా కాపాడి నిలబెట్టటానికి తీవ్ర కృషిచేశారు

***వ్యవసాయ స్తబ్దత, క్షీణత:*** వ్యవసాయంమీద మంది మోపుకావటం, రైతు భరించజాలని భూమిశిస్తు, భూస్వామ్య వృద్ధి, నానాటికి ఎక్కువయ్యే రుణభారం పెచ్చు పెరిగే రైతాంగం పేదరికం వగైరాల ఫలితంగా భారతదేశంలో వ్యవసాయం నిలువనీరులాగా మురిగిపోసాగింది; క్షీణించిపోసాగింది ఫలితంగా దిగుబడి మరీ దిగనాసిల్లింది

వ్యసాయంలో ఎక్కడెక్కడి జనం వచ్చి క్రిక్కిరిసి పోవటం వల్ల, ఉప భూస్వామ్యం మితిమీరి పోవటం వల్ల భూమి ముక్క చెక్కలై పోయి రైతుకు గిట్టుబాటు కాకుండా పోయింది కటిక పేదరికం వల్ల రైతుల దగ్గర వ్యవసాయాభివృద్ధి కోసం ఖర్చు పెట్టడానికి వనరులు లేవు మేలు పశువుల్ని, విత్తనాల్ని, ధారాళంగా ఎరువుల్ని వాడటానికి మెరుగైన ఉత్పత్తి పద్ధతుల్ని ఉపయోగించుకోడానికి రైతుకు తాహతు లేదు ప్రభుత్వం, భూ కామందులూ రైతులనేళ్ళు కొట్టి అత్యధిక కౌలు వసూలు చేసుకుంటున్న స్థితిలో భూమిని బలం చెయ్యాలంటే రైతుకు ప్రోత్సాహం కరువైంది తను సాగుచేసే భూమి తనది కాదు; భూమిని బాగుచేసి బలంపెట్టి అధిక దిగుబడి సాధించినా అది తనకు దక్కదు పని చెయ్యకుండా ఫలితం అనుభవించే పరోక్ష భూస్వాముల గుంపు దాన్ని గుంజుకుంటారు భూమిని ఖండ ఖండాలుగా చీల్చటంతో అభివృద్ధి చెయ్యటానికి అస్కారం లేకుండా పోయింది

ఇంగ్లండ్‌లో ఇంకా తదితర యూరపు దేశాలలో ధనిక భూస్వాములు అధిక దిగుబడిలో వాలు పంచుకోవటం కోసం భూమి మీద పెట్టుబడి పెట్టారు భారతదేశంలో కౌలు వసూలు చేసుకోవటం మినహా మరే వ్యక్తిగత శ్రద్ధా ప్రదర్శించని పాత కొత్త పరోక్ష భూస్వాములు ప్రయోజనకరమైన పనంటూ చేసిన పాపాన పోలేదు వాళ్ళు కేవలం కౌలు వసూలు దార్లు, అంతకు మించి వాళ్ళకి వేరే ఆసక్తి లేదు తమ భూముల మీద అధికోత్పత్తి దాయకమైన పెట్టుబడులు పెట్టటం కన్నా రైతుల్ని ఇంకా పీడించి ఇంకా ఎక్కువ కౌలు వసూలు వసూలు చేసుకుని ఆస్తులు పెంచుకోవటానికే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు

ప్రభుత్వమైనా వ్యవసాయాభివృద్ధికి తోడ్పడాల్సింది కాని ఆ బాధ్యతని గుర్తించటానికి ప్రభుత్వం నిరాకరించింది ప్రభుత్వం పన్నుల భారం యావత్తూ రైతు భుజస్కంధాల మీద మోపి, అతనికోసం పైసా కూడా ఖర్చు చేయకుండా ఉండటమనేది బ్రిటిషు ఇండియా ఆర్థిక విధానంలో ప్రధాన లక్షణం నీటి పారుదల పట్ల గాని, వ్యవసాయాభివృద్ధి పట్ల గాని ప్రభుత్వం ప్రదర్శించిన సవతితల్లి ప్రేమ దానికి రైతాంగం పట్ల, వ్యవసాయం పట్ల ఉండే నిర్లక్ష్య భావానికి ప్రత్యక్ష ఉదాహరణ 1905లో బ్రిటిషు ఇండియా ప్రభుత్వం బ్రిటిషు వ్యాపార వర్గాలు కావాలని గోలచేసిన రైల్వేల మీద 360 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టింది అదే సంవత్సరం నీటిపారుదల కోసం 50 కోట్ల కన్నా ఇంకా తక్కువ మొత్తం ఖర్చు చేసింది నీటిపారుదల కోసం రైల్వేల మీద పెట్టినట్లుగా పెద్ద మొత్తం ఖర్చుపెట్టి వుంటే, తద్వారా లక్షలాది భారత వ్యవసాయదార్లకు ఎంతో మేలు జరిగేది అయినప్పటికీ, ప్రభుత్వం ఏవేనా చర్యలు తీసుకున్నదంటే అది ఒక్క నీటిపారుదల రంగంలోనే

ప్రపంచ మంతటా వ్యవసాయంలో అధునాతన పద్ధతులు విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టే సమయంలో భారతదేశంలో వ్యవసాయం సాంకేతిక శాస్త్ర పరంగా స్తబ్ద స్థితిలో ఉంది ఆధునిక యంత్రాలనేవి భారతదేశం ఎరగదు అతి సామాన్యమైన వ్యవసాయ పనిముట్లు సైతం శతాబ్దాల నాటి పాతవి ఉదాహరణకి, 1951లో దేశం మొత్తంలో 9 లక్షల 30 వేల ఇనుపనాగళ్ళు మాత్రమే వాడుకలో ఉన్నాయి కొయ్య నాగళ్ళు 3 కోట్ల 18 లక్షల దాకా ఉన్నాయి రసాయనిక ఎరువుల వాడకం బొత్తిగా తెలీదు పశువుల పెంట, ఎముకలు, మానవ మలం వగైరా సహజ ఎరువులో చాలాభాగం వినియోగపడకుండా వ్యర్థమయ్యేది 1922-23లో పంటపొలంలో నూటికి రెండెకరాల కన్నా తక్కువ భూమిలో మేలు వంగడాల వినియోగం జరిగింది 1938-39 నాటికి అది 11 శాతానికి పెరిగింది వ్యవసాయ శాస్త్ర విద్యని ప్రభుత్వం పట్టించుకోనే లేదు 1939లో మొత్తం ఆరు వ్యవసాయ కళాశాలలున్నాయి దేశం మొత్తం మీద 1306గురు విద్యార్థులు ఆ కళాశాల్లో అధ్యయనం చేశారు బెంగాల్, బీహార్, ఒరిస్సా, సింధూ రాష్ట్రాలు ఒక్క వ్యవసాయ కళాశాలకైనా నోచుకోలేదు ఇక రైతులు స్వయంగా అధ్యయనం చేసి అభివృద్ధి పనులు చేయగలిగే స్థితిలో లేరు గ్రామీణ ప్రాంతాలలో ప్రాథమిక విద్యా వ్యాప్తి మృగ్యం; అక్షరాస్యతే గగన కుసుమం

**అధునిక పారిశ్రామికాభివృద్ధి :** భారతదేశంలో యంత్రాధార భారీ పరిశ్రమల స్థాపన 19వ శతాబ్ది రెండవ పాదంలో ఒక ముఖ్యమైన పరిణామం. 1850 ప్రాంతంలో నూలు, బట్టలు, జనపనార మిల్లులు, గనుల నుండి బొగ్గు త్రవ్వి తీసే పరిశ్రమ ప్రారంభం కావటంతో భారతదేశంలో యంత్రయుగం ప్రవేశించింది కొవ్జి నానాభాయ్ 1853 లో బొంబాయిలో మొట్టమొదటి బట్టల మిల్లు నెలకొల్పాడు అట్లాగే మొట్టమొదటి జనపనార మిల్లు 1855లో రిష్రా (బెంగాల్‌లో) అనే చోట ప్రారంభమైంది. ఈ పరిశ్రమలు నిదానంగా విస్తరించినా కుంటుపడకుండా ముందుకు సాగాయి 1879లో మనదేశంలో 56 బట్టల మిల్లులు పనిచేశాయి 43 000 మంది కార్మికులకు ఉపాధి దొరికింది 1882లో 20 జనపనార మిల్లులు పనిచేశాయి వాటిలో ఎక్కువ భాగం బెంగాల్‌లో ఉన్నాయి ఆ మిల్లుల్లో షుమారు ఇరవై వేల మంది దాకా పనిచేశారు. 1901 నాటికిగాని మిల్లుల సంఖ్య 36కి పెరిగింది వాటితో పాటుకార్మికుల సంఖ్య లక్షా పదిహేను వేలకి పెరిగింది 1906లో బొగ్గు గనులు షుమారు లక్షమంది గని పనివాళ్ళకి ఉపాధి కల్పించింది ఇతర యంత్ర పరిశ్రమలు 19వ శతాబ్ది రెండవ పాదంలోను, 20వ శతాబ్ది తొలి పాదంలోను అభివృద్ధి అయ్యాయి ప్రత్తి నుంచి గింజల్ని వేరుచేసే యంత్రాలు, బియ్యం మిల్లులు, పిండి మరలు, కలప మిల్లులు, తోళ్ళని శుద్ధిచేసే కర్మాగారాలు, ఉన్నిమిల్లులు, కాగితం, పంచదార మిల్లులు, ఇనుము ఉక్కు కార్ఖానాలు, ఉప్పు, అభ్రంకారం, సూరేకారం వగైరా ఖనిజ పరిశ్రమలు అప్పుడు ప్రారంభమైనవే. సిమెంటు, కాగితం అగ్గిపుల్లలు, చక్కెర, గ్లాసు పరిశ్రమలు 1930 ప్రాంతంలో అభివృద్ధి చెందాయి కాని, ఈ పరిశ్రమలు సత్వరాభివృద్ధి సాధించకుండా గిటకబారాయి

ఈ అధునిక పరిశ్రమల్లో ఎక్కువ భాగం బ్రిటిషు పెట్టుబడికి పుట్టినవి; లేదా దాని పెత్తనం కింద ఉన్నవి అధిక లాభాలు ఆర్జించే అవకాశాలు కన్పించటంతో భారతదేశంలో పరిశ్రమల స్థాపనవైపు విదేశ పెట్టుబడి దారులు ఆకర్షితులయ్యారు.

కార్మిక శక్తి కారు చౌక. ముడిపదార్థాలు కొదువ లేకుండా చౌకగా అందుబాటవుతున్నాయి. తయారైన వస్తువులకు దేశంలో గిరాకి ఉంది. తేయాకు, జనపనార వస్తువులు, మాంగనీసు వగైరాలకు ప్రపంచమంతటా మార్కెట్‌వుంది. మరొక చెంప, వాళ్ళ దేశాల్లో లాభదాయకమయిన పెట్టుబడి అవకాశాలు తగ్గిపోతున్నాయి. అదే సమయంలో వలస ప్రభుత్వం, అధికార్లు అన్ని విధాలా సహాయం అందించటానికి, ఆదరించటానికి సుముఖంగా ఉన్నారు.

అనేక పరిశ్రమల్లో భారతీయుల పెట్టుబడిని విదేశ పెట్టుబడి సునాయసంగా ముంచెత్తి వేసింది. మొట్టమొదటి నుంచి ఒక్క బట్ట మిల్లులలోమాత్రం భారతీయులకు పెద్ద వాటా ఉంది. 1930 ప్రాంతంలో పంచదార పరిశ్రమని భారతీయులే అభివృద్ధిచేశారు. కాని భారతీయ పెట్టుబడిదార్లు అదినుంచీ కూడా బ్రిటిషు మేనేజింగ్ ఏజెన్సీలతో, బ్రిటిషు బ్యాంకులతో పోరు పడవలసి వచ్చింది. భారతీయులు ఏదైనా ఒక పరిశ్రమలో అడుగు పెట్టాలంటే, బ్రిటిషు మేనేజింగు ఏజెన్సీల ముందు మోకరిల్లక తప్పేది కాదు. ఆనాడు అవి పారిశ్రామిక రంగాన్ని శాసించాయి. చాలా సందర్భాల్లో భారతీయుల స్వంత కంపెనీల్ని, విదేశీయులు స్వంతంగా నడిపే లేదా పెత్తనం చేసే మేనేజింగు ఏజెన్సీలు శాసించాయి. బ్యాంకుల్లో అత్యధిక భాగం బ్రిటిషు పెట్టుబడి దారులవి కావటం చేత భారతీయులకు పరపతి పుట్టటం కష్టసాధ్యమై పోయింది. ఒకవేళ అప్పు పుట్టినా, దానిమీద అత్యధిక వడ్డీరేటు చెల్లించవలసి వచ్చేది. అదే బ్రిటిషు పారిశ్రామికుల కయితే స్వల్ప వడ్డీ రేటుమీద సునాయాసంగా రుణం ముట్టేది. అయితే, భారతీయులు కూడా క్రమేణా స్వంత బ్యాంకుల్ని, భీమా కంపెనీల్ని అభివృద్ధి చేసుకో సాగారు. 1914లో భారతదేశంలో మొత్తం బ్యాంకు డిపాజిట్లలో 70 శాతం విదేశ బ్యాంకుల అధీనంలో ఉండేవి. 1937 నాటికి వాటి వాటా 57 శాతానికి పడిపోయింది.

యంత్రాలు, యంత్ర పరికరాలు సరఫరా చేసే కంపెనీలతో, నౌకా సంస్థలతో, భీమా కంపెనీలతో, మార్కెటింగ్ ఏజన్సీలతో, ప్రభుత్వాధికారుల్తో, రాజకీయ నాయకుల్తో ఉన్న సన్నిహిత సంబంధాల్ని అవకాశంగా తీసుకొని భారతదేశంలో బ్రిటిషు పారిశ్రామిక వేత్తలు భారత ఆర్థిక జీవనంలో తమ ప్రాబల్యాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నించారు. పైగా ప్రభుత్వం భారతీయుల పెట్టుబడికి వ్యతిరేకంగా విదేశ పెట్టుబడిని ఆదరించే వైఖరిని బుద్ధి పూర్వకంగా చేపట్టింది.

రైల్వే విధానంలో సైతం ప్రభుత్వం భారత పరిశ్రమల పట్ల విపక్ష ప్రదర్శించింది. విదేశాల నుండి దిగుమతయిన సరుకు మీద రవాణా చార్జీలు అతితక్కువగా వసూలు చేసి దేశీ సరుకుల వ్యాపారాన్ని దెబ్బ తీసింది. విదేశీ వస్తువుల కన్నా భారతీయ వస్తువుల్ని రవాణా చెయ్యటం కష్టసాధ్యం, అతి ప్రియం అయ్యింది.

భారీ పరిశ్రమలు లేదా యంత్ర నిర్మాణం వగైరాలకు పనికి వచ్చే ముడి పదార్థాలు ఉత్పత్తి చేసే పరిశ్రమలు పూర్తిగా మృగ్యం కావటం భారతీయ పారిశ్రామికాభివృద్ధి కృషిలో తీవ్ర బలహీనత. అటువంటి భారీ పరిశ్రమలు లేకపోతే సత్వర, స్వతంత్ర పారిశ్రామిక ప్రగతి సాధ్యం కాదు. యంత్ర నిర్మాణానికవసరమైన ఇనుము, ఉక్కు ఉత్పత్తి చేసే భారీ కర్మాగారాలు భారతదేశంలో లేవు. కొద్ది రిపేరు వర్కుషాపులు ఇంజనీరింగు పరిశ్రమలుగా చలామణి అయ్యాయి. కొద్ది ఇనుము,

ఇత్తడి ఫౌండ్రీలే (లోహాన్ని కరగించి పోతపోసే కార్ఖానాలు) లోహ నిర్మాణ పరిశ్రమలకు ప్రాతినిధ్యం వహించాయి. భారతదేశంలో1913లో మొట్ట మొదటగా ఉక్కు తయారయింది. ఆ విధంగా భారతదేశంలో ఉక్కు, లోహ నిర్మాణం, యంత్రాలు, రసాయనాలు, ఖనిజ తైలం వంటి మౌలిక పరిశ్రమలు లేనేలేవు. విద్యుదుత్పాదనలో సైతం భారతదేశం వెనుకబడి ఉంది.

యంత్రాధార పరిశ్రమలే కాకుండా భారతదేశంలో 19వ శతాబ్దంలో నీలిమందు, తేయాకు, కాఫీవంటి తోటలు, పరిశ్రమలు వృద్ధి అయ్యాయి. అయితే ఇవన్నీ సంపూర్ణంగా యూరోపియన్ యజమానుల చేతుల్లో ఉన్నాయి. బట్టల తయారీలో నీలిమందుని రంగువేయటానికి ఉపయోగించారు. ఈ నీలిమందు తయారీ భారతదేశంలో 18వ శతాబ్దాంతంలో ప్రవేశపెట్టబడింది. బెంగాల్, బీహార్‌లు నీలిమందు ఉత్పత్తికి ప్రసిద్ధి పొందాయి. నీలిమందు తోటల యజమానులు రైతుల చేత నిర్బంధంగా ఈ పంట వేయించి, నానా హింసలు పెట్టి ఘోరమైన అపఖ్యాతి పొందారు. వాళ్ళు పెట్టిన దారుణ హింసల్ని కళ్ళకు కట్టేట్టు దీనబంధు మిత్రా అనే ప్రసిద్ధ బెంగాలీ రచయిత 1860 లో "నీల్‌దర్పణ్" అనే నాటకం రాశాడు. ఒక కృతమైన (సింథెటిక్) రంగు కనిపెట్టబడ్డాక, నీలిమందు పరిశ్రమ క్రమేణా క్షీణించి పోయింది. అస్సాం, బెంగాల్, దక్షిణ భారతదేశం, హిమాచల ప్రదేశ్ పర్వతాల వాలుల్లో 1850 తరువాత తేయాకు తోటలు అభివృద్ధి అయ్యాయి. తేయాకు పరిశ్రమల పెంపు మీరింది. ఈ తోటల యజమానులు విదేశీయులు కాబట్టి ప్రభుత్వం కిరాయి లేకుండా భూమి, ఇంకా తదితర అనేక సౌకర్యాలు కలుగ జేసింది. అనతికాలంలోనే టీ వాడకం దేశమంతటా అల్లుకు పోయింది. ఎగుమతి చేసే వస్తువుల్లో ముఖ్యమైన వస్తువుగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదే కాలంలో దక్షిణ భారతదేశంలో కాఫీ తోటల పెంపకం వృద్ధి పొందింది.

విదేశీయుల యాజమాన్యంలోని ఈ తోటలు, పరిశ్రమల వల్ల భారతీయులకు రవ్వంత ప్రయోజనం కలగలేదు. వాళ్ళ వేతనాలు, లాభాలు దేశం దాటి పోయాయి. సరుకు సరఫరా చెయ్యటం ద్వారా వచ్చిన మొత్తంలో ఎక్కువ భాగం విదేశీయుల పద్దు కింద వ్యయమై పోయింది. వాళ్ళకి అవసరమైన యంత్ర సామగ్రి యావత్తు విదేశాల్లో కొనుగోలు చేశారు. వాళ్ళ సాంకేతిక సిబ్బంది యావన్మంది విదేశాల నుండి దిగుమతయిన వాళ్ళు. ఉత్పత్తిలో హెచ్చుభాగం విదేశ మార్కెట్లలో అమ్ముడయింది. తద్వారా లభించిన విదేశ మారక ద్రవ్యం యావత్తు బ్రిటన్‌లో వినియోగ పడింది. ఈ తోటల వల్ల ఈ దేశస్థులకు కలిగిన లాభమల్లా నైపుణ్యం అవసరంలేని మామూలు కూలిపనివాళ్ళ సృష్టి ఒక్కటే. ఆ కూలీలకు ముట్టింది అతి తక్కువ కూలి. గంటలకి గంటలు అతి నిష్ఠుర పరిస్థితుల్లో వాళ్ళు పరిశ్రమించారు. దాదాపు దుర్భర బానిస పరిస్థితులు ఈ తోటల్లో తాండవమాడాయి.

మొత్తంమీద భారతదేశంలో పారిశ్రామిక ప్రగతి అతికష్టంమీద కుంటుతూ సాగింది. అదికూడా బట్టలు, జనపనార మిల్లులు, టీ తోటలకు మాత్రమే పరిమితమై పోయింది. 1930 ప్రాంతంలో చక్కెర, సిమెంటు మిల్లులు ప్రారంభమయ్యాయి. 1946 లెక్కల్ని బట్టి దేశంలో ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు మొత్తంలో నూటికి నలభై మంది బట్టలు, జనపనార మిల్లుల్లోనే పనిచేశారు. ఉత్పత్తి, ఉపాధికి సంబంధించి ఇతర దేశాల్లో

పోల్చి చూసినా, భారతదేశ ఆర్థిక అవసరాల దృష్ట్యాను మన ఆధునిక పారిశ్రామికాభివృద్ధి చాలా నాసి. దేశి వృత్తులు నాశనమై పోయి వ్యవసాయంలోకి ఎగబడ్డ అసంఖ్యాక కార్మికుల విషయంలో ఇదేమీ బదులు తీర్చలేదు. గ్రామసీమల్లో దారిద్ర్య సమస్యల మీద దీని ప్రభావం లేదు. 1951లో దేశ జనాభా 35 కోట్ల 70 లక్షలు కాగా, కేవలం 23 లక్షల మంది ఆధునిక పారిశ్రామిక రంగంలో పనిచేశారు. 1858 లగాయతు పట్టణ గ్రామీణ చేతి పరిశ్రమలు దిక్కులేకుండా కృశించి నశించి పోతూనే వున్నాయి. ఉత్పాదక రంగంలో, ప్రత్యేక ప్రక్రియలు నిర్వహించే ప్రాసెసింగ్ రంగంలో కార్మికుల సంఖ్య 1901లో కోటి 30 లక్షల దాకా ఉండగా, 1951 నాటికి అది 88 లక్షలకి పడిపోయిందని ప్రణాళికా సంఘం లెక్కలు కట్టింది. అదే సమయంలో జనాభా 40 శాతం పెరిగింది. కాని ప్రభుత్వం ఈ పాత దేశీయ పరిశ్రమలకు రక్షణ, పునరావాసం కల్పించటానికి గాని, వీటిని పునర్ వ్యవస్థీకరించటానికి గాని, ఆధునిక పంథాలో తీర్చిదిద్దటానికి గాని కనీస ప్రయత్నం చెయ్యలేదు.

పైపెచ్చు, ఆధునిక పరిశ్రమలు సైతం ప్రభుత్వ సహాయం లేకుండా, బ్రిటిష ప్రభుత్వ వైఖరికి ప్రతికూలంగా అభివృద్ధి కావలసి వచ్చింది. బ్రిటిషు ఉత్పత్తి దారులు భారతీయ వస్త్ర, తదితర పరిశ్రమల్ని పోటీగా పరిగణించారు. కాబట్టి ఆ పరిశ్రమలకు ఎటువంటి ప్రోత్సాహం యివ్వనీకుండా చెయ్యటమే కాకుండా, భారత పారిశ్రామిక వికాసాన్ని నిరుత్సాహ పర్చమని వాళ్ళు ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చారు. ఆ విధంగా బ్రిటిషు ప్రభుత్వం భారత పరిశ్రమల అభివృద్ధిని కృత్రిమంగా మందగింప జేశారు; నిర్బంధాలు విధించారు.

ఇంకా శైశవ దశలో ఉన్న భారత పరిశ్రమలకు రక్షణ అవసరం. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికాలు అప్పటికే శక్తివంతమైన పరిశ్రమలు నెలకొల్పుకొని వున్న దశలో భారత పరిశ్రమలు అకుదొడిగాయి. కాబట్టి, ఆ దేశాల పరిశ్రమలతో మన పరిశ్రమలు పోటీ చెయ్యలేని స్థితిలో ఉన్నాయి. వాస్తవానికి, బ్రిటన్‌తో సహా అన్ని ఇతర దేశాలు తమ పరిశ్రమలు శైశవదశలో ఉన్న కాలంలో ఆయా దేశాల్లోకి దిగుమతయ్యే ఉత్పత్తులమీద భారీ వాణిజ్య సుంకాలు విధించడం ద్వారా వాటిని కాపాడుకున్నాయి. కాని భారతదేశం స్వతంత్ర దేశం కాదు; దానికి సంబంధించిన విధానాలు బ్రిటన్‌లో రూపొందుతాయి. బ్రిటిషు ప్రయోజనాల కనుగుణంగా రూపొందుతాయి. ఆ కారణంగానే, బ్రిటిషు ఇండియా ప్రభుత్వం భారతదేశంలో కొత్తగా నెలకొన్న పరిశ్రమలకు ఆర్థిక, తదితర సహాయం చెయ్యటానికి నిరాకరించింది. దేశం సాంకేతిక విద్యలో చాలా వెనుకబడి ఉన్నప్పటికీ, ప్రభుత్వం సాంకేతిక విద్యా వ్యాప్తికి కనీసం ఏర్పాట్లు కూడా చెయ్యలేదు. భారతదేశం పారిశ్రామికంగా వెనుకబడి వుండటానికి అది కూడా దోహదం చేసింది. 1939లో దేశంలో ఉన్న మొత్తం ఇంజనీరింగు కళాశాలలు ఏడు. విద్యార్థుల సంఖ్య 2,217. ప్రభుత్వం ఎటువంటి సహాయం అందజెయ్యటానికి నిరాకరించిన కారణంగా నౌకలు, రైలింజనులు, కార్లు, విమానాలు నిర్మించే అనేక ప్రాజెక్టులకు పురిట్లోనే సంధికొట్టింది.

చివరికి 1920, 1930 ప్రాంతాల ఉప్పొంగే జాతీయోద్యమం ఒత్తిడికి, భారతీయ పెట్టుబడి దారీ వర్గాల ఒత్తిడికి బ్రిటిషు ఇండియా ప్రభుత్వం దిగివచ్చి, భారతీయ పరిశ్రమలకు కొంతవరకు ఎగుమతి దిగుమతి సుంకాలనుంచి రక్షణ కలుగ జేసింది.

ఇక్కడ మళ్ళీ భారతీయులు స్వంతదార్లుగావున్న పరిశ్రమల పట్ల వివక్ష చూపింది. భారతీయులు స్థాపించిన సిమెంటు, ఇనుము-ఉక్కు, గ్లాసు పరిశ్రమలకు రక్షణ ఇవ్వటానికి ప్రభుత్వం నిరాకరించింది. దేనికైనా రక్షణ ఇచ్చినా అది చాలీ చాలనిది. మరొక వెంప, విదేశీయులు నడిపే అగ్గిపుల్లలు తయారీ వంటి పరిశ్రమలకు వాళ్లడిగిన మేరకు రక్షణ ఇచ్చింది పైగా, బ్రిటన్ నుండి దిగుమతయ్యే వాటికి ప్రత్యేక సౌకర్యాలు, రాయితీలు సమకూర్చింది. భారతీయులు ఈ వైఖరిని తీవ్రంగా ప్రతిఘటించినా ప్రభుత్వం ఖాతరు చెయ్యలేదు.

భారత పారిశ్రామికాభివృద్ధిలో సమతూకం లేకపోవటం మరొక లక్షణం. విపరీతంగా ప్రాంతీయమైన మొగ్గు కనిపించింది. దేశంలో కొద్ది ప్రాంతాలలోను పట్టణాల్లోను మాత్రమే పరిశ్రమలు కేంద్రీకృతమయ్యాయి. దేశంలో పలు విశాల ప్రాంతాలు అభివృద్ధి లేకుండా పూర్తిగా వెనుకబడి పోయాయి ప్రాంతీయ ఆర్థికాభివృద్ధిలో ఈ అసమానత ఆదాయంలో తీవ్ర ప్రాంతీయ అసమానతలకు దారి తీయడమే కాకుండా, జాతీయ సమైక్యతా స్థాయిని చెదర గొట్టింది ఒక సమైక్య భారత జాతి నిర్మాణ కర్తవ్యాన్ని ఇది కష్టతరం చేసింది

దేశంలో ఈ పరిమిత పారిశ్రామికాభివృద్ధి మూలంగా భారత సమాజంలో రెండు నూతన వర్గాలు ఆవిర్భవించటం ఒక ముఖ్యమైన సామాజిక పరిణామం ఈ రెండు వర్గాలలో ఒకటి పారిశ్రామిక పెట్టుబడి దారీ వర్గం; రెండవది ఆధునిక కార్మిక వర్గం. ఈ రెండు వర్గాలు భారత చరిత్రలో పూర్తిగా కొత్తవి. ఎంచేతనంటే కొత్త గనులు, పరిశ్రమలు, రవాణా సాధనాలు అన్నీ కొత్త భారతదేశ జనాభాలో ఈ వర్గాలు అతి స్వల్ప భాగమే అయినా, వీళ్ళు ఒక నూతన సాంకేతిక సంవిధానానికి, ఒక నూతన ఆర్థిక నిర్మాణ పంథాకి, నూతన సామాజిక సంబంధాలకు, నూతన భావాలకు, నూతన దృక్పథానికి ప్రాతినిధ్యం వహించారు. పాత సాంప్రదాయాలు, ఆచారాలు, జీవన సరళి బరువుకింద ఈ వర్గాలు కృంగిపోలేదు. వీళ్లందరికి ఒక అఖిల భారత దృక్పథం అనేది ఉంది. పైగా, ఉభయులకూ దేశ పారిశ్రామికాభివృద్ధిలో ప్రధానంగా ఆసక్తి ఉంది. కాబట్టి, వాళ్ల, ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యం, పాత్ర వాళ్ల సంఖ్యా బలంకంటే అత్యధికంగా అధిగమించి పోయాయి.

**దారిద్ర్యం, కరువు కాటకాలు :** దేశానికి తీవ్ర దారిద్రం దాపురించటం భారతదేశంలో బ్రిటిషు పరిపాలన ముఖ్య విలక్షణం; బ్రిటిషు ఆర్థిక విధానాల వికర ఫలితమూను. బ్రిటిషు పాలనలో భారతదేశం నానాటికి పేదదై పోతుందా లేదా అనే సమస్య మీద చరిత్ర కారుల్లో ఏకిభావం లేకపోవచ్చు గానీ బ్రిటిషు పరిపాలన సాగినంత కాలం భారత ప్రజల్లో అత్యధిక సంఖ్యాకులు అర్థాకలితో జీవించారనే వాస్తవానికి సంబంధించి చరిత్రకారులు యావన్మంది ఏకీభవించారు. కాలం గడిచిన కొద్దీ, ప్రజలకు బ్రతుకు తెరువు దొరకటం దుర్లభమై పోయింది. బ్రిటిషు ఆర్థిక దోపిడీ, దేశి పరిశ్రమల పతనం, వాటిస్థానే ఆధునిక పరిశ్రమలు ప్రవేశించవి వైఫల్యం, తలకు మించిన పన్నుల బరువు, భారత సంపద బ్రిటన్‌కు వయనం, వ్యవసాయ స్తబ్దతకు దారితీసిన వెనుకబడిన వ్యవసాయక వ్యవస్థ, రైతాంగాన్ని దోచివేసే జమిందార్లు, భూకామందులు, ప్రభువులు, వడ్డీ వ్యాపారస్తులు, వర్తకులు, ప్రభుత్వం - భారత ప్రజానీకాన్ని నికృష్ట దారిద్ర్య కూపంలోకి నెట్టివేసిన శక్తులు; భారత ప్రజని

పురోగమించనీకుండా నిరోధించిన కారణాలు భారత దేశ వలస ఆర్థిక వ్యవస్థ అధమస్థాయిలో మురిగి పోయింది

19వ శతాబ్ది రెండవ పాదంలో భారతదేశంలోని అన్ని ప్రాంతాలలో పుంఖాను పుంఖంగా విజృంభించిన కరువు కాటకాలలో ప్రజల దారిద్ర్యం పరాకాష్ఠ చెందింది ఈ కరువు కాటకాలు మొట్టమొదట 1860-61 లో ఉత్తరప్రదేశ్ పశ్చిమ ప్రాంతంలో చెలరేగి రెండు లక్షల నిండు ప్రాణాల్ని బలిగొన్నాయి 1865-66 లో ఒరిస్సా, బీహార్, మద్రాస్ రాష్ట్రాల్లో కరువు రక్కసి కరాళనృత్యంచేసింది రమారమి 20 లక్షల మంది రాలిపోయారు. ఒక్క ఒరిస్సాలోనే పది లక్షలమంది మరణించారు. 1868-70 సంవత్సరాల మధ్య ఉత్తర ప్రదేశ్, బొంబాయి, పంజాబు రాష్ట్రాలలో సంభవించిన దారుణ క్షామంలో 14 లక్షల మందికి పైగా ప్రాణాలు విడిచారు రాజపుటానాలో అనేక సంస్థానాల్లో నూటికి 30 మందికి పైగా కరువురక్కసి కోరల్లో అహుతయ్యారు.

1876-78లో మద్రాసు, మైసూరు, హైదరాబాద్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్ పశ్చిమ ప్రాంతం, పంజాబ్‌లలో సంభవించిన కరువు భారతదేశంలో అప్పటివరకు సంభవించిన కరువుల్లో అత్యంత భయంకరమైంది మహారాష్ట్రలో 8 లక్షలమంది, మద్రాసు రాష్ట్రంలో 35 లక్షలమంది, మైసూరు జనాభాలో ఐదవ వంతు, ఉత్తరప్రదేశ్‌లో 12 లక్షలమంది మరణించారు 1896-97 లో ఒక తూరి, తిరిగి 1899-1900 లో మరొక తూరి దుర్భిక్ష పరిస్థితులు తీవరించి దేశవ్యాప్తంగా కరువు సంభవించింది. 1896-97 కరువలో తొమ్మిది కోట్ల 50 లక్షల ప్రజలు అల్లాడిపోయారు. 45 లక్షలమంది దారుణంగా మరణించారు వెంటనే మళ్లీ 1899 లో కరువు కాలు మోపింది అది పుండు మీద రోకటి పోటు లక్షలాది జనం క్షోభించారు కరువు నివారణ చర్యల ద్వారా ప్రజల ప్రాణాలు కాపాడ్డానికి ప్రభుత్వం పూనుకున్నా షుమారు 25 లక్షల మంది రాలిపోయారు ఈ పెద్ద కరువులొక్కటే కాకుండా అనేక ప్రాంతాల్లో స్థానికంగా కరువు కాటకాలు, అహార కొరత వగైరాలు ఏర్పడి వేలాది ప్రజలు కఠోర బాధలను అనుభవించారు. 1854-1901 సంవత్సరాల మధ్య సంభవించిన కరువు కాటకాల్లో మొత్తం 2 కోట్ల 88 లక్షల, 25 వేల మంది ప్రజలు మరణించినట్లు విలియందిగ్బీ అనే బ్రిటిష్ రచయిత లెక్కగట్టారు. 1943లో సంభవించిన బెంగాల్ కరువులో 30 లక్షలమంది మరణించారు భారతదేశంలో దారిద్ర్యం, ఆకలి ఏ మేరకి వేళ్ళూనాయో ఈ క్షామాలు, ఈ ప్రాణ నష్టాలు సూచిస్తాయి

19వ శతాబ్దంలో భారతదేశంలో తాండవించే భయంకర దారిద్ర్య స్వరూపాన్ని ఇక్కడ పనిచేసే ఇంగ్లీషు అధికార్లలో చాలామంది గుర్తించారు. ఉదాహరణకు, గవర్నరు-జనరల్ సలహామండలి సభ్యుడైన చార్లెస్ ఇలియట్ ఇలా వ్యాఖ్యానించారు:

"వ్యవసాయం మీద జీవించే ప్రజల్లో సగంమంది ఏడాది మొత్తంలో కడుపునిండా భోజనం అంటే ఏమిటో ఎరగరని చెప్పడానికి నేను వెనుకాడను."

ఇంపీరియల్ గజెట్ సంకలనకర్త విలియం హంటర్ - "భారతదేశ జనాభాలో నాలుగు కోట్ల మందికి అర్ధాకలితో బ్రతుకు వెళ్ళబుచ్చటం అలవాట"ని ఒప్పుకున్నారు. ఈ పరిస్థితి 20వ శతాబ్దంలో ఇంకా అధ్వాన్నంగా దిగజారిపోయింది 1911 నుంచి 1941 వరకు జరిగిన 30 ఏళ్ళ కాలంలో భారత దేశంలోని మనిషికి లభించే అహారం 29 శాతం తగ్గిపోయింది.

భారతదేశ ఆర్థిక దైన్య స్థితిని, పేదతనాన్ని తెలిపే గుర్తులు ఇంకా చాలా ఉన్నాయి. 1925-1934 సంవత్సరాల మధ్య కాలంలో ప్రపంచలో కెల్లా అతి తక్కువ తలసరి ఆదాయం కల దేశాలు చైనా, ఇండియాలని జాతీయాదాయ శాస్త్రీయ పరిశీలనలో తలనెరిసిన కోలిన్ క్లార్క్ అనే సుప్రసిద్ధుడు తేల్చారు. ఇంగ్లీషువాని ఆదాయం భారతీయుని ఆదాయం కన్నా అయిదు రెట్లు ఎక్కువ. అట్లాగే, 1930 ప్రాంతంలో భారతీయుని సగటు ఆయు ప్రమాణం 32 ఏళ్ళు! ఆధునిక వైద్య శాస్త్రాలు, పారిశుద్ధ్యం అద్భుత ప్రగతి సాధించి కూడా ఇక్కడ మనిషి సగటు ఆయుర్దాయం అంతే. చాలా పశ్చిమ యూరప్ దేశాల్లోను, ఉత్తర అమెరికా రాష్ట్రాల్లోనూ మనిషి సగటు ఆయుర్దాయం 60 ఏళ్ళు.

భారతదేశ దారిద్ర్యం, వెనుకబాటుతనం ప్రకృతి వనరుల లోపం వల్ల ఏర్పడినవి కావు. అవి మానవ కల్పితాలు. భారతదేశంలో ప్రకృతి వనరులు అపారం. సద్వినియోగ పర్చుకుంటే ప్రజలకు అత్యున్నత సుఖ సంపదలు సమకూర్చి పెట్టేటంత శక్తివంతమైనవి. కాని, విదేశ పరిపాలన ఫలితంగా, దోపిడీ ఫలితంగా, వెనుకబడ్డ వ్యావసాయిక, పారిశ్రామిక ఆర్థిక నిర్మాణం ఫలితంగా భారతదేశం పేద ప్రజలు జీవించే సంపన్న దేశమయింది. ఇది విడ్డూరమైన వాస్తవం.

# నవభారత వికాసం–జాతీయోద్యమ సంరంభం:1858–1905

10వ శతాబ్దం రెండవ పాదంలో భారతదేశంలో జాతీయ రాజకీయ చైతన్యం వేయి రేకులతో వికసించింది. సుసంఘటితమైన జాతీయోద్యమం రెక్క విప్పింది. 1885 డిసెంబరులో భారత జాతీయ కాంగ్రెస్ సంస్థ ఆవిర్భవించింది. విదేశ పాలనకు స్వస్తి పలికి స్వాతంత్ర్య సముపార్జనకై భారత ప్రజలు కాంగ్రెస్ నాయకత్వాన ఒక సుదీర్ఘ, ధైర్యోపేత పోరాటం సాగించారు. ఆ పోరాట ఫలితంగా భారతదేశానికి 1045 ఆగష్టు 15వ స్వాతంత్ర్యం సిద్ధించింది.

**విదేశాధిపత్యం వల్ల సంభవించిన పరిణామం :** విదేశాధిపత్యం తాలూకు సవాలుని ఎదుర్కొనడానికి ఆధునిక భారత జాతీయవాదం ప్రాథమికంగా తలెత్తింది. బ్రిటిషు పాలన సృష్టించిన పరిస్థితులే భారత ప్రజల్లో జాతీయవాదం వ్యాప్తికి దారి తీశాయి. బ్రిటిషు పాలన, దాని ప్రత్యక్ష, పరోక్ష ఫలితాలు భారతదేశంలో జాతీయోద్యమ స్ఫూర్తికి భౌతిక, నైతిక, బౌద్ధిక పరిస్థితులు కల్పించాయి.

భారతదేశంలో బ్రిటిషు పాలకుల ప్రయోజనాలతో భారత ప్రజల ప్రయోజనాలు సంఘర్షణకు తలపడ్డమే దీనికంతటికి అసలు కారణం. బ్రిటిషువాళ్ళు తమ ప్రయోజనాల కోసం ఈ దేశాన్ని జయించారు. ప్రధానంగా ఆ లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ దేశాన్ని పాలించారు. భారత ప్రజల శ్రేయస్సుని బ్రిటిషు ప్రయోజనాల కోసం బలిపెట్టారు. లాంకషైర్ పారిశ్రామికుల లాభాల కోసం, బ్రిటన్‌లో ప్రాబల్యం వహించిన తదితర శక్తుల ప్రయోజనాల కోసం తమ సంక్షేమాన్ని బలిపెడుతున్నారనే వాస్తవాన్ని భారతీయులు క్రమేణా గ్రహించారు. విదేశ పాలన దుష్పరిణామాలను గుర్తించటం ప్రారంభించారు. భారత ప్రభుత్వ విధానాలను విదేశ శక్తులకు బదులు భారతీయులే గనుక నడిపి వుంటే ఈ చెరుగు జరగకుండా ఉండేదని అనేక మంది ఆలోచనాపరులైన భారతీయులకు తట్టింది.

భారతదేశపు ఆర్థిక హీన స్థితికి బ్రిటిషు పాలన ప్రధాన కారణం అనే వాస్తవం భారత జాతీయోద్యమానికి పునాది. ఈ దేశాన్ని ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, వివేకవంతంగా, రాజకీయంగా పురోభివృద్ధి కానివ్వకుండా బ్రిటిషు పాలన అడ్డుగోడగా నిలిచింది. ఈ వాస్తవాన్ని భారత ప్రజల్లో చాలామంది ఇతోధికంగా అవగాహన చేసుకున్నారు.

భారత సమాజంలో ప్రతి వర్గం, ప్రతి తరగతి తమ ప్రయోజనాలు విదేశ పాలకుల చేతుల్లో చితికి పోతున్నాయని క్రమంగా గుర్తించింది. ప్రభుత్వం భూమిశిస్తు రూపేణా తను పండించిన పంటలో అధికభాగం గుంజుకుంటుందని రైతుకు అర్థమయింది. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగానికి మూల స్తంభాలైన పోలీసులు,

కోర్టులు, అధికార్లు, రైతాంగాన్ని పీడించుకుని తినే వాళ్ళ కొమ్ము కాస్తున్నారని రైతు గుర్తించారు. తమ నుంచి బలాత్కారంగా అధిక కౌలు కాజేసి తమని పీల్చి పిప్పిచేసే జమీందార్లని, భూకామందుల్ని, తమని వెయ్యి విధాల దగా చేస్తూ, దోచుకుంటూ తమ గర్దని అప్పుకింద కట్టుకునే వడ్డీ వ్యాపారస్థుల్ని, వర్తకుల్ని, ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం అభిమానించి అదుకొంటున్నాయని రైతు గ్రహించారు. భూస్వాముల, వడ్డీ వ్యాపారస్థుల పీడనకి వ్యతిరేకంగా పోరాటానికి నడుం కట్టినప్పుడల్లా పోలీసులు, సైన్యం శాంతి భద్రతల పేరుతో రైతుని అణచి పారేశారు.

చేతివృత్తి కార్మికులు ఈ ప్రభుత్వం తమని నాశనం చెయ్యటానికి విదేశ పోటీకి మద్దతు ఇచ్చిందని అర్థం చేసుకున్నారు. తమకు పునరావాసం కల్పించటానికి ఏమీ చెయ్యలేదని గ్రహించారు.

తరువాత 20వ శతాబ్దంలో ఫ్యాక్టరీల్లో, గనుల్లో, తోటల్లో పనిచేసే కార్మికులు ఈ ప్రభుత్వ పెట్టుబడి దారీ అనుకూల స్వభావాన్ని గుర్తించారు. ముఖ్యంగా విదేశ పెట్టుబడి దారుల్తో చేతులు కలిపిన వైనం అర్థం చేసుకున్నారు. తాము ఎప్పుడు కార్మిక సంఘాలు పెట్టుకోటానికి ప్రయత్నించినా, తమ పరిస్థితి మెరుగు పర్చుకోటానికి సమ్మెలు, ప్రదర్శనలు, తదితర పోరాట రూపాలకు తెగించినా ప్రభుత్వ యంత్రాంగం తమకు వ్యతిరేకంగా తమపైన విరుచుకు పడుతున్నదని కార్మికులు గమనించారు. పెరిగిపోయే నిరుద్యోగాన్ని అరికట్టాలంటే సత్వర పారిశ్రామికీకరణ జరగాలనీ, అది స్వతంత్ర ప్రభుత్వ పాలనలో గాని సాధ్యం కాదనీ కార్మిక వర్గానికి కనువిప్పు కలిగింది.

జనాభాలో ఎక్కువ భాగానికి ప్రాతినిధ్యం వహించే భారత సమాజంలోని ఈ మూడు వర్గాలు- రైతులు, వృత్తికారులు, కార్మికులు- తమ కెటువంటి రాజకీయ హక్కులు, అధికారాలు లేవని గ్రహించారు. తమ మేధో, సాంస్కృతిక వికాసానికి బొత్తిగా కృషి జరగటం లేదని గుర్తించారు. విద్య ఇంకా కింది తరగతులు దాకా రాలేదు. గ్రామాల్లో పాఠశాలలు లేవు. ఎక్కడైనా ఒకటీ అరా మినుకు మినుకు మంటున్నా అవి పాఠశాలల్లాగా లేవు. ఆచరణలో ఉన్నత విద్యాద్వారాలు ఈ తరగతుల ప్రజలకి మూసుకున్నాయి. వీళ్లలో ఎక్కువ మంది తక్కువ కులాలకు చెందిన వాళ్ళు కావటం చేత, అగ్ర కులాల సాంఘిక, ఆర్థిక దోపిడీ ఇంకా భరించి తీరాలి.

సమాజంలో తదితర తరగతుల్లో కూడా అసంతృప్తి తక్కువగా ఏమీలేదు. ఆధునిక విజ్ఞానాన్ని ఆకళించుకున్న విద్యావంతులు మాతృదేశం యొక్క ఆర్థిక, రాజకీయ విపాద పరిస్థితిని అర్థం చేసుకున్నారు. 1857 లో మాదిరిగా విదేశ పాలనని సమర్థించిన విద్యావంతులు, విదేశ ప్రభుత్వమైనప్పటికీ అదే ఈ దేశాన్ని ఆధునికంగా తీర్చి దిద్దుతుందని, పారిశ్రామిక వంతం చేస్తుందనీ ఆశతో బ్రిటిషు ప్రభుత్వాన్ని బల పర్చిన వాళ్ళు క్రమంగా నీరసపడి పోయారు; నిరాశ చెందారు. బ్రిటిషు పెట్టుబడిదారీ విధానం స్వదేశంలో మాదిరి భారత దేశంలో కూడా ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి దోహదపడుతుందని విద్యావంతులు ఆశించారు. కాని దానికి బదులు బ్రిటిషు పెట్టుబడి దారుల చెప్పుచేతుల్లో నడిచే బ్రిటిషు ఇండియా ప్రభుత్వ విధానాలు భారత దేశంలో ఉత్పత్తి శక్తుల్ని పెరగనివ్వకుండా దేశాన్ని ఆర్థికంగా బరుగు స్థితిలో అణచి వుంచుతున్నాయని వాళ్లు అర్థం చేసుకున్నారు. బ్రిటిషు వాళ్ళ ఆర్థిక దోపిడీ

భారతదేశంలో దారిద్ర్యాన్ని పెంచుతోంది. మాతృదేశంలో బ్రిటిషు పరిపాలన దుష్పరిణామాల్ని విద్యావంతులు సంపూర్ణంగా అవగాహన చేసుకున్నారు. భారత ఆర్థిక వ్యవస్థ మీద సామ్రాజ్యవాదుల అదుపాజ్ఞలు సాగినంత కాలం దాన్ని అభివృద్ధి చెయ్యటం అసంభవం; ముఖ్యంగా పారిశ్రామికీకరణ పూర్తిగా అసాధ్యం అని వాళ్ళు గ్రహించారు.

రాజకీయంగా - బ్రిటిషు వాళ్ళు భారతదేశాన్ని స్వపరిపాలన దిశలో నడిపిస్తున్నట్లుగా లోగడ ఆడిన నాటకాన్ని ఇప్పుడు కట్టి పెట్టినట్లు అర్థమైంది. తాము భారత దేశాన్ని వదలి వెళ్ళేది లేదని బ్రిటిషు అధికార్లు, రాజకీయ నాయకులు బహిరంగంగా బల్లగుద్ది చెప్పారు. ప్రాథమిక హక్కులైన వాక్, పత్రికా, వ్యక్తి స్వాతంత్ర్యాలను ప్రోత్సహించటానికి బదులు వాటిమీద నిర్బంధాలు ఎక్కువ చేశారు. ప్రజాస్వామ్యానికి, స్వపరి పాలనకు భారతీయులు అనర్హులని బ్రిటిషు అధికార్లు, రచయితలు ఉద్ఘాటించారు. సాంస్కృతిక రంగంలో ఉన్నత విద్య, నూతన భావాల వ్యాప్తి పట్ల పాలకులు కేవలం వ్యతిరేక ధోరణినే కాకుండా శత్రుత్వ వైఖరిని సైతం చేపట్టారు.

భారతదేశంలో విద్యావంతులు పెరిగి పోయే నిరుద్యోగపు కోరల్లో నలిగి పోయారు చదువు కున్నవాళ్ళు కొద్దిమందే అయినా, ఆ కొద్ది మందికైనా ఉద్యోగాలు దొరకడం కష్టమై పోయింది. అధవా ఎన్నో కొన్ని దొరికినా, మంచి మంచి ఉద్యోగాలన్నీ బ్రిటిషు ఉన్నత, మధ్య తరగతుల వాళ్ళకి ప్రత్యేకించబడ్డాయి. ఆ వర్గాలు భారతదేశాన్ని తమ బిడ్డలకు ప్రత్యేకావకాశాల సీమగా భావించాయి. కాబట్టి దేశం ఆర్థికంగా, సాంస్కృతికంగా అభివృద్ధి అయితేనే తప్ప, విదేశపాలన నుంచి విముక్తి పొందితేనే తప్ప తమకు మేలైన ఉద్యోగావకాశాలు ఒనగూడవని విద్యావంతులు గుర్తించారు.

పెరుగుతున్న భారత పెట్టుబడి దారీ వర్గంలో జాతీయ రాజకీయ చైతన్యం చాలా నెమ్మదిగా కలిగింది. సామ్రాజ్య వాదుల చేతుల్లో తాము దెబ్బ తింటున్నామని వాళ్ళు క్రమేణా గుర్తించారు. ప్రభుత్వం అనుసరించే వాణిజ్య విధానం, టారిఫ్, పన్నులు, రవాణా విధానాలు ఈ వర్గం ప్రగతిని దారుణంగా అడ్డుకున్నాయి. ఇది కొత్తగా పుట్టిన వర్గం. ఇంకా బలహీనంగా ఉన్నవర్గం. కాబట్టి, ఈ వర్గం తన అనేక బలహీనతల్ని అధిగ మించడానికి ప్రభుత్వ క్రియా శీల సహకారం, మద్దతు అవసరం. కాని ప్రభుత్వం ఎటువంటి సహాయం చెయ్యలేదు. చెయ్యకపోగా ప్రభుత్వం, ఉన్నతాధికార్లు భారత దేశానికి అపారమైన వనరులతో వచ్చిన విదేశ పెట్టుబడి దార్లని ఆదరించారు. వాళ్ళు ఇక్కడ చాలా పరిమితంగా వున్న పారిశ్రామిక రంగాన్ని గుప్పెట్లో పెట్టుకున్నారు. విదేశ పెట్టుబడి దార్ల బలమైన పోటీని భారత పెట్టుబడి దార్లు నిరసించారు. వాళ్లలో చాలామంది 1940 ప్రాంతంలో "బ్రిటిషు పెట్టుబడులు సమస్తం స్వదేశానికి తరలిపోవాల"ని డిమాండ్ చేశారు. భారత వర్తక మండలి అధ్యక్షుడు M.A. మాష్టరు 1945లో ఇలా హెచ్చరిక చేశారు. "భారత దేశం పారిశ్రామికంగా అభివృద్ధి కాకపోయినా సరే; కొత్త తూర్పిండియా కంపెనీలు మళ్లీ ఈ గడ్డమీద వేళ్ళూనటానికి అనుమతించకూడదు. ఇవి భారతదేశ ఆర్థిక స్వాతంత్ర్యానికి ప్రతికూలంగా పని చెయ్యడమే కాకుండా! రాజకీయ స్వాతంత్ర్యం రాకుండా గట్టిగా అడ్డుకుంటాయి."

కాబట్టి భారత పెట్టుబడి దార్లు కూడా సామ్రాజ్యవాదానికి - తాము స్వతంత్రంగా అభివృద్ధి కావటానికి మధ్య వైరుధ్యం ఉన్నదనే వాస్తవాన్ని గ్రహించారు. భారత వ్యాపార, పరిశ్రమలు శీఘ్రంగా అభివృద్ధి కావాలంటే అందుకు అవసరమైన అనుకూల పరిస్థితుల్ని జాతీయ ప్రభుత్వం మాత్రమే సృష్టించగలదని వాళ్ళు గుర్తించారు.

ఇకపోతే - జమీందార్లు, భూస్వాములు, సంస్థానాధీశులు ఉన్నారు. భారత సమాజంలో విదేశ పాలకుల ప్రయోజనాలతో తమ ప్రయోజనాలు మమేకమై పోయిన వర్గం వీళ్ళు మాత్రమే. కాబట్టి ఈ వర్గం బ్రిటిషు పాలనని తుదకంటా సమర్థించింది; వాళ్ల కొమ్ము కాసింది. అయితే వీళ్లలో కూడా కొందరు జాతీయోద్యమంలో చేరారు. ఆనాడు అల్లుకుపోయిన జాతీయతా భావోద్దీప్తిలో, ఆ వాతావరణంలో దేశ భక్తిభావన అనేకుల్ని ఆకట్టుకుంది. ఆలోచనాపరుడు, ఆత్మాభిమాని అయిన ప్రతి భారతీయుడు అతడే వర్గానికి చెందినా బ్రిటిషు జాత్యదురహంకార, వివక్ష విధానాలకు వ్యతిరేకంగా నిలబడ్డాడు. అన్నిటికన్నా ముఖ్యంగా ఆ బ్రిటిషు పరిపాలన యొక్క విదేశ స్వభావం జాతీయతా భావాన్ని రేకెత్తించింది. విదేశ పాలకుల ఆధిపత్యం తప్పనిసరిగా పాలిత ప్రజల హృదయాల్లో దేశభక్తి భావాల్ని ఉత్తేజపర్చింది

సారాంశమేమిటంటే -- విదేశ సామ్రాజ్య వాదం, భారత ప్రజా జీవనంమీద దాని దుష్పరిణామాల సహజ సిద్ధమైన స్వభావం ఫలితంగా భారత దేశంలో ఒక శక్తివంతమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం క్రమంగా మొగ్గదొడిగి వికసించింది. ఈ ఉద్యమం జాతీయ ఉద్యమం దీన్ని జాతీయ ఉద్యమం అని ఎందుకు అంటున్నామంటే ఇది సమాజంలోని విభిన్న వర్గాల, తరగతుల ప్రజల్ని సమైక్యపర్చింది; ఒక ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా తమ పరస్పర విభేదాల్ని విస్మరించి వివిధ వర్గాల, తరగతుల ప్రజలు ఒక్కటయ్యారు.

***దేశ ఆర్థిక, పాలనా ఏకీకరణ:*** 19,20వ శతాబ్దాలలో భారత దేశం సమైక్యమై ఒక జాతిగా రూపొందింది. కాబట్టి జాతీయ భావావేగం ప్రజల్లో సులువుగా అల్లుకుపోయింది. బ్రిటిషు వాళ్ళు దేశమంతటా ఒకే మాదిరి ఆధునిక పరిపాలనా వ్యవస్థని ప్రవేశ పెట్టి పాలనాపరంగా దేశం మొత్తాన్ని ఒక్కటిగా చేశారు. గ్రామీణ స్థానిక స్వయంసంపూర్ణ ఆర్థిక వ్యవస్థ విచ్ఛిన్నమైపోయి అఖిల భారత స్థాయిలో ఆధునిక వ్యాపార పరిశ్రమలు ప్రారంభం కావటం వల్ల భారత ఆర్థిక జీవనం ఏకరాశి అయింది. వివిధ ప్రాంతాల్లో జీవించే ప్రజల ఆర్థిక గతిలో ఒక అవినాభావ సంబంధం నెలకొన్నది. ఉదాహరణకు దేశంలో ఒక ప్రాంతంలో కరువు, ఆహారకొరత ఏర్పడితే, దాని ప్రభావం దేశంలో అన్ని ప్రాంతాలకు సోకింది 19వ శతాబ్దానికి ముందు పరిస్థితి అలాలేదు. బొంబాయిలో ఒక ఫ్యాక్టరీలో తయారైన వస్తువులు ఎక్కడో దూరంగా వున్న లాహోర్, పెషావర్లలో అమ్ముడవుతాయి. మద్రాసు, బొంబాయి, కలకత్తాల్లో ఉండే కార్మికుల, పెట్టుబడి దార్ల జీవితాలు భారత గ్రామసీమల్లో జీవించే కోట్లాది రైతుల బ్రతుకుల్తో సన్నిహితంగా ముడిపడ్డాయి. ఇవన్నీ కాక రైలు మార్గాలు, తంతి, ఏకీకృతమైన తపాల వ్యవస్థ దేశంలోని వివిధ ప్రాంతాల్నికలిపాయి. ప్రజల మధ్య పరస్పర సంబంధాల్ని వృద్ధిచేశాయి. ముఖ్యంగా వివిధ ప్రాంతాల నాయకుల మధ్య సంబంధాలు పెంపొందించాయి.

ఇక్కడ మళ్లీ విదేశ పాలన మసుగడ ఐక్యతా సాధనంగా పని చేసింది.

దేశమంతటా ప్రజలు తాము తమ ఉమ్మడి శత్రువైన బ్రిటిషు వాళ్ల చేతుల్లో బాధలు పడుతున్నామని భావించారు. ఈ సామ్రాజ్యవాద వ్యతిరేక భావనే దేశ సమైక్యతకు, ఒక సమిష్టి జాతీయ దృక్పథం అవిర్భవించడానికి కారణ భూతమైంది.

*పాశ్చాత్య విద్య, విచార ధార :* 19వ శతాబ్దంలో అధునిక పాశ్చాత్య విద్య, అలోచనా విధానం వ్యాప్తి చెందిన ఫలితంగా ప్రజల్లో చాలామంది ఒక నూతన హేతువాద, లౌకిక, ప్రజాస్వామిక, జాతీయవాద రాజకీయ దృక్పథాన్ని అలవర్చుకున్నారు. యూరపు దేశాల్లోని సమకాలీన జాతీయోద్యమాల్ని అధ్యయనం చేయ్యసాగారు; అభిమానించారు; వాటినుంచి ఉత్తేజం పొందారు; వాటిని అదర్శంగా తీసుకో సాగారు. రూసో, పేన్, జాన్‌స్టువార్ట్ మిల్ ప్రభృత పాశ్చాత్య తత్వవేత్తలు వాళ్ళకి రాజకీయ గురువులయ్యారు. మాజినీ గారి బాల్డి, ఐరిషు జాతీయోద్యమనేతలు వాళ్ళకు రాజకీయ వీరమూర్తులయ్యారు.

పరాధీనతలోని పరాభావాన్ని మొట్టమొదట అనుభవించిన వాళ్ళు ఈ విద్యావంతులే. తమ అలోచనా విధానంలో నవ్యతని సంతరించుకున్నందువల్ల వాళ్ళు విదేశపాలన యొక్క దుష్పరిణామాల్ని అధ్యయనం చేసే సామర్థ్యాన్ని పొందారు. ఒక నూతన, పటుతర, సంపన్న, సమైక్య భారతదేశం గురించి కన్న స్వప్నం వాళ్ళని ఉత్తేజితుల్ని చేసింది. కాలక్రమంలో, వాళ్ళలోని అతిరధులు జాతీయోద్యమ నిర్వాహకులు, నాయకులు అయ్యారు.

అధునిక విద్యావ్యవస్థ జాతీయోద్యమాన్ని సృష్టించలేదు. బ్రిటన్, ఇండియా ప్రయోజనాల పరస్పర సంఘర్షణలో జాతీయోద్యమం పుట్టింది. అయితే, భారతీయుల్లో విద్యావంతులు పాశ్చాత్య అలోచనా విధానాన్ని అలవర్చుకోటానికి, తద్వారా జాతీయోద్యమ నాయకత్వాన్ని స్వీకరించటానికి, దానికి ఒక నవీన ప్రజాస్వామిక దృష్టి ప్రసాదించటానికి అధునిక విద్యా విధానం తోడ్పడింది. నిజానికి పాఠశాలల్లో, కళాశాలల్లో అధికార్లు విద్యార్థులకు బానిస భావాలు అలవర్చటానికి ప్రయత్నించారు. అధునిక భావాల సార్వత్రిక వ్యాప్తిలో జాతీయోద్యమ భావాలు ఒక భాగం. చైనా, ఇండోనేషియా వంటి ఇతర అసియా దేశాల్లో, అఫ్రికా అంతటా నూతన పాఠశాలలు, కళాశాలలు చాలా కొద్ది అయినప్పటికీ నూతన, జాతీయ భావాలు వ్యాప్తి చెందాయి.

విద్యావంతులైన భారతీయుల్లో కొత్త చదువులు ఒకానొక పొందికని సృష్టించాయి; సమిష్టిదృష్టి, ఉమ్మడి ప్రయోజనాల అవగాహన కలిగించాయి. ఇంగ్లీషు భాష ఈ విషయంలో ఒక ముఖ్యపాత్ర నిర్వహించింది. నవీన భావాలు వ్యాప్తి చెందటానికి అది ఒక సాధనం అయింది. దేశంలోని వివిధ భాషా ప్రాంతాలకు చెందిన విద్యావంతులు పరస్పరం తమ భావాలు తెలుపుకోడానికి, తమ అలోచనలు ఇచ్చిపుచ్చుకోడానికి అది ఒకమార్గం అయింది. అయితే, ఇంగ్లీషు భాషా ప్రాధాన్యాన్ని అతిగా చెప్పుకోకూడదు. గతంలో సంస్కృతం, పర్షియన్ భాషలు విద్యావంతులైన భారతీయులకు అధ్యయన, బోధన భాషలుగా ఉన్నాయి. అధునిక శాస్త్ర విజ్ఞానాన్ని అర్జించటానికి ఇంగ్లీషే తప్పనిసరిగా ఉండాల్సిన పనిలేదు. చైనా, జపాన్ వంటి ఇతర అసియా దేశాల్లో పాశ్చాత్య శాస్త్ర విజ్ఞానాన్ని తమ భాషల్లోకి తర్జుమా చేసుకొని విజ్ఞానార్జన చేస్తున్నారు. నిజానికి, సామాన్య ప్రజల్లో అధునిక విజ్ఞాన వ్యాప్తికి ఇంగ్లీషు

భాష అడ్డుగోడగా తయారైంది. పట్టణాల్లో చదువుకున్న వాళ్ళని ఇంగ్లీషుభాష సామాన్య ప్రజానీకం నుంచి వేరుచేసి ఉభయుల మధ్య గోడ కట్టింది. ముఖ్యంగా గ్రామీణ ప్రజలతో విద్యావంతులకు సంబంధం లేకుండా చేసింది. దేశ భాషలో బోధన, ప్రచారం జరిగిన అనేక దేశాల్లో ఆధునిక భావాలు అతిసత్వరంగా, విస్తృతంగా ప్రజల్లో వ్యాప్తి చెందాయి. భారతదేశంలో ఇంగ్లీషు భాషకి విపరీత ప్రాధాన్యం ఇవ్వటం వల్ల ఆధునిక విజ్ఞాన వ్యాప్తి కొద్ది మంది పట్టణ వర్గాలవరకే పరిమితమై పోయింది. ఈ వాస్తవాన్ని చాలా మంది మన రాజకీయ నాయకులు గుర్తించారు. దాదాభాయ్ నౌరోజీ, సయ్యద్ అహ్మద్‌ఖాన్, జస్టిస్ రానడే మొదలుకొని తిలక్, గాంధీజీ వరకు మన జాతీయోద్యమ నాయకులు విద్యా వ్యవస్థలో భారతీయ భాషలకు పెద్దపీట వెయ్యాలని ఆందోళన చేశారు నిజానికి, సామాన్య ప్రజానీకంలో ఆధునిక భావాలు వ్యాప్తి చెందాయంటే అది వర్తమాన భారతీయ భాషల ద్వారా, ఆ భాషల్లో వికసించిన సాహిత్యం ద్వారా, ప్రాంతీయ భాషా పత్రికల ద్వారా సాధ్యమైంది ఈ ఉమ్మడి భాషకన్నా ముఖ్యమైన అంశం మరొకటున్నది. ఆధునిక విద్యా విధానం దేశమంతటా ఒకే మాదిరి కోర్సులు ప్రవేశపెట్టింది. కొత్త పాఠశాలల్లో, కళాశాలల్లో పెట్టిన పుస్తకాలు విద్యార్థుల్లో ఒకే రాజకీయ, ఆర్థిక దృక్పథాన్ని కలిగించడంవల్ల మొగ్గ చూపాయి. ఫలితంగా, విద్యావంతులందరిలో ఒకే రకమైన భావాలు, అనుభూతులు, ఆశలు, ఆదర్శాలు ఉదయించే అవకాశం ఏర్పడింది.

*సాహిత్యం, పత్రికల పాత్ర :* జాతీయవాదులు దేశభక్తి సందేశాన్ని ప్రజల్లో ప్రచారం చెయ్యటానికి, ఆధునిక ఆర్థిక, సామాజిక, రాజకీయ భావాలను ప్రజల్లో వ్యాప్తిచేయటానికి, అఖిలభారత జాతీయ చైతన్యాన్ని కలిగించటానికి పత్రికలు ప్రధాన సాధనంగా ఉపయోగపడ్డాయి. 19 శతాబ్దం రెండవ పాదంలో జాతీయ భావాలు ప్రచారం చేసే పత్రికలనేకం వెలువడ్డాయి. ఆ పత్రికలు ప్రభుత్వ విధానాలను ఎడతెరిపి లేకుండా ఎడా పెడా విమర్శించాయి. భారతీయ దృక్పథాన్ని వివరించాయి. జాతీయ శ్రేయస్సు కోసం ప్రజలందర్నీ సమైక్యం కమ్మని పిలుపిచ్చాయి. స్వపరిపాలన, ప్రజాస్వామ్యం, పారిశ్రామికీకరణ వంటి విషయాల్ని అవి ప్రజల్లో ప్రచారం చేశాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేసే జాతీయోద్యమ కార్యకర్తలు పరస్పరం తమ భావాలు తెలుసుకోవటానికి పత్రికలు తోడ్పడ్డాయి. బెంగాల్‌లో హిందూ పేట్రియట్, అమృత బజార్ పత్రిక, ఇండియన్ మిర్రర్, ది బెంగాలీ, సోంప్రకాశ్ సంజీవని; బొంబాయిలో రాస్త్‌గోఫ్తర్ (Rast Goftar), ది నేటివ్ ఒపీనియన్, ఇందుప్రకాష్, మరాఠా, కేసరి; మద్రాసు రాష్ట్రంలో ది హిందూ, స్వదేశ మిత్రన్, ఆంధ్ర ప్రకాశిక, కేరళ పత్రిక, ఉత్తరప్రదేశ్‌లో (అప్పటి సంయుక్త రాష్ట్రం) ఎడ్వకేట్, హిందుస్థానీ, ఆజాద్, పంజాబ్‌లో ట్రిబ్యూన్, అక్బర్-ఇ-ఆమ్, కోహినూర్ అనాటి ప్రముఖ వార్తా పత్రికలు.

జాతీయ సాహిత్యం నవల, వ్యాసం, దేశభక్తి గేయాల రూపంలో ప్రజల్లో జాతీయాభిమానాన్ని, చైతన్యాన్ని రేకెత్తించడంలో ముఖ్యపాత్ర నిర్వహించాయి. బెంగాల్‌లో బంకించంద్ర చటర్జీ, రవీంద్రనాథ ఠాగోర్; అస్సాంలో లక్ష్మీనాథ్ బెజ్‌బారువా; మహారాష్ట్రలో విష్ణుశాస్త్రి చిప్లుంకర్, తమిళనాడులో సుబ్రమణ్య భారతి; ఉర్దూలో అల్తాఫ్ హుస్సేన్ హాలి అనాటి ప్రముఖ జాతీయ కవులు, రచయితలు.

**భారతదేశ గతం పునరావిష్కరణ:** చాలామంది భారతీయులు స్వపరిపాలనా సామర్థ్యంలో విశ్వాసం కోల్పోయేటంతగా కుంగిపోయారు. పైపెచ్చు బ్రిటిష్ అధికార్లు, సమకాలీన రచయితలు పనిగట్టుకుని భారతీయుల అసమర్థతని పదే పదే ప్రచారం చేశారు. గతంలో భారత ప్రజలు తమని తాము ఎన్నడూ పరిపాలించుకోలేదని, హిందూ, ముస్లింలు పరస్పరం ఎప్పుడూ గుద్దులాడుకుంటారని, పరాయివాళ్ళ చేత పరిపాలింపబడ్డం భారతదేశానికి రాసిపెట్టి వుందని, భారతీయుల మతం, సామాజిక జీవనం వాళ్ళని ప్రజాస్వామ్యానికి, ఆఖరికి స్వపరిపాలనకు కూడా పనికిరాకుండా చేసినంతటి అధమాధమమైనవని, అనాగరికమైనవని బ్రిటీషు అధికార్లు, రచయితలు పాటపాడారు. చాలామంది జాతీయోద్యమ నాయకులు ఈ ప్రచారానికి విరుగుడుగా ప్రజల్లో ఆత్మవిశ్వాసం, ఆత్మాభిమానం పురికొల్పడానికి ప్రయత్నించారు. ఆ ప్రయత్నంలో భాగంగా వాళ్ళు భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని సగర్వంగా చాటారు. అశోకుడు, చంద్రగుప్త విక్రమాదిత్యుడు, అక్బర్‌వంటి భారత సామ్రాట్టుల రాజకీయ విజయాలను విమర్శకులకు గుర్తుచేశారు. కళలు, శిల్పం, సాహిత్యం, తత్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రం, రాజకీయాల్లో మన జాతీయ వారసత్వాన్ని పునరావిష్కరించడానికి ఐరోపా, భారతీయ పండితులుభయులూ జరిపిన కృషి వారికి తోడ్పాటు, ప్రోత్సాహం ఇచ్చాయి. కాని దురదృష్టవశాత్తు జాతీయవాదుల్లో కొందరు 'అతి'గా పోయి భారత గతవైభవాన్ని ఆకాశానికెత్తారు. విమర్శనా దృష్టి లేకుండా ప్రాచీన భారత సమాజంలోని బలహీనతల్ని, వెనుకబాటుతనాన్ని విస్మరించారు. కేవలం ప్రాచీన భారతీయ వారసత్వంమీద మాత్రమే దృష్టి నిలిపి, మధ్యయుగంలో ప్రాచీన భారత విజయాలకు తీసిపోని ఘనవిజయాల్ని నిర్లక్ష్యం చెయ్యటంవల్ల గొప్పహాని జరిగింది. ఆ ధోరణి హిందువుల మనస్సుల్లో స్వమత అభిమానాన్ని ప్రోత్సహించింది; ముస్లిములలో దానికి వ్యతిరేకమైన వైఖరి ప్రబలింది. వాళ్ళు చారిత్రక, సాంస్కృతిక ఉత్తేజం కోసం అరబ్బుల, టర్కుల, చరిత్ర పుటల్ని తిరగవేశారు. పాశ్చాత్య సాంస్కృతిక సామ్రాజ్యవాదం యొక్క సవాలుని ఎదుర్కొనడంలో మనవాళ్ళు చాలామంది అనేక విషయాల్లో భారత ప్రజలు సాంస్కృతికంగా వెనుకబడి వున్నారనే వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకోలేదు. గత కీర్తిగానలోలతలో ఒక మిథ్యా గర్వభావం, ఆత్మసంతృప్తి పెరిగిపోయి భారతీయుల్ని తమ సమాజం కేసి సవిమర్శకంగా చూడనివ్వకుండా చేశాయి. సామాజిక, సాంస్కృతిక హీన స్థితికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఇది బలహీనపర్చింది. ఇతర దేశాల ప్రజల ఆరోగ్యకర, నూతన ధోరణులకేసి భారతీయులు ముఖం తిప్పుకునేటట్టు చేసింది.

**పాలకుల జాత్యహంకారం:** ఇంగ్లీషువాళ్లలో చాలామంది భారతీయులతో వ్యవహరించిన సందర్భాల్లో ప్రదర్శించిన జాతిపరమైన ఆధిక్యతా భావం భారతదేశంలో జాతీయాభిమానం ఎదుగుదలకి ప్రధాన కారణం కాకపోయినా, ప్రముఖ కారణం అయింది. చాలామంది ఇంగ్లీషు వాళ్లు విద్యావంతులైన భారతీయుల్ని సైతం బహిరంగంగా అవమానించారు; ఆఖరికి వారిమీద చెయ్యి చేసుకున్నారు కూడా. ఒక భారతీయుడితో ఇంగ్లీషువాడు వివాదంలో ఇరుక్కున్నప్పుడల్లా న్యాయం కళ్ళు, చెవులూ మూసుకుంది. ఇది జాత్యహంకారం తరచు ధరించిన జుగుప్సాకరమైన రూపం. ఇంగ్లీషువాడు భారతీయుణ్ణి కొట్టి, చంపి కూడా తేలిక శిక్షతో స్వల్ప జరిమానాతో

తప్పించుకున్న అనేక సంఘటనలను, సందర్భాలను భారతీయ పత్రికలు తరచు ప్రచురించాయి. న్యాయమూర్తులు, న్యాయనిర్వహణాధికార్ల పక్షపాత బుద్ధివల్ల మాత్రమే కాకుండా, అంతకన్నా ఎక్కువగా జాత్యభిమానం వల్ల న్యాయం జరుగలేదు. ట్రెవెలియన్ అనే ఇంగ్లీషు చరిత్రకారుడు 1864లో భారతదేశంలో ఇంగ్లీషు న్యాయమూర్తుల న్యాయ నిర్ణయాన్ని గురించి ఇలా వ్యాఖ్యానించాడు. "న్యాయస్థానంలో ఒక్క ఇంగ్లీషు వ్యక్తి సాక్ష్యానికి పెక్కుమంది హిందువుల సాక్ష్యంకన్నా ఎక్కువ విలువ ఉంది. అధర్మభీతి లేని దురాశాపరుడైన ఇంగ్లీషు వ్యక్తి చేతుల్లో ఒక భయంకర అధికార సాధనాన్ని పెట్టేటటువంటి పరిస్థితి ఇది".

కుల, మత, వర్గ, ప్రాంత విచక్షణ లేకుండా భారతీయులందర్నీ ఈ ఇంగ్లీషు జాత్యహంకారం అధములని ముద్రవేసింది. ఇంగ్లీషు వాళ్లకి మాత్రమే ప్రత్యేకితమైన క్లబ్బుల్లో, భారతీయులకు ప్రవేశార్హత లేదు. రైళ్లలో యూరోపియన్ ప్రయాణీకులతోపాటు ఒకే పెట్టెలో భారతీయులు ప్రయాణించటానికి వీలులేదు. జాతికి జరిగిన పరాభవంగా భారతీయులు వీటిని పరిగణించారు. ఇంగ్లీషు వాళ్ల ముందు భారతీయులు తామంతా ఒక్కటే అని భావించడానికి ఇది దారితీసింది.

***తక్షణ కారణాలు:*** 1870 ప్రాంతానికి భారత రాజకీయరంగంమీద ప్రధాన శక్తిగా అనిపించేటంత బలాన్ని, పడిని భారత జాతీయవాదం పుంజుకుంది. అయినా, దానికి ఒక స్పష్టమైన రూపం ఏర్పాటానికి లార్డ్‌లిట్టన్ అభివృద్ధి నిరోధక ప్రభుత్వం అవసరమైంది. వివాదాస్పదమైన ఇల్బర్ట్ బిల్లు అది ఒక సంఘటిత రూపంలో అవతరించటానికి అవకాశం కలిగించింది.

1876-80 సంవత్సరాల మధ్య లార్డ్‌లిట్టన్ వైస్రాయి గిరీలో బ్రిటన్‌నుండి భారతదేశానికి దిగుమతయ్యే నూలు వస్త్రాలమీద దిగుమతి సుంకాలు రద్దయ్యాయి. బ్రిటిషు వస్త్ర పారిశ్రామికుల్ని సంతోషపెట్టటానికి ఆ వైస్రాయిగారు సుంకాలు ఎత్తివేశాడు. భారతదేశంలో అప్పుడే తలెత్తుతోన్న బట్టల పరిశ్రమని దెబ్బతియ్యడానికి తీసుకున్న చర్యగా భారతీయులు దాన్ని పరిగణించారు. దాంతో దేశమంతటా ఒక ఆగ్రహకెరటం ఉవ్వెత్తింది. అది విస్తృత జాతీయాందోళనకు దారితీసింది. అప్పుడే రెండవ ఆఫ్ఘన్ యుద్ధం ప్రారంభమైంది. భారత ప్రజానీ భరించవలసిన ఆ సామ్రాజ్యవాద యుద్ధ వ్యయానికి వ్యతిరేకంగా దేశంలో ఆందోళన విజృంభించింది. 1878 ఆయుధ చట్టం ప్రజల్ని నిరాయుధుల్ని చేసింది. యావత్ జాతిని నపుంసకంగా చేసే చర్యగా ఈ చట్టాన్ని ప్రజలు నిరసించారు. అదే సంవత్సరం దేశభాషా పత్రికల చట్టం వచ్చింది. విదేశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెచ్చు పెరిగే జాతీయవాదుల విమర్శను అణచి వెయ్యటానికి తలపెట్టిన ప్రయత్నంగా ఆ చట్టాన్ని రాజకీయ చైతన్యం కలిగిన భారతీయులంతా ఖండించారు. ప్రజానీకం తీవ్రక్షామంలో భయంకర బాధలననుభవించే సంక్షోభ సమయంలో 1877లో ఢిల్లీలో అట్టహాసంగా దర్బారు జరిగింది. దాంతో ఇంగ్లీషు పాలకులు ప్రజలేమైపోయినా పట్టించుకోరనే భావం భారతీయులకు కలిగింది. 1878లో ప్రభుత్వం ఐ.సి.యస్ పరీక్షకు కూర్చునే అభ్యర్థుల గరిష్ఠ వయస్సుని 21 నుంచి 19 సంవత్సరాలకు తగ్గిస్తూ కొత్త నిబంధనలు ప్రకటించింది. ఈ కొత్త నిబంధనల వల్ల భారతీయులు ఉన్నత ప్రభుత్వోద్యోగాల్లో ప్రవేశించే అవకాశాలు కోల్పోయారు. పరిపాలనా యంత్రాంగంలో పైపదవుల్లో ఇంగ్లీషు

గుత్తాధిపత్యాన్ని తగ్గించే యోచన ప్రభుత్వానికి లేదనేది మన విద్యావంతులకు అర్థమైంది.

ఆ విధంగా, లార్డ్ లిట్టన్ వైస్రాయిగిరీ విదేశ పాలనకు వ్యతిరేకంగా అసంతృప్తిని పెంచింది. జాతీయోద్యమ నిర్మాతల్లో ఒకరైన సురేంద్రనాథ్ బెనర్జీ ఆనాటి పరిస్థితిని ఇలా వర్ణించారు:

"లార్డ్ లిట్టన్ అభివృద్ధి నిరోధక పరిపాలన నిర్లిప్తంగా ఉండిపోయిన ప్రజల్ని మేల్కొలిపింది. ప్రజాజీవితంలో చురుకు పుట్టించింది. రాజకీయంగా అభివృద్ధి చెందే పరిణామంలో చెడు పరిపాలన కూడా ఒక పరోక్ష లాభం. దుష్ట పాలకులు ఒక సమాజానికి కదలిక, చైతన్యం కలిగిస్తారు. సంవత్సరాల తరబడి పాటుబడ్డా బహుశా ఆ ఫలితం కలగదు".

లార్డ్ లిట్టన్ లోలోపల దహించే అసంతృప్తికి కారకుడయితే, ఇల్బర్ట్ బిల్లుకు సంబంధించిన వివాదం ఆ అసంతృప్తిని మండించే అగ్నికణం అయింది. లార్డ్‌లిట్టన్ తరువాత వైస్రాయిగా వచ్చిన లార్డ్‌రిప్పన్ 1883లో ఒక శాసనాన్ని ఆమోదింపచేయటానికి ప్రయత్నించారు. భారతీయ జిల్లా మేజిస్ట్రేటులు, సెషన్స్ జడ్జీలు, క్రిమినల్ కేసుల్లో యూరోపియన్లను విచారించటానికి అధికారం ప్రసాదించే శాసనం అది. కొట్టవచ్చినట్లు కనబడే జాతి వివక్ష తాలూకు ఒక ప్రత్యక్ష ఉదాహరణని తొలగించటానికి చేసిన చిరుప్రయత్నం అది. ఆనాడు చట్టరీత్యా భారతీయ ఐ.సి యస్. అధికార్లకు సైతం న్యాయస్థానాలలో యూరోపియన్లని విచారించే హక్కు, అధికారం లేవు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా భారతదేశంలోని యూరోపియన్లు మొత్తం ఒక్కపై తీవ్రంగా ప్రతిఘటించారు. న్యాయశాఖ సభ్యుడైన ఇల్బర్ట్ అనే పెద్దమనిషి ఆ బిల్లుని రూపొందించడంచేత దానికి ఇల్బర్ట్ బిల్లు అని పేరు వచ్చింది. ఆ బిల్లుని ప్రతిఘటించిన యూరోపియన్లు భారతీయుల మీద, వాళ్ల సంస్కృతి మీద, వాళ్ల శీలం మీద విషం కక్కారు. మహావిద్యాధికుడైన భారతీయునికి సైతం ఒక యూరోపియన్‌ని విచారించే అధికారం లేదని వాళ్లు ఉద్ఘాటించారు. వాళ్లలో ఉగ్రవాదులు కొందరు వైస్రాయిని బలవంతంగా అపహరించి, ఇంగ్లండ్‌కు రవాణా చెయ్యటానికి కుట్రపన్నారు. చిట్టచివరకు భారత ప్రభుత్వం యూరోపియన్ల ముందు తలవంచి, వాళ్ల విమర్శలకు అనుగుణంగా బిల్లుని సవరించింది.

ఇల్బర్ట్ బిల్లుని దుయ్యబట్టిన ఇంగ్లీషు వాళ్ళు ప్రదర్శించిన జాతి వైషమ్యాన్ని చూసి భారతీయులు నివ్వెరపోయారు. విదేశ పాలన తమని ఎటువంటి అధమ స్థితికి దిగజార్చిందో వాళ్లకు పూర్తిగా అర్థమైంది. బిల్లుకు అనుకూలంగా వాళ్ళు అఖిల భారత ప్రజాభిప్రాయాన్ని రెచ్చగొట్టటానికి పూనుకున్నారు. ప్రభుత్వం తమ వాంఛల్ని ఆమోదించాలంటే, తామూ జాతీయ స్థాయిలో నిరంతరాయంగా, సమైక్యంగా ఆందోళన కొనసాగించవలసి ఉంటుందనే విలువైన పాఠం నేర్చుకున్నారు.

***భారత జాతీయ కాంగ్రెసుకు పూర్వం ఉన్న ప్రముఖులు:*** 1885 డిశంబరులో ఆవిర్భవించిన భారత జాతీయ కాంగ్రెస్ అఖిల భారత స్థాయిలో భారత జాతీయోద్యమం యొక్క మొట్టమొదటి సజీవ అభివ్యక్తి. అయితే, దానికి ముందు ఉద్యమాలు నడిపిన ప్రముఖులు చాలామంది ఉన్నారు.

భారతదేశంలో రాజకీయ సంస్కరణల కోసం ఉద్యమం ప్రారంభించిన మొట్టమొదటి భారతీయుడు, రాజారామమోహన్‌రాయ్. ఆధునిక భారతదేశంలో

అన్నిటికన్నా ముందుగా వెలసిన సంఘం భూస్వామ్య సంఘం. బెంగాల్, బీహార్, ఒరిస్సా భూస్వాములంతా కలిసి భూస్వామ్య వర్గ ప్రయోజనాల కోసం 1837లో ఈ సంఘాన్ని పెట్టుకున్నారు. ఆ తరువాత 1843లో సార్వత్రిక ప్రజాప్రయోజనాల పరిరక్షణకోసం, పెంపుకోసం బెంగాల్ బ్రిటిష్ ఇండియన్ సొసైటీ స్థాపన జరిగింది. అదేవిధంగా 1852లో మద్రాను, బొంబాయి రాష్ట్రాలలో వేరుగా సంఘాలు ఆరంభమైనాయి. అంతగా ప్రచారం పొందని అలాంటి సంఘాలు దేశంలో వివిధ ప్రాంతాలలో, పట్టణాల్లో ప్రారంభమయ్యాయి. సయ్యిద్ అహ్మద్‌ఖాన్ స్థాపించిన సైంటిఫిక్ సొసైటీ అటువంటిదే. ఈ సంఘాల్లో ధనిక, కులీన వర్గాలకు చెందిన ప్రముఖులు ప్రాబల్యం వహించారు. పరిపాలనా సంస్కరణ కోసం, పరిపాలనా నిర్వహణలో భారతీయుల భాగస్వామ్యం కోసం, విద్యావ్యాప్తి కోసం ఆ సంఘాలు కృషిచేశాయి. భారత ప్రజల కోర్కెల్ని వివరిస్తూ అవి బ్రిటిషు పార్లమెంటుకు సుదీర్ఘమైన మహాజర్లు, విజ్ఞప్తులు పంపాయి.

1858 తరువాత విద్యావంతులైన భారతీయులకు, బ్రిటిషు ఇండియా పాలనకు మధ్య అగాధం మరీ విస్తరించింది. మన విద్యావంతులు బ్రిటిషు పాలన స్వభావాన్ని, భారత ప్రజలపైన దాని పరిణామాల్ని అధ్యయనం చేశాక బ్రిటిషు విధానాలపట్ల తీవ్ర విమర్శనాత్మక వైఖరి అవలంబించారు. వాళ్ళ అసంతృప్తి రాజకీయ కార్యకలాపాల్లో అభివ్యక్తమైంది. అప్పుడున్న సంఘాలు రాజకీయ చైతన్యం విస్తారిన భారతీయుల్ని సంతృప్తిపర్చలేక పోయాయి.

1866లో దాదాభాయ్ నౌరోజీ భారతదేశ సమస్యని చర్చించటం కోసం, భారతదేశ శ్రేయస్సుని పెంపొందించటానికై బ్రిటిషు ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చెయ్యటం కోసం లండన్‌లో ఈస్ట్ ఇండియా అసోసియేషన్‌ని (తూర్పిండియా సంఘం) స్థాపించాడు. తరువాత భారతదేశంలో అన్ని ప్రధాన పట్టణాల్లో ఆ సంఘం శాఖలు ప్రారంభించాడు. ఆయన 1825లో జన్మించాడు. తన యావజ్జీవితాన్ని జాతీయోద్యమానికి అంకితం చేశాడు. భారత కురువృద్ధుడుగా (Grand Old Man of India) పేరు వచ్చాడు. ఆయనే భారతదేశంలో మొట్టమొదటి ఆర్థికవేత్త కూడా ఆర్థిక విషయాలపైన రాసిన తన రచనల్లో బ్రిటిషు దోపిడీ భారతదేశ దారిద్ర్యానికి మూలకారణం అని ఆయన సవివరంగా చూపాడు. భారత జాతీయ కాంగ్రెసుకు ఆయనని మూడు పర్యాయాలు అధ్యక్షునిగా ఎన్నుకోనడం ద్వారా దేశప్రజలు ఆయనపట్ల తమ గౌరవాభిమానాల్ని వ్యక్తం చేశారు. విశేష ప్రజాదరణపొందిన భారత జాతీయనాయకుల పరంపరలో దాదాభాయ్ నౌరోజీ ప్రప్రథముడు. ఆయన పేరు వింటేచాలు భారతప్రజల హృదయాలు ఉద్రూతలూగిపోయాయి.

జస్టిస్ రానడే, ఇంకా తదితరులు 1870లో పూనా సార్వజనిక సభని నెలకొల్పారు. అట్లాగే 1881లో మద్రాసు మహాజన సభ ప్రారంభమైంది. 1885లో బొంబాయి ప్రెసిడెన్సీ అసోసియేషన్ స్థాపన జరిగింది. ముఖ్యమైన పరిపాలనా, శాసననిర్మాణ చర్యల్ని విమర్శించడంపైన ఈ సభల, సంఘాల దృష్టి లగ్నమైంది. పూనా సార్వజనిక సభ జస్టిస్ రానడే ఆధ్వర్యంలో ఒక త్రైమాసిక పత్రికను తెచ్చింది. ఈ పత్రిక ముఖ్యంగా ఆర్థిక సమస్యలపైన నవభారత మేధావులకు మార్గదర్శి అయింది.

కాంగ్రెస్‌కు ముందు ప్రారంభమైన జాతీయ సంస్థలలో అత్యంత ముఖ్యమైంది కలకత్తా భారతీయ సంఘం (Indian Association of Calcutta). బెంగాలీ యువ జాతీయవాదులు బ్రిటిష్ ఇండియా అసోసియేషన్‌వారి సంప్రదాయవాద, భూస్వామ్య అనుకూల విధానాలతో విసుగెత్తిపోయారు. విస్తృత ప్రజానీకానికి సంబంధించిన సమస్యలమీద నిర్విరామ రాజకీయ ఆందోళన సాగాలని ఆ యువకులు వాంఛించారు. సురేంద్రనాథ బెనర్జీ వారికి నాయకుడు. ఆయన ఉజ్వల రచయిత, మహావక్త. ఆయన ఇండియన్ సివిల్ సర్వీసుకు ఎంపికైన వ్యక్తి. ఐ.సి.యస్. అధికార్లలో స్వతంత్రభావాలు కలిగిన భారతీయ వ్యక్తి ఉండటం బ్రిటిషు పాలకులకు నచ్చక ఆయనని బైటికి గెంటివేశారు. ఆయన ప్రజాజీవితం 1875లో మొదలయింది. కలకత్తా విద్యార్థులకు జాతీయ విషయాలపైన ఆయన గంభీరోపన్యాసం ఇవ్వటంతో ఆయన రాజకీయ జీవితం ప్రారంభమైంది. సురేంద్రనాథ్ బెనర్జీ, ఆనందమోహన్ బోస్‌ల నాయకత్వంలో వంగ యువ జాతీయవాదులు 1876లో భారతీయ సంఘాన్ని (Indian Association) స్థాపించుకున్నారు. రాజకీయ సమస్యలమీద దేశంలో బలియమైన ప్రజాభిప్రాయాన్ని సృష్టించటం, ఒక ఉమ్మడి రాజకీయ కార్యక్రమంతో భారత ప్రజల్ని సమైక్యపర్చటం ఆ సంస్థ లక్ష్యాలు. భారతీయ సంఘం అశేష ప్రజానీకాన్ని తన జెండా కిందికి ఆకర్షించడానికి పేద తరగతులవారి కోసం అతి తక్కువ సభ్యత్వ రుసుము నిర్ణయించింది.

సివిల్ సర్వీసు నిబంధనల సంస్కరణ, ఐ.సి.యస్. (I.C.S.) పరీక్షకు గరిష్ఠ వయోపరిమితి పెంపు అనె రెండు సమస్యలమీద ఆ సంఘం తొలి ఆందోళన ప్రారంభించింది. ఆ సమస్యలమీద అఖిల భారత ప్రజాభిప్రాయాన్ని రేకెత్తించటం కోసం సురేంద్రనాథ్ బెనర్జీ 1877-78లో దేశమంతటా విస్తృతంగా పర్యటించారు. ఆయుధ చట్టానికి వ్యతిరేకంగా, దేశ భాషా పత్రికల చట్టానికి వ్యతిరేకంగా ఆ సంఘం ఆందోళన నడిపింది. జమీందార్ల పీడన నుంచి కౌల్దార్ల రక్షణకోసం అది ఉద్యమం సాగించింది. దాదాపుగా బానిస పరిస్థితులు కొనసాగే తేయాకు తోటల్లో పనిచేసే కార్మికులకు మెరుగైన పరిస్థితుల కోసం అది ఆందోళన చేసింది. బెంగాల్‌లో అనేక పట్టణాల్లో గ్రామాల్లో, బెంగాల్‌కి వెలుపలా ఆ సంఘం శాఖలు ప్రారంభమయ్యాయి.

జాతీయవాదుల అఖిలభారత రాజకీయ సంస్థ అవతరణకు కాలం పరిపక్వమైంది. విదేశపాలన, దోపిడీ అనే ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా రాజకీయంగా సమైక్యం కావలసిన అవసరాన్ని జాతీయవాదులు గుర్తించారు. తామంతా ఒక్క సంస్థగా ఐక్యం కావాలనే అనుభూతి పొందారు.

భారతీయ సంఘం (The Indian Association of Calcuttak) 1883 డిసెంబరులో కలకత్తాలో అఖిల భారత జాతీయ సదస్సును ఏర్పాటు చేసింది. ఆ సదస్సుకు బెంగాల్ బైట ప్రాంతాల నుంచి అనేకమంది ప్రతినిధులు హాజరయ్యారు. భారత జాతీయ కాంగ్రెస్ ఎంచుకున్న కార్యక్రమాన్ని పోలిన కార్యక్రమాన్నే ఆ సదస్సు ఆమోదించింది. తరువాత ఆ సదస్సు 1886లో కాంగ్రెస్‌తో విలీనమైంది. ఏమైనా, దేశం మొత్తంమీద రాజకీయ కార్యకర్తలకు, నాయకులకు ప్రతినిధి సంస్థగా రూపొందడానికి చేసిన ప్రయత్నంలో అది విజయం పొందలేకపోయింది.

*భారత జాతీయ కాంగ్రెస్:* జాతీయవాద రాజకీయ కార్యకర్తలతో ఒక అఖిల భారత సంస్థని స్థాపించాలని చాలామంది భారతీయులు యోచన చేస్తూనే ఉన్నారు.

అయితే, ఆ ఆలోచనకు ఒక నిర్దిష్టమైన తుదిరూపు ఇచ్చిన ఘనత A.O. హ్యూమ్ అనే ఇంగ్లీషు వ్యక్తికి దక్కింది. ఆయన ఐ సి.యస్. పింఛనుదారు. హ్యూమ్ ప్రముఖ భారత రాజకీయ నాయకుల్ని కలిసి, వాళ్ళ సహకారంతో 1885 డిశంబరులో బొంబాయిలో ప్రధమ జాతీయ కాంగ్రెసును సమావేశపరిచారు. ఆ సమావేశానికి డబ్ల్యు.సి.బెనర్జీ అధ్యక్షత వహించారు. వివిధ రాష్ట్రాలనుండి 72 మంది ప్రతినిధులు ఆ సమావేశానికి హాజరయ్యారు. నాటి భారత జాతీయ కాంగ్రెస్ లక్ష్యాలు నాలుగు:

ఒకటి: దేశంలోని వివిధ ప్రాంతాల జాతీయవాద రాజకీయ కార్యకర్తల మధ్య పరస్పర పరిచయం, స్నేహసంబంధాలు పెంపొందించడం.

రెండు: కుల, మత, రాష్ట్ర దురభిమానాలకు అతీతంగా జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించి, దృఢపర్చడం.

మూడు: ప్రజల వాంఛితాల్ని తెలుసుకొని, వాటిని చర్చించి, వాటికి పరిణత రూపమిచ్చి ప్రభుత్వం ముందు పెట్టటం.

నాలుగు: దేశంలో ప్రజాభిప్రాయాన్ని సుశిక్షితం చేయటం, సమీకరించటం. ఈ నాలుగు లక్ష్యాలలో ఇది అన్నిటికన్నా ముఖ్యమైంది.

బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా పెల్లుబికే అసంతృప్తిని ఉపశమింపచేయటానికి అనువైన నదుపాయాన్ని కలగజేయాలనే ఒక లక్ష్యంతో హ్యూమ్ భారత జాతీయ కాంగ్రెస్ సంస్థ స్థాపనకు సహాయపడ్డాడు. అంతకు క్రితం 1879లో వాసుదేవ్ బలవంత ఫాడ్కే అనే ఉద్యోగి రామోషి రైతుల్ని కూడగట్టి మహారాష్ట్రలో సాయుధ తిరుగుబాటు ప్రారంభించారు. అవసరమైన సన్నాహాలు చేయకుండా, పరిపక్వత లేకుండా పచ్చిగా ఆరంభించిన ప్రయత్నం కావటాన దాన్ని ప్రభుత్వం సులువుగా అణచివేసింది. కాని అది ముందు సంభవించబోయే ఘటనలకు సూచిక. పరాయి ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యావంతులు ప్రజావాహినికి నాయకత్వం వహించి ఒక శక్తివంతమైన తిరుగుబాటును తెస్తారనే భయం హ్యూమ్‌కి, ఇంకా అనేకమంది ఇతర బ్రిటిషు అధికార్లకు ఉంది. కాబట్టి, "మన విద్యాకంపల్ల ఉప్పొంగే మహాశక్తిని ఉపశమింపజేయటానికి అనువైన మార్గాన్ని చూడ్డం మన తక్షణావసరం" అన్నాడు హ్యూమ్. విద్యావంతులైన భారతీయుల్లో పేరుకుపోయిన అసంతృప్తి నిరపాయకరంగా వెలికిరావడానికి భారత జాతీయ కాంగ్రెస్ ఒక శాంతియుతమైన, రాజ్యాంగబద్ధమైన మార్గాన్ని ఏర్పరుస్తుందని హ్యూమ్ నమ్మాడు.

ఈ "ఉపశమన కారక నదుపాయ" సిద్ధాంతం అసలు నిజంలో పిసరంత భాగం. ఎవరేంచెప్పినా భారత జాతీయ కాంగ్రెసు రాజకీయ, ఆర్థిక ప్రగతికోసం ఒక జాతీయ సంస్థను స్థాపించాలనే రాజకీయ చైతన్యం కలిగిన భారతీయుల ఆరాటానికి ప్రాతినిధ్యం వహించింది. అనేక బలవత్తర శక్తులు పనిచేసిన ఫలితంగా అప్పటికే జాతీయోద్యమం దేశంలో ఉప్పొంగుతోందని లోగడ చెప్పుకున్నాం. ఈ ఉద్యమాన్ని సృష్టించిన ఘనత ఏ ఒక్క మనిషికి, లేదా ఏ ఒక్క గ్రూపుకు చెందదు. హ్యూమ్ కూడా కేవలం ప్రజల్లో పెల్లుబికే అసంతృప్తి శాంతియుతంగా వెలికురకడానికి అనువైన మార్గాన్ని అన్వేషించే లక్ష్యాన్ని మించిన ఒక మహోన్నత లక్ష్యంతో ప్రేరేపితుడయ్యాడు. భారతదేశంపట్ల, పేద రైతాంగంపట్ల ఆయనకు చిత్తశుద్ధితో కూడిన అభిమానం ప్రేమా ఉన్నాయి. జాతీయ సంస్థ స్థాపనలో హ్యూమ్‌తో

సహకరించిన భారతీయ నాయకులు ఉత్తమ శీలం కలిగిన దేశభక్తులు. రాజకీయ కార్యక్రమం ప్రారంభించబోయే తొలిదశలోనే ప్రభుత్వ శత్రుత్వాన్ని కొనితెచ్చుకోవటం ఇష్టంలేక వాళ్ళు హ్యూమ్ సహాయాన్ని హృదయపూర్వకంగా ఆమోదించారు.

ఆ విధంగా 1885లో భారత జాతీయ కాంగ్రెస్ సంస్థ ఆవిర్భావంతో పరాయి పాలనకు వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్యం కోసం ఒక సుసంఘటిత మార్గంలో చిన్న ఎత్తున పోరాటం మొదలయింది. జాతీయోద్యమం దేశంలో వెల్లువకవలసి వుంది; స్వాతంత్ర్యంసాధించేదాకా దేశ ప్రజలు విరామమెరుగక పోరాడవలసి వుంది.

సురేంద్రనాథ్ బెనర్జీ, ఇంకా ఇతర బెంగాలీ నాయకులు జాతీయ కాంగ్రెసు ప్రథమ సదస్సుకు హాజరుకాలేదు. అప్పుడు వారంతా కలకత్తాలో రెండవ జాతీయ సదస్సు ఏర్పాటుచేసే పనిలో నిమగ్నమై వున్నారు. 1886లో వారంతా జాతీయ కాంగ్రెస్‌లో విలీనమయ్యారు. రెండవ జాతీయ కాంగ్రెసు సదస్సు 1886 డిశంబర్‌లో కలకత్తాలో దాదాభాయ్ నౌరోజీ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సు జరిగినప్పటి నుంచి జాతీయ కాంగ్రెసు దేశప్రజలందరి సంస్థ అయింది. దానికి హాజరైన 436 గురు ప్రతినిధుల్ని స్థానిక సంఘాలు, గ్రూపులు ఎన్నుకున్నాయి. అప్పటినుంచి జాతీయ కాంగ్రెసు ఏటా డిశంబర్ మాసంలో దేశంలో వివిధ ప్రదేశాల్లో సమావేశమవుతూ వచ్చింది. అనతికాలంలోనే ప్రతినిధుల సంఖ్య వేలకి పెరిగింది. ప్రతినిధుల్లో ఎక్కువమంది న్యాయవాదులు, పత్రికేయులు, వ్యాపారస్థులు, పారిశ్రామికవేత్తలు, అధ్యాపకులు, భూస్వాములు. 1890 లో కలకత్తా విశ్వవిద్యాలయ ప్రప్రథమ మహిళా పట్టభద్రురాలైన కాదంబిని గంగూలీ కాంగ్రెస్ సదస్సుని ఉద్దేశించి ప్రసంగించింది. శతాబ్దాలుగా అధోగతిననుభవిస్తున్న భారత స్త్రీలను భారత స్వాతంత్ర్య పోరాటం ఉద్ధరిస్తుందనే వాస్తవానికిది ప్రతీక.

జాతీయవాద వెల్లువకు జాతీయకాంగ్రెస్ ఒక్కటే ఏకైక ప్రవాహ మార్గం కాదు. రాష్ట్ర సభలు, ప్రాంతీయ, స్థానిక సంఘాలు, జాతీయ వార్తాపత్రికలు పొంగొత్తే జాతీయోద్యమానికి ప్రముఖ సాధనాలయ్యాయి. ముఖ్యంగా, పత్రికలు జాతీయ భావాన్ని, జాతీయోద్యమాన్ని పెంపొందించటంలో పటుతర సాధనంగా పనిచేశాయి. ప్రారంభదశలో జాతీయ కాంగ్రెసుకు దాదాభాయ్ నౌరోజీ, బద్రుద్దీన్ త్యాబ్జీ, ఫిరోజ్ షా మెహతా, పనంపాక ఆనందాచార్యులు, సురేంద్రనాథ్ బెనర్జీ, రమేశ్ చంద్ర దత్తు, ఆనంద మోహన్ బోస్, గోపాలకృష్ణ గోఖలే వంటి మహామహులు అధ్యక్షులుగా ఉన్నారు. అదేకాలంలో కాంగ్రెసులో గాని, జాతీయోద్యమంలోగాని మహదేవ్ గోవింద రానడే, బాలగంగాధర తిలక్, శిశిర్ కుమార సోదరులు, మోతీలాల్ ఘోష్, మదన్ మోహన్ మాలవీయ, జి.సుబ్రమణ్య అయ్యర్, సి.వెంకట రాఘవాచారియార్, దిన్‌షా మొదలైనవారు ప్రముఖపాత్ర నిర్వహించారు.

భారత జాతీయోద్యమ కార్యక్రమాన్ని 1885-1905 సంవత్సరాల మధ్యకాలంలో అంటే ప్రారంభదశలో వివిధ శీర్షికలకింద అధ్యయనం చెయ్యవచ్చు.

*రాజ్యాంగ సంస్కరణలు:* మొట్టమొదటి జాతీయవాదులు తమ స్వీయదేశాన్ని పాలించే ప్రభుత్వంలో ఎక్కువ భాగస్వామ్యం కావాలని కోరారు. వాళ్ళు ప్రజాస్వామ్య సూత్రాన్ని పాటించమని విజ్ఞప్తి చేశారు. కాని వాళ్ళు తక్షణ లక్ష్యసిద్ధికోసం పట్టుబట్టలేదు. వాళ్ళు ప్రభుత్వం ముందు పెట్టిన తక్షణ కోర్కెలు మహామితవాద

స్వభావం కలిగినవి. క్రమక్రమంగా స్వాతంత్ర్యం సాధించాలని వాళ్ళు ఆశించారు. తమ కార్యకలాపాలను ప్రభుత్వం ఎక్కడ అణచివేస్తుందోనని, వాళ్ళు అతి జాగరూకతతో వ్యవహరించారు. 1885 నుంచి 1892 వరకు వాళ్ళు కేవలం శాసన మండలుల విస్తరణ, సంస్కరణలకోసం మాత్రమే డిమాండు చేశారు. ప్రజలచేత ఎన్నుకోబడ్డ ప్రతినిధులకు శాసనమండలి సభ్యత్వం పరిమితం కావాలనీ, మండలికి ఎక్కువ అధికారాలు ఉండాలనీ వాళ్ళు వాంఛించారు.

జాతీయవాదుల ఆందోళనకు లొంగిపోయి ప్రభుత్వం 1892లో శాసనసభల చట్టం చేసింది. దీని ప్రకారం కేంద్ర శాసనసభలోనూ, రాష్ట్ర శాసనసభల్లోనూ సభ్యుల సంఖ్య పెరిగింది. వారిలో కొందరిని భారతీయులు పరోక్షంగా ఎన్నుకునే వీలు కలిగింది. ఏమైనా, ప్రభుత్వంచేత నియమితులైన సభ్యుల సంఖ్యాధిక్యత యధాతధంగానే ఉండిపోయింది. నూతన సభ్యులకు వార్షిక బడ్జెట్‌పై చర్చల్లో పాల్గొనే అవకాశం కలిగింది. కాని వారికి వోటువేసే హక్కు లేదు.

1892 శాసనసభ చట్టం భారతీయులకు ఏమాత్రం సంతృప్తి ఇవ్వలేదు. ఇది గడుసుతనంతో చేసిన మోసం అని గేలచేశారు జాతీయవాదులు. శాసనసభల్లో భారతీయులకు హెచ్చు ప్రాతినిధ్యం, అధికారాలు ఉండాలని వాళ్ళు డిమాండు చేశారు. ప్రజాధనం మీద భారతీయుల అదుపాజ్ఞలుండాలని ఆందోళన చేశారు. అమెరికా స్వాతంత్ర్య యుద్ధసమయంలో అమెరికా ప్రజలు తమకు పార్లమెంటులో ప్రాతినిధ్యం ఇవ్వనిదే పార్లమెంటు విధించే పన్నులు కట్టేది లేదని ఘంటాపథంగా చెప్పినట్లే, భారతీయులు కూడా అదే మాట నినదించారు.

20వ శతాబ్దం ప్రారంభమైననాటికి, మన జాతీయ నాయకులు ఇంకా కొంత ముందడుగువేసి స్వరాజ్యం కావాలని ఘోషించారు. బ్రిటీషు సామ్రాజ్యంలో స్వపరిపాలిత దేశాలైన ఆస్ట్రేలియా, కెనడాల నమూనాలో భారతదేశానికి స్వయంపరిపాలనా ప్రతిపత్తి కావాలని ఒత్తిడి తెచ్చారు. కాంగ్రెస్ వేదిక మీంచి గోపాలకృష్ణ గోఖలే 1905లో దాదాభాయ్ నౌరోజీ 1906లోను స్వరాజ్య వాంఛ ప్రకటించారు.

***ఆర్థిక సంస్కరణలు:*** ఆనాటి జాతీయవాదులు ఆర్థిక రంగంలో సంస్కర్తల కోసం కూడా ఆందోళన జరిపారు. భారతదేశంలో పెరుగుతున్న దారిద్ర్యానికి, ఆర్థికమైన ఐదుగుస్థితికి, ఆధునిక పరిశ్రమలు, వ్యవసాయం అభివృద్ధికాకుండా నిలిచిపోయిన మందకొడిస్థితికి వాళ్ళు బ్రిటీషు పాలకుల విధానాలే కారణం అని నిందించారు. బ్రిటీషు పరిపాలన "శాశ్వతంగా పాతుకుపోయి, నిత్యమూ పెరుగుతూ పోయే ఒక విదేశాక్రమణ" అని దాదాభాయ్ నౌరోజీ ఎన్నడో 1881లోనే చెప్పారు. అది "ఈ దేశాన్ని విదానంగా సర్వనాశనం చేస్తున్నది". స్వదేశీ పరిశ్రమల విధ్వంసానికి జాతీయవాదులు బ్రిటీషు వాళ్ళని నిందించారు. భారతదేశ దారిద్ర్య నిర్మూలనకు సత్వర ఆధునిక పారిశ్రామికాభివృద్ధి ఒక్కటే మార్గమని వాళ్ళు సూచించారు. టారిఫ్ రక్షణ ఇవ్వటం ద్వారా, ప్రత్యక్ష ప్రభుత్వ సహాయం అందజేయడం ద్వారా ఆధునిక పరిశ్రమల్ని పెంపొందించమని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భారత పరిశ్రమల పెంపుకోసం వాళ్ళు స్వదేశీ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించారు. విదేశ వస్తు బహిష్కరణ ప్రచారం చేశారు. ఉదాహరణకు 1896లో విశాల స్వదేశీ ఉద్యమంలో భాగంగా పూనాలో,

మహారాష్ట్రలో ఇంకా ఇతర పట్టణాల్లో విద్యార్థులు విదేశ వస్త్రాల్ని బహిరంగంగా దహనం చేశారు.

భారతదేశ సంపదని ఇంగ్లీషువాళ్లు ఇంగ్లండుకు తరలించుకు పోతున్నారనీ, ఆ తరలింపుని నిలుపు చేయాలనీ జాతీయవాదులు కోరారు. పన్నుల బరువుకింద రైతాంగం మూపులు విరిగిపోకుండా భూమి శిస్తుని తగ్గించాలని జాతీయవాదులు ఎడతెగకుండా ఆందోళన సాగించారు. తేయాకు వగైరా తోటల్లో పనిచేసే కూలీల జీవన పరిస్థితుల మెరుగుదల కోసం కూడా వాళ్లు ఆందోళన చేశారు. అధిక పన్నులు భారతదేశ దారిద్ర్యకారణాల్లో ఒకటని ప్రకటిస్తూ ఉప్పుపన్ను రద్దుకోసం, భూమిశిస్తు తగ్గింపుకోసం అనాటి జాతీయవాదులు ప్రభుత్వాన్ని గద్దించారు. బ్రిటిషు ఇండియా ప్రభుత్వం మితిమీరిన సైనిక వ్యయాన్ని తగ్గించుకోవాలని కూడా వాళ్లు పట్టుబట్టారు. ఆర్థిక దోపిడీ, భయంకర దారిద్ర్యం, మారని ఆర్థిక హీనస్థితి వగైరాలు విదేశ పాలనవల్ల కలిగిన లాభాలను దిగమింగి వేశాయని అనేకమంది జాతీయవాదులు క్రమేణా ఒక నిర్ణయానికి వచ్చారు. ఆస్తికి, ప్రాణానికి భద్రత చేకూరిందని చేసే ప్రచారాన్ని గురించి దాదాభాయ్ నౌరోజీ ఇలా వ్యాఖ్యానించాడు.

"భారతదేశంలో ఆస్తికి, ప్రాణానికి భద్రత ఉన్నదనేది ఒక కాల్పనిక ఊహ. వాస్తవానికి అటువంటిదేమీ లేదు. ఒక విధంగా ధన, ప్రాణ రక్షణ ఉన్నది. జనం పరస్పరం హింసకు పాల్పడకుండా భద్రత ఉన్నది. స్వదేశ నిరంకుశుల నుంచి రక్షణ ఉన్నది. కాని బ్రిటిషు కబంధ హస్తాలనుంచి ఆస్తికి రక్షణ లేదు. తద్వారా ప్రాణానికీ భద్రతలేదు. భారతదేశ సంపదకు భద్రత లేదు. ఏది భద్రంగా, కడు భద్రంగా ఉన్నదంటే ఇంగ్లండు కడుపులో నీళ్లు కదలకుండా క్షేమంగా భద్రంగా ఉంది. భారతదేశంనుంచి సంపదని తరలించుకు పోవటానికి, ఇక్కడ కూర్చుని తేరగా మెక్కటానికి ఇంగ్లండుకు సంపూర్ణ భద్రత ఉంది. ఏటా భారతదేశపు ఆస్తిని మూడు, నాలుగు కోట్ల శాంర్ల వంతున కొల్లగొట్టుకు పోవటానికి భద్రత ఉంది. కాబట్టి, భారతదేశంలో ఆస్తికి, ప్రాణానికి భద్రత లేదని మనవి చెయ్యటానికి సాహసిస్తున్నాను. భారతదేశంలో కోట్లాది ప్రజలకు జీవితం అంటే "అర్థాకలి, పస్తులు, కరువులు, రోగాలు".

శాంతి భద్రతల గురించి ఆయనింకా ఇలా అన్నారు:

"కొడితే వీపుమీద కొట్టుగానీ, పొట్టమీద పొట్టకు' అని భారతదేశంలో ఒక నానుడి ఉంది. స్వదేశీ నిరంకుశ రాజుల జమానాలో ప్రజలు తాము పండించింది దాచుకుని అనుభవించేవాళ్లు. అప్పుడప్పుడు వీపు మోగిపోతే భరించారు. కాని బ్రిటిషు ఇండియా నిరంకుశ ప్రభువుల కింద మనిషి శాంతిగానే బ్రతుకుతున్నాడు. హింసలేదు, కాని అతని జీవనాధారం తన్నుకుపోతున్నారు. కానరాకుండా, చప్పుడు కాకుండా, అతి గోప్యంగా, ఆ మనిషి పస్తులు పడుంటానికి శాంతి ఉంది. పస్తుల్లో చావటానికి శాంతి ఉంది. శాంతి భద్రతలకేం క్షేమంగ్గా ఉన్నాయి!"

***పాలనా సంస్కరణలు – తదితర సంస్కరణలు:*** ఆ రోజుల్లో భారతీయులు వాంఛించిన అతి ముఖ్యమైన పరిపాలనా సంస్కరణ ఉన్నత పదవుల్లో అధిక సంఖ్యలో భారతీయుల నియామకం. అంటే ఉన్నతోద్యోగాల్లో భారతీయీకరణ జరగాలనేది వాళ్ల వాంఛితం. ఆర్థిక, రాజకీయ, నైతిక కారణాల ప్రాతిపదిక మీద భారతీయులీనాడు ఈ

డిమాండు చేశారు. ఆర్థికంగా, ఉన్నతోద్యోగాలలో యూరోపియన్ల గుత్తాధిపత్యం రెండు విధాలుగా హానికరం: (1) ఆ పదవుల్లో నియమితులైన యూరోపియన్లకు అత్యధిక వేతనాలు చెల్లించటంవల్ల పరిపాలన అతి ప్రియంగా తయారైంది. అవే అర్హతలుగల భారతీయుల్ని తక్కువ వేతనాల మీద నియమించవచ్చు. (2) యూరోపియన్ అధికార్లు తమ వేతనాల్లో హెచ్చు మొత్తాన్ని భారతదేశం వెలుపలికి పంపుకుంటున్నారు. వాళ్ళకి పింఛను ఇంగ్లండులో చెల్లించబడుతోంది. భారత సంపద హరించుకు పోవటానికి ఇదికూడా అదనంగా తోడ్పడింది. రాజకీయ దృష్ట్యా - ఈ ఉన్నతోద్యోగాల్లో భారతీయుల్ని నింపితే, ప్రభుత్వ పరిపాలన భారతీయుల అవసరాల కనుగుణంగా స్పందిస్తుంది. నైతిక సంబంధమైన ప్రశ్నని గోపాలకృష్ణ గోఖలే 1897 లో ఇలా వివరించాడు:

"విదేశ ఏజెన్సీ యొక్క మితిమీరిన ఖరీదెక్కటే దానిలోని చెడుగుకాదు. అంతకు మించిన నైతిక అనర్థం ఉంది. వర్తమాన వ్యవస్థలో భారత జాతిని ఎదగనివ్వకుండా మరుగుజ్జుల్ని చేసే ప్రమాదం జరిగిపోతోంది. మనం జీవించినన్నాళ్ళు ఒక న్యూనతా వాతావరణంలో గడపాలి. మనలో మహోన్నతుడు కూడా తలవంచాలి. మన పురుషత్వం ఎదగగలిగిన హాటి సంపూర్ణ ఔన్నత్యాన్ని ఈ వ్యవస్థలో ఎన్నటికీ సాధించలేం. ప్రతి స్వయం పాలిత ప్రజ పొందే నైతిక గౌరవానుభూతి మనకు కలగదు. మన పరిపాలనా ప్రతిభ, మన సైనిక శక్తి యుక్తులు ఉపయోగపర్చుకునే మార్గంలేక క్రమేణా వాడి వత్తలై పోక తప్పదు. చివరికి మన బ్రతుకు మన స్వంతదేశంలోనే కట్టెలు కొట్టేవాళ్ళుగా, నీళ్ళు మోసే వాళ్ళుగా తెల్లవారుతుంది."

కార్యనిర్వాహక శాఖ అధికారాలనుంచి న్యాయశాఖ అధికారాలను వేరుపర్చాలని జాతీయ వాదులు కోరారు. జూరీ సభ్యుల అధికారాల్లో కోతని వాళ్ళు ప్రతిఘటించారు. ప్రజల్ని నిరాయుధుల్ని చేసే చర్యని వాళ్ళు నిరసించారు. ప్రజల్లో విశ్వాసం ఉంచి వాళ్ళకు ఆయుధాలు ధరించే హక్కును ప్రసాదించి, సందర్భం వచ్చినప్పుడు తమని, తమ దేశాన్ని పరిరక్షించుకునే అవకాశం ఉండేలాగు చూడమని వాళ్ళు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు.

జాతీయ వాదులు ప్రభుత్వాన్ని ఇతోధికంగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవలసిందిగా కోరారు. ఇంకా ఈ క్రింది డిమాండ్లను కూడా వారు ప్రభుత్వానికి నివేదించారు:

- ప్రజల్లో ప్రాథమిక విద్యా వ్యాప్తికి ప్రాధాన్యం ఇవ్వాలి,
- సాంకేతిక, ఉన్నత విద్యలకు ఎక్కువ సౌకర్యాలు కలగజేయాలి,
- రైతాంగాన్ని వడ్డీవ్యాపారస్థుల కోరలనుంచి తప్పించడానికి వ్యవసాయ పరపతి బ్యాంకుల్ని అభివృద్ధి చేయాలి,
- దేశాన్ని కరువు కాటకాలనుంచి రక్షించడానికి, వ్యవసాయాభివృద్ధికి నీటిపారుదల సౌకర్యాల విస్తరణకు భారీస్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలి,
- వైద్య, ఆరోగ్య సదుపాయాలు విస్తృతపరచాలి,
- పోలీసు వ్యవస్థను నీతివంతంగా, సమర్థవంతంగా, ప్రజాభిమాన పాత్రంగా తీర్చిదిద్దే చర్యలు తీసుకోవాలి.

పేదరికాన్ని తట్టుకోలేక బ్రతుకుతెరువుకోసం దక్షిణాఫ్రికా, మలయా, మారిషస్, వెస్టిండీస్, బ్రిటిషు, గయానావంటి విదేశాలకు తరలిపోయిన కార్మికుల

తరఫున జాతీయనాయకులు గట్టిగా వాదించారు. చాలా ఇతర దేశాల్లో వాళ్ళు తీవ్రహింసకు, కఠోర జాతి వివక్షకు గురయ్యారు. ముఖ్యంగా దక్షిణాఫ్రికాకి సంబంధించి ఇది నూటికి నూరుపాళ్ళు సత్యం. దక్షిణాఫ్రికాలో భారతీయుల ప్రాథమిక మానవ హక్కుల పరిరక్షణ కోసం మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ ప్రజాపోరాటానికి నాయకత్వం వహించారు.

***పౌర హక్కుల రక్షణ:*** వాక్, పత్రికా స్వాతంత్ర్యాల విలువను పూర్వ జాతీయవాదులు పూర్తిగా గుర్తించారు. వాటిని తగ్గించటానికి జరిగే ప్రయత్నాలను వాళ్ళు ప్రతిఘటించారు. నిజానికి వాక్, పత్రికా స్వాతంత్ర్యాల కోసం పోరాటం స్వాతంత్ర్యంకోసం సాగిన జాతీయ పోరాటంలో అంతర్భాగమైంది. 1897లో బాలగంగాధర తిలక్, ఇంకా తదితర నాయకులు తమ ప్రసంగాలు, రచనల ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లో అవిశ్వాసం రేకెత్తిస్తున్నారనే ఆరోపణమీద బొంబాయి రాష్ట్ర ప్రభుత్వం వారిని విచారించి దీర్ఘకాల కారాగార వాస శిక్ష విధించింది. అదే సమయంలో ఇద్దరు పూనా నాయకులు విచారణలేకుండా దేశంనుంచి బహిష్కరించబడ్డారు. ఈ దాడికి వ్యతిరేకంగా దేశం మొత్తం ఉడుకెత్తి పోయింది. అప్పటివరకు మహారాష్ట్రలో మాత్రమే ప్రసిద్ధుడైన తిలక్ రాత్రికి రాత్రి అఖిలభారత నాయకుడైపోయాడు. అమృత్‌బజార్ పత్రిక ఆయన నిర్బంధాన్ని గురించి ఇలా రాసింది: " ఈ విశాల దేశంలో తిలక్‌ను గురించి నిర్వేదంతో చర్చించని గృహమంటూలేదు. ఆయన కారాగార శిక్షని తమకు వ్యక్తిగతంగా వాటిల్లిన విపత్తుగా భావించని కుటుంబం లేదు". తిలక్ నిర్బంధం దేశంమొత్తాన్ని ఉద్రేకంతో ఊపివేసింది. జాతీయోద్యమంలో ఒక నూతన దశకు నాంది పలికింది.

***రాజకీయ కార్యపద్ధతులు:*** జాతీయోద్యమంలో 1905 వరకు మితవాదులని తరచు అభివర్ణించబడ్డ నాయకులు ప్రాబల్యం వహించారు. చట్టంయొక్క నాలుగుగోడల మధ్య రాజ్యాంగబద్ధమైన ఆందోళన జరపడం మితవాల రాజకీయ పద్ధతి అని క్లుప్తంగా చెప్పవచ్చు. నెమ్మదిగా, క్రమబద్ధంగా రాజకీయ ప్రగతి సాధించడం వాళ్ళు ఎన్నుకున్న పద్ధతి. దేశంలో ప్రజాభిప్రాయాన్ని కూడగట్టి, ప్రజల కోర్కెలి మహాజర్లు, సభలు తీర్మానాలు, ప్రసంగాల ద్వారా ప్రభుత్వానికి నివేదించినట్లయితే, అధికార్లు క్రమంగా ఆ కోర్కెల్ని ఆమోదిస్తారని మితవాదుల విశ్వాసం.

కాబట్టి వాళ్ళ రాజకీయ కృషి రెండు దిశల్లో సాగింది. ఒకటి-ప్రజల్లో జాతీయతాభావాన్ని, రాజకీయ చైతన్యాన్ని ఉద్దీప్తం చెయ్యటానికి భారతదేశంలో ఒక పటుతరమైన ప్రజాభిప్రాయాన్ని కూడ గట్టాలి. రాజకీయ సమస్యలపైన ప్రజానీకాన్ని విజ్ఞానవంతుల్ని చేసి, ఒక త్రాటిమీద నడింపించాలి. మౌలికంగా జాతీయ కాంగ్రెస్ తీర్మానాలు, విజ్ఞాపనలు సైతం ఈ గమ్యం దిక్కుగానే సాగాయి. రెండు - జాతీయవాదులు నిర్దేశించిన మార్గంలో సంస్కరణలు ప్రవేశ పెట్టమని ప్రభుత్వానికి నచ్చచెప్పాలి. బ్రిటిషు ప్రజలకు, పార్లమెంటుకు భారతదేశంపట్ల న్యాయబద్ధంగా వ్యవహరించాలనే కాంక్ష ఉందని మితవాద జాతీయ నాయకులు భావించారు. అయితే వాళ్ళకు భారతదేశంలోని వాస్తవ పరిస్థితులు తెలియవని మితవాదుల విశ్వాసం. కాబట్టి, స్వదేశంలో ప్రజాభిప్రాయన్ని చైతన్యవంతంచేసే

కార్యక్రమం తరువాత బ్రిటిష్ ప్రజలకు కనువిప్పు కలుగజేసేందుకు మితవాదులు కృషి చేశారు. అది సాధించేందుకు వారు బ్రిటన్‌లో చురుగ్గా ప్రచార కార్యక్రమం కొనసాగించారు. భారతీయ దృక్పథాన్ని ప్రచారంచేసేందుకు ప్రముఖ భారతీయులతో కూడిన ఒక ప్రతినిధివర్గాన్ని బ్రిటన్‌కు పంపారు. 1889లో భారత జాతీయ కాంగ్రెస్ తరఫున బ్రిటిషుకమిటీ అవతరించింది ఈ కమిటీ 1890లో "ఇండియా" అనే ఒక పత్రికను ప్రారంభించింది. దాదాభాయ్ నౌరోజీ తన జీవితంలో విశేషకాలాన్ని, తన రాబడిలో అధికభాగాన్ని ఇంగ్లండులో బ్రిటిష్ ప్రజలకు భారత పక్షం వాదాన్ని నచ్చజెప్పే ప్రచార కృషికే వెచ్చించారు.

ప్రముఖ మితవాద నాయకులు బ్రిటిష్ పాలనపట్ల విధేయత ప్రకటిస్తూ గొంతెత్తి ఉద్ఘాటించిన ప్రకటనలు చదువుతున్నప్పుడు భారత చరిత్ర విద్యార్థికి కొన్ని సమయాల్లో గందరగోళం కలుగుతుంది ఆ ప్రకటనలనుబట్టి వాళ్ళు నిజమైన దేశభక్తులు కారనిగానీ, వాళ్ళు పిరికివాళ్ళని గానీ అర్థం కాదు. ఆ చారిత్రక దశలో బ్రిటన్‌తో మన రాజకీయానుబంధం కొనసాగడం మనదేశానికే ప్రయోజన కరమని వాళ్ళు నిజంగా నమ్మారు. అంచేత, వాళ్ళు బ్రిటిషు వాళ్ళని భారతదేశం నుంచి వెళ్ళ గొట్టటానికి పథకాలు రూపొందించలేదు బ్రిటిషు పాలనని జాతీయపాలనకి సరిసమానంగా ఉండేటట్లుగా మార్చాలని యోచించారు. ఆ తరువాత క్రమంగా వాళ్ళు బ్రిటిషు పాలనవలని దుష్పరిణామాల్ని గ్రహించాక, సంస్కరణల విషయంలో జాతీయవాదుల కోర్కెల్ని ప్రభుత్వం నిరాకరించాక వాళ్ళలో చాలామంది బ్రిటిషు పరిపాలన పట్ల విశ్వాసం ప్రకటించడం విరమించుకున్నారు. భారతదేశానికి స్వపరిపాలన ఇవ్వాలని డిమాండ్ చేశారు. విదేశ పాలకులకు వ్యతిరేకంగా ప్రత్యక్షంగా సవాలు విసరటానికి కాలం అప్పటికింకా పరిపక్వం కాలేదని విశ్వసించడంచేత వాళ్ళలో అనేకమంది మితవాదులయ్యారు.

అప్పటి జాతీయవాదులంతా మితవాద వైఖరికి చెందినవాళ్ళు కాదని మనం గుర్తు పెట్టుకోవాలి. వాళ్ళలో కొందరికి మొట్టమొదటి నుంచి కూడా బ్రిటిషువాళ్ళ సదుద్దేశాల పట్ల విశ్వాసం లేదు. భారత ప్రజల రాజకీయ కార్యాచరణమీద, భారత ప్రజాబలం మీద ఆధారపడాలని వాళ్ళు నమ్మారు ఒక సమరశీల రాజకీయ, ఆర్థిక కార్యక్రమానికి అనుకూలంగా వాదించారు. బాలగంగాధర తిలక్, ఇంకా లెక్కలేనంత మంది రాజకీయనాయకులు, పత్రికా సంపాదకులు ఇదే ధోరణిని ప్రతిబింబించారు. వీరినే తరువాత అతివాదులనీ, జాతీయ తీవ్ర వాదులనీ వ్యవహరించారు. వారి కృషిని, దృక్పథాన్ని గురించి తరువాత అధ్యాయంలో చర్చించబడింది.

**ప్రభుత్వ వైఖరి:** బ్రిటిషు అధికార్లు మొట్టమొదటి నుంచి కూడా ఎక్కివచ్చే జాతీయోద్యమం పట్ల శత్రుభావంతోనే ఉన్నారు. జాతీయ కాంగ్రెసును అనుమాన దృష్టితోనే చూశారు. ఆ అధికారుల్లో డఫ్రిన్ మొదలుకొని కిందిదాకా అందరూ జాతీయనాయకుల మీద "ప్రభుత్వంపైన విశ్వాసం లేని బాబు"లనీ "రాజద్రోహపూరిత బ్రాహ్మ"లనీ, "తీవ్ర దుర్మార్గుల"నీ, ముద్రవేసింది. అయితే మొదట్లో వాళ్ళు తమ శత్రుత్వాన్ని బాహాటంగా వెళ్ళగక్కలేదు. హ్యూమ్ నాయకత్వం భారత జాతీయోద్యమాన్నీ, దాని సంస్థ అయిన జాతీయ కాంగ్రెస్‌నీ బ్రిటిష్ పాలనకు హానికరంగా రూపొందించదని బహుశా వాళ్ళు భావించి వుండవచ్చు. 1886

డిశంబర్‌లో భారత వైస్రాయి అంతటివాడు జాతీయ కాంగ్రెస్ ప్రతినిధులను వన భోజనానికి ఆహ్వానించాడు. కాని, జాతీయ కాంగ్రెస్ సంస్థ బ్రిటీషు అధికారులకు పనిముట్టుగా ఉపయోగపడదనేది అనతికాలంలోనే విస్పష్టమైంది. భారత జాతీయాభిమాన ఉజ్వల కాంతుల్ని వెలార్చే కేంద్ర సంస్థగా అది క్రమేణా పరిణతి చెందుతున్నట్లు అర్థమైంది. దాంతో బ్రిటిష్ అధికార్లు జాతీయ కాంగ్రెస్‌నీ, తదితర జాతీయోద్యమ నాయకుల్ని బాహాటంగా విమర్శించటం మొదలు పెట్టారు. డఫ్రిన్ 1887 లో ఒక బహిరంగ ప్రసంగంలో జాతీయ కాంగ్రెస్ " ప్రజా రాశిలో ఒక నలుస"ని గేలిచేశాడు. లార్డ్ కర్జన్ భారత రాజ్యకార్య దర్శికి 1900 లో రాసిన ఒక లేఖలో "కాంగ్రెస్ పడిపోవడానికి సిద్ధంగా వుంది. నేను భారతదేశంలో ఉండగానే అది ప్రశాంతంగా కన్ను మూయటానికి సహాయపడాలని నా కోరిక" అని వెల్లడించాడు. బ్రిటీషు అధికార్లు 'విభజించి పాలించే' విధానాన్ని ఇంకా ముందుకు తోశారు. సయ్యద్ అహ్మద్‌ఖాన్,బెనారస్ రాజా శివప్రసాద్, ఇంకా ఇతర బ్రిటిషు అనుకూల ప్రముఖుల చేత కాంగ్రెస్ వ్యతిరేక ఉద్యమాన్ని మొదలు పెట్టించటానికి బ్రిటిషు అధికార్లు ప్రయత్నం చేశారు. కాని, జాతీయోద్యమ వికాసాన్ని అరికట్టడంలో అధికార్ల ప్రతిఘటన పనిచెయ్యలేదు.

***తొలి జాతీయోద్యమం మదింపు:*** జాతీయోద్యమంగానీ, జాతీయ కాంగ్రెస్‌గానీ ప్రారంభ దశలో అట్టే సాధించిందేమీలేదని కొందరు విమర్శకుల భావన జాతీయవాదులు ఆందోళన జరిపిన సంస్కరణల్లో అతి కొద్దింటినే బ్రిటిషు ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆ దశలో జాతీయోద్యమం ప్రజల్లో వేళ్లూనలేదని కూడా విమర్శకులు ఆరోపించారు.

ఈ విమర్శలో చాలా నిజం ఉంది. కాని, తొలి జాతీయోద్యమం ఒక వైఫల్యం అని చెప్పటం మాత్రం సరికాదు. జాతిని మేల్కొల్పడంలో అది విజయవంతమైంది. తామంతా ఒకే జాతికి చెందినవారం, తమది భారతజాతి అనే సంవేదనని ప్రజల్లో రేకెత్తించటంలో అది విజయవంతమైంది. అది ప్రజల్ని రాజకీయ కుశలతలో సుశిక్షితుల్ని చేసింది. జాతీయత, ప్రజాస్వామ్యాలపట్ల ప్రజల్లో అభిమానం పెంపొందించింది. వాళ్ళలో ఆధునిక దృక్పథాన్ని ప్రబోధించింది. బ్రిటిషు పరిపాలన దుష్పరిణామాల్ని వాళ్ళ కళ్ళకుకట్టింది. అన్నిటికన్నా ముఖ్యంగా, అది బ్రిటిషు సామ్రాజ్యవాద ఆర్థికతత్వాన్ని, స్వభావాన్ని ప్రజలచేత గుర్తింపజేసింది. బ్రిటన్ భారతదేశాన్ని ముడిపదార్థాలు సరఫరాచేసే దేశంగా, బ్రిటిషు వస్తువులకు విపణివీధిగా, బ్రిటిషు పెట్టుబడులకు సుక్షేత్రంగా తయారుచేస్తున్నదనే సత్యాన్ని పూర్వజాతీయోద్యమం ప్రజలకు చాటిచెప్పింది. తరువాతి దశలో ప్రజలు విరివిగా ముందుకువచ్చి, రాజకీయ పోరాటాన్ని సాగించటానికి అవసరమైన ఒక ఉమ్మడి రాజకీయ, ఆర్థిక కార్యక్రమాన్ని అది రూపొందించింది. భారత ప్రజల ప్రయోజనాల కోసం భారతదేశ పరిపాలన జరగాలనే రాజకీయ సత్యాన్ని అది ప్రతిష్ఠించింది. భారతీయ జీవనంలో జాతీయతా సమస్యను ప్రబలం చేసింది. దాని బలహీనతల్ని తరువాతి తరాలవారు తొలగించుకోవలసి వుంది. దాని విజయాలు ముందుకాలంలో ఒక పటుతర జాతీయోద్యమ వికాసానికి పునాదిగా వినియోగపడాలి.

# నవభారత వికాసం

## 1858 తరువాత మత, సాంఘిక సంస్కరణ

స్వాతంత్ర్య పోరాటానికి బాటలు పరచిన జాతీయాభిమానం, ప్రజాస్వామ్యాల ఉప్పొంగే తరంగం భారత ప్రజల సామాజిక వ్యవస్థని, మత దృక్పథాన్ని సంస్కరించడానికి, ప్రజాస్వామ్యబద్ధం చేయడానికి పూనుకున్న ఉద్యమాల్ని కూడా ప్రభావితం చేసింది. నవీన పంథాలో దేశ సమగ్రాభివృద్ధికిగాని, జాతీయ సమైక్యతా వికాసానికిగాని, సాంఘిక, మత సంస్కరణ అత్యవసరమని భారతీయుల్లో చాలామంది గ్రహించారు. జాతీయ భావనా వికాసం, నూతన ఆర్థికశక్తుల ఆవిర్భావం, ఆధునిక పాశ్చాత్య విచార, సంస్కృతుల ప్రభావం, విద్యావ్యాప్తి, ప్రపంచ పరిస్థితి గురించి ఇతోధిక స్పృహ మొదలైనవి భారతీయ సమాజానికి, దాని వెనుకబాటుతనం గురించి, హీనస్థితిని గురించి చైతన్యం పెంచటమే కాకుండా సంస్కరణ సంకల్పాన్ని మరింత దృఢతరం చేశాయి. ఉదాహరణకు కేశవ్ చంద్రసేన్ భారతీయ సమాజ దీన, హీన స్థితిని ఇలా వర్ణించారు:

"నేడు మనం చుట్టూరా ఒక పతితజాతిని చూస్తున్నాం. ఆ జాతి ప్రాచీన ఔన్నత్యం శిథిలాలలో మరుగుపడిపోయింది. ఆ జాతి సాహిత్యం, శాస్త్రాలు, దాని ధర్మసూత్రాలు, తత్వశాస్త్రం, దాని పరిశ్రమలు, వాణిజ్యం, దాని సామాజిక సౌభాగ్యం, గార్హస్థ్య నిరాడంబరత్వం, మాధుర్యం అన్నీ గతించిపోయిన వాటితో లెక్క. మనచుట్టూ పరచుకున్న దుఃఖభాజనమైన, విషణ్ణపూరితమైన దృశ్యాన్ని, ఆధ్యాత్మికంగా సామాజికంగా, మేథాసంబంధంగా చివికి జీర్ణించిపోయిన నిరామయ దృశ్యాన్ని పర్యేక్షణచేస్తూ, అందులో కాళిదాస కవీంద్రుని కన్నభూమిని, కావ్యశాస్త్రాలు పరిమళించిన కమనీయ సీమని, నాగరికతా స్వర్గసీమని కనుగొనాలని విఫలయత్నం చేస్తాం".

అదేవిధంగా స్వామి వివేకానందుడు భారతప్రజల దయనీయ పరిస్థితిని ఇలా వర్ణించారు:

"చిక్కి శల్యమైపోయిన యువక, వృద్ధ ఆకారాలు చింపిరి బట్టల్లో అటూ ఇటూ తిరుగుతూ సాక్షాత్కరిస్తాయి. వాళ్ళ ముఖాలమీద శతాబ్దాల నైరాశ్యం, దారిద్ర్యం దాళ్ళు గీశాయి. ప్రతిచోటా సర్వ సాధారణంగా కనుపించే పశువుల కళ్ళలో సైతం అదే విషణ్ణదృష్టి... మనుషుల మారిదే కృశించిపోయిన ఆకారాలు... రోడ్డు పక్క దుమ్ములో, చెత్తలో, ఉచ్చిష్టంలో..... ఇదీ మన వర్తమాన భారతదేశం! మేడల నీడల్లో పాడుబడ్డ గుడిసెలు, దేవాలయాల్ని ఆనుకుని చెత్త గుట్టలు, కళ్ళు మిరుమిట్లు గొలిపే దుస్తులు ధరించి వెడలే సంపన్నుల పరసన కౌపీనం మాత్రమే ధరించి పడిచే

సన్యాసులు, వడ్డించిన విస్తరిలాంటి జీవితాలు అనుభవించే వారివంక, సుష్టుగా భోంచేసి త్రేన్చేవారికేసి ఆకలిజీవులు గాజుకళ్ళతో చూసే దీనమైన చూపు- ఇదీ మన కన్నభూమి! జన్మభూమి! ప్లేగు, కలరా రోగాల విశృంఖల విహారంలో జరిగిన దారుణవిధ్వంసం. జాతి ఆయువుపట్టుని పట్టి పల్లార్చే మలేరియా. అలవాటుగా మారిపోయిన వస్తులు, అర్ధాకలి. మృత్యువులాంటి కరువురాక్షసి కరాళనృత్యం- వీటి మధ్య ఆకారాన్నిబట్టి మాత్రమే మనుషులనిపించే 30 కోట్ల జీవాల ఉంద; తమ జాతి ప్రజలచేతా, పరాయి జాతులచేతా అట్టడుగుకు తొక్కబడి, బ్రతుకు నాశనమైపోయిన జీవాలు, వాళ్ళకి ఏ ఆశాలేదు, ఏ గతమూలేదు, ఏ భవిష్యత్తూ లేదు...

బానిసకిమాత్రమే తగివుండే ద్వేషస్వభావం వాళ్ళని ఆవరించింది. సాటివాని ఆస్తి చూసి సహించలేరు వాళ్ళు. బలవంతుల పాదాలకంటిన దుమ్ముని నాకుతారు. దాంతోపాటు బలహీనుల్ని చావుదెబ్బ కొడతారు. బలహీనులకు, భవిష్యత్తు మీద ఆశలేని వాళ్ళకు, నైతికంగా వెన్నెముకలేని వాళ్ళకు సహజంగా కలిగే క్రూర, వికార మూఢవిశ్వాసాలు నిండి పండిపోయాయి. ఇటువంటి 30 కోట్ల జీవాలు భారతదేశం మీద ముసురుకుంటున్నాయి... కుళ్ళి కంపు కొట్టే కళేబరం మీద పురుగులు మూగినట్టు ఇదీ మనకు సంబంధించిన మన దృశ్యం- సహజంగా ఇంగ్లీషు అధికారి కళ్ళకు కనబడేదీ ఇదే దృశ్యం!"

ఆ విధంగా, 1858 తరువాత తొలి సంస్కరణాభిలాష విస్తృతి సంతరించుకొంది. రాజారామ మోహన్‌రాయ్, పండిత విద్యాసాగర్ వంటి తొలి సంస్కర్తల కృషిని తరువాత తలెత్తిన ప్రముఖ మత, సాంఘిక సంస్కరణోద్యమాలు ఇంకా ముందుకు తీసుకుపోయాయి.

**మత సంస్కరణ:** శాస్త్రవిజ్ఞానం, ప్రజాస్వామ్యం, జాతీయవాదం ప్రాబల్యం వహించిన ఆధునిక ప్రపంచపు అపేక్షలకు అనుగుణంగా తమ సమాజాన్ని మలచుకోవాలనే కాంక్షతో, తమ మార్గంలో అడ్డంకులేవీ తలెత్తనివ్వకూడదనే దృఢసంకల్పంతో ఆలోచనాపరులైన భారతీయులు కొందరు తమ సాంప్రదాయక మతాలను సంస్కరించటానికి సన్నద్ధులయ్యారు. తమ మత ప్రాతిపదికలకు బద్ధులై ఉంటూనే, వాళ్ళు వాటికి భారత ప్రజల నూతన అవసరాలకు తగినట్టుగా కొత్తరూపు దిద్దారు.

**బ్రహ్మసమాజం:** రాజారామ మోహన్‌రాయ్ స్థాపించిన బ్రహ్మసమాజ సంప్రదాయాన్ని 1843 తరువాత దేవేంద్రనాథ టాగోరు, 1866 తరువాత కేశవచంద్రసేన్ ముందుకు తీసుకుపోయారు. వేదాలలో చెప్పిందంతా సర్వ నిర్దుష్టమనే సిద్ధాంతాన్ని దేవేంద్రనాథ్ టాగోరు త్రోసివేశారు. ఏకేశ్వరోపాసనమీదా, వేదోపనిషత్తులలో ప్రవచించబడ్డ ప్రబోధాల మీదా ఆధారపడి, ఆధునిక పాశ్చాత్య విచారధారలోని ఉత్తమాంశాల్ని స్వీకరించి బ్రహ్మసమాజం హిందూమతాన్ని సంస్కరించడానికి కృషిచేసింది. అన్నిటికన్నా ఎక్కువగా అది మానవుని హేతుబుద్ధి మీద ఆధారపడింది. గత, వర్తమాన మత సూత్రాలు ఆచారాలలో ఏది అనుసరించదగింది, ఏది తిరస్కరించదగింది అని నిర్ణయించే అంతిమ ప్రమాణం మానవుని హేతు విచార బుద్ధి కాబట్టి, బ్రహ్మసమాజం మత గ్రంథాలకు అర్థవివరణ ఇచ్చే పురోహితవర్గం యొక్క అవసరంలేదు పొమ్మంది. ఒక మతగ్రంథంలోగానీ, ధర్మంలోగానీ ఏది మంచో ఏది చెడో

ప్రతివ్యక్తి స్వీయ బుద్ధిబలంతో నిర్ణయించుకోగలడు. అతనికా హక్కు, సామర్థ్యం ఉన్నాయి. ఆ విధంగా బ్రహ్మసమాజం వారు విగ్రహారాధనకు, మూఢాచారాలకు, మత సంస్కారాలకు– ఆ మాటకొస్తే సమస్త బ్రాహ్మణ వ్యవస్థకు మౌలికంగా వ్యతిరేకులు. పురోహితుల మధ్యవర్తిత్వం లేకుండా వాళ్ళు ఏకేశ్వరోపాసన చేసుకోవచ్చు.

బ్రహ్మసమాజికులు గొప్ప సంఘసంస్కర్తలు కూడా. వాళ్ళు కులవ్యవస్థనీ, బాల్య వివాహాల్ని క్రియాశీలంగా ప్రతిఘటించారు. వితంతు పునర్వివాహంతో సహా స్త్రీ సముద్ధరణని బలపర్చారు. స్త్రీ పురుషులందర్లో ఆధునిక విద్యావ్యాప్తిని ప్రోత్సహించారు.

బ్రహ్మసమాజం 19వ శతాబ్ది ఉత్తరార్ధంలో అంతర్గత విభేధాల మూలంగా బలహీనపడింది. పైపెచ్చు, దాని పలుకుబడి పట్టణ విద్యాధిక వర్గాలమేరకే పరిమితమైపోయింది. అయినప్పటికీ, 19వ, 20వ శతాబ్దాలలో బెంగాల్, ఇంకా మిగతా భారతదేశ మేధో, సంమాజిక, సాంస్కృతిక, రాజకీయ జీవితంమీద దాని నిర్ణాయక ప్రభావ ముద్రపడింది.

*మహారాష్ట్రలో మతసంస్కరణం:* బొంబాయిలో మొట్టమొదట 1840లో పరమహంస మండలి మత సంస్కరణకు శ్రీకారం చుట్టింది. విగ్రహారాధనకు, వర్ణవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడ్డం ఆ సంస్థ లక్ష్యాలు. పశ్చిమ భారతంలో తొట్టతొలి సంఘసంస్కర్త బహుశా గోపాల్ హరి దేశ్‌ముఖ్ కావచ్చు. ఆయన "లోకహితవాది" అని ప్రజల్లో వాడుకపడ్డారు. ఆయన మరాఠీ భాషలో రచనలు చేశాడు. తన రచనల్లో ఆయన హిందూ సనాతనత్వంమీద హేతువాద పూరితమైన దాడి చేశాడు. మత, సామాజిక సమానతను ప్రబోధించాడు. ఉదాహరణకు ఆయన 1840 ప్రాంతంలో ఇలా రాశాడు:

"ఈ పురోహితులున్నారే, మహా అపవిత్రులు. అర్థం తెలాయకుండా వీళ్ళు మంత్రాలు పదే పదే వల్లిస్తారు. జ్ఞానాన్ని నీచంగా పునరుక్తిమయంగా దిగజార్చారు. ఇక పండితులు పురోహితులకన్నా భ్రష్టులు. ఎంచేతనంటే వాళ్ళు ఇంకా అజ్ఞానులు. పైగా అహంకారులు కూడాను... బ్రాహ్మలంటే ఎవరు ? వి విషయాల్లో వాళ్ళు మాకంటే భిన్నమైనవాళ్ళు? వాళ్ళకేమైనా ఇరవై చేతులున్నాయా ? మాలో ఏదైనా లోపించిందా ? ఇటువంటి ప్రశ్నలడుగుతున్న ఈనాడు, బ్రాహ్మణులు తమ తెలివి తక్కువ భావనలను విడిచిపెట్టాలి. మానవులంతా సమానమే అనివాళ్ళు అంగీకరించాలి. ప్రతి ఒక్కరికి జ్ఞానాన్ని సంపాదించే హక్కు ఉందని వాళ్ళు ఆమోదించాలి."

ఆ తరువాత, హిందూ మత విచారాన్నీ, ఆచరణనీ, ఆధునిక విజ్ఞానం వెలుగులో సంస్కరించే లక్ష్యంతో ప్రార్థనా సమాజం ప్రారంభమైంది. ఆ సమాజం ఏకేశ్వరోపాసనని బోధించింది. కుల ఛాందసం నుంచి, పురోహితవర్గ పెత్తనం నుంచి మతానికి విముక్తి కలిగించటానికి ప్రయత్నం చేసింది. సుప్రసిద్ధ సంస్కృత పండితుడు, చరిత్రకారుడు అయిన ఆర్.జి.భండార్కర్, మహాదేవ్ గోవిందరానడే (1842-1901) ప్రార్థనా సమాజంలో మహారథులు. అది బ్రహ్మ సమాజం పలుకుబడికి బలంగా లోనైంది. దాని కార్యకలాపాలు తెలుగు సంస్కర్త వీరేశలింగం పంతులుగారి కృషివల్ల దక్షిణ భారతదేశంలో కూడా విస్తరించాయి. ఆధునిక భారతదేశంలో

హేతువాద మహావేత్తలలో ఒకరైన గోపాల్ గణేశ్ అగర్కర్ అదే కాలంలో మహారాష్ట్రలో జీవించాడు. సంప్రదాయంమీద గుడ్డి నమ్మకాన్ని, భారతదేశ గతాన్ని గురించి మిధ్యాస్తోత్రం చేయడాన్ని ఆయన నిశితంగా దుయ్యబట్టాడు.

*రామకృష్ణ పరమహంస, వివేకానందుడు:* రామకృష్ణ పరమహంస (1834-1886) ఒక యోగి. సర్వసంగ పరిత్యాగం, ధ్యానం, భక్తి అనే సాంప్రదాయక మార్గాలలో ఆయన ముక్తిగామి అయ్యాడు. భగవత్ సాక్షాత్కార హేతుభూతమైన బ్రహ్మవిద్యాన్వేషణలో ఆయన క్రైస్తవ, మహమ్మదీయాది ఇతర యోగులతో కొంతకాలం గడిపాడు. భగవంతుడ్ని చేరడానికి అనేక మార్గాలున్నాయి. అన్ని మతాలూ భిన్న మార్గాల ద్వారా భగవంతుని దగ్గరకేచేరతాయి. అన్నీ పరమార్థ ప్రాప్తిమార్గాలే, మానవ సేవే మాధవసేవ. మానవుడు దేవుని మూర్తి అని ఆయన ఉపదేశించాడు.

రామకృష్ణ పరమహంస మేటిశిష్యుడు స్వామి వివేకానంద (1863-1902) తన గురూపదేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళాడు. పరమహంస సందేశాన్ని ఆయన సమకాలీన భారతీయ సమాజావసరాల కనుగుణంగా రూపొందిచాడు. అన్నిటికన్నా స్వామి వివేకానంద సామాజిక కార్యాచరణకి ప్రాధాన్యం ఇచ్చారు. మనం జీవించే ఈ ప్రపంచంలో ఆచరణతో మేళవించని జ్ఞానం పనికిమాలినదని ఆయన స్పష్టం చేశాడు. తన గురువులాగే వివేకానందుడు కూడా సర్వమత ఏకత్వాన్ని ఉద్ఘాటించాడు. మతవిషయాలలో సంకుచితత్వాన్ని ఖండించాడు. "మన మాతృదేశానికి హిందూ-ఇస్లాం మహా వ్యవస్థల కూడలి ఏకైక ఆశాకిరణం" అని ఆయన 1898లో రాశాడు. అలాగే, ఆయన భారతీయ తత్వ సంప్రదాయ ఉత్కృష్ట పృథక్పథాన్ని విశ్వసించాడు. వేదాంతం పరిపూర్ణ తర్కబద్ధమైన సంవిధానమని ప్రకటించాడు. స్వయంగా దాన్ని వృద్ధి చేశాడు.

భారతీయులు మిగతా ప్రపంచంతో సంబంధం లేకుండా మడికట్టుకుని కూర్చుని, నిలవనీరులాగా కుళ్ళిపోయి ఎదుగుదల లేకుండా శుష్కించి పోయినపరిస్థితిని ఆయన విమర్శించాడు. "మనం ప్రపంచంలోని ఇతర జాతులతో సంబంధం పెట్టుకోకుండా వేరుపడిపోవటమే మన దౌర్భాగ్యానికి కారణం, మనం మళ్ళీ మిగతా ప్రపంచపు వెల్లువలో కలవటమే తరుణోపాయం. చలనం లేదా గతి జీవన సంకేతం" అని ఆయన రాశాడు.

వివేకానందుడు కులవ్యవస్థని ఖండించాడు. మత సంస్కారాలు, కర్మలు, మూఢనమ్మకాలకు హిందువులిచ్చే ప్రాధాన్యాన్ని ఆయన విరసించాడు. స్వేచ్ఛ, సమభావం, స్వతంత్రాలోచనల చైతన్యాన్ని అలవర్చుకోమని ఆయన ప్రజలకు ఉద్బోధించారు.

"మన మతం వంటింట్లోకి జరిగిపోయే ప్రమాదం ఉంది. మనలో చాలామందిమి వైదాంతికులమూ కాదు. పౌరాణికులం అంతకన్నా కాదు. తాంత్రికులం అసలేకాదు. మనం కేవలం 'ముట్టుకోకండని మూలకి జరిగిపోయేవాళ్ళం'. మన మతం వంటింట్లో కూర్చుంది. మన దేవుడు కూటి కుండలో ఉన్నాడు. నన్ను ముట్టుకోకండి, నేను పవిత్రురాలినిన అంటోంది మనమతం. ఇదిలా మరో వంద ఏళ్ళు సాగితే, మనలో ప్రతి ఒక్కరూ పిచ్చాసుపత్రిలో ఉంటారు" అని స్వామి వివేకానంద మహావాడిగా మాట్లాడాడు.

భావస్వాతంత్ర్యాన్ని గురించి ఆయనిలా అన్నాడు: "ఆలోచనలో,

కార్యాచరణలో స్వాతంత్ర్యం జీవితానికి, వికాసానికి, సంక్షేమానికి తప్పనిసరి. ఆ స్వేచ్ఛ లేని చోట మనిషి, జాతి పతనం కాకతప్పదు."

తన గురువులాగే వివేకానందుడు కూడా మహా మానవతావాది. తనదేశంలోని సామాన్య ప్రజల పేదరికాన్ని, దైన్యాన్ని, బాధల్ని చూసి చలించిపోయాడు. "అన్ని జాతుల్లో ఉన్న పేదలే నేను విశ్వసించే ఏకైక దైవం" అన్నాడాయన. విద్యావంతులైన తన దేశస్థుల్ని ఉద్దేశించి ఆయనింకా ఇలా అన్నారు:

"కోట్లాది ప్రజలు ఆకలిలో, అజ్ఞానంలో జీవిస్తున్నంత కాలం ప్రతివాణ్ణి దేశద్రోహిగా నిలబెడ్తాను. ఆ ప్రజల కష్టంమీద చదువుకొని, వాళ్ళ గోడు పట్టించుకోని వాళ్ళంతా ద్రోహులే".

మానవ బాధానివారణకు సహాయం చెయ్యటం కోసం, సమాజసేవ చెయ్యటంకోసం వివేకానందుడు 1896లో శ్రీరామకృష్ణ మఠాన్ని స్థాపించాడు. దేశంలో పలు ప్రాంతాలలో ఈ సంస్థ శాఖోపశాఖలుగా అల్లుకున్నది. విద్యాలయాలు, వైద్యశాలలు, అనాథ శరణాలయాలు, గ్రంథాలయాలు మొదలైన అనేక సేవాసంస్థల్ని స్థాపించి రామకృష్ణమఠం సమాజ సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తోంది. వ్యక్తిగత మోక్షం కాకుండా సంఘం మంచి, సాంఘిక సేవా ఆదర్శంగా ఈ సంస్థ పనిచేస్తోంది.

*స్వామి దయానంద–ఆర్య సమాజం:* ఉత్తర భారతదేశంలో హిందూమతాన్ని సంస్కరించే కర్తవ్యాన్ని ఆర్యసమాజం చేపట్టింది. స్వామి దయానంద సరస్వతి (1824-1883) ఆర్యసమాజాన్ని 1875లో స్థాపించాడు. స్వార్థపరులు, అజ్ఞానులు అయిన పురోహితులు తప్పుడు బోధల్తో నిండిన పురాణాల ప్రమాణంతో హిందూమతాన్ని పెడత్రోవపట్టించారని స్వామి దయానందుని విశ్వాసం. స్వీయ ఉత్తేజంకోసం ఆయన వేదాల్ని అధ్యయనం చేశారు. అవి సర్వ నిర్దుష్టాలుగా, అపౌరుషేయాలుగా ఆయనకు తోచాయి. అవి సమస్త జ్ఞానానికి ఉత్పత్తి స్థానంగా ఆయన భావించాడు. వైదిక ధర్మాలకు విరుద్ధంగా వేదం తరువాత వెలువడ్డ విచారధారని ఆయన నిరాకరించాడు. వేదాలమీదనే ఆయన సంపూర్ణంగా ఆధారపడ్డం, వేద ధర్మమే ధర్మమని, సర్వప్రామాణికమని ఆయన అచంచలంగా విశ్వసించడం వీటివల్ల ఆయన బోధలు సనాతన ఛాయలు సంతరించుకున్నాయి. వేదాలలో చెప్పినది యావత్తు పరిపూర్ణంగా నిర్దుష్టమని ఆయన చెప్పడంలోని అంతరార్థమేమంటే, మానవుని హేతుబుద్ధి అంతిమ నిర్ణాయక ప్రతినిధిగా ఉండరాదు. అయినప్పటికీ, ఆయన వైఖరిలో ఒక తార్కికాంశ ఉంది. వేదాలు దైవశక్తి మూలకంగా ఉదయించిన జ్ఞానమైనప్పటికీ వాటికి తనే, ఇతరులో అర్థ వివరణ చెప్పాలి. తాను, ఇతర్లు కూడా కేవలం మానవమాత్రులే. ఆ విధంగా వ్యక్తిగత హేతు విచారం నిర్ణయాత్మక కారణాంశం అయింది. ప్రతి మనిషికి వేరుగా భగవంతుణ్ణి తెలుసుకునే హక్కు వుందని ఆయన నమ్మాడు. పైగా, హిందూ సనాతన ధర్మాన్ని బలపర్చడానికి బదులుగా ఆయన దానిమీద తిరుగుబాటు ధ్వజమెత్తాడు. వేదాలకు ఆయన స్వంతంగా ఇచ్చిన అర్థవివరణలను బట్టి రూపొందించిన బోధలు ఇతర భారతీయ సంస్కర్తలు ప్రతిపాదించిన మత, సామాజిక సంస్కరణలతో చిత్రంగా సరిపోతాయి. ఆయన విగ్రహారాధనకి వ్యతిరేకి. మతసంస్కారాలకు, పూజాపునస్కారాలకు, పురోహితవర్గానికి ఆయన వ్యతిరేకి. బ్రాహ్మణులు బోధించిన కులాచారాలకు, ప్రజల్లో విరివిగా వ్యాప్తమైవున్న హైందవ

సిద్ధాంతానికి ఆయన వ్యతిరేకి. ఈ వాస్తవ ప్రపంచంలో జీవిస్తూ మానవులెదుర్కొనే సమస్యలపైన ఆయన తన దృష్టి మళ్లించాడు. పరలోకాన్ని నమ్మే సాంప్రదాయక నమ్మకాలకేసి ఆయన మొహం తిప్పుకున్నాడు. పాశ్చాత్య విజ్ఞాన శాస్త్రాధ్యయనానికి ఆయన సుముఖుడు. దయానంద సరస్వతి సమకాలపు మత, సామాజిక సంస్కర్తలైన కేశవచంద్రసేన్, విద్యాసాగర్, జస్టిస్ రానడే, గోపాల్ హరిదేశ్‌ముఖ్ ప్రభృతుల్ని కలిసి, వారితో చర్చలు జరపడం విశేషం. ఆర్యసామాజికులంతా ప్రతి ఆదివారంనాడు సమావేశం కావాలనే ఆలోచన బ్రహ్మసమాజం, ప్రార్థనా సమాజం అనుసరించిన ఆచారాన్ని జ్ఞప్తికి తెస్తుంది.

స్వామి దయానంద అనుచరులు కొందరు తరువాత దేశమంతటా అనేక పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించి పాశ్చాత్య పంథాలో విద్యావ్యాప్తికి కృషిచేశారు. ఈ కృషిలో లాలాహన్స్ రాజ్ ప్రముఖ పాత్ర నిర్వహించాడు. 1902 లో స్వామి శ్రద్ధానంద హరిద్వార్ సమీపంలో ఒక గురుకులాన్ని స్థాపించి సనాతన సంప్రదాయబద్ధమైన విద్యా ప్రచారం కావించాడు.

ఆర్య సామాజికులు బహుగట్టి సంఘ సంస్కరణవాదులు. స్త్రీ సముద్ధరణకు, స్త్రీ విద్యావ్యాప్తికి, వాళ్లు గట్టి కృషిచేశారు. అస్పృశ్యతని, వంశానుక్రమమైన కఠోర కులవ్యవస్థని వాళ్ళు ప్రతిఘటించారు. ఆ విధంగా వాళ్ళు సాంఘిక సమానత్వాన్ని ప్రచారం చేశారు. సామాజిక సమైక్యతని పెంపొందిచారు. ప్రజలలో ఆత్మగౌరవ భావం, స్వావలంభనా చైతన్యం ఉద్దీప్తం చేశారు. కాని, హిందువులు ఇతర మతాలలోకి ప్రవేశించడాన్ని మాత్రం ఆర్య సామాజికులు తీవ్రంగా నిరోధించారు. హిందువులు అన్యమత ప్రవేశాన్ని అడ్డుకొనటానికి వాళ్ళు ఇతర మతాలమీద ఉధృత ఉద్యమం నడిపారు. ఈ హిందూధర్మ ఉద్యమం 20వ శతాబ్దంలో భారతదేశంలో మతతత్వవ్యాప్తికి దోహదపడింది. ఒకవేపు ఆర్యసామాజికుల సామాజిక సంస్కరణోద్యమ కృషి ప్రజా సమైక్యతాసాధనకి దోహదపడగా, మరోవేపు వారి మతపరమైన కార్యకలాపాలు అనుద్దేశపూర్వకంగానైనా హిందూ, ముస్లిం, పార్శీ, శిక్కు, క్రైస్తవ ప్రజలమధ్య పెరిగే జాతీయ సమైక్యతని చీల్చడానికి దారితీశాయి. భారతదేశంలో జాతీయ సమైక్యత లౌకిక స్వభావం సంతరించుకోవలసి వుందనీ, మతానికి అతీతంగా ఉండవలసిన అవసరం వుందనీ, అప్పుడే అది అన్ని మతాల ప్రజల్నీ తమలో ఇముడ్చుకొంటుందనీ ఒక స్పష్టమైన అవగాహన కలగలేదు.

***దివ్యజ్ఞాన సమాజం (Theosophical Society)***: మదాం బ్లావట్స్కీ, కల్నల్ ఓల్కాట్‌లు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో దివ్యజ్ఞాన సమాజాన్ని మొట్టమొదట స్థాపించారు. ఆ తరువాత వారు భారతదేశం వచ్చి మద్రాసు సమీపంలో అడయారు వద్ద దివ్యజ్ఞాన సమాజం కేంద్ర కార్యాలయాన్ని 1886లో నెలకొల్పారు. అనీబిసెంటు నేతృత్వంలో ఈ సమాజం భారతదేశంలో ఒక ఉద్యమంగా వృద్ధి చెందింది. ఆమె 1893లో భారతదేశం వచ్చారు. దివ్యజ్ఞాన సమాజం ప్రాచీన హిందూ, జొరాస్ట్రియన్, బౌద్ధమతాల పునరుద్ధరణకు, పుష్టికి కృషిచేసింది. ఆత్మదేహాంతర సిద్ధాంతాన్ని వారు నమ్మారు. విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని వారు ప్రచారం చేశారు. మతపునరుద్ధరణ వాదులుగా దివ్యజ్ఞాన సామాజికులు విజయం పొందలేదు. కాని, నవభారత పరిణామాలకు వాళ్లు విలక్షణమైన సేవ చేశారు. భారతీయ మతాలను,

తత్వసంప్రదాయాన్ని ఆకాశానికెత్తటానికి పాశ్చాత్యులు ప్రారంభించిన ఉద్యమం అది. కాబట్టి భారతీయులు ఆత్మ విశ్వాసాన్ని పుంజుకోవటానికి దివ్యజ్ఞాన సమాజం తోడ్పడింది. అయితే, గత ఔన్నత్యంలో మిథ్యాగర్వం కలిగించటానికి కూడా అది దోహదం చేసింది.

అనిబిసెంటు సాధించిన అనేక విజయాల్లో కాశీలో హిందూ కళాశాల స్థాపన ఒకటి. అదే క్రమేణా మదనమోహన మాలవీయ ఆధ్వర్యంలో కాశీ హిందూ విశ్వవిద్యాలయంగా పరిణతి చెందింది.

***సయ్యద్ అహ్మద్ ఖాన్ – అలీఘడ్ ఉద్యమం:*** మహమ్మదీయుల్లో మత సంస్కరణోద్యమాలు కొంత ఆలస్యంగా ఆవిర్భవించాయి. ముస్లిం ఉన్నత వర్గాలవారు పాశ్చాత్య విద్యా సంస్కృతులకు ఎడంగా ఉండిపోయారు. 1857 తిరుగుబాటు తరువాత మాత్రమే మత సంస్కరణోద్యమ నూతన భావాలు వాళ్లలో కూడా పొటమరించ సాగాయి. 1863లో కలకత్తాలో మహమ్మదీయ సాహిత్య సమాజావిర్భావం ఈ దిశలో తొలిమెట్టు. ఈ సమాజం నవీన భావాల వెలుగులో మత, సాంఘిక, రాజకీయ సమస్యల మీద చర్చలు ప్రారంభించింది. ఉన్నత, మధ్య వర్గాల ముస్లిం ప్రజలను పాశ్చాత్య విద్యాభ్యాసానికి ప్రోత్సాహపరిచింది.

ముస్లిములలో సయ్యద్ అహ్మద్‌ఖాన్ (1817-1898) అతి ముఖ్య సంస్కర్త. ఆధునిక శాస్త్రీయ ఆలోచనా విధానం ఆయనని బలంగా ఆకర్షించింది. ఆ ఆలోచనా విధానాన్ని ఇస్లాంతో మేళవింపచేయాలని ఆయన తన జీవితాంతం కృషిచేశారు. కొరాన్ ఒక్కటే ఇస్లాం మతానికి అధికారిక గ్రంథం అని ఆయన ప్రకటిస్తూ తన ఆశయ సాధనకు జాగ్రత్తగా బాటవేసుకున్నాడు. కొరాన్ తరువాత వచ్చిన తదితర ఇస్లామిక రచనలన్నీ తక్కువ ప్రాధాన్యం కలవిగా పరిగణించాడు. కొరాన్‌కి సైతం ఆయన సమకాలీన హేతువాద, విజ్ఞాన శాస్త్రాల వెలుగులో అర్థ వివరణ ఇచ్చాడు. మానవుని హేతువిచార బుద్ధితో, శాస్త్ర విజ్ఞానంతో లేదా ప్రకృతితో పొసగకుండా కొరాన్‌కి చెప్పే ఏ భాష్యమైనా తప్పుడు భాష్యమే అన్నాడాయన. సంప్రదాయానికి గుడ్డిగా తలవొగ్గడానికి వ్యతిరేకంగా, ఆచారం, అజ్ఞానం, వివేచనా హీనతలమీద ఆధారపడ్డానికి వ్యతిరేకంగా ఆయన జీవితాంతం పోరాడాడు. విమర్శనాత్మక వైఖరిని, భావస్వాతంత్ర్యాన్ని అలవర్చుకోమని ఆయన ప్రజలకు ఉద్బోధించాడు. "భావ స్వాతంత్ర్యం వికసించనంతవరకు నాగరిక జీవితమనేది ఉండజాలదు" అన్నాడాయన. మత మూర్ఖత్వానికి, సంకుచిత మనస్తత్వానికి, ఇతర్లతో కలవకుండా వేరగా ఉండటానికి వ్యతిరేకంగా ఆయన హెచ్చరిక చేశాడు. విశాల దృష్టి, సహనశీలం అలవర్చుకోవలసిందిగా ఆయన విద్యార్థులకు, ఇతరులకు విజ్ఞప్తి చేశాడు. మూసివున మనస్సు సామాజికమైన, మేధాసంబంధమైన వెనుకబాటుతనానికి ప్రతీక అన్నాడాయన. ఉత్తమ ప్రపంచ గ్రంథాల అధ్యయనాన్ని ఆయన చాలా ప్రశంసించాడు. ఆ అధ్యయనం ద్వారా ప్రపంచం మన స్వీయశాఖకన్నా, సంఘంకన్నా, వర్గంకన్నా ఇంకా చాలా విశాలమైందనే జ్ఞానోదయం కలుగుతుందని ఆయన చెప్పాడు.

ముస్లిం ప్రజల మత, సాంఘిక జీవనం ఆధునిక పాశ్చాత్య శాస్త్రవిజ్ఞానాన్ని, సంస్కృతిని జీర్ణించుకోడం ద్వారానే మెరుగుపడుతుందని సయ్యద్ అహ్మద్‌ఖాన్ గాఢంగా విశ్వసించాడు. కాబట్టి ఆధునిక విద్యావ్యాప్తి అనేది ఆయన జీవితంలో

ప్రప్రథమ కర్తవ్యమయింది. ఒక ప్రభుత్వాధికారిగా ఆయన అనేక పట్టణాల్లో పాఠశాలలు పెట్టించాడు. అనేక పాశ్చాత్యగ్రంథాలను ఉర్దూలోకి తర్జుమా చేయించాడు. 1875లో అలిగఢ్‌లో పాశ్చాత్య విజ్ఞాన శాస్త్ర, సంస్కృతుల వ్యాప్తికోసం ఆయన మహమ్మదీయ ఆంగ్ల ప్రాచ్యకళాశాలని స్థాపించాడు. అదే అలీఘడ్ ముస్లిం విశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందింది.

సయ్యద్ అహ్మద్‌ఖాన్ మతసహనంలో మహావిశ్వాసం కలవాడు. అన్ని మతాలలో ఒకానొక అంతర్గతమైన ఏకత్వం నిలిచివుందని ఆయన నమ్మాడు. దాన్నే వాస్తవ లేదా క్రియాత్మక నీతి అనవచ్చు. ఒక వ్యక్తి యొక్క మతం అతని లేక ఆమె వ్యక్తిగత వ్యవహారం అని నమ్మినవాడు గనుక ఆయన మత దురభిమానాన్ని నిరసించాడు. మత ఘర్షణని ప్రతిఘటించాడు. హిందూ–ముస్లిం ప్రజల్ని ఐక్యంగా ఉండమని విజ్ఞప్తిచేస్తూ 1883లో ఆయనిలా అన్నాడు:

"ఇప్పుడు మనం ఉభయులూ భారతదేశం గాలిపీలుస్తూ గంగా యమునా జలాలు త్రాగుతూ బ్రతుకుతున్నాం. భారతదేశపు గడ్డమీద పండినవి తిని శరీరాన్ని పోషించుకుంటున్నాం. జీవన్మరణాలలో కలిసి మెలిసి ఉన్నాం. భారతదేశంలో జీవిస్తూ మనం ఉభయులం మన రక్తాన్ని మార్చుకున్నాం. మన శరీరచ్ఛాయ ఒక్కటయింది. మన రూపురేఖలు ఒకే మాదిరిగా అయ్యాయి. ముసల్మాన్లు లెక్కలేనన్ని హిందూ ఆచారాల్ని స్వీకరించారు. హిందువులు ముస్లిం నడవడిలోని అనేక విశిష్ట లక్షణాల్ని ఆమోదించారు. మనం ఎంత కలగలిసిపోయామంటే, ఉర్దూ అనే నూతన భాషని అభివృద్ధి చేసుకున్నాం. అది మన భాషా కాదు, హిందువుల భాషా కాదు. అది అందరిదీ. కాబట్టి, మన జీవితాల్లో భగవంతునికి చెందిన ఆ భాగాన్ని మినహాయిస్తే అప్పుడు మన ఉభయులం ఒకే దేశమాత బిడ్డలం అనే వాస్తవాన్నిబట్టి మనమంతా ఒకే జాతి. మన ఉభయులదైన దేశప్రగతి, శ్రేయస్సు మన ఐక్యతమీద, పరస్పర సహానుభూతి మీద, ప్రేమమీద ఆధారపడివుంటుంది. మన పరస్పర విభేదాలు, మొండితనం, ప్రతిస్పర్థలు, వ్యతిరేకతాభావం మనల్ని ఖచ్చితంగా నాశనం చేస్తాయి".

సయ్యద్ అహ్మద్‌ఖాన్ స్థాపించిన కళాశాల అభివృద్ధికి హిందువులు, పార్శీలు, క్రైస్తవులు నిరభ్యంతరంగా నిధులు సమకూర్చారు. ఆ కళాశాల ద్వారాలు భారతీయులందరికీ తెరచి ఉంచబడ్డాయి. ఉదాహరణకు, 1898లో అలీఘడ్ కళాశాలలో 64గురు హిందూ విద్యార్థులు, 285మంది ముస్లిం విద్యార్థులు కలిసి చదివారు. ఏడుగురు అధ్యాపకుల్లో ఇద్దరు హిందువులు. ఆ ఇద్దర్లో ఒకరు సంస్కృతంలో ఆచార్యుడు. కాని, ఆయన తన జీవిత చరమాంకంలో చాలా మారిపోయాడు. హిందూ అధిక సంఖ్యాకుల ప్రాబల్యం గురించి ప్రసంగించటం ప్రారంభించాడు. ఉప్పొంగే జాతీయోద్యమంలో తన అనుచరుల్ని చేరనివ్వకుండా నిరోధించాడు. ఆయన మౌలికంగా మతతత్వవాది కాదు. కాని ఆయన తన చివరిరోజుల్లో ఆ విధంగా మారిపోవటం దురదృష్టకరం. ముస్లిం ప్రజల్లో ఉన్నత మధ్యవర్గాలవారి వెనుకబాటుతనం పోవాలని మాత్రమే ఆయన కోరాడు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని గద్దెదించటం సులువుకాదు కాబట్టి తక్షణ రాజకీయ ప్రగతి సాధ్యంకాదనే అభిప్రాయం ఆయన మనస్సులో నాటుకొన్న ఫలితంగా ఆయన రాజకీయ దృక్పథంలో మార్పువచ్చింది. ఇంగ్లీషు అధికారులు కక్షపూనితే, మహమ్మదీయుల్లో తను

కాంక్షించిన విద్యావ్యాప్తికి ఆటంకాలు కలగవచ్చని ఆయన అభిప్రాయపడ్డాడు. భారతీయులు తమ ఆలోచనల్లో, కార్యాచరణలో ఇంగ్లీషు వాళ్లంత ఆధునికులు అయిననాడే, విదేశపాలనని విజయవంతంగా సవాలు చెయ్యగలుగుతారని ఆయనలో ఒక నమ్మకం పడింది. అంచేత ఆయన భారతీయులందర్నీ, ముఖ్యంగా విద్యలో వెనుకబడివున్న ముస్లిముల్ని కొంతకాలంపాటు రాజకీయాలకు దూరంగా ఉండమని సలహా ఇచ్చాడు. రాజకీయాల్లో దూకే సమయమింకా రాలేదన్నాడు. నిజం చెప్పాలంటే, ఆయన అలీఘడ్ కళాశాలకు, విద్యావ్యాప్తి జరగాలనే తన ఆశయానికి ఎంతగా అంకితమైపోయాడంటే, వాటికోసం తదితర ప్రయోజనాలన్నిటినీ బలిపెట్టటానికి సిద్ధమయ్యాడు. పర్యవసానంగా, సనాతన ముస్లిములు తన కళాశాలని నిరసించకుండా వుండేటందుకు మతసంస్కరణోద్యమాన్ని సొంతం వదులుకున్నాడు. అదే కారణంగా, ప్రభుత్వాన్ని నొప్పించే ఏ పనీ చెయ్యకూడదనుకున్నాడు. అక్కడితో ఆగకుండా మతత్వాన్ని, వేర్పాటువాదాన్ని ప్రోత్సహించాడు. ఇది ఘోర రాజకీయ తప్పిదం. తరువాతి కాలంలో దాని హానికర పరిణామాలు ప్రభావం చూపాయి. ఆయన అనుచరుల్లో కొందరు ఇతర మతాల్ని విమర్శిస్తూ ఇస్లామునీ, దానిగతాన్నీ ఆకాశానికెత్తారు.

సయ్యద్ అహ్మద్ సంస్కరణాభిలాష సామాజిక రంగానికి కూడా పాకింది. మధ్యయుగ ఆచారాల్ని, ఆలోచనా పద్ధతుల్ని, ప్రవర్తనని విడనాడవలసిందిగా ఆయన తన ముస్లిం సోదరులకు విజ్ఞప్తి చేశాడు. సమాజంలో స్త్రీల ప్రతిపత్తి పెరగాలని ఆయన చాలా రచనలు చేశాడు. పర్దా పద్ధతిని ఆయన వ్యతిరేకించాడు. ముస్లిం స్త్రీలలో విద్యావ్యాప్తికి ఆయన ప్రచారం చేశాడు. ముస్లిములలో బహుభార్యాత్వాన్ని, విడాకుల మంజూరును ఆయన నిరసించాడు.

అలీగఢ్ ఉద్యమం అని అభివర్ణింపబడే విశ్వాసపాత్రులైన అనుచర బృందం సయ్యద్ అహ్మద్ ఖాన్‌ని ఎల్లవేళలా కనిపెట్టుకొని ఉంది. చిరాగ్ అలీ, ఉర్దూకవి అల్తఫ్ హుస్సేన్ హాలి, నజీర్ అహ్మద్, మౌలానా షిబ్లి నేమానీ ప్రభృతులు అలీగఢ్ ఉద్యమంలో ఇతర ప్రముఖులు.

**మహమ్మద్ ఇక్బాల్:** ఆధునిక భారతీయ మహాకవులలో ఒకరైన మహమ్మద్ ఇక్బాల్ (1876-1938) తన కవితద్వారా హిందూ-ముస్లిం యువతరం యొక్క తాత్విక, మత దృక్పథాన్ని గాఢంగా ప్రభావితం చేశాడు. స్వామి వివేకానందునిలాగే ఈయన నిరంతరమైన మార్పుని, నిర్విరామ క్రియాపరతని ఆహ్వానించాడు. విరక్తిభావాన్ని, ధ్యాననిమగ్నతని, ఉన్నంతమేరకి తృప్తిపడే గుణాన్ని నిరసించాడు. ఈ ప్రపంచాన్ని మార్చటానికి దోహదం చేసే క్రియోన్ముఖ దృక్పథాన్ని అలవర్చుకోమని విజ్ఞప్తి చేశాడు. ఇక్బాల్ కవి మౌలికంగా మానవతావాది. మానవ కార్యాచరణని ఆయన సర్వోత్కృష్టమైన ధర్మంగా పరిగణించాడు. మానవుడు ప్రకృతికి లేదా శక్తులకు లొంగిపోకూడదనీ, అతడు ఈ ప్రపంచాన్ని తన నిరంతర పరిశ్రమతో నియంతించెయ్యాలనీ ఆయన కోరాడు. ఉన్న పరిస్థితిని ఉదాసీనంగా ఆమోదించటం ఆయన దృష్టిలో మహాపాపం. కర్మకాండ, కఠోర నియమానుకరణం, పరలోక చింతన ఆయనకు గిట్టవు. మనం జీవించే ఈ ప్రపంచంలో సుఖసంతోషాలు సాధించడానికి కృషిచెయ్యమని ఆయన ప్రజలకు ఉద్బోధించాడు. ఆయన తన తొలి కవితారచనల్లో

దేశాభిమానం ప్రబోధించాడు కాని తరువాత ఆయన కూడా ముస్లిం వేర్పాటువాదాన్ని ప్రోత్సహించాడు.

***పార్శీలలో మత సంస్కరణ:*** 19వ శతాబ్దం మధ్యలో బొంబాయిలోని పార్శీలలో మత సంస్కరణ ధోరణి మొలకెత్తింది. నౌరోజీ ఫర్దోంజీ, దాదాభాయ్ నౌరోజీ, యస్.యస్. బెంగాలీ ప్రభృతులు 1851లో మత సంస్కరణ సభని ప్రారంభించారు. మత విషయక రంగంలో పాతుకుపోయిన ఛాందసత్వానికి వ్యతిరేకంగా ఆ సభ ప్రచారం చేసింది. స్త్రీ విద్య, వివాహం, వాళ్ళ సామాజిక అంతస్తు వగైరాలకు సంబంధించి పార్శీ సాంఘికాచారాల ఆధునికీకరణకు ఆ సభ శ్రీకారం చుట్టింది. కాలక్రమేణా భారతీయ సమాజంలో పార్శీలు సామాజిక పరంగా అందరికంటే ఎక్కువగా పాశ్చాత్య సభ్యతని అలవర్చుకున్న వర్గంగా రూపొందారు.

***సిక్కు ప్రజల్లో మతసంస్కరణ:*** 19వ శతాబ్ది చివర్లో అమృత్‌సర్‌లో ఖల్సా కళాశాల స్థాపన నాటినుంచి సిక్కుల్లో మత సంస్కరణాభిలాష ప్రారంభమైంది. అయితే మతసంస్కరణ కార్యక్రమం 1920 తరువాతనే ఊపుఅందుకుంది. అప్పుడే పంజాబ్‌లో అకాలీ ఉద్యమం తలెత్తింది. సిక్కు గురుద్వారాల నిర్వహణ వ్యవస్థని క్షాళనం చెయ్యటానికి అకాలీలు నడుంకట్టారు. భక్తిపరులైన సిక్కులు దానంగా ఇచ్చిన భూములు, భూరి విరాళాలతో గురుద్వారాలు ఉచ్ఛస్థితో ఉన్నాయి. కాని వాటిమీద స్వార్థం, అవినీతి నిండిన మహంతులనే పూజార్లు నిరంకుశ పెత్తనం సాగించేవాళ్ళు. అకాలీల నాయకత్వంలో సిక్కు ప్రజలు 1921లో మహంతులకు వ్యతిరేకంగా, వాళ్ళ కొమ్ముకాసే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక బ్రహ్మాండమైన సత్యాగ్రహం నడిపారు. ఫలితంగా 1922లో ప్రభుత్వం నూతన గురుద్వార చట్టాన్ని తెచ్చింది. అది తిరిగి 1925లో సవరించబడింది. కొన్ని సందర్భాల్లో ఈ చట్టంద్వారాను, తరచుగా ప్రత్యక్ష కార్యాచరణ ద్వారాను సిక్కులు గురుద్వారాల నుంచి అవినీతిపరులైన మహంతులను పారద్రోలారు. ఆ పరిణామ క్రమంలో వందలాది ప్రాణాలు బలయ్యాయి.

ఇంతవరకు మనం చర్చించిన సంస్కరణోద్యమాలు, వ్యక్తిగత సంస్కరణ వాదులేకాకుండా ఇంకా అటువంటి అసంఖ్యాక ఉద్యమాలు, వ్యక్తులు 19, 20వ శతాబ్దాలలో విశేషకృషి సాగించటం జరిగింది.

ఆధునిక యుగంలోని భిన్న మత సంస్కరణోద్యమాల్లో ఒక అంతర్గతమైన ఏకత్వం గోచరించింది. వాటిలో చాలా ఉద్యమాలు హేతువాదం మానవతావాదం అనే జంట సిద్ధాంతాల మీద ఆధారపడ్డాయి. ఐతే, కొన్ని సమయాల్లో అవి ప్రజల దృష్టిని తమవేపు తిప్పుకోడానికి మతవిశ్వాసాన్ని, ప్రాచీన ప్రమాణాల్ని ఊతగా తీసుకున్నాయి. మత సంస్కరణోద్యమాలు అప్పుడే పైకి వస్తున్న మధ్యతరగతివారి ఆకాంక్షల్ని ప్రతిబింబించడంచేత, అవి వారి దృష్టిని విశేషంగా ఆకర్షించాయి. అవి మానవ మేధని తర్క వ్యతిరేకమైన మూఢమత సిద్ధాంతాల నుంచి, పిడివాదం నుంచి విడిపించి ఆలోచనాపటిమ, హేతువాదం అలవర్చటానికి ప్రయత్నించాయి. అవి భారతీయ మతాలలో అనుష్ఠానికమైన, మూఢ విశ్వాసపూరితమైన, హేతురహితమైన, అర్థరహితమైన సూత్రాలను ప్రతిఘటించాయి. చాలా ఉద్యమాలు కొంత హెచ్చు తగ్గులుగా మతంలో ప్రామాణ్యతా సూత్రాన్ని వదిలివేసి తర్కం, హేతువాదం లేదా

శాస్త్రీయ విచారాలకు అనుగుణ్యంగా ఏ మతంలోగానీ, పవిత్ర గ్రంథాలలోగాని సత్యనిరూపణ చేశాయి. విజ్ఞాన శాస్త్రాలకు, బాహ్యజ్ఞానానికి ఏ పరిశోధనా పద్ధతుల్ని వర్తింపజేస్తున్నామో మతం అనే శాస్త్రానికి కూడా అవే పద్ధతుల్ని అనువర్తింపజేయ్యాలని స్వామి వివేకానంద చెప్పాడు.

ఈ సంఘ సంస్కర్తల్లో కొందరు సంప్రదాయంవేపు దృష్టిని మరల్చారు. తాము కేవలం గతంలోని శుద్ధ సిద్ధాంతాల్ని, విశ్వాసాల్ని, ఆచారాల్ని పునరుద్ధరిస్తున్నాం అని చెప్పుకున్నారు. కాని నిజానికి గతాన్ని పునరుద్ధరించటం జరగని పని. గతానికి సంబంధించి సర్వామోదణీయమైన చిత్రణ తరచు కనబడదు. గతాన్ని పునరుద్ధరించడం అనే అంశాన్ని జస్టిన్ రానడే తీవ్రంగా దుయ్యబట్టాడు. సమాజమనేది ఒక సజీవ వ్యవస్థ. నిరంతర పరిణామ శీలం. కాబట్టి అది గతంలోకి మరలిపోదు అన్నాడు జస్టిన్ రానడే. ఆధునిక శాస్త్రీయ విజ్ఞానానికి విరుద్ధంగా పరిణమించిన ఆలోచనల్ని, భావాల్ని తప్పుడు భాష్యంగా ప్రకటించడం జరిగింది. ఛాందసులు ఈ దృక్పథాన్ని అంగీకరించలేదు కాబట్టి సంఘ సంస్కర్తలు సనాతన వర్గాలతో సంఘర్షించారు. కనీసం ఆ మొదటి దినాల్లో వాళ్ళు మత, సామాజిక తిరుగుబాటుదార్లయ్యారు. స్వామి దయానందుని పట్ల సనాతన వర్గాలు తీవ్ర వ్యతిరేకత వెళ్ళగక్కాయి. ఆఖరికి ఆయన ప్రాణాన్ని బలి గొంటానికి సైతం సనాతనులు తెగించారు. "ఆయనని క్రైస్తవుల కిరాయి దూత, మతభ్రష్టుడు, పాషండుడు, నాస్తికుడు వగైరా వగైరా పేర్లతో నిందించారు" అని లాలా లజపత్‌రాయ్ ఒకచోట రాశాడు.

అదేవిధంగా, సాంప్రదాయవాదులు సయ్యద్ అహ్మద్‌ఖాన్‌ని దుర్భాషలాడారు. ఆయనకి వ్యతిరేకంగా మతపరమైన డిక్రీలు జారీచేశారు. ప్రాణహాని చెయ్యటానికి సైతం తెగించారు.

పురోహితవర్గంపైనా, కర్మకాండపైన జరిపిన దాడి మత సంస్కరణోద్యమాల మానవతా వైఖరిని వెల్లడి చేసింది. మానవ హేతువిచారబుద్ధి, మానవ సంక్షేమాల వెలుగులో మతగ్రంథాలకు అర్థవివరణ ఇవ్వటానికి వ్యక్తిగత హక్కును నొక్కి చెప్పడంలో ఆ మానవతా వైఖరి వెల్లడయింది. మానవజాతి పురోగమించగలదు. అది పురోగమించింది. మానజాతి పురోగమనానికి అనుకూలించేవే అంతిమంగా నైతిక సూత్రాలు అనే భావనని ఆశ్రయించుకున్న ఒక నూతన మానవ నీతి మానవతావాదం తాలూకు గమనార్హమైన అంశం. సాంఘిక సంస్కరణోద్యమాలు ఈ నూతన మానవ నీతిని మూర్తీభవించాయి.

పూర్తిగా మతపరమైన ప్రతిఫలం అటుంచి, ఈ మత సంస్కరణోద్యమాలు భారతీయుల్లో గొప్ప ఆత్మ గౌరవాన్ని, ఆత్మ విశ్వాసాన్ని, దేశంపట్ల గర్వాన్ని వర్ధిల్లచేశాయి. వాళ్ళ మత సంబంధమైన గతాన్ని ఆధునిక హేతువాద అర్థంలో నిర్వచించటం ద్వారా, 19వ శతాబ్దినాటి మతవిశ్వాసాలు, ఆచారాల్లోని అవినీతికరమైన, హేతురహితమైన అంశాల్ని ఏరిపారెయ్యటం ద్వారా మత సంస్కర్తలు తమ అనుచరుల్ని భారతీయ మతాలు, సమాజంపైన అధికార్లు విసిరే విసుర్లను ఎదుర్కోడానికి సన్నద్ధుల్ని చేశారు. భారతీయ మతాలు, సమాజం అధమస్థాయికి చెందినవనీ, అవి పతనావస్థలో ఉన్నాయనీ, వేళాకోళంగా మాట్లాడే అధికార్ల వెక్కిరింతని

గట్టిగా ఎదుర్కోడానికి అనువుగా మతసంస్కర్తలు తమ అనుచరుల్ని తీర్చిదిద్దారు. ఈ సందర్భంలో జవహర్‌లాల్ నెహ్రూ ఇలా అన్నారు:

"పైకి ఎక్కి వచ్చే మధ్య తరగతి వర్గాలకు రాజకీయాల వేపు మొగ్గు ఉంది. మతాన్వేషణలో వాళ్ళకంత ఆసక్తి లేదు. అయినా, తాము కాలూనటానికి ఏదో ఒక సాంస్కృతికాధారం కావాలనుకున్నారు. తమ అర్హతకు హామీ ఇచ్చేదేదో కావాలని కోరుకున్నారు. విదేశీయుల ఆక్రమణ, పరిపాలన సృష్టించిన నైరాశ్యాన్ని పరాభవాన్ని మరిపించేదేదో కావాలనుకున్నారు".

మత సంస్కరణోద్యమాలు చాలామంది భారతీయుల్ని ఆధునిక ప్రపంచంతో రాజీకి రావటానికి సహాయపడ్డాయి. వాస్తవానికి, అవి పాత మతాలను సమాజంలోని నూతన సామాజిక వర్గాల అవసరాల కనుగుణంగా ఒక కొత్త ఆధునికమైన మూసలో పోశాయి. గతంమీద గర్వభావం ఉన్నా, భారతీయులు ఆధునిక ప్రపంచం గొప్పతనాన్ని, ముఖ్యంగా విజ్ఞాన శాస్త్రంలో దాని ఆధిక్యతని అంగీకరించడానికి అది అడ్డురాలేదు. సంస్కరణ దృష్టి ఫలితంగా, చాలామంది భారతీయులు కుల, మత విచక్షణలతో నిండిన సంకుచిత దృక్పథం స్థానే ఆధునికమైన, ఇహలోకానికి పరిమితమైన, లౌకిక స్వభావం కలిగిన జాతీయతా ప్రభావితమైన దృక్పథాన్ని అలవర్చుకోసాగారు. అంతమాత్రం చేత కుల, మత, విచక్షణా సహితమైన సంకుచిత దృక్పథం అంతమైపోలేదు. భారతదేశం సాంస్కృతికంగా, బౌద్ధికంగా మిగతా ప్రపంచంతో సంబంధంలేకుండా మడికట్టుకుని కూర్చున్న పరిస్థితిని ఈ ఉద్యమాలు తొలగించాయి. ప్రపంచ భావవెల్లువలో భారతీయులు కూడా పాలుపంచుకునేటట్లు చేశాయి. అదే సమయంలో, భారతీయులు పాశ్చాత్య ప్రపంచానికి చెందిన ప్రతిదానికీ సమ్మోహితులు కాలేదు. పాశ్చాత్యుల్ని గుడ్డిగా అనుకరించిన విదేశ మానసపుత్రుల్ని వాళ్ళు తృణీకార భావంతో చూశారు.

ఈ సందర్భంలో మతసంస్కరణోద్యమాల తాలూకు ప్రతికూలాంశాల్ని కూడా గమనించాల్సి వుంది. ఒకటి- ఈ ఉద్యమాలన్నీ ప్రజల్లో అతికొద్ది శాతాన్ని స్పృశించాయి. వాళ్లు పట్టణ మధ్య, ఉన్నత వర్గాల ప్రజలు మాత్రమే. విశాల రైతాంగాన్ని, పట్టణ పేదవర్గాల్ని ఇవి తాకలేదు. ఈ వర్గాలకు చెందిన విశాల ప్రజాబాహుళ్యం సాంప్రదాయకమైన, పూర్వాచార బద్ధమైన పద్ధతుల్లోనే జీవితం గడిపింది. ఇలా ఎందుకు జరిగిందంటే, ఈ ఉద్యమాలు భారతీయ సమాజంలోని విద్యావంతులైన పట్టణ వర్గాల వాంఛల్ని మాత్రమే వినదించాయి.

ఇక రెండవ పరిమితి ప్రధాన వ్యతిరేకాంశం అయింది. అది వెనక్కి చూసే ధోరణి. గత ఔన్నత్యం గురించి గొప్పలు పలికే ధోరణి. మత గ్రంథాల ప్రామాణ్యం మీద ఆధారపడే ధోరణి. ఈ ధోరణులు మత సంస్కరణోద్యమాలు ప్రచారం చేసిన విర్మాణాత్మక బోధలకు వ్యతిరిక్తంగా తయారయ్యాయి. మానవుని హేతు విచారబుద్ధి, శాస్త్రీయ దృక్పథాల ప్రాధాన్యానికి కొంత చెరుపు చేశాయి. మార్మికతకి కొత్త తొడుగులు తొడిగాయి. కుహనా శాస్త్రీయ విచారానికి పాలుపోశాయి. గత ఔన్నత్యాన్ని డబ్బా కొట్టుకోవడంవల్ల మిధ్యా గర్వం, శుష్క ఆత్మ సంతృప్తి చోటుచేసుకున్నాయి. గతం పొరల అడుగున "స్వర్ణయుగాన్ని" గాలించే అలవాటు నవీన శాస్త్ర విజ్ఞానాన్ని సంపూర్ణంగా ఆమోదించనివ్వకుండా అడ్డుకుంది. వర్తమాన పరిస్థితిని

మెరుగుపర్చుకునే కృషికి విఘాతం కలిగించింది. అన్నిటికన్నా ముఖ్యంగా, ఈ ధోరణులు హిందువుల్ని, ముస్లిముల్ని, సిక్కుల్ని, పార్శీల్ని విడదీసే దిశలో సాగాయి. అగ్రవర్ణ హిందువుల్ని తక్కువ కులాల హిందువుల నుంచి వేరుపర్చాయి. అనేక మతాలు పొగుబడ్డ దేశంలో మతానికి అధిక ప్రాధాన్యం ఇవ్వటం తప్పకుండా చీలికలు తెచ్చిపెడుతుంది. పైపెచ్చు, సంస్కర్తలు సాంస్కృతిక వారసత్వం తాలూకు మత, తాత్విక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వటంలో పక్షపాతం ప్రదర్శించారు. ఆ అంశాలు అన్ని వర్గాల, మతాల ప్రజల ఉమ్మడి వారసత్వం కావు. అన్ని వర్గాల, మతాల ప్రజలు సమానపాత్ర నిర్వహించిన కళలు, శిల్పం, సాహిత్యం, సంగీతం, విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలు వగైరా విషయాలకు మన సంస్కర్తలు సముచిత ప్రచారం ఇవ్వలేదు. పైగా, హిందూ సంస్కర్తలు భారతదేశపు గత కీర్తిని గానం చేసినప్పుడల్లా, ప్రాచీన యుగం మీదే దృష్టినిల్పారు. వివేకానందుని వంటి విశాల దృష్టి గలిగిన వ్యక్తి సైతం ఇదేదృష్టితో భారతీయ చైతన్యాన్ని, భారతదేశ గత విజయాల్ని గానం చేశాడు. ఈ సంస్కర్తలంతా భారత చరిత్రలో మధ్యయుగాన్ని క్షీణయుగంగా పరిగణించారు. ఇది చరిత్ర విరుద్ధమైనదే కాకుండా సామాజికంగా, రాజకీయంగా చెరుపు చేసేది కూడా. రెండు భిన్న జాతుల సిద్ధాంతాన్ని సృష్టించటానికి కారణమవుతుంది. ప్రాచీన యుగాన్ని, మతాన్ని విచక్షణా రహితంగా ఆకాశానికెత్తటం కింది కులాల ప్రజలకు నచ్చదుకూడా. ఎంచేతనంటే, వాళ్ళు శతాబ్దాలుగా వినాశకరమైన కులదోపిడీకి గురయ్యారు. అది సరిగ్గా మన సంస్కర్తలు దబ్బా వాయించే ప్రాచీన యుగంలోనే పుట్టి పెరిగింది. తత్ఫలితంగా, అందరు భారతీయులూ సమానంగా తమ గతాన్ని, సాంస్కృతిక విజయాల్ని గర్వకారణంగా భావించడానికి బదులుగా, వాటి నుంచి సమానంగా ఉత్తేజం పొందటానికి బదులుగా గతం కొద్దిమంది వారసత్వం అయింది. పాక్షికత ప్రాతిపదికమీద గతం అనేది రెండు వేర్వేరు అరలుగా చీలిపోయింది. ముస్లిం మధ్యతరగతి ప్రజల్లో చాలామంది తమ మహత్వ సంప్రదాయాలు, గర్వోన్నత ఘడియలూ గుర్తుతెచ్చుకుందుకు పశ్చిమాసియా చరిత్ర పుటలు తిప్పారు. అధికాధికంగా మతసంస్కరణోద్యమ ప్రభావితులైన హిందువులు, ముస్లిములు, సిక్కులు, పార్శీలు, తరువాత కింది కులాల హిందువులు ఒకరి కొకరు వేరయిపోయారు. మరొక చెంప సాంప్రదాయక మార్గంలో జీవిస్తూ, మత సంస్కరణోద్యమ ప్రభావం సోకని హిందువులు, ముస్లిములు పరస్పరం సఖ్యతతో మెలిగారు. తమ తమ భిన్న మతాచారాలు అనుష్ఠించారు. కొద్ది శతాబ్దాలుగా సాగుతున్న సమ్మిశ్ర సంస్కృతీ వికాస పరిణామానికి కొంత విఘాతం కలిగింది. అయితే, ఇతర రంగాలలో భారత ప్రజల జాతీయ ఏకీకరణ వేగం పుంజుకున్న మాట కూడా నిజం. ఏమైనప్పటికీ, జాతీయ చైతన్యంతోపాటే మధ్య తరగతి ప్రజల్లో మతతత్వం కూడా పెచ్చు పెరగసాగింది. మత సంస్కరణోద్యమాల ప్రతికూలాంశాలే కాకుండా, ఇంకా తదితర కారణాలనేకం ఆధునిక యుగంలో మతతత్వ ఆవిర్భావానికి బాధ్యత వహించాయి. అయితే మత సంస్కరణోద్యమాల స్వభావం దీనికి నిస్సందేహంగా దోహదం చేసింది.

**సంఘసంస్కరణ:** 19వ శతాబ్దంలో జాతీయ జాగృతి ప్రధానమైన ప్రభావం సంఘ సంస్కరణ రంగంలో పొడగట్టింది. కొత్తగా చదువులు నేర్చినవాళ్ళు కఠోర

సామాజిక నియమాలకు కాలదోషం పట్టిన ఆచారాలకు వ్యతిరేకంగా ఇతోధికంగా తిరుగుబాటు చేశారు. అర్థరహితమైనటువంటి, మానవతా లక్షణాలను రూపుమాపేటటువంటి సాంఘికాచారాలను వాళ్ళింకా సహించలేకపోయారు. సాంఘిక సమానత, సర్వమానవ సమానార్హత అనే మానవతాదర్శాలు వాళ్ళని ఆ తిరుగుబాటుకు ఉత్తేజితుల్ని చేశాయి.

దాదాపు మత సంస్కర్తలంతా సంఘ సంస్కరణోద్యమానికి తోడ్పాటు ఇచ్చారు. కులవ్యవస్థ, స్త్రీ పురుష అసమానతవంటి భారతీయ సమాజంలోని వెనుకబాటు లక్షణాలకు గతంలో మతానుమోదం ఉండటమే దానికి కారణం. పైపెచ్చు, సోషల్ కాన్ఫరెన్స్, సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ, క్రైస్తవ మిషనరీలు, ఇంకా ఇతర సంస్థలు సంఘసంస్కరణ రంగంలో చురుగ్గా కృషిచేశాయి. జోతిబా గోవిందఫూలే, గోపాల్ హరిదేశ్‌ముఖ్, జస్టిస్ రానడే, కె.టి.తెలాంగ్, బి.యమ్.మలబారి, డి.కె. కార్వే, శశిపాద బెనర్జీ, బి.సి.పాల్, వీరేశలింగం పంతులు, బి.ఆర్.అంబేద్కర్ వంటి ప్రముఖ వ్యక్తులు కూడా సంఘ సంస్కరణోద్యమంలో ముఖ్యపాత్ర నిర్వహించారు. 20వ శతాబ్దంలో, ముఖ్యంగా 1919 తరువాత జాతీయోద్యమం సంఘసంస్కరణకు ప్రధాన ప్రచారకర్త అయింది. సంస్కరణవాదులు ప్రజాబాహుళ్యంలోకి చొచ్చుకుపోవడానికి ఎక్కువగా ప్రాంతీయ భాషల్లో తమ ప్రచారం కొనసాగించారు. తమ భావాలను ప్రజల్లో విరివిగా వ్యాప్తిచెయ్యటం కోసం వాళ్ళు నవల, నాటకం, కవిత, కథానిక వగైరా సాహిత్యరూపాల్ని, పత్రికల్ని 1930 తరువాత చలనచిత్రాల్ని ప్రచార సాధనాలుగా వాడుకున్నారు.

19వ శతాబ్దంలో కొన్ని సందర్భాల్లో సంఘసంస్కరణ మత సంస్కరణతో జతపడ్డప్పటికి, తరువాతి కాలంలో అది ఇతోధికంగా లౌకిక వైఖరిని సంతరించుకొంది. పైగా, మతానికి సంబంధించి సనాతనులుగా ఉన్న వ్యక్తులు కూడా సంఘ సంస్కరణోద్యమంలో పాల్గొన్నారు. అట్లాగే, మొట్టమొదట్లో సంఘసంస్కరణ కృషి కొత్తగా విద్యావంతులైన అగ్రవర్ణాల భారతీయులకే పరిమితమైంది. రానురాను, అది సమాజంలోని కిందితరగతులకు పాకింది. సామాజిక రంగాన్ని పునర్నిర్మింపసాగింది. విప్లవాత్మకం చెయ్యసాగింది. సంఘసంస్కర్తల భావాలు, ఆదర్శాలు సకాలంలో సర్వత్రా ఆమోదంపొందాయి. ఈనాడు భారత రాజ్యాంగంలో పొందుపర్చబడ్డాయి.

సంఘసంస్కరణోద్యమాలు ప్రధానంగా రెండు లక్ష్యాలను సాధించ పూనుకున్నాయి. (1) స్త్రీ విముక్తి; పురుషులతోపాటు స్త్రీలకు సమానహక్కులు; (2) కులం యొక్క కాఠిన్యాన్ని తగ్గించటం; ముఖ్యంగా అస్పృశ్యతా నిర్మూలనం.

**స్త్రీ విముక్తి:** శతాబ్దాలుగా భారతదేశంలో స్త్రీలు పురుషులకింద అణగిమణగి పడున్నారు. సాంఘికంగా అణచివేయబడ్డారు. భారతదేశంలో ప్రచలితమైన వివిధ మతాలుగానీ, వాటి ఆధారంగా రూపొందిన వ్యక్తిగతమైన చట్టాలు, కట్టుబాట్లుగానీ, పురుషునికన్నా స్త్రీకి తక్కువ హోదా ప్రసాదించాయి. ఈ విషయంలో ఉన్నత వర్గాల స్త్రీల పరిస్థితికన్నా రైతుకుటుంబాల ఆడపడుచుల పరిస్థితే మెరుగు. కనీసం వాళ్ళు పొలాల్లో పురుషుల సరసన చురుగ్గా పనిపాట్లలో పాలుపంచుకుంటారు. నిత్య వ్యవహారాల్లో ఉన్నత వర్గాల స్త్రీలకన్నా ఎక్కువ స్వేచ్ఛ అనుభవిస్తారు. కొన్ని విషయాల్లో ఉన్నతవర్గాల స్త్రీలకన్నా వీళ్లే కుటుంబంలో మెరుగైన హోదా అనుభవిస్తారు.

ఉదాహరణకు- పాటక జనం స్త్రీలకు పర్దాపద్ధతి లేదు. పైగా చాలామందికి పునర్వివాహం చేసుకునే హక్కు కూడా ఉంది. అర్ధాంగిగా, మాతృమూర్తిగా స్త్రీని శాస్త్రాలు పొగిడాయి. కాని వ్యక్తులుగా వాళ్లకి సమాజంలో అధమస్థానం అంటగట్టాయి. భర్తలతో ఉండే బంధం తప్ప వాళ్లకెటువంటి వ్యక్తిత్వం ఉండకూడదు. వాళ్ళు గృహిణులుగా బాధ్యతలు నిర్వహించాలే తప్ప, పుట్టుకతో అబ్బిన ప్రతిభా విశేషాలను సాధన చేసుకోడానికిగాని, ప్రదర్శించటానికి గాని వీలులేదు. తత్సంబంధమైన కోరికల్ని అణచిపెట్టుకోవలసిందే. వాస్తవానికి, వాళ్లని పురుషులకు అనుబంధ వస్తువులుగా చూశారు. ఉదాహరణకు, హిందూ సమాజంలో స్త్రీ ఒక్కమారు మాత్రమే వివాహం చేసుకోడానికి అర్హురాలు. పురుషుడు బహుభార్యల్ని చేసుకోవచ్చు. ముస్లిములలో సైతం ఈ బహు భార్యాత్వ ఆచారం అమల్లో వుంది. దేశంలో చాలాప్రాంతాల్లో స్త్రీలు పర్దా వెనుక ఉండవలసిందే. ఇదిగాక, బాల్యవివాహాలు ప్రబలిపోయాయి. 8-9 సంవత్సరాల చిన్నపిల్లలకు వివాహాలు చేశారు. వితంతువులకు పునర్వివాహం చేసుకునే హక్కులేదు. ఇహలోక సుఖ సంతోషాలకు దూరమైన కఠోర నిర్బంధ వైధవ్యంలో బ్రతుకు వెళ్ళబుచ్చాలి. దేశంలో పలుప్రాంతాల్లో భయంకరమైన సతిసహగమన దురాచారం అమల్లో ఉండేది. హిందూ స్త్రీకి ఆస్తిలో వారసత్వ హక్కులేదు. అవాంఛనీయమైన వివాహాన్ని తెగతెంపులు చేసుకునే హక్కులేదు. ముస్లిం స్త్రీలకు ఆస్తిహక్కు ఉందిగాని, పురుషుడు పొందేదాన్లో సగం మాత్రమే ఆమెకు దక్కుతుంది. విడాకులకు సంబంధించి, సిద్ధాంతపరంగా కూడా స్త్రీ పురుషుల మధ్య సమానత లేదు. వాస్తవానికి ముస్లిం స్త్రీలు విడాకులంటే గడగడలాడారు. హిందూ-ముస్లిం స్త్రీలుభయుల సాంఘిక స్థితిగానీ, విలువలుగానీ ఒకేమాదిరిగా ఉన్నాయి. ఉభయులూ ఆర్థికంగా, సామాజికంగా తమ భర్తలమీదనే సంపూర్ణంగా ఆధారపడ్డారు. చివరకి, చదువుకునే అవకాశం కూడా తిరస్కరించబడింది. పైపెచ్చు స్త్రీలు అస్వతంత్రతని ఆమోదించేలాగు, అదేదో గొప్ప గౌరవ చిహ్నమని తలకెత్తుకునేలాగు పాఠాలు నేర్పారు. చరిత్రలో అడపా దడపా రజియా సుల్తానా, చాంద్‌బీబీ, అహల్యాబాయి హోల్కార్‌లాంటి మహత్తర శీల, వ్యక్తిత్వాలుగల నారీమణులు రాణకెక్కిన మాట నిజమే. కాని, అది స్త్రీ లోకానికంతటికీ వర్తించదు. అటువంటి సంఘటనలు సాధారణ సూత్రానికి మినహాయింపు. కాబట్టి స్త్రీలోక దృశ్యం వాటివల్ల కించిత్తు మారదు.

19వ శతాబ్దంలో మానవతాదర్శాలతో, సర్వమానవ సమతాకాంక్షతో ప్రేరితులైన సంఘ సంస్కర్తలు స్త్రీ సముద్ధరణకోసం శక్తివంతమైన ఉద్యమాల్ని ప్రారంభించారు. ఆ సంస్కర్తల్లో కొందరు వ్యష్టివాదం, సమానత్వ సిద్ధాంతాలవేపు దృష్టి మరల్చారు. మరికొందరు నిజమైన హిందూమతంగానీ, ఇస్లాంగానీ, జొరాష్ట్రియన్ మతంగానీ స్త్రీలకు తక్కువ హోదా ఉండాలని సిఫార్సు చెయ్యలేదని ప్రకటించారు. నిజమైన మతం అనేది స్త్రీలకు ఉన్నత సామాజిక హోదాని ప్రసాదించిందని వాళ్ళు ఉద్ఘాటించారు.

అనేక మంది వ్యక్తులు, సంస్కరణ సంఘాలు, మత సంస్థలు స్త్రీ విద్యా వ్యాప్తికి, వితంతు వివాహాలకు, వితంతువుల జీవన పరిస్థితుల మెరుగుదలకు, బాల్య వివాహ నిషేధానికి పర్దాపద్ధతి తొలగింపునకు, ఏకపత్నీ వ్రతాన్ని పాటించటానికి, మధ్యతరగతి మహిళలు ఉద్యోగాలు, వృత్తులు స్వీకరించే వాతావరణం కల్పించటానికి చాలా గట్టి

కృషి జరిపాయి. 1880 తరువాత, అప్పటి వైస్రాయి సతీమణి లేడీ డఫ్రిన్ పేరిట వైద్యశాలలు ప్రారంభించినప్పుడు, ఆధునిక వైద్య, ప్రసూతి విధానాలు స్త్రీలకు అందుబాటు అయ్యేటట్లు చేయడానికి ప్రయత్నం జరిగింది.

20వ శతాబ్దంలో ఉప్పొంగిన సమరశీల జాతీయోద్యమం స్త్రీ విముక్తి ఉద్యమానికి గొప్ప ఉత్తేజం ఇచ్చింది. స్త్రీలు స్వాతంత్ర సమరంలో గొప్ప క్రియాశీల పాత్ర నిర్వహించారు. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా సాగిన మహోద్యమంలోను, హోమ్‌రూల్ ఉద్యమంలోను స్త్రీలు అశేష సంఖ్యలో పాల్గొన్నారు. 1918 తరువాత వాళ్ళు రాజకీయ ప్రదర్శనల్లో, ఊరేగింపుల్లో పాల్గొన్నారు. విదేశ వస్త్రాలను, మద్యాన్ని అమ్మే దుకాణాలముందు పికెటింగు జరిపారు. నూలు వడికారు. ఖద్దరు ప్రచారం చేశారు. సహాయ నిరాకరణ ఉద్యమాల్లో పాల్గొని జైళ్ళకు వెళ్లారు. ప్రజాప్రదర్శనల్లో లాఠీలు, బాష్పవాయువు, తూటాలకు ఎదురొడ్డి నిలిచారు. తీవ్రవాద విప్లవోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. శాసన సభలకు జరిగిన ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొందరు మహిళలు అభ్యర్థినులుగా కూడా ఎన్నికల్లో నిలబడ్డారు. సుప్రసిద్ధ కవయిత్రి శ్రీమతి సరోజిని నాయుడు భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలయింది. 1937లో ఏర్పడ్డ కాంగ్రెస్ మంత్రివర్గాల్లో మహిళలు మంత్రులు, పార్లమెంటరీ కార్యదర్శులయ్యారు. కార్మిక సంఘాలు, కిసాన్ ఉద్యమము తలెత్తినప్పుడు మహిళలు అగ్రగాములుగా నిలబడ్డారు. అన్నిటికన్నా ముఖ్యంగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనటమన్నది భారత స్త్రీ జాగృతికి, విముక్తికి విశేషంగా దోహదం చేసింది. బ్రిటిషు ప్రభుత్వ కారాగారాలకు, తూటాలకు నిర్భయంగా ఎదురు నిలచిన స్త్రీలోకం పురుషులకు తీసికట్టని ఎవరైనా 'ఎలా అనగలుగుతారు ! ఇంకా ఎంతకాలం వాళ్ళు నాలుగు గోడల మధ్య బంధింపబడి, పురుషుని ఆటబొమ్మగా, దాసీ మనిషిగా తృప్తి పొందుతారు? మానవులుగా వాళ్ళూ తమ హక్కులకోసం నిలబడితీర్తారు.

దేశంలో మహిళా ఉద్యమ ఆవిర్భావం మరొక ముఖ్య పరిణామం. 1920 ప్రాంతందాకా, చైతన్యవంతులైన పురుషులు స్త్రీ సముద్ధరణ కోసం పాటుబడ్డారు. ఇప్పుడు స్వీయ చైతన్యం, ఆత్మ విశ్వాసం సంతరించుకున్న మహిళాలోకమే ఈ కర్తవ్య సాధనకు నడుం కట్టింది. దానికోసం స్త్రీలు అనేక సంఘాల్ని, సంస్థల్ని స్థాపించారు. వాటిలో, 1927లో స్థాపించబడ్డ అఖిలభారత మహిళా సంఘం అత్యంత ప్రముఖమైంది.

దేశానికి స్వతంత్రం వచ్చాక, సమానత్వం కోసం మహిళాపోరాటం గొప్ప ముందంజ వేసింది. భారత రాజ్యాంగంలోని 14, 15వ అధికరణలు (Articles) స్త్రీ, పురుష సంపూర్ణ సమానత్వాన్ని గ్యారంటీచేశాయి. 1956లో ప్రభుత్వం తెచ్చిన హిందూవారసత్వ చట్టం హిందూ కుటుంబంలో కుమారునితోపాటు కుమార్తెని సహా సమాన వారసురాలుగా గుర్తించింది. 1955లో వచ్చిన హిందూ వివాహ చట్టం ప్రత్యేకపరిస్థితులలో వివాహం రద్దుని అనుమతించింది. పురుషునికొకే భార్య, స్త్రీకొకే భర్త అనే నియమాన్ని స్త్రీ పురుషులుభయులకు సమానంగా వర్తింపజేసింది. వరకట్నాన్ని నిషేధించినప్పటికి, ఈ దురాచారం సమాజంలో ఇంకా కొనసాగుతూనే ఉంది. పురుషులతో సమానంగా పనిచేసే హక్కుని భారతరాజ్యాంగం స్త్రీలకు

ప్రసాదించింది. ప్రభుత్వోద్యోగాలలో వారికి సమాన హక్కును గ్యారంటీ చేసింది. రాజ్యాంగంలోని ఆదేశక సూత్రాలలో స్త్రీ పురుషులుభయులకు సమానమైన పనికి సమానవేతనం అనే సూత్రం పొందుపర్చబడింది. అయితే, స్త్రీ, పురుష సమానతా సూత్రాన్ని ఆచరణలో పెట్టేటప్పుడు బైటికి కనబడేవీ, కనిపించనివీ అడ్డంకులనేకం ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఒక సక్రమమైన సామాజిక వాతావరణం ఇంకా నెలకొనవలసి ఉంది. అయినా, సంఘ సంస్కరణోద్యమం, స్వాతంత్ర్య పోరాటం, మహిళలు స్వయంగా లేవదీసిన ఉద్యమం, భారత రాజ్యాంగం, ఇవన్నీ స్త్రీ పురుష సమానతను సాధించే దిశలో గొప్ప సేవచేశాయి.

***కుల వ్యతిరేక పోరాటం:*** సంఘ సంస్కరణోద్యమం దాడిచేసిన మరొక ప్రధాన లక్ష్యం, కులవ్యవస్థ. హిందువులు నానారకాల కులాలుగా చీలిపోయిన రోజులవి. ఒక మనిషి పుట్టిన కులం అతని జీవితంలో చాలా రంగాల్ని నిర్ణయించింది. అది అతను ఎవర్ని పెళ్ళి చేసుకోవాలో నిర్ణయించింది. ఎవరితో కలిసి భుజించాలో నిర్ణయించింది. అతని వృత్తిని, అతని సాంఘిక విశ్వాసాల్ని నిర్ణయించింది. పైగా ఈ కులాలన్నీ అంతస్తు దొంతరగా పేర్చబడ్డాయి. ఈ కులనిచ్చెన అట్టడుగున అస్పృశ్యులు లేదా ఈనాడు మనం షెడ్యూల్డు కులాలని వ్యవహరిస్తున్న వాళ్ళు ఉన్నారు. హిందువుల జనాభాలో వాళ్ళు 20 శాతం. అస్పృశ్యులు లెక్కలేనన్ని కఠోర నిర్బంధాలకు, అనర్హతలకు గురయ్యారు. అవి ఒక్కో ప్రాంతంలో ఒక్కొక్కరకంగా ఉండేవి. వాళ్ళని ముట్టుకుంటే మైలపడిపోయినట్లు భావించారు అగ్రవర్ణాల హిందువులు. దేశంలో కొన్ని ప్రాంతాలలో, ముఖ్యంగా దక్షిణాదిన అంటరానివాడి నీడకూడా పడకూడదు. బ్రాహ్మణుడు వస్తున్నట్లు కనిపించినా, వినిపించినా అస్పృశ్యుడు వేగం దూరంగా తప్పుకోవాలి. అతని దుస్తులు, ఆహారం, నివాసం అన్నిటినీ అగ్రవర్ణాలవారు నిర్ణయించారు. అగ్రవర్ణాలవారు నీళ్ళుతోడుకునే బావిని అస్పృశ్యులు వాడుకునే వీలులేదు. అగ్రవర్ణాలవారు నీరు తెచ్చుకునే చెరువుకు అంటరాని వాళ్ళు పోయే వీలులేదు. అస్పృశ్యులకోసం ప్రత్యేకించబడ్డ నూతుల్లో, చెరువుల్లో నీళ్ళు మాత్రమే వాళ్ళు వాడుకోవాలి. అలా ప్రత్యేకంగా నూతులు, చెరువులు లేనిచోట్ల దొరువులు, పంటకాలవల్లోని మురికి నీళ్ళు తెచ్చుకుని తాగాలి. అస్పృశ్యుడికి హిందూ దేవాలయంలో ప్రవేశించే హక్కులేదు. శాస్త్రాలు చదివే అధికారం లేదు. సవర్ణ హిందువుల పిల్లలు చదువుకునే పాఠశాలల్లో అస్పృశ్యుల పిల్లలు అడుగుపెట్టటానికి వీలులేదు. పోలీసు, సైనిక శాఖల్లో వాళ్ళకి ఉద్యోగాలు నిషేధం. పాకీపని, చెప్పులు కుట్టటం, మృతకళేబరాల్ని తొలగించటం, చచ్చిన జంతువుల చర్మాలు వొలచటం, తోళ్ళు బాగుచేయటంవంటి హీనవృత్తుల్లో వాళ్ళని బలవంతంగా ఇరికించారు. సొంతభూమి కలిగివుండే హక్కులేదు కాబట్టి వాళ్ళు వ్యవసాయ కూలీలుగా, కౌలుదార్లుగా శ్రమించారు.

కులవ్యవస్థలో ఇంకొకవిధమైన చెరుపు కూడా వుంది. అది అమానుషం, మానహీనం మాత్రమే కాకుండా పుట్టుకతో సిద్ధించే అసమానతా సూత్రంమీద ఆధారపడి వుంది. ఇది పూర్తి ప్రజాస్వామ్య వ్యతిరేక సూత్రం. సామాజిక అనైక్యతకు, విచ్ఛిత్తికి కారణం. ఇది ప్రజల్ని లెక్కలేనన్ని ముఠాలుగా చీల్చింది. ఆధునిక యుగంలో జాతీయ సమైక్యతా భావం వికసించనీకుండా, ప్రజాస్వామ్యవ్యాప్తిని జరగనీకుండా ఇది

అడ్డుపడింది. ఈ కుల స్పృహ వివాహాది సందర్భాలలో ముస్లిములలో, క్రైస్తవుల్లో, సిక్కుల్లో సైతం అల్లుకుని వుంది. అయితే, ఈ మతాలవారు అస్పృశ్యతని పాటించినా హిందువులలో మాదిరి కఠోరరూపంలో మాత్రం కాదు.

కులవ్యవస్థని క్రమేణా నిర్వీర్యపరచే అనేక శక్తులు బ్రిటిషు పాలనతో వెలికివచ్చాయి. ఆధునిక పరిశ్రమల స్థాపన, రైళ్లు, బస్సుల ప్రవేశం, పట్టణాల పెరుగుదల వగైరాలవల్ల విభిన్న కులాలకు చెందిన మనుషుల మధ్య కలివిడి పెరిగింది ముఖ్యంగా పట్టణాల్లో ఈ పరస్పర సంబంధాలు ముమ్మరించాయి. ఆధునిక వాణిజ్యం, పరిశ్రమలు అందరికీ నూతన ఆర్థిక కార్యకలాపాల ద్వారాలు తెరిచాయి. ఉదాహరణకి ఒక బ్రాహ్మణ కులస్థుడుగానీ, అగ్రవర్ణ వ్యాపారస్థుడుగానీ తోళ్ళు, జోళ్ళు వ్యాపారంలో అవకాశాల్ని వదులుకోలేక పోయాడు. అట్లాగే డాక్టరు కావటానికి, సైనికుడు కావటానికి అవకాశం వస్తే నిరాకరించలేరు. భూముల క్రయవిక్రయాలలో కలిగిన స్వేచ్ఛ గ్రామాలలో కులాల సమతూకాన్ని తారుమారు చేసింది. లాభార్జనా ప్రవృత్తి ప్రధానపాత్ర ధరించే ఆధునిక పారిశ్రామిక సమాజంలో కులానికి-వృత్తికి మధ్యవుండే సన్నిహిత సంబంధం కొనసాగలేదు.

ఇక పరిపాలనలో- బ్రిటీషువాళ్ళు చట్టంముందు అందరూ సమానులే అన్న సూత్రాన్ని ప్రవేశపెట్టారు. కుల పంచాయతీల న్యాయనిర్ణయాధికారాన్ని లాగివేశారు. ప్రభుత్వోద్యోగాలలో కులవిచక్షణకు తావులేకుండా అందరికీ సమానావకాశాలు ప్రసాదించారు. పైగా నూతన విద్యావ్యవస్థ లౌకికమైంది. కాబట్టి అది వర్ణ తారతమ్యాలకు, కుల దృక్పధానికి మౌలికంగా వ్యతిరేకం.

భారతీయుల్లో ప్రజాస్వామ్య హేతువాద భావాలు వ్యాప్తిచెందటంతో, వాళ్ళు కులవ్యవస్థకు వ్యతిరేకంగా ధ్వజమెత్తారు. బ్రహ్మసమాజం, ప్రార్థనా సమాజం, ఆర్యసమాజం, సోషల్ కాన్ఫరెన్స్, రామకృష్ణమఠం, దివ్యజ్ఞాన సమాజం, ఇంకా 19వ శతాబ్ది సంఘసంస్కర్తలు యావన్మంది కులవ్యవస్థని ప్రతిఘటించారు. వాళ్ళలో చాలామంది చాతుర్వర్ణ్య విభజనని ఆమోదించినా, అమానుషమైన అస్పృశ్యతని ఖండించారు. లక్షలాది ప్రజలకు హుందాగా, మర్యాదగా జీవించే హక్కు లేనంతకాలం రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలలో జాతీయ సమైక్యత, జాతీయ ప్రగతి సాధించడం సాధ్యంకాదని వాళ్ళు గ్రహించారు.

జాతీయోద్యమ వికాసం కులవ్యవస్థని నిర్వీర్యపరచటంలో గణనీయమైన పాత్ర నిర్వహించింది. భారత ప్రజల్ని చీల్చే అన్ని సంస్థలకు, వ్యవస్థలకు జాతీయోద్యమం చుక్కెదురు. ఆ విధంగా, భారత జాతీయ కాంగ్రెస్ సంస్థ - ఆ మాటకొస్తే యావత్ జాతీయోద్యమం ఆదినుండి కులవిచక్షణని ప్రతిఘటించింది. సమాన పౌర హక్కులకోసం, సమాన స్వేచ్ఛకోసం, వర్ణలింగ భేద, మత వ్యత్యాసాల కతీతంగా వ్యక్తి వికాసం కోసం పోరాడింది.

గాంధీజీ జీవించినంతకాలం తన ప్రజాసేవా కార్యక్రమాల్లో అస్పృశ్యతా నిర్మూలనానికి ప్రథమస్థానం ఇచ్చారు. 1932లో ఆయన అఖిల భారత హరిజన సంఘాన్ని స్థాపించాడు.

19వ శతాబ్ది మధ్యమంచి అనేకమంది వ్యక్తులు, సంస్థలు అట్టడుగు కులాల ప్రజల్లో విద్యావ్యాప్తికి కృషి చెయ్యడం జరిగింది. వాళ్ళకు బడుల, గుడుల తలుపులు

తెరిపించటానికి, అందరూ ఉపయోగించుకునే నూతులు, చెరువుల నుంచి వాళ్ళు నీళ్ళు తెచ్చుకోడానికి, ఇంకా ఇతర సామాజిక అనర్హతల్ని తొలగించడానికి ఆ వ్యక్తులు కృషిచేశారు. సంస్థలు కృషి చేశాయి.

విద్య, చైతన్యం వ్యాప్తికావడంతో, కింది కులాలవాళ్ళు తమంతటతామే ముందుకు కదిలారు. తమ ప్రాథమిక మానవ హక్కుల్ని గురించి చైతన్యం పొందారు. ఆ హక్కుల రక్షణకుగాను నిలబడసాగారు. సాంప్రదాయక పీడనకు వ్యతిరేకంగా వాళ్ళు క్రమేణా ఒక బలవత్తరమైన ఉద్యమాన్ని నిర్మించారు. హరిజన కులంలో పుట్టిన డాక్టర్ అంబేద్కర్ తన యావజ్జీవితం అగ్రవర్ణాల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడాడు అందుకోసం అఖిలభారత దళిత వర్గాల ఫెడరేషన్‌ని స్థాపించాడు. దక్షిణాదిన 1920 ప్రాంతంలో బ్రాహ్మణేతరులు ఆత్మగౌరవ ఉద్యమాన్ని ప్రారంభించారు. బ్రాహ్మణులు బ్రాహ్మణేతరుల మీద రుద్దిన అనర్హతల్ని తొలగించుకోవటంకోసం బ్రాహ్మణేతరుల ఉద్యమం సాగింది. దేవాలయ ప్రవేశ నిషేధానికి వ్యతిరేకంగా, ఇంకా తదితర నిర్బంధాలకు వ్యతిరేకంగా దళిత కులాల ప్రజలు అఖిల భారత స్థాయిలో అసంఖ్యాక ఉద్యమాలు సాగించారు.

అస్పృశ్యతా వ్యతిరేకపోరాటం విదేశపాలనలో సంపూర్ణంగా విజయవంతం కాలేకపోయింది సమాజంలో సనాతనవర్గాల శత్రుత్వాన్ని కొనితెచ్చుకోడానికి విదేశ ప్రభుత్వం జంకింది స్వతంత్ర భారత ప్రభుత్వం ఒక్కటే సమాజంలో సమూల పరివర్తన తెచ్చే కార్యక్రమాన్ని చేపట్టగలుగుతుంది పైపెచ్చు సామాజిక సముద్ధరణ సమస్య రాజకీయ, ఆర్థిక ఉన్నతికి సంబంధించిన సమస్యతో సన్నిహితంగా ముడిపడివుంది. ఎలాగంటే, దళిత కులాల సాంఘిక అంతస్తును పెంచడానికి ఆర్థిక ప్రగతి తప్పనిసరి. అలాగే విద్యావ్యాప్తి, రాజకీయ హక్కులు అవసరం. భారత జాతీయ నాయకులు దీన్ని పూర్తిగా గుర్తించారు. ఉదాహరణకు, డాక్టర్ అంబేద్కర్ ఇలా అన్నారు:

"ఎవ్వరూ మీ అగచాట్లని తొలగించలేరు. రాజకీయాధికారం హస్తగతం కానిదే మీరూ ఆ పని చెయ్యలేరు.... జీవన సామాజిక, ఆర్థిక స్మృతిని సవరించటానికి జంకని మనుషులు అధికారంలో ఉండే ప్రభుత్వం మనకు ఉండితీరాలి. బ్రిటిషు ప్రభుత్వం ఎన్నటికీ ఈ పాత్ర నిర్వహించలేదు. ప్రజలకోసం, ప్రజలచేత ఏర్పడ్డ ప్రజల ప్రభుత్వం ఒక్కటే- అంటే స్వరాజ్య ప్రభుత్వం ఒక్కటే ఆ లక్ష్యసాధనని సాధ్యం చేస్తుంది".

1950లో రూపొందిన మన రాజ్యాంగం అస్పృశ్యత అంతిమ నిర్మూలనకు చట్టబద్ధమైన చట్టాన్ని తయారుచేసింది. రాజ్యాంగం అస్పృశ్యతని రద్దుచేసినట్లు ప్రకటించింది. ఏ రూపంలోగానీ అస్పృశ్యతని ఆచరణలో పాటించడాన్ని నిషేధించింది. "అస్పృశ్యత" ద్వారా తలెత్తే ఎటువంటి అనర్హతని సంక్రమింపజేసినా అది చట్టరీత్యా శిక్షార్హమైన నేరంగా పరిగణించబడింది. బావులు, చెరువులు, స్నాన ఘట్టాలు మొదలైనవి ఉపయోగించుకోవటంలో ఆంక్షలు పెట్టటానికి వీలులేకుండా రాజ్యాంగం నిషేధించింది. దుకాణాలు, భోజన, ఫలహారశాలలు, సినిమా ప్రదర్శనశాలలు మొదలైన వాటిలో ప్రవేశించటానికి ఎటువంటి అటంకాలు పెట్టటానికి వీలులేదని రాజ్యాంగం నిర్దేశించింది. భారత రాజ్యాంగంలోని ఆదేశక నియమాలలో ఒకటి

భవిష్యత్తులో ఏర్పడే ప్రభుత్వాలకు మార్గనిర్దేశం చేస్తూ ఇలా ఆదేశించింది: "జాతీయ జీవనంలోని అన్ని రంగాలలో సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని ఉజ్జీవింపజేసే సాంఘిక వ్యవస్థను వీలైనమేరకు కట్టుదిట్టంగా చేకూర్చడం ద్వారాను, దాన్ని రక్షించటం ద్వారాను రాజ్యము ప్రజల శ్రేయస్సును పెంపొందించడానికి పాటుపడాలి".

ఏమైనా, కులవ్యవస్థలోని చెడుగుకు వ్యతిరేకంగా పోరాటం ఇప్పటికీ భారత ప్రజల తక్షణ కర్తవ్యమైవుంది. అందునా గ్రామీణ ప్రాంతాలలో ఇది తక్షణ కర్తవ్యం.

# 1905-1918 సంవత్సరాల మధ్య జాతీయోద్యమం

*సమరశీల జాతీయవాద వికాసం:* కాలక్రమేణా దేశంలో సమరశీల జాతీయవాదం విస్తారసాగింది. 1905లో బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా ఉప్పొంగిన ఉద్యమంలో ఈ అతివాద ధోరణి వెల్లువికింది.

భారత జాతీయోద్యమం తొలిదశలో సైతం ప్రజలు చాలామందిలో విదేశాధిపత్యం వల్ల కలిగే దుష్పరిణామాల్ని గురించి, దేశభక్తిని పెంపొందించు కోవలసిన అవసరాన్ని గురించి చైతన్యం కలిగించింది. అది దేశంలో విద్యావంతులకు అవసరమైన రాజకీయ శిక్షణని అందించింది. ప్రజల మానసిక స్థితినే మార్చివేసి దేశంలో నూతన జీవం రేకెత్తించింది.

జాతీయ వాదులు కోరిన ముఖ్యమైన డిమాండ్లను బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరించక పోవటంతో రాజకీయ చైతన్యవంతులైన ప్రజలకు బ్రిటిష్ ప్రభుత్వం మీద భ్రమలు తొలగి పోయాయి. వాళ్ళంతా మితవాద భావాలు కలిగి, మితవాద పద్ధతులకు అంటిపెట్టుకున్నవాళ్ళు. సభలు, సమావేశాలు, మహజర్లు శాసనసభల్లో ప్రసంగాలు వగైరాల కన్నా ఇంకా శక్తివంతమైన రాజకీయ కార్యాచరణకు, పోరాట పద్ధతులకు పూనుకోవాలనే కాంక్ష చాలా మందిలో బలీయమైంది.

*బ్రిటిష్ పాలన నిజస్వరూపం - ప్రజల కనువిప్పు :* బ్రిటిష్ పాలనని లోలోపలనుంచి సంస్కరించ వచ్చుననే విశ్వాసం మితవాద జాతీయ నాయకుల రాజకీయాలకు పునాది. కాని రాజకీయ ఆర్థిక సమస్యలకు సంబంధించిన పరిజ్ఞానం పెరగటంతో ఈ విశ్వాసం క్రమేణా సన్నగిల్లింది. మితవాదుల రాజకీయ ఆందోళనే ఈ విశ్వాసం సన్నగిల్లటానికి చాలావరకు కారణం. జాతీయవాద రచయితలు, ఆందోళన కారులు భారత ప్రజల దారిద్ర్యానికి బ్రిటిషు పాలనే కారణమని నిందించారు. భారతదేశాన్ని ఆర్థికంగా కొల్లగొట్టి బ్రిటన్‌ని సంపన్నవంతం చేసుకోవటమే బ్రిటిషు పాలన ధ్యేయమని రాజకీయ చైతన్యవంతులైన భారతీయులకు తెలిసి వచ్చింది. బ్రిటిషు సామ్రాజ్య వాదాన్ని గద్దెదింపి, భారత ప్రజల అదుపాజ్ఞలలో నడిచే ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యనిదే భారతదేశం ఆర్థికంగా అభివృద్ధి చెందదని వాళ్ళు గ్రహించారు. ముఖ్యంగా భారతీయ పరిశ్రమలకు ప్రోత్సాహం, రక్షణ ఇచ్చే భారత ప్రభుత్వం ఆధ్వర్యం కింద తప్ప అవి అభివృద్ధి చెందవని జాతీయవాదులు గుర్తించారు. 1896 నుండి 1900 దాకా దేశంలో ప్రళయ తాండవం చేసి 90 లక్షల ప్రాణాల్ని బలిగొన్న భీకర కరువు కాటకాలు విదేశ పరిపాలన దుష్పరిణామాలకు ప్రతీకలుగా ప్రజలకు గోచరించాయి.

1892-1905 సంవత్సరాల మధ్య సంభవించిన రాజకీయ సంఘటనలు భారత

జాతీయ వాదుల్ని నిరాశ పర్చాయి వాళ్ళ దృష్టిని తీవ్రవాద రాజకీయాల వేపు మళ్ళించాయి. 1892 నాటి శాసనసభల చట్టం వారిని పూర్తిగా నిరుత్సాహ పర్చింది విదేశ ప్రభుత్వం పట్ల ప్రజానీకంలో రాజకీయ అసంతృప్తిని రెచ్చగొట్టటం నేరంగా ప్రకటిస్తూ 1898లో చట్టం వచ్చింది. 1899లో కలకత్తా పురపాలక సంస్థలో భారతీయ సభ్యుల సంఖ్య తగ్గించబడింది. 1904లో ప్రభుత్వం పత్రికా స్వాతంత్ర్యం మీద ఆంక్షలు విధిస్తూ చట్టం తెచ్చింది. 1897లో నాతూ సోదరుల్ని విచారణ లేకుండా దేశం నుంచి బహిష్కరించింది అదే సంవత్సరం, విదేశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్ని రెచ్చగొడుతున్నారనే నేరంమీద లోకమాన్య తిలక్, ఇంకా ఇతర పత్రికా సంపాదకులు దీర్ఘ కారాగార శిక్షలకు గురయ్యారు. ప్రభుత్వం తమకు రాజకీయ హక్కులు ఎక్కువ చెయ్యటానికి బదులు ఉన్న స్వల్ప హక్కుల్ని సైతం లాగివేసుకొంటుందని ప్రజలు అర్థం చేసుకున్నారు. బ్రిటిషువాళ్ళ దొరతనం భారతదేశంలో సాగినంత కాలం రాజకీయ, ఆర్థిక ప్రగతి ఒనగూడుతుందని ఆశించడం వ్యర్థమని లార్డ్ కర్జన్ కాంగ్రెస్ వ్యతిరేక వైఖరి ద్వారా ప్రజలకు ఇతోధికంగా బోధపడింది. "బ్యూరోక్రసీ నిర్మొహమాటంగా స్వార్థపరత్వం పెంచుకుంటోంది భారత జాతీయ వాంఛలకు వ్యతిరేకంగా బాహాటంగా కత్తిగట్టింది" అన్నాడు గోఖలే వంటి మితవాద జాతీయ నాయకుడు సైతం

కనీసం సామాజికంగా, సాంస్కృతికంగా సైతం బ్రిటిషు పాలన అభ్యుదయాత్మకంగా లేదు ప్రాథమిక, సాంకేతిక విద్యా వ్యాప్తి స్తంభించి పోయింది. ఉన్నత విద్యపట్ల అధికార్లకు అనుమానాలు ఎక్కువయ్యాయి ఉన్నత విద్యా వ్యాప్తిని నిరుత్సాహ పర్చటానికి సైతం వాళ్ళు ప్రయత్నం చేశారు. 1904లో వచ్చిన భారత విశ్వ విద్యాలయ చట్టాన్ని జాతీయ నాయకులు ఆమోదించ లేదు. భారతీయ విశ్వ విద్యాలయాల్ని ప్రభుత్వం పూర్తిగా తన అదుపాజ్ఞల్లో పెట్టుకోటానికి, ఉన్నత విద్యా వ్యాప్తిని అరికట్టటానికి ఉద్దేశింప బడ్డ చట్టంగా జాతీయ నాయకులు దాన్ని పరిగణించారు

ఈ విధంగా, భారత ప్రజల్లో చాలామంది దేశ ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికాభివృద్ధికి స్వపరి పాలిత ప్రభుత్వం తప్పనిసరిగా ఉండి తీరాలని గట్టిగా నమ్మారు. రాజకీయ దాస్యం అంటే భారత ప్రజల అభివృద్ధిని ఎదగనివ్వకుండా చెయ్యటమేనని ప్రజలకు అర్థమైంది.

***ఆత్మ గౌరవం, ఆత్మ విశ్వాసం :*** 19వ శతాబ్దాంతం నాటికి భారత జాతీయ వాదుల్లో ఆత్మ గౌరవం, ఆత్మ విశ్వాసం పెరిగాయి. తమని తాము పరిపాలించు కోగలమనే తమ శక్తి సామర్థ్యాలలో నమ్మకం కుదిరింది. దేశ భవిష్యదభివృద్ధిలో విశ్వాసం కలిగింది. లోకమాన్య తిలక్, బిపిన్ చంద్రపాల్ వంటి నాయకులు ఆత్మ గౌరవ సందేశాన్ని ప్రచారం చేశారు. భారత ప్రజల శీలం, శక్తి సామర్థ్యాల మీద ఆధారపడాలని జాతీయ వాదుల్ని హెచ్చరించారు.

తమ దుస్థితికి నివారణోపాయం తమ చేతుల్లోనే ఉందని వారు ప్రజలకు ఉద్బోధించారు. కాబట్టి ప్రజలంతా నిర్భయులుగా, బలోపేతులుగా తయారు కావాలని కోరారు. స్వామి వివేకానంద రాజకీయ నాయకుడు కాకపోయినా ఇదే సందేశాన్ని పదే పదే ఉద్ఘోషించాడు. " ఈ ప్రపంచంలో పాపమన్నది ఒకటి ఉంటే అదే బలహీనత.

బలహీనతల్ని మానుకోండి బలహీనత అనేది పాపం బలహీనత మృత్యువు... మిమ్మల్ని భౌతికంగా, బౌద్ధికంగా, ఆధ్యాత్మికంగా బలహీనులుగా చేసేదాన్ని విషంగా భావించి విసర్జించండి అందులో జీవం లేదు అది నిజమైంది కాదు ఇదే సత్య పరీక్ష" అని ప్రకటించాడాయన

గత వైభవపు మత్తులో తేలిపోవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశాడు పురుషకారంతో భవిష్యత్తును నిర్మించుకోండని ఆయన ఉద్బోధ చేశాడు. "ఓ భగవంతుడా! నా దేశం గతంలో జీవించే పరిస్థితి నుంచి ఎన్నటికి బైట పడుతుంది?" అని ఆక్రోశించాడాయన

స్వయంకృషిలో విశ్వాసం జాతీయోద్యమాన్ని విస్తృతం చెయ్యాలన్న ఆకాంక్షని సృష్టించింది జాతి ఆశయం కొద్దిమంది ఉన్నత వర్గాల విద్యావంతుల వరకే పరిమితమై పోకూడదు. విశాల ప్రజా బాహుళ్యంలో రాజకీయ చైతన్యం ఉరకలెత్తాలి. "భారత దేశం యొక్క ఏకైక ఆశ- జనబాహుళ్యం ఉన్నత వర్గాల వాళ్ళు భౌతికంగా, నైతికంగా మృతప్రాయులు" అన్నాడు స్వామి వివేకానంద. స్వాతంత్ర్య సాధనలో అమేయ త్యాగాలు చెయ్యగలిగింది ప్రజా సామాన్యం మాత్రమే అన్న సత్యాన్ని జాతీయ నాయకులు గుర్తించారు జాతీయ కాంగ్రెస్ సభలో, రాష్ట్ర సభలో జరిగే నాలుగు రోజుల వరకే రాజకీయ కార్యకలాపాలు పరిమితం కావటానికి బదులు అవి నిరంతరాయంగా కొనసాగాలని జాతీయ వాదులు భావించారు.

*విద్య, నిరుద్యోగం :* 19వ శతాబ్దాంతానికి దేశంలో విద్యావంతుల సంఖ్య గణనీయంగా పెరిగింది వాళ్ళలో చాలామంది అతితక్కువ వేతనం మీద ప్రభుత్వోద్యోగాలలో చేరారు. ఇంకా చాలామంది నిరుద్యోగులుగా మిగిలి పోయారు. వారి ఆర్థిక దుస్థితి బ్రిటిషు పాలన స్వభావాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించేటట్లు చేసింది. నిరుద్యోగులలో చాలామంది విప్లవ శీల జాతీయ రాజకీయాల వేపు ఆకర్షితు లయ్యారు.

విద్యావ్యాప్తి తాలూకు సైద్ధాంతికమైన అంశం చాలా ముఖ్యమైంది. విద్యావంతుల సంఖ్య ఎంత పెరిగితే, పాశ్చాత్య భావాల ప్రభావం అంత పెరిగింది. ప్రజాస్వామ్యం, జాతీయవాదం, సమాజం సమూలంగా మారాలనే రాడికల్ భావాలు వగైరా పాశ్చాత్య సిద్ధాంతాలు విస్తృతి పొందాయి. విద్యావంతులు ఈ భావాలను వ్యాప్తి చేయటంలో విశిష్ట ప్రచారకులుగా తయారయ్యారు. సమరశీల జాతీయ వాదాన్ని అనుసరించారు. ఎందుచేతనంటే వాళ్ళ వేతనాలు అతి తక్కువ, లేదా వాళ్ళు నిరుద్యోగులు. పైగా వాళ్ళు నూతన ఆలోచనా విధానం రాజకీయాలు, విరోపా ప్రపంచ చరిత్రలు ఆకళించుకున్న వాళ్ళు.

*అంతర్జాతీయ ప్రభావం :* అదే కాలంలో ఇతర దేశాలో సంభవించిన సంఘటనలు భారతదేశంలో సమరశీల జాతీయవాదం విస్ఫారటానికి దోహదం చేశాయి. 1868 తరువాత జపాన్ గొప్ప అభివృద్ధి సాధించింది. ఒక వెనుకబడ్డ ఆసియా దేశం పాశ్చాత్యుల పెత్తనం కింద లేకుండా స్వశక్తి మీద అభివృద్ధి పొందవచ్చునేది జపాన్ ఆవతరణ నిరూపించింది. కొద్ది దశాబ్దాల కాలంలో జపాన్ నాయకులు తమ దేశాన్ని ప్రథమ స్థాయి పారిశ్రామిక, సైనిక శక్తిగా రూపొందించారు. సార్వత్రిక ప్రాథమిక విద్య ప్రవేశ పెట్టారు. సమర్థవంతమైన ఆధునిక పరిపాలనా విధానాన్ని నిర్మించారు.

1896లో ఇథియోపియన్ల చేతుల్లో ఇటలీ సైన్యం ఓటమి, 1905లో జపాన్ చేతుల్లో రష్యా పరాజయం ఐరోపా గొప్పతనపు మాయతెరని చించి వేశాయి. ఐరోపా ఖండంలో ఒక అతి పెద్ద సైనిక శక్తి మీద ఆసియాలోని ఒక చిన్నదేశం విజయం సాధించిందన్న వార్త ఆసియాలో ప్రతిచోటా ప్రజల్ని ఆనందంలో ముంచెత్తింది. ఉదాహరణకు, లోకమాన్య తిలక్ సంపాదకత్వంలో వెలువడే 'కేసరి' పత్రిక 1904, డిశంబర్ 6వ తేదీ సంచికలో జపాన్ విజయాన్ని ప్రశంసిస్తూ ఉత్తేజకరమైన వ్యాఖ్యలు వచ్చాయి. ఆసియా దేశాలు స్వతంత్ర జాతులుగా అవతరించి తమ ఐరోపా ప్రత్యర్థులకు సమవుజ్జీ కాగలవనటం అసంబద్ధమేమీ కాదని 'కేసరి' వ్యాఖ్యానించింది. 'కరాచీ క్రానికల్' 1905, జూన్ 18 సంచిక భారత ప్రజల మనోభావాల్ని ఇలా తేటతెల్లం చేసింది :

"ఒక ఆసియాదేశం చేసిన పనిని మిగతా దేశాలూ చెయ్యగలవు.. రష్యాని జపాన్ చిత్తు చేయగలగ్గా, ఇంగ్లండుని ఇండియా సునాయాసంగా చిత్తు చెయ్యగలుగుతుంది... బ్రిటీషు వాళ్ళని మనమూ సముద్రంలోకి తోసేద్దాం. ప్రపంచంలో అగ్ర రాజ్యాల మధ్య జపాన్ సరసన మనమూ మన స్థానాన్ని సాధించుకుందాం."

త్యాగాలకు సిద్ధపడి, ప్రజలంతా ఒక్కటై రంగంలోకి దూకితే మహాశక్తివంతమైన నిరంకుశ ప్రభుత్వాలనైనా సవాలు చెయ్యవచ్చుననే సత్యాన్ని ఐర్లండ్, రష్యా, ఈజిప్టు, టర్కీ, చైనాలలోని విప్లవోద్యమాలూ, దక్షిణాఫ్రికాలో బోయర్ యుద్ధం భారత ప్రజల మనస్సు కెక్కించాయి. దేశభక్తి చైతన్యం, ఆత్మబలిదానం అన్నిటికన్నా ముఖ్యంగా కావాలి.

***సమరశీల జాతీయ వాదం :*** జాతీయోద్యమ ప్రారంభం నుంచి దేశంలో సమరశీల జాతీయ, భావాలు వ్యాప్తిలో ఉన్నాయి. బెంగాల్‌లో రాజ్‌నారాయణ్ బోస్, అశ్వనీ కుమార దత్తు వంటి వాళ్ళు, మహారాష్ట్రలో విష్ణుశాస్త్రి చిప్లుంకర్ వంటి వాళ్ళు ఈ భావాలకు ప్రాతినిధ్యం వహించారు. వీళ్ళందరిలోకి అత్యంత ప్రముఖుడు లోకమాన్య బాలగంగాధర తిలక్. ఆయన 1856లో జన్మించాడు. బొంబాయి విశ్వ విద్యాలయంలో పట్టభద్రుడైన నాటినుంచి, ఆయన తన యావజ్జీవితం దేశ సేవకు అంకితం చేశాడు. 1880 ప్రాంతంలో 'న్యూ ఇంగ్లీష్ స్కూల్' స్థాపనకు ఆయన కారకుడు. అదే తరువాత ఫెర్గుసన్ కళాశాలగా పరిణతి చెందింది. ఇంగ్లీషులో 'మరాఠా', మరాఠీలో 'కేసరి' పత్రికల్ని ప్రారంభించటానికి ఆయనే కారకుడు. 1889 నుంచి ఆయన కేసరి పత్రికకు సంపాదకత్వ బాధ్యత స్వీకరించాడు. ఆ పత్రిక ద్వారా ప్రజల్లో జాతీయ భావాలు ప్రచారం చేశాడు. భారతదేశ స్వాతంత్ర్య సాధనలో ప్రజలంతా ధైర్యవంతులుగా స్వావలంబనపరులుగా, నిస్వార్థయోధులుగా తయారు కావాలని ఆయన తన పత్రిక ద్వారా ప్రజలకు ఉద్బోధ చేశాడు. 1893లో ఆయన మహారాష్ట్రలో సాంప్రదాయకంగా జరిగే గణపతి ఉత్సవాలను జాతీయవాద ప్రచారానికి ఉపయోగించాడు. ఉత్సవాలలో పాటలు, ప్రసంగాల ద్వారా జాతీయ భావాలు ప్రచారం చేశాడు. 1895లో ఆయన శివాజీ ఉత్సవాల్ని ప్రారంభించాడు. శివాజీని ఆదర్శంగా చూపిస్తూ మహారాష్ట్ర యువతలో జాతీయతా భావం ఉద్దీప్తం చెయ్యటానికి ఆయన ఈ ఉత్సవాల్ని ప్రారంభించాడు. 1896-97లో మహారాష్ట్రలో ఆయన పన్నుల నిరాకరణోద్యమానికి అంకురార్పణ చేశాడు. పంటలు పండకపోతే శిస్తు కట్టవద్దని

కరువు బాధితులైన మహారాష్ట్ర రైతాంగానికి పిలుపిచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లో అసంతృప్తిని, ద్వేషాన్ని రెచ్చగొడుతున్నాడన్న నేరంమీద అధికార్లు ఆయనని అరెస్టు చేసిన సందర్భంలో ధైర్యాన్ని, త్యాగాన్ని చేతలలో ప్రదర్శించి ఆదర్శమూర్తి అయ్యాడు. ప్రభుత్వానికి క్షమాపణ చెప్పటానికి నిరాకరించి 18 మాసాల కఠిన కారాగార శిక్ష అనుభవించాడు. అలా ఆత్మత్యాగంతో కూడిన నూతన జాతీయ చైతన్యానికి ఆయన సజీవ ప్రతీక అయ్యాడు.

20వ శతాబ్దారంభంలో సమరశీల జాతీయ వాదుల ఉద్యమానికి రాజకీయ వాతావరణం ఉదయించింది. ఆ ఉద్యమం అనుయాయులు జాతీయోద్యమ ద్వితీయ ఘట్టానికి సారథ్యం వహించడానికి ముందుకు వచ్చారు. లోకమాన్య తిలక్ మాత్రమే కాకుండా బిపిన్ చంద్రపాల్, అరవింద ఘోష్, లాలా లజపత్‌రాయ్‌లు సమరశీల జాతీయోద్యమ ప్రముఖ నేతలయ్యారు. వారి కార్యక్రమంలోని ముఖ్యమైన రాజకీయ వైఖరులేమిటో పరిశీలిద్దాం :

భారతీయులు తమ విముక్తి కోసం తామే కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి, తామున్న హైన్యస్థితినుంచి పైకి రావటానికి స్వయంగా పాటుపడాలి అని వాళ్ళు నమ్మారు. ఈ కర్తవ్య పరిపూర్తికి నిష్ఠుర కష్టాలకు, నిరుపమాన త్యాగాలకు సిద్ధపడాలని వాళ్ళు ప్రకటించారు. వారి ప్రసంగాలలో, రచనల్లో, రాజకీయ కార్యకలాపాల్లో సాహసం, ఆత్మ విశ్వాసం వెల్లి విరిశాయి. దేశంకోసం ఎంతటి వ్యక్తిగత త్యాగమైనా స్వల్పమేనని వాళ్ళ నమ్మిక.

భారతదేశం బ్రిటిషువారి "ఉదార మార్గదర్శకత్వం"లో, ఆధిపత్యంలో ప్రగతి సాధించగలదనే వాదాన్ని వాళ్ళు నిరాకరించారు. వారంతా పరాయి పాలనని తీవ్రంగా గర్హించారు. స్వరాజ్య సాధనే జాతీయోద్యమ లక్ష్యం అని వాళ్ళు విస్పష్టంగా ప్రకటించారు.

ప్రజాశక్తిలో వాళ్ళకు ప్రగాఢ విశ్వాసం ఉంది. ప్రజా కార్యాచరణ ద్వారా స్వరాజ్య సాధనకు వాళ్ళు ఉపక్రమించారు. కాబట్టే వాళ్ళు జనబాహుళ్యంలో రాజకీయ కృషి సాగాలని, జన బాహుళ్యం ప్రత్యక్ష రాజకీయ కార్యాచరణకు దిగాలని పట్టుబట్టారు.

***సుశిక్షిత నాయకత్వం :*** 1905 నాటికి భారతదేశంలో సుశిక్షితులైన నాయకులు చాలామంది తయారయ్యారు. వాళ్ళంతా లోగడ రాజకీయ ఆందోళనలు నడపడంలో, రాజకీయ పోరాటాలకు నాయకత్వం వహించడంలో విలువైన అనుభవం గడించారు. సుశిక్షితులైన రాజకీయ కార్యకర్తలు లేకుండా జాతీయోద్యమాన్ని ఇంకా ఉన్నతమైన రాజకీయ దశకు తీసుకుపోవటం సాధ్యం కాదు.

***బెంగాల్ విభజన :*** ఆ విధంగా, సమరశీల జాతీయవాద ఆవిర్భావానికి పరిస్థితులు పరిణమించాయి. 1905లో బెంగాల్ విభజన ప్రకటించ బడింది. భారత జాతీయోద్యమం రెండవ ఘట్టంలో ప్రవేశించింది. వైస్రాయి లార్డ్ కర్జన్ 1905 జూలై 20వ బెంగాల్ రాష్ట్రాన్ని రెండుగా విభజిస్తూ ఉత్తర్వు జారీ చేశాడు. 3 కోట్ల పది లక్షల జనాభా కలిగిన తూర్పు బెంగాల్, అస్సాములు కలిపి ఒక భాగం, 5 కోట్ల 40 లక్షల జనాభా గల మిగతా బెంగాల్ రెండవ భాగం. అందులో కోటీ ఎనభై లక్షలమంది బెంగాలీలు, మిగిలిన 3కోట్ల 60 లక్షలమంది బీహారీలు, ఒరియాలు. అంతటి విశాల

బెంగాల్ రాష్ట్రాన్ని ఒక్క రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా పరిపాలించటం చాలా కష్టమైన పని కాబట్టి రాష్ట్రాన్ని రెండు భాగాలుగా విభజిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కాని విభజన వ్యూహాన్ని రచించిన అధికారుల లక్ష్యాలు వేరు బెంగాల్‌లో ఉప్పొంగే జాతీయోద్యమ వెల్లువకు అడ్డుకట్ట వెయ్యటం వాళ్ళ ఆశయం భారతప్రభుత్వ హోంశాఖ కార్యదర్శి రిస్లే 1904 డిశంబర్ 6న రాసిన నోట్‌లో ఇలా ఉంది :

"అవిభక్త బెంగాల్ ఒక శక్తి. దాన్ని విడగొడితే కకావికలవుతుంది కాంగ్రెస్ నాయకులు భావించేది అదే. వాళ్ళ అనుమానాలు పూర్తిగా సరైనవే బెంగాల్ విభజన ప్రతిపాదనలో గొప్పగా పరిగణింపదగ్గ అంశం అదే. బీరార్‌ని మధ్య పరగణాలతో విలీనం చేసిన పద్ధతి మాదిరిగానే ఈ పథకంలో బెంగాల్‌ని చీల్చి, మన పాలనని ప్రతిఘటించే గట్టి ప్రత్యర్థుల్ని బలహీనపర్చడమే మన ప్రధాన ధ్యేయం."

1905 ఫిబ్రవరిలో లార్డ్ కర్జన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు కాంగ్రెస్ సంస్థ పలుకుబడి యావత్తు బెంగాల్‌లోనే కాకుండా, దేశం మొత్తంలో పాకిపోవటానికి కలకత్తా ఒక కేంద్రమైందని లార్డ్ కర్జన్ అభిప్రాయం. కాబట్టి, కాంగ్రెస్ సంస్థ యొక్క విజయవంతమైన కుతంత్రానికి కేంద్రంగా తయారైన కలకత్తాని పడగొట్టాలని ఆయన రాశాడు.

భారత జాతీయ కాంగ్రెస్, బెంగాల్ జాతీయ వాదులు విభజనని దృఢంగా వ్యతిరేకించారు. బెంగాల్ రాష్ట్రంలోపల జమీందార్లు, వ్యాపారస్థులు, న్యాయవాదులు, విద్యార్థులు, పట్టణ పేద తరగతులు, ఆఖరికి స్త్రీలతో సహా సమస్త వర్గాల ప్రజలు స్వరాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా ఒక్కుమ్మడిగా విజృంభించారు.

భారత జాతీయతకు బెంగాల్ విభజనని ఒక సవాలుగా జాతీయ వాదులు పరిగణించారు. ఈ చర్య కేవలం పరిపాలనా సౌలభ్యం కోసం తలపెట్టింది కాదని వాళ్ళు గ్రహించారు. వాళ్ళ దృష్టిలో అది బెంగాల్‌ని చీల్చి, బెంగాల్‌లో జాతీయావేశాన్ని నిర్వీర్యపరచి కూలగొట్టటానికి పన్నిన బుద్ధి పూర్వక ప్రయత్నం. అది బెంగాల్ భాషా, సంస్కృతుల వికాసానికి కూడా గొడ్డలిపెట్టు. పరిపాలనా సామర్థ్యమే ఆ ప్రతిపాదన లక్ష్యమయితే, బెంగాలీ భాషా ప్రాంతం నుంచి హిందీ, ఒరియా భాషా ప్రాంతాల్ని విడదీస్తే సరిపోతుందని జాతీయ నాయకులు సూచించారు. పైగా అది ప్రజాభిప్రాయాన్ని కాలరాచివేస్తూ ప్రభుత్వం తీసుకున్న చర్య. అది ధైర్యోపేతులైన బెంగాలీ ప్రజల సున్నిత హృదయాన్ని గాయపర్చిన చర్య కావటమే బెంగాల్ ప్రతిఘటనలోని తీవ్రావేశ స్ఫూర్తికి కారణం.

***విభజన వ్యతిరేక ఉద్యమం లేదా స్వదేశీ ఉద్యమం — విదేశ వస్తు బహిష్కరణోద్యమం :*** జాతీయోద్యమంలోని ఏ ఒక వర్గమో కాకుండా, యావత్తు జాతీయోద్యమ నాయకత్వం విభజన వ్యతిరేకోద్యమాన్ని లేపింది. ఉద్యమం ప్రారంభదశలో సురేంద్రనాథ్ బెనర్జీ, కృష్ణకుమార మిత్రా వంటి మితవాదులు ప్రముఖ పాత్ర నిర్వహించారు. మలిదశలో విప్లవ జాతీయవాదులు ఉద్యమాన్ని చేబట్టారు. నిజానికి, మితవాదులు అతివాదులుభయులూ ఉద్యమంలో పరస్పరం సహకరించుకున్నారు.

విభజన వ్యతిరేకోద్యమం 1905 ఆగస్టు 7న ప్రారంభమైంది. ఆరోజు కలకత్తా

టౌన్ హాలులో విభజనకు వ్యతిరేకంగా బ్రహ్మాండమైన ప్రదర్శన జరిగింది. ఆ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు ఉద్యమాన్ని రాష్ట్రం నలుమూలలకు తీసుకుపోవటానికి తలొక దిక్కుకు కదిలి వెళ్ళారు.

విభజన 1905 అక్టోబర్ 16న అమల్లోకి వచ్చింది. ప్రతిఘటనోద్యమ నాయకులు ఆ రోజుని బెంగాల్ అంతటా జాతీయ సంతాప దినంగా ప్రకటించారు. నిరాహార దీక్ష పాటిచారు. కలకత్తాలో హర్తాల్ జరిగింది. ప్రజలు జోళ్ళు లేకుండా వట్టి కాళ్ళతో నడిచి వెళ్ళి ఉషఃకాలంలో గంగానదిలో స్నానాలు చేశారు. ఆ సందర్భానికనుగుణంగా రవీంద్ర కవీంద్రుడు ఒక జాతీయగీతం రచించాడు. ఆ గీతం ఆలాపిస్తూ అశేష జనవాహిని కలకత్తా వీధుల్లో పరవళ్ళు తొక్కింది. బంకించంద్రుని వందేమాతరం నినాదంతో కలకత్తా వీధులు మార్మోగి పోయాయి. ఆనాటి నుంచే వందేమాతరం వంగజాతీయ గీతమైంది. రక్షాబంధన ఉత్సవం కొత్త పుంత తొక్కింది. ఆ రోజున బెంగాల్ ప్రజలు రెండు బెంగాలుల, బెంగాలీల అభేద్య సమైక్యతకు చిహ్నంగా పరస్పరం ఒకరిచేతికొకరు రక్షాబంధం కట్టారు.

ఆ రోజు మధ్యాహ్నం బ్రహ్మాండమైన ప్రజా ప్రదర్శన జరిగింది. జాతీయ నాయకుల్లో అతిరథుడు ఆనందమోహన్ బోస్ బెంగాల్ అవినాశ సమైక్యతకు ప్రతీకగా ఫెడరేషన్ హాలుకు శంకుస్థాపన చేశాడు. 50వేల మంది ప్రజలకు పైగా హాజరైన బ్రహ్మాండమైన బహిరంగ సభలో ప్రసంగించాడు. ఆ మహాసభలో బెంగాల్ ఐక్యతా పరిరక్షణకు కాయశక్తులా కషి చేస్తామని ఒక ప్రతిజ్ఞా తీర్మానం ఆమోదించ బడింది.

***స్వదేశీ ఉద్యమం, విదేశీ వస్తు బహిష్కరణ :*** ప్రజా ప్రదర్శనలు, బహిరంగ సభలు, తీర్మానాలు పాలకులపైన అట్టే ప్రభావం చూపకపోవచ్చునని బెంగాల్ నాయకులు భావించారు. ప్రజల తీవ్ర ఆవేదన, ఆవేశం ప్రస్ఫుటంగా ప్రదర్శితమయ్యే ఒక దృఢ కార్యాచరణ అవసరమైంది. అదే స్వదేశీ ఉద్యమం - విదేశ వస్తు బహిష్కరణ. బెంగాల్ అంతటా బహిరంగ సభలు, సమావేశాలు జరిగాయి. ఆ సభలు, సమావేశాల్లో స్వదేశీ వస్తువుల్నే వాడతామని, విదేశ వస్తువుల్ని బహిష్కరిస్తామని ప్రజలు ప్రకటించారు, ప్రతిన పూనారు. అనేకచోట్ల బహిరంగంగా విదేశ వస్త్ర దహనం జరిగింది. విదేశ వస్త్రాల్ని అమ్మే దుకాణాల ముందు ప్రజలు పికెటింగు చేశారు. స్వదేశీ ఉద్యమం ఒక బ్రహ్మాండమైన విజయం. సురేంద్రనాథ్ బెనర్జీ ఇలా వర్ణించాడు :

"స్వదేశీవాదం బాగా బలంగా ఉన్న రోజుల్లో అది మా సాంఘిక, గృహ జీవన నిర్మాణం సమస్తాన్ని కాంతివంతం చేసింది. వివాహ కానుకలలో స్వదేశ వస్తువులకు బదులుగా విదేశ వస్తువులు ఇచ్చిన సందర్భాలలో వాటిని తిప్పి కొట్టారు. దేవతా సమర్పణకు విదేశ వస్తువుల్ని ఉంచిన ఉత్సవాలు వ్రతాలలో, పురోహితులు పూజాదికాలు నిర్వహించటానికి నిరాకరించారు. విదేశ చక్కెరని గానీ, ఉప్పుని గానీ వాడిన విందులకు హాజరు కావటానికి అతిధులు నిరాకరించారు."

స్వదేశీ ఉద్యమం భారతీయ పరిశ్రమలకు గొప్ప ప్రోత్సాహం ఇచ్చింది. అనేక బట్టల మిల్లులు, సబ్బు, అగ్గిపుల్లల ఫ్యాక్టరీలు, చేనేత పరిశ్రమలు, జాతీయ బ్యాంకులు, భీమా కంపెనీలు ప్రారంభమయ్యాయి. ఆచార్య పి.సి.రే స్వప్రసిద్ధ బెంగాల్ కెమికల్ స్వదేశీ స్టోర్సు తెరిచాడు. మహాకవి రవీంద్రనాథ టాగోర్ సైతం ఒక స్వదేశీ స్టోర్సు ప్రారంభం కావటానికి సహాయం చేశాడు.

స్వదేశీ ఉద్యమం సాంస్కృతిక రంగంలో అనేక ఫలితాలు సాధించింది. జాతీయ కవిత, వచనం, పత్రికా రచన వికసించాయి. రవీంద్రనాథ టాగూర్, రజనీకాంతసేన్, ముకుందదాస్ వంటి కవులు ఆనాడు రాసిన గీతాల్ని బెంగాల్‌లో ప్రజలిప్పటికీ పాడుకొంటున్నారు. ఆనాడు చేపట్టిన మరొక నిర్మాణాత్మక కార్యం - జాతీయవిద్య. సాహిత్య, సాంకేతిక, వ్యాయామ విద్యని బోధించే జాతీయ విద్యా సంస్థల్ని ప్రారంభించ టానికి జాతీయవాదులు ముందుకొచ్చారు. అప్పుడు సాగుతున్న విద్యావిధానం జాతీయ ప్రతిపత్తి లేకుండా చేసేది గాను, మన అవసరాలకు సరిపోనిది గాను ఉన్నదని వాళ్ళు భావించారు. 1906 ఆగస్టు 15న జాతీయ విద్యా సమితి అవతరించింది. కలకత్తాలో జాతీయ కళాశాల ప్రారంభమైంది దానికి అరవింద ఘోష్ ప్రిన్సిపాలు.

**విద్యార్థుల, మహిళల, ముస్లిముల, సామాన్య ప్రజల పాత్ర :** స్వదేశీ ఆందోళనోద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించిన వాళ్ళు బెంగాల్ విద్యార్థులు. వాళ్ళు స్వయంగా స్వదేశీ వస్తువుల్ని వాడారు. స్వదేశీ వస్తు వాడకాన్ని వాడవాడలా ప్రచారం చేశారు. విదేశ వస్త్రాలను అమ్మే దుకాణాలముందు పికెటింగులు జరిపారు బహుశా, బెంగాల్‌లో స్వదేశీ చైతన్యానికి ప్రధానకర్తలు వాళ్ళేననాలి విద్యార్థుల్ని అణచి వెయ్యటానికి ప్రభుత్వం సర్వ ప్రయత్నాలు చేసింది స్వదేశీ ఆందోళనలో క్రియాశీల పాత్ర నిర్వహించిన విద్యార్థులు చదివే పాఠశాలలు, కళాశాలల మీద చర్య తీసుకోడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సంస్థల కిచ్చే గ్రాంట్లు, తదితర సౌకర్యాలు ఉపసంహరించ బడ్డాయి. అవి ఏ విశ్వ విద్యాలయానికి గాని అనుబంధంగా ఉండే సౌకర్యాన్ని లేకుండా చేశారు. అక్కడ చదివే విద్యార్థులు ఉపకార వేతనాల కోసం పోటీ చేసే అర్హతను లాగివేశారు. ఆ విద్యార్థులు ఏ ప్రభుత్వోద్యోగాల్లోను ప్రవేశించే అవకాశం లేకుండా చేశారు. జాతీయాందోళనోద్యమంలో పాల్గొన్నట్టుగా గుర్తింపబడిన విద్యార్థులపైన అధికార్లు క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. అనేకమందికి జరిమానాలు విధించారు. పాఠశాలలు, కళాశాలల నుండి బహిష్కరించారు అరెస్టు చేసి జైళ్ళలో కుక్కారు. పోలీసుల చేత లాఠీలతో బాదించారు. ఎన్ని హింసా, నిర్బంధాలు సాగినా విద్యార్థులు తలవొగ్గలేదు.

స్వదేశీ ఆందోళనలో మహిళలు చురుగ్గా పాల్గొనడం ఒక విశేషం. సాధారణంగా అంటిపెట్టుకొని వుండే పట్టణ మధ్య తరగతి మహిళలు ఊరేగింపుల్లో పాల్గొన్నారు, పికెటింగులు చేశారు. అప్పటి నుంచి మహిళలు జాతీయోద్యమంలో పాల్గొనడం ప్రారంభమైంది.

ప్రముఖ బారిష్టరు అబ్దుల్ రసూల్, ప్రసిద్ధ ఆందోళనకారుడు లియాఖత్ హుస్సేన్, వ్యాపారవేత్త గజ్నవీలతో సహా ప్రముఖ ముస్లిములెందరో స్వదేశీ ఉద్యమంలో చేరారు. మధ్య, ఉన్నత వర్గాల ముస్లిములలో చాలామంది తటస్థంగానైనా ఉండిపోయారు, లేదా ఢక్కా నవాబు నాయకత్వం కిందికి వచ్చారు. అతగానికి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం 14 లక్షల రుణం మంజూరు చేసింది. కాబట్టి ఢక్కా నవాబు బెంగాల్ విభజనని బలపర్చాడు. విభజన వల్ల తూర్పు బెంగాల్‌లో ముస్లిముల ఆధిక్యతకు అవకాశం వచ్చిందని సంబర పడ్డాడు. ఈ మతతత్వ ధోరణికి సంబంధించి బ్రిటిషు అధికార్లు ఢక్కా నవాబును, ఇంకా ఇతర ప్రముఖ ముస్లిములను ప్రోత్సాహ

వర్ణారు. "వెనుకటి ముసల్మాను రాజులు, వైస్రాయిల కాలం తరువాత ఎరుగని ఐక్యతని ముస్లిములకు తిరిగి ప్రసాదించటం" బెంగాల్ విభజన కారణాల్లో ఒకటని లార్డ్ కర్జన్ తన ఢక్కా ప్రసంగంలో ఉద్ఘాటించాడు

విభజన వ్యతిరేకోద్యమం ప్రజాదరణ పొందినప్పటికీ, అతివాదులు జాతీయోద్యమాన్ని ప్రజల్లోకి తీసుకుపోవాలని ఊగినప్పటికీ ఉద్యమం నిజంగా బెంగాల్ రైతాంగాన్ని కదిలించలేదు. మొత్తంమీద అది పట్టణాలకు, రాష్ట్రంలో మధ్యతరగతి ప్రజలకు పరిమితమై పోయింది.

***ఉద్యమం అఖిలభారత స్థాయి :*** స్వదేశీ, స్వరాజ్య ఉద్యమాల పొలికేకను దేశంలో ఇతర రాష్ట్రాలు అందుకున్నాయి ఐక్య బెంగాలుకు, విదేశవస్త్ర బహిష్కరణకు మద్దతు ప్రకటిస్తూ బొంబాయిలో, మద్రాసులో, ఉత్తరభారతంలో ఉద్యమాలు సాగాయి స్వదేశీ ఉద్యమాన్ని దేశంలో మిగతా ప్రాంతాలకు విస్తరింపజేసే కృషిలో లోకమాన్య తిలక్ ప్రధానపాత్ర వహించాడు బెంగాల్‌లో స్వదేశీ ఉద్యమ అవతరణ భారతజాతీయోద్యమ చరిత్రలో ఒక నూతన అధ్యాయం తెరిచిందని తిలక్ గుర్తించాడు. బ్రిటిషురాజ్యానికి వ్యతిరేకంగా ప్రజాపోరాటాన్ని నడపటానికి, దేశం మొత్తాన్ని ఒక ఉమ్మడి సహానుభూతి బంధంతో ముడివేయటానికి ఇదొక సవాలు; ఒక అపూర్వావకాశం.

***అతివాదులు:*** విభజన వ్యతిరేకోద్యమ నాయకత్వం వెంటనే తిలక్, బిపిన్ చంద్రపాల్, అరవింద ఘోష్‌వంటి అతివాద జాతీయనాయకుల చేతుల్లోకి పోయింది. దీనికి చాలా కారణాలున్నాయి.

ఒకటి - మితవాదులు నడిపిన ప్రతిఘటనోద్యమంవల్ల ఆశించిన ఫలితాలు చేకూరలేదు. మిత వాద జాతీయనాయకులు ఎన్నో ఆశలుపెట్టుకున్న జాన్‌మార్లేవంటి ఉదార భారత రాజ్యకార్యదర్శి సైతం బెంగాల్ విభజనని తిరగతోడేదిలేదని ప్రకటించాడు. రెండు - తూర్పు, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు రెండూ, ముఖ్యంగా తూర్పు బెంగాల్ ప్రభుత్వం హిందూ - ముస్లిం ప్రజల్ని చీల్చటానికి చురుగ్గా కృషి చేయటం జరిగింది హిందూ - ముస్లిం ప్రజలమధ్య అనైక్యతా బీజాలు బహుశా ఈ సమయంలోనే పడ్డాయి. ఈ పరిణామం జాతీయవాదులకు చేదుమాత్ర అన్నిటికన్నా ముఖ్యంగా, ప్రభుత్వ దమన విధానం ప్రజల్ని సమరశీల విప్లవ రాజకీయాలవేపు త్రోసింది. ప్రత్యేకంగా, తూర్పు బెంగాల్ ప్రభుత్వం పనిగట్టుకుని జాతీయోద్యమాన్ని కాలరాయటానికి పూనుకుంది. స్వదేశీ ఆందోళనలో విద్యార్థుల్ని పాల్గొననీకుండా అధికార్లు తీసుకున్న కఠినచర్యలు గురించి ఇంతకుముందే చర్చించాం. తూర్పు బెంగాల్‌లో వీధుల్లో వందేమాతరం నినాదాన్ని ప్రభుత్వం నిషేధించింది. బహిరంగ సభలమీద నిర్బంధాలు, నిషేధాజ్ఞలు జారయ్యాయి పత్రికలమీద ఆంక్షలు విధిస్తూ చట్టాలు అమల్లోకి వచ్చాయి. స్వదేశీ ఉద్యమ కార్యకర్తలు దీర్ఘకారాగార శిక్షలకు గురయ్యారు. అనేక జాతీయ దినపత్రికలమీద ప్రభుత్వం కేసులు బనాయించి, పత్రికా స్వాతంత్ర్యాన్ని పూర్తిగా హరించివేసింది అనేక పట్టణాల్లో మిలిటరీ పోలీసులు తిష్ఠవేసి, ప్రజలమీద విరుచుకు పడ్డారు. 1906 ఏప్రిల్‌లో బారిసాల్ అనే టౌనులో శాంతియుతంగా సమావేశం జరుపుకొంటున్న వంగరాష్ట్ర సదస్సు ప్రతినిధులపైన పోలీసులు జరిపిన పాశవిక దాడి ప్రభుత్వ దారుణదమననీతికి ఒక ప్రత్యక్ష

ఉదాహరణ అనేకమంది యువ వలంటీర్లను పోలీసులు చిదకబాదారు సదస్సుని జరగనీకుండా ఛిన్నాభిన్నం చేశారు 1908 డిశంబరులో పూజ్యులైన కృష్ణకుమార్ మిత్రా, అశ్వనీకుమారదత్తులతో సహా తొమ్మండుగురు బెంగాలీ నాయకులకు ప్రభుత్వం దేశాంతరవాస శిక్ష విధించింది. పంజాబ్‌లో జరిగిన అల్లర్లను పురస్కరించుకొని లాలాలజపత్‌రాయ్, అజిత్‌సింగ్‌లను 1907 లో దేశంనుంచి బహిష్కరించింది 1908లో తిలక్‌ని తిరిగి నిర్బంధించి ఆరేళ్ళపాటు జైల్లోకుక్కింది తమిళనాడులో చిదంబరం పిళ్ళైను, ఆంధ్రాలో గాడిచర్ల హరిసర్వోత్తమరావును కటకటాల వెనుక బంధించింది

అతివాద జాతీయనాయకులు ముందుకువస్తూనే, స్వదేశీ ఆందోళన, విదేశవస్తు బహిష్కరణలతో పాటు సహాయనిరాకరణకు పిలుపిచ్చారు ప్రభుత్వంతో సహకరించవద్దని ప్రజల్ని కోరారు ప్రభుత్వోద్యోగాల్ని, కోర్టుల్ని ప్రభుత్వ విద్యాసంస్థల్ని బహిష్కరించమని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అరవింద ఘోష్ మాటల్లో చెప్పాలంటే - "దేశాన్ని దోచే బ్రిటిషు వాణిజ్యానికిగానీ, దాని అమలుకై సాగే పాలనావ్యవస్థలో బ్రిటిషు అధికారవర్గానికి గానీ సంఘటితంగా సహాయనిరాకరణ చెయ్యడంద్వారా ఇప్పటి పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని స్తంభింపజేయడం" వారి కార్యక్రమం. "ప్రజలు వాంఛించే పద్ధతిలో పరిస్థితులు మారే దాకా" సహాయనిరాకరణం కొనసాగుతుందని ఆయన ఉద్ఘాటించాడు అతివాదుల స్వదేశీ ఉద్యమాన్నీ, విభజన వ్యతిరేక ఆందోళననీ ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని ఉత్తేజితం చేయటానికి ఉపయోగించుకున్నారు. విదేశపాలననుంచి విముక్తికి నినాదం ఇచ్చారు "రాజకీయ స్వేచ్ఛ జాతికి ఊపిరి" అని అరవింద ఘోష్ బహిరంగంగా ఉద్ఘోషించాడు ఆ విధంగా బెంగాల్ విభజన సమస్య వెనక్కిపోయి భారతస్వాతంత్ర్యం ప్రధాన సమస్యగా భారత రాజకీయాలలో ఆవిష్కృతమైంది ఒక మహత్తర లక్ష్యసాధన కోసం ఆత్మ త్యాగం అవసరమని అతివాదులు పిలుపిచ్చారు భారత యువత ఆ పిలుపుకి ఉత్సాహపూరితంగా ప్రతిస్పందించింది. ఆ రోజుల్లో ఇంగ్లండ్‌లో చదువుసాగిస్తున్న జవహర్‌లాల్ నెహ్రూ తన "స్వీయచరిత్ర"లో యువభారత ప్రతిస్పందనని ఇలా వర్ణించాడు:

"1907 లగాయతు భారతదేశం అనేక ఏళ్లపాటు అశాంతితో, అలజడితో ఉడికిపోయింది 1857 తిరుగుబాటు తరువాత మొట్టమొదటిసారి భారతదేశం విదేశపాలనకు కిమ్మనకుండా లొంగిపోక ప్రతిఘటన ప్రదర్శించింది తిలక్, అరవిందఘోషుల దృఢవిశ్వాసం, కార్యకలాపాలు, బెంగాల్ ప్రజల స్వదేశీ ఆందోళన, విదేశవస్తు బహిష్కరణ ప్రతిజ్ఞాదీక్ష ఇంగ్లండ్‌లో ఉన్న మా భారతీయులు యావన్మందిని కదిలించివేశాయి. మినహాయింపు లేకుండా దాదాపు మేమందరం తిలక్ అనుయాయులం లేదా అతివాదులం." భారతదేశంలో కొత్తపార్టీని అనాడు అలాపిలిచారు. అయితే ఈ సందర్భంలో ఒక్క విషయం గుర్తుంచుకోవాలి ఈ అతివాదులు సైతం ప్రజల్ని నిర్మాణాత్మకంగా ముందుకు నడిపించలేక పోయారు సమర్థవంతమైన నాయకత్వం ఇవ్వలేకపోయారు. తమ ఉద్యమానికి మార్గనిర్దేశం చేసే ఒక పటిష్ట సంస్థా నిర్మాణం చెయ్యలేకపోయారు. ప్రజల్ని ఉత్తేజితుల్ని చేశారేగాని, ప్రజల్లో పెల్లుబికిన నూతన శక్తిని ఎలా మళ్లించాలో, ఎలా ఉపయోగించుకోవాలో వాళ్లకు బోధపడలేదు. పైగా వాళ్లు తమ జాతీయవాద విశ్వాసాలలో విప్లవ శీలురే అయినా,

ఆచరణలో రాజ్యాంగవాదులుగా మిగిలిపోయారు దేశంలో నిజమైన ప్రజాబాహుళ్యంలోకి అంటే రైతాంగంలోకి వాళ్ళు వెళ్ళలేకపోయారు వాళ్ళ అతివాద ఉద్యమం పట్టణ మధ్యతరగతి ప్రజలవరకే పరిమితమైపోయింది ఆ వర్గంలోనైనా వాళ్ళు ఒక సమర్థవంతమైన పార్టీని నిర్మించలేకపోయారు ఫలితంగా, ప్రభుత్వం వాళ్ళని అణచివెయ్యటంలో చాలావరకు విజయవంతమైంది వాళ్ళ ప్రధాన నాయకుడు తిలక్ అరెస్టు కావటంతోను, బిపిన్ చంద్రపాల్, అరవింద ఘోషులు క్రియాశీల రాజకీయాల నుండి విరమించుకోవటంతోను ఉద్యమానికి నడుం విరిగిపోయి నిలబడలేకపోయింది.

అయినా జాతీయావేశ వెల్లువ అడుగంటిపోలేదు ప్రజలు శతాబ్దాల గాఢసుషుప్తి నుంచి మేలుకున్నారు రాజకీయాల్లో సాహసోపేత నిర్ణయ వైఖరి తీసుకోవటం నేర్చుకున్నారు తమ అనుభవంనుంచి అమూల్య గుణపాఠాలు నేర్చుకోగలిగారు "విభజన అనంతరం, ప్రజలు మహజర్లకు మద్దతుగా బలం ఉండాలని గమనించారు. తమకు కష్టనష్టాలు భరించే శక్తి ఉండాలని గుర్తించారు" అని గాంధీజీ తరువాత రాశారు నిజానికి విభజన వ్యతిరేకోద్యమం భారత జాతీయవాద వెల్లువలో ఒక గొప్ప విప్లవ కెరటం.

***విప్లవ హింసావాదం:*** ప్రభుత్వ దమన నీతి రాజకీయ పోరాట వైఫల్యంవల్ల ఆవరించిన నిస్పృహ అంతిమంగా విప్లవ హింసావాదంగా పరిణమించాయి అధికార్ల పొగరుమోతు వైఖరి, అణచివేత బెంగాల్ యువకుల్లో ఆగ్రహావేశాలు రగుల్కొల్పాయి విదేశ పాలనపట్ల వాళ్ళ గుండెల్లో కసి పేరుకుంది శాంతియుత ప్రతిఘటనకు, రాజకీయ కార్యాచరణకు అవకాశాలన్నీ అడుగుంటిపోయాయి ఒక నిస్పృహతో వాళ్ళు బాంబు వాదాన్ని ఆశ్రయించారు శాంతియుత ప్రతిఘటనతో జాతీయ లక్ష్యాలు సాధించవచ్చనే వాదంలో వాళ్ళకు విశ్వాసం పోయింది. కాబట్టి బ్రిటీషువాళ్ళని బలవంతంగా గెంటేయాలి బారిసాల్ సదస్సు తరువాత యుగంతర్ పత్రిక 1906 ఏప్రిల్ 22న ఇలా రాసింది: "నివారణోపాయం ప్రజల చేతుల్లోవుంది 30 కోట్ల భారత ప్రజలు ఈ పీడనని, పీడని వదిలించుకోడానికి తమ 60 కోట్ల పిడికిళ్ళెత్తాలి హింసను హింసతో ఎదుర్కోవాలి" కాని విప్లవాత్మక యువలోకం ఒక ప్రజా విప్లవాన్ని రగుల్కొల్పటానికి ప్రయత్నం చెయ్యలేదు దానికి బదులు, వాళ్ళు ఐరిష్ ఉగ్రవాదుల, రష్యన్ నిహిలిస్టుల పద్ధతుల్ని అనుకరించారు అంటే ప్రజావ్యతిరేక అధికార్లను ఖతంచేసే పద్ధతుల్ని చేబట్టారు. 1897లో చాపేకర్ సోదరులు ప్రజాకంటకులైన ఇద్దరు బ్రిటిష్ అధికార్లను పూనాలో హత్యచేయటంతో ఈ దిశలో మొదటి ఘట్టం ప్రారంభమైంది. 1904లో వి.డి. సావర్కార్ "అభినవ భారత్" అనే ఒక రహస్య విప్లవసంస్థను ప్రారంభించారు. 1905 తరువాత అనేక పత్రికలు విప్లవ హింసావాదాన్ని ప్రచారం చేశాయి బెంగాల్‌లో 'సంధ్య', 'యుగంతర్'; పూనాలో 'కాల్' విప్లవ ఉగ్రవాదాన్ని ప్రచారం చేసిన ప్రముఖ పత్రికలు.

1907 డిశంబర్‌లో బెంగాల్ లెఫ్టినెంట్ గవర్నరుపైన హత్యాప్రయత్నం జరిగింది. 1908 ఏప్రిల్‌లో ఖుదీరామ్‌బోస్, ప్రఫుల్లచక్రి అనే విప్లవకారులు ఒక బ్రిటిషు ప్రభుత్వ శకటంపైన బాంబువిసిరారు. ప్రజలకు రోతపుట్టించిన ముజఫర్‌పూర్ జడ్జి కింగ్స్‌ఫర్డ్ అందులో ప్రయాణిస్తున్నాడనే అపోహతో ఆ ఇద్దరూ బాంబువిసిరారు. ప్రఫుల్లచక్రి స్వయంగా కాల్చుకుని చనిపోయాడు. ఖుదీరామ్ బోస్

పోలీసులకు చిక్కి ఉరికంబమెక్కారు. విప్లవ హింసావాద శకం మొదలయింది టెర్రరిస్టు యువకుల రహస్య విప్లవ సంస్థలనేకం వెలశాయి. వాటన్నిట్లో అనుశీలన్ సమితి అనే సంస్థ సుప్రసిద్ధమైంది. ఆ సంస్థ ఢక్కా విభాగానికి 500 శాఖలుండేవి బెంగాల్‌లోనే కాకుండా, మిగతా దేశమంతటా కూడా టెర్రరిస్టు సంస్థలు అల్లుకు పోయాయి. ఢిల్లీలో ఒక ప్రభుత్వ ఊరేగింపులో ఏనుగుమీద కూర్చుని ప్రయాణించేస్తున్న వైస్రాయి లార్డ్ హార్డింజ్ అంతటివాడిమీద బాంబువిసిరే సాహసానికి విప్లవకారులు తెగించారు. వైస్రాయి గాయపడ్డారు.

టెర్రరిస్టులు విదేశాలలో కూడా తమ కేంద్రాలు ప్రారంభించారు. శ్యామ్‌జీ కృష్ణవర్మ, వి డి సావర్కార్, హర్‌దయాళ్‌లు లండన్‌లో టెర్రరిస్టు కార్యకలాపాలు నడిపారు యూరప్‌లో మేడంకామా, అజిత్‌సింగ్‌లు ప్రసిద్ధ టెర్రరిస్టులు

టెర్రరిజం (హింసావాదం) సైతం క్రమేణా అంతరించి పోయింది నిజానికి ఒక విప్లవ ఆయుధంగా టెర్రరిజం విఫలంకాక తప్పదు. బ్రిటీషువాళ్ళని బైటికి పారదోలాలనే దాని ఆశయం రవ్వంతైనా నెరవేరలేదు అయితే భారతదేశంలో జాతీయవాద వికాసానికి టెర్రరిస్టులు అమూల్యసేవ చేశారు ఒక చరిత్రకారుడు చెప్పినట్లుగా "వాళ్ళు మన పురుషకారపు గర్వాన్ని మనకు తిరిగి అప్పగించారు " రాజకీయ చైతన్యవంతులైన ప్రజల్లో చాలామంది వాళ్ళ రాజకీయవిధానంతో ఏకీభవించకపోయినా, వాళ్ళు ప్రదర్శించిన వీరత్వం ద్వారా సమకాలికుల అపార అభిమానాన్ని చూరగొన్నారు.

***భారత జాతీయ కాంగ్రెస్ – 1905–1914:*** బెంగాల్ విభజన వ్యతిరేకాందోళన భారత జాతీయ కాంగ్రెస్‌పైన ప్రగాఢ ముద్రవేసింది. కాంగ్రెస్ సంస్థలోని అన్ని వర్గాలు విభజనకు వ్యతిరేకంగా ఐక్యమయ్యాయి. 1905లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో, కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాలకృష్ణ గోఖలే బెంగాల్ విభజనని, లార్డ్‌కర్జన్ అభివృద్ధి విరోధకపాలనని నిర్ద్వందంగా ఖండించారు. స్వదేశీ ఉద్యమాన్ని, విదేశవస్తు బహిష్కరణని జాతీయ కాంగ్రెస్ బలపర్చింది.

మితవాదులకు-అతివాదులకు మధ్య బహిరంగంగా వివాదాలు, విభేదాలు తలెత్తాయి. బెంగాల్ ప్రజాఉద్యమాన్ని మిగతా దేశమంతటాకూడా విస్తరింపజెయ్యాలని అతివాదులు వాదించారు. ఉద్యమాన్ని బెంగాలుకు మాత్రమే పరిమితంచెయ్యాలని మితవాదులు కోరారు. ఆ సంవత్సరం జాతీయ కాంగ్రెస్ అధ్యక్షపదవికి ఈ ఉభయవర్గాల మధ్య ఘర్షణరేగింది చివరకి జాతీయవాదులందరూ గౌరవించే దాదాభాయ్ నౌరోజీ రాజీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధ్యక్ష పీఠాన్ని అలంకరించారు. కాంగ్రెస్ కురువృద్ధుడు దాదాభాయ్ నౌరోజీ తన అధ్యక్షోపన్యాసంలో మొదటిసారిగా "స్వపరిపాలన లేదా స్వరాజ్యం భారత జాతీయోద్యమ గమ్యం" అని గర్జించారు. జాతీయవాదులంతా ఉర్రూతలూగిపోయారు.

కాని, జాతీయోద్యమంలో మితవాద, అతివాద పక్షాలమధ్య విభేదాల్ని ఎంతోకాలం తొక్కిపట్టి ఉంచటం సాధ్యంకాలేదు. మితవాదుల్లో చాలామంది అప్పటి ఊపుకు తగ్గట్లుగా సాగలేక పోయారు. గతంలో నిజంగా ఒక మేలు సాధించిన తమ దృక్పధం, పద్ధతులు ఇక అకాలానికి పొసగవని మితవాదులు గుర్తించలేకపోయారు. జాతీయోద్యమ నూతన దశకి వాళ్ళు పయనించలేకపోయారు. మరొకవెంప అతి

వాదులు మెదలకుండా ఉండటానికి సిద్ధంగాలేరు 1907 లో సూరత్‌లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సమావేశంలో ఇరువర్గాల మధ్య చీలిక వచ్చింది కాంగ్రెస్ పార్టీ యంత్రాంగాన్ని చేజిక్కించుకున్న మితవాద నాయకులు సంస్థనుంచి అతివాద శక్తుల్ని ఏరివేశారు

దీర్ఘకాలిక పరిణామంలో ఈ చీలికవల్ల ఉభయులకూ ప్రయోజనం కలగలేదు మితవాద నాయకులకు యువతరంతో సంబంధం పోయింది బ్రిటిషు ప్రభుత్వం 'విభజించి పాలించే' నాటకం ఆడింది అతివాదుల్ని వేరుపర్చి, అణగదొక్కి వెయ్యటానికి జాతీయోద్యమంలోని మితవాద వర్గాన్ని తనకనుకూలంగా తిప్పుకోవాలని ప్రయత్నించింది మితవాదుల్ని బుట్టలో వేసుకోదానికి 1909 భారత శాసనసభల చట్టం ద్వారా రాజ్యాంగ పరమైన రాయితీలు ప్రకటించింది వాటినే మింటో-మార్లే సంస్కరణలంటారు 1911లో బ్రిటిషు ప్రభుత్వం బెంగాల్ విభజనని సైతం రద్దుచేసింది పశ్చిమ, తూర్పు బెంగాలులు తిరిగి ఏకమయ్యాయి బీహార్, ఒరిస్సాలతో కూడిన కొత్తరాష్ట్రం ఏర్పడింది అప్పుడే భారత రాజధాని కలకత్తానుంచి ఢిల్లీకి మారింది

మింటో-మార్లే సంస్కరణలు కేంద్ర, రాష్ట్ర శాసనసభల్లో ఎన్నిక సభ్యుల సంఖ్య పెంచాయి ఎన్నికైన సభ్యుల్లో ఎక్కువ మంది పరోక్ష పద్ధతిద్వారా శాసనసభల్లో ప్రవేశించారు కేంద్ర శాసన సభకు రాష్ట్ర శాసనసభల చేత, రాష్ట్ర శాసన సభలకు మున్సిపల్ కమిటీలు, జిల్లా బోర్డులచేత సభ్యులు ఎన్నుకోబడ్డారు ఎన్నిక సభ్యుల స్థానాల్లో కొన్ని భూస్వాములకు, భారతదేశంలో ఉన్న బ్రిటిషు పెట్టుబడిదార్లకు కేటాయించబడ్డాయి ఉదాహరణకు కేంద్ర శాసనసభలోని 68 మంది సభ్యుల్లో 36గురు అధికార సభ్యులు, 5గురు నామినేటయిన అనధికార సభ్యులు ఇక మిగిలిన 27గురు ఎన్నిక సభ్యుల్లో ఆరుగురు బడా భూస్వాములు, ఇద్దరు బ్రిటిషు పెట్టుబడిదార్లు పైగా ఈ కొత్త శాసనసభలకు అధికారం శూన్యం అవి కేవలం సలహా సంఘాలు మాత్రమే కాబట్టి మింటో - మార్లే సంస్కరణలు బ్రిటిషు పరిపాలన యొక్క ప్రజాస్వామ్య రహిత విదేశ స్వభావాన్ని ఏవిధంగానూ మార్చలేదు లేదా భారత దేశాన్ని విదేశస్థులు ఆర్థికంగా దోపిడీ చేసే వైనాన్ని మార్చలేదు అవి భారతదేశ పాలనని ప్రజాస్వామ్య బద్ధం చేయడానికి ఉద్దేశించినవికావు మార్లే కుండ బద్దలు కొట్టినట్టు ఆనాడే బహిరంగంగా ఇలా చెప్పారు: " ఈ సంస్కరణలు భారతదేశంలో పార్లమెంటరీ వ్యవస్థ స్థాపనకు ప్రత్యక్షంగా లేదా తప్పనిసరిగా దారి ఏర్పరుస్తాయని చెప్పవచ్చని అంటే, నా మట్టుకి నాకు దాంతో ఎట్టి సంబంధం లేదు" మార్లే తరువాత భారత రాజ్య కార్యదర్శిగా వచ్చిన లార్డ్ క్రెవీ 1912 లో ఇంకా విస్పష్టంగా వివరణ ఇచ్చాడు. "అధినివేశ రాజ్యాలకు ప్రసాదించిన ప్రతిపత్తికి దగ్గరగా తీసుకుపోయే స్వయం పరిపాలన గురించి భారత దేశంలో ఒక వర్గం ఎదురు తెన్నులు చూస్తోంది. భారతదేశానికి ఆ విధమైన భవిష్యత్తు ఉన్నట్లు నాకు తోచదు "

కాబట్టి మితవాదుల్ని తికమకపెట్టటం, జాతీయోద్యమ నాయకుల్లో, కార్యకర్తల్లో చీలికలు తేవటం, భారతీయుల్లో ఐక్యత పెంపొందకుండా నిరోధించటం మింటో-మార్లే సంస్కరణల నిజమైన ధ్యేయం.

ఆ సంస్కరణలు మత ప్రాతిపదిక మీద ప్రత్యేక నియోజకవర్గాల్ని

సృష్టించాయి. ముస్లిములందర్నీ కలిపి ఏర్పాటు చేసిన నియోజకవర్గాల నుంచి ముస్లిం అభ్యర్థులు మాత్రమే ఎన్నిక కాగలుగుతారు. ముస్లిం అల్ప సంఖ్యాక వర్గాన్ని పరిరక్షించే సాకు చెప్పి ప్రభుత్వం ఈ పని చేసింది. వాస్తవానికి, ఇది హిందూ-ముస్లిం ప్రజల్ని విభజించి పాలించే నీతిలో భాగం. భారతదేశంలో బ్రిటిషు అధిపత్యాన్ని నిలబెట్టుకునే మార్గం. హిందూ, ముస్లిముల ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు వేరనే ఊహా ప్రాతిపదికమీద ఆధారపడి ప్రత్యేక నియోజకవర్గాల్ని ఏర్పాటు చెయ్యటం జరిగింది. ఈ సిద్ధాంతం అశాస్త్రీయమైంది. ఎంచేతనంటే ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకి గాని లేదా రాజకీయ వర్గాలకుగాని మతాలు ఎన్నడూ ప్రాతిపదిక కావు. ఆచరణలో ఈ పద్ధతి విపరీత హానికరమని రుజువయింది. ఒక అవిచ్ఛిన్న చారిత్రక పరిణామ క్రమంగా వస్తున్న భారత ఏకీకరణ ప్రగతిని ఇది కుంటుపర్చింది. దేశంలో హిందూ ముస్లిం ప్రజల మధ్య మతతత్వం పెరగటానికి ప్రధాన సాధనమైంది. మధ్యతరగతి ముస్లిం ప్రజల ఆర్థిక, విద్యా సంబంధమైన వెనుకబాటుతనాన్ని నిర్మూలించి భారత జాతీయ స్రవంతిలో కలిపివేయటానికి బదులు ఈ ప్రత్యేక నియోజక వర్గాల సృష్టి వాళ్ళని వర్ధమాన జాతీయోద్యమానికి ఇకముందుకూడా దూరమయ్యేటట్లు చేసింది. వాళ్ళలో వేర్పాటు ధోరణులు ప్రోత్సహించింది. హిందూ ముస్లిం తారతమ్యం లేకుండా భారత ప్రజలందరికీ సమానమైన ఆర్థిక, రాజకీయ సమస్యలమీద వాళ్ళు తమ దృష్టిని కేంద్రీకరించనివ్వకుండా చేసింది.

మితవాద జాతీయవాదులు మింటో-మార్లే సంస్కరణలను సంపూర్ణంగా బలపర్చలేదు. అవి ఒరగ బెట్టిందేమీలేదనే వాస్తవాన్ని వాళ్ళు వెంటనే గ్రహించారు. అయితే వాటి అమలుకు మితవాదులు ప్రభుత్వంతో సహకరించటానికి నిశ్చయించుకున్నారు. ప్రభుత్వంతో ఈ సహకారం, అతివాదుల కార్యక్రమాల పట్ల వ్యతిరేకత మితవాదుల ప్రతిష్ఠను దెబ్బతీశాయి. క్రమేణా వాళ్ళు ప్రజల్లో గౌరవం, బలం పోగొట్టుకొని ఒక చిన్న రాజకీయవర్గం స్థాయికి దిగజారిపోయారు. రాజకీయ చైతన్యవంతులైన ప్రజల్లో అధిక సంఖ్యాకులు నిశ్శబ్దంగానైనా లోకమాన్య తిలక్‌ను, అతివాదుల్ని బలపరుస్తూ వచ్చారు.

***ముస్లిం లీగు — మతతత్వం:*** ఆధునిక రాజకీయ చైతన్యం ముస్లిములలో కొంత ఆలస్యంగా కలిగింది. హిందూ, పార్శీ దిగువ మధ్యతరగతి వర్గంలో అల్లుకుపోయినంత శీఘ్రంగా ముస్లిం మధ్యతరగతి ప్రజల్లో జాతీయవాదం వ్యాప్తికాలేదు.

1857 తిరుగుబాటు సమయంలో హిందువులు, ముస్లిములు భుజం భుజం కలిపి పోరాడిన ఘట్టం లోగడ చదివాం. తిరుగుబాటును అణచివేశాక, బ్రిటిషు అధికారులు ముస్లిములపట్ల ప్రతీకారవైఖరి ప్రదర్శించారు. ఒక్క ఢిల్లీలోనే 27,000 మంది ముస్లిములను ఉరితీశారు. వాళ్ళను అనుమాన దృష్టితో చూశారు. 1870 తరువాత ఈ వైఖరిలో మార్పు వచ్చింది. జాతీయోద్యమ ఆవతరణతో బ్రిటిషు రాజనీతిజ్ఞులు భారతదేశంలో తమ సామ్రాజ్య భద్రతగురించి భీతిల్లారు. దేశంలో సమైక్య జాతీయతా భావం పెంపొందకుండా అరికట్టడానికి బ్రిటిషు పాలకులు మత ప్రాతిపదికమీద 'విభజించి పాలించే' కుటిల నీతిని అవలంభించాలని నిర్ణయించుకున్నారు. మరో మాటల్లో బ్రిటిషు పాలకులు భారత రాజకీయాల్లో

మతతత్వ, వేర్పాటు ధోరణులను ప్రోత్సహించారు ముస్లిం జమీందార్లను, భూస్వాములను, కొత్తగా విద్యావంతులైన వాళ్ళను తమవైపుకు ఆకట్టుకోడానికి విదేశ పాలకులు 'ముస్లిం ఉద్ధారకులు'గా వేషంకట్టాలని నిర్ణయించారు అంతటితో ఆగకుండా, భారత సమాజంలో మరెన్నో చీలికలు తేవటానికి పూనుకున్నారు. బెంగాలీల అధిక్యతకు వ్యతిరేకంగా మాట్లాడుతూ ప్రాంతీయతత్వాన్ని రేపారు బ్రాహ్మణులకు వ్యతిరేకంగా బ్రాహ్మణేతరుల్ని, పైకులాలకు వ్యతిరేకంగా కిందికులాల్ని ఉసికొల్పటానికి కులవ్యవస్థను వాడుకోవాలని చూశారు హిందువులు, ముస్లిములు సఖ్యతతో జీవించే యు పి , బీహార్ రాష్ట్రాల్లో కోర్టుభాషగా ఉర్దూని తొలగించి హిందీకి పట్టంకట్టాలనే ఉద్యమానికి క్రియాశీల ప్రోత్సాహం ఇచ్చారు మరో మాటల్లో చెప్పాలంటే- భారత సమాజంలో వివిధ తరగతుల ప్రజల న్యాయసమ్మతమైన కోర్కెల్ని సైతం భారత ప్రజల్లో విభేదాలు సృష్టించడానికి సాధనాలుగా వాడుకోడానికి ప్రయత్నం చేశారు.

మత ప్రాతిపదికమీద వేర్పాటు ధోరణి తలెత్తడానికి సయ్యద్ అహ్మద్‌ఖాన్ ముఖ్యపాత్ర నిర్వహించారు గొప్ప విద్యావేత్త, సంఘసంస్కర్త అయివుండీ కూడా ఆయన తన చివరి దినాల్లో రాజకీయాల్లో సనాతనవాదిగా మారిపోయారు 1880లో ఆయన తన పూర్వపు విశ్వాసాల్ని మార్చుకుని ముస్లిం మతతత్వానికి పునాదివేశారు హిందూ-ముస్లిం రాజకీయ ప్రయోజనాలు ఒకటికావు, అవి పూర్తిగా వేరు, పరస్పర విరుద్ధం అని వాదించారు బ్రిటిషు ప్రభుత్వానికి విధేయులుగా ఉండమని ముస్లిం ప్రజలకు ఉద్బోధించారు 1885లో భారత జాతీయ కాంగ్రెస్ సంస్థ ఏర్పాటైనప్పుడు, ఆయన దాన్ని వ్యతిరేకించాలని నిర్ణయించుకున్నారు రాజా శివప్రసాద్ వగైరాలతో కలిసి బ్రిటిషు పాలనపట్ల విశ్వాసం ప్రకటించే ఒక ఉద్యమాన్ని లేవదీయటానికి కృషిచేశారు. భారతదేశపు జనాభాలో హిందువులు చాలా ఎక్కువమంది కాబట్టి బ్రిటిషు పరిపాలన బలహీన పడ్డా, తొలగిపోయినా ముస్లిముల మీద హిందువుల ఆధిపత్యం సాగుతుందని సయ్యద్ అహ్మద్‌ఖాన్ ప్రబోధం చేశారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో ముస్లిముల్ని చేరవలసిందిగా బద్రుద్దీన్‌త్యాబ్జీ చేసిన విజ్ఞప్తిని త్రోసిపుచ్చమని సయ్యద్ అహ్మద్‌ఖాన్ ప్రచారం చేశారు

ఇవి అశాస్త్రీయమైన భావాలు వీటికి ఒక ప్రాతిపదిక లేదు. హిందువులు, ముస్లిములు వేర్వేరు మతాల్ని అవలంబించినా, వాళ్ళ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలు ఒక్కటే. సాంఘికంగా, సాంస్కృతికంగా సైతం హిందూ, ముస్లిం ప్రజలు, వర్గాలు ఉమ్మడి జీవన విధానాలను పెంపొందించుకున్నారు. ఒక బెంగాలీ ముస్లిం - ఒక పంజాబీ ముస్లిం మధ్యకన్నా ఒక బెంగాలీ ముస్లిం - ఒక బెంగాలీ హిందువు మధ్య ఎక్కువ పోలిక కనిపిస్తుంది. పైపెచ్చు, బ్రిటిషు సామ్రాజ్యవాదం హిందూ ముస్లిం ప్రజలుభయుల్ని సమానంగా, సంయుక్తంగా అణచివేసింది, దోపిడీ చేసింది.

1884లో సయ్యద్ అహ్మద్‌ఖాన్ హిందూ ముస్లిం ఐక్యత గురించి ఉపన్యాసాలిచ్చారు. వేర్వేరు మతాలకు చెందిన వాళ్ళుభయులూ ఒకే జాతి అని ఉద్ఘాటించారు. మరయితే, ముస్లిములలో మతతత్వ వేర్పాటు ఆలోచనా ధోరణి ఎలా తలెత్తిందనే ప్రశ్న ఉదయిస్తుంది.

విద్యలో, వ్యాపారంలో, పరిశ్రమల్లో ముస్లిములు ఇతర్లతో పోల్చిచూస్తే

వెనుకబడి ఉండేవారు. ఆ వెనుకబాటు తనమే దీనికి చాలావరకు కారణం ముస్లిం ఉన్నతవర్గాల వారిని చూద్దామా అంటే వాళ్ళంతా జమీందార్లు, జాగీర్దార్లు, కులీనులు. 1870 దాకా ముస్లిం ఉన్నత వర్గాలవాళ్ళు బ్రిటిషు వ్యతిరేకులు, సనాతనులు, ఆధునిక విద్యకి శత్రువులు దేశంలో ముస్లిం విద్యావంతులు చాలా తక్కువ మంది. ఫలితంగా, విజ్ఞానశాస్త్రం, ప్రజాస్వామ్యం, జాతీయతలకు పెద్ద పీటవేసిన ఆధునిక పాశ్చాత్య విచారధార ముస్లిం మేధావుల్లో వ్యాప్తి కాలేదు. వాళ్ళు సాంప్రదాయవాదులుగా మిగిలిపోయారు, వెనుకబడిపోయారు తరువాత సయ్యద్ అహ్మద్‌ఖాన్, నవాబ్ అబ్దుల్ లతీఫ్, బద్రుద్దీన్‌త్యాబ్జీ మొదలైన ప్రముఖుల కృషి ఫలితంగా ఆధునిక విద్య ముస్లిములలో వ్యాప్తి కాసాగింది. హిందూ, పార్శీ, క్రైస్తవ ప్రజల్లో విద్యావంతుల సంఖ్యతో పోలిస్తే ముస్లిం విద్యావంతుల సంఖ్య చాలా తక్కువ అలాగే వ్యాపారంలో, పరిశ్రమల్లో ముస్లిములు పెద్దగా ఆసక్తి చూపలేదు. ముస్లిములలో విద్యావంతులు తక్కువమంది కావటంచేత, వ్యాపార పరిశ్రమల్లో పైకివచ్చిన వాళ్ళు బహు కొద్దిమంది కావటంచేత అభివృద్ధి నిరోధకులైన బడా భూస్వాములు ముస్లిం జనసామాన్యం మీద తమ పట్టు కాపాడుకున్నారు. జమీందార్లుగానీ, భూస్వాములుగానీ వాళ్లేమతానికి చెందినా స్వప్రయోజనాల దృష్ట్యా బ్రిటిషుపాలనని సమర్థించారు. అయితే హిందువుల్లో కొత్త చదువులు ఒంటబట్టిన మేధావులు, వ్యాపార పరిశ్రమల్లో బాగా ఎక్కువచ్చిన వర్గాలు భూస్వామ్యవర్గ నాయకత్వాన్ని వదగొట్టారు. దురదృష్టవశాత్తు ముస్లిములలో దీనికి వ్యతిరిక్తమైన పరిణామం సంభవించింది

విద్యలో ముస్లిముల వెనుకబాటుతనం వల్ల మరొక దుష్ఫలితం కలిగింది ఏదేనా ఉద్యోగంలో, వృత్తిలో ప్రవేశించాలంటే ఆధునిక విద్యార్హతలు అత్యవసరం. ముస్లిములలో ఆధునిక విద్యావ్యాప్తి చాలా తక్కువగా జరగటంచేత, మిగతా వాళ్ళతో పోలిస్తే ముస్లిములకు ఉద్యోగాల్లో, ఇతర వృత్తుల్లో అవకాశాలు మృగ్యమయ్యాయి 1857 తరువాత బ్రిటిషు ప్రభుత్వం ముస్లిముల పట్ల వివక్ష ప్రదర్శించింది ముస్లిములలో ఆధునిక విద్యావ్యాప్తి జరిగేక, ముస్లిం విద్యావంతులకు వ్యాపార రంగంలోగాని, వృత్తి ఉద్యోగాల్లోగాని అవకాశాలు తక్కువయ్యాయి. ఆ మాటకొస్తే- భారతదేశం బడుగు వలసదేశం కాబట్టి భారత ప్రజలకు ఉద్యోగావకాశాలు చాలా తక్కువగా ఉండేవి. ఆ పరిస్థితుల్లో హిందూ విద్యావంతులకు వ్యతిరేకంగా ముస్లిం విద్యావంతుల్ని రెచ్చగొట్టడం బ్రిటిషు అధికార్లకు, వాళ్లకు విశ్వాసపాత్రులుగా ఉండే ముస్లిం నాయకులకు అతి సులువు. ప్రభుత్వోద్యోగాలకు సంబంధించి ముస్లిములకు ప్రత్యేకావకాశాలు ఉండాలని సయ్యద్ అహ్మద్‌ఖాన్ ప్రభృతులు డిమాండు చేశారు ముస్లిం విద్యావంతులు బ్రిటిషు ప్రభుత్వానికి విధేయులుగా ఉంటే, ప్రభుత్వం వారిని ఉద్యోగాలతో సత్కరిస్తుందని అహ్మద్‌ఖాన్ ప్రభృతులు ఉద్ఘాటించారు. హిందువుల్లో పార్శీల్లో కూడా కొద్దిమంది ఇదేవిధంగా వాదించారు. అయితే వాళ్ళు సముద్రంలో కాకి రెట్ట. చివరికి పర్యవసానం యేమంటే - దేశం మొత్తంలో జాతీయవాదులైన న్యాయవాదులు, పత్రికా రచయితలు, విద్యార్థులు, వ్యాపారస్థులు, పారిశ్రామికవేత్తలు రాజకీయ నాయకులవుతుంటే ముస్లిములలో మాత్రం బ్రిటిషు విధేయులైన భూస్వాములు, ప్రభుత్వ పింఛనుదార్లు రాజకీయ ప్రాబల్యం వహించారు. ముస్లిములు చాలా ముందుగా వ్యాపార, పరిశ్రమల్లోకి దిగింది బొంబాయి రాష్ట్రంలోనే. అక్కడే

జాతీయ కాంగ్రెస్ నాయక శ్రేణిలో బద్రుద్దీన్‌త్యాబ్జీ, ఆర్.యమ్.సయానీ, ఎ భీమ్‌జీ, మహ్మదాలీ జిన్నా వంటి ఉద్దండులైన ముస్లిములు ఉండేవారు. ఈ సమస్య తాలూకు ముఖ్యాంశాన్ని పండిత జవహర్‌లాల్ నెహ్రూ తన "డిస్కవరీ ఆఫ్ ఇండియా"లో ఇలా వర్ణించారు: "హిందూ ముస్లిం మధ్యతరగతి వర్గాల వికాసంలో ఒక తరంగానికీ, అంతకన్నా ఎక్కువగానీ అంతరం ఉంది. ఆ అంతరం రాజకీయ, ఆర్థిక, ఇతరేతర రంగాలెన్నింటిలో విడువకుండా కానవచ్చింది ఆ అంతరమూ ముస్లిములలో మానసిక భయాన్ని సృష్టించింది."

ఆ రోజుల్లో కాలేజీల్లో, పాఠశాలల్లో భారతచరిత్రను బోధించిన పద్ధతి హిందూ ముస్లిం విద్యావంతుల్లో మతతత్వం పెరుగుదలకి దోహదం చేసిందనే వాస్తవాన్ని చరిత్ర విద్యార్థులుగా మనం కూడా తెలుసుకోవాలి బ్రిటిషు చరిత్రకారులు, వారి అడుగుజాడల్లో మనచరిత్రకారులు భారతచరిత్రలో మధ్య యుగాన్ని ముస్లిం యుగంగా వర్ణించారు. టర్కీ, ఆఫ్ఘన్, మొఘల్ పరిపాలకుల ఏలుబడిని ముస్లిం పరిపాలన అని వర్ణించారు. హిందూ ప్రజాబాహుళ్యం మాదిరిగానే ముస్లిం ప్రజాబాహుళ్యం కూడా పేదరికంలో, పన్నుల భారంలో కృంగిపోయివుంది. రాజులు, సర్దార్లు, జమీందార్లు, జాగీర్దార్లు హిందూ - ముస్లిం పేదప్రజలుభయుల్ని ఈసడించుకున్నారు, వాళ్ళని పురుగుల్లా చూశారు. అయినప్పటికీ ఈ చరిత్రకారులు భారత మధ్యయుగంలో ముస్లిములందర్నీ పాలకులుగా వర్ణించారు. ముస్లిమేతరుల్ని పాలితులుగా అభివర్ణించారు భారత ప్రాచీన, మధ్యయుగాల రాజకీయాలుగానీ, ఆమాటకొస్తే సర్వత్రా రాజకీయాలన్నీ ఆర్థిక, రాజకీయ ప్రయోజనాల మీద ఆధారపడివున్నాయేగాని మతపరమైన ఆలోచనలమీద కాదు. పాలకులైతేనేం, తిరుగుబాటుదారులైతేనేం తమ భౌతిక ప్రయోజనాల, ఆశల వాటకాన్ని కప్పిపుచ్చుకుందుకు మతాన్ని పై ముసుగుగా వాడుకున్నారు. బ్రిటిషు చరిత్రకారులు, మతతత్వం కలిగిన ఇతర చరిత్రకారులు భారతదేశ సమ్మిశ్ర సంస్కృతి సిద్ధాంతాన్నే ప్రతిఘటించారు. నిస్సందేహంగా భారతదేశంలో భిన్నసంస్కృతులు వర్ధిల్లాయి. అయితే ఈ భిన్నత్వం మతప్రాతిపదికమీద ప్రబలం కాలేదు. ఒక ప్రాంతం ప్రజలూ, అట్లాగే అక్కడ ఉన్నత, నిమ్నవర్గాలూ ఒకే మాదిరి సాంస్కృతిక జీవన విధానాలు అలవర్చుకున్నారు. అయినా కూడా మతతత్వవాదులైన చరిత్రకారులు మాత్రం భారతదేశంలో ఒకదానితో ఒకటి పోలికలేని భిన్న హిందూ ముస్లిం సంస్కృతులు జీవించాయని గట్టిగా వాదించారు.

రాజకీయాలు, సంస్కృతికి సంబంధించిన మతతత్వ దృక్పథం అశాస్త్రీయమైనదే అయినా, అది అభివృద్ధి నిరోధక చింతనకు బ్రిటిషు ఎత్తుగడలకు పుట్టిన శిశువే అయినా అల్పసంఖ్యాక వర్గానికి సహజంగా కలిగే భయాలపైన అది బలంగా పనిచేసింది. అటువంటి పరిస్థితుల్లో అల్పసంఖ్యాకవర్గాల భయాన్ని పోగొట్టడానికి అవసరమైన ప్రతిచర్యా తీసుకోవటం విజ్ఞతా లక్షణం. మతపరంగా అత్యధిక సంఖ్యాకులుగా ఉండేవారి దృక్పథం, ప్రవర్తనల ద్వారా అల్పసంఖ్యాకుల భయాలు తొలగిపోతాయి. ఎలాగంటే, అల్పసంఖ్యాక వర్గానికి రెండు విషయాల్లో నమ్మిక కలిగేటట్లుగా అధిక సంఖ్యాకవర్గం తమ కార్యాచరణ ద్వారా రుజువు చేసుకోవాలి: (1) అల్పసంఖ్యాకుల మతం, వారి ప్రత్యేక సాంఘిక, సాంస్కృతిక

లక్షణాలు భద్రంగా ఉంటాయి. (2) ఆర్థిక, రాజకీయ విధాన నిర్ణయంలో మతం ఒక కారకంగా ఉండదు, ఉండబోదు. ఈ సత్యాన్ని భారత జాతీయతా వ్యవస్థాపకులు సంపూర్ణంగా గుర్తించారు. భారత ప్రజల్ని ఏకజాతిగా రూపొందించడం నెమ్మదిగా జరిగే కష్టతరమైన కార్యం అనీ, దానికి ప్రజల్ని సుదీర్ఘ రాజకీయ చైతన్యం ద్వారా సుశిక్షితుల్ని చేయాల్సి ఉంటుందనీ వాళ్లు ఆదిలోనే గ్రహించారు. అంచేత, వాళ్లు జాతీయోద్యమం అల్పసంఖ్యాక వర్గాల మత, సామాజిక హక్కుల్ని జాగరూకతతో సంరక్షింస్తుందని నమ్మకం కలిగించటానికి పూనుకున్నారు. 1886లో భారత కాంగ్రెస్ సమావేశంలో దాదాభాయ్ నౌరోజీ తన అధ్యక్షోపన్యాసంలో కాంగ్రెస్‌సంస్థ జాతీయ సమస్యల్ని మాత్రమే చేపడుతుందిగాని, మత సాంఘిక విషయాల జోలికిపోదని స్పష్టంగా హామీ ఇచ్చాడు. ముస్లిములకు హానికలిగించే ఎట్టి ప్రతిపాదనకు కూడా తాను అంగీకరించనని 1889లో కాంగ్రెస్ సంస్థ నియమం పెట్టుకుంది. కాంగ్రెస్ తొలిదినాల్లో అనేకమంది ముస్లిములు ఆ సంస్థలో చేరారు. మరోమాటల్లో చెప్పాలంటే, రాజకీయాలు మతం, కులం ప్రాతిపదికమీద ఆధారపడి వుండకూడదని బోధించడంద్వారా తొలి జాతీయవాదులు ప్రజల రాజకీయ దృష్టిని ఆధునికంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేశారు.

సమరశీల జాతీయవాదం అన్నివిధాల ముందడుగే అయినా, జాతీయసమైక్యతా వికాసంలో వెనుకడుగు వెయ్యటం దురదృష్టకరం. కొంతమంది అతివాద జాతీయనాయకుల ప్రసంగాలు, రచనలు ఘాటైన హిందూమత వాసన కొట్టాయి. వాళ్ళు భారత మధ్యయుగ సంస్కృతిని పూర్తిగా వదిలేసి ప్రాచీన భారతీయ సంస్కృతిని పైకెత్తారు, భారత సంస్కృతినిభారతజాతిని హిందూమతంతో, హిందువులతో మమేకం చేశారు. సమ్మిశ్ర సంస్కృతిని తమ ఛాయలకు రానివ్వలేదు. ఉదాహరణకు తిలక్ మహాశయుని శివాజీ, గణపతి ఉత్సవాల ప్రచారం, భారతదేశం తల్లి, జాతీయత మతం అని భావించి రాజ్యాంగ సిద్ధాంతానికి వేదాంతం జోడించిన అరవిందుని అర్థ ఆధ్యాత్మిక సిద్ధాంతం, కాళీమాత ప్రేమోల ఉగ్రవాదుల ప్రమాణాలు, గంగానదిలో స్నానాలుచేసి బెంగాల్ విభజన వ్యతిరేకోద్యమానికి అంకురార్పణ చెయ్యటం వగైరాలు ముస్లిములకు నచ్చలేదు. నిజంచెప్పాలంటే, అటువంటి పనులు వాళ్ళమతానికి వ్యతిరేకం, ముస్లిములుగా వాళ్ళు అటువంటి కార్యక్రమాలతో పూనుకు తిరుగుతారనుకోవటం పొరబాటు. శివాజీని, రాణాప్రతాప్‌ని వాళ్లు నిర్వహించిన చారిత్రకపాత్రల్నిబట్టి మాత్రమే కాకుండా "విదేశీయుల"కు వ్యతిరేకంగా పోరాడిన 'జాతీయ' వీరులుగా ఆకాశానికెత్తుతోంటే, అది చూసి ముస్లిములు నిండు ఉత్సాహంతో ప్రతిస్పందిస్తారని భావించడం కూడా శుద్ధ పొరబాటు. ఏ నిర్వచనం ప్రకారం అక్బర్, ఔరంగజేబుల్ని విదేశీయులుగా పరిగణించగలం ? ముస్లిం మతస్థులు కాబట్టి విదేశీయులని పరిగణించాలా ? వాస్తవానికి రాణాప్రతాప్-అక్బర్‌ల మధ్య పోరాటాన్నిగానీ, శివాజీ-ఔరంగజేబుల మధ్య పోరాటాన్ని గానీ ఆనాటి నిర్దిష్ట చారిత్రక వాతావరణంలో జరిగిన రాజకీయ సంఘర్షణగా మాత్రమే చూడవలసి వుంటుంది. అక్బర్, ఔరంగజేబుల్ని 'విదేశీయులు'గా, రాణాప్రతాప్, శివాజీలను 'జాతీయ వీరులు'గా పరిగణించటమంటే ఈ 20వ శతాబ్ది మతతత్వ దృక్పథాన్ని గతచరిత్రలోకి చొప్పించటమే. ఇది చెడ్డ చరిత్ర మాత్రమే కాదు, జాతీయ సమైక్యతకి కూడా గొడ్డలిపెట్టు.

అయితే అతివాదులంతా ముస్లిం వ్యతిరేకులనిగానీ, పూర్తిగా మతతత్వవాదులనిగానీ అర్థంకాదు. అలా అనటం సత్యదూరం. తిలక్‌తోసహా అతివాదుల్లో ఎక్కువమంది హిందూ-ముస్లిం ఐక్యతావాదులు. వాళ్ళందరికీ మాతృభూమి లేదా భారతమాత ఒక నూతన భావన. ఆ భావనకి మతంతో ఎటువంటి సంబంధంలేదు. వాళ్ళలో చాలామంది రాజకీయ చింతనలో ఆధునిక దృష్టి ఉన్నవాళ్ళు. అంతేగాని వెనుకచూపు ఉన్నవాళ్ళు కారు. ఆర్థిక బహిష్కరణ (బాయ్‌కాట్) వాళ్ళ ముఖ్య రాజకీయ ఆయుధం. ఆ ఆయుధం ఆధునికం. అట్లాగే వాళ్ళ రాజకీయ సంస్థ కూడా. విప్లవ ఉగ్రవాదులు సైతం ఐరోపా విప్లవోద్యమాలచేత ఉత్తేజితులైన వాళ్ళే. కాళి, భవానీ మాతలకన్నా ఐర్లాండ్, రష్యా, ఇటలీ విప్లవనేతలే వాళ్ళకాదర్శం. అయితే, ముందు చెప్పినట్లుగా అతివాదుల రాజకీయ కృషిలో, భావాలలో కొంత హిందూమత వాసన ఉంది. ఇది ప్రత్యేకంగా హానికరంగా పరిణమించింది. ఎంచేతనంటే తెలివిమీరిన బ్రిటీషువాళ్ళు బ్రిటీషు అనుకూలవాదులు ఈ హిందూమత ఛాయని ముస్లిముల మనస్సుల్లో విషబీజాలు చల్లటానికి వాడుకున్నారు. ఫలితంగా ముస్లిం విద్యావంతులనేక మంది వర్ధమాన జాతీయోద్యమానికి దూరంగానైనా ఉండిపోయారు, లేదా దానికి వ్యతిరేకంగా కత్తిగట్టారు. ఆ విధంగా వాళ్ళు వేర్పాటు ధోరణికి ఎర అయ్యారు. అయినప్పటికీ ముస్లిం మేధావుల్లో అభ్యుదయవాదులయిన బారిష్టర్ అబ్దుల్ రసూల్, హస్రత్ మొహానీ వంటివారు స్వదేశీ ఉద్యమంలో దూకారు. మహమ్మదాలీ జిన్నా భారత జాతీయ కాంగ్రెస్ ప్రముఖ యువ నాయకుల్లో ఒకడయ్యాడు.

దేశ ఆర్థిక బడుగుస్థితి కూడా మతతత్వం పెరగటానికి దోహదం చేసింది. ఆధునిక పారిశ్రామికాభివృద్ధి కొరవడ్డందువల్ల, నిరుద్యోగ సమస్య తీవ్రరూపం దాల్చింది. ముఖ్యంగా విద్యావంతులు నిరుద్యోగపు కోరల్లో నలిగిపోయారు. ఫలితంగా, ఉన్న కొద్ది ఉద్యోగాలకు తీవ్ర పోటీ ఏర్పడింది. దూరదృష్టిగల భారతీయులు వ్యాధి నిర్ణయం చేశారు. ఈ దేశం ఆర్థికంగా బాగుపడ్డానికి, ఉద్యోగావకాశాలు పుష్కలంగా కలగటానికి అనువైన ఆర్థిక, రాజకీయ వ్యవస్థకోసం శ్రమించారు. కాని ఇంకా చాలా మంది ఉద్యోగాలలో మత, ప్రాంతీయ, కుల ప్రాతిపదిక మీద రిజర్వేషన్ల వంటి సంకుచిత దృష్టితో కూడిన స్వల్పకాలిక నివారణోపాయాల్ని గురించి ఆలోచించారు. అనాడున్న పరిమిత ఉద్యోగావకాశాలలో హెచ్చు శాతం కొట్టేయ్యాలన్న ప్రయత్నంలో అటువంటివాళ్ళు మత, ప్రాంతీయ, కుల వైషమ్యాల్ని రెచ్చగొట్టారు. మొండి తెగింపుతో ఉద్యోగాలకోసం వేటాడుతున్న వాళ్ళని ఇటువంటి సంకుచితమైనవి తక్షణం ఆకర్షించాయి. ఈ పరిస్థితిలో హిందూ - ముస్లిం మతతత్వ నాయకులు, కులప్రముఖులు 'విభజించి పాలించే' సూత్రాన్ని అక్షరాలా పాటించే అధికార్లు కొంతవరకు విజయం సాధించారు. చాలామంది హిందువులు హిందూ జాతీయతని గురించి, ముస్లిములలో అనేకమంది ముసల్మాను జాతీయతని గురించి మాట్లాడ్డం మొదలుపెట్టారు. రాజకీయ పరిణతిలేని ప్రజలు తమకి ఆర్థిక, విద్యా, సాంస్కృతిక దుస్థితి విదేశపాలనవల్ల, ఆర్థికమైన వెనుకబాటుతనం వల్ల సంప్రాప్త మయ్యాయని గ్రహించలేకపోయారు. తమ అందరి ఉమ్మడి కృషి ద్వారా మాత్రమే తమ దేశానికి స్వేచ్ఛ లభిస్తుందని, తమ దేశం ఆర్థికంగా బాగుపడుతుందనీ, అప్పుడే నిరుద్యోగం లాంటి ఉమ్మడి సమస్యలు పరిష్కారం అవుతాయనీ వాళ్ళు గ్రహించలేకపోయారు.

ముస్లిం విద్యావంతుల్లో, ముస్లిం ఐదానవాబుల్లో, భూస్వాముల్లో ఈ వేర్పాటు, గులామీ ధోరణులు 1906లో అఖిల భారత ముస్లిం లీగు స్థాపనలో పరాకాష్ఠ చెందాయి. ముస్లిం లీగు సంస్థ ఆగాఖాన్, ఢక్కా నవాబ్, నవాబ్ మొహసిన్-ఉల్-ముల్క్‌ల నాయకత్వంలో ప్రారంభమైంది. ముస్లిం లీగు బెంగాల్ విభజనని సమర్థించింది. ప్రభుత్వోద్యోగాలలో ముస్లిములకు ప్రత్యేక రక్షణలు కల్పించాలని డిమాండు చేసింది. ఆ తరువాత, వైస్రాయి లార్డ్ మింటో తోడ్పాటుతో ముస్లిములకు ప్రత్యేక నియోజకవర్గాలను సాధించుకోగలిగింది. ఒకవేపు జాతీయ కాంగ్రెసు సామ్రాజ్యవాద వ్యతిరేక ఆర్థిక, రాజకీయ సమస్యల్ని చేపడితే మరోవేపు ముస్లిం లీగు, దాని అభివృద్ధి నిరోధక నాయకులు ముస్లిముల ప్రయోజనాలు హిందువుల ప్రయోజనాలకు భిన్నమైనవని ప్రచారం సాగించారు. ముస్లిం లీగు రాజకీయ కార్యకలాపాలు విదేశపాలకులకు వ్యతిరేకంగా లేవు. హిందువులకు, జాతీయ కాంగ్రెసుకు వ్యతిరేకంగా సాగాయి. అది మొదలు, కాంగ్రెస్ సంస్థ అడిగిన ప్రతి ఒక్క జాతీయ, ప్రజాస్వామిక డిమాండుని లీగు ప్రతిఘటించింది. ముస్లిముల 'ప్రత్యేక ప్రయోజనాల్ని, పరిరక్షిస్తామని ప్రకటించిన బ్రిటీషువాళ్ళ చేతుల్లోకి లీగు జారిపోయింది. ఉప్పొంగే జాతీయోద్యమ వెల్లువని అరికట్టాలని ఆశించిన బ్రిటీషు వాళ్ళకి లీగు ఆ ప్రయత్నంలో ప్రధాన సాధనమైంది.

లీగుని తమకు పనికివచ్చేటట్లు బాగా ఉపయోగించుకుందుకు బ్రిటీషు వాళ్ళు దాన్ని ముస్లిం ప్రజా బాహుళ్యంలోకి చొచ్చుకుపోయి, నాయకత్వం వహించమని ప్రోత్సాహపరచారు. జాతీయోద్యమంలో కూడా ఆనాడు విద్యావంతులైన పట్టణవాసుల ప్రాబల్యమే హెచ్చుగా వున్న మాట వాస్తవమే. కాని జాతీయోద్యమం సామ్రాజ్యవాద వ్యతిరేక వైఖరి తీసుకున్నది కాబట్టి పేదలు-సంపన్నులు, హిందువులు-ముస్లిములు భారత ప్రజలందరి ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించింది. మరోవెంప ముస్లిం లీగుకుగాని అందులోని ఉన్నత వర్గాల నాయకులకుగాని సామాన్య ముస్లిం ప్రజానీక ప్రయోజనాలతో ఏమాత్రం నిమిత్తం లేదు. విదేశ సామ్రాజ్యవాదం కింద హిందూ ప్రజా సామాన్యం మాదిరిగా ముస్లిం ప్రజా సామాన్యం కూడా కడగండ్ల పాలయింది.

ముస్లిం లీగు మౌలిక బలహీనతని దేశభక్తులైన ముస్లిములు ఇతోధికంగా గుర్తించసాగారు. ముఖ్యంగా విద్యావంతులైన ముస్లిం యువకులు విప్లవాత్మక జాతీయ భావాలవేపు ఆకర్షితులయ్యారు. సమరశీల జాతీయ అహ్రార్ (Ahrar) ఉద్యమం ఆ సమయంలో మౌలానా మహమ్మదాలీ, హకీమ్ అజ్మల్‌ఖాన్, హసన్ ఇమామ్, మౌలానా జఫ్రలీఖాన్, మజహర్-ఉల్-హక్ ప్రభృత యువనాయకుల నేతృత్వంలో ప్రారంభమైంది. ఈ యువకులకు అలీఘర్ ఉద్యమం, ఐదానవాబులు, జమీందార్ల గులామీ రాజకీయాలు నచ్చలేదు. ఆధునిక స్వరాజ్య భావాలతో ఉత్తేజితులైన ఈ యువనాయకులు సమరశీల జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొనమని ప్రజల్లో ప్రచారం చేశారు.

సాంప్రదాయక ముస్లిం పండితుల్లో ఒక భాగంలో అటువంటి జాతీయ భావాలు మొలకెత్తాయి. ఈ పండితుల్లో అత్యంత ప్రముఖుడు మౌలానా అబుల్ కలాం అజాద్. అప్పటికాయన యువకుడు. కైరోలో సుప్రసిద్ధ అల్ అజర్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేశాడు. తన 24వ ఏట (1912) అల్‌హిలాల్ అనే పత్రికని స్థాపించి, దాని

ద్వారా ఆయన తన హేతువాద జాతీయవాద భావాలను ప్రచారం చేశాడు. మౌలానా మహమ్మదాలీ, అబుల్‌కలాం అజాద్, ఇంకా తదితర్లు కలిసి ప్రజలకు ధైర్య, నిర్భీకతల్ని ప్రబోధించారు. ఇస్లాముకు-జాతీయ ఉద్యమానికి మధ్య వైరుధ్యం లేదని తేగేసి చెప్పారు.

1911లో ఒట్టొమాన్ సామ్రాజ్యానికి (టర్కీ) ఇటలీకి యుద్ధం ప్రజ్వరిల్లింది. 1912, 1913 సంవత్సరాల మధ్య టర్కీ బాల్కన్ రాజ్యాలతో పోరాడవలసి వచ్చింది. ఆ రోజుల్లో టర్కీ సుల్తాను కలిఫా, అంటే సమస్త ముస్లిం మతస్థులకు పెద్ద. పైగా ముస్లిం పవిత్ర స్థలాలన్నీ టర్కీ సామ్రాజ్యంలోనే ఉండేవి. కాబట్టి భారతదేశంలో టర్కీపట్ల సానుభూతి ఉన్నెన పొంగింది. డాక్టర్ అన్సారీ అధ్వర్యంలో ఒక వైద్యబృందం టర్కీకి వెళ్ళింది. బాల్కన్ యుద్ధకాలంలోనూ, ఆ తరువాతా బ్రిటిషువైఖరి టర్కీకి వ్యతిరేకంగా ఉంది. టర్కీ అనుకూల, కలిఫా అనుకూల లేదా ఖిలాఫత్ భావావేశం సామ్రాజ్యవాద వ్యతిరేకత సంతరించుకుంది. 1912 నుండి 1924 వరకు ముస్లింలీగులో రాజభక్తులు జాతీయవాద యువకుల అధిక్యత అడుగున మరుగుపడి పోయారు.

దురదృష్టవశాత్తు హేతువాద దృష్టి కలిగిన అజాద్‌వంటి కొద్దిమంది తప్ప ముస్లిం యువకుల్లో అతివాద భావాలు కలిగిన జాతీయవాదుల్లో ఎక్కువమంది రాజకీయాల్లో అధునిక లౌకిక దృక్పథాన్ని సంపూర్ణంగా అంగీకరించలేదు. ఫలితంగా వాళ్ళు రాజకీయ స్వాతంత్ర్యాన్ని అతి ముఖ్య సమస్యగా చేపట్టలేదు. పవిత్రస్థలాల పరిరక్షణ, టర్కీ భద్రత వాళ్ళకు ముఖ్యమయ్యాయి. సామ్రాజ్యవాద ఆర్థిక, రాజకీయ పరిణామాల్ని అవగాహన చేసుకుని ప్రతిఘటించటానికి బదులుగా పవిత్రస్థలాలకు, కలిఫాకు సామ్రాజ్యవాదం ముప్పుతెస్తుంది కాబట్టి దానికి వ్యతిరేకంగా పోరాడారు. టర్కీపట్ల వాళ్ళ సానుభూతి కూడా మత ప్రాతిపదికమీద కలిగింది. వాళ్ళ రాజకీయ విజ్ఞప్తి కూడా మతపరతతో కూడుకున్నది. వాళ్ళు కీర్తించిన వీరులు, పురాణ కథలు, సాంస్కృతిక సంప్రదాయాలు భారత ప్రాచీన, మధ్యయుగాలకు సంబంధించినవి కావు, పశ్చిమాసియా చరిత్ర నుంచి ఎరువు తెచ్చుకున్నవి. ఈ రకమైన వైఖరి భారత జాతీయవాదంతో వెంటనే సంఘర్షించని మాట నిజమే. అది తదనుయాయుల్ని సామ్రాజ్యవాద వ్యతిరేకులుగా చేసింది కూడా. పట్టణాల్లో జీవించే ముస్లిముల్లో జాతీయవాద ధోరణులు పెంపొందించింది కూడా. కాని చివరికి ఈ ధోరణి ప్రమాదకరమని రుజువయింది. ఎంచేతనంటే ఇది రాజకీయ సమస్యల్ని మతపరమైన దృక్పథం నుంచి చూసే అలవాటుని ప్రోత్సహించింది. ఏది ఏమైనా అటువంటి రాజకీయ కార్యకలాపాలు ముస్లిం జనసామాన్యంలో ఆర్థిక, రాజకీయ సమస్యలపట్ల అధునిక, లౌకిక దృక్పథాన్ని ప్రోత్సహించలేదు.

అదే సమయంలో హిందూ మతతత్వవాదులు ఒక సంస్థని నిర్మించకపోయినా, హిందూ మతతత్వ భావాలు మొలకెత్తాయి. చాలామంది హిందూ రచయితలు, రాజకీయ కార్యకర్తలు ముస్లింలీగు పక్కలో అటువంటి భావాలను, కార్యక్రమాన్ని ప్రతిధ్వనించారు. హైందవ జాతీయతని గురించి మాట్లాడారు. ముస్లిములు భారతదేశానికి విదేశస్థులని ఉద్ఘాటించారు. శాసనసభల్లో, పురపాలక సంఘాల్లో, ప్రభుత్వోద్యోగాల్లో తమ వాటా తమకు కావాలని వాళ్ళు విడువకుండా ఆందోళన చేశారు.

***జాతీయవాదులు - మొదటి ప్రపంచ యుద్ధం:*** 1914 జూన్‌లో మొదటి ప్రపంచ యుద్ధం మొదలయింది. గ్రేట్ బ్రిటన్, ఇటలీ, రష్యా, జపాన్, అమెరికా సంయుక్త రాష్ట్రాలు కలిసి ఒక పక్షం -జర్మనీ, ఆస్ట్రియా, హంగరీ, టర్కీలు కలిసి ప్రత్యర్థి పక్షం ఈ రెండుపక్షాల మధ్య యుద్ధం ప్రజ్వరిల్లింది మార్కెట్లకోసం, వలసలకోసం పారిశ్రామిక పెట్టుబడిదారీ దేశాల పోటీ, పోరాటాలు గురించి 9వ అధ్యాయంలో చెప్పుకున్నాం 20వ శతాబ్దారంభంనాటికి ఈ పోరాటం తీవ్రతరమైంది ప్రపంచంలో ఇంకా జయించటానికి అందుబాటైన భూభాగం క్రమేణా కుంచించుకు పోవటంతో సామ్రాజ్యవాద దేశాల సంఘర్షణ వేడి పుంజుకుంది ప్రపంచ రంగస్థలం మీదికి జర్మనీ, ఇటలీవంటి రాజ్యాలు అలస్యంగా ప్రవేశించటంవల్ల ముందుగా రంగప్రవేశం చేసిన బ్రిటన్, ఫ్రాన్సువంటి రాజ్యాలు అందినమేరకి వలసల్ని స్థాపించుకున్నాయి ఇంకా మిగిలింది చాలా తక్కువ కాబట్టి, వలసల్ని పునర్విభజన చేసుకోవాలని జర్మనీ, ఇటలీలు పట్టుబట్టాయి ఈ పునఃపంపకాల్లో అవసరమైతే బలప్రయోగానికి తయారై ఉన్నాయి. ప్రపంచంలో ప్రతి ముఖ్యమైన దేశం ఈ వరకే తను సంపాదించుకున్న వలసల్ని నిలబెట్టుకోటానికిగాని, ఇంకా కొత్త వలసల్ని స్థాపించుకోటానికిగాని యుద్ధ సన్నాహాలు చేసుకుంటున్నది 20వ శతాబ్ది మొదటి సంవత్సరాల్లో ప్రతి అగ్రరాజ్యం ఆయుధపోటీలో నిమగ్నమైపోయింది రాజకీయంగా, సైనికంగా ప్రత్యర్థులచేత ఎక్కడ ఏ కాకి అయిపోతానో అనే భయంతో ప్రతి దేశం ఇతర దేశాలతో మైత్రికోరింది ఎవరికి దొరికిన వాళ్ళని వాళ్ళు కూడగట్టుకున్నారు వెంటనే ఈ రాజ్యాలన్నీ పరస్పర శత్రు శిబిరాలుగా చీలిపోయాయి చిట్టచివరకి 1914 ఆగస్టులో యుద్ధం ప్రారంభమైంది ప్రపంచ రాజకీయాలు అమితవేగంగా మారిపోసాగాయి. మొదటి ప్రపంచ యుద్ధం సాగినకాలంలో భారతదేశంలో జాతీయవాదం పరిణతస్థితి పొందింది

యుద్ధం మొదట్లో లోకమాన్య తిలక్‌తో సహా భారత జాతీయనాయకులంతా ప్రభుత్వ యుద్ధ కృషికి తోడ్పాటు ఇవ్వటానికి నిశ్చయించుకున్నారు. బ్రిటీషువాళ్ళ లక్ష్యంపట్ల సానుభూతి వుండిగానీ, విధేయత ప్రకటించాలనిగానీ వాళ్ళు ఈ నిర్ణయం తీసుకోలేదు. ఈ సందర్భంలో పండిత జవహర్‌లాల్ నెహ్రూ తన 'ఆత్మకథ' లో ఇలా రాశారు:

"పైకి ఎలుగెత్తి విశ్వాసం ప్రకటించినా, బ్రిటిషు వాళ్ళంటే పిసరంత సానుభూతి లేదు మితవాదులు, అతివాదులు జర్మనీ విజయాలు విని సమానంగా సంతృప్తి చెందారు. అంటే జర్మనీపట్ల అభిమానం ఉండికాదు. మన పాలకులు మన్ను కరుస్తుంటే చూడాలనే కోరిక మాత్రమే".

బ్రిటన్‌కు తోడ్పాటు ఇస్తే, అది కృతజ్ఞతతో భారతదేశానికి స్వపరిపాలన ప్రసాదిస్తుందనే వెర్రి నమ్మకంతో జాతీయవాదులు క్రియాశీల బ్రిటిషు అనుకూల వైఖరి ప్రదర్శించారు. ప్రపంచ యుద్ధంలో పోరాడే వివిన్న దేశాలు తమ వలసల్ని రక్షించుకోడానికి మాత్రమే బరిలోకి దిగాయనే వాస్తవాన్ని మన జాతీయనాయకులు పూర్తిగా గ్రహించలేకపోయారు.

**హోమ్‌రూల్ ఉద్యమం** (స్వయం పరిపాలనా ఉద్యమం): ప్రజలు ఒత్తిడి చేస్తేనేగాని ప్రభుత్వం రాయితీలు ఇవ్వజాలదని చాలామంది జాతీయనాయకులు స్పష్టంగా గ్రహించారు. కాబట్టి నిజమైన ప్రజారాజకీయోద్యమం అవసరమైంది. ఇంకా

కొన్ని ఇతర కారణాలు కూడా జాతీయోద్యమాన్ని ఇదే దిశలో నడిపించాయి. ఐరోపా సామ్రాజ్యవాద రాజ్యాల మధ్య పరస్పర సంఘర్షణ ఫలితంగా ప్రజ్వరిల్లిన ప్రపంచ యుద్ధం ఆసియా ప్రజలపైన పాశ్చాత్య జాతుల కల్పిత జాత్యాధిక్యతని బద్దలు కొట్టింది. పైగా యుద్ధం భారత పేద ప్రజానీకపు దైన్య పరిస్థితిని మరింత దుర్భరం చేసింది. యుద్ధం అంటే ప్రజల అనుభవంలో భారీ పన్నులు, నిత్య జీవితావసర వస్తువుల అధిక ధరలు. కాబట్టి ప్రజలు ఏ అతివాద ప్రతిఘటనోద్యమంలోనైనా దూకటానికి సిద్ధంగా ఉన్నారు. పర్యవసానంగా యుద్ధకాలం తీవ్రతర జాతీయవాద రాజకీయాందోళన కాలంగా మారింది.

అయితే ఈ ప్రజాందోళనని భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వంలో నడిపే అవకాశం లేదు. ఎంచేతనంటే, జాతీయ కాంగ్రెస్ సంస్థ మితవాద నాయకత్వంలో ప్రజల మధ్యకు వెళ్ళి ఏ కార్యక్రమమూ నడపలేని నీరవ రాజకీయ సంస్థగా తయారైవుంది. అంచేత 1915-16 సంవత్సరాల మధ్య రెండు హోమ్‌రూల్ సంఘాలు ప్రారంభమయ్యాయి. ఒక సంఘానికి లోకమాన్య తిలక్ నాయకుడు, రెండవ దానికి అనీబిసెంట్, యస్.సుబ్రమణ్య అయ్యర్‌లు సారధులు. ఈ రెండు సంఘాలూ యుద్ధానంతరం భారతదేశానికి స్వపరిపాలన ఇవ్వాలనే వాంఛితాన్ని దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర ప్రచారం సాగించాయి. ఈ సమయంలో తిలక్ "స్వరాజ్యం నా జన్మహక్కు, దాన్ని నేను సాధించి తీరుతాను" అనే జనప్రియ నినాదం ఇచ్చారు. ఈ రెండు ఉద్యమాలూ శీఘ్ర ప్రగతి సాధించాయి. స్వరాజ్యవాంఛ దేశమంతటా వాడ వాడలా మార్మోగింది.

మొదటి ప్రపంచ యుద్ధకాలంలోనే ఒక విప్లవోద్యమం అల్లుకుంది. బెంగాల్, మహారాష్ట్రల నుంచి టెర్రరిస్టు బృందాలు యావత్తు ఉత్తర భారతంలోపలికి చొచ్చుకుపోయాయి. బ్రిటిషు పాలనని కూలదోయడానికి అనేకమంది భారతీయులు హింసాత్మక తిరుగుబాటు లేవదీయటానికి సన్నాహాలు ప్రారంభించారు. అమెరికా, కెనడాలలోని భారతీయ విప్లవకారులు 1913లో గదర్ (తిరుగుబాటు) పార్టీని స్థాపించారు. పార్టీ సభ్యుల్లో ఎక్కువమంది సిక్కు రైతులు, సిపాయిలు. నాయకుల్లో చాలామంది విద్యావంతులైన హిందువులు, ముస్లిములు. మెక్సికో, జపాన్, చైనా, ఫిలిప్పైన్స్, మలయా, సింగపూర్, థాయ్‌లాండ్, ఇండోచైనా, తూర్పు, దక్షిణ ఆఫ్రికాలలో ఆ పార్టీకి అనేకమంది క్రియాశీల సభ్యులుండేవాళ్ళు.

భారతదేశంలో బ్రిటిషు వాళ్ళకి వ్యతిరేకంగా ఒక విప్లవ సమరం సాగించటానికి గదర్ పార్టీ ప్రతిజ్ఞా కంకణం ధరించింది. 1914 లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కాగానే గదర్ పార్టీ కార్యకర్తలు భారతదేశంలో స్వదేశ సైనికుల, స్థానిక విప్లవకారుల సహాయంతో తిరుగుబాటు లేవదీయటానికి ఆయుధాల్ని, మనుషుల్ని పంపారు. అనేక వేలమంది భారతదేశానికి తిరిగి వెళ్ళటానికి ముందుకొచ్చారు. వాళ్ళ ఖర్చులకుగాను లక్షల డాలర్లు విరాళంగా ముట్టాయి. కొందరు జీవితమంతా కష్టపడి కూడబెట్టిన సొమ్ముని విరాళంగా ఇచ్చారు. మరికొందరు భూములు, ఇతర ఆస్తులు అమ్మి ఆర్థిక సహాయం సమకూర్చారు. గదర్ వీరులు దూర ప్రాచ్యంలో, ఆగ్నేయ ఆసియాలో, ఇండియాలో పనిచేసే సైనికులతో సంబంధాలు పెట్టుకున్నారు. బ్రిటీషు వాళ్ళకు వ్యతిరేకంగా తిరుగుబాటు చెయ్యమని అనేక సైనిక పటాలాలకి

నచ్చచెప్పారు. చివరికి 1915 ఫిబ్రవరి 15న పంజాబులో సాయుధ తిరుగుబాటు చెయ్యటానికి నిర్ణయం జరిగింది. దురదృష్టవశాత్తు ఈ రహస్య పథకం ప్రభుత్వానికి వెల్లడికావటంతో అది తక్షణం చర్య తీసుకుంది. తిరుగుబాటుకు సమాయత్తమైన పటాలాలను రద్దుచేసింది. నాయకుల్ని జైళ్ళలో నిర్బంధించడమో, ఉరితీయడమో చేసింది. ఉదాహరణకు 23వ అశ్వికదళంలో 12గురు ఉరితీయబడ్డారు. పంజాబులో గదర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అరెస్టు కాబడ్డారు. విచారణ తరువాత వాళ్ళలో నలభై ఇద్దర్ని ప్రభుత్వం ఉరితీసింది. 114 మందికి అజన్మ ఖైదుశిక్ష పడింది. తొంభై ముగ్గురికి దీర్ఘ కారాగార శిక్షలు పడ్డాయి. వారిలో చాలామంది జైళ్ళనుండి విడుదల పొందాక, పంజాబులో కీర్తి, కమ్యూనిస్టు ఉద్యమాలను స్థాపించారు. బాబా గురుముఖ్‌సింగ్, కర్తార్‌సింగ్, సోహన్‌సింగ్ భాక్నా, రహ్మత్ అలీషా, భాయి పరమానంద్, మహమ్మద్ బర్కతుల్లాలు గదర్ ఉద్యమ ప్రముఖుల్లో కొందరు.

గదర్ పార్టీ ఉత్తేజంతో సింగపూర్‌లోని పంచమ పదాతి దళంలో 700 మంది సైనికులు జమేదార్ చిస్తీఖాన్, సేబుదార్ దుందేఖాన్‌ల నాయకత్వంలో సాయుధ తిరుగుబాటు చేశారు. ఆ భీకర యుద్ధంలో అనేకమంది హతులయ్యారు. తిరుగుబాటు నమసిపోయింది. 37గురిని ప్రభుత్వం బహిరంగంగా ఉరితీసింది. 41 మందికి అజన్మఖైదు శిక్ష విధించింది.

భారతదేశంలోను, విదేశాలలోను ఇతర విప్లవకారులు చురుగ్గా పనిచేశారు. 1915లో బాలాసోర్‌లో జతిన్ ముఖర్జియా ఒక విప్లవ చర్యలో పోలీసులతో పోరాడుతూ ప్రాణాలు అర్పించాడు. రాస బిహారీ బోస్, రాజా మహేంద్ర ప్రతాప్, లాలాహర్‌దయాల్, అబ్దుల్ రహీమ్, మౌలానా ఒబైదుల్లా సింధీ, చంపక్ రామన్ పిళ్లే, సర్దార్ సింగ్ రాణా, మదాం కామా మొదలైన కొందరు భారతదేశానికి వెలుపల విప్లవ కార్యక్రమాలను నడిపిన ప్రముఖులు.

***కాంగ్రెస్ లక్నో సమావేశం (1916):*** జాతీయోద్యమంలో అతివాదులు, మితవాదులు అనే తేడాలు, రెండు హోమ్‌రూల్ సంస్థలు, హిందువులు-ముస్లిములు అనే తారతమ్యాలు తమ ఆశయానికి హానిచేస్తున్నాయనేది జాతీయవాదులు సత్వరం గ్రహించారు. తామంతా ఒక ఐక్య సంఘటనగా ప్రభుత్వానికెదురు నిలబడాలని వాళ్ళు నిర్ణయించుకున్నారు. దేశంలో ఉప్పొంగే జాతీయతా భావం, జాతీయ సమైక్యత కోసం ఆరాటం 1916లో లక్నో కాంగ్రెస్ సమావేశంలో రెండు చారిత్రక పరిణామాల్ని సృష్టించాయి. ఒకటి- కాంగ్రెస్ సంస్థలోని అతివాదులు, మితవాదులు తిరిగి ఒక్కటయ్యారు. పాత వివాదాలు నమసిపోయాయి. ఉప్పొంగే జాతీయవాద వెల్లువ లోకమాన్య తిలక్ వంటి అతివాద జాతీయ నాయకుల్ని కాంగ్రెస్ సంస్థతో కలిపింది. కాంగ్రెస్ పాత నాయకులు సమరశీల జాతీయవాదుల్ని మాత్రం సంస్థలోకి సాదరంగా ఆహ్వానించారు. 1907 తరువాత లక్నో కాంగ్రెస్ మొట్టమొదటి సమైక్య కాంగ్రెస్ అని చెప్పవచ్చు.

రెండు- లక్నో సమావేశంలో కాంగ్రెస్, అఖిల భారత ముస్లింలీగులు తమ పాత విభేదాలు విస్మరించి తమ ఉమ్మడి రాజకీయ డిమాండ్లను ప్రభుత్వం ముందుపెట్టారు. ప్రపంచ యుద్ధం, రెండు హోమ్‌రూల్ సంస్థలు దేశంలో ఒక నూతన అనుభూతిని రేకెత్తిస్తూ, కాంగ్రెస్ పార్టీ స్వభావాన్ని మార్చి వేస్తున్నట్లే ముస్లింలీగు కూడా క్రమేణా

పరివర్తన చెందుతోంది. ముస్లిం విద్యావంతుల్లో యువకులు సాహసవంతమైన జాతీయవాద రాజకీయాలవేపు ఆకర్షితులయ్యారన్న అంశం గురించి ఇంతకు ముందే చెప్పుకున్నాం. యుద్ధకాలంలో ఈ దిశలో ఇంకా కొన్ని పరిణామాలు సంభవించాయి. 1914లో బ్రిటిషు ప్రభుత్వం అబుల్‌కలాం అజాద్ నడిపే అల్ హిలాల్ పత్రికనీ, మౌలానా మహమ్మదాలి 'కామ్రేడ్' పత్రికనీ అణచివేసింది. అలీ సోదరులుగా పేరుకెక్కిన మౌలానా మహమ్మదాలీ, శౌకత్ అలీలనీ, హస్రత్ మొహానీ, అజాద్‌లనీ నిర్బంధంలో ఉంచింది. ముస్లింలీగు తన యువ సభ్యుల రాజకీయ సమరశీలాన్ని కనీసం పాక్షికంగానైనా గుర్తించింది. అది అలీఘడ్ ఉద్యమం యొక్క పరిమిత రాజకీయ దృక్పథాన్ని అధిగమించి కాంగ్రెస్ రాజకీయాలకు చేరువకాసాగింది. కాంగ్రెస్-ముస్లిం లీగుల మధ్య ఒడంబడిక మీద సంతకాలు జరగటంలో ఉభయ పక్షాల మధ్య సమైక్యత నెలకొన్నది. దీన్నే లక్నో ఒడంబడిక అంటారు. కాంగ్రెస్, లీగుల మధ్య ఐక్యతా సాధనలో లోకమాన్య తిలక్ ప్రముఖపాత్ర నిర్వహించాడు. ఈ రెండు సంస్థలు తమ సమావేశాల్లో ఒకే తీర్మానాన్ని ఆమోదించాయి. ప్రత్యేక నియోజక వర్గాల ప్రాతిపదిక మీద సంయుక్తంగా రాజకీయ సంస్కరణల పథకాన్ని ప్రభుత్వం ముందు ఉంచాయి. భారతదేశానికి సత్వరం స్వపరిపాలనాధికారం ప్రసాదిస్తామని బ్రిటిషు ప్రభుత్వం ప్రకటించాలని కోరాయి. హిందూ-ముస్లిం ఐక్యతకు సంబంధించి లక్నో ఒడంబడిక గొప్ప ముందంజ. కాని హిందూ-ముస్లిం విద్యావంతుల్ని భిన్న అస్తిత్వాలు కలిగిన వ్యక్తులుగా అంగీకరించి, ఆ ఉభయుల మధ్య సంఘీభావం నెలకొల్పే సిద్ధాంతంమీద లక్నో ఒడంబడిక ఆధారపడ్డం దురదృష్టం. మరో మాటల్లో చెప్పాలంటే, వాళ్ళ రాజకీయ దృక్పథం లౌకిక స్వభావం సంతరించుకుంటేనేగాని, రాజకీయాల్లో హిందూ-ముస్లిముల ప్రయోజనాలు వేరనే భావం వాళ్ళలో పోదు. అంటే లౌకిక రాజకీయ దృక్పథం ద్వారా వాళ్ళు హిందూ-ముస్లిముల రాజకీయ ప్రయోజనాలు ఒక్కటే అని గ్రహించగలుగుతారు. కాబట్టి ఆ దృష్ట్యా లక్నో ఒడంబడిక భారత రాజకీయాల్లో మతతత్వ పునరుజ్జీవనానికి తలుపు తెరిచే ఉంచింది.

అయితే లక్నో పరిణామాల ద్వారా సంభవించిన తక్షణ ఫలితాలు మహత్తరమైనవి. అతివాద-మితవాద జాతీయవాదుల మధ్య, కాంగ్రెస్-ముస్లిం లీగుల మధ్య ఐక్యత దేశంలో గొప్ప రాజకీయోత్సాహాన్ని రేకెత్తించింది. ఆఖరికి బ్రిటిషు ప్రభుత్వం సైతం జాతీయవాదుల్ని సంతృప్తి పరచవలసిన అవసరాన్ని గుర్తించింది. అప్పటిదాకా ప్రభుత్వం జాతీయవాదుల ఆందోళనని అణచివేయటానికి దమన నీతిమీద ఆధారపడింది. వేలాది రాడికల్ జాతీయవాదుల్ని, విప్లవకారుల్ని ప్రభుత్వం జైళ్లలో నిర్బంధించింది. అసహ్యకరమైన భారత భద్రతా చట్టం వంటి క్రూర నిబంధనల కింద జాతీయవాదుల్ని దారుణహింసా, నిర్బంధాలకు గురిచేసింది. ఇప్పుడు జాతీయవాదుల అసంతృప్తిని శాంతింప చేయటానికి ప్రభుత్వం నిశ్చయించింది.

"భారతదేశ ప్రభుత్వ పరిపాలనా శాఖలన్నిటిలో భారతీయుల ప్రవేశాన్ని అభివృద్ధి చేయటం, స్వపరిపాలనా సంస్థలను క్రమేణా నిర్మిస్తూ బ్రిటిషు సామ్రాజ్యంలో ఒక అంతర్భాగంగా భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని సిద్ధింపజేయటం"

పార్లమెంటు ఉద్దేశ్యమని భారతరాజ్య కార్యదర్శి మాంటేగ్ 1917 ఆగస్టు 20న ప్రకటించాడు.

తదనుసారంగా 1918 జూలైలో మాంటేగ్-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ప్రకటించబడ్డాయి. అవి పొందుపర్చబడ్డ చట్టాన్ని 1919 రాజ్యాంగ చట్టమని అంటారు. కాని ఈ సంస్కరణలు భారత జాతీయవాదుల్ని సంతృప్తిపర్చలేదు. భారత జాతీయోద్యమం మూడవ లేదా తుదిదశలో ప్రవేశించనుంది. అదే పోరాటశకం లేదా గాంధీశకం.

# స్వరాజ్య సమరం

ప్రపంచ యుద్ధం జరిగిన 1914-1918 సంవత్సరాల మధ్య ఒక నూతన రాజకీయ పరిస్థితి పరిపక్వత చెందుతున్నదని ముందు అధ్యాయంలో చెప్పుకున్నాం. జాతీయవాదం తన శక్తుల్ని సమీకరించింది. జాతీయవాదులు యుద్ధానంతరం ప్రధాన రాజకీయ ప్రయోజనాలు ఒనగూరుతాయని ఆశలు పెట్టుకున్నారు. తమ ఆశలు నెరవేరని పక్షంలో పోరాటంలోకి దూకటానికి సంసిద్ధంగా ఉన్నారు. యుద్ధానంతరకాలంలో ఆర్థిక పరిస్థితి మరింత గడ్డుగా పరిణమించింది. మొదట ధరలు పెరిగిపోయాయి. తరువాత ఆర్థిక మాంద్యం విజృంభించింది. యుద్ధకాలంలో విదేశాలనుంచి దిగుమతులు ఆగిపోవటంవల్ల బాగా పుంజుకున్న స్వదేశీ పరిశ్రమలు ఇప్పుడు నష్టాల్ని ఎదుర్కొన్నాయి. కొన్ని మూతపడే పరిస్థితి ఎదురయింది. భారీ కస్టమ్సు సుంకాలు విధించి, ప్రభుత్వ సహాయాన్ని అందజేసి తమని ఆదుకోవాలని భారత పారిశ్రామికులు కోరారు. ఒక శక్తివంతమైన జాతీయోద్యమం విజృంభించి, స్వతంత్ర భారత ప్రభుత్వం ఏర్పడితేనే తప్ప తమ కోర్కెలు నెరవేరవని వాళ్ళు గ్రహించారు. నిరుద్యోగం, అధికధరలు, దుర్భర దారిద్ర్య జీవన పరిస్థితులు ఎదుర్కొంటున్న కార్మికవర్గం జాతీయోద్యమంవేపు చురుగ్గా మొగ్గింది. ఆఫ్రికా, ఆసియా, యూరప్‌లలో దిగ్విజయ యాత్ర ముగించుకొని స్వదేశానికి తిరిగివచ్చిన భారత సైనికులు తమ ఆత్మవిశ్వాసాన్ని, ఈ విశాల ప్రపంచాన్ని గురించి గడించిన తమ పరిజ్ఞానాన్ని గ్రామసీమలకు బట్వాడా చేశారు. పెరిగిపోయే దారిద్ర్యంలో, అధికపన్నులతో కృంగిపోయే రైతాంగం తమని నడిపించే నాయకత్వం కోసం ఎదురుతెన్నులు చూస్తోంది. పట్టణాల్లో విద్యావంతులు పెరిగిపోతున్న నిరుద్యోగాన్ని ఎదుర్కొన్నారు. ఆ విధంగా భారత సమాజంలోని అన్ని తరగతుల వాళ్ళు ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు.

జాతీయవాద పునరుజ్జీవనానికి అంతర్జాతీయ వాతావరణం కూడా అనుకూలంగా ఉంది. మొదటి ప్రపంచయుద్ధం ఆసియా, ఆఫ్రికాలలో జాతీయవాదానికి గొప్ప ఊపు ఇచ్చింది. తమ యుద్ధ కృషికి ప్రజల మద్దతును పొందటంకోసం మిత్ర రాజ్యాలైన బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సు, ఇటలీ, జపాన్‌లు ప్రపంచ ప్రజలందరికీ ప్రజాస్వామిక, జాతి స్వయం నిర్ణయాధికార నూతన శకాన్ని వాగ్దానం చేశాయి. కాని యుద్ధంలో విజయం సాధించాక, ఆ దేశాలన్నీ వలస వ్యవస్థని అంతం చెయ్యటానికి ఏమాత్రం సుముఖతా చూపలేదు. తద్విరుద్ధంగా, పారిస్ శాంతి సమావేశంలోగాని, తదితర శాంతి ఒడంబడికల్లోగాని యుద్ధకాలంలో చేసిన వాగ్దానాల ప్రస్తావనేలేదు. వలస ప్రజానీకాన్ని అవి వంచించాయి. యుద్ధంలో ఓడిపోయిన జర్మనీ, టర్కీలవలసల్ని యుద్ధంలో విజయం సాధించిన రాజ్యాలు పరస్పరం

పంచుకున్నాయి. ఆసియా, ఆఫ్రికా ప్రజలు ఒక్కమారు ఆశాశిఖరాలమీంచి భయంకర నిరాశాకూపంలోకి పడిపోయారు. భ్రమలు వీడిన సమరశీల జాతీయవాదం తలెత్తసాగింది.

ప్రపంచ యుద్ధం ఫలితంగా సంభవించిన మరొక ముఖ్య పరిణామమేమంటే తెల్లమనిషి ప్రతిష్ఠ వెల్లకిలపడింది. సామ్రాజ్యవాదం ఆరంభమైనప్పటి నుంచి యూరప్ రాజ్యాలు తమ వలసాధిపత్యాన్ని నిలబెట్టుకుందుకు తెల్లజాతి, తెల్ల సంస్కృతి సర్వోత్కృష్టమైనవనే సిద్ధాంతాల్ని అడ్డంపెట్టుకున్నాయి. అయితే యుద్ధకాలంలో ఉభయపక్షాలు ఒకరికి వ్యతిరేకంగా ఒకరు ప్రత్యర్థుల పాశవిక, అనాగరిక వలస పాలనా చరిత్రని రచ్చకీడ్చుకొని పరస్పరం దుమ్మెత్తిపోసుకున్నాయి. సహజంగా వలసదేశాల ప్రజలు ఉభయపక్షాల ఖండనమండనల్ని విని, తెల్లవాళ్ళ అధికృతపట్ల పెంచుకున్న భయభక్తుల్ని విడనాడారు.

రష్యా విప్లవం జాతీయోద్యమాలకు గొప్ప ఉత్తేజం ప్రసాదించింది. 1917 నవంబర్ 7న లెనిన్ నాయకత్వాన బోల్షివిక్ (కమ్యూనిస్టు) పార్టీ రష్యాలో జారుపరిపాలనకి సమాధి కట్టింది. ప్రపంచ చరిత్రలో ప్రప్రథమ సామ్యవాద రాజ్య సంస్థాపనని ప్రకటించింది. చైనాపైన, ఇంకా ఇతర ఆసియాదేశాలపైన అనాదిగా ఉన్న తన సామ్రాజ్యవాద హక్కుల్ని ఏకపక్షంగా వదులుకోవటం ద్వారా, ఆసియాలోని జారిస్టు వలసదేశాలకు స్వయంనిర్ణయాధికారం ప్రకటించడం ద్వారా, తన సరిహద్దుల్లోని ఆసియా జాతులకు సమానహోదా ప్రసాదించటంద్వారా నూతన సోవియట్ ప్రభుత్వం వలస ప్రపంచాన్ని గాఢంగా ప్రభావితం చేసింది, సముత్తేజపర్చింది. సామాన్యజనంలో అసామాన్య బలం, శక్తి నిక్షిప్తమై ఉన్నాయన్న అమూల్య సత్యాన్ని రష్యావిప్లవం వలసదేశాల ప్రజలకు తెలియజెప్పింది. రష్యా జారు చక్రవర్తి అంతటివాణ్ణి కూలదియ్యగాలేనిది, మరే ఇతర ప్రభుత్వమైనా అజేయం కాదు. నిరాయుధులైన కార్మికులు, రైతాంగం తమదేశపు నిరంకుశ ప్రభువుకు వ్యతిరేకంగా విప్లవాన్ని విజయవంతం చేసుకోగలిగినప్పుడు పరాధీన ప్రజలు నిరాశపడనవసరం లేదు. సమైక్యంగా, సుసంఘటితంగా, స్వాతంత్ర్య పోరాట నిశ్చయులై ఉంటే, దేశవిముక్తి కోసం తాముా అకుంఠిత పోరాటం సాగించవచ్చు. ఆ విధంగా రష్యా విప్లవం వలస ప్రజల మనస్సుల్లో ఆత్మవిశ్వాసం నింపింది. సామాన్య ప్రజల బలంమీద ఆధారపడాలని జాతీయోద్యమ నాయకులకు సూచించింది.

మిగతా ఆఫ్రో-ఆసియా ప్రపంచం యుద్ధానంతర జాతీయాందోళనా వెల్లువలో కొట్టుకుపోతోందన్న వాస్తవం భారతదేశంలో కూడా జాతీయోద్యమాన్ని ప్రభావితం చేసింది. జాతీయవాదం ముందుకు త్రోసుకువచ్చింది. ఒక్క భారతదేశంలో మాత్రమే కాదు- టర్కీలో, ఉత్తర ఆఫ్రికా, అరబ్ దేశాల్లో, పశ్చిమాసియాలో, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, బర్మా, మలయా, ఇండోనేషియా, ఇండోచైనాల్లో, ఫిలిప్పైన్స్‌లో, చైనా, కొరియాల్లో జాతీయవాద వెల్లువ ఉప్పొంగింది.

జాతీయవాద, పరప్రభుత్వ వ్యతిరేక భావవెల్లువని గమనించిన బ్రిటిషు పాలకులు ఒక చేత రాయితీలు, మరొక చేత దండం చూపించే పద్ధతిని అనుసరించాలని నిర్ణయించుకున్నారు.

***మాంటేగ్-చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు:*** భారత రాజ్య కార్యదర్శి ఎడ్విన్ మాంటేగ్, వైస్రాయి లార్డ్ చెమ్స్‌ఫర్డ్ కలిసి 1918లో ఒక రాజ్యాంగ సంస్కరణల పథకాన్ని

రూపొందించారు. దానిని పార్లమెంటు ఆమోదించి 1919 డిశంబర్‌లో భారత ప్రభుత్వ చట్టమనే పేరుతో అమలులో పెట్టింది ఈ చట్టం ప్రకారం రాష్ట్ర శాసన సభల్లో సభ్యుల సంఖ్య పూర్వం కన్నా హెచ్చు అయింది అట్లాగే ఎన్నిక సభ్యుల సంఖ్యకూడా పెరిగింది "ద్వంద పరిపాలన" (Dyarchy) పద్ధతి కింద రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చు అధికారాలు కలిగాయి. ఈ ద్వంద పరిపాలనా విధానంలో ఆర్థిక వ్యవహారాలు, శాంతి భద్రతలు వంటి విషయాల్ని "ప్రభుత్వాధీన అంశాలు" (Reserved Subjects) అంటారు ఇవి గవర్నర్ ప్రత్యక్ష అధీనంలో ఉంటాయి విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, స్థానిక స్వపరిపాలన వంటి విషయాల్ని "శాసన సభాధీన అంశాలు" (Transferred Subjects) అంటారు ఇవి శాసన సభలకు బాధ్యులైన మంత్రుల వశంలో ఉంటాయి. కొన్ని వ్యయశాఖలు శాసన సభలకు బదిలీ అయినా, ఆర్థిక వ్యవహారాల్లో గవర్నరుదే పూర్తి పెత్తనం. మంత్రులు స్వతంత్రించి పనిచేసే వీలులేదు మంత్రుల ప్రతిపాదనల్ని గవర్నరు ఏ కారణం చేతనైనా త్రోసిపుచ్చవచ్చు

ఇక కేంద్రంలో ఈ నూతన రాజ్యాంగ చట్టం కింద రెండు శాసన సభలు ఏర్పాటయ్యాయి. ఒకటి - రాజ్యసభ దీన్ని ఎగువసభ అన్నారు రెండవది - శాసనసభ (Legislative Assembly) ఇది దిగువసభ దిగువసభ శాసనసభ్యుల సంఖ్య 144 వీరిలో 41 మందిని ప్రభుత్వం నామినేట్ చేసింది (ప్రభుత్వం చేత నియమితులైన సభ్యులు) ఎగువసభ సభ్యుల సంఖ్య 60 వీరిలో ముప్పై నలుగురు ఎన్నికైన సభ్యులు, మిగిలిన 26గురు ప్రభుత్వం చేత నియమితులైనవాళ్ళు ఈ శాసన సభలకు గవర్నర్-జనరల్‌పైన గాని, ఆయన కార్యనిర్వాహక మండలిపైనగాని ఎటువంటి అధికారం లేదు పైపెచ్చు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వాలపైన నిర్నిబంధమైన ఆధిపత్యం ఉంది ఇవన్నీ అటుంచి ఓటింగు హక్కును ప్రభుత్వం ఘోరంగా పరిమితం చేసింది అంటే ఓటు హక్కు వినియోగించుకోటానికి అనేక అర్హతలు ప్రవేశ పెట్టబడ్డాయన్నమాట! 1920లో దిగువసభకు ఓటు చేసే అర్హతగల వారి సంఖ్య 9,09,874, ఎగువ సభ ఓటర్ల సంఖ్య 17,364

భారత జాతీయవాదులు కోరింది ఈ మందకొడి రాయితీల్ని కాదు ఒక పరాయి ప్రభుత్వం తమ స్వపరిపాలనా యోగ్యతను నిర్ణయించటానికి వాళ్ళు అంగీకరించలేదు. ఈ నామమాత్రపు రాజకీయాధికారం వాళ్ళకి సంతృప్తి కలిగించలేదు. ఈ సంస్కరణ ప్రతిపాదనల్ని పరిశీలించటం కోసం హసన్ ఇమామ్ అధ్యక్షతన భారత జాతీయ కాంగ్రెసు 1918 ఆగస్టులో బొంబాయిలో సమావేశమైంది. బొంబాయి సమావేశం ఈ సంస్కరణలను నిరుత్సాహకరమైనవిగా, అసంతృప్తికరమైనవిగా అభివర్ణించింది వీటి స్థానే ఒక సమర్థవంతమైన స్వపరిపాలనా వ్యవస్థ కావాలని డిమాండు చేసింది కొందరు ఆరితేరిన కాంగ్రెస్ నాయకులు సురేంద్రనాథ్ బెనర్జీ నాయకత్వాన ఈ సంస్కరణలపట్ల సుముఖత వెల్లడించి, కాంగ్రెస్ నుండి వైదొలగారు బొంబాయి సమావేశంలో పాల్గొనటానికి వారు నిరాకరించారు. అయితే వాళ్ళు చాలా కొద్దిమంది. వారంతా కలిసి "ఇండియన్ లేబర్ ఫెడరేషన్" అనే సంస్థని ప్రారంభించారు వాళ్ళనే తరువాత "ఉదారవాదు"లన్నారు. అప్పటి నుంచి భారత రాజకీయాలలో వారి పాత్ర చాలా స్వల్పం.

**రౌలట్ శాసనం:** ఒకవేపు భారతీయుల్ని సంతృప్తి పర్చడానికి ప్రయత్నిస్తూనే,

బ్రిటిషు ఇండియా ప్రభుత్వం అణచివేత చర్యలకు సిద్ధపడింది. యుద్ధకాలమంతటా జాతీయవాదుల అణచివేత కొనసాగింది. టెర్రరిస్టుల్ని, విప్లవకారుల్ని ప్రభుత్వం వెంటాడి వేటాడింది. అనేక మందిని ఉరితీసింది. దీర్ఘకారాగార శిక్షలు విధించింది. అబుల్ కలాం అజాద్ వంటి ఇతర జాతీయ నాయకుల్ని సైతం జైళ్ళలో నిర్బంధించింది. అధికార సంస్కరణలతో సంతృప్తిపడని జాతీయవాదుల్ని అణచివేయటానికి ప్రభుత్వం విస్తృతాధికారాలు చేతుల్లో పెట్టుకోవాలని నిర్ణయించుకొంది. సమ న్యాయపాలన (Rule of Law) కు విరుద్ధమైన విపరీతాధికారాలు చేతుల్లో పెట్టుకోవాలని నిర్ణయించుకొంది. కేంద్ర శాసనసభలోని ప్రతి ఒక్క భారతీయ సభ్యుడూ తీవ్రంగా ప్రతిఘటించినా ప్రభుత్వం 1919 మార్చిలో రౌలట్ శాసనాన్ని తెచ్చింది. మహమ్మదాలీ జిన్నా, మదనమోహన మాలవ్యా, మజర్-ఉల్-హక్‌లు తమ శాసన సభ్యత్వానికి రాజీనామాలిచ్చారు. ఈ చట్టం ద్వారా ఏ వ్యక్తినైనా విచారణ లేకుండా, కోర్టు తీర్పు చెప్పకుండా నిర్బంధించే హక్కు ప్రభుత్వానికి సంక్రమించింది. బ్రిటన్‌లో పౌర స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు పునాది అయిన హెబియస్ కార్పస్ హక్కును నిలుపుదల చెయ్యటానికి ఈ చట్టం ద్వారా ప్రభుత్వానికి అవకాశం కల్గింది.

***మహాత్మాగాంధీ నాయకత్వం:*** హఠాత్తుగా మీదపడ్డ దెబ్బలా రౌలట్ చట్టం వచ్చింది. యుద్ధకాలంలో ప్రభుత్వం విస్తృత ప్రజాస్వామ్యాన్ని ప్రసాదిస్తానన్న వాగ్దానాలు విన్న భారత ప్రజానీకానికి ఈ చర్య క్రూర పరిహాసంగా తోచింది. ఆకలితో నకనకలాడే మనిషికి గులకరాళ్ళు వడ్డించినట్లుగా ఉంది. ప్రజాస్వామ్య ప్రగతికి బదులు ఉన్న కొద్ది పౌరహక్కుల్ని సైతం ఊడ్చివేయటానికి వచిందీ చట్టం. ప్రజలకు అవమానం జరిగింది. దాంతో కోపోద్రిక్తులయిపోయారు. దేశంలో అసంతృప్తి వ్యాపించింది. రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా బ్రహ్మాండమైన ఆందోళన చెలరేగింది. ఈ ఆందోళనా సమయంలో కొత్త నాయకుడు మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ జాతీయోద్యమ నాయకత్వాన్ని స్వీకరించాడు. భారత జాతీయోద్యమ తృతీయ, నిర్ణాయక ఘట్టం ప్రారంభమైంది.

***గాంధీజీ – ఆయన భావాలు:*** మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ గుజరాత్‌లోని పోర్ బందర్‌లో 1869 అక్టోబరు 2న జన్మించాడు. బ్రిటన్‌లో న్యాయశాస్త్ర విద్య ముగించుకొని, వకీలువృత్తి సాగించటానికి దక్షిణాఫ్రికా తరలివెళ్ళాడు. ఉన్నత న్యాయాదర్శాలు కలిగిన వ్యక్తి కాబట్టి దక్షిణాఫ్రికా వలసల్లో భారతీయులు అనుభవించే అన్యాయాలు, జాతివివక్ష, హీనస్థితి చూసి చలించి తిరుగబడ్డాడు. దక్షిణాఫ్రికాకు వలసవెళ్ళిన భారతీయ కార్మికులకు, వారి వెనుక వెళ్ళిన భారతీయ వ్యాపారస్థులకు ఓటు హక్కులేదు. ప్రత్యేకంగా నిర్దేశించిన స్థలాల్లో తప్ప వారు నివసించే హక్కులేదు. అనారోగ్యపూరితమైన ఇరుకు ప్రాంతాలు వాళ్ళకు కేటాయించబడ్డాయి. కొన్ని దక్షిణాఫ్రికా వలసల్లో ఆసియన్లు, ఆఫ్రికన్లు రాత్రి తొమ్మిది గంటల తర్వాత బైటికి కదలటానికి వీలులేదు. ప్రజలంతా నడిచివెళ్ళే కాలిబాటలమీద వాళ్ళు నడవటానికి చట్టం ఒప్పుకోదు. ఈ దారుణ పరిస్థితులకు వ్యతిరేకంగా గాంధీజీ ఒక ఉద్యమాన్ని నిర్మించాడు. 1893-94 సంవత్సరాల మధ్య గాంధీజీ దక్షిణాఫ్రికా జాత్యహంకార అధికార మదాంధులకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడారు. అది అధికార బలానికి

పరితూగగల సమపుజ్జీ పోరాటం కాకపోవచ్చు కాని తెగించి పోరాడారు దాదాపు రెండు దశాబ్దాలపాటు సాగిన ఆ సుదీర్ఘ పోరాటంలో ఆయన సత్యాహింసలు ప్రాతిపదికగా సత్యాగ్రహ నూతన పోరాటపద్ధతిని అభివృద్ధి చేశారు సత్య, శాంతిపరుడైనవాడు ఆదర్శ సత్యాగ్రహి అయితే అతడు తనకు తప్పుగా తోచిన దానికి తలవొగ్గ నిరాకరిస్తాడు తప్పుచేసే వ్యక్తికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో అతడు సంతోషంగా కష్టాలు సహిస్తాడు సత్యమంటే తనకుగల ప్రేమలో ఈ పోరాటం ఒక భాగం చెడును ప్రతిఘటిస్తూనే అతడు చెడుచేసేవాణ్ణి ప్రేమిస్తాడు నిజమైన సత్యాగ్రహికి ద్వేషం అతని నైజ విరుద్ధం అతడు నిర్భయుడు కష్టాలెన్నయినా కలగనీ చెడుముందు అతడు తలవంచడు గాంధీజీ దృష్టిలో అహింస బలహీనుల, భీరువుల ఆయుధం కాదు ధైర్యవంతులు, శక్తివంతులు మాత్రమే దాన్ని ఆచరించగలరు పిరికితనంకంటే హింసయినా మేలు ఆయన 'యంగ్ ఇండియా' అనే తన వారపత్రికలో 1920లో అహింస గురించి ఒక అద్భుత వ్యాసం రాశారు "హింస మృగానికి ధర్మమైనట్లుగానే, అహింస మనకు ధర్మం కాని పిరికితనం, బలప్రయోగాల మధ్య ఒకదాన్ని కోరుకోవలసివస్తే, నేను బలప్రయోగానికే అనుకూలం భారతదేశం తన అవమానాన్ని పిరికితనంతో నిస్సహాయంగా చూస్తూ కూర్చోటంకన్నా, తన గౌరవరక్షణకు ఆయుధం పట్టటం మేలంటాను" అని ఆ వ్యాసంలో రాశారు అట్లాగే ఆయన తన అఖిల జీవనతత్వాన్ని ఇలా కుదించి చెప్పారు: "నేను కోరుకోగోరే ఏకైక ధర్మం సత్యాహింసలు; మానవాతీత శక్తులు నేను కోరను నాకు మరేమీ అక్కరలేదు"

ఆయన సిద్ధాంతాన్ని ఆచరణ నుంచి, విశ్వాసాన్ని కార్యాచరణ నుంచి వేరుచెయ్యడు అది గాంధీజీ దృక్పథంలోని మరొక ముఖ్యలక్షణం ఆయన సత్యాహింసలు దైనందిన జీవనానికుద్దేశించినవే గాని, గంభీరోపన్యాసాలకు, రచనలకు ఉద్దేసించినవి కాదు

గాంధీజీ 1915లో తన 46వ యేట భారతదేశం తిరిగివచ్చారు తన దేశానికి, ప్రజలకు సేవచేయాలని తహతహలాడారు తన కార్యక్షేత్రాన్ని నిర్ణయించుకోబోయే ముందు భారతదేశ పరిస్థితుల్ని మొట్టమొదట అధ్యయనం చెయ్యాలని నిర్ణయించుకున్నారు 1916లో అహ్మదాబాద్‌లో సబర్మతీ ఆశ్రమాన్ని నెలకొల్పారు. తన స్నేహితులు, అనుయాయులు అక్కడ సత్యాహింసలను నేర్చుకుని ఆచరించాలి.

***చంపారన్ సత్యాగ్రహం (1917):*** గాంధీజీ ప్రప్రథమంగా తన మహత్తర సత్యాగ్రహ ఆయుధాన్ని 1917 లో బీహార్‌లో చంపారన్ జిల్లాలో ప్రయోగించారు ఆ జిల్లాలో నీలిమందు తోటల్లో పనిచేసే రైతాంగం యూరోపియన్ తోటల యజమానుల తీవ్ర హింసా, పీడనలకు గురవుతూంది రైతులు తమ భూమిలో 15 శాతం మేరకి నీలిమందు పండించాలని తోటల యజమానులు నిర్బంధించారు పండించిన నీలిమందును వాళ్ళు నిర్ణయించిన ధరకే అమ్మాలని బలవంతపెట్టారు. పూర్వం బెంగాల్‌లో కూడా ఇవే పరిస్థితులుండేవి 1859-61 సంవత్సరాల మధ్య సాగిన మహోధృత తిరుగుబాటు ఫలితంగా, బెంగాల్ రైతాంగం నీలిమందు తోటల యజమానుల పీడననుంచి విముక్తి పొందారు.

దక్షిణాఫ్రికాలో గాంధీజీ సత్యాగ్రహోద్యమాన్ని గురించి విన్న చంపారన్ రైతులనేకమంది ఆయనను అక్కడికి వచ్చి తమకు తోడ్పడమని అర్థించారు. బాబూ

రాజేంద్ర ప్రసాద్, మజర్-ఉల్-హక్, కృపలానీ, మహదేవ్ దేశాయిలతో కలిసి గాంధీజీ 1917 లో చంపారన్ చేరుకుని రైతాంగ స్థితిగతుల్ని గురించి సంపూర్ణ సర్వేక్షణ జరిపాడు. ఆయన రాకకి ఆగ్రహించిన జిల్లా అధికార్లు గాంధీజీని చంపారన్ నుంచి తక్షణం వెళ్ళిపోవాలని ఆదేశించారు. ఆయన ఆ ఉత్తర్వుల్ని ధిక్కరించి విచారణని, కారాగార శిక్షని ఎదుర్కోడానికి సిద్ధపడ్డాడు. దాంతో అధికార్లు తమ ఉత్తర్వుని రద్దుచేసుకుని ఒక విచారణ సంఘాన్ని నియమించారు. గాంధీజీ ఆ సంఘంలో ఒక సభ్యుడు. అంతిమంగా రైతులు తమ బాధలనుంచి బైటపడ్డారు. గాంధీజీ భారతదేశంలో తన సత్యాగ్రహ సమరంలో తొలి విజయం సాధించాడు. భారత రైతాంగం అనుభవించే నగ్న దారిద్ర్యాన్ని ఆయన కళ్ళారాచూసే అవకాశం కూడా కలిగింది.

***అహ్మదాబాద్ మిల్లుల సమ్మె:*** 1918లో మిల్లు కార్మికులకు, యజమానులకు మధ్య ఉత్పన్నమైన ఒక వివాదంలో గాంధీజీ జోక్యం కల్పించుకున్నాడు. ఉభయవర్గాల మధ్య రాజీకోసం ఆయన ఆమరణ నిరాహారదీక్ష పూనాడు. మిల్లు యజమానులు దీక్ష నాల్గవరోజున మనస్సు మార్చుకొని, కార్మికుల వేతనాలలో 35 శాతం పెంచటానికి అంగీకరించారు.

పంటలు పోయిన ఏడాదికూడా పన్నులు కట్టితీరాలనే ప్రభుత్వ నిర్బంధ విధానానికి వ్యతిరేకంగా గుజరాత్‌లోని ఖైరా రైతాంగం సాగించిన పోరాటానికి గాంధీజీ మద్దతు ప్రకటించాడు. సర్దార్ వల్లభాయ్ పటేలు తన న్యాయవాద వృత్తిని మానుకొని, గాంధీజీకి తోడ్పడ్డానికి రంగంలోకి దూకాడు.

ఈ అనుభవాలు గాంధీజీని ప్రజలకు సన్నిహితుణ్ణి చేశాయి. ఆయన తన జీవితమంతా సామాన్య ప్రజానీకం ప్రయోజనాల కోసమే ధారపోశాడు. వాస్తవానికి సామాన్య ప్రజల జీవితంలో తన జీవితాన్ని, జీవన సరళిని మమేకం చేసిన మొట్టమొదటి భారత జాతీయ నాయకుడు గాంధీజీ. అనతి కాలంలోనే ఆయన దరిద్ర భారతదేశానికి, జాతీయస్ఫూర్తివంతమైన భారతదేశానికి, ఎదురు తిరిగే భారతదేశానికి ప్రతీక అయ్యాడు. మరో మూడు అంశాలు గాంధీజీకి అత్యంత ప్రియమైనవి. మొదటిది: హిందూ - ముస్లిం ఐక్యత. రెండవది: అస్పృశ్యతా వ్యతిరేక పోరాటం. మూడవది: భారత మహిళల సామాజిక హోదా పెంపుదల.

ఆయన నిష్ఠాపరుడైన హిందువు అయినా ఆయన సాంస్కృతిక, మత దృక్పథం విశ్వజనీనమైందేగాని, సంకుచితమైంది కాదు. "భారతీయ సంస్కృతి హైందవమూకాదు, ఇస్లామికమూ కాదు, ఇంకేదీ కాదు, అది అన్నిటి సమ్మేళనం" అని ఆయన రాశాడు. భారతీయులు స్వీయ సంస్కృతిలో లోతుగా వేళ్ళూనాలని ఆయన వాంఛించినా, ఇతర ప్రపంచ సంస్కృతులలోని ఉదాత్త విషయాలను కూడా తమలో జీర్ణించుకోవాలని ఆయన కోరాడు. ఈ సందర్భంలో ఆయనిలా అన్నాడు:

"సకల దేశాల సంస్కృతీ వాయువులు నా ఇంట స్వేచ్ఛగా వీచాలనే నా కోరిక. అంతేగాని అవి నన్ను పెకలించి తీసుకుపోవటానికి నేను వ్యతిరేకిని. ఇతరుల ఇండ్లలో చొరబాటుదారుగా, బిచ్చగాడుగా, బానిసగా బ్రతకటానికి నేను నిరాకరిస్తాను".

***రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా సత్యాగ్రహం:*** మిగతా ఇతర జాతీయవాదుల మాదిరిగానే గాంధీజీ కూడా రౌలట్ చట్టాన్ని వ్యతిరేకించాడు. 1919 ఫిబ్రవరిలో ఆయన సత్యాగ్రహ సభను స్థాపించాడు. ఆ సభ సభ్యులందరూ రౌలట్ చట్టాన్ని

ధిక్కరించటానికి, తత్ఫలితంగా కలిగే శిక్షలను అనుభవించటానికి ప్రతిజ్ఞ తీసుకున్నారు దీంతో ఒక నూతన పోరాట పద్ధతి మొదలయింది ఇప్పటిదాకా జాతీయోద్యమం అతివాదులకింద ఉండనీ, మితవాదులకింద ఉండనీ, తన పోరాటాన్ని ఆందోళన మేరకి పరిమితం చేసింది పెద్ద పెద్ద సభలు, ప్రదర్శనలు, ప్రభుత్వంతో సహాయ నిరాకరణం, విదేశ వస్త్ర, విద్యాలయ బహిష్కరణ, లేదా వ్యక్తిగత టెర్రరిస్టు చర్యలు మాత్రమే అప్పటిదాకా జాతీయవాదులకు తెలిసిన రాజకీయ కార్యాచరణ రూపాలు సత్యాగ్రహం వెంటనే ఉద్యమాన్ని ఒక నూతన ఉన్నత స్థాయికి కొంపోయింది. జాతీయవాదులు తమ అసంతృప్తిని, ఆగ్రహాన్ని వాచ్యంగా వ్యక్తం చేయటానికి బదులు ఇప్పుడు ప్రత్యక్ష కార్యాచరణకు ఉద్యమించవచ్చు. జాతీయ కాంగ్రెస్ ఇప్పుడు రాజకీయ కార్యాచరణ సంస్థగా రూపొందనుంది.

అంతేకాకుండా కాంగ్రెస్ సంస్థ ఇప్పుడు పేద ప్రజానీకం రాజకీయ మద్దతుపైన విశేషంగా ఆధారపడబోతున్నది గాంధీజీ జాతీయవాద కార్యకర్తల్ని పల్లెలకు తరలిపొండని పిలుపిచ్చారు అక్కడే భారతదేశం జీవిస్తోందని అన్నాడాయన. జాతీయ ఉద్యమాన్ని ఆయన సామాన్యునివేపు తిప్పారు ఈ పరివర్తన సంకేతం ఖాదీ లేదా చేనేతబట్ట అదే అనతికాలంలో జాతీయవాదుల యూనిఫారం అయింది. శ్రమలోని గౌరవాన్ని, స్వావలంబన విలువని ఎత్తి చూపడానికి ఆయన ప్రతిరోజూ నూలు వడికారు ప్రజా సామాన్యం నిద్రమేల్కొని రాజకీయాల్లోకి చురుగ్గా ప్రవేశించినప్పుడే భారతదేశం విముక్తి సాధించగలదని ఆయన ఉద్బోధించారు ప్రజలు గాంధీజీ పిలుపుకు బ్రహ్మాండంగా ప్రతిస్పందించారు

1919 మార్చి, ఏప్రిల్ మాసాల్లో భారతదేశంలో ఒక అపూర్వ రాజకీయ జాగృతి కానవచ్చింది హర్తాళ్ళు, సమ్మెలు, ప్రదర్శనలు ఉధృతంగా సాగాయి. హిందూ-ముస్లిం ఐక్యతా నినాదం దేశమంతటా మార్మోగింది యావత్తు దేశం వేడుందుకుంది. భారత ప్రజలు విదేశ దౌర్భగ్యపాలనని ఇకపై సహించేది లేదనే నిశ్చయానికి వచ్చారు.

***జలియన్ వాలాబాగ్ ఊచకోత:*** ప్రజాందోళనని అణచి వెయ్యటానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. బొంబాయి, అహ్మదాబాద్, కలకత్తా, ఢిల్లీ, ఇంకా ఇతర నగరాల్లో నిరాయుధులైన ప్రదర్శకులపైన పోలీసులు పదే పదే లాఠీలు ప్రయోగించారు, కాల్పులు జరిపారు. గాంధీజీ 1919 ఏప్రిల్ 6న బ్రహ్మాండమైన హర్తాళ్‌కు పిలుపిచ్చారు. ఆ పిలుపుకి ప్రజలు అపూర్వ ఉత్సాహంతో కదలి వచ్చారు. ప్రభుత్వం ఈ ప్రజా ప్రతిఘటనని ముఖ్యంగా పంజాబులో బలప్రయోగంతో అణచివెయ్యటానికి నిర్ణయం తీసుకొంది. ఈ సమయంలోనే ఆధునిక చరిత్రలో కనీ వినీ ఎరుగని ఒక ఘోర రాజకీయ దురంతం జరిగిపోయింది. అదే జలియన్ వాలాబాగ్ ఘోరకలి. ప్రజలకు ప్రియతమ నాయకులైన డా సైఫుద్దీన్ కిచ్లూ, డా. సత్యపాల్‌ల అరెస్టుకు నిరసనగా అమృత్‌సర్ జలియన్ వాలాబాగ్‌లో 1919 ఏప్రిల్ 13న నిరాయుధులైన ఒక బ్రహ్మాండ జనసందోహం గుమిగూడింది. అమృత్‌సర్ మిలిటరీ కమాండరు జనరల్ డయ్యర్ ప్రజల్ని భయభ్రాంతుల్ని చేసి లొంగదియ్యాలని నిర్ణయించుకున్నాడు. జలియన్ వాలాబాగ్ ఒక విశాల బహిరంగస్థలం. మూడువైపులా ఎత్తయిన భవనాలు. ఒకవైపు మాత్రమే బైటికి పోవటానికి దారి ఉంది. జనరల్ డయ్యర్ తన సైనిక దళాలతో ఆ మైదానాన్ని చుట్టుముట్టాడు. బైటికిపోయే

దేవని సైనికులతో మూసివేశాడు. మధ్యలో చిక్కుబడ్డ అశేష జనసందోహంపైన రైఫిళ్ళతో, మరతుపాకులతో దాడికి సైన్యాన్ని ఆదేశించాడు. తూటాలు పూర్తయ్యేదాకా సైన్యం కాల్పులు జరిపింది. వేలాది మంది మరణించారు. గాయపడ్డారు. ఊచకోత ముగిసిన వెంటనే పంజాబ్ అంతటా సైనిక శాసనం అమలులో పెట్టాడు. ప్రజానీకం ఒక మహా అనాగరిక హింసా కాండకు గురయింది.

జలియన్ వాలాబాగ్ ఘోరకలి గురించిన సమాచారం ప్రసారంకావటంతో దేశం యావత్తు భయాక్రాంతమైపోయింది. సామ్రాజ్యవాదం, విదేశపాలనలు దబ్బావాయించిన నాగరికత ముసుగు వెనక దాగిన వికృతత్వం, పాశవికతలు, మెరుపు మెరిసినట్లుగా ప్రజల కళ్ళకుకట్టాయి. మానవతావాది, మహాకవి రవీంద్రనాథ టాగోర్ బ్రిటిషు ప్రభుత్వం తనకు ప్రసాదించిన నైట్ హుడ్ (యోధ బిరుదం) జలియన్ వాలాబాగ్ ఘోరకలికి నిరసనగా త్యజించివేస్తూ ఉద్రేకపూరితంగా ప్రసంగించాడు.



1919లో జలియన్‌వాలాబాగ్ హత్యాకాండ తర్వాత పంజాబులో అణచివేతలో భాగంగా ప్రజలను అవమానపరచడం

***ఖిలాఫత్, సహాయనిరాకరణోద్యమాలు (1919–22):*** ఖిలాఫత్ ఉద్యమంతో జాతీయోద్యమంలోకి ఒక కొత్తస్రవంతి వచ్చి కలిసింది. రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా సాగిన జాతీయాందోళన భారతప్రజలందర్నీ సమానంగా స్పృశించింది. హిందూ ముస్లిం ప్రజలుభయుల్ని సంయుక్త రాజకీయ కార్యాచరణలో ఒక్కటిగా బంధించింది. ఉదాహరణకు రాజకీయ కార్యాచరణలో హిందూ - ముస్లిం సమైక్యతని లోకానికి

చాటటానికా అన్నట్లు ఆర్యసామాజికుడైన స్వామి శ్రద్ధానందను ఢిల్లీ జుమ్మామసీదులో ప్రసంగించటానికి ముస్లిములు ఆహ్వానించారు. అలాగే డాక్టర్ సైపుద్దీన్‌కిచ్లూ అమృతసర్‌లో సిక్కుల పవిత్ర స్వర్ణదేవాలయంలో స్వాగతం అందుకున్నారు. ప్రభుత్వ దారుణ దమన నీతివల్లనే అమృత్‌సర్‌లో అటువంటి రాజకీయ ఐక్యత సిద్ధించింది. హిందూ-ముస్లిములిరువుర్నీ కలిపి అరదండాలు తగిలించారు. ఇద్దర్నీ కలిపి నేలమీద పాకించారు. కలిపి మంచినీళ్ళు తాగించారు. సాధారణంగా ఒక హిందువు ముస్లించేతి నీళ్ళు తాగడు. ఈ వాతావరణంలో ముస్లిముల్లో జాతీయవాద ధోరణి ఖిలాఫత్ ఆందోళనా రూపాన్ని ధరించింది. మొదటి ప్రపంచ యుద్ధంలో బ్రిటన్, దాని మిత్రరాజ్యాలు కలిసి టర్కీపైన జరిపిన అవమానాన్ని రాజకీయ చైతన్యవంతులైన ముస్లిములంతా గర్హించారు. టర్కీ సుల్తాను తన పదవి కోల్పోయాడు. ఖలీఫా వ్యవస్థ ముగిసిపోయింది. బ్రిటిషువాళ్ళు టర్కీ సామ్రాజ్యాన్ని ముక్కలు ముక్కలు చేసి, టర్కీ భూభాగంనుంచి థ్రేస్‌ని కాజేశారు. బ్రిటిషు ప్రధాని లాయడ్ జార్జి లోగడ ఇచ్చిన హామీకి ఇది పూర్తిగా విరుద్ధం. ముస్లిం ప్రపంచం ఖలీఫాగా (మతపెద్ద) భావించే టర్కీ సుల్తాను ప్రతిష్ఠను బ్రిటన్ ఆ విధంగా కించపరచటం ముస్లిములకు బాధ కలిగించింది. దానికి నిరసనగా భారతదేశంలో అలీసోదరులు, మౌలానా ఆజాద్, హాకిం, అజ్మల్‌ఖాన్, హస్రత్ మోహానీల ఆధ్వర్యంలో ఖిలాఫత్ కమిటీ నిర్మాణమైంది. దేశవ్యాప్త ఆందోళన మొదలైంది.

అఖిలభారత ఖిలాఫత్ సమావేశం 1919 నవంబర్‌లో ఢిల్లీలో జరిగింది. తమ కోర్కెలు నెరవేరకపోతే ప్రభుత్వానికి తమ మద్దతును ఉపసంహరించుకోవాలని మహాసభ తీర్మానించింది. జాతీయవాదుల నాయకత్వం కిందికి వచ్చిన ముస్లింలీగు భారత జాతీయ కాంగ్రెసుకు, కాంగ్రెస్ రాజకీయాందోళనా కార్యక్రమాలకు పూర్తి సహకారం ఇచ్చింది. లోకమాన్య తిలక్, గాంధీజీలతో సహా కాంగ్రెస్ నాయకులు తమవంతు కర్తవ్యంగా హిందూ ముస్లిం ఐక్యతను దృఢపర్చటానికి, ముస్లిం ప్రజాసామాన్యాన్ని జాతీయోద్యమంలోకి లాగటానికి ఖిలాఫత్ ఉద్యమాన్ని సువర్ణావకాశంగా భావించారు. వివిధానేక తరగతుల ప్రజలు- హిందువులు, ముస్లిములు, సిక్కులు, క్రైస్తవులు, పెట్టుబడిదార్లు, కార్మికులు, రైతాంగం, చేతివృత్తివాళ్ళు, మహిళలు, యువకులు, ఆదివాసులు, వివిధ ప్రాంతీయులు సమస్త భారత ప్రజానీకం విదేశపాలన తమందరికి వ్యతిరేకమైందనే గుర్తింపుతో, తమ విభిన్న ప్రయోజనాల సాధనకై పోరాటానుభవం ద్వారా జాతీయోద్యమంలోకి వచ్చి చేరుతుందని జాతీయ నాయకులు గ్రహించారు. గాంధీజీ ఖిలాఫత్ ఆందోళనని "నూరేళ్ళకైనా కలగని హిందూ-ముస్లిం ఐక్యతావకాశం"గా భావించాడు. టర్కీతో బ్రిటిషు శాంతి షరతులు భారతీయ ముస్లిములను సంతృప్తిపరచక పోయినట్లయితే తాను సహాయ నిరాకరణోద్యమాన్ని నడుపనున్నట్లు గాంధీజీ ప్రకటించాడు. వాస్తవానికి గాంధీజీ ఆ వెంటనే ఖిలాఫత్ ఉద్యమనాయకుల్లో ఒకడయ్యాడు.

ఇదిలా ఉండగా ప్రభుత్వం రౌలట్ చట్టాన్ని రద్దుచెయ్యటానికిగాని, పంజాబులో జరిగిన దురంతాలమీద చర్యలు తీసుకోడానికిగాని, జాతీయవాదుల స్వరాజ్య వాంఛని సంతృప్తిపర్చటానికిగాని నిరాకరించింది. 1920 జూన్‌లో అలహాబాదులో జరిగిన అఖిలపక్ష సమావేశం పాఠశాలల్ని, కళాశాలల్ని,

న్యాయస్థానాల్ని బహిష్కరించే కార్యక్రమాన్ని ఆమోదించింది. ఖిలాఫత్ 1920 ఆగస్టు 31న సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించింది ఆ ఉద్యమంలో పాల్గొన్న మొట్టమొదటి నాయకుడు గాంధీజీ ఆయన గతంలో చేసిన యుద్ధసేవలకుగాను లభించిన కైజర్-ఇ-హింద్ పతకాన్ని తిరిగి ఇచ్చివేశాడు.

కాంగ్రెస్ ప్రత్యేక సమావేశం 1920 సెప్టెంబరులో కలకత్తాలో జరిగింది అప్పటికి కొద్దివారాల క్రితమే లోకమాన్య బాలగంగాధర తిలక్ తన 64వ యేట అస్తమించాడు. కాంగ్రెస్ సంస్థకు ఆయన మరణం గొప్ప దెబ్బ. వెంటనే ఆయన స్థానాన్ని గాంధీజీ, చిత్తరంజన్‌దాస్, మోతీలాల్ నెహ్రూలు భర్తీచేశారు పంజాబ్, ఖిలాఫత్ ఉద్యమాలకు సంబంధించి జరిగిన తప్పుల్ని ప్రభుత్వం సరిదిద్దేదాకా గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని కాంగ్రెస్ బలపర్చింది. ప్రభుత్వాన్ని, ప్రభుత్వ చట్టాల్ని అతి శాంతియుత పద్ధతుల్లో ధిక్కరించాలని తీసుకున్న నిర్ణయాన్ని నాగపూర్ కాంగ్రెస్ సమావేశం 1920 డిశంబరులో ఆమోదించింది "బ్రిటిషు ప్రజలు న్యాయం చేకూర్చకూడదని వాంఛిస్తే, బ్రిటిషు సామ్రాజ్యాన్ని ధ్వంసం చెయ్యటం ప్రతి ఒక్క భారతీయుని విద్యుక్త ధర్మం అని వాళ్ళు గుర్తుంచుకోవాలి జాగ్రత్త " అని గాంధీజీ నాగపూర్ కాంగ్రెస్ సమావేశంలో తీవ్రంగా హెచ్చరించాడు. నాగపూర్ సమావేశం కాంగ్రెస్ రాజ్యాంగంలో కొన్ని మార్పుల్ని చేసింది భాషాధారక ప్రాంతాల ప్రాతిపదికపైన రాష్ట్ర కాంగ్రెస్ సంఘాలు పునర్వ్యవస్థీకరింపబడ్డాయి అధ్యక్ష, కార్యదర్శులతో సహా 15గురు సభ్యులతో కూడిన కార్య నిర్వాహక వర్గం కాంగ్రెస్ సంస్థకు సారథ్యం వహిస్తుంది కాంగ్రెస్ నిరంతరాయంగా నడిచే ఒక రాజకీయ సంస్థగా అభివృద్ధి కావటానికి, కాంగ్రెస్ తీర్మానాలను అమలుపరచే పార్టీ యంత్రాంగాన్ని నిర్మించటానికి ఈ మార్పులు తోడ్పడ్డాయి. 21 సంవత్సరాలుగల స్త్రీ, పురుషులందరూ నాలుగణాల వార్షిక సభ్యత్వ రుసుము చెల్లించి కాంగ్రెస్ సంస్థలో సభ్యులుగా చేరే అవకాశం కలిగింది 1921లో వయోపరిమితి 18 సంవత్సరాలకు తగ్గించబడింది

ఇప్పుడు కాంగ్రెస్ స్వభావమే మారిపోయింది. విదేశ పాలననుండి విముక్తికోసం జాతీయ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనే ప్రజాబాహుళ్యానికి కాంగ్రెస్ నాయకత్వ పాత్ర స్వీకరించింది ఒక సార్వజనీన సమధికోత్సాహానుభూతి వెల్లివిరిసింది. స్వాతంత్ర్యం ఇంకా చాలా ఏళ్ళు గడిచాక రావచ్చు. కాని ప్రజలు తమ బానిస మనస్తత్వాన్ని విదిలించివేశారు. భారతదేశం పీల్చే గాలే మారిపోయిందా అనిపించింది. ఆనాటి ఆ ఉల్లాసం, ఉత్సాహమే వేరు ఎంచేతనంటే నిద్రించే ఒక మహాశక్తి మేల్కొంటోంది హిందువులు, ముస్లిములు భుజం భుజం కలిపి ముందుకు సాగుతున్నారు. అదే సమయంలో పాత నాయకులు కొందరు సంస్థ నుంచి తప్పుకున్నారు. జాతీయోద్యమం తీసుకున్న కొత్త మలుపు వాళ్ళకు మింగుడు పడలేదు. వాళ్ళకింకా పాత అందోళనా పద్ధతుల మీద, చట్టం నాలుగు గోడలమధ్య ఒదిగిపోయిన రాజకీయ కార్యక్రమం మీద మమకారం పోలేదు. ప్రజాబాహుళ్యం చొరవ, హర్తాళ్ళు, సత్యాగ్రహాలు, శాసనోల్లంఘనం, కోరి కారాగారాలకు వెళ్ళటం, ఇంకా తదితర సమరశీల పోరాట పద్ధతులు వగైరాల్ని వాళ్ళు వ్యతిరేకించారు. మహమ్మదాలీ జిన్నా, జి.యస్ కపర్దే, బిపిన్ చంద్రపాల్, అనిబిసెంట్ ప్రభృతులు ఆ సమయంలో కాంగ్రెస్ నుంచి తప్పుకున్న ప్రముఖులు.

1921, 1922 సంవత్సరాల్లో భారత ప్రజలు ఒక అపూర్వ ఉద్యమం నిర్వహించారు. వేలాది విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాలు బహిష్కరించి జాతీయ పాఠశాలలు, కళాశాలల్లో చేరారు. అలీఘడ్ జామియా మిలాయా ఇస్లామియా (జాతీయ ముస్లిం విశ్వవిద్యాలయం), బీహార్ విద్యాపీఠ్, కాశీ విద్యాపీఠ్, గుజరాత్ విద్యాపీఠ్‌లు అవతరించిన కాలం కూడా ఇదే. జామియా మిలాయా ఇస్లామియా తరువాత ఢిల్లీకి మారింది. ఆచార్య నరేంద్రదేవ్, డాక్టర్ జకీర్ హుస్సేన్, లాలాలజపతిరాయ్ ప్రభృతులు ఈ జాతీయ విద్యా పీఠాలలో పనిచేసిన ప్రముఖుల్లో కొందరు. దేశబంధు చిత్తరంజనదాస్, మోతీలాల్ నెహ్రూ, బాబు రాజేంద్ర ప్రసాద్‌లతో సహా వేలాది న్యాయవాదులు తమ న్యాయవాద వృత్తిని త్యజించారు. సహాయ నిరాకరణోద్యమానికి ఆర్థిక సహాయం చెయ్యటానికి తిలక్ స్వరాజ్యనిధి ప్రారంభమైంది. ఆరునెలలు తిరిగేలోగా కోటి రూపాయలకు పైగా నిధి వసూలైంది. మహిళలు బ్రహ్మాండమైన ఉత్సాహంతో ముందుకు వచ్చి తమ ఆభరణాలను సమర్పించారు. దేశమంతటా విదేశ వస్త్ర దహనకాండ ముమ్మరంగా జరిగింది. ఖాదీ స్వాతంత్ర్య సంకేతమైంది. ముస్లిం మతస్థుడెవ్వడూ బ్రిటిషు ఇండియా సైన్యంలో పనిచేయకూడదని అఖిల భారత ఖిలాఫత్ కమిటీ 1921 జూలైలో ఒక తీర్మానాన్ని ఆమోదించింది. అదే సంవత్సరం సెప్టెంబరులో ప్రభుత్వం అలీ సోదరుల్ని "రాజద్రోహ" నేరం మీద అరెస్టు చేసింది. తక్షణం గాంధీజీ అదే తీర్మానాన్ని వందలాది మీటింగుల్లో పదేపదే చేయించారు. భారతదేశాన్ని సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అధోగతి పాల్జేసిన బ్రిటిషు ప్రభుత్వంలో భారతీయుడెవ్వడూ పనిచెయ్యరాదని అఖిలభారత కాంగ్రెస్ కమిటీలోని 50 మంది సభ్యులు ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కూడా ఆ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది.

ఉద్యమాన్ని ఇంకా ఉన్నతస్థాయికి తీసుకుపోవాలని కాంగ్రెస్ నిర్ణయించింది. సత్యాగ్రహాలు, శాసనధిక్కారం, పన్నుల నిరాకరణ వగైరా ఆందోళనలకు ప్రజలు సంసిద్ధంగా ఉన్న పక్షంలో రాష్ట్ర కాంగ్రెస్ సంఘాలు వాటిని వెంటనే ప్రారంభించటానికి అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అనుమతించింది.

ప్రభుత్వం తిరిగి అణచివేతకు పూనుకుంది. క్రిందిస్థాయిలలో హిందూ ముస్లిం రాజకీయ కార్యకర్తల్ని సమైక్యపరిచే విధంగా కాంగ్రెస్, ఖిలాఫత్ వలంటీర్లు కలిసి చేసే కవాతును ప్రభుత్వం చట్ట వ్యతిరేకంగా ప్రకటించింది. 1921వ సంవత్సరాంతానికి ఒక్క గాంధీజీ మినహా ముఖ్య జాతీయ నాయకులంతా కటకటాల వెనక నిర్బంధంలో ఉన్నారు. వాళ్ళతోపాటు మరో మూడువేల మందిని కూడా ప్రభుత్వం జైళ్ళలో కుక్కింది. 1921 నవంబరులో బ్రిటిష్ సింహాసనానికి వారసుడైన వేల్సు రాకుమారుడు భారత సందర్శనానికి విచ్చేసిన సందర్భంలో బ్రహ్మాండమైన నిరసన ప్రదర్శనలు జరిగాయి. బొంబాయిలో ప్రభుత్వం ప్రజా ప్రదర్శనను అణచివేయటానికి ప్రయత్నించిన సందర్భంలో యాభై ముగ్గురు ప్రదర్శకులు కాల్పులకు బలయ్యారు. 400 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. 1921 డిశంబర్‌లో అహ్మదాబాదులో జరిగిన కాంగ్రెస్ వార్షిక సమావేశంలో "పంజాబ్, ఖిలాఫత్‌లకు సంబంధించిన తప్పిదాలు సరిదిద్దబడేవరకు, స్వరాజ్యం సిద్ధించే వరకు ఇప్పటికన్నా

ఇతోధికశక్తితో అహింసాయుత సహాయ నిరాకరణ కార్యక్రమాన్ని కొనసాగించాలనే కాంగ్రెస్ దృఢదీక్ష"ని ప్రకటిస్తూ ఒక తీర్మానం ఆమోదించబడింది. ఆ తీర్మానం భారత ప్రజలందరికి, ముఖ్యంగా విద్యార్థిలోకానికి "సత్యాగ్రహ శిబిరాల్లో చేరి ప్రశాంతంగా, ఆవేశకావేషాలకు తావివ్వకుండా అరెస్టు కావటానికి ముందుకు రమ్మని" పిలుపిచ్చింది. సత్యాగ్రహులు "వాచా, కర్మా అహింసాయుతంగా ఉంటామని" ప్రమాణం చెయ్యాలి. హిందూ, ముస్లిం, సిక్కు, పార్సీ, క్రైస్తవ, యూదు ప్రజల మధ్య ఐక్యత పెంపొందిస్తామని, ఖద్దరు మాత్రమే ధరిస్తామని సత్యాగ్రహులు ప్రమాణం చెయ్యాలి. అస్పృశ్యతకు వ్యతిరేకంగా పోరాడుతానని ప్రతిహిందూ స్వచ్ఛంద సేవకుడు ప్రతిజ్ఞ తీసుకోవాలి. ప్రజలంతా సాధ్యాసాధ్యాలను బట్టి అహింసాయుత పద్ధతుల్లో వ్యష్టి, సమష్టి సత్యాగ్రహాలు చెయ్యవలసిందిగా కాంగ్రెస్ తీర్మానం కోరింది.

మున్ముందు పోరాటానికి పిలుపుకోసం ప్రజలు అసహనంతో నిరీక్షించారు. ఉద్యమం ప్రజల్లో గాఢంగా అల్లుకు పోయింది. యు.పి., బెంగాల్‌లలో రైతులు సహాయ నిరాకరణ పిలుపుకు ప్రతిస్పందించారు. పంజాబ్‌లో సిక్కులు తమ పవిత్ర గురుద్వారాలనుండి అవినీతిపరులైన మహంతులను తొలగించటానికి అకాలీ ఉద్యమాన్ని ప్రారంభించారు. మలబార్‌లో మోప్లాలు (ముస్లిం రైతులు) ఒక పటుతర మైన జమీందారీ వ్యతిరేక పోరాటాన్ని ప్రారంభించారు. పట్టణాల్లో క్రిందివర్గాల ప్రజల్ని, అస్సాం, యు.పి., ఒరిస్సా, బెంగాల్ రాష్ట్రాల్లో రైతాంగాన్ని సహాయ నిరాకరణోద్యమం గాఢంగా ప్రభావితం చేసిందని భారత వైస్రాయి 1919 ఫిబ్రవరిలో భారత రాజ్యకార్యదర్శికి రాసిన ఒక లేఖలో స్వయంగా అంగీకరించాడు. ఏడురోజులలోగా రాజకీయ ఖైదీలందర్నీ విడుదల చేయని పక్షంలో, పత్రికా స్వాతంత్ర్యం మీద ప్రభుత్వ నిర్బంధాలు సడలని పక్షంలో తాను బ్రహ్మాండమైన ప్రజా సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించగలనని గాంధీజీ 1922 ఫిబ్రవరి 1న ప్రకటించాడు.

కాని ఈ పోరాటోత్సాహం ఒక సంఘటన కారణంగా ముడుచుకు పోయింది. ఉత్తరప్రదేశ్‌లో గోరఖ్‌పూర్ జిల్లాలో చేరిచేరా అనే గ్రామంలో ఫిబ్రవరి 5న మూడువేల రైతులతో కూడిన ఒక కాంగ్రెస్ ఊరేగింపు మీద పోలీసులు కాల్పులు జరిపారు. జనం రెచ్చిపోయి పోలీసుస్టేషనుని తగలబెట్టి, ఇరవై ఇద్దరు పోలీసు జవాన్ల మృతికి కారకులయ్యారు. ఈ సంఘటనని గాంధీజీ చాలా తీవ్రంగా భావించాడు. అహింసా పద్ధతి ఆచరణని కార్యకర్తలింకా సక్రమంగా అర్థం చేసుకోలేదని ఆయనకి నమ్మకం కలిగింది. అహింసా పద్ధతిని పాటించకపోతే సత్యాగ్రహోద్యమం విజయవంతం కాదని ఆయన నమ్మాడు. హింసాయుత ఉద్యమాన్ని బ్రిటీషువాళ్ళు తేలిగ్గా కాలరాచివెయ్యగలరని కూడా బహుశా ఆయన భావించివుండవచ్చు. ఎంచేతనంటే ప్రభుత్వ దమనకాండని ప్రతిఘటించగల శక్తి స్థామతల్ని ప్రజలింకా సంతరించుకోలేదు. అంచేత ఆయన వెంటనే జాతీయాందోళనా కార్యక్రమాన్ని నిలిపివేశాడు. ఫిబ్రవరి 12న గుజరాత్‌లోని బార్డోలిలో సమావేశమైన కాంగ్రెస్ కార్యనిర్వాహక సంఘం శాసనోల్లంఘన కార్యక్రమాలన్నిటిని నిలిపివేస్తూ ఒక తీర్మానం ఆమోదించింది. చర్ఖా ప్రచారం, జాతీయ పాఠశాలలు, మితాహారం వంటి నిర్మాణాత్మక కార్యక్రమాలకు తమ కాలాన్ని వినియోగించమని కాంగ్రెస్ కార్యకర్తల్ని ఆ తీర్మానం కోరింది.

బార్డోలీ తీర్మానంతో దేశం ప్రాన్పడి పోయింది జాతీయవాదుల్లో కొందరు ఆ తీర్మానాన్ని పొగిడారు, మరికొందరు తెగిడారు. కాంగ్రెస్ యువ నాయకుల్లో ఆనాడు అగ్రగణ్యులైన సుభాష్ చంద్రబోస్ తన స్వీయ చరిత్రలో ఇలా రాశాడు :

"ప్రజల్లో ఉత్సాహం సలసల కాగే సమయంలో తిరోగమించండని నినాదం ఇవ్వటం జాతి విపత్తుకు తీసిపోనటువంటిది. మహాత్ముని ముఖ్య సహచరులైన దేశబంధు చిత్తరంజన్‌దాస్, పండిత మోతీలాల్ నెహ్రూ, లాలా లజపతిరాయ్‌లు జైల్లో ఉండి ఈ తీర్మానం పట్ల ప్రదర్శించిన నిరసన భావాన్ని పంచుకున్నారు అప్పుడు నేను దేశబంధుతో ఉన్నాను మహాత్మాగాంధీ పదే పదే అదుసులో కాలేసే ధోరణిపట్ల ఆయన ఆగ్రహం, విచారం నేను గమనించ గల్గాను "

జవహర్‌లాల్ నెహ్రూ వంటి అనేకమంది ఇతర నాయకులు సైతం తిరోగమన నినాదంతో ఏకీభవించ లేకపోయారు ప్రజలకు, నాయకులకు గాంధీజీ మీదగల విశ్వాసంతో బహిరంగంగా ఆయనని విమర్శించలేక పోయారు బహిరంగంగా ప్రతిఘటించకుండా వాళ్ళు గాంధీజీ నిర్ణయాన్ని ఆమోదించారు మొట్టమొదటి సహాయ నిరాకరణ, సత్యాగ్రహ ఉద్యమం ఆ విధంగా ముగిసిపోయింది

అప్పుడున్న పరిస్థితిని ఆసరాగా తీసుకుని ప్రభుత్వం గట్టిదెబ్బ తియ్యటానికి నిర్ణయించటంతో నాటకంలో చివరి అంకం ప్రారంభమైంది 1922 మార్చి 10న మహాత్మా గాంధీ అరెస్టయ్యాడు కోర్టు విచారణ పూర్తయ్యాక ఆయనకి ఆరు సంవత్సరాల కారాగార శిక్ష పడింది కోర్టులో గాంధీజీ ఇచ్చిన ప్రకటన చరిత్ర సృష్టించింది. ప్రాసిక్యూషన్ వారి అభియోగానికి సమాధానంగా దోషినని ఒప్పుకుంటూ ఆయన "చట్ట ప్రకారం వీలయినంత కఠినాతి కఠినమైన శిక్షని" విధించవలసిందిగా కోర్టు వారిని అభ్యర్థించాడు "చట్టం దృష్టిలో బుద్ధిపూర్వకమైన నేరం నా దృష్టికి ఒక పౌరుని ఉత్తమోత్తమమైన ధర్మంగా గోచరిస్తుంది" అన్నాడాయన. బ్రిటిషు పరిపాలనకు మద్దతు దారుగా ఉన్న తను దాని నిశిత విమర్శకుడుగా ఎలా మారాడో ఆ రాజకీయ పరిణామాన్ని కోర్టు ముందు వివరించాడు. "మంచికి సహకారం ఇవ్వటం ధర్మమైనట్లే చెడుతో సహాయ నిరాకరణం పాటించటం అంతే ధర్మం" అని గాంధీజీ కోర్టులో తన ప్రసంగాన్ని ముగించాడు. 1908లో లోకమాన్య తిలక్‌కి విధించిన శిక్షనే గాంధీజీకి కూడా విధిస్తున్నానని న్యాయమూర్తి రాశాడు

ఆ తరువాత కొద్దిరోజులకే ఖిలాఫత్ సమస్య సందర్భశుద్ధి కోల్పోయింది. టర్కీ ప్రజలు ముస్తఫా కమాల్ పాషా నాయకత్వంలో తిరుగుబాటు చేసి 1922 నవంబరులో సుల్తాను రాజకీయధికారాన్ని పీకి వేశారు టర్కీ ఆధునికీకరణకు కమాల్ పాషా అనేక చర్యలు తీసుకున్నాడు. ఖలీఫా వ్యవస్థని రద్దు చేశాడు రాజ్యాన్ని మతం నుంచి వేరు పర్చాడు. రాజ్యాంగం నుంచి ఇస్లాముని పరిహరించాడు. విద్యని జాతీయం చేశాడు. స్త్రీలకు విస్తృత హక్కులు ప్రసాదించాడు. యూరోపియన్ నమూనాలో న్యాయసూత్రాల్ని ప్రవేశ పెట్టాడు. వ్యవసాయాభివృద్ధి కోసం, ఆధునిక పరిశ్రమల స్థాపన కోసం అనేక చర్యలు తీసుకున్నాడు. ఈ చర్యలన్నీ ఖిలాఫత్ ఉద్యమం వెన్ను విరిచాయి.

ఖిలాఫత్ ఆందోళన సహాయ నిరాకరణోద్యమానికి గొప్ప మేలు చేసింది. అది పట్టణవాసులైన ముస్లిములను జాతీయోద్యమంలోకి లాగింది. ఆనాడు దేశంలో వెల్లి విరిసిన జాతీయోద్యమ సంరంభానికి, సముత్సాహానికి అది కొంతవరకు కారణం.

రాజకీయాల్ని మతంతో ముడి వేసిందని ఖిలాఫత్ ఉద్యమాన్ని కొందరు చరిత్రకారులు విమర్శించారు తత్ఫలితంగా మత ప్రభావం రాజకీయాలకు సోకింది చివరికి మత తత్వశక్తులు బలపడ్డాయి ఈ విమర్శ కొంతవరకు సత్యమే. జాతీయోద్యమం ముస్లిములకు మాత్రమే సంబంధించిన డిమాండును చేపట్టటంలో తప్పులేదు అయితే ముస్లిముల మతపరమైన రాజకీయ చైతన్యాన్ని లౌకిక రాజకీయ చైతన్య స్థాయికి తీసుకు పోవటంలో జాతీయ నాయకత్వం కొంతవరకు విఫలమైంది ఏది ఏమైనా 1924లో కమాల్ పాషా కలీఫా వ్యవస్థని రద్దు చేసినప్పుడు భారతదేశంలో నిరసన ధ్వనులు వినరాలేదు

**స్వరాజ్య వాదులు :** సత్యాగ్రహోద్యమ ఉప సంహరణ తరువాత అనైక్యత, అవ్యవస్థత అలముకొన్నాయి కాంగ్రెస్ సంస్థ సభ్యుల్లో, కార్యకర్తల్లో ఉత్సాహం ఇగిరిపోయింది నైరాశ్యం, నిరుత్సాహం ఆవరించాయి పైపెచ్చు నాయకుల మధ్య విభేదాలు పొడసూపాయి

మారిన ఆ పరిస్థితుల్లో చిత్తరంజనదాస్, మోతీలాల్ నెహ్రూలు ఒక నూతన రాజకీయ కార్యక్రమ పంథాను ప్రతిపాదించారు జాతీయవాదులు శాసనసభల బహిష్కరణను విరమించి, శాసన సభలకు పోటీచేసి వాటిలో ప్రవేశించి ప్రభుత్వ లోపాలను బట్టబయలు చేసి శాసనాల ఫలితమేమీ లేకుండా చేయాలని వారు వాదించారు శాసనసభల్ని ఉపయోగించుకొని ప్రజల్లో ఉత్సాహాన్ని దీపింప చేయాలని వారు కోరారు "మార్పులు కోరని పక్షం" (No-Changers)గా అభివర్ణింపబడ్డ సర్దార్ వల్లభాయ్ పటేల్, డా అన్సారీ, బాబూ రాజేంద్రప్రసాద్ ప్రభృతులు శాసనసభల్లో పునఃప్రవేశాన్నిప్రతిఘటించారు శాసనసభా రాజకీయాలు జాతీయావేశాన్ని నిర్వీర్యపరుస్తాయని, నాయకుల మధ్య స్పర్ధలు సృష్టిస్తాయని వారు హెచ్చరించారు కాబట్టి నూలు వడకటం, స్వయం పోషణ, హిందూ-ముస్లిం ఐక్యత, అస్పృశ్యతా నిర్మూలనం వగైరా నిర్మాణాత్మక కార్యక్రమాలకు వారు ప్రాధాన్యం ఇచ్చారు

1922 డిశంబరులో చిత్తరంజనదాస్, మోతీలాల్ నెహ్రూలు కలిసి కాంగ్రెస్-ఖిలాఫత్ స్వరాజ్య పార్టీలని స్థాపించారు దేశబంధు దాస్ దానికి అధ్యక్షుడు మోతీలాల్ నెహ్రూ పార్టీ కార్యదర్శులలో ఒకడు. కొత్త పార్టీ శాసనసభల్లో పునఃప్రవేశానికి సంబంధించిన అంశం మినహా కాంగ్రెస్ కార్యక్రమం మొత్తాన్ని యధాతధంగా ఆమోదించింది

స్వరాజ్యవాదులకు- "మార్పులు కోరని పక్షాని"కి మధ్య ప్రచండ రాజకీయ వివాదం ప్రారంభమైంది ఆరోగ్య కారణాల వల్ల 1924 ఫిబ్రవరి 5న జైలునుంచి విడుదలైన గాంధీజీ ఉభయ పక్షాలను ఐక్యపరచటానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు అయితే ఆయన సలహా ననుసరించి ఇరుపక్షాలూ కాంగ్రెస్‌లోనే ఉండిపోయి ఎవరికి నచ్చిన మార్గంలో వారు కృషి చెయ్యటానికి ఒప్పుకున్నారు.

1923 నవంబరు ఎన్నికల్లో స్వరాజ్యపార్టీ గణనీయంగా విజయం సాధించింది. కేంద్ర శాసనసభకు 101 స్థానాల్లో 42 స్థానాలు స్వరాజ్య పార్టీ గెలుచుకుంది. రాష్ట్ర శాసనసభల్లో కూడా స్వరాజ్య పార్టీ అదేవిధంగా గెలిచింది. కేంద్ర శాసనసభలో ఇతర భారతీయ గ్రూపులతో కలిసి స్వరాజ్య పార్టీ ప్రభుత్వాన్ని పలుమార్లు ఓడగొట్టింది. 1925 మార్చిలో కేంద్ర శాసనసభకు సభాపతిగా విఠల్ భాయి పటేల్ ఎన్నికయ్యాడు. సభాపతి ఎన్నికలో స్వరాజ్య పార్టీ విజయవంతమైంది గాని, బ్రిటిషు ఇండియా

ప్రభుత్వ అధికార విధానాల్ని మార్చాలనే ప్రయత్నంలో విఫలమైంది. కాబట్టి కేంద్ర శాసనసభ నుంచి తప్పుకోవటం మేలని భావించి, ఆ పార్టీ శాసనసభ్యులు 1926 మార్చిలో శాసనసభ నుంచి బైటికి వచ్చేశారు. అన్నిటికన్నా ఘోరమైన విషయమేమంటే స్వరాజ్య పార్టీ ప్రజాసామాన్యాన్ని గాని, మధ్య తరగతి ప్రజల్ని గాని క్రియాశీల రాజకీయాల వేపు ఆకర్షించలేక పోయింది. అలాగే మార్పులు కోరని పక్షానికి చెందిన నాయకులు కూడా విఫల మయ్యారు. ఉభయ పక్షాలూ పేరుకుపోతున్న రాజకీయ తుప్పును నివారించలేక పోయాయి. ఈలోగా 1925 జూన్‌లో దేశబంధు చిత్తరంజన్‌దాస్ కన్నుమూశారు.

సహాయ నిరాకరణోద్యమం అడుగంటిపోయి ప్రజానీకంలో నిస్పృహ ఆవరించిన సమయంలో మతతత్వ శక్తులు మళ్ళీ తలెత్తాయి. 1923 తరువాత దేశంలో పదేపదే మత కలహాగ్నులు ప్రజ్వరిల్లాయి. ముస్లింలీగు సంస్థ, 1917 డిశంబరులో ప్రారంభమైన హిందూ మహాసభ మళ్ళీ చురుగ్గా రంగంలో ప్రవేశించాయి. ఫలితంగా భారతీయులంతా ఒక్కటే అని దేశంలో వృద్ధి పొందుతున్న భావన గాయపడింది. స్వరాజ్య పార్టీ సైతం కొందరు నాయకుల మతతత్వ వైఖరులవల్ల చీలిపోయింది. మదనమోహన మాలవీయ, లాలాలజపతిరాయ్, యన్.సి. కేల్కర్‌లతో సహా కొందరు నాయకులు 'సమాధాన వాదులు' అనే పేరుతో ఒక బృందంగా ఏర్పడి ప్రభుత్వంతో సహకరించడానికి ముందుకు వచ్చారు. హిందూ ప్రయోజనాల పరిరక్షణ పేరిట వీరంతా విదేశ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వటానికి ఉబలాటపడ్డారు. మోతీలాల్ నెహ్రూని హిందూ వ్యతిరేకి అనీ, గోవధని ఆమోదిస్తాడనీ, గోమాంస భక్షకుడనీ, హిందువుల్ని ముంచేవాడనీ వాళ్ళు నానా కారుకూతలు కూశారు. ఇక ముస్లిం మతతత్వ వాదులు కూడా వారికి తీసిపోకుండా స్వలాభం ఆశించి పోరాటానికి దిగారు. "హిందూ-ముస్లిం ఐక్యత సర్వకాలాల్లో, సకల పరిస్థితుల్లో మన మతం, మన విశ్వాసం" అని గాంధీజీ పదే పదే ఘోషించారు. దిగజారి పోతున్న పరిస్థితిని చక్కదిద్దడానికి ఆయన ఐక్యం కల్పించుకోడానికి ప్రయత్నించారు. 1924 సెప్టెంబరులో ఆయన ఢిల్లీలో మౌలానా మహమ్మదాలీ గృహంలో 21 దినాల పాటు ఉపవాసం చేశారు. మతకలహాల్లో మంటగలిసిన మానవతకు ప్రాయశ్చిత్తంగా ఆయన చేసిన ఉపవాసం కూడా సత్ఫలితాలు సాధించలేక పోయింది.

దేశ పరిస్థితి అంధకార బంధురమై పోయింది. జనంలో రాజకీయ ఔదాసీన్యం వ్యాపించింది. గాంధీజీ అన్నీ చాలించుకుని ఏకాంతవాసం చేస్తున్నారు. స్వరాజ్యవాదులు చీలిపోయారు. మతతత్వం పెచ్చు పెరిగిపోయింది. అయితే వీటన్నిటికి వెనుక జాతీయ పునరుజ్జీవ శక్తులు బలం పుంజుకుంటున్నాయి. 1927 నవంబర్ మాసంలో సైమన్ కమీషన్ ఏర్పాటైనట్లుగా ప్రకటన రావటంతో భారతదేశం మళ్ళీ అంధకారంలోంచి బైటపడి నూతన రాజకీయ పోరాట ఘట్టంలో ప్రవేశించింది.

***రెండవ సహాయ నిరాకరణోద్యమం :*** 1927లో భారతజాతి పుంజుకుంటున్న సూచనలు కన్పించాయి. ప్రజలు తమని నడిపించే నాయకత్వం కోసం ఎదురు చూస్తున్నారని స్పష్టంగా వెల్లడయింది. రాజకీయంగా ఈ ఆవేశం, శక్తి కాంగ్రెస్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోసుల నాయకత్వాన నూతన వామపక్ష ఆవిర్భావంలో ప్రతిఫలించాయి. ఈ ఇద్దరూ దేశమంతటా పర్యటించి నూతన సామ్యవాద సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. ఇద్దరూ సామ్రాజ్యవాదాన్ని, పెట్టుబడిదారీ

విధానాన్ని, భూస్వామ్య పద్ధతిని దుయ్యబట్టారు. ప్రజలు స్వాతంత్ర్యాన్ని సాధించుకోవాలంటే అది బ్రిటిషు పార్లమెంటునుంచి కానుకగా రాదు అని వారు ప్రజలకు ప్రకటించారు. విద్యార్థులకు, యువకులకు ఈ ఇద్దరు ఆరాధ్య దైవాలయ్యారు.

భారత యువత వేడెందుకుంటోంది. దేశ వ్యాప్తంగా యువక సంఘాలు అవతరిస్తున్నాయి. విద్యార్థుల సభలు, సమావేశాలు జరుగుతున్నాయి. 1928 ఆగస్టులో ప్రప్రథమ అఖిల వంగ విద్యార్థి మహాసభలు జరిగాయి. ఆ సభలు జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన జరిగాయి. దాని తరువాత దేశంలో అనేక విద్యార్థి సంఘాలు ప్రారంభమయ్యాయి. డిశంబర్‌లో ప్రప్రథమ అఖిల భారత యువజన కాంగ్రెస్ సమావేశమైంది. యువ భారత జాతీయవాదులు క్రమేణా సోషలిజం వేపు మొగ్గసాగారు. దేశం అనుభవించే రాజకీయ, ఆర్థిక, సామాజిక జాడ్యాలకు వాళ్ళు విప్లవాత్మక మార్గాలు సూచించ సాగారు. సంపూర్ణ స్వాతంత్ర్య కార్యక్రమాన్ని వాళ్ళు ప్రజల్లోకి తీసుకు వెళ్ళారు. 1920 ప్రాంతంలో సోషలిస్టు, కమ్యూనిస్టు గ్రూపులు ఆవిర్భవించాయి. సోవియట్ రష్యా ఆదర్శం అనేకమంది యువ జాతీయ వాదుల్లో ఆసక్తి రేకెత్తించింది. వారిలో చాలామంది గాంధీజీ రాజకీయ భావాలు, కార్యక్రమాలతో అసంతృప్తి చెందారు. మార్గదర్శకత్వం కోసం సోషలిస్టు సిద్ధాంతం కేసి తిరిగారు. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నాయకత్వానికి ఎన్నికయిన మొట్టమొదటి భారతీయుడు యమ్.యన్. రాయ్. 1924లో ప్రభుత్వం ముజఫర్ అహ్మద్, యన్.ఎ. డాంగేల మీద కమ్యూనిస్టు భావాలు ప్రచారం చేస్తున్నారని కేసు బనాయించి అరెస్టు చేసింది. కాన్పూరు కుట్రకేసంటూ ఒకటి సృష్టించి ఇతర విప్లవాదుల్తో పాటు ఈ ఇద్దరిపైనా విచారణ జరిపింది. ఇదేకాలంలో దేశంలో వివిధ ప్రాంతాలలో కార్మిక-కర్షక పార్టీలు అనేకం ఆవిర్భవించాయి. ఈ పార్టీలు, గ్రూపులు మార్క్సిస్టు, కమ్యూనిస్టు భావాలు ప్రచారం చేశాయి.

రైతాంగంలో, కార్మికుల్లో మళ్ళీ కదలిక ప్రారంభమైంది. ఉత్తరప్రదేశ్‌లో కౌల్దారీ చట్టాల సవరణ గురించి రైతులు పెద్ద ఎత్తున ఆందోళన జరిపారు. గుజరాత్‌లో రైతాంగం భూమిశిస్తు పెంపుదల ప్రయత్నాలకు వ్యతిరేకంగా ప్రతిఘటించింది. ఈ సమయంలోనే సుప్రసిద్ధ బర్డోలి సత్యాగ్రహం జరిగింది. సర్దార్ వల్లభాయ్‌పటేల్ నాయకత్వాన రైతులు 1928లో పన్నుల నిరాకరణోద్యమం సాగించారు. అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్మిక సంఘతత్వం వేగంగా అభివృద్ధి చెందింది. 1928లో అనేక సమ్మెలు జరిగాయి. ఖర్గపూరు రైల్వే వర్క్‌షాపు కార్మికులు రెండు మాసాలపాటు సమ్మె చేశారు. దక్షిణ భారత రైల్వే కార్మికులు సమ్మె కట్టారు. జమ్‌షెడ్‌పూర్‌లో టాటా ఇనుము-ఉక్కు కర్మాగారంలో సమ్మె జరిగింది. ఈ సమ్మె పరిష్కారంలో సుభాష్ చంద్రబోస్ ప్రముఖపాత్ర నిర్వహించాడు. ఈ కాలంలో జరిగిన అత్యంత ముఖ్యమైంది - బొంబే బట్టల మిల్లు కార్మికుల సమ్మె. దాదాపు లక్ష 50వేల మంది కార్మికులు 5 మాసాలకు పైగా సమ్మె చేశారు. ఈ సమ్మెకు కమ్యూనిస్టులు నాయకత్వం వహించారు. 1928వ సంవత్సరంలో మొత్తం 5 లక్షల మందికి పైగా కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు

ఈ నూతన భావావేశం విప్లవ ఉగ్రవాద కార్యకలాపాల విస్తరణలో ప్రతిబింబించింది. ఆ ఉద్యమం కూడా సోషలిస్టు మలుపు తీసుకోసాగింది. మొదటి

సహాయ నిరాకరణోద్యమ వైఫల్యం టెర్రిస్టు ఉద్యమ పునర్వికాసానికి దారి తీసింది. దేశంలో సాయుధ విప్లవాన్ని సాగించటానికి 1924 అక్టోబర్‌లో 'హిందూస్థాన్ రిపబ్లికన్ అసోసియేషన్' అనే విప్లవ సంస్థ ప్రారంభమైంది. ప్రభుత్వం వెంటనే అనేకమంది టెర్రరిస్టు యువకుల్ని అరెస్టు చేసి కాకోరీ కుట్రకేసులో ఇరికించింది. అరెస్టయిన వారిలో 17 గురికి దీర్ఘ కారాగార శిక్షలు పడ్డాయి. నలుగురికి యావజ్జీవ ద్వీపాంతరవాస శిక్ష పడింది. నలుగురికి ఉరిశిక్ష పడింది ఆ వెంటనే టెర్రిస్టు యువకులు సోషలిస్టు భావాల పలుకుబడి కిందికి వచ్చారు 1928లో చంద్రశేఖర అజాద్ నాయకత్వంలో విప్లవ సంస్థ పేరు 'హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్'గా మారింది.

ఒక బ్రిటిష్ పోలీసు అధికారి హత్యలో విప్లవ ఉగ్రవాదుల కార్యక్రమం నాటకీయంగా బహిర్గతమైంది ఆ అధికారి పేరు శాండర్స్ లాలాలజపతిరాయ్ నడిపిన ఒక ప్రజా ప్రదర్శనమీద లాఠీచార్జీ జరిపాడు పంజాబ్ కేసరిగా ప్రజలు ఆప్యాయంగా పిలుచుకునే లాలాలజపతిరాయ్ తలమీద, రొమ్ముమీద తగిలిన లాఠీ దెబ్బలవల్ల ఒక నెలలోపే మరణించాడు. భగత్‌సింగ్, సుక్‌దేవ్, రాజగురు కలిసి లాలాలజపతిరాయ్ మరణానికి కారకుడైన శాండర్స్‌ని కాల్చి చంపారు వారు తాము చేసిన హత్యని ఇలా సమర్థించుకున్నారు :

"కోట్లాది ప్రజలు కొలిచే మహా నాయకుడు ఒక సాధారణ పోలీసుల అధికారి పాపపు చేతుల్లో మరణించడం జాతికే అవమానం. దాన్ని చెరిపివేయటం భారత యువకుల విద్యుక్త ధర్మం ఒక వ్యక్తిని చంపవలసి రావటం విచారకరమే.... కాని అతడు అమానుష, అక్రమ ఉత్తర్వులో ఒక భాగం. ఆ అమానుష ఉత్తర్వుని అంతం చేయాల్సి వుంది. అతని మరణంతో బ్రిటిషు పాలన ఏజెంటు ఒకడు తుడిచిపెట్టుకు పోయాడు. మానవ రక్తపాతం మాకూ మనస్తాపం కలిగిస్తుంది. కాని విప్లవ పూజా పీఠం ముందు రక్తపాతం అనివార్యం మనిషిని మనిషి దేచుకునే వ్యవస్థని రూపుమాపే విప్లవం కోసం పాటుపడటం మా ధ్యేయం "

అదే మాదిరిగా భగత్‌సింగ్, బి కె దత్తు కలిసి 1929 ఏప్రిల్ 8వ కేంద్ర శాసనసభలో బాంబు విసిరారు ప్రజా రక్షణ బిల్లు ఆమోదానికి నిరసనగా వాళ్ళు ఆ సాహసానికి ఒడిగట్టారు అది పౌరహక్కుల్ని హరించే బిల్లు. అయితే ఆ బాంబు ఎవ్వరికీ హాని కలిగించ లేదు. హానికలిగించని విధంగా వాళ్ళు దాన్ని తయారు చేశారు. చంపటం వాళ్ళ లక్ష్యంకాదు. చెవిటివాళ్ళకి వినిపించేటట్లు చెయ్యటం వాళ్ళ లక్ష్యం. బాంబు విసిరేక భగత్‌సింగ్, బి కె. దత్తులు సులువుగా తప్పించుకుపోయే వీలుంది. కాని వాళ్ళు అరెస్టు కావటానికే నిశ్చయించుకున్నారు. తమ విప్లవ ప్రచారానికి న్యాయస్థానాన్ని వేదికగా ఉపయోగించుకో గోరారు.

బెంగాల్‌లో కూడా విప్లవ కార్యకలాపాలు తిరిగి ప్రారంభమయ్యాయి. 1930 ఏప్రిల్లో సూర్యసేన్ నాయకత్వంలో చిట్టగాంగులో ప్రభుత్వ ఆయుధాగారం పైన దాడి జరిగింది. ప్రజావ్యతిరేక ప్రభుత్వాధికార్లపైన జరిగిన అనేక దాడుల్లో ఇది మొట్టమొదటిది. బెంగాల్ విప్లవోద్యమంలో విశేషమేమంటే, యువతులు కూడా ఆ కార్యకలాపాలలో పాల్గొన్నారు.

ప్రభుత్వం విప్లవ ఉగ్రవాదులపైన గట్టిదెబ్బ కొట్టింది. అనేకమంది అరెస్టయ్యారు. వివిధ సుప్రసిద్ధ కుట్ర కేసుల్లో విచారించ బడ్డారు. భగత్‌సింగ్ ప్రభృతుల్ని ప్రభుత్వం పోలీసు అధికార్ల హత్యకేసుల్లో విచారించింది. న్యాయస్థానాల్లో


ఆ యువ విప్లవకారుల ప్రకటనలు, ఉద్ఘాటనలు, వారి నిర్భీకత, వారి ధిక్కార ధోరణి ప్రజల సానుభూతిని చూరగొన్నాయి జైళ్ళలోని దుర్భర పరిస్థితులకు నిరసనగా వాళ్ళు పూనిన నిరాహార దీక్ష ప్రత్యేకంగా ఉత్తేజకరమైంది. రాజకీయ ఖైదీలుగా వాళ్ళు గౌరవప్రదమైన, మర్యాదోచితమైన ఆదరణని డిమాండు చేశారు. ఆ నిరాహార




అష్ఫకుల్లా ఖాన్



చంద్రశేఖర ఆజాద్



సుఖదేవ్ (దయాళ్)



శివరాం రాజ్‌గురు

దీక్షలో జతిన్‌దాస్ అనే ఒక బక్క యువకుడు 63 రోజుల ఉపవాసం తరువాత వీరోచిత మరణం పొందాడు. ప్రభుత్వం ప్రజల నిరసనని లక్ష్యపెట్టకుండా భగత్‌సింగ్, సుక్‌దేవ్, రాజగురులను 1931 మార్చి 23న ఉరితీసింది. ఉరి తియ్యటానికి కొద్ది రోజుల ముందు జైలు సూపరెంటుకు రాసిన ఒక లేఖలో ఆ ముగ్గురూ ఇలా విస్పష్టం చేశారు: "అతి త్వరలో అంతిమయుద్ధం ఆరంభమవుతుంది. దాని ఫలితం నిర్ణాయకంగా ఉంటుంది. మేం పోరాటంలో పాలుపంచుకున్నాం. అందుకు మేం గర్వపడుతున్నాం."

భగత్‌సింగ్ తన చివరి రెండు లేఖల్లో సోషలిజంలో విప్లవ ఉగ్రవాదులు విశ్వాసాన్ని విస్పష్ట పర్చాడు.

"రైతులు విదేశ దాస్య బంధాల నుంచే కాక భూస్వాముల, పెట్టుబడిదార్ల చెరనుంచి కూడా విముక్తి సాధించాలి" అని ఆయన రాశాడు. 1931 మార్చి 3న ఇచ్చిన తన అంతిమ సందేశంలో - భారతదేశంలో పోరాటం "కొద్దిమంది దోపిడిదార్లు స్వలాభం కోసం సామాన్య ప్రజల శ్రమశక్తిని దోచుకున్నంత కాలం కొనసాగుతుంది. ఆ దోపిడిదార్లు స్వచ్ఛమైన బ్రిటిషు పెట్టుబడిదార్లా, బ్రిటిషు-భారత పెట్టుబడిదార్ల సంయుక్త కూటమా, పదహారణాల భారత పెట్టుబడిదార్లా అనేది అనవసరం" అని ఆయన ఉద్ఘాటించారు.

యువ విప్లవ యోధుల మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చటానికి నిరాకరించిన ప్రభుత్వ కర్కశవైఖరి ప్రజల ఆగ్రహాన్ని మరింత ఉధృతం చేసింది. మరోవైపు- వాళ్ళ ప్రగాఢ దేశభక్తి, అజేయ ధైర్యం, దృఢ నిశ్చయదీక్ష, అసమాన త్యాగభావం భారత ప్రజానీకాన్ని కదల్చివేశాయి. జాతీయవాద, సామ్యవాద చైతన్య వ్యాప్తిలో ముఖ్యపాత్ర నిర్వహించిన విప్లవాత్మక టెర్రరిస్టు ఉద్యమం ఆ తరువాత ఇంకిపోయింది. చాలా ఏళ్ళపాటు అదప తదప విప్లవ సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. చంద్రశేఖర ఆజాద్ ఒక పబ్లిక్ పార్కులో పోలీసు ఎదురుకాల్పుల్లో మరణించాడు. ఆ పార్కుకి తరువాత ఆజాద్ పార్కు అని పేరు పెట్టారు. సూర్యసేన్ 1933 ఫిబ్రవరిలో అరెస్టయ్యాడు. రకరకాల కారాగార శిక్షలు పడ్డాయి.

ఆ కల్లోల దశాబ్దం గురించి రాస్తూ భారత వైస్రాయి లార్డ్ ఇర్విన్ ఆ దినాల్ని జ్ఞాపకం చేసుకున్నారు: "ఏదో ఒక నూతన శక్తి పనిచేస్తోంది. భారతదేశం గురించి 20-30 ఏళ్ళుగా తెలిసిన వాళ్ళకి సైతం దాని సంపూర్ణ తాత్పర్యం ఇంకా బోధపడకుండా ఉంది."

**సైమన్ కమిషన్ బహిష్కరణ :** బ్రిటిషు ప్రభుత్వం భారతదేశంలో మరికొన్ని రాజ్యాంగ సంస్కరణలు ప్రవేశపెట్టే సమస్యని పరిశీలించటానికి 1927 నవంబరులో ఒక సంఘాన్ని (కమీషన్) నియమించింది. ఆ సంఘానికి సర్ జాన్ సైమన్ అనే ఆంగ్లేయుడు అధ్యక్షుడు కాబట్టి దానికి సైమన్ కమిషన్ అని పేరు స్థిరపడింది. ఆ కమిషన్ సభ్యులందరు ఇంగ్లీషువారే. సైమన్ కమిషన్ నియామకాన్ని భారతీయులంతా ముక్తకంఠంతో నిరసించారు. అందులో ఒక్క భారతీయుణ్ణయినా చేర్చక పోవటం ప్రజల్ని కోపోద్రిక్తుల్ని చేసింది. స్వపరిపాలక ప్రభుత్వానికి భారతీయుల అర్హతని విదేశీయులే చర్చించి నిర్ణయించాలన్న మౌలిక దృక్పథమే కమిషన్‌లో భారతీయునికి చోటు పెట్టకపోవటానికి కారణం. మరో మాటల్లో చెప్పాలంటే-ఈ బ్రిటిషు చర్యని స్వయం నిర్ణయాధికార సూత్ర ఉల్లంఘనగా,

భారతీయుల ఆత్మ గౌరవానికి బుద్ధిపూర్వకంగా చేసిన అవమానంగా ప్రజలు, నాయకులు పరిగణించారు. డాక్టర్ అన్సారీ అధ్యక్షతన 1927 లో మద్రాసులో జరిగిన జాతీయ కాంగ్రెస్ సమావేశం సైమన్ కమిషన్‌ని "ప్రతి ఒక్క దశలో, ప్రతి ఒక్కరూపంలో" బహిష్కరించాలని తీర్మానించింది. కాంగ్రెస్ నిర్ణయాన్ని బలపర్చాలని ముస్లింలీగు, హిందు మహాసభ నిర్ణయించుకున్నాయి. నిజం చెప్పాలంటే సైమన్ కమిషన్ కనీసం తాత్కాలికంగానైనా దేశంలో విభిన్న పార్టీల్ని, గ్రూపుల్ని ఒక త్రాటిమీదికి తెచ్చింది. జాతీయవాదులతో సంఘీభావానికి చిహ్నంగా ముస్లింలీగు సంయుక్త నియోజకవర్గ సూత్రానికి ఆమోదం తెల్పింది. అయితే, ముస్లిములకు కొన్ని స్థానాలు కేటాయించాలని మాత్రం కోరింది.

ముఖ్య భారతీయ నాయకులు, పార్టీలు కలిసి అందరికీ ఆమోద యోగ్యమైన భారత రాజ్యాంగాన్ని రూపొందించడం ద్వారా బ్రిటిషు సవాలుని ఎదుర్కోవాలని నిర్ణయించారు. అందుకోసం ఒక అఖిల పక్ష సమావేశం మొదట ఢిల్లీలో, తరువాత పూనాలో జరిగింది. ఆ సమావేశం మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన ఒక ఉపసంఘాన్ని నియమించింది. ఆ ఉపసంఘంలోని ఇతర సభ్యులతో తేజ్ బహదూర్ సప్రూ, అలీ ఇమామ్, సుభాష్ చంద్రబోసులు ముఖ్యులు. ఉపసంఘం , ఆగస్టులో ఒక నివేదికను సమర్పించింది. అదే నెహ్రూ నివేదిక. ఆ నివేదిక సిఫార్సుల ప్రకారం మొట్టమొదటి మెట్టుగా అధినివేశ ప్రతిపత్తి (Dominion Status) పొందాలి. భాషాప్రయుక్త రాష్ట్రాల విభజన, రాష్ట్రాలకు స్వతంత్ర ప్రతిపత్తి అనే రెండు సూత్రాల ప్రాతిపదిక మీద భారతదేశం ఫెడరల్ రాజ్యంగా అవతరించాలి. కార్యనిర్వాహక మండలి శాసనసభలకు బాధ్యత వహించి వుండాలి. వయోజన వోటింగు పద్ధతి మీద సంయుక్త నియోజక వర్గాల ప్రాతిపదికపైన ఎన్నికలు జరపాలి. శాసనసభలలో కనీసం పది సంవత్సరాల వరకైనా అల్ప సంఖ్యాక వర్గాల వారికి కొన్ని స్థానాలు కేటాయించాలి.

దురదృష్టవశాత్తు 1928 డిశంబరులో కలకత్తాలో జరిగిన అఖిపక్ష సమావేశం నెహ్రూ నివేదికను ఆమోదించలేదు. నివేదికలోని అంశాలపైన ముస్లింలీగు ఏకాభిప్రాయానికి రాలేక జాతీయవాద, మతతత్వ పంథాలలో రెండుగా చీలిపోయింది. మహమ్మదాలీ జిన్నా 14 డిమాండ్లను సమావేశం ముందు పెట్టాడు. ప్రత్యేక నియోజక వర్గాలు, కేంద్ర శాసనసభలో ముస్లిములకు మూడవ వంతు స్థానాలు, బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలలో జనాభా దామాషాను బట్టి ముస్లిములకు సీట్ల కేటాయింపు, రాష్ట్రాలకు పరిశిష్ట అధికారాలు అనేవి ఆయన కోరిన డిమాండ్లలో ముఖ్యమైనవి. హిందూ మహాసభ నెహ్రూ నివేదికని ముస్లిం అనుకూల నివేదిక అని నిందించింది. ఆ విధంగా జాతీయ సమైక్యతావకాశాలు మతతత్వ ముఠాలవల్ల భగ్నమయ్యాయి.

కేవలం రాజ్యాంగపరమైన సమస్యలకు సంబంధించినంత వరకు జాతీయ వాదులకు- మతతత్వ వాదులకు మధ్య అంతరం ఆనాడు అంత ఎక్కువగా లేదు. అల్ప సంఖ్యాక వర్గాల ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన భద్రతలను సమకూర్చటానికి జాతీయవాదులు సుముఖంగానే ఉన్నారు. మతం, సంస్కృతి, భాష, వ్యక్తులు, అల్ప సంఖ్యాక వర్గాల ప్రాథమిక హక్కులు- అన్నీ పరిరక్షింపబడాలి. జాతీయవాదులు వాటన్నిటికి సుముఖంగా ఉన్నారు. ఎటొచ్చీ ఈ నాయకులు అల్ప సంఖ్యాక వర్గాల ఆనాటి మనోభావాలను సంపూర్ణంగా అవగాహన చేసుకోవడంలో కృతకృత్యులు కాలేకపోయారు. అల్పసంఖ్యాక వర్గాలు-ముఖ్యంగా ముస్లిములు

అధిక సంఖ్యాకవర్గాన్ని గురించి అనవసర భయాన్ని పెంచుకున్నారు ఆధునిక రాజకీయాల్లో ఆచరణానుభవం ద్వారా మాత్రమే వాళ్ళు ఆ భయాన్ని క్రమేణా పోగొట్టుకుంటారు అప్పుడే అభివృద్ధి నిరోధకుల, లేదా పరాయి ప్రభుత్వపు చెప్పుడు మాటల్ని నిరాకరిస్తారు చాలామంది జాతీయ నాయకులు ఈ సత్యాన్ని తరువాత సంపూర్ణంగా చక్కగా గ్రహించారు 1933లో జవహర్‌లాల్ నెహ్రూ ఇలా రాశారు:

"ఒక అల్పసంఖ్యాక వర్గంలో ఈ భయం కొంతమట్టుకి సమర్థనీయం కనీసం వారి భయాన్ని అర్థం చేసుకోవచ్చు. . కాబట్టి భారతదేశంలో హిందువులపైన ఒక ప్రత్యేక బాధ్యతపడుతుంది. ఒకటి-వాళ్ళు అధిక సంఖ్యాకవర్గం కాబట్టి రెండు - వాళ్ళు ఆర్థికంగా, విద్యా విషయకంగా చాలా అభివృద్ధి చెంది ఉన్నారు కాబట్టి ఈ బాధ్యత వాళ్ళమీద ఉంటుంది హిందూ మహాసభ ఆ బాధ్యతని నిర్వర్తించటానికి బదులు ముస్లిములలో మతతత్వాన్ని పెంచే రీతిలో, హిందువుల పట్ల వాళ్ళకింకా అవిశ్వాసం కలిగే రీతిలో, వ్యవహరించింది ఒక మతతత్వం రెండవదాన్ని అంతం చెయ్యదు ప్రతిదీ ఒకదానిమీద మరొకటి పడి పోషణ చేసుకుంటాయి. ఫలితంగా రెండూ బలుస్తాయి."

1934లో రాసిన మరొక వ్యాసంలో జవహర్‌లాల్ నెహ్రూ ఇలా సలహా ఇచ్చారు: "కాబట్టి, మనం ఈ భీతిభావాన్ని తొలగించాలి ముస్లిములు తాము నిజంగా కోరే ఏ భద్రతనైనా పొందవచ్చుననే భావం ముస్లిం ప్రజానీకానికి కలిగించాలి"

జిన్నా సైతం ఆనాడు దీన్ని అంగీకరించాడు 1931లో ఒక ప్రసంగంలో ఆయనిలా ఉద్ఘాటించాడు :

"ప్రత్యేక నియోజక వర్గాల ప్రాతిపదిక మీదనైనా సరే పరిష్కారం కుదరాలనేది నా అభిమతం మనం నూతన రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు, హిందూ-ముస్లిములుభయులు అపనమ్మకం, అనుమానం, భయాల నుంచి బైటపడినప్పుడు, వాళ్ళు తమ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నప్పుడు మనం సందర్భానికి తగినట్లుగా బాధ్యత స్వీకరిస్తాం. బహుశా అప్పుడు ఈ ప్రత్యేక నియోజక వర్గాలనేవి చాలా మంది అనుకునే దానికన్నా ఇంకా చాలాముందే పోవచ్చు"

కాని జాతీయనాయకుల్లో ఎక్కువమంది ఈ దృక్పథాన్ని ఆమోదించరు, లేదా అప్పుడు దానిమీద కార్యచరణకు పూనుకోవటంలో విఫలమయ్యారు. ఒకపక్క వాళ్ళమీద హిందూమతతత్వ వాదుల ఒత్తిడి పడింది. మరోప్రక్క అల్ప సంఖ్యాకవర్గాల భయాలు కేవలం ఊహాజనితమైనవని వాళ్ళు భావించారు మతతత్వ నాయకులకు ప్రజాబలం లేదు కాబట్టి వారి కోర్కెల్ని నిరాక్షేపణీయంగా నిరాకరించవచ్చు అని కూడా వాళ్ళు భావించారు. ఇది పొరపాటు. పర్యవసానంగా మౌలానా మహమ్మదాలీ వంటి జాతీయవాది సైతం జాతీయ నాయకులు సంపూర్ణ స్వాతంత్ర్య సమస్య మీద బ్రిటిషు ప్రభుత్వంతో రాజీపడ్డానికైనా సిద్ధంగా ఉన్నారుగాని తమవారైన మతతత్వ వాదుల్ని సమాధానపర్చడానికి మాత్రం నిరాకరిస్తున్నారని ఫిర్యాదు చేశాడు. 'రక్షణలు కావాలని కోరటం ముస్లిముల అవివేకం. వాటిని హిందువులు నిరాకరించటం అంతకన్నా అవివేకం" అని ఆనాడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వ్యాఖ్యానించాడు. ఏమైనా అది మొదలుముస్లిం మతతత్వం నిలకడగా పెరగసాగింది.

జాతీయవాదుల రాజకీయాలకు, మతతత్వ వాదుల రాజకీయాలకు మధ్య ఒక

మౌలికమైన తేడా ఉంది. జాతీయవాదులు రాజకీయ హక్కుల కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం విదేశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం సాగించారు. హిందూ, ముస్లిం మతతత్వ వాదులు అలా చెయ్యలేదు. వాళ్ళు తమ దిమాండ్లను జాతీయవాదుల మీద రుద్దారు. మరోప్రక్క మద్దతుకోసం అనుగ్రహం కోసం విదేశ ప్రభుత్వం వేపుచూపుతిప్పారు. తరచుగా వాళ్ళు కాంగ్రెసుకు వ్యతిరేకంగా పోరాడారు, పరాయి ప్రభుత్వంతో సహకరించారు.

అఖిలపక్ష సమావేశపు తర్జన భర్జనలు, లావాదేవీలకన్నా చాలా ముఖ్యమైంది - సైమన్ కమీషనుకు వ్యతిరేకంగా ఉప్పొంగిన ప్రజాశక్తి. భారతదేశానికి సైమన్ కమిషను రాక ఒక శక్తివంతమైన నిరసనోద్యమానికి దారితీసింది. ఆ ఉద్యమంలో జాతీయోత్సాహం, ఐక్యత మిన్నులు ముట్టాయి.

ఫిబ్రవరి 3న సైమన్ కమీషన్ బొంబాయి చేరింది. ఆ రోజున దేశ వ్యాప్తంగా హర్తాళ్ జరిగింది. కమిషన్ సభ్యులు ఎక్కడికి వెళ్ళినా హర్తాళ్ళు, నల్లజండా ప్రదర్శనలు ఎదురయ్యాయి. "సైమన్! తిరిగిపో" అనే నినాదాలు మిన్నుముట్టాయి. ప్రభుత్వం పాశవిక హింసాకాండకు తలపడింది. ప్రజల నిరసనను అణచి వెయ్యటానికి పోలీసులు విశృంఖలంగా దాడిచేశారు.

సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమం వెంటనే ఒక విస్తృత రాజకీయ పోరాటానికి దారి తియ్యలేదు. ఎంతచేతనంటే జాతీయోద్యమానికి ఎదురులేని నాయకుడు గాంధీజీ ఇంకా ఎటూ తేల్చుకోలేదు. పోరాటానికి సమయం ఆసన్నమైందన్న నమ్మకం ఆయనకింకా కలగలేదు. కాని దేశంలో మరొకసారి పోరాట మనస్తత్వం పెంపొందింది. ప్రజల ఉత్సాహావేశాల్ని అదిమిపెట్టి ఉంచటం అసాధ్యమని తేలింది.

*పూర్ణ స్వరాజ్యం :* జాతీయ కాంగ్రెస్ కూడా ఈ నూతన మనస్థితిని ప్రతిబింబించింది. గాంధీజీ మళ్ళీ క్రియాశీల రాజకీయాలలోకి ప్రవేశించాడు. 1928 డిశంబర్లో కలకత్తా కాంగ్రెస్ సమావేశానికి హాజరయ్యాడు. ప్రస్తుతం ఆయన జాతీయవాదుల శ్రేణుల్ని సంఘటిత పర్చటానికి పూనుకున్నాడు. కాంగ్రెస్ లోని సమరశీల వామపక్షాన్ని సమాధానపర్చటం మొట్టమొదటి చర్య. 1929లో లాహోర్‌లో జరిగిన చరిత్రాత్మక కాంగ్రెస్ మహాసభలో జవహర్‌లాల్ నెహ్రూ కాంగ్రెస్ అధ్యక్షపీఠం అలంకరించాడు. తండ్రి అలంకరించిన స్థానాన్ని తనయుడు అలంకరించటం విశేషం. (మోతీలాల్ నెహ్రూ 1928లో కాంగ్రెస్ అధ్యక్షుడు). ఆధునిక చరిత్రలో ఇది అపురూపం.

లాహోర్‌లో కాంగ్రెస్ సమావేశం ఒక నూతన సమరశీల చైతన్యానికి గొంతుకిచ్చింది. అది సంపూర్ణ స్వాతంత్ర్యం కాంగ్రెస్ ఆశయమని ప్రకటిస్తూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. 1929 డిశంబరులో కొత్తగా రూపొందించిన స్వాతంత్ర్య త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించింది. 1930 జనవరి 26 ప్రప్రథమ స్వాతంత్ర్యదినంగా నిర్ణయించ బడింది. బ్రిటిషు పాలనకు 'ఇంకా లొంగివుండటం మానవునికి దేవునికి అపచారం' అని ప్రమాణం చేస్తూ ప్రజలంతా ఆరోజున పూర్ణ స్వరాజ్యం జయంతి జరుపుకున్నారు. కాని జాతీయ కాంగ్రెస్ పోరాట కార్యక్రమాన్ని రూపొందించలేదు. అది గాంధీజీకి వదిలివేసింది. కాంగ్రెస్ సంస్థ ఆయన కనుసన్నల్లో మెలగటానికి సిద్ధంగా వుంది. మళ్ళీ మరొకసారి గాంధీజీ నాయకత్వాన జాతీయోద్యమం ప్రభుత్వంతో తలపడింది. దేశంలో మళ్ళీ ఆశ, ఆనందం, స్వాతంత్ర్య దీక్ష వెల్లివిరిశాయి.

**రెండవ సత్యాగ్రహోద్యమం :** గాంధీజీ 1930 మార్చి 12 న చరిత్ర ప్రసిద్ధమైన దండియాత్రలో రెండవ సత్యాగ్రహ సమరానికి నాంది పలికారు ఇదే భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో ఉప్పు సత్యాగ్రహంగా ప్రసిద్ధికెక్కింది గాంధీజీ తాను స్వయంగా ఎంపిక చేసుకున్న 78 మంది అనుచరుల్తో కలిసి సబర్మతి ఆశ్రమం నుంచి బైల్దేరి 200 మైళ్ళు నడిచి గుజరాత్ సముద్ర తీరాన దండి గ్రామం చేరుకున్నారు అక్కడ గాంధీజీ, ఆయన అనుచరులు ఉప్పుచట్టాల్ని ఉల్లంఘించి ఉప్పు తయారుచేశారు ( ఆరోజుల్లో ఎవరంటే వారు ఉప్పు తయారు చేయడానికి వీలులేదు ఉప్పు తయారుచేయటానికి ప్రభుత్వానుమతి పొందాలి తయారుచేసిన ఉప్పుమీద పన్ను కట్టాలి దాన్నే ఉప్పుపన్ను అనేవాళ్ళు ) బ్రిటీషువాళ్ళు రూపొందించిన చట్టాలకింద జీవించడానికి, అంటే బ్రిటీషు పాలనకి భారతీయులు తెలిపిన నిరాకరణకు ఈ చర్య ప్రతీక గాంధీజీ ఇలా ప్రకటించారు :

"భారతదేశంలో బ్రిటిషు పరిపాలన ఈ మహత్తర దేశాన్ని నైతికంగా, భౌతికంగా, సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా భ్రష్టం చేసింది ఈ పాలనని నేను పీడగా పరిగణిస్తాను ఈ ప్రభుత్వ వ్యవస్థని అంతం చెయ్యటానికి నడుం కట్టాను . రాజద్రోహం ఇప్పుడు నా మతం మాది అహింసాయుత సమరం మేం ఎవ్వర్నీ చంపం, కాని ఈ ప్రభుత్వ పీడని తుడిచిపెట్టటం మా ధర్మం".

ఉద్యమం వేగంగా అల్లుకుపోయింది దేశంలో ప్రతిచోటా హర్తాళ్ళు, ప్రదర్శనలు, విదేశ వస్తు బహిష్కరణ ప్రచారం, పన్నుల నిరకారణ లక్షలాది భారత ప్రజలు సత్యాగ్రహాలు చేశారు దేశంలో అనేకచోట్ల రైతులు పన్నులు, గుత్తలు చెల్లించ నిరాకరించారు మహిళలు సైతం ఉద్యమంలో విరివిగా పాల్గొనటం ఒక విశేషం వేలాది మహిళలు వంటిళ్ళుదాటి బైటికొచ్చి సత్యాగ్రహాలు చేశారు విదేశ వస్త్రాలు, మద్యం అమ్మే దుకాణాలముందు పికెటింగు చేశారు ఊరేగింపుల్లో పురుషులతోపాటు భుజం భుజం కలిపి ముందుకు సాగారు

ఉద్యమం భారతదేశ వాయువ్య కొనకు సైతం చేరింది బల, ధైర్యోపేతులైన పఠాన్లను కదిలించింది. "సరిహద్దు గాంధీ"గా ప్రసిద్ధుడైన ఖాన్ అబ్దుల్ గఫర్‌ఖాన్ నాయకత్వంలో పఠాన్లు ఖుదాయ్ ఖిద్మత్ గార్స్ (భగవంతుని సేవకులు) అనే సంస్థని ప్రారంభించారు వాళ్ళనే "రెడ్‌షర్ట్"లు అని జనం వాడుకగా పిలుస్తారు. అహింసా మార్గంలో స్వాతంత్ర్య పోరాటానికి వాళ్ళు ప్రమాణం తీసుకున్నారు ఇదే సమయంలో పెషావర్‌లో ఒక గొప్ప సంఘటన జరిగింది గఢ్‌వాలీ సైనిక పటాలాలు రెండు అక్కడ జరిగిన ప్రజా ప్రదర్శన మీద కాల్పులు జరపడానికి నిరాకరించాయి సైనిక ఉత్తర్వులను ధిక్కరిస్తే సంభవించే ప్రమాదకర పరిణామాలను సైతం వాళ్ళు లెక్కచెయ్యలేదు జాతీయవాదం భారత సైన్యంలోకి కూడా చొచ్చుకు పోసాగిందని ఈ సంఘటన సూచించింది

అదేవిధంగా, జాతీయోద్యమం భారతదేశపు తూర్పు ప్రాంతంలో కొట్టకొనని తాకింది. మణిపూర్ వాసులు ఉద్యమంలో సాహసోపేత పాత్ర నిర్వహించారు. నాగాలండ్ వీరనారి రాణి గైడిన్‌లియూ (Gaidinliu) తన 13వ ఏట గాంధీజీ పిలుపు విని, విదేశ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ధ్వజమెత్తింది ముక్కుపచ్చలారని రాణిని ప్రభుత్వం పట్టుకుని 1932లో యావజ్జీవ కారాగారశిక్ష విధించింది అస్సాంలోని వివిధ చీకటి జైలుగదుల్లో ఆమె యవ్వనకాలం వాడివత్తలై పోయింది. 1947లో భారత

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక, స్వతంత్ర భారత ప్రభుత్వం ఆమెని విడుదల చేసింది జవహర్‌లాల్ నెహ్రూ 1937 లో ఆమెని గురించి ఇలా రాశాడు : "భారతదేశం ఆమెని జ్ఞాపకం చేసుకుని, ప్రియతమురాలుగా ప్రేమించే రోజు ఒకనాడు వస్తుంది."

జాతీయ పోరాటానికి ప్రభుత్వం ఇచ్చే జవాబు ఒకటే- అదే నిర్దాక్షిణ్యపు అణచివేత : లాఠీచార్జీలు, నిరాయుధులైన స్త్రీ పురుషుల మీద విచక్షణారహితమైన కాల్పులు. . గాంధీజీ ఇతర కాంగ్రెస్ నాయకులతో సహా 90 000 మంది సత్యాగ్రహుల్ని ప్రభుత్వం జైళ్ళలో కుక్కింది. కాంగ్రెస్‌ని చట్ట వ్యతిరేక సంస్థగా ప్రకటించింది కఠిన సెన్సారు నిబంధనలు విధించి జాతీయ పత్రికల నోరు నొక్కింది అధికార్ల లెక్కల్ని బట్టి సుమారు 110 మంది పోలీసు కాల్పులకు బలయ్యారు, 300 మందికి పైగా క్షతగాత్రులయ్యారు అనధికార లెక్కల్ని బట్టి ఇంకా ఎందరో మరణించారు, గాయపడ్డారు., ఖద్దరు కట్టినవాణ్ణి, గాంధీ టోపీ పెట్టిన వాణ్ణి పోలీసులు చావమోదారు.

ఈలోగా లండన్‌లో బ్రిటిషు ప్రభుత్వం 1930 లో సైమన్ కమిషన్ నివేదికను చర్చించటానికి రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఆ సమావేశానికి భారతీయ నాయకుల్ని ఆహ్వానించింది. భారత జాతీయ కాంగ్రెస్ ఆ సమావేశాన్ని బహిష్కరించింది ఆ సమావేశ నిర్ణయాలు నిష్ఫలమయ్యాయి

ప్రభుత్వం కాంగ్రెస్‌తో ఒక ఒప్పందానికి రావటానికి ప్రయత్నాలు చేసింది ఆ విధంగానైనా రౌండు టేబులు సమావేశానికి జాతీయ కాంగ్రెస్ నాయకులు హాజరవుతారని ఆశ చివరికి 1931 మార్చిలో లార్డ్ ఇర్విన్, గాంధీజీలు పరస్పరం సంప్రతింపులు జరుపుకొని ఒక ఒప్పందానికొచ్చారు గాంధీ-ఇర్విన్ ఒప్పందం మూలంగా ప్రభుత్వం రాజకీయ ఖైదీలందర్నీ విడుదల చెయ్యటానికి అంగీకరించింది కాంగ్రెస్ సత్యాగ్రహోద్యమాన్ని తాత్కాలికంగా నిలిపి వేసింది రెండవ రౌండ్ టేబులు సమావేశానికి హాజరు కావటానికి కాంగ్రెస్ నాయకులు అంగీకరించారు

గాంధీజీ రెండవ రౌండ్ టేబులు సమావేశంలో పాల్గొనడానికి 1931 సెప్టెంబర్‌లో ఇంగ్లాండు వెళ్ళారు. తక్షణం అధినివేశ ప్రతిపత్తి నిచ్చే ప్రాతిపదిక మీద భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రసాదించడానికి సంబంధించి గాంధీజీ ఎంత గట్టిగా వాదించినప్పటికీ బ్రిటిషు ప్రభుత్వం కాంగ్రెస్ మౌలిక జాతీయ వాంఛితాన్ని నెరవేర్చడానికి అంగీకరించలేదు. గాంధీజీ స్వదేశం తిరిగి వచ్చారు. కాంగ్రెస్ తిరిగి సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించింది.

ఇర్విన్ తర్వాతభారత వైస్రాయిగా వచ్చిన లార్డ్ విల్లింగ్టన్ కాంగ్రెస్‌ని అణచి వెయ్యటానికి పూర్తిగా సిద్ధపడ్డారు. నిజానికి భారతదేశంలో బ్యూరోక్రసీ ఎన్నడూ కనికరం చూపి ఎరుగదు. గాంధీ-ఇర్విన్ ఒప్పంద మీద సంతకాలు జరిగాక ఆంధ్రదేశంలో తూర్పుగోదావరి జిల్లాలో గాంధీ పటం పెట్టుకుని ఊరేగింపు తీసిన జనం మీద పోలీసులు కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో నలుగురు మరణించారు. రౌండ్‌టేబులు సమావేశం విఫలమయ్యాక గాంధీజీతో సహా ఇతర నాయకులంతా తిరిగి అరెస్టయ్యారు. కాంగ్రెస్‌ని చట్టవ్యతిరేక సంస్థగా ప్రభుత్వం ప్రకటించింది. సాధారణ చట్టాలు నిలిపి వేయబడ్డాయి. ప్రత్యేక ఆర్డినెన్సుల ద్వారా పరిపాలన సాగింది. పోలీసులు నగ్న భయోత్పాతం సృష్టించారు. స్వాతంత్ర్య యోధులపైన అనేక కిరాతకాలు జరిపారు సుమారు లక్షలమంది సత్యాగ్రహులు అరెస్టయ్యారు. వేలాది

జాతీయవాదుల స్థిర, చరాస్తుల్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది జాతీయ సాహిత్యం నిషేధించబడింది. జాతీయ దిన పత్రికల పైన మళ్ళీ సెన్సారు నిర్బంధాలు విధించబడ్డాయి

ప్రభుత్వ అణచివేత విధానం చివరికి గెలిచింది భారతీయ నాయకుల్లో మతపరమైన, ఇంకా తదితర సమస్యలపైన విభేదాలు పొడసూపటం వల్ల ప్రభుత్వానికి విజయం చేకూరింది. సత్యాగ్రహోద్యమం క్రమేణా అడుగంటి పోయింది. రాజకీయ ఉత్సాహం, ఉల్లాసం చల్లారిపోయాయి నైరాశ్యం, అధైర్యం ఆవరించాయి కాంగ్రెస్ అధికారికంగా 1933 మేలో ఉద్యమాన్ని నిలిపి వేసింది. గాంధీజీ తిరిగి క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకున్నారు కాంగ్రెస్ సభ్యత్వం అయిదు లక్షల కిందికి దిగజారి పోయింది.

## జాతీయవాద రాజకీయాలు, 1935–1939

***1935 భారత ప్రభుత్వ రాజ్యాంగ చట్టం :*** కాంగ్రెస్ సత్యాగ్రహ సమరంలో తలమున్కలై వున్న సమయంలో మూడవ రౌండ్ టేబులు సమావేశం 1932 నవంబర్‌లో లండన్‌లో ఏర్పాటయింది. కాంగ్రెస్ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కాలేదు. భారతదేశానికి కొత్త రాజ్యాంగ విధానాన్ని ఏర్పాటు చెయ్యాలని ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయ ఫలితంగా 1935 భారత ప్రభుత్వ రాజ్యాంగ చట్టం ఆమోదించ బడింది. ఆ చట్టం భారత ఫెడరల్ (సమాఖ్య) రాజ్యస్థాపన, రాష్ట్రాలకు స్వపరిపాలనా బాధ్యత వగైరాల్ని ప్రతిపాదించింది ఫెడరల్ రాజ్యం బ్రిటిషు ఇండియాలోని అన్ని రాష్ట్రాలు, స్వదేశ సంస్థానాల సమాఖ్య మీద ఆధారపడి వుంటుందని అది నిర్దేశించింది. బ్రిటిషు ఇండియా రాష్ట్ర ప్రతినిధులు, స్వదేశ సంస్థానాల ప్రతినిధులు కూడిన శాసనసభను కేంద్రంలో ఏర్పాటు చేయటానికి నిర్ణయమైంది. కేంద్ర శాసనసభకు సంస్థానాలనుంచి ప్రతినిధుల్ని సంస్థానాధీశులే నిర్దేశిస్తారు రాష్ట్రాల నుంచి ప్రతినిధుల్ని ప్రజలు ఎన్నుకుంటారు. బ్రిటిషు ఇండియా మొత్తం జనాభాలో నూటికి 14 గురికి మాత్రమే ఓటింగు హక్కు ఉంది కేంద్ర శాసనసభకున్న అధికారాలు కూడా నామమాత్రమే. జాతీయ వాద శక్తులకు పోటీగా సంస్థానాధీశులకు శాసనసభలో చోటిచ్చారు రక్షణ, విదేశ వ్యవహారాలు శాసనసభ పరిధికింద ఉండవు. మిగతా విషయాల మీద గవర్నర్ జనరల్‌కు ప్రత్యేకాధికారాలుంటాయి. గవర్నర్ జనరల్, గవర్నర్లను బ్రిటిషు ప్రభుత్వం నియమిస్తుంది వారు బ్రిటిషు ప్రభుత్వానికి మాత్రమే జవాబు దారీగా ఉంటారు.

రాష్ట్రాలకు అధికారాలను పెంచారు. రాష్ట్ర శాసనసభలకు బాధ్యత కలిగిన మంత్రులకు రాష్ట్ర పరిపాలనా శాఖలన్నింటిపైనా కంట్రోలు ఉంటుంది. అయితే గవర్నర్లకు ప్రత్యేకాధికారాలున్నాయి. శాసనసభలు ఆమోదించిన చర్యని గవర్నర్లు వీటో చెయ్యవచ్చు. స్వతంత్రంగా చట్టాలు తేవచ్చు. పైగా ప్రభుత్వోద్యోగ వ్యవస్థ మీద పోలీసు శాఖ మీద వారికి పూర్తి అదుపు ఉంటుంది. ఈ చట్టం జాతీయవాదుల ఆశల్ని, ఆకాంక్షల్ని తృప్తిపర్చలేక పోయింది. ఎంచేతనంటే రాజకీయ, ఆర్థిక అధికారాలు యావత్తు మునుపటి మాదిరిగానే బ్రిటిషు ప్రభుత్వం చేతుల్లో కేంద్రీకృతమై ఉంటాయి. విదేశ పాలన యధాతథంగా కొనసాగుతుంది. మారిందల్లా ప్రజలచేత

ఎన్నుకోబడ్డ కొద్దిమంది మంత్రులు భారతదేశంలోని బ్రిటిషు పరిపాలనా వ్యవస్థలో అదనంగా చేరారు అంతకన్నా ఏమీ లేదు కాంగ్రెసు ఈ చట్టాన్ని నిరసించింది

ఈ చట్టంలోని ఫెడరల్ భాగం అసలు అమలులోకి రాలేదు రాష్ట్రాలకు సంబంధించిన భాగం మాత్రం అమలయింది ఈ చట్టానికి కాంగ్రెస్ తీవ్ర వ్యతిరేకతను ప్రకటించినప్పటికి, ఎన్నికలలో పాల్గొనడానికే నిర్ణయించింది 1935 భారత రాజ్యాంగ చట్టం ప్రజలకు ఎంత అప్రియమైందో బట్టబయలు చెయ్యటానికి కాంగ్రెస్ ఆ విధంగా నిర్ణయం తీసుకుంది జూలై 1937 నాటికి ఎన్నికలు పూర్తయ్యాయి భారత ప్రజానీకంలో అత్యధిక సంఖ్యాకులు కాంగ్రెస్‌నే అభిమానిస్తున్నారని ఆ ఎన్నికలు రుజువు చేశాయి. చాలా రాష్ట్రాలలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలను గెలుచుకుంది కాంగ్రెస్ మంత్రివర్గాలు ఏర్పడ్డాయి.

కాంగ్రెస్ మంత్రులు ఐచ్ఛికంగా తమ వేతనాలను తగ్గించుకొని కేవలం 500 రూపాయలను మాత్రమే స్వీకరించారు ఎక్కువమంది మంత్రులు ఆడంబరాలకు పోక, రైళ్ళలో రెండవ, మూడవ తరగతుల్లోనే ప్రయాణం చేశారు నిజాయితీలో, ప్రజాసేవలో నూతన ప్రమాణాలు నెలకొల్పారు ప్రాథమిక, సాంకేతిక, ఉన్నత విద్యల పట్ల, ప్రజారోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ ప్రదర్శించారు వడ్డీ వ్యతిరేక చట్టాలు, కౌల్దారీ చట్టాలు ప్రవేశపెట్టి రైతాంగానికి గొప్ప మేలు చేకూర్చారు పౌరహక్కుల్ని పునరుద్ధరించారు రాజకీయ ఖైదీలను విడుదల చేశారు. 'పోలీసు, రహస్య శాఖల రాజ్యం' కొంత సడలింది పత్రికలకు అధిక స్వాతంత్ర్యమిచ్చారు కార్మిక సంఘాలకు మునుపటి కన్నా ఎక్కువ స్వేచ్ఛ లభించింది కార్మికుల వేతనాలలో పెంపుదల సాధించుకో గల్గాయి అన్నిటికన్నా మించింది ప్రజల మానసిక తృప్తి ప్రజలకు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామనే భావం కలిగింది. స్వపరిపాలన సాధించామనే సంతృప్తి కలిగింది నిన్నటి జైళ్ళలో మగ్గినవాళ్ళు నేడు సచివాలయాన్ని పాలిస్తున్నారంటే అది గొప్ప విజయం కాదా?

1935-39 సంవత్సరాల మధ్య అనేక ఇతర ముఖ్య రాజకీయ పరిణామాలు సంభవించాయి ఒక విధంగా అవి జాతీయోద్యమంలోను, కాంగ్రెస్‌లోను ఒక కొత్త మలుపు సూచించాయి.

***సోషలిస్టు భావాల వికాసం :*** 1930 ప్రాంతంలో కాంగ్రెస్ లోపలా, బైటా సోషలిస్టు భావాలు బహు వేగంగా వృద్ధి అయ్యాయి 1929లో అమెరికాలో తీవ్ర ఆర్థిక సంక్షోభం ఉత్పతిల్లింది. అది క్రమేణా మిగతా ప్రపంచానికి పాకింది పెట్టుబడిదారీ దేశాల్లో ప్రతిచోటా ఉత్పత్తిలో, విదేశ వాణిజ్యంలో తీవ్ర మాంద్యం వ్యాపించింది ఫలితంగా ఆర్థిక దురవస్థలు, భారీ ఎత్తున నిరుద్యోగం చోటుచేసుకున్నాయి. ఒక దశలో- బ్రిటన్‌లో నిరుద్యోగుల సంఖ్య 30 లక్షలు, జర్మనీలో 60 లక్షలు, అమెరికాలో కోటి ఇరవై లక్షలు. పెట్టుబడి దారీ దేశాల్లో పరిస్థితి ఇలావుంటే, సోవియట్ రష్యాలో పరిస్థితి దానికి పూర్తిగా భిన్నంగా ఉంది అక్కడ సంక్షోభం లేదు సరిగదా రెండు పంచవర్ష ప్రణాళికలు విజయవంతంగా పూర్తయ్యాయి. సోవియట్ పారిశ్రామిక ఉత్పత్తులు నాలుగింతలు పెరిగాయి. ప్రపంచ ఆర్థిక సంక్షోభం పెట్టుబడీ దారీ వ్యవస్థని అప్రతిష్ఠ పాల్జేసింది. ప్రజలదృష్టి మార్క్సిజం, సోషలిజం, ప్రణాళికా బద్ధ ఆర్థిక వ్యవస్థల వేపు మళ్ళింది. ఫలితంగా ప్రజల అధికాధికంగా సోషలిస్టు భావాలవేపు ఆకర్షితులయ్యారు- ముఖ్యంగా యువకులు, కార్మికులు, రైతులు

ఆర్థిక సంక్షోభం భారతదేశంలో రైతుల, కార్మికుల పరిస్థితిని దిగజార్చింది వ్యవసాయోత్పత్తుల ధరలు 1932వ సంవత్సరాంతానికి సగానికి పైగా పడిపోయాయి యజమానులు కార్మికుల కూలి తగ్గించటానికి ప్రయత్నించారు. దేశవ్యాప్తంగా రైతులు భూ సంస్కరణల కోసం, భూమిశిస్తు, కౌలురేట్ల తగ్గింపు కోసం, అప్పుల బాధనుంచి విముక్తి కోసం డిమాండు చేశారు ఫ్యాక్టరీలలో, తోటల్లో పనిచేసే కార్మికులు పని పరిస్థితుల్లోమెరుగుదల కోసం, తమ ట్రేడ్ యూనియన్ హక్కుల గుర్తింపు కోసం గొంతెత్తారు. పట్టణాల్లో ట్రేడ్ యూనియన్లు (కార్మిక సంఘాలు) పల్లెసీమల్లో కిసాన్ సభలు (రైతు సంఘాలు) చకచకా అభివృద్ధి అయ్యాయి. ప్రప్రథమ అఖిల భారత కిసాన్ సభ 1936లో ఆవిర్భవించింది రైతాంగం జాతీయోద్యమంలో ఇతోధిక క్రియాశీల పాత్ర నిర్వహించసాగింది.

కాంగ్రెసు లోపల వామపక్ష ధోరణి జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోసులు కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నిక కావటంలో ప్రతిబింబించింది 1936 లక్నో కాంగ్రెస్ సమావేశంలో నెహ్రూ తన అధ్యక్షోపన్యాసంలో కాంగ్రెస్ సంస్థ సోషలిజాన్ని తన గమ్యంగా ఆమోదించాలని అర్థించారు. కాంగ్రెస్ రైతాంగానికి, కార్మిక వర్గానికి సన్నిహితం కావాలని కోరారు. ముస్లిం ప్రజాబాహుళ్యాన్ని అభివృద్ధి నిరోధక మతతత్వ శక్తుల పలుకుబడి నుండి తప్పించడానికి ఇది ఉత్తమోత్తమ మార్గమని నెహ్రూ భావించారు.

"ప్రపంచ సమస్యల, భారతదేశ సమస్యల పరిష్కారానికి కీలకం సోషలిజంలో ఉందని నాకు నమ్మకం కుదిరింది. నేనీపదాన్ని ఉపయోగిస్తున్నానంటే ఏదో అస్పష్ట మానవతా దృష్టితోకాదు. ఒక శాస్త్రీయమైన, ఆర్థికపరమైన అర్థంలో వాడుతున్నాను. అది మన రాజకీయ సాంఘిక వ్యవస్థలో విస్తృత విప్లవాత్మక మార్పుల్ని చేర్చుతుంది. భూమి, పరిశ్రమల్లో గుత్తప్రయోజనాల్ని అంతమొందిస్తుంది. అంటే ప్రైవేటు ఆస్తికి అంతం (పరిమితార్థంలో తప్ప). వర్తమాన లాభార్జనా విధానాన్ని త్రోసివేసి సహకార సేవా ఉన్నతాదర్శ స్థాపన అని అర్థం. అంతిమంగా మన సహజాతాలలో, అలవాట్లలో, కోరికల్లో ఒక మార్పు అని అర్థం. క్లుప్తంగా చెప్పాలంటే సోషలిజం వర్తమాన పెట్టుబడిదారీ వ్యవస్థకి సమూలంగా భిన్నమైన ఒక వినూతన నాగరికత అని అర్థం".

కాంగ్రెస్ వెలుపల సోషలిస్టు ధోరణులు పి.సి.జోషి నాయకత్వంలో కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధికి దారితీశాయి ఆచార్య నరేంద్రదేవ్, జయప్రకాశ్ నారాయణ్‌ల నాయకత్వంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నిర్మాణానికి దారి తీశాయి. 1938లో గాంధీజీ వ్యతిరేకించినా సుభాష్ చంద్రబోస్ తిరిగి కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. గాంధీ వ్యతిరేకతవల్ల, వర్కింగ్ కమిటీలో గాంధీజీ అనుయాయుల వైముఖ్యం వల్ల సుభాష్ చంద్రబోస్ 1939లో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా ఇవ్వవలసి వచ్చింది అయినా, అంతా ఆయన వామపక్ష అనుయాయులు కలిసి ఫార్వర్డ్ బ్లాక్ అనే కొత్త పార్టీని ప్రారంభించారు.

**కాంగ్రెస్ – ప్రపంచ వ్యవహారాలు:** 1935-1939 సంవత్సరాల మధ్యకాలంలో కాంగ్రెసు ప్రపంచ వ్యవహారాలలో ఇతోధిక శ్రద్ధ తీసుకోవడం రెండవ ముఖ్య పరిణామం. కాంగ్రెసు 1885లో అవతరించిన నాటి నుంచి ఆసియా, ఆఫ్రికాలలో బ్రిటిషు ప్రయోజనాలకోసం భారత సైన్యాన్ని, భారత ఆర్థిక వనరుల్ని

వినియోగించటాన్ని ప్రతిఘటిస్తూనే ఉంది. అది సామ్రాజ్యవాద విస్తరణను వ్యతిరేకించే ప్రాతిపదికమీద క్రమేపి విదేశాంగ విధానాన్ని రూపొందించుకొంది. జవహర్‌లాల్ నెహ్రూ భారత జాతీయ కాంగ్రెసు తరఫున 1927 ఫిబ్రవరిలో బ్రసెల్స్‌లో జరిగిన పీడిత జాతుల కాంగ్రెసుకు హాజరయ్యాడు. పాశ్చాత్య రాజ్యాల ఆర్థిక, రాజకీయ సామ్రాజ్యవాదం కింద అణగారిపోయిన ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాల నుండి వచ్చిన రాజకీయ ప్రవాసితులు, విప్లవకారులు కలిసి పీడిత జాతుల కాంగ్రెసును ఏర్పాటు చేశారు. యూరప్‌కు చెందిన అనేక మంది వామపక్ష మేధావులు, రాజకీయ నాయకులు కూడా అందులో చేరారు ఈ కాంగ్రెసులో ఆవిర్భవించిన సామ్రాజ్యవాద వ్యతిరేక లీగుకార్యనిర్వాహక మండలి సభ్యుడుగా నెహ్రూ ఎన్నికయ్యాడు 1927 లో మద్రాసులో జరిగిన భారత జాతీయ కాంగ్రెసు సమావేశంలో ప్రసంగిస్తూ సామ్రాజ్యవాద లక్ష్యసిద్ధికి బ్రిటన్ తలపడే ఏ యుద్ధంలోనూ భారతదేశం బ్రిటన్‌కు మద్దతు ఇవ్వబోదని ఆయన స్పష్టం చేశాడు.

1930 ప్రాంతంలో కాంగ్రెసు సంస్థ ప్రపంచంలో ఎక్కడగాని సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా గట్టి వైఖరి తీసుకుంది ఆసియా, ఆఫ్రికా దేశాల జాతీయోద్యమాలను బలపర్చింది. ఆ రోజుల్లో ఇటలీ, జర్మనీ, జపాన్ దేశాల్లో బలపడుతున్న ఫాసిజాన్ని తీవ్రంగా ఖండించింది ఇథియోపియా, స్పెయిన్, చెకొస్లొవేకియా, చైనా ప్రజలు ఫాసిస్టు శక్తుల దురాక్రమణకు వ్యతిరేకంగా జరుపుతున్న పోరాటాలను సంపూర్ణంగా బలపర్చింది జపాను 1937 లో చైనాపై దురాక్రమణ జరిపినప్పుడు జాతీయ కాంగ్రెసు "చైనా ప్రజలపట్ల సానుభూతికి గుర్తుగా భారత ప్రజలు జపాన్ వస్తువులను బహిష్కరించవలసింది"గా ఒక తీర్మానం ఆమోదించింది 1938లో జాతీయ కాంగ్రెసు చైనా సాయుధ దళాలకు సహాయంగా డా. యమ్. అతల్ ఆధ్వర్యంలో ఒక వైద్య బృందాన్ని చైనాకు పంపింది. అమరజీవి డా. ద్వారకానాథ కోట్నీస్ ఆ బృందంలో ఒక సభ్యుడు

భారతదేశ భవిష్యత్తు ఫాసిజానికి – స్వాతంత్ర్యం, సామ్యవాదం, ప్రజాస్వామ్యాల శక్తులకు మధ్య రానున్న సంఘర్షణతో అతి సన్నిహితంగా ముడిపడివుందని జాతీయ కాంగ్రెసు సంపూర్ణంగా గ్రహించింది 1936 లక్నో కాంగ్రెసు సమావేశంలో జవహర్‌లాల్ నెహ్రూ తన అధ్యక్షోపన్యాసంలో భారత ప్రజల పోరాటం ప్రపంచంలో స్వాతంత్ర్యం కొరకు సాగే ఇంకా చాలా విస్తృతమైన పోరాటంలో ఒక భాగం మాత్రమే అని పేర్కొన్నాడు. ఫాసిజం, సామ్రాజ్యవాదం ఆనాడు చీడబట్టి చివికిపోతున్న పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క రెండు ముఖాలని ఆయన వర్ణిస్తూ, పశ్చిమ దేశాల్లో సోషలిజం, తూర్పు దేశాల్లో ఉప్పొంగే జాతీయవాదం కలిసి ఫాసిజం, సామ్రాజ్యవాదాల కలయికని ప్రతిఘటిస్తాయని ఉద్ఘాటించాడు.

సామ్రాజ్యవాద రాజ్యాల మధ్య ఏ యుద్ధంలోనైనా బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం పాల్గొనడాన్ని కాంగ్రెసు ప్రతిఘటిస్తుందని నొక్కి చెప్తూ, నెహ్రూ "ప్రపంచ ప్రగతిశీల శక్తులకు, స్వాతంత్ర్యం కోసం రాజకీయ, సామాజిక బంధనాల్ని తెంచి వెయ్యటంకోసం నిలబడ్డ శక్తులకు" పూర్తి మద్దతు ప్రకటించాడు ఎందుకంటే "సామ్రాజ్యవాదానికి, ఫాసిస్టు ప్రగతి నిరోధకత్వానికి వ్యతిరేకంగాసాగే వారి పోరాటంలో మన పోరాటం అందరికీ సంబంధించిన ఒకే ఉమ్మడి పోరాటం అని మనం అనుభూతి పొందుతాం" అన్నాడాయన

***సంస్థాన ప్రజల పోరాటం:*** ఇదే కాలంలో జాతీయోద్యమం స్వదేశ సంస్థానాలకు వ్యాపించటం మూడవ ముఖ్య పరిణామం చాలా సంస్థానాలలో దారుణమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులు రాజ్యం చేస్తున్నాయి. రైతులు అణగారిపోయారు భూమి శిస్తు, పన్నులు మోయలేని బరువుగా తయారయ్యాయి. విద్యా వ్యాప్తి స్తంభించిపోయింది. ఆరోగ్యం, తదితర సామాజిక సేవా కార్యక్రమాలు చాలా వెనుకబడి ఉన్నాయి. పత్రికా స్వాతంత్ర్యం, ఇతర పౌరహక్కులు దాదాపు లేవు సంస్థానాల రాబడిలో అత్యధికభాగం సంస్థానాధీశుల విలాసవైభోగాల కింద చెల్లిపోతోంది. చాలా సంస్థానాలలో బానిసత్వం, వెట్టిచాకిరీ పెరిగిపోయాయి రాజ్యంతో తిరుగుబాటు వస్తుందనే భయంగానీ, బైటినుంచి దురాక్రమణ జరుగుతుందనే భీతిగానీ లేకుండా చేశారు బ్రిటిషు పాలకులు కాబట్టి స్వదేశ సంస్థానాధీశులు ఎంతటి తప్పుడు పరిపాలన సాగించటానికైనా వెనుదియ్యటం లేదు

పైగా బ్రిటిషు అధికారవర్గం జాతీయ సమైక్యతా వికాసాన్ని అడ్డగించటానికి, ఉప్పొంగే జాతీయోద్యమ వెల్లువకి అడ్డుకట్టవెయ్యటానికి సంస్థానాధీశుల్ని వాడుకోసాగింది. ప్రజల తిరుగుబాట్ల నుంచి స్వీయరక్షణ చేసుకోడానికి సంస్థానాధీశులు బ్రిటిషు రాజ్యం ఇచ్చే రక్షణమీద ఆధారపడివున్నారు కాబట్టి వాళ్ళు జాతీయోద్యమంపట్ల శత్రుభావం పూనారు 1921లో సంస్థానాధీశుల సమాఖ్య ఒకటి సృష్టి అయ్యింది. తద్వారా సంస్థానాధీశులంతా కలుసుకుని బ్రిటిషువారి మార్గదర్శకత్వంలో ఉమ్మడి సమస్యల్ని చర్చించుకోడానికి వీలయింది 1935 భారత రాజ్యాంగచట్టంలో ప్రతిపాదితమైన సమాఖ్య రాజ్యం జాతీయవాద శక్తుల్ని నిరోధించే రీతిలో రూపొందించబడింది. ఎగువసభలో అయిదింట రెండుపంతుల స్థానాలు, దిగువ సభలో మూడవ వంతు స్థానాలు సంస్థానాధీశులకు కట్టబెట్టాలని ఆ చట్టం ప్రతిపాదించింది.

అనేక స్వదేశ సంస్థానాల్లో ప్రజలు ప్రజాస్వామిక హక్కులకోసం, ప్రజా ప్రభుత్వాల కోసం ఉద్యమాలు నిర్మించసాగారు. 1927 డిశంబరునాటికే 'అఖిల భారత సంస్థాన ప్రజాసభ' ప్రారంభమైంది ముఖ్యంగా రాజ్‌కోట, జైపూర్, కాశ్మీర్, హైదరాబాద్, తిరువాన్కూర్ సంస్థానాలలో ప్రజాపోరాటాలు ముమ్మరమయ్యాయి. సంస్థానాధీశులు ఈ పోరాటాలపైన తీవ్ర హింసాకాండ ప్రయోగించారు. కొంతమంది మతతత్వాన్ని చేటుచేసుకున్నారు. నిజాం నవాబు ప్రజాందోళనని ముస్లిం వ్యతిరేక ఉద్యమంగా చిత్రించారు. కాశ్మీరు మహారాజా అక్కడి ప్రజాపోరాటంపైన హిందూ వ్యతిరేక ముద్రవేశారు. తిరువాన్కూరు మహారాజా తన సంస్థాన ప్రజాందోళన వెనక క్రైస్తవుల హస్తం ఉందని నిందించారు.

జాతీయ కాంగ్రెసు సంస్థాన ప్రజల పోరాటాలను బలపర్చింది. ప్రజా ప్రాతినిధ్య ప్రభుత్వాలను ప్రవేశపెట్టమని, ప్రాథమిక పౌర హక్కుల్ని ప్రసాదించమని జాతీయ కాంగ్రెస్ సంస్థానాధీశులకు విజ్ఞప్తి చేసింది. 1938లో కాంగ్రెసు తన స్వాతంత్ర్య గమ్యాన్ని నిర్వచించినప్పుడు, స్వదేశ సంస్థానాల స్వాతంత్ర్యాన్ని కూడా అందులో చేర్చింది. భారతదేశంలోను, స్వదేశ సంస్థానాలలోను రాజకీయ పోరాటాల జాతీయ ఉమ్మడి లక్ష్యాల ప్రాధాన్యాన్ని ప్రదర్శించడానికా అన్నట్లు 1939లో నెహ్రూ అఖిలభారత సంస్థాన ప్రజాసభకు అధ్యక్షుడయ్యారు. సంస్థాన ప్రజల ఉద్యమం

వివిధ సంస్థాన ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని మేల్కొల్పింది. అది దేశవ్యాప్తంగా ఒక నూతన సమైక్యతా చైతన్యాన్ని వ్యాపింపజేసింది.

**మతతత్వం అభివృద్ధి:** మతతత్వం పొటమరించటం నాల్గవ ముఖ్య పరిణామం. పరిమిత ఓటింగు హక్కు, ప్రత్యేక నియోజకవర్గాల ప్రాతిపదికపైన రాష్ట్ర శాసనసభలకు జరిగిన ఎన్నికలు వేర్పాటు భావాలను సృష్టించాయి. అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేకంగా కేటాయించబడ్డ నియోజకవర్గాలలో కాంగ్రెస్ ఎక్కువస్థానాలను గెల్చుకోలేకపోయింది. ముస్లిములకు ప్రత్యేకించబడ్డ మొత్తం 482 స్థానాల్లో కాంగ్రెస్ కేవలం 26 స్థానాల్లో విజయం సాధించింది. అందులో 15 స్థానాలు వాయువ్య సరిహద్దు రాష్ట్రంలో సాధించినవే. జిన్నా నాయకత్వంలో ముస్లింలీగు కాంగ్రెసుకు బద్ధశత్రువుగా మారింది. అది ముస్లిం అల్పసంఖ్యాకవర్గం ప్రమాదంలో పడిపోయిందని కాకిగోల ప్రారంభించింది. అధిక సంఖ్యాకులైన హిందువులు అల్పసంఖ్యాకులైన ముస్లిములను మింగివేస్తారని ప్రచారం చేసింది. హిందువులు, ముస్లిములు రెండు వేర్వేరు జాతులనే ఒక అశాస్త్రీయ, అచారిత్రక సిద్ధాంతాన్ని ప్రతిపాదించి ఆ ఉభయజాతులు ఎన్నడూ కలిసి జీవించలేవని ప్రచారం చేసింది. అది 1940లో దేశవిభజనని డిమాండుచేస్తూ ఒక తీర్మానం ఆమోదించింది. ముస్లిముల కొరకు ఒక ప్రత్యేక రాజ్యం అవతరించాలని, స్వాతంత్ర్యానంతరం అది 'పాకిస్థాన్' అని వ్యవహరింపబడుతుందని ఆ తీర్మానం పేర్కొంది.

హిందువులలో హిందూ మహాసభవంటి మతతత్వ సంస్థల ఉనికి ముస్లింలీగు ప్రచారానికి లాభించింది. ముస్లింలీగు ప్రచారం సాగించిన పక్కాలోనే హిందూ మహాసభ కూడా అల్పసంఖ్యాక వర్గాలకు సముచిత భద్రతలు కల్పించడాన్ని ప్రతిఘటించింది. ఒక విధంగా హిందూ మతతత్వం మరీ సమర్థనీయం కాదు. ఎంచేతనంటే - ప్రతి దేశంలో మత, భాషా, జాతీయ అల్పసంఖ్యాక వర్గాలు తమ తక్కువ సంఖ్యాబలాన్ని బట్టి ఏదో ఒక దశలో ఎప్పుడో ఒకప్పుడు తమ సామాజిక, సాంస్కృతిక ప్రయోజనాలు దెబ్బతినవచ్చునేమో అని భయపడ్డారు. అయితే అధిక సంఖ్యాకవర్గం వాచా, క్రియా అటువంటి భయాలకు తావులేదని నిరూపించినప్పుడు అల్పసంఖ్యాకుల భయాలు అదృశ్యమై పోయాయి. కాని అధిక సంఖ్యాకవర్గంలోని ఒక భాగం మతతత్వ పూరితంగా తయారై, అల్పసంక్యాకవర్గాలకు వ్యతిరేకంగా మాట్లాడ్డం, ప్రవర్తించటం ప్రారంభిస్తే అప్పుడు వాళ్ళు తమకు రక్షణలేదని భావించటం కద్దు. అల్పసంఖ్యాక వర్గాల్లో మతతత్వవాదుల నాయకత్వం మరింత బలపడుతుంది. ఉదాహరణకు 1930 ప్రాంతంలో ముస్లిములు చాలా తక్కువగా ఉన్నచోట్ల ముస్లింలీగు బలంగా ఉంది. మరోచెంప ముస్లిములు ఎక్కువ సంఖ్యలో ఉన్న వాయువ్య సరిహద్దు రాష్ట్రం, పంజాబ్, సింధు, బెంగాల్‌లలో ముస్లింలీగు బలహీనంగా ఉండిపోయింది. ఇక్కడ ఆసక్తికరమైన విశేషమేమంటే హిందూ, ముస్లిం మతతత్వవాదులుభయులూ కాంగ్రెసుకు వ్యతిరేకంగా చేతుల కలపటానికి వెనుకాడలేదు. వాయువ్య సరిహద్దు రాష్ట్రంలో, పంజాబ్, సింధు, బెంగాల్ రాష్ట్రాల్లో హిందూ మతతత్వవాదులు కాంగ్రెసుకు వ్యతిరేకంగా ముస్లింలీగు, తదితర మతపరమైన గ్రూపులు మంత్రివర్గాలను ఏర్పరచటానికి సహాయపడ్డారు. ఈ వివిధ మతతత్వ గ్రూపులు సమానంగా పంచుకున్న మరొక లక్షణమేమంటే వీరంతా ప్రభుత్వానుకూల వైఖరులు తీసుకున్నారు. హిందూ, ముస్లిం జాతీయతల్ని గురించి కబుర్లుచెప్పిన మతతత్వ

పార్టీలేవీ విదేశ పరిపాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో క్రియాశీల పాత్ర వహించుకోలేదు. వాళ్ళు ఇతర మతాలకు చెందిన ప్రజల్ని, జాతీయనాయకుల్ని తమ నిజమైన శత్రువులుగా భావించారు

ఈ మతతత్వవాద పార్టీలు, గ్రూపులు సామాన్య ప్రజల సామాజిక, ఆర్థిక డిమాండ్లకేసి మొహం తిప్పుకున్నాయి. జాతీయోద్యమం ఒక్కటే వాటిని గురించి గట్టిగాపట్టించుకుని పోరాడింది. ఈ సందర్భంలో అవి అధికాధికంగా ఉన్నతవర్గాల గుత్త ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చాయి ఎన్నడో 1933లోనే జవహర్‌లాల్ నెహ్రూ చెప్పారు "హిందువుల, ముస్లిముల, తదితర్ల తరఫున నివేదించిన వివిధ మతపరమైన డిమాండ్లను విమర్శనాత్మకంగా పరిశీలించినట్లయితే వాళ్ళకి ప్రజాసామాన్యంతో నిమిత్తం లేదనేది బైటపడుతుంది" అని

***రెండవ ప్రపంచ యుద్ధకాలంలో జాతీయోద్యమం:*** రెండవ ప్రపంచయుద్ధం 1939 సెప్టెంబరులో ప్రారంభమైంది. నాజీ జర్మనీ, పోలండు మీద దండెత్తింది అంతకుముందే హిట్లర్ 1938 మార్చిలో ఆస్ట్రియాను, 1939 మార్చిలో చెకొస్లొవేకియాను ఆక్రమించాడు హిట్లర్‌ని బుజ్జగించాలని ప్రయత్నించిన బ్రిటన్, ఫ్రాన్సులు పోలండ్ సహాయార్థం వెళ్ళక తప్పలేదు బ్రిటిషు ఇండియా ప్రభుత్వం కనీసం జాతీయ కాంగ్రెస్‌తో గాని, కేంద్ర శాసనసభకు ఎన్నికైన సభ్యుల్తోగాని మాట మాత్రమైనా చెప్పకుండా తక్షణం యుద్ధంలోకి దూకింది.

జాతీయ కాంగ్రెస్‌కు ఫాసిస్టు దురాక్రమణకు గురయిన ప్రజలపట్ల సంపూర్ణ సానుభూతి ఉంది. ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడే ప్రజాస్వామ్య శక్తులకు మద్దతివ్వడానికి సర్వసంసిద్ధంగా ఉంది అయితే కాంగ్రెస్ నాయకులు ఒక్కప్రశ్న అడిగారు బానిససంకెళ్ళలో ఉన్న ఒకజాతి స్వాతంత్ర్యంకోసం పోరాడే ఇతర ప్రజలకు సాయపడ్డం ఎలా సాధ్యపడుతుంది? అంచేత భారతదేశానికి స్వతంత్ర్యం ప్రకటించమని వాళ్ళు డిమాండు చేశారు భారతదేశం యుద్ధంలో చురుగ్గా పాల్గొనడానికి ముందు, కనీసం భారతీయుల చేతుల్లో సార్థకమైన అధికారాలైనా ఉంచండని వాళ్ళడిగారు. బ్రిటిషు ప్రభుత్వం ఈ డిమాండును నిరాకరించింది కాంగ్రెస్ తన మంత్రివర్గాలను రాజీనామా చెయ్యమని ఆదేశించింది. 1940 అక్టోబరులో గాంధీజీ ఒక పరిమిత సత్యాగ్రహానికి పిలుపిచ్చారు. ఉధృత ప్రజోద్యమం గనక విజృంభిస్తే బ్రిటిషు యుద్ధ కృషి చిక్కుల్లో పడుతుందేమోనన్న శంకతో గాంధీజీ తను ఎంపిక చేసుకున్న వ్యక్తులతోనే పరిమిత సత్యాగ్రహోద్యమానికి పిలుపిచ్చారు. తన సత్యాగ్రహోద్యమ లక్ష్యాలను వివరిస్తూ ఆయన వైస్రాయికి ఒక లేఖ రాశారు.

"నాజీజం విజయానికి ఏ బ్రిటిషు పౌరుడైనా ఎంత విముఖుడో, కాంగ్రెస్ కూడా అంత విముఖం. కాని దాన్ని యుద్ధంలో పాల్గొనేటంత దూరం తీసుకుపోలేం. మీరూ, భారతరాజ్య కార్యదర్శి కలిసి యావత్తు భారతదేశం స్వచ్ఛందంగా యుద్ధ కృషిలో తోడ్పడుతున్నట్లుగా ప్రకటించారు కాబట్టి, వివరణ ఇవ్వటం అవసరం. భారత ప్రజానీకంలో అత్యధిక భాగానికి మీ యుద్ధ కృషిలో ఎటువంటి ఆసక్తిలేదు. నాజీజానికి, ఇండియాని పాలించే ద్విగుణీకృత నిరంకుశత్వానికి మధ్య వాళ్ళు తేడా చూడరు" అని ఆయన లేఖలో రాశారు.

1941లో ప్రపంచ రాజకీయాల్లో రెండు పెద్ద మార్పులు సంభవించాయి. పోలండ్,

బెల్జియం, హాలెండ్, నార్వే, ఫ్రాన్సు, తూర్పు యూరప్‌లని ఆక్రమించుకున్న నాజీ జర్మనీ 1941 జూన్ 22న సోవియట్ యూనియన్‌పైన దాడి చేసింది. డిశంబర్ 7న జపాను పెరల్ హార్బరులో అమెరికా నౌకాశ్రేణిపైన మెరుపుదాడి జరిపింది. యుద్ధంలో జర్మనీ, ఇటలీలతో చేరిపోయిన జపాను సుడిగాలిలా ఫిలిప్పైన్స్, ఇండోచైనా, ఇండొనేషియా, మలయా, బర్మాల్ని పడగొట్టింది. 1942 మార్చిలో రంగూన్‌ని ఆక్రమించుకుంది. దాంతో యుద్ధం భారతదేశం గుమ్మంలోకి వచ్చిపడింది.

ఇప్పుడు బ్రిటిషు ప్రభుత్వం యుద్ధ కృషిలో భారతీయుల క్రియాశీల సహకారం కోసం కాళ్ళావేళ్లా పడింది. ఈ సహకార సాధనకోసం అది 1942 మార్చిలో బ్రిటిషు మంత్రివర్గ సభ్యుడైన సర్ స్టాఫర్డ్‌క్రిప్సు అధ్వర్యంలో ఒక రాయబార వర్గాన్ని భారతదేశానికి పంపింది. అయన పూర్వం బ్రిటిషు లేబర్ పార్టీలో రాడికల్ సభ్యుడు. భారత జాతీయోద్యమానికి గట్టి మద్దతుదారు. అయన భారతదేశంలో బ్రిటిషు వారి విధానం యొక్క లక్ష్యం "సాధ్యమైనంత సత్వరం స్వపరిపాలన ప్రసాదించటమే"నని నచ్చజెప్పాడుగాని అయనకు - కాంగ్రెసు నాయకులకు మధ్య నడచిన సమగ్ర సంప్రతింపులు విఫలమయ్యాయి. తక్షణం అధికార బదిలీ జరగాలన్న కాంగ్రెసు డిమాండును బ్రిటిషు ప్రభుత్వం నిరాకరించింది. ప్రస్తుతం నిరంకుశాధికారాలన్నీ వైస్రాయి తన చేతుల్లో ఉంచుకొని, ఎన్నడో భవిష్యత్తులో అధికారం బదిలీ చేస్తామని కేవలం వాగ్దానాలు మాత్రమే చెయ్యటం కాంగ్రెస్ నాయకుల్ని సంతృప్తిపర్చలేదు. క్రిప్సు రాయబారం విఫలమైపోయింది. జపాను సైన్యాలు గడపలోకొచ్చి ఉన్నాయన్న అదుర్దాలో యుద్ధకృషికి తోడ్పాటు ఇద్దామని కాంగ్రెసనుకుంది. కాని దేశంలో ఒక జాతీయ ప్రభుత్వం ఏర్పాటైనప్పుడే అటువంటి తోడ్పాటు ఇవ్వగలమని కాంగ్రెసు నాయకులు భావించారు.

క్రిప్స్ రాయబార వైఫల్యం భారత ప్రజలకి తీవ్ర అసంతృప్తి కలిగించింది. భారతీయుల స్వాతంత్ర్య వాంఛను బ్రిటిషు వారిచేత ఒప్పించటానికి చురుగ్గా పనిచెయ్యాలని కాంగ్రెస్ నిర్ణయించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 1942 అగస్టు 8న బొంబాయిలో సమావేశమైంది. ఆ సమావేశంలో చరిత్ర ప్రసిద్ధమైన "క్విట్ ఇండియా" తీర్మానం ఆమోదించబడింది. గాంధీజీ నాయకత్వాన ఒక అహింసాయుత ప్రజాపోరాటాన్ని ప్రారంభించాలని నిర్ణయం జరిగింది.

కాంగ్రెసు ఉద్యమాన్ని ప్రారంభించకముందే ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకుంది. అగస్టు 9 తెల్లవారుజామున గాంధీజీతో సహా కాంగ్రెసు నాయకులంతా అరెస్టయ్యారు. కాంగ్రెసు నిషేధించబడింది.

నాయకుల అరెస్టు వార్త ప్రజల్ని నిశ్చేష్టుల్ని చేసింది. మరుక్షణం దేశవ్యాప్తంగా నిరసనోద్యమాలు లేచాయి. ప్రజల హృదయాల్లో మూసుకుపోయిన ఆగ్రహం కట్టలు తెంచుకుంది. నడిపించే నాయకుడు లేక, సంస్థలేక దిక్కుతోచని ప్రజలు తమకుతోచిన రీతిలో తెగబడ్డారు. దేశమంతటా హర్తాళ్ళు, ఫ్యాక్టరీల్లో సమ్మెలు, విద్యాలయాల బహిష్కరణ, ఊరేగింపులు, ప్రదర్శనలు లేచాయి; పోలీసులు లాఠీచార్జీలు చేశారు, కాల్పులు జరిపారు. అణచివేతతో రెచ్చిపోయిన జనం హింసాచర్యలకు పాల్పడ్డారు. బ్రిటిషు అధికారానికి సంకేతాలైన పోలీసు స్టేషన్లు, పోస్టాఫీసులు, రైల్వే స్టేషన్లమీద ప్రజలు దాడిచేశారు, టెలిగ్రాఫ్, టెలిఫోను తీగెలు తెంపారు, రైలుపట్టాలు పీకేశారు. ప్రభుత్వ భవనాలను తగలబెట్టారు. మద్రాసు,

బెంగాలులలో ఈ విధ్వంసకాండ మితిమీరి జరిగిపోయింది చాలాచోట్ల తిరుగుబాటుదార్లు అనేక బస్తీల్ని, పట్టణాల్ని, గ్రామాల్ని, తాత్కాలికంగా వశంచేసుకున్నారు ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా, ఆంధ్ర, మద్రాసు, మహారాష్ట్రలలో కొన్ని ప్రాంతాలలో బ్రిటిషు అధికారం తాత్కాలికంగా అదృశ్యమైంది విప్లవకారులు 'సమానాంతర ప్రభుత్వాలు' నెలకొల్పారు విస్తారంగా విద్యార్థులు, కార్మికులు, రైతాంగం 'తిరుగుబాటు'కు వెన్నెముక అయ్యారు ఉన్నతవర్గాలు, బ్యూరోక్రసీ ప్రభుత్వానికి విధేయంగా ఉన్నారు

ఇక ప్రభుత్వం 1942 ఉద్యమాన్ని కాలరాచివేయటానికి బరితెగించింది అవధులులేని ప్రభుత్వ హింసాకాండ ప్రజ్వరిల్లింది పత్రికల నోళ్ళకు చిక్కాలు పడ్డాయి. జైళ్ళలో ఖైదీలు చిత్రహింసలకు గురయ్యారు పోలీసులు, గూఢచారులు విశృంఖలంగా రాజ్యం చేశారు సైన్యం అనేక బస్తీల్ని, పట్టణాల్ని అదుపులోకి తీసుకుంది. పోలీసు, మిలిటరీ కాల్పుల్లో 10,000 మంది మరణించారు తిరుగుబాటు చేసిన గ్రామాలు భారీ జరిమానాలు భరించవలసి వచ్చింది గ్రామస్థుల్ని సామూహికంగా పేముబెత్తాలతో బాదమోదారు 1857 తిరుగుబాటు తరువాత భారతదేశం అటువంటి దారుణ అణచివేతని చూడలేదు.

చిట్టచివరికి ప్రభుత్వం ఉద్యమాన్ని అణచివేయగలిగింది 1942 తిరుగుబాటు స్వల్పకాలిక మైంది అయితే అది జాతి ఆవేదనలోతుల్ని, ప్రజల పోరాటపటిమని, త్యాగశీలాన్ని బహిర్గతం చేసింది

1942 తిరుగుబాటు అణగిపోయాక 1945లో యుద్ధం ముగిసినప్పటిదాకా దేశంలో ఏ రాజకీయ కార్యకలాపాలు లేవు మొదటినుంచి ఉద్యమాన్ని నడిపిన నాయకులు కటకటాల వెనుక మగ్గుతున్నారు. వాళ్ళస్థానాన్ని భర్తీచేసే కొత్తనాయకులు కనిపించలేదు 1943లో బెంగాల్‌లో భయంకర క్షామం విలయతాండవం చేసింది 30 లక్షలమందికిపైగా ఆకలితో మాడి ప్రాణాలు విడిచారు. ప్రభుత్వం సకాలంలో మేల్కొంటే అంతటి ప్రాణనష్టం జరిగివుండేది కాదు బెంగాల్ కరువు రక్కసి మారణహోమాన్ని నిరోధించనందుకు ప్రజలు ప్రభుత్వంపట్ల కోపోద్రిక్తులయ్యారు కాని ఆ కోపం ఏ రాజకీయ రూపంలోనూ వ్యక్తంకాలేకపోయింది

జాతీయోద్యమం దేశ సరిహద్దుల కావల ప్రస్ఫుటమైంది సుభాష్ చంద్రబోస్ 1941 మార్చిలో ఇండియా నుంచి తప్పించుకుని జర్మనీ వెళ్ళారు 1943 ఫిబ్రవరిలో జపాన్ చేరుకున్నారు. జపానువారి సహాయంతో బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ యుద్ధాన్ని సాగించటం ఆయన ఆశయం సింగపూర్‌లో ఆయన అజాద్ హింద్ ఫౌజ్ (స్వతంత్ర భారత సైన్యం) నిర్మించారు. బ్రిటిషు సైన్యంలో పనిచేసిన భారతీయ సిపాయిలు, ఆగ్నేయ ఆసియా దేశాల్లో నివసించే భారతీయులు, మలయా, సింగపూర్ బర్మాలలో జపానుకు యుద్ధ ఖైదీలుగా చిక్కిన బ్రిటిషు ఇండియా సిపాయిలు, ఇంకెందరో స్వాతంత్ర్యావేశపరులు అజాద్ హింద్ ఫౌజ్‌లో చేరారు. సైనికులంతా ఆయనని నేతాజీ అని ప్రేమపూర్వకంగా పిలిచారు. 'జైహింద్' అని రణన్నినాదాన్ని ఇచ్చింది. సుభాష్ చంద్రబోస్ బర్మానుండి భారతదేశంవేపు పురోగమించే జపాను సైన్యాలతో కలిసి అజాద్ హింద్ ఫౌజ్ స్వదేశ విముక్తికి బయల్దేరింది. 1944-45లో యుద్ధంలో జపానుకు చావుదెబ్బ తగలటంతో, అజాద్ హింద్ ఫౌజ్ కూడా పడిపోయింది. సుభాష్ చంద్రబోసు టోకియోకు వెళ్తూ విమాన

ప్రమాదంలో దుర్మరణం పొందాడు ఫాసిస్టు శక్తులతో కుమ్మక్కయి భారత స్వాతంత్ర్యాన్ని సాధించదలచిన ఆయన వ్యూహాన్ని, ఆయనని ఆనాడు చాలామంది భారతీయ నాయకులు తీవ్రపదజాలంతో నిందించారు కాని ఆజాద్ హింద్ ఫౌజ్‌ని నిర్మించటం ద్వారా ఆయన భారత ప్రజలకు, భారత సైనికులకు దేశభక్తి రూపుదాల్చిన ఉత్తేజకర ఆదర్శమూర్తి అయ్యాడు అందుకనే ఆయనని యావత్ భారతదేశం 'నేతాజీ' అని జయజయధ్వానాలు చేసింది

***యుద్ధానంతరం జాతీయపోరాటం:*** 1945 ఏప్రిల్‌లో యూరప్‌లో యుద్ధం ముగియటంతో, భారత స్వాతంత్ర్య పోరాటం ఒక నూతన దశలో ప్రవేశించింది 1942 తిరుగుబాటు, ఆజాద్ హింద్ ఫౌజు భారత ప్రజల వీరతని, దీక్షని వెల్లడిచేశాయి జాతీయ నాయకులు జైళ్ళనుంచి విడుదల కావటంతో ప్రజలు తుది స్వాతంత్ర్య పోరాటరూపం కోసం ఎదురుచూశారు

నూతన పోరాటం ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికులు, అధికార్ల విచారణకు వ్యతిరేకంగా ఒక బ్రహ్మాండమైన ప్రజా ఉద్యమ స్వరూపం తీసుకుంది వెనక బ్రిటీషు ఇండియా సైన్యంలో పనిచేసిన జనరల్ షానవాజ్ గురుదయాళ్ సింగ్ ధిల్లన్, ప్రేమ్ సింగులను ఢిల్లీ ఎర్రకోటలో విచారించటానికి ప్రభుత్వం నిర్ణయించింది బ్రిటీషు చక్రవర్తికి చేసిన విధేయతా ప్రమాణాన్ని ఉల్లంఘించి "దేశద్రోహులు"గామారారని వాళ్ళమీద ప్రభుత్వం అభియోగం మోపింది వాళ్ళ విడుదలకోసం దేశవ్యాప్తంగా ఉవ్వెత్తున బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిగాయి ఈ తూరి తమ పోరాటం విజయవంత మవుతుందని దేశం యావత్తు ఉత్కంఠంతో, ఆత్మ విశ్వాసంతో అట్టుడికి పోయింది తమ వీరయోధులకు ప్రభుత్వ శిక్షపడనివ్వం అని పట్టుదల పట్టారు బ్రిటీషు ప్రభుత్వం ఈసారి భారత ప్రజాభిప్రాయాన్ని నిర్లక్ష్యపెట్టే స్థితిలో లేదు సైనిక న్యాయస్థానం వారిని దోషులుగా నిర్ణయించినప్పటికీ, ప్రభుత్వం వారిని విడుదల చేయటం యుక్తి యుక్తమని భావించింది

బ్రిటీషు ఇండియా ప్రభుత్వ వైఖరిలో ఈ మార్పుకు చాలా కారణాలున్నాయి

ఒకటి - యుద్ధం ప్రపంచంలో వివిధ రాజ్యాల అధికారశక్తుల సరితూకాన్ని మార్చివేసింది బ్రిటన్ కాకుండా అమెరికా, సోవియట్ యూనియన్‌లు అగ్రరాజ్యాలుగా అవతరించాయి. రెండు అగ్రరాజ్యాలూ భారత స్వాతంత్ర్య వాంఛని బలపర్చాయి

రెండు - బ్రిటన్ యుద్ధంలో గెలిచిన పక్షంలోనే ఉన్నా దాని ఆర్థిక, సైనికశక్తి ముక్కలైపోయింది. పునరావాసం పూర్తికావటానికి చాలా సంవత్సరాలు పట్టవచ్చు కన్సర్వేటివ్ పార్టీ ఎన్నికల్లో ఓడిపోయింది. లేబర్‌పార్టీ అధికారానికొచ్చింది లేబర్‌పార్టీ సభ్యుల్లో చాలామంది కాంగ్రెసు డిమాండ్లను బలపర్చారు బ్రిటీషు సైనికులు యుద్ధంలో దస్సిపోయారు వారు సుదీర్ఘ సంవత్సరాలపాటు యుద్ధంలో పోరాడి నెత్తురు చిందించి, మళ్ళీ భారతదేశంలో స్వాతంత్ర్య పోరాటాన్ని అణచివేసేందుకుగాను ఇంకా స్వదేశానికి దూరంగా జీవించటం వాళ్ళకు ఇష్టంలేదు.

మూడు - జాతీయోద్యమాన్ని అణచటానికి బ్రిటీషు ఇండియా ప్రభుత్వం ఇకనుండి పౌర పరిపాలనా యంత్రాంగంలోని భారతీయ ఉద్యోగులమీదగాని, భారత సైనిక బలాలమీదగాని ఆధారపడగలిగిన పరిస్థితిలో లేదు భారతదేశంలో బ్రిటీషుపాలనకు ప్రధాన సాధనంగా ఉపయోగపడ్డ భారత సైనికశ్రేణుల్లోకి దేశభక్తి

భావాలు చొరబడ్డాయన్న వాస్తవాన్ని అజాద్ హింద్ ఫౌజు బైటపెట్టింది 1946లో భారత నావికులు బొంబాయిలో తిరుగుబాటు చేసి ప్రభుత్వ నౌకా, సైనిక దళాలతో ఏడుగంటలపాటు భయంకరంగా పోరాడారు జాతీయ నాయకుల సలహామీద మాత్రమే వాళ్ళు లొంగిపోయారు భారత వైమానికదళంలో విస్తృతంగా సమ్మెలు జరిగాయి జబల్‌పూర్‌లో భారత సిగ్నల్ దళం సమ్మెకట్టింది పోలీసులు, ఉన్నతాధికార్లు సైతం జాతీయవాదంవేపు మొగ్గుచూపుతున్న జాడలు కనిపించాయి కాబట్టి జాతీయోద్యమాన్ని అణచివెయ్యటానికి వాళ్ళనింకా ఉపయోగించటం క్షేమకరం కాదు. ఉదాహరణకు బీహార్, ఢిల్లీలలో పోలీసు బలగాలు సమ్మెకట్టాయి

నాలుగు - అన్నిటికన్నా భారత ప్రజల ఆత్మవిశ్వాస పూరితమైన, నిశ్చయాత్మక మనస్థితి కళ్ళకు కట్టింది విదేశపాలనా పరాభవాన్ని ఇకపై సహించబోరు స్వాతంత్ర్యం సాధించేవరకు ఇక విశ్రమించరు భారత నావికుల తిరుగుబాటు జరిగింది అజాద్ హింద్ ఫౌజు యుద్ధఖైదీల విడుదల కోసం పోరాటం జరిగింది ఇవన్నీకాక, 1945-46 సంవత్సరాల మధ్య అసంఖ్యాక ఆందోళనలు చెలరేగాయి దేశవ్యాప్తంగా సమ్మెలు, బందులు, ప్రదర్శనలు పెచ్చరిల్లాయి. హైదరాబాద్, తిరువాన్కూరు, కాశ్మీరు మొదలైన స్వదేశ సంస్థానాల్లో సైతం ఉవ్వెత్తున ప్రజా ప్రదర్శనలు జరిగాయి 1945 నవంబర్‌లో లక్షలాది ప్రజలు అజాద్ హింద్ ఫౌజు ఖైదీల విడుదలని డిమాండుచేస్తూ కలకత్తా వీధుల్లో బ్రహ్మాండమైన ప్రదర్శనలు జరిపారు. మూడు రోజులపాటు నగరంలో దాదాపు ప్రభుత్వం ఉన్నజాడలే కనిపించలేదు మళ్ళీ 1946 ఫిబ్రవరి 12న అజాద్ హింద్ ఫౌజు ఖైదీలలో ఒకడైన అబ్దుల్ రషీద్ విడుదల కోసం కలకత్తా నగరంలో అశేష జనసందోహం ప్రదర్శన జరిపింది. ఫిబ్రవరి 22న బొంబాయిలో సంపూర్ణ హర్తాళ్, ఫ్యాక్టరీలు, ప్రభుత్వ కార్యాలయాలలో సాధారణ సమ్మె జరిగాయి ప్రజాందోళనని అణచటానికి సైన్యాన్ని పిలిపించవలసి వచ్చింది 48 గంటలసేపు జరిగిన కాల్పుల్లో బొంబాయి నగర వీధుల్లో 250 మంది బలైపోయారు.

దేశవ్యాప్తంగా భారీ ఎత్తున కార్మికవర్గంలో అశాంతి ప్రబలిపోయింది. సమ్మెలు జరగని ఫ్యాక్టరీ అంటూ లేదు 1946 జూలైలో అఖిల భారత తంతి-తపాలా పనివాళ్ళు సమ్మెకట్టారు. ఆగస్టులో దక్షిణ భారత రైల్వే కార్మికులు పనులు మానేశారు ఇదే సమయంలో రైతాంగం సైతం సమరశీల పంథా చేబట్టింది హైదరాబాద్, మలబార్, బీహార్, ఉత్తరప్రదేశ్, బెంగాల్, మహారాష్ట్రలలో భూమికోసం, భుక్తికోసం, అధిక కౌళ్ళ తగ్గింపుకోసం రైతాంగ పోరాటాలు విజృంభించాయి. సమ్మెలు, హర్తాళ్ళు, ప్రదర్శనలు నిర్వహించడంలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ప్రముఖపాత్ర వహించారు.

ఆ పరిస్థితుల్లో బ్రిటిషు ప్రభుత్వం 1946 మార్చిలో భారత జాతీయ నాయకుల్తో అధికార బదిలీ గురించి సంప్రతింపులు జరపడానికి ఒక క్యాబినెట్ మిషన్‌ని పంపింది క్యాబినెట్ మిషన్ కాంగ్రెసు, లీగు నాయకులతో సంప్రతింపుల అనంతరం ఒక ప్రణాళికని తయారుచేసి భారతీయుల అభిప్రాయం కోరింది. నూతన రాజ్యాంగం అమలులోకి వచ్చేవరకు ఒక తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని బ్రిటీషు రాయబార వర్గం సూచించింది. తదనుసారంగా, 1946 సెప్టెంబర్‌లో నెహ్రూ నాయకత్వంలో తాత్కాలిక జాతీయ ప్రభుత్వం ఏర్పాటయింది. ముస్లింలీగు ప్రతినిధులు కొద్దిరోజులు తటపటాయించి చివరికి అక్టోబరులో మంత్రివర్గంలో

చేరారు కాని లీగు సభ్యులు రాజ్యాంగ పరిషత్తును బహిష్కరించారు బ్రిటిషు ప్రధాని క్లెమెంట్ అట్లీ 1947 ఫిబ్రవరి 20న ఒక ప్రకటనలో బ్రిటిషు వారు భారతదేశం నుంచి 1948 జూన్ నాటికి వైదొలుగుతారని స్పష్టం చేశారు.

స్వాతంత్ర్యం రానున్నదన్న ఉత్సాహం 1946 అగస్టులోను, ఆ తరువాత ప్రజ్వరిల్లిన మత కలహాగ్నులలో కాలి బూడిదైపోయింది మహాత్మాగాంధీ విచార సాగరంలో మునిగిపోయాడు ప్రాథమికమైన మానవత మంటగలిసిపోవటం, సత్యాహింసల్ని గాలికి వదిలెయ్యటం చూసి చలించిపోయిన మహాత్ముడు మతకలహాగ్నుల్ని అర్పటానికి తూర్పుబెంగాల్, బీహార్లలో పాదయాత్ర చేశాడు కాని మతతత్వ శక్తులు ప్రజల మనస్సుల్లో వైషమ్య భావాలకు నారుపోస్తే, విదేశ ప్రభుత్వం నీరుపోసి పోషించింది గాంధీజీ, ఇంకా తదితర జాతీయవాదులు మతదురావేశాలకు వ్యతిరేకంగా విఫల పోరాటం జరిపారు

చివరకి 1947 మార్చిలో భారత వైస్రాయిగా వచ్చిన లార్డ్‌మౌంట్ బాటెన్ కాంగ్రెస్-ముస్లిం లీగు నాయకులతో సుదీర్ఘ సంభాషణలు జరిపిన అనంతరం ఉభయతారకంలో ఒక రాజీ పథకం రూపొందించాడు దేశం స్వతంత్ర మవుతుంది, కాని సమైక్యంగా ఉండదు జాతీయనాయకులు దేశవిభజనకు అంగీకరించారు మతకలహాల మూలంగా సంభవించే భయంకర రక్తపాతాన్ని నివారించడానికి వాళ్ళు దేశ విభజనకు అంగీకారం తెల్పారు కాని ద్విజాతి సిద్ధాంతాన్ని మాత్రం ఒప్పుకోలేదు. ముస్లింలీగు అడిగినట్లుగా దేశంలో మూడవ వంతు భాగాన్ని అప్పగించడానికి వాళ్ళు ఒప్పుకోలేదు ముస్లింలీగు అతిప్రబలంగా ఉన్న ప్రాంతాలను మాత్రమే ఒప్పగించటానికి భారత జాతీయ నాయకులు సుముఖత ప్రకటించారు ముస్లిం లీగు ప్రభావం అనుమానాస్పదంగా ఉన్న వాయువ్య సరిహద్దు రాష్ట్రంలోను, అస్సాంలోని సిల్హెట్ జిల్లాలోను జనాభిప్రాయ సేకరణ జరపాలని ప్రతిపాదించబడింది. మరో మాటల్లో చెప్పాలంటే, దేశ విభజన జరుగుతుంది, కాని హిందూ, ఇస్లాం మతాల ప్రాతిపదిక మీద మాత్రం కాదు

భారత, పాకిస్థాన్ దేశాలు స్వతంత్ర దేశాలుగా అవతరిస్తాయన్న ప్రకటన 1947 జూన్ 3న విడుదలయింది. ఈ రెంటిలో ఏదో ఒక దానిలో చేరడానికి భారత స్వదేశ సంస్థానాలకు స్వేచ్ఛ ఇవ్వబడింది సంస్థాన ప్రజల ఉధృత ఉద్యమాల ఒత్తిడివల్లా, నాటి దేశీయాంగ మంత్రి సర్దార్ వల్లభాయ్‌పటేల్ చాకచక్య యుతమైన రాజనీజ్ఞత వల్లా చాలా స్వదేశ సంస్థానాలు భారతదేశంలో చేరిపోయాయి. జునాగఢ్ నవాబు, హైదరాబాద్ నిజాం, జమ్మూ-కాశ్మీర్ మహారాజాలు కొద్దిరోజులు భీష్మించుకుని కూర్చున్నారు. కథియవాడ్ తీరంలోని అతిచిన్న సంస్థానం జునాగఢ్ పాకిస్థాన్‌లో విలీనమవుతానని ప్రకటించినా, జునాగఢ్ ప్రజలు భారతదేశంలో చేరాలని పట్టుబట్టారు. చివరకి భారత సైన్యాలు జునాగఢ్‌ని ఆక్రమించుకొని ప్లెబిసైట్ జరిపించాయి. ప్రజాభిప్రాయం భారతదేశంవైపు వ్యక్తం కావడంతో జునాగఢ్ సమస్య పరిష్కారమైపోయింది. నైజాం నవాబు స్వతంత్ర ప్రతిపత్తికోసం పాకులాడాడుగాని చివరికి 1948లో తెలంగాణా ప్రజల తిరుగుబాటువల్లా, భారత సైన్యాలు హైదరాబాదులో ప్రవేశించటంవల్లా గత్యంతరంలేక నైజాం నవాబు తన సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశాడు నేషనల్ కాన్ఫరెన్సు ఒత్తిడివల్లా, పాకిస్థాన్

వహాబు తన సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశాడు  నేషనల్ కాన్ఫరెన్సు ఒత్తిడివల్లా, పాకిస్థాన్ సాయుధ దళాలు, పఠాన్లు కాశ్మీర్‌లోయ మీద దాడి చెయ్యటంవల్లా కాశ్మీరు మహారాజా జమ్మూ-కాశ్మీర్ సంస్థానాన్ని భారతదేశంలో కలిపాడు

1947 ఆగస్టు 15న భారతదేశం తన తొలి స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకుంది  ఎన్నో తరాల దేశభక్తుల త్యాగాలు, అసంఖ్యాక మృతవీరుల రక్తతర్పణం ఫలించాయి  వారి స్వప్నం వాస్తవమైంది  ఆగస్టు 14 అర్ధరాత్రి జవహర్‌లాల్ నెహ్రూ తన దేశప్రజల మనోభావాలకు వాగ్రూపం ఇస్తూ రాజ్యాంగపరిషత్తులో చేసిన చిరస్మరణీయ ప్రసంగంలో ఇలా అన్నాడు:

"అర్ధరాత్రి గంటమోగిన క్షణాన, ప్రపంచం సుషుప్తిలో మునిగివున్నప్పుడు భారతదేశం చైతన్యవంతమవుతూంది; స్వతంత్రమవుతూంది  చరిత్రలో అరుదుగావచ్చే ఒక ఘడియలో మనం పాత శకం నుంచి కొత్త శకంలోకి గెంతుతాం; ఒక యుగం అంతమవుతుంది  బహు దీర్ఘకాలం అణచిపెట్టబడ్డ జాతి ఆత్మ గొంతుక విప్పుతుంది  ఈ మహత్తర ఘడియలో మనం మనదేశానికి, మన ప్రజలకు మానవాళికి సేవచెయ్యడానికి అంకితమవుతామని ప్రతిజ్ఞ తీసుకుందాం  మనం ఈ రోజు సంబరాలు జరుపుకునే విజయం మన వాంఛిత సాఫల్యానికి శ్రమించే అనవరత ప్రయత్నం కావాలి  అప్పుడే మనం అనేకతూర్లు చేసిన ప్రమాణాన్ని నెరవేర్చగలం "

కాని జాతి అవధులులేని ఆనందంలో తలమున్కలు కావలసిన సమయంలో బాధ, విషాదాల నీలినీడలు పరుచుకున్నాయి  జాతి సమైక్యతా స్వప్నం ముక్కలైంది  అన్నదమ్ములు విడదీయబడ్డారు  ఆఖరికి స్వాతంత్ర్య సుముహూర్తాన సైతం వర్ణనాతీతమైన పాశవిక హత్యాపూరితమైన మతపిచ్చి భారత్, పాకిస్థాన్ ఉభయదేశాలలో వేలాది ప్రజల పచ్చినెత్తురు తాగుతోంది. తమ తాత ముత్తాతలు జీవించిన గడ్డని గత్యంతరంలేక వీడవలసివచ్చిన లక్షలాది శరణార్థులు ఈ రెండు దేశాలలోకి వరదెత్తుతున్నారు  జాతీయ మహోత్సవ సమయంలో ఈ విషాదానికి ప్రతీకగా గాంధీజీ శోకమూర్తిగా మిగిలిపోయాడు  భారత ప్రజలకు సత్యం, అహింస, ప్రేమ, ధైర్యం, పురుషకారం ప్రబోధించిన మహాత్ముడు భారతీయ సంస్కృతిలో సర్వోత్కృష్టమైన ప్రత్యంశానికి సంకేతమైన మహాత్ముడు విషాదంతో కృంగిపోయాడు; అర్థంలేని మత మారణహోమం ద్వారా స్వాతంత్ర్యానికి మూల్యం చెల్లించే అశేష బాధిత ప్రజల్ని ఓదారుస్తూ బెంగాల్‌లో పాదయాత్ర చేస్తున్నాడు  ఉత్సవ ఉత్సాహపు కేకలు, కేరింతలు ఇంకా ముగియకముందే 1948 జనవరి 30న గుండెల్లో కసి గడ్డకట్టిన ఒక హిందూమతోన్మాది 70 ఏళ్ళకుపైగా మన జీవగడ్డమీద జాజ్వల్యమానంగా వెలుగొందిన ఒక జ్యోతిని ఆర్పివేశాడు  గాంధీజీ తన యావజ్జీవితాన్ని అంకితం చేసిన హిందూ-ముస్లిం ఐక్యతాదర్శ సాధనలో వీరమరణం పొందాడు

స్వాతంత్ర్య సముపార్జనతో దేశం మొట్టమొదటి అడుగు కదిపింది  జాతీయ పునరుజ్జీవన పథంలో అడ్డుగోడగా నిలిచిన విదేశపాలన అంతమైపోయింది  కాని శతాబ్దాల వెనుకబాటుతనం, దురావేశం, అసమానత, అజ్ఞానం ఇంకా దేశాన్ని కృంగదీస్తూనే ఉన్నాయి  ఇప్పుడే గాలివాలు తిరిగింది  రవీంద్ర కవీంద్రుడు 1941లో అస్తమించటానికి మూడు నెలలముందు చెప్పినట్లుగా, "విధిచక్రాలు ఒకనాటికి ఇంగ్లీషు పాలకులు తమ భారత సామ్రాజ్యాన్ని వదలివెళ్ళే పరిస్థితిని సృష్టిస్తాయి. అయితే వాళ్ళు భారతదేశాన్ని ఏ స్థితిలో వదలి వెళ్ళిపోతారు? ఎటువంటి

నగ్నదైన్యంలో విడిచిపెట్టి పోతారు ? శతాబ్దాలపాటు సాగిన వాళ్ళపరిపాలనా వైతరణి పూర్తిగా ఎండిపోయాక ఎంతటి కల్మషాన్ని, మాలిన్యాన్ని వదలి వెళ్ళిపోతారు ?"

తమ సామర్థ్యంలో విశ్వాసంతో, విజయం సాధించగలమనే సంకల్పబలంతో భారత ప్రజలు నేడు తమ దేశ స్వరూపాన్ని మార్చివేయటానికి, ఒక న్యాయబద్ధమైన నాణ్యమైన సమాజాన్ని నిర్మించటానికి నడుంకట్టారు

45395
-500 044

Nandyala ... Reddy
3504121
Hyderabad ... Committee
For ...
Constituted by the Govt of India

## చారిత్రక యదార్థ తత్వం

గతంలో భారతదేశాన్ని ఆక్రమించిన విదేశీయులకూ, బ్రిటీషు వారికి మధ్య తేడా ఏమిటి? భారతదేశంమీద బ్రిటన్ సాధించిన విజయం ప్రత్యేకత ఏమిటి? భారత జాతీయోద్యమ అవిర్భావానికి 1857 తిరుగుబాటు ఏ రకమైన ఊపునిచ్చింది? ఏఏ సామాజిక మత సంస్కరణోద్యమాలు ఆవిర్భవించాయి? అవి ఏ సుప్త చైతన్యాన్ని మేలుకొలిపాయి? జాతీయోద్యమానికి ప్రజలు ఏవిధంగా స్పందించారు? భారత జాతీయ వాదంలోని పాయ లేవి? బ్రిటీషు వలసవాద కుటిల రాజనీతి ఫలితంగా దేశానికి కలిగిన అరిష్టమేమిటి?

ఈ ప్రశ్నలకు సమాధానమే ఈ పుస్తకం. ప్రజల ఆర్థిక సామాజిక జీవిత విధానాల్లో వచ్చిన పరిణామాలను చరిత్రకు పునాదిగా గ్రహించిన కొద్దిమంది చరిత్రకారులలో ఈ గ్రంథ రచయిత బిపిన్ చంద్ర ఒకరు. ఈయన జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (ఢిల్లీ)లో ఆధునిక చరిత్రాచార్యులుగా పనిచేస్తున్నారు. 1973-1974 విద్యాసంవత్సరానికి యు.జి.సి. నేషనల్ లెక్చరరుగా గౌరవ పురస్కారాన్ని పొందారు. 1970వ సంవత్సరపు ఇండియన్ హిస్టరీ కాంగ్రెసులో ఆధునిక భారత విభాగానికి అధ్యక్షులు. 'ఆధునిక భారత దేశంలో జాతీయ భావం పుట్టుక, పరిణామం,' 'ఆధునిక భారత దేశంలో జాతీయవాదం, వలసవాదం,' 'ఆధునిక భారత దేశంలో మతతత్వం' అనేవి వీరి ఇతర గ్రంథాలు. 'స్వాతంత్ర్య పోరాటం' అనే గ్రంథానికి సహరచయిత. 'భారత దేశపు వామపక్షాలు : సవిమర్శక పరిశీలనం' అనే పుస్తకానికి అయిన సంపాదకులు.

అందరికీ అందుబాటులో ఉండే ఆచార్యులుగా వీరికి విద్యార్థుల్లో పేరుంది.